# భారతదేశ ఉత్పత్తి సంబంధాలలో మార్పులు - మన రాజకీయ కార్యక్రమం

జనవరి 2021

కేంద్రకమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# భారతదేశ ఉత్పత్తి సంబంధాలలో మార్పులు - మన రాజకీయ కార్యక్రమం

జనవరి 2021

కేంద్రకమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

కేంద్రకమిటీ

భారతదేశ ఉత్పత్తి సంబంధాలలో మార్పులు - మన రాజకీయ కార్యక్రమం
ప్రథమ ప్రచురణ: జనవరి 2021
కేంద్రకమిటీ
సీపీఐ (మావోయిస్టు) డాక్యుమెంట్

# విషయసూచిక

ముందుమాట .... 7

సామాజిక పరివర్తన–మార్క్సిస్టు దృక్పథం .... 13

భారతదేశంలో సమాజ పరిణామ క్రమం .... 19

భూస్వామ్య సమాజం .... 23

బ్రిటీషు వలసవాద పాలనలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి
ఉత్పత్తి సంబంధాలు అడ్డంకిగా నిలిచాయి .... 38

అర్ధ వలస, అర్ధ భూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు (1947–1990) .... 55

భూసంస్కరణలు బూటకం .... 60

అర్ధ భూస్వామ్య పునాదిపై కేంద్రీకృత పంచవర్ష ప్రణాళికలు .... 61

హరిత విప్లవం .... 64

అర్ధవలస స్థితి .... 69

అర్ధభూస్వామ్య స్థితి .... 80

భారత అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థపై ప్రపంచీకరణ దాడి
(1991 నుండి ఫిబ్రవరి 2020 వరకు) .... 91

అంతర్జాతీయ స్థాయిలో ద్రవ్య పెట్టుబడి దాడి .... 93

ప్రపంచ ద్రవ్య పెట్టుబడి – దాని వివిధ రూపాలు .... 101

ప్రధాన ధోరణిగా మారిన ద్రవ్య వ్యాపారం .... 104

ప్రపంచ ద్రవ్య పెట్టుబడి కలిగిస్తున్న వినాశకర ప్రభావాలు .... 115

ప్రపంచీకరణ దశ–కొనసాగుతున్న అర్ధవలస, అర్ధభూస్వామ్య సంబంధాలు
.... 123

అర్ధవలస స్థితి .... 130

విదేశీ ద్రవ్య పెట్టుబడులు .... 130

భారత పరిశ్రమలో పెద్దెత్తున పెరిగిన అంతర్జాతీయ గుత్త సంస్థల టేక్ ఓవర్లు
.... 137

విదేశీ ద్రవ్య పెట్టుబడికి సేవకులుగా దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు

.... 144

జాతీయ బూర్జువా వర్గం .... 151

పారిశ్రామికరంగం .... 152

అర్ధభూస్వామ్య స్థితి .... 160

అధికార మార్పిడి తర్వాత దేశ సామాజిక వ్యవస్థలో చోటు చేసుకున్న మార్పులు

.... 190

మన రాజకీయ కార్యక్రమం .... 206

✶

# ముందుమాట

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా పరివర్తన చెంది ఒక శతాబ్దం దాటిపోయింది. అయినప్పటికీ పెట్టుబడిదారీ–సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ ఉనికిలో ఉంది. అది అసమానాభివృద్ధి లక్షణాన్ని కలిగి ఉండడం వల్ల ప్రపంచమంతటా వివిధ దేశాల, వాటిలోని వివిధ ప్రాంతాల పరిస్థితులలో చెప్పుకోదగ్గ భిన్నత్వం ఉన్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సామ్రాజ్యవాద– పెట్టుబడిదారీ, అర్ధభూస్వామ్య, పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి సంబంధాలు ఇంకా ఉనికిలో ఉన్నాయి. శ్రమశక్తి భిన్నమైన పరిస్థితులలో ఉత్పత్తి అవుతున్నది. అది ఏ పరిస్థితుల్లో ఉత్పత్తి అవుతున్నప్పటికీ దానినంతటినీ సామ్రాజ్యవాదం కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నది. ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారీ రంగంలో ఉత్పత్తి పరిస్థితులు, ఉత్పాదకత, శ్రమ పరిస్థితులు, వేతన చెల్లింపులూ మొదలైనవి, ముఖ్యంగా పీడక, పీడిత దేశాల ఆర్థిక వ్యవస్థలూ భిన్నంగా ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ మార్కెట్ విస్తరించినప్పటికీ, కాపిటల్ గూడ్స్ వినియోగం పెద్దెత్తున పెరిగినప్పటికీ, శ్రమ అంతర్జాతీయీకరణ జరిగినప్పటికీ వేతనాలలో, దోపిడీ రేట్లలో ఎంతో అసమానత ఉంది. ఇదే విధంగా భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత సంక్లిష్టమైంది. ఇందులో వివిధ దశల్లో గల ఆర్థిక వ్యవస్థలు ఒకదాని పక్కన మరొకటి ఉనికిలో ఉంటాయి.

ఏదైనా ఒక సమాజంలో పాత ఉత్పత్తి సంబంధాలు ఏ విధంగా మార్పు చెందుతాయి? ఏ విధంగా కొత్త ఉత్పత్తి సంబంధాలు ఏర్పడి పరిపూర్ణమైనవిగా రూపొందుతాయి? అనేది అర్థం చేసుకోవడానికి ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల మధ్య వైరుధ్యాల సహాయంతో వివరించడం మాత్రమే సరిపోదు, ఆర్థిక పునాది, ఉపరితల నిర్మాణాల మధ్య సంబంధాలను కూడా పరిశీలించవలసి ఉంటుంది. అది ప్రగతిశీలమైనదా, అభివృద్ధినిరోధకమైనదా – దీనిని అర్థం చేసుకోవడానికి ఆ సామాజిక వ్యవస్థను, దానికి ముందున్న దాని తర్వాతి సామాజిక వ్యవస్థతో పోల్చి చూడాల్సి ఉంటుంది. అందువల్ల భూస్వామ్య విధానపు మౌలిక లక్షణాలను, దీని ప్రత్యేకతలను అర్థం చేసుకోవడానికి తరచుగా దానిని పెట్టుబడిదారీ విధానపు మౌలిక లక్షణాలతో, ప్రత్యేకతలతో పోల్చి చూడాల్సి ఉంటుంది. మార్క్సిస్టులు ఎవరైనా గానీ/గతితార్కిక చారిత్రక భౌతికవాదులు ఎవరైనా గానీ వర్తమానపు వాస్తవిక స్థితిని అవగాహన చేసుకోదలచుకుంటే, ఈ వర్తమానానికి దారితీసిన గతం గురించిన నిర్దిష్టమైన క్రమాన్ని తప్పనిసరిగా అర్థం చేసుకోవాలి, సమాజంలో పూర్తిగా అన్ని వర్గాల మధ్య సంబంధాలను వస్తుగతంగా సమగ్రంగా పరిశీలించాలి. అప్పుడు మాత్రమే వారు ఆ గత వర్తమానాల సమన్వయంతో తగిన ఎత్తుగడలను రూపొందించగలుగుతారు, భవిష్యత్తుకు మార్గాన్ని కనిపెట్టగలుగుతారు. మార్క్స్ ఇలా అన్నారు, "ఒక నిర్దిష్ట సమాజంలో పూర్తిగా అన్ని వర్గాల

మధ్య ఉన్న సంబంధాల మొత్తాన్ని వస్తుగతంగా పరిశీలించినప్పుడు మాత్రమే, తద్వారా ఆ సమాజం చేరిన భౌతిక అభివృద్ధి దశను, ఆ సమాజానికి, ఇతర సమాజాలకూ ఉన్న సంబంధాలనూ పరిశీలించినప్పుడు మాత్రమే పురోగామి వర్గం సరైన ఎత్తుగడలు అవలంబించడానికి ఆ పరిశీలనలు ప్రాతిపదికగా ఉపయోగపడతాయి".

మన దేశం పెట్టుబడిదారీ సమాజమా లేదా అర్ధభూస్వామ్య, అర్ధవలస సమాజమా? – అనే విషయంపై మార్క్సిస్టులలో, కుహనా మార్క్సిస్టులలో, రివిజనిస్టులు, నయా రివిజనిస్టులలో, బూర్జువా మేధావులలో, ఎన్‌జీఓలలో పెద్దెత్తున చర్చలు, వివాదం నడుస్తున్నాయి. నిజమైన కమ్యూనిస్టు విప్లవకారులు చర్చ చర్చ కోసం కాకుండా విప్లవ సమస్య పరిష్కారానికి చర్చ చేస్తారు. మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్ ప్రకారం కార్మికవర్గ అగ్రగామి దళం ప్రధాన విధులు ఇవి: ప్రతి ఒక్క రాజకీయ పరిస్థితిలో ముందుకు వచ్చే అవకాశాలను సామాజిక ఆర్థిక వాస్తవికత గురించిన వర్గ విశ్లేషణపై ఆధారపడి ఖచ్చితంగా అంచనా కట్టుకోవడం, కార్మికవర్గ ఉద్యమాన్ని తన లక్ష్యానికి అనుగుణంగా పెంపొందించడం, అది మౌలిక మార్పు సాధించే స్థితికి చేరకుండా అడ్డుకునే బూర్జువాజీ, రివిజనిస్టు, పెటీబూర్జువాజీ ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాడడం.

భారత విప్లవం కోసం ఎటువంటి వ్యూహం–ఎత్తుగడలను అవలంబించాలి? ఇది సమాజంలోని యావత్తు వర్గాలను, సామాజిక సెక్షన్లను, పీడిత జాతులను వర్గీకరించడంతో ముడిపడి ఉంది. ఏ ఏ వర్గాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాల్సి ఉంటుంది? ఏ ఏ వర్గాలు, సామాజిక సెక్షన్లు, పీడిత జాతులు విప్లవంలో మిత్రశక్తులుగా భాగస్వామ్యమవుతాయి? విప్లవానికి ఏ వర్గం నాయకత్వం వహిస్తుంది? ఏ వర్గాల్ని విప్లవం ద్వారా నిర్మూలించాల్సి ఉంటుంది? ఏ వర్గాలు మిత్ర వర్గాలు, ఏ వర్గాలు శత్రు వర్గాలు? మొదలైనవి దీనితో ముడివడి ఉన్నాయి.

భారతదేశ సామాజిక వ్యవస్థను సరిగా అర్థం చేసుకోవడానికి మొదట మనం సరైన మార్క్సిస్టు పద్ధతిని ఎంచుకోవాలి. అంటే అధ్యయనంలో స్వీయాత్మకతను–యాంత్రిక పద్ధతిని, జడతార్కిక పద్ధతిని విడనాడి గతితార్కిక చారిత్రక భౌతికవాద పద్ధతిని చేపట్టాలి. ఈ పద్ధతి ప్రకారం ప్రతి విషయాన్ని (ఎంటిటి) చలనంలో చూడాలి, ఆ చలనాన్ని మొత్తం దేశ నిర్దిష్ట పరిస్థితిలోనూ, ఆయా ప్రాంతాల నిర్దిష్టతల్లోనూ చూడాలి. మార్క్స్ ఇలా అన్నారు, "గతితార్కిక పద్ధతి ప్రతి నిర్ణీత వ్యవస్థనూ (set pattern) దాని నిరంతరం చలనం నుండి, దాని అశాశ్వత స్వభావం నుండి అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తుంది. అది దేనినీ ఆరాధించేది కాదు. అది విమర్శనాత్మకమైనది, విప్లవాత్మకమైనది" (పెట్టుబడి, 1వ సంపుటి, రెండవ ప్రచురణకు చివరి మాట, ప్రోగ్రెస్ పబ్లిషర్స్, 1974, పేజీ 29). అంటే భారతదేశ నిర్దిష్టతలలో ఫ్యూడల్ (భూస్వామ్య) సమాజాన్ని, ఆ తర్వాత వలసవాద (వలస, అర్ధభూస్వామ్య), నయా వలసవాద తరహా (అర్ధవలస,

అర్ధభూస్వామ్య) సమాజాల్ని, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ (ద్రవ్య పెట్టుబడి) దాడిని, అది మొత్తం దేశంలోనూ, ఆయా ప్రాంతాలలోనూ కలిగించిన మార్పులను, ఆయా ప్రాంతాల్లోని ఉత్పత్తి సంబంధాల మార్పుకు దోహదపడిన వర్గపోరాట పాత్రను అధ్యయనం చేయాలి. సైద్ధాంతిక, రాజకీయ అధ్యయనంలో భాగంగా దేశ సామాజిక పరిస్థితుల అధ్యయనం కూడా కొనసాగించాలి. పార్టీలో అంతర్గతంగా సాగే రెండు పంథాల మధ్య పోరాటంతో పాటు అన్ని రంగాల్లో కొనసాగుతున్న వర్గపోరాట అనుభవాల నుండి, ప్రజల నుండి నేర్చుకోవడం, తప్పుడు భావాలను, పద్ధతులను సరిదిద్దడం, సరైన భావాల, రాజకీయాల ప్రాతిపదికన ఒక క్రమపద్ధతిలో విప్లవ పంథాను సంపద్వంతం చేయడం మన అధ్యయన లక్ష్యంగా ఉండాలి.

1947 ఆగస్టు 15 నుంచి భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రత్యక్ష, వలస పాలన నుంచి అర్ధవలసగా మారింది. భారత సమాజం అప్పటికే అర్ధభూస్వామ్య వ్యవస్థగా ఉంది. ఈ విషయంలో ముందు విప్లవ కమ్యూనిస్టులలో మౌలికంగా భిన్నాభిప్రాయాలు లేవు. 1946-51 మధ్య మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగింది. దానికి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం సాయుధ పోరాటాన్ని విరమించి విద్రోహం చేసింది. దానితో పార్టీలో మితవాద అవకాశవాదం బలపడింది. ఆ తర్వాత పార్టీ వ్యూహాన్ని పరిశీలిస్తే, పార్టీ నాయకత్వం మాటల గారడీ చేస్తూ భారతదేశాన్ని మౌలికంగా ఒక స్వతంత్ర పెట్టుబడిదారీ దేశంగా పరిగణించడం ప్రారంభమైంది. అది భారత విప్లవానికి ఎటువంటి సరైన, స్పష్టమైన వ్యూహం-ఎత్తుగడలనూ ప్రజల ముందు పెట్టలేదు. ఎన్నికల్లో పాల్గొనడమే దాని మౌలిక, ప్రధాన ఎజండా అయ్యింది. అది బడా దళారీ పెట్టుబడిదారులకు ప్రగతిశీలురని కితాబు ఇచ్చింది. అయితే పార్టీలో ఉన్న విప్లవపక్షం ఈ మితవాద అవకాశవాద ధోరణిని ఎన్నడూ ఆమోదించలేదు. 1960 దశకంలో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సీపీఐ, సీపీఐ (ఎం)లుగా చీలిపోయినప్పుడు విప్లవపక్షం సీపీఐ (ఎం)లో ఉన్నా, ఆ నాయకత్వ నయా రివిజనిస్టు పంథాను వ్యతిరేకించి అనతికాలంలోనే భారత విప్లవానికి పథనిర్దేశం చేసిన, మన పార్టీ సిపీఐ (మావోయిస్టు) సంస్థాపక నాయకులు, ఉపాధ్యాయులు అయిన కా. సీఎం, కా. కేసీలు, వారి లాంటి మొదటిశ్రేణికి చెందిన అనేక మంది నాయకత్వం, కార్యకర్తలు భారత సమాజం అర్ధవలస, అర్ధభూస్వామ్య సమాజమని స్పష్టపరుస్తూ సాయుధ వ్యవసాయక విప్లవ సమస్యను లేవనెత్తారు. దాని ఫలితంగా 1967లో ఉత్తర బెంగాల్‌లో నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాటం జరిగింది. ఈ పోరాటం అనతికాలంలోనే దేశంలో అనేక ప్రాంతాలకు విస్తరించింది. 1969లో ఆవిర్భవించిన సీపీఐ (ఎం-ఎల్), ఎంసీసీ పార్టీలు భారత సమాజం అర్ధవలస, అర్ధభూస్వామ్య సమాజం అని తేల్చిచెప్పాయి. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను చేపట్టి నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో ముందుకు సాగాయి. 1970లో విజయవంతమైన సీపీఐ (ఎం-ఎల్) 8వ కాంగ్రెస్ ఈ పంథాను ఏకగ్రీవంగా ఎత్తిపట్టింది.

దళారీ పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం 'హరిత విప్లవాన్ని' ముందుకు తెచ్చాయి. దీని ఫలితంగా పంజాబ్ వంటి కొన్ని ప్రాంతాలలో అభివృద్ధి అయిన వక్ర పెట్టుబడిదారీ సంబంధాలను ఆసరా చేసుకొని, దేశంలో నెలకొని వున్న ఉత్పత్తి విధానంపై చర్చను లేవదీసాయి. సాయుధ వ్యవసాయ విప్లవానికి, దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాకూ పునాది లేకుండా చేయాలనే కుట్ర దీని వెనుక దాగి ఉంది. ఉత్పత్తి విధానంపై చర్చ 1970 దశకం ప్రారంభంలో విద్యావేత్తలతో మొదలై రాజకీయ కార్యకర్తల వరకూ విస్తరించింది. ప్రెజెంటేషన్లు, విశ్లేషణాత్మక పేపర్లు, రీసర్చ్ అధ్యయనాలు, సైద్ధాంతిక సూత్రీకరణలు, రాజకీయ విశ్లేషణలు, ఆచరణకు సంబంధించిన రిపోర్టులు - ఇలా వివిధ పద్ధతుల్లో ఈ విషయంపై అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. తరతమ తేడాలతో ఈ చర్చ ఈ రోజు వరకూ కొనసాగుతూనే ఉంది. ఆర్థికవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, రాజకీయ కార్యకర్తలు, పాలకవర్గ పార్టీలు, రివిజనిస్టు నయా రివిజనిస్టు పార్టీలే కాక, రాజ్యానికి చెందిన అధికార ప్రతినిధులు (స్పోక్స్‌పర్సన్స్), ప్రభుత్వ పథకాల రూపకర్తలు (ప్లానర్స్), అనేక పత్రికలు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తాయి.

తిరిగి 80వ దశకంలో కొన్ని ప్రాంతాలలో ఎంసీసీ, సీపీఐ (ఎం-ఎల్) (పీడబ్ల్యు), సీపీఐ (ఎం-ఎల్) పీయు విప్లవ పార్టీల నాయకత్వంలో సాయుధ వ్యవసాయ విప్లవ పోరాటం వృద్ధి చెందింది. ఈ పార్టీలు 1974-80ల మధ్య వర్గ పరిశీలన చేపట్టి వ్యవసాయంలో ఉత్పత్తి సంబంధాలను విశ్లేషించి, వీటి ఆధారంగా 'సాయుధ వ్యవసాయ విప్లవ పోరాటంలో భాగస్వాములుకండి, ప్రజాసైన్యం, ఎర్ర విముక్తి ప్రాంతాలను నిర్మించే పనిని తీవ్రతరం చేయండి', 'వ్యవసాయ విప్లవం', 'దున్నేవారికి భూమిలేనిదే రైతాంగానికి విముక్తి లేదు' 'భారత వ్యవసాయపు వర్గ విశ్లేషణ' వంటి రచనలు చేసాయి. 70వ, 80వ దశకంలో భారతదేశంలో కొనసాగిన ఉత్పత్తి సంబంధాలను ఈ రచనల్లో విశ్లేషించి అర్ధవలస, అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు అమలులో ఉన్నాయని నిర్ద్వంద్వంగా నిరూపించాయి. 'దున్నేవారికే భూమి', 'రైతు సంఘాలకే/ క్రాంతికారీ కిసాన్ కమిటీలకే సర్వాధికారం' అనే నినాదాన్నిచ్చాయి. దేశంలో ఉత్పత్తి విధానంపై పలు సందర్భాలలో ఈ పార్టీల్లో వివిధ రూపాల్లో ముందుకు వచ్చిన చర్చలను అవి కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రానికి అనుగుణంగా ప్రజాస్వామిక పద్ధతిలో సంబంధిత కమిటీలలో, కాన్ఫరెన్స్‌లలో చర్చించి పరిష్కరించాయి. ఫలితంగా సాయుధ వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధం దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు విస్తరించింది. వ్యూహాత్మక ప్రాంతాలలో విముక్తి ప్రాంతాలను స్థాపించే లక్ష్యంతో మరింత నిర్దిష్టంగా గెరిల్లాజోన్లలో 'దున్నేవారికే భూమి', 'విప్లవ ప్రజా కమిటీలకే సర్వాధికారాలు', ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలలో 'దున్నేవారికే భూమి', 'రైతు కమిటీలకే అధికారం' అనే నినాదాలు ముందుకు వచ్చాయి. 1990లలో ముందుకు వచ్చిన ప్రపంచీకరణ విధానాల ఫలితంగా చోటు చేసుకున్న పరిణామాలపై వచ్చిన పలు చర్చలకు ఈ పార్టీలు ఎప్పటికప్పుడు వివిధ రూపాలలో జవాబులు ఇచ్చాయి. ఎంఎల్ఎం

వెలుగులో కొనసాగించిన ఆచరణ ద్వారా ఆర్జించిన అపార సైద్ధాంతిక, రాజకీయ, సైనిక, నిర్మాణ, సాంస్కృతిక అనుభవంపై ఆధారపడి రెండు ప్రధాన విప్లవ స్రవంతులు ఐక్యం కావడంతో సీపీఐ (మావోయిస్టు) ఆవిర్భవించింది. ఐక్యపార్టీ ఆవిర్భావం దేశంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధానికి అపారమైన ఊపు నిచ్చింది. అలలు అలలుగా ప్రజాయుద్ధ విస్తరణతో పాటు మూడు మంత్రదండాలు సాపేక్షికంగా బలోపేతమయ్యాయి.

ఐక్య పార్టీ సీపీఐ (మావోయిస్టు) భారతదేశంలో ఉత్పత్తి విధానంపై కొన్నిరాష్ట్రాలలో, ప్రత్యేకించి పంజాబ్‌లో ముందుకు వచ్చిన పొలిటికల్ డిబేట్‌ని ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌లో కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రానికి అనుగుణంగా నిర్వహించింది. ఈ కాంగ్రెస్ భారతదేశంలో పంజాబ్‌తో సహా కొన్ని ప్రాంతాలలో వ్యవసాయంలో వక్రీకరించబడిన పెట్టుబడిదారీ సంబంధాలు ఉనికిలో ఉన్నప్పటికీ ఉత్పత్తి విధానం అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాలతో కూడుకొని ఉందని, దేశంలో అసమాన వృద్ధిని కలిగివున్న అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో తగిన ఎత్తుగడలను చేపట్టి కూకటివేళ్లతో పెకలించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలని తేల్చి చెప్పటం ద్వారా పార్టీ పంథాను మరింత సంపద్వంతం చేసింది.

మరో వైపు భారతదేశంలో ప్రజాయుద్ధం బలోపేతమైతే దేశీయంగా, అంతర్జాతీయంగా ఏర్పడే తీవ్ర పరిణామాలను సామ్రాజ్యవాదులు ముందుగానే అంచనా కట్టుకున్నారు. సామ్రాజ్యవాదుల దిశానిర్దేశంతో దళారీ పాలకవర్గాలు మన పార్టీని 'దేశ అంతర్గత భద్రతకు అతి పెద్ద ముప్పు'గా ప్రకటించాయి.

ఈ స్థితిని వినియోగించుకొని ఉత్పత్తి సంబంధాలపై చర్చ రూపంలో పార్టీ పంథాపై సైద్ధాంతిక దాడి మరోసారి తీవ్రతరమైంది. అంతర్జాతీయంగా, దేశీయంగా పలు సామ్రాజ్యవాద ప్రాయోజిత థింక్ ట్యాంకులు ఆవిర్భవించాయి. భారతదేశ సామాజిక ఆర్థిక వ్యవస్థ అర్ధభూస్వామ్యంగానే ఉందా లేక పెట్టుబడిదారీ విధానంగా మారిందా, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాకు నేటికీ ప్రాసంగికత ఉందా లేక అది కాలంచెల్లిన సిద్ధాంతమా అనే చర్చను లేవదీసాయి. 2011లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో పెద్దెత్తున జరిగిన సెమినార్‌తో పాటు లెక్కకుమించిన పరిశోధనలు జరిగాయి, జరుగుతున్నాయి. ఈ క్రమంలో కొంతమంది నేటి పాలక వ్యవస్థ స్కాలర్లు గ్రామాల సర్వేలు నిర్వహించారు. దీనికోసం సామ్రాజ్యవాద ప్రాయోజిత ఎన్‌జీఓ సంస్థలు కోట్లాది రూపాయలు కుమ్మరిస్తున్నాయి.

మొత్తం మీద చూసినప్పుడు, ఈ పరిశోధనల క్రమంలో మేధావులలో మూడు ధోరణులు ప్రస్తుతం మనకు కనపడతాయి. మొదటిది, భారతదేశం అర్ధభూస్వామ్య దేశమే అనే ధోరణి. ఈ అవగాహనను బలపరుస్తూ పలు స్వతంత్ర మేధావి బృందాలు సైతం పరిశోధనలు చేసి

దేశ ఆర్థిక వ్యవస్థ మౌలిక స్వభావాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. రెండవది, భారతదేశం ఎంతమాత్రమూ అర్ధభూస్వామ్య దేశంగా లేదు, అది పెట్టుబడిదారీ సమాజంగా మారిందనే ధోరణి. ఇది ప్రధానంగా సామ్రాజ్యవాద, పాలకవర్గ ప్రాయోజిత ధోరణి. శత్రు ఏజెంట్లు, విప్లవ వ్యతిరేక శక్తులు, పార్టీ నుండి తోసివేయబడిన అవకాశవాద రివిజనిస్టు శక్తులు, పార్టీ నుండి వెళ్లి శత్రువుకు లొంగిపోయిన విద్రోహ శక్తులు ఈ ధోరణికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ ధోరణిని కొందరు స్వతంత్ర మేధావులు కూడా సమర్థిస్తున్నప్పటికీ వారు ఎంఎల్ఎం అవగాహన కొరవడడం, సామాజిక ఆచరణకు దూరంగా ఉండడం, అనుభవరాహిత్యం కారణంగా, మరి కొందరు విశ్వసనీయతలేని సగటు డాటాపై ఆధారపడి యాంత్రిక విశ్లేషణలు చేయడం కారణంగా ఈ ధోరణికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వివిధ రకాల రివిజనిస్టు పార్టీలు, వ్యక్తులు కూడా దీనికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మూడవది, మధ్యేమార్గంతో కూడుకున్నది. ఇది భారతదేశ సామాజిక వ్యవస్థ అంచుల్లో ఉన్న పెట్టుబడిదారీ విధానమని, అర్ధ–పెట్టుబడిదారీ విధానమని, పరివర్తనలో ఉన్న పెట్టుబడిదారీ విధానమని సూత్రీకరించే ధోరణి. ఈ ధోరణి కొంత మేరకు సామ్రాజ్యవాద ప్రాయోజితమైనప్పటికీ, కొన్ని స్వతంత్ర మేధావి బృందాలు, కొన్ని మితవాద అవకాశవాద రివిజనిస్టు గ్రూపులు దీనికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

మొదటి ధోరణి ప్రస్తుత భారతదేశ అర్ధభూస్వామ్య సమాజాన్ని మార్చి దేశాభివృద్ధికి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను, అటు పిమ్మట సోషలిజం–కమ్యూనిజం స్థాపించాలనే ప్రత్యామ్నాయాన్ని ముందుకు తెస్తున్నది. ఈ ధోరణి బలపడితే తమ ఉనికికి ప్రమాదమని భావించిన ఫాసిస్టు దోపిడీ పాలకవర్గాలు దీనికి ప్రాతినిధ్యం వహించే విప్లవ–ప్రజాస్వామిక మేధావి బృందాలను వేటాడుతున్నాయి. పలు బూటకపు కేసులు పెట్టి జైళ్లల్లో కుక్కుతున్నాయి. రెండవ ధోరణి సామ్రాజ్యవాద ప్రాయోజిత అంతర్జాతీయ 'అభివృద్ధి' నమూనాను ముందుకు తెస్తోంది. మావోయిస్టు పార్టీ వర్గీకరణ 1960ల చివరి కాలానికి వర్తిస్తుందేమో గానీ, ప్రస్తుతం 'భూస్వామ్య విధానం' పూర్తిగా బలహీనపడిందనీ, ప్రస్తుతం వ్యవసాయ రంగంలో చాలా వరకూ పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు ఆధిపత్యం వహిస్తున్నాయనీ వాదిస్తోంది. అందువల్ల గ్రామీణ ప్రాంతంలో సాయుధ వ్యవసాయ విప్లవానికి ఎటువంటి అర్థంలేదని సైద్ధాంతికంగా రుజువు చేసేందుకు ప్రయత్నిస్తున్నది. ఇందుకోసం విప్లవ పార్టీకీ, ప్రజలకూ, విప్లవానికీ ద్రోహం చేసి శత్రువు ముందు మోకరిల్లిన కొందరు విద్రోహులను కూడా ముందుకు తెస్తున్నది. వీరు పార్టీ పంథాపై పలు విధాలుగా దుమ్మెత్తిపోస్తూ విప్లవ శిబిరంలో గందరగోళం సృష్టించేందుకు విఫలయత్నం చేస్తున్నారు. మూడవ ధోరణి తెలిసో, తెలియకో విప్లవ శ్రేణులలో, ప్రజలలో గందరగోళాన్ని వ్యాపింపజేస్తూ ప్రజల పోరాట చేవను సడలింపజేస్తున్నది. ఈ క్రమంలోనే సామ్రాజ్యవాదులకు సేవ చేస్తూ తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్న దళారీ నిరంకుశ బూర్జువా వర్గం (సీబీబీ), బడా భూస్వామ్య వర్గం, వాటికి ప్రాతినిధ్యం వహించే దోపిడీ పాలకవర్గ పార్టీలు సమాజ

అభివృద్ధి పేరుతో ముందుకు తెస్తున్న కుహనా అభివృద్ధి నమూనాకూ, సీపీఐ (మావోయిస్టు) నాయకత్వంలో గత 52 సంవత్సరాలుగా కొనసాగుతున్న విప్లవోద్యమానికీ, దాని ఆచరణ ద్వారా ముందుకు తెచ్చిన నిజమైన నూతన ప్రజాస్వామిక అభివృద్ధి నమూనాకూ మధ్య స్పష్టమైన విభజన రేఖను గీయబడింది.

ఈ నేపథ్యంలో దేశంలో వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలలో కలిగిన మార్పులు, చేపట్టాల్సిన ఎత్తుగడలపై సీఆర్‌బీ విస్తృత సమావేశం 2014 జులైలోనే ఒక పేపర్ విడుదల చేయడంతో పాటు, సెంట్రల్ రీజియన్‌లోని వివిధ రాష్ట్రాల్లో పరిశోధనలు చేసి రిపోర్టులు తయారు చేసారు. ఈస్టరన్ రీజియన్‌లో సామాజిక పరిశోధన చేయాలనే నిర్ణయాలు తీసుకున్నారు. ఈ క్రమంలో దేశంలో నెలకొని ఉన్న (చలనంలో ఉన్న) సామాజిక సంబంధాలపై సీసీ అధ్యయనం చేపట్టింది. ఈ అధ్యయనం ద్వారా దేశ సామాజిక వ్యవస్థ(అర్ధవలస, అర్ధభూస్వామ్య)లో గణనీయమైన మార్పులు జరిగినప్పటికీ మౌలిక మార్పు రాలేదని నిర్ధారించింది. అయితే సామ్రాజ్యవాదుల, భారత పాలకవర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా, ఆర్థిక వ్యవస్థలో జరిగిన గణనీయమైన మార్పులు, సామాజిక సంబంధాలపై బలమైన ప్రభావాన్ని వేసాయనీ, అవి గణించదగిన పరిమాణాత్మక మార్పులకు గురి అయ్యాయనీ సీసీ అభిప్రాయపడింది. ఈ మార్పులు, భారతదేశ అర్ధవలస–అర్ధభూస్వామ్య సామాజిక వ్యవస్థ అసమానాభివృద్ధి స్వభావానికి అనుగుణంగా జరిగాయనీ, ఇందుకనుగుణంగా ఎత్తుగడలలో మార్పు తీసుకురావాలని కూడ సీసీ గుర్తించింది. ఈ క్రోడీకరణలపై ఆధారపడి 'భారతదేశ ఉత్పత్తి సంబంధాలలో మార్పులు–మన రాజకీయ కార్యక్రమం' అనే ఈ డాక్యుమెంటును మన పార్టీ కేంద్రకమిటీ విడుదల చేస్తోంది. ఈ డాక్యుమెంటులో దేశాన్ని ఒకే మొత్తంగా తీసుకొని దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఉత్పత్తి విధానాన్ని విశ్లేషించేందుకు, దీనికి అనుగుణంగా తగిన రాజకీయ కార్యక్రమం, ఎత్తుగడలు రూపొందించేందుకు పూనుకుంటున్నది.

## సామాజిక పరివర్తన-మార్క్సిస్టు దృక్పథం

ఏదైనా ఒక సమాజపు ఉత్పత్తి విధానాన్ని అర్థం చేసుకోవాలంటే ముందు సామాజిక అభివృద్ధి భౌతిక నియమాన్ని గ్రహించాలి. సామాజిక అభివృద్ధి చరిత్ర పట్ల మార్క్సిస్టు దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవాలి. సమాజంలో సుదీర్ఘ కాలంగా చారిత్రక భావవాదానికి చారిత్రక భౌతికవాదానికి మధ్య తీవ్రమైన పోరాటం జరుగుతున్నది. తమ పాలనను పరిరక్షించుకోవడం కోసం ప్రతీఘాతుక, శిథిలమవుతున్న దోపిడీ వర్గాలు, వారి ప్రతినిధులూ అనివార్యంగా చరిత్ర గురించిన భావవాద భావనలను ప్రచారం చేస్తారు, చరిత్రను వక్రీకరిస్తారు. మార్క్సిజం పుట్టడానికి ముందు సమాజంలో ఒక శాస్త్రీయమైన అవగాహన ఆవిర్భవించలేదు. దోపిడీ వర్గ వకాల్తాదారులందరూ భగవంతుని యిష్టాయిష్టాల ప్రకారమే మానవ సమాజం అభివృద్ధి

చెందిందనే కుతర్కాన్ని పట్టుకు వేలాడేవారు. వీరులే చరిత్రను నిర్మిస్తారనే వితండవాదంతో చిల్లరమల్లర విషయాలతో కాలం గడిపేవారు. మార్క్సిజం పుట్టిన తరువాతనే, చరిత్ర గురించిన భౌతికవాద భావన గురించి మార్క్స్ శాస్త్రీయంగా వివరించిన తరువాతనే, అది చరిత్ర గురించిన భావవాద భావన సృష్టించిన తప్పుడు వాతావరణాన్ని క్షుణ్ణంగా తిప్పికొట్టింది. మానవ సమాజ అభివృద్ధి గురించిన నిజమైన శాస్త్రీయ భౌతికవాద అవగాహనను అందించింది. విరుద్ధ అంశాల చలనం ఫలితంగానే మానవ సమాజం దాని నియమం ప్రకారం కింది స్థాయి నుంచి పై స్థాయికి అభివృద్ధి చెందిందని చరిత్ర గురించిన మార్క్సిస్టు భౌతికవాద భావనను శాస్త్రీయంగా వివరించింది. ఆదిమ సమాజం నుంచి మొదలుకొని ఆ తరువాత బానిస సమాజం, భూస్వామ్య సమాజం, పెట్టుబడిదారీ సమాజం ఏర్పడ్డాయనీ, ఇది అంతిమంగా అనివార్యంగా సోషలిస్టు, కమ్యూనిస్టు సమాజం-వర్గరహిత సమాజ ఆవిర్భావానికి దారితీస్తుందని రుజువు చేసింది. ఇది మనిషి ఇష్టాయిష్టాలతో సంబంధం లేని భౌతిక నియమం.

మార్క్సిజం మానవ సామాజిక అభివృద్ధి చరిత్ర మనకు శాస్త్రీయంగా ఇలా చెబుతుంది- వర్గాల విషయంలో మాదిరిగానే మానవ చరిత్ర ప్రారంభ దశలో రాజ్యం లేదు, ఇప్పుడున్న వర్గాలు, రాజ్యం ఎప్పటికీ ఉండేవి కావు. వర్గాల రద్దుతో రాజ్యం రద్దవుతుంది. వర్గ సమాజం ఏర్పడే క్రమంలో ఒక వర్గం యింకొక వర్గంపై దోపిడీ, అణచివేతలను కొనసాగించడానికీ, ఆధిపత్యం చెలాయించటానికీ, దోపిడీ, పీడనకు గురవుతున్న వర్గాల ప్రతిఘటనను అణచివేయడానికి రాజ్యం ఆవిర్భవించింది. మానవ సమాజం వర్గాలుగా విభజన అయిన నాటి నుంచి తమ దోపిడీ పాలనను నిలిపి ఉంచుకోవడం కోసం దోపిడీ పాలక వర్గాలు ఎల్లప్పుడూ రాజ్యాంగ యంత్రాన్ని ఉపయోగించుకుంటూనే వున్నాయి. బానిస యజమానులు తమ పాలనను పరిరక్షించుకోవడం కోసం బానిసలను చావబాదేవారు. అంటే బానిసల నుండి మిగులు శ్రమను, ఉత్పత్తిని దోచుకోవడానికి బానిస యజమానులు అత్యంత క్రూరమైన పద్ధతులు ఉపయోగించారు. ఫ్యూడల్ భూస్వామ్యవర్గం రైతాంగాన్ని దోచుకుంటుంది, అణచివేస్తుంది, బూర్జువావర్గం కార్మికవర్గాన్ని దోచుకుంటుంది, దానిపై నియంతృత్వం చెలాయిస్తుంది. ఇదే మాదిరిగా తన పాలనను నిలిపి ఉంచుకోవడం కోసం కార్మికవర్గం బూర్జువావర్గంపై నియంతృత్వాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. ఈ సూత్రాన్ని విప్లవ ప్రతీఘాతుక నియంతృత్వం నుంచే విప్లవ నియంతృత్వం నేర్చుకున్నది.

లెనిన్ చెప్పినట్లుగా, పెట్టుబడిదారులు తమ దోపిడీని సమర్థించుకోవడానికి రాజ్యాంగయంత్రం అనేది యేదో దైవాంశసంభూతమనీ, ప్రకృతికి అతీతమైందనీ, అది ప్రజాభీష్టాన్నీ, మొత్తం ప్రజా నిర్ణయాన్నీ, జాతీయాభీష్టాన్ని వ్యక్తం చేస్తుందనే కుతర్కాన్ని ముందుకు తెచ్చి ప్రజల్ని వంచిస్తారు. భూమీ, ఉత్పత్తి సాధనాలూ సొంత ఆస్తులుగానే వుండి, పెట్టుబడి పెత్తనం ఉన్నంతవరకూ వారు తమ రిపబ్లిక్ యెంత ప్రజాస్వామికమైనదిగా చెప్పినప్పటికీ,

దాని రాజ్యాంగయంత్రం కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని అణచివేసే, పెట్టుబడిదారుల ప్రయోజనాలు నెరవేర్చే యంత్రంగానే ఉంటుంది. సార్వజనిక ఎన్నిక హక్కు, రాజ్యాంగనిర్ణయ సభ, పార్లమెంటు – ఇవన్నీ రాజ్యాంగయంత్రపు అసలు స్వభావాన్ని యేమాత్రమూ మార్చలేవు. పెట్టుబడే సర్వశక్తివంతమైనదీ, పార్లమెంటూ, ఎన్నికలూ కేవలం తోలుబొమ్మలూ, కీలుబొమ్మలూ మాత్రమే. దోపిడీ వున్నంత కాలమూ సమానత్వం వుండజాలదు. కార్మికుడు పెట్టుబడిదారుడితో యెన్నటికీ సమానం కాజాలడు. ఆకలితో అలమటిస్తూన్న మనిషి కడుపునిండా భోజనం చేసిన మనిషితో యెన్నటికీ సమానం కాజాలడు. యే యంత్రం రాజ్యాంగయంత్రం అని పిలువబడుతూందో, పీడిత ప్రజలు పాత పుక్కిటి పురాణాలని నమ్మి దేనినైతే ప్రజా పరిపాలన అని భావించి, దేనినైతే మూఢనమ్మకంతో గౌరవించారో అట్టి యంత్రాన్ని శ్రామికవర్గం బద్దలు చేసి అదొక బూర్జువా వర్గపు అబద్ధం అని యెలుగెత్తి చాటుతుంది.

చరిత్రలో ప్రతి నూతన సామాజిక వ్యవస్థ పాత సమాజ పునాది నుంచే ఉద్భవించింది; ఇది పాత సమాజాన్ని అభావం చేసింది. నూతన సమాజం సారాంశంలో ముందు సమాజానికి భిన్నంగా ఉంటుంది. అదే సమయంలో అనివార్యంగా పాత సమాజ పుట్టు మచ్చలు దానిపై కొన్ని మిగిలిపోతాయి. వర్గ సమాజంలో పునరుద్ధరణకు, ప్రతిపునరుద్ధరణకూ మధ్య సుదీర్ఘ, సంక్లిష్ట పోరాటం జరిగి తీరుతుంది. పునరుద్ధరణ శక్తుల అస్థిత్వానికి పునాది, పరిస్థితులూ పాత సమాజం నుంచి నూతన సమాజానికి వచ్చిన పుట్టుమచ్చలే. కార్మికవర్గం హింసాత్మక విప్లవం ద్వారా బూర్జువా పాలనను కూలదోసిన తరువాత కార్మికవర్గ నియంతృత్వం కింద సోషలిస్టు రాజ్యాన్ని నెలకొల్పుతుంది. ఇది మానవ సమాజ అభివృద్ధి చరిత్రలో ఒక గొప్ప గెంతు. వర్గ సమాజం నుంచి వర్గరహిత సమాజానికి జరిగే పరివర్తనలో నిర్ణయాత్మక ప్రాధాన్యత ఉన్న గొప్ప ముందడుగు.

ఆదిమ సమాజంలో ప్రజా యాజమాన్యం విచ్ఛన్నం కావడంలో వ్యక్తిగత ఆస్తి సంబంధాల అభివృద్ధి కీలకమైంది. ఫ్యూడల్ సమాజ సామాన్య సరుకు ఆర్థిక వ్యవస్థ నుంచి పెట్టుబడిదారీ వ్యవస్థ పెరిగింది. ఇది సరుకు ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో అత్యున్నత దశ. మౌలిక సామాజిక వైరుధ్యాల ఫలితంగా సమాజంలో కొనసాగే వర్గ పోరాటం సమాజాన్ని ముందుకు నడిపిస్తుంది. కింది దశ నుంచి ఉన్నత దశకు మానవ సమాజ అభివృద్ధికి మౌలిక కారణం సామాజిక వర్గ పోరాటంలో, అంటే వర్గ సమాజంలో ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి శక్తుల మధ్యను, ఉ పరితలానికి ఆర్థిక పునాదికీ మధ్యనూ గల వైరుధ్యాల ఫలితంగా సమాజంలో వర్గ పోరాటం ఉందనీ, ఇది చరిత్రను ముందుకు నడిపిస్తుందని సామాజిక అభివృద్ధి చరిత్ర గురించి మార్క్సిజం వివరిస్తుంది. వర్గ సమాజంలో ఈ మౌలిక వైరుధ్యాలు వర్గ పోరాటంగా వ్యక్తమవుతాయి. ఆదిమ సమాజం విచ్ఛిన్నమయిన తరువాత మానవ సమాజ చరిత్రంతా వర్గ పోరాట చరిత్రే. ఈ విషయాన్ని సరిగా అర్థం చేసుకుంటే ఆయా నిర్దిష్ట సమాజాలలో ఉండే మౌలిక వైరుధ్యాలు

మరింత లోతుగా అర్థం అవుతాయి. అలాగే సోషలిస్టు సమాజంలో వర్గరహిత సమాజ లక్ష్యంతో ముందుకు సాగడానికి తోడ్పడేలా ఉపరితలంలోనూ, పునాదిలోనూ విప్లవకర పరివర్తన కోసం కార్మికవర్గ నియంతృత్వంలో విప్లవాన్ని ఎలా నిరంతరాయంగా కొనసాగించాలో కూడా తెలుస్తుంది.

**ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలు:** ఉత్పత్తి శక్తులు ఈ కింది మూడు అంశాలను కలిగి వుంటాయి. 1) ఎంతో కొంత అనుభవం, శ్రమ నైపుణ్యం ఉన్న కార్మికులు 2) శ్రమ సాధనాలు. ఇందులో మొట్టమొదటగా ఉత్పత్తి సాధనాలు 3) శ్రమ లక్ష్యాలు. ఈ మూడింటిలో కార్మికులు ప్రాథమిక, నిర్ణయాత్మక అంశం. అంటే శ్రామిక ప్రజానీకం మాత్రమే ఉత్పత్తి సాధనాలను సృష్టించి, మెరుగుపరచి, ఉపయోగించుకోగలుగుతారు. మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్ పేర్కొన్నట్టుగా – "మొత్తంగా మానవ సమాజ ప్రాథమిక ఉత్పత్తి శక్తి కార్మికులు, శ్రామిక ప్రజలు".

భౌతిక సరుకుల సామాజిక ఉత్పత్తి క్రమంలో ప్రజల మధ్య ఏర్పడే సంబంధాల గురించి ఉత్పత్తి సంబంధాలు చెబుతాయి. వీటిలో మూడు అంశాలు ఉంటాయి. 1) ఉత్పత్తి సాధానాల యాజమాన్య రూపం; 2) ఉత్పత్తి సాధానాల యాజమాన్య రూపం నిర్ణయించే ఉత్పత్తిలో వివిధ సామాజిక గ్రూపుల స్థానం, వాటి మధ్య పరస్పర సంబంధాలూ; 3) పూర్తిగా ఈ రెండింటి మీదనే ఆధారపడి ఉన్న ఉత్పత్తుల పంపిణీ రూపం. ఈ మూడింటిలో ఉత్పత్తి సాధనాల యాజమాన్యం నిర్ణయాత్మకమైనది, ఉత్పత్తి సంబంధాలకు పునాది. ఉత్పత్తి సాధానాల యాజమాన్యం ప్రజల మధ్య పరస్పర సంబంధాలను పంపిణీ రూపాన్నీ నిర్ణయిస్తుంది. ఉదాహరణకు, పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి సాధానాలు పెట్టుబడిదారుల యాజమాన్యంలో ఉంటాయి. కార్మికులకు అమ్ముకోవడానికి తమ శ్రమశక్తి తప్ప మరేమీ ఉండదు. ఉత్పత్తిలో పెట్టుబడిదారులకు ఆధిపత్య, దోపిడీ, పీడక స్థానం ఉంటుంది. కార్మికులు వేతన బానిస, దోపిడీకి గురయ్యే, పీడిత స్థానంలో ఉంటారు. పెట్టుబడిదారుల చేతులలో ఉత్పత్తి సాధనాలు ఉండి, కార్మికులు అధికారం లేని స్థితిలో ఉంటారు కనుక శ్రమ ఉత్పత్తులు అనివార్యంగా పెట్టుబడిదారులకే చెందుతాయి. కార్మికులు తమ జరుగుబాటుకు అవసరమైన వేతనాలు మాత్రమే పొందుతారు. ఉత్పత్తి సాధానాల యాజమాన్యం ఉత్పత్తి సంబంధాలలో నిర్ణయాత్మక పాత్ర వహిస్తుంది. అయితే ప్రజల మధ్య పరస్పర సంబంధాలు, పంపిణీ రూపం కూడా యాజమయాన్య వ్యవస్థపై ప్రభావం చూపిస్తాయి. కొన్ని పరిస్థితులలో నిర్ణయాత్మక పాత్ర వహిస్తాయి.

ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలూ గతితార్కిక ఐక్యతలో రెండు అంశాలు. ఒకటి లేకుండా మరొకటి ఉండదు; ఉత్పత్తి శక్తులు అత్యంత విప్లవకర, చురుకైన అంశం కాబట్టి

సాధారణంగా ప్రధాన, నిర్ణయాత్మక పాత్ర వహిస్తాయి. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి వల్ల, మార్పుల వల్ల వేగంగానో లేక నిదానంగానో ఖచ్చితంగా ఉత్పత్తి సంబంధాలు అభివృద్ధి చెందుతాయి. ఉత్పత్తి శక్తులతో పోలిస్తే ఉత్పత్తి సంబంధాలు కొంత నిలకడగా ఉంటాయి. అందువల్ల, ఉత్పత్తి శక్తులు ఒక స్థాయికి అభివృద్ధి చెందిన తర్వాత ఉత్పత్తి సంబంధాలు వాటి అభివృద్ధిని ఆటంకపరుస్తాయి.

ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని ఆటంకపరచినప్పుడు ఉత్పత్తి సంబంధాలలో మౌలిక మార్పు జరగడానికి హింసాత్మక విప్లవం జరుగుతుంది. ఈ విప్లవం పాత సామాజిక వ్యవస్థను కూలదోసి, ఉత్పత్తి శక్తులు విప్లవాత్మకంగా అభివృద్ధి చెందే విధంగా నూతన, ఉన్నత ఉత్పత్తి సంబంధాలను నెలకొల్పుతుంది. నూతన ఉత్పత్తి సంబంధాల ఆవిర్భావం తిరిగి ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని పెంపొందిస్తుంది.

ఈనాటి వరకూ మానవ సమాజం ఐదు రకాల ఉత్పత్తి సంబంధాలను చవి చూసింది. అవి – ఆదిమ కమ్యూనిస్టు వ్యవస్థ, బానిస వ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థ, సోషలిస్టు వ్యవస్థ.

**ఆర్థిక పునాది, ఉపరితలం:** ఆర్థిక పునాది సామాజిక అభివృద్ధి ఒక ప్రత్యేక దశలో ఉన్న ఆర్థిక వ్యవస్థ గురించి, అంటే ఉత్పత్తి సంబంధాల మొత్తం గురించి చెబుతుంది. ఉపరితలం రాజకీయాలు, చట్టం, తత్వశాస్త్రం, కళ, మతం మొదలయిన వాటి గురించి సామాజిక వైఖరులను, ఈ వైఖరులకు అనుగుణమైన రాజకీయ, చట్ట, న్యాయ సంస్థలు (జైళ్లు, కోర్టులు), సైన్య, రాజ్య వ్యవస్థలను గురించి చెబుతుంది.

ఉపరితలానికి ఆర్థిక పునాదికీ మధ్య వైరుధ్యం సమాజంలో వున్న ఒక మౌలిక వైరుధ్యం. ఇది సమాజ అభివృద్ధిని, మార్పునూ పెంపొందిస్తుంది. ఉపరితలానికి ఆర్థిక పునాదికీ మధ్య సంబంధం గతితార్కిక ఐక్యత కలిగినది. ఆర్థిక పునాది సాధారణంగా ప్రధాన, నిర్ణయాత్మక పాత్ర వహిస్తుంది. ఉపరితలం ఆర్థిక పునాది నుంచి ఏర్పడుతుంది. దాని స్వభావాన్ని ఆర్థిక పునాది నిర్ణయిస్తుంది. ఉదాహరణకు, పెట్టుబడిదారీ సమాజ ఆర్థిక పునాది, ఈ పునాది మీద నిర్మాణమయిన ఉపరితలం బూర్జువావర్గ నియంతృత్వ రాజ్య వ్యవస్థ, బూర్జువా వర్గ భావజాలం కలిపి పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు అంటాం. ఆర్థిక పునాది వహించే నిర్ణయాత్మక పాత్ర గురించి మహోపాధ్యాయులు మార్క్స్ యిలా చెప్పారు. "ఆర్థిక పునాదిలో మార్పుతో యావత్తు ఉపరితలమూ ఎంతో కొంత వేగంగా మార్పు చెందుతుంది" (రాజకీయ అర్థశాస్త్ర విమర్శ).

అయితే సామాజికాభివృద్ధిలో ఉపరితలం ఎలాంటి క్రియాశీల పాత్ర నిర్వహించకుండా కేవలం ఆర్థిక పునాదిని అనుసరించదు. ఇది సాపేక్షికత కలిగి ఉండి ఆర్థిక పునాది మీద

ప్రభావం కలిగిస్తుంది. పురోగామి ఉపరితలం పురోగామి ఆర్థిక పునాది పెరుగుదల అవసరాలు తీర్చే విధంగా ఏర్పడుతుంది; పునాదిని బలోపేతం చేసి దానిని సంఘటితపరుస్తుంది. పాత ఆర్థిక పునాదిని నాశనం చేస్తుంది. ఉత్పత్తి శక్తుల పెరుగుదలకు చోదకంగా ఉండే ప్రగతిశీల శక్తిగా రూపొందుతుంది. శిథిలమవుతున్న ఉపరితలం పాత ఆర్థిక పునాదిని పరిరక్షిస్తుంది, నూతన ఆర్థిక పునాది పుట్టుకను, పెరుగుదలనూ ఆటంకపరుస్తుంది. విప్లవం ద్వారా పాత ఆర్థిక పునాది పరివర్తన చెందిన తరువాత పాత ఉపరితలం, ముఖ్యంగా పాత భావజాలం తక్షణమే మారదు, సుదీర్ఘ కాలం పాటు కొనసాగుతుంది. నూతన ఆర్థిక పునాదిని అణచివేయడంలో, పాతదాన్ని పునరుద్ధరించడంలో అది ప్రతీఘాతుక పాత్ర వహిస్తుంది. ఉత్పత్తి శక్తుల పెరుగుదలను అడ్డుకునే ప్రతీఘాతుక శక్తిగా తయారవుతుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ఆర్థిక పునాది మీద ఉపరితలం నిర్ణయాత్మక ప్రభావం వేస్తుందన్న వాస్తవాన్ని సోషలిస్టు విప్లవ కాలంలో స్పష్టంగా చూడవచ్చు. ఎందుకంటే సోషలిస్టు ఆర్థిక పునాది దానంతట అదే పాత సమాజంలో నుంచి ఉద్భవించదు, కార్మిక వర్గం రాజకీయాధికారం స్వాధీనం చేసుకున్న తరువాతనే ఏర్పాటవుతుంది, పెంపొందుతుంది.

ఇక్కడ ప్రపంచవ్యాప్తంగా జరిగిన పరిణామాలను సంక్షిప్తంగాను ప్రత్యేకించి భారతదేశంలో సమాజ పరిణామ క్రమాన్ని స్థూలంగా చూద్దాం:

ఆదిమ సమాజ చరిత్ర మనిషితో ప్రారంభమవుతుంది. శ్రమ మనిషిని సృష్టించింది. పరికరంగా మారిన మానవ చెయ్యి పరికరాలను తయారు చేయడం మొదలు పెట్టడంతో మనుషులు ప్రకృతిలో భాగంగా ఉంటూనే ప్రకృతిని శాసించేవారుగా మారారు. మానవ అస్తిత్వానికి మూలకారణం శ్రమే. చెయ్యి శ్రమ చేసే అంగం మాత్రమే కాదు, అది శ్రమ ఫలితం కూడా. వేల సంవత్సరాల మానవుల ఆచరణ, ఉత్పత్తి క్రమంలో మానవజాతి పరిణామం ఆటవిక యుగం, అనాగరిక యుగం, నాగరిక యుగాల గుండా సాగింది. ఇందులో మొదటి రెండు యుగాలు ఆదిమ సమాజం లేదా వర్గ రహిత సమాజానికి చెందినవి కాగా, వర్గ సమాజం ఆవిర్భావంతో బానిస, బానిస యజమాని ఉత్పత్తి సంబంధాలు ఏర్పడ్డాయి. అంటే వర్గ సమాజం ఆవిర్భావంతో 'నాగరిక' యుగంగా బానిస సమాజం ఏర్పడింది.

అయితే భారతదేశంలో బానిస సమాజం రూపంలో కాకుండా సింధు నదీలోయలో మొదటి నాగరికత పతనమై ఆర్య తెగలు స్థిర నివాసం ఏర్పరచుకొని వ్యవసాయం చేపట్టిన తర్వాత వర్ణ వ్యవస్థ రూపంలో వర్గ సమాజం ఆవిర్భవించింది. ఈజిప్టు, రోమ్ తదితర ప్రాంతాలలోని బానిస నాగరికతలతో పోలిస్తే విలక్షణమైనదిగా కనిపించే వర్ణ సమాజపు అంతస్సారమూ, బానిస సమాజపు అంతస్సారమూ ఒక్కటే. ఈ రెండూ ఆదిమ గణ సమాజపు సమిష్టి ఉత్పత్తి సంబంధాలను ఛేదించుకుంటూ ఆవిర్భవించినవే.

**భారతదేశంలో సమాజ పరిణామ క్రమం:**

సింధూ నాగరికత (క్రీ.పూ. 2500-1800)ను మినహాయిస్తే, ప్రాచీన భారత సమాజ పరిణామ క్రమాన్ని నాలుగు దశలుగా విభజించవచ్చు. ఇది ఆర్యుల రాక (క్రీ.పూ. 1800)తో ఆరంభమై గుప్తుల కాలం(క్రీ.శ. 4)తో అంతమవుతుంది.

**1. పశుపోషణ, ఆదిమ వ్యవసాయ దశ:** ఈ దశ(క్రీ.పూ. 1800-1000)లో సంచార జీవనం సాగించే ఆర్య తెగలకు పశుపోషణ ప్రధాన జీవనాధారంగా ఉండేది. అప్పటికి వారు 'రాజన్య' అనే ప్రభువులు (Aristocracy)గానూ, 'బ్రాహ్మణులు' అనే పురోహితులుగానూ, 'విశ్' అనే సాధారణ గణ సభ్యులుగానూ విభజించబడి ఉన్నారు. ఈ ఋగ్వేద కాలంలో ఆర్యులు గో మాంసాన్ని ఆహారంగా తీసుకునేవారు. ప్రధానంగా పశువుల మేత కోసమే వ్యవసాయాన్ని చేపట్టారు. మరో పక్క ఈ దశలో ఆర్యేతర ఆటవిక తెగలు ఆహారసేకరణ, వేట కొనసాగించగా, కంచుయుగపు తెగలు తేలికపాటి వ్యవసాయం కొనసాగించాయి. కొందరు పశుపోషణ చేపట్టారు. రాతి పనిముట్లు, విల్లు-బాణాలు ఉత్పత్తి సాధనాలుగా ఉండేవి. ఈ కాలంలో జరిగిన ముఖ్యమైన పరిణామం ఏమంటే ఆర్యేతరులైన ఆటవిక తెగలను యుద్ధాలలో ఓడించడంతో పాటు వివిధ రూపాలలో లొంగదీసుకొని ఆర్యులు ఒక విస్తృతమైన గణ సమాజాన్ని సృష్టించడం. దక్షిణ భారతంలో సాపేక్షికంగా స్థిరమైన నివాసాలు ఏర్పర్చుకొన్న రాగి, కంచుయుగపు వ్యవసాయక సమాజాలేర్పడ్డాయి. అయితే పశుపోషణ కంటే ఆదిమ వ్యవసాయం ప్రధానంగా వుండేది. మొత్తం మీద అప్పటికి యింకా భారతదేశంలో ఎక్కడా వర్గ సమాజాలు ఏర్పడలేదు.

**2. నాగలితో వ్యవసాయానికి పరివర్తన చెందిన దశ:** ఇది సంచార పశుపోషణ నుంచి స్థిర వ్యవసాయానికి పరివర్తన చెందిన దశ (క్రీ.పూ. 1000-600). ఈ దశ ప్రారంభం నాటికి ఇనుము వాడకం విస్తరించడంతో ఉత్పత్తి శక్తులలో గణనీయమైన మార్పు వచ్చింది. వ్యవసాయం ప్రధాన జీవనాధారం కానారంభించింది. పశువులను మొదటిసారిగా వ్యవసాయానికి వాడడం మొదలయింది. ఉత్పాదకత పెరగడంతో ఆర్య గణాలకు అదనపు ఉత్పత్తి చేయడం మొదటిసారిగా సాధ్యమయ్యింది. వర్ణవ్యవస్థ నూతన సామాజిక వ్యవస్థను, నూతన ఉత్పత్తి సంబంధాలను అందించింది. ఆర్యులలో రాజన్య, బ్రాహ్మణ, విశ్ అనే వర్ణాలు ఉండగా, శూద్రవర్ణం ఆర్యేతరుల నుంచి ఏర్పడింది. క్షత్రియులు, బ్రాహ్మణులు పాలకవర్గంగానూ, వైశ్యులు వ్యవసాయం చేసే కర్షకులుగానూ ఏర్పడ్డారు. వీరుగాక లొంగదీసుకున్న దాసులను, యితర ఆర్యేతర ఆటవికులను ఆర్య గణాలకు సేవకులుగా, వర్ణరీత్యా శూద్రులుగా మార్చారు. శూద్రులు బానిసలుగా కాక ఆర్య తెగలకు సమిష్టి భృతులయ్యారు. పై మూడు వర్ణాలకు సేవ చేయడమే శూద్రుల ధర్మం. ఈ దశలో శూద్రులకు ప్రత్యక్ష ఉత్పత్తిలో భాగస్వామ్యం లేదు.

అంటే భారతదేశంలో ఆదిమ సమాజం తర్వాత బానిస సమాజం కాకుండా వర్ణ వ్యవస్థ రూపంలో మొట్టమొదటి వర్గ సమాజం ఏర్పడింది. దాంతో వర్గ వ్యవస్థకు పునాది పడి, అదనపు ఉత్పత్తిని చేజిక్కించుకునే పాలక వర్గం ఏర్పడింది. ఉత్పత్తి శక్తులు మరింతగా అభివృద్ధి చెందాలంటే దానికి అడ్డంకిగా ఉండే పాత గణ వ్యవస్థను కూలదోయడం అనివార్యమైంది. ఈ దశ నాటికి దక్షిణ భారతదేశంలోని తెగలు ఇనుము వాడకం నేర్చుకోలేదు. కంచుయుగపు వ్యవసాయమే అక్కడ ప్రధానంగా కొనసాగింది.

**3. వర్ణ ఆధారిత వ్యవస్థ:** సింధూ నాగరికత తర్వాత తిరిగి ఈ కాలం(క్రీ.పూ. 600–200)లోనే నాగరికత దశ తిరిగి ప్రారంభమైంది. ఇది భూస్వామ్య పూర్వ సమాజంగా లేక భూస్వామ్యానికి పరివర్తన చెందుతున్న వర్గ సమాజం. ఈ దశలో స్థానిక తెగల నుండి ఆర్య పశుపాలక తెగలు వ్యవసాయాన్ని నేర్చుకున్నాయి. దీనితో ఆహార సేకరణ స్థానంలో ఆహార ఉత్పత్తి ప్రధానమైంది. పశుపోషణపై ఆధారపడిన సమాజం స్థానంలో వ్యవసాయ ఆధారిత సమాజం, గణ వ్యవస్థ స్థానంలో వర్గ (వర్ణ) వ్యవస్థ ఏర్పడ్డాయి. ఈ దశలో విశ్‌లూ, లొంగదీసుకున్న తెగలూ సమర్పించే కప్పాలపై, కానుకలపై ఆధారపడి బతికే వర్గాలు–వర్ణాలు ఏర్పడే క్రమంలో బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలు ఆవిర్భవించాయి. స్థానిక తెగ గణాల నుండి నాయకులను, పూజారులను వరుసగా క్షత్రియ, బ్రాహ్మణ వర్ణాలలో చేర్చుకున్నారు. ఓడిపోయిన ఆర్య, ఆర్యేతర తెగలన్నీ క్రమంగా శూద్రవర్ణంగా మార్చబడ్డాయి. ప్రధానంగా వైశ్య రైతులు, శూద్రులు పశువులు కాచేవారు, వ్యవసాయం చేసేవారు. బ్రాహ్మణ పురోహిత వర్గం వర్ణాశ్రమ ధర్మాన్ని అభివృద్ధి చేసింది. క్రమంగా నిజమైన వ్యవసాయదారులు, వృత్తిపనివారు శూద్రులయ్యారు, వారిలో పలువురు వ్యవసాయ కూలీలుగా వెట్టి శ్రామికులుగా మార్చబడ్డారు. వైశ్యులు వర్తకానికి పరిమితమయ్యారు. ఆర్యులు, అనార్యుల మధ్య అంతరువులు నశించి ఆర్యులదిగానే ఒక నూతన తెగ ఆర్థిక వ్యవస్థ ఏర్పడింది. యజ్ఞాలు, కర్మకాండలు క్రమంగా సంక్లిష్టంగా ధన, కాల, వ్యయాలతో కూడినవిగా మారాయి. ఇవి మిగులును పునఃపంపిణీ చేసే సాధనాలయ్యాయి. శూద్ర శ్రామికులు సృష్టించిన అదనపు విలువ మీద సమాజం నిలదొక్కుకుంది. శూద్రులు క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య వర్ణాలకు గృహ బానిసలుగా పరిణామం చెందారు. చాతుర్వర్ణ వ్యవస్థలో కర్షకుడు శూద్రుని స్థానం పొందగా, 'మలినమైన' పనులుగా పరిగణించబడే చచ్చిన పశువుల తోళ్లను తొలగించి శుభ్రం చేయడం, పశువులను చంపడం వంటి పనులను దాసులతో చేయించేవారు. కౌటిల్యుని 'అర్థశాస్త్రం' ఈ దశను ప్రతిబింబించింది. వర్ణ వ్యవస్థ పునాదుల్ని గట్టిపరచడంలో, శూద్రులను అణచిపెట్టడంలో కర్మ సిద్ధాంతం ప్రధాన పాత్ర వహించింది.

ఈ దశలో స్థిర నివాస గ్రామాలు ప్రధాన లక్షణమయ్యాయి. పట్టణ కేంద్రాలు అవతరించాయి.

గణ పరిపాలన, తెగల సమాఖ్యల స్థానంలో అన్ని తెగలలోని ఉన్నత వర్గాలైన/వర్ణాలైన క్షత్రియ, బ్రాహ్మణుల ప్రతినిధిగా రాజ్యం ఆవిర్భవించింది. పట్టణ నాగరికత, ఇనుపయుగపు వ్యవసాయ సమాజ త్వరిత విస్తరణ, పెద్ద సామ్రాజ్యాల అవతరణ, కేంద్రీకృత పద్ధతిలో అదనపు ఉత్పత్తి సమీకరణ, విదేశీ వ్యాపారం ఈ దశలో ముఖ్య పరిణామాలు. ఈ కాలంలోనే బౌద్ధ, జైన మతాలు జనించి అభివృద్ధి చెందాయి.

అహింస, కర్మ సిద్ధాంతాలను ప్రచారం చేయడం ద్వారా బౌద్ధమతం నూతన సమాజానికి ప్రతినిధిగా నిలిచింది. సమాజంలో శాంతిని, స్థిరత్వాన్ని నెలకొల్పే లక్ష్యం కలిగి ఉండడం వలన బౌద్ధమతం వర్తకానికి పెద్ద ఊపునిచ్చింది. అందువల్లనే ఇది సంపన్న వర్గాలకు, శెట్టి గహపతులకు, రాజులకు అనువైన సాధనమైంది. మొత్తం మీద ఆరంభ దశలో గణాలలో వ్యవసాయిక వర్గసమాజాన్ని ప్రవేశపెట్టడంలో బౌద్ధమతం ప్రముఖ పాత్ర వహించింది.

ఆర్యులు భారత దేశానికి వలస వచ్చిన నాటినుండి ఈ దశకు పరిణామం చెందడానికి దాదాపు 1200 సంవత్సరాలు పట్టడానికి ఇక్కడి భౌగోళిక, వాతావరణ పరిస్థితులే ప్రధాన కారణం.

సింధూనదికి తూర్పున ఉన్న ప్రాంతం అంతా అప్పుడు దట్టమైన అడవితో నిండి వుంది. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకొని స్థిరనివాసాలను ఏర్పరచుకోవాలంటే రాతి, కంచు పనిముట్లు సరిపోవు. దట్టమైన అడవులను నరకడానికి ఇనుప గొడ్డలి, నేలను చదును చేయడానికి పార, భూమిని సాగుచేయడానికి ఇనుపకర్రుతో తయారుచేసిన బరువైన నాగలి అవసరం. ఇనుప పనిముట్లను తయారు చేయడానికి కావలసిన విస్తృతమైన గనులు బీహార్ ప్రాంతంలోనే వున్నాయి. ఆర్యులు ఈ దేశానికి వచ్చేటప్పటికే ఇనుము వాడకం తెలిసి ఉండడం, బీహార్ ప్రాంతాన్ని ఆక్రమించుకోవడంతోటే ఈ పరివర్తన దశ పూర్తి అయి నాగరిక సమాజ ఆవిర్భావం సాధ్యం అయింది. అంతేకాక యింకా ఆటవిక దశలో వున్న నగా, నిషాధా తదితర ఆర్యేతర జాతులనూ, కంచుయుగపు అనాగరికదశలో ఉన్న దాసులు తదితర గణాలను యుద్ధాల ద్వారా జయించి లొంగదీసుకోవడానికి కంచుయుగపు ఆయుధాలు సరిపోవు. ఇనుముతో చేసిన ఖడ్గం, ఈటెల ద్వారానే ఇది సాధ్యం. ఎంగెల్స్ చెప్పినట్లు అనాగరిక దశలోని ప్రధాన ఆయుధం ఇనుప ఖడ్గమే. గుర్రాలు, ఇనుప ఖడ్గాల సహాయంతో ఆర్యులు మిగతా ఆటవిక కంచుయుగపు అనాగరిక గణాలను జయించి లొంగదీసుకోగలిగారు. లేదా వారికి వ్యవసాయాన్ని నేర్పి తమలో కలుపుకోగలిగారు. తద్వారా వర్గసమాజాన్ని ఏర్పరచి సామ్రాజ్యాలను స్థాపించగలిగారు. దక్షిణ భారతానికి నాగలితో వ్యవసాయం చేసే స్థిర నివాసాలు విస్తరించాయి. ఉత్తర భారతంలో కేంద్రీకృత రాజ్యాల కింద జరిగిన పరిణామాలే దక్షిణ భారతంలో శాతవాహనుల పాలనలో జరిగాయి.

ఇనుము యుగానికి చెందిన వ్యవసాయ వర్గసమాజ తొలి రోజులలో అదనపు ఉత్పత్తి స్వల్పంగానే వుంది. దానిని పెద్ద మొత్తంలో చేజిక్కించుకోవాలంటే పాలకవర్గాలకు కర్కశమైన కేంద్రీకృత పరిపాలన అవసరం. శిస్తు సేకరణ హింసాత్మకంగా జరగాలి. వ్యవసాయేతర సరుకుల ఉత్పత్తి, వర్తకం కూడా కేంద్రీకృతంగా జరిగితేనే అధిక పన్నులను వసూలు చేయడం సాధ్యం. అందుకే ఈ నాగరికత తొలిదశలో ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ పెద్ద కేంద్రీకృత సామ్రాజ్యాలు అవతరించాయి.

**4. వర్ణ ఆధారిత వ్యవస్థ నుంచి కులాధారిత ఫ్యూడలిజానికి పరివర్తన చెందిన దశ:** ఈ దశ (క్రీ.పూ. 200–క్రీ.శ. 400)లో పెద్ద కేంద్రీకృత సామ్రాజ్యం స్థానంలో అనేక చిన్న వికేంద్రీకృత రాజ్యాలు, సామంత రాజ్యాలు ఉనికిలోకి వచ్చాయి. తిరిగి బ్రాహ్మణాధారిత వర్ణవ్యవస్థ బౌద్ధమతంతో పోటీపడి, గణాలను నాగరిక సమాజంలో కలిపేసుకునే క్రమంలో బలపడుతూ చివరికి పట్టణ వర్తకం దెబ్బతిని స్వయంపోషక గ్రామాల ఏర్పాటుతో పైచేయి సాధించింది. దీంతో భూస్వామ్య వ్యవస్థకు పునాదులు ఏర్పడ్డాయి. చేతివృత్తుల శ్రేణులు, వర్తక శ్రేణులు దెబ్బతినడం, పట్టణాలు పతనమవడం, వృత్తికారులు గ్రామాలకు తరలి వెళ్లడం, బౌద్ధ మతం క్షీణించడం, బ్రాహ్మణ మతం ఆధిక్యతలోకి రావడం, కుల వ్యవస్థ ఏర్పడడం ఈ దశలో ముఖ్య పరిణామాలు. ఈ దశలో పరిణామాలను 'మనుస్మృతి' అద్దం పడుతుంది.

ఉత్తర భారతంలో మౌర్యుల, దక్షిణంలో శాతవాహనుల పతనానంతరం స్వయం పోషక గ్రామాలు ఏర్పడడంతో ఈ దశ ముగిసింది.

గ్రీకు, రోమన్ తదితర పాశ్చాత్య సమాజాలలో లాగా భారతదేశంలో బానిస వ్యవస్థ ఉనికిలోకి రాకపోవడానికి కారణాలు రెండు :

1) ఇక్కడ వ్యవసాయిక సమాజాలను ఏర్పరచిన ఆర్యులు స్వంత ఆస్థిపై ఆధారపడలేదు. వారు భూమిని, పశువులను సమిష్టి ఆస్తిగా కలిగిన గణ సమాజాల నుంచి వచ్చారు. దీనివలన ఆర్యులు లొంగదీసుకున్న దాసులను, ఆర్యేతరులనూ యావత్తు ఆర్య గణాలకు ఉమ్మడి సేవకులుగా వర్ణరీత్యా శూద్రులుగా మార్చారు. కానీ, ఏ ఒక్కరికీ స్వంత బానిసలు కాలేదు.

2) భారతదేశ భూభాగం విశాలమైనదిగా ఉండి, ఆహార సేకరణకు, వేటకూ పుష్కలమైన అవకాశాలు వుండడం వలన బానిస వ్యవస్థ మనగడకు అవకాశం లేకుండా పోయింది. గ్రీకు, రోమన్ తదితర సామ్రాజ్యాలలో వలే ఇక్కడి ఆటవికులను, దాసులను బానిసలుగా ఎల్లకాలం ఉంచుకోవడం సాధ్యం కాని పని. అందువలన వారిని వర్ణ వ్యవస్థ లాంటి సామాజిక నిర్మాణంలో వివిధ రూపాలలో అణచిపెట్టి ఉంచడంలో కర్మ సిద్ధాంతం ప్రధాన పాత్ర వహించింది. దీనర్థం బలప్రయోగం లేకుండా ఆర్యేతరుల్లో కొందరు

శూద్రులుగా మారారని గానీ, శూద్రులంతా వర్గ పోరాటాలు చేయకుండా స్వయంగా లొంగిపోయారని గానీ కాదు. వర్ణాశ్రమ ధర్మం బల ప్రయోగ ఆవశ్యకతను కొంత మేరకు తగ్గించింది.

## భూస్వామ్య సమాజం

క్రీ.శ. 4వ శతాబ్దం నుండి మన దేశంలో భూస్వామ్య వ్యవస్థ రెండు దశలుగా అభివృద్ధి చెందింది. 1) సామంత భూస్వామ్యం (ఫ్యూడేటరీ ఫ్యూడలిజం) లేదా మీది నుండి భూస్వామ్యం, 2) గ్రామీణాధారిత భూస్వామ్యం లేదా కింది నుండి భూస్వామ్యం.

**1) సామంత భూస్వామ్యం లేదా మీది నుండి భూస్వామ్యం:** ఈ దశ క్రీ.శ. 4వ శతాబ్దంలో ఆరంభమై క్రీ.శ. 6వ శతాబ్దంలో గుప్త సామ్రాజ్య పతనంతో వ్యవస్థీకృతమై 11వ శతాబ్దం వరకు ప్రధాన ధోరణిగా ఉంది. రాజుకూ రైతుకూ మధ్య సామంతుల దొంతరలు ఉండేవి. ప్రతి సామంతుడూ తనపై వాడికి కప్పం చెల్లిస్తూ తన స్థాయిలో సంపూర్ణ స్వేచ్ఛ కలిగి వుండేవాడు. ఇదే కాలంలో వర్ణాశ్రమ ధర్మాన్ని ఆధారం చేసుకుని కులవ్యవస్థ, హిందూ మతం పూర్తి స్థాయిలో రూపుదిద్దుకున్నాయి. భూమి గ్రామీణుల ఉమ్మడి ఆస్తిగా ఉండి గ్రామసభ స్వయంప్రతిపత్తిని కలిగి వుండేది. ఈ దశలోనే శూద్రులు రైతులుగా మార్పు చెందారు. బలహీనమైన గణాలు అంటరానివారుగా, పంచములుగా గ్రామీణ వ్యవస్థలో భాగస్వాములయ్యారు.

**2) గ్రామీణాధారిత భూస్వామ్యం లేదా కింది నుండి భూస్వామ్యం:** ఈ దశ క్రీ.శ. 9వ శతాబ్దం నుండే ముందుకు వచ్చినప్పటికీ 11వ, 12వ శతాబ్దాల కాలంలోనే ప్రధాన ధోరణి అయ్యింది. ఈ దశలోనే పైనున్న రాజులకు, సామంతులకు కిందనున్న గ్రామీణులకు మధ్య ఒక సాయుధ భూస్వామ్య వర్గం ఏర్పడింది. శిస్తు వసూళ్లు, శాంతి భద్రతల సంరక్షణ, అమ్మకపు సరుకుల ఉత్పత్తి, చెరువులు తదితర నీటి వనరుల నిర్వహణ అంశాలన్నీ వీరి ప్రత్యక్ష హక్కులు, బాధ్యతలు, దీంతో గ్రామసభ స్వయంప్రతిపత్తిని కోల్పోయింది. ముస్లిం రాజుల పరిపాలనలో ఈ గ్రామీణ భూస్వామ్య వర్గం రైతుల నుండి వసూలు చేసిన పన్నులో ప్రధాన భాగం తాము ఉంచుకునేవారు. వీరు యుద్ధ అవసరాలకు సైనికులను పంపేవారు.

### భూస్వామ్య వ్యవస్థకు సంబంధించిన ముఖ్యమైన లక్షణాలు:

1) భూమి ప్రధాన ఉత్పత్తి సాధనంగా ఉంటూ, స్థానిక అవసరాలు స్థానికంగానే తీర్చుకునే స్వయంపోషక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఉనికిలో ఉండడం, సరుకు-మార్కెట్ సంబంధాలు అత్యంత పరిమితంగా ఉండడం.

2) రైతుల నుండి శిస్తులను లేదా అదనపు ఉత్పత్తిని రాబట్టుకునే ఒక భూస్వామ్య వర్గం అస్తిత్వంలో ఉండడం.

3) జనాభాలో అత్యధికంగా ఉన్న రైతాంగము తాము ఉత్పత్తి చేసే దాంట్లో ఒక గణనీయమైన భాగాన్ని ఉత్పత్తిలో పాల్గొనని పరాన్నభుక్కు భూస్వామ్య వర్గానికి చెల్లించడం, ఉచిత సేవలు/వెట్టిచాకిరి చేయడం రూపంలో గానీ, వస్తు రూపంలో గానీ లేదా డబ్బు రూపంలో గానీ మిగులు చెల్లించడం ద్వారా రైతాంగం భూస్వాముల దోపిడీకి గురికావడం.

4) భూస్వామ్య వ్యవస్థ ప్రధానంగా శూద్ర కులాల, దళితుల (అంటరానివారి) శ్రమ దోపిడీ, పీడన, అణచివేతలపై ఆధారపడి ఉండడం.

ఉత్తర భారతంలో మౌర్యుల పాలన (క్రీ.పూ. 600–200)/దక్షిణాన శాతవాహనుల పాలన (క్రీ.పూ. 250–క్రీ.శ. 400) అనంతరం భూస్వామ్య వ్యవస్థకు పునాదిగా ఉన్న స్వయంపోషక గ్రామాలు సర్వవ్యాపితమై సహజ ఆర్థిక వ్యవస్థలో ప్రాథమిక యూనిట్లుగా మారాయి. గ్రామసభలు వీటి పరిపాలనా వ్యవహారాలు చూసేవి. వ్యవసాయం, చేతివృత్తులు గ్రామ స్థాయిలో సమ్మిళితమైపోయాయి. ఈ స్వయంపోషక గ్రామాలు పూర్తిగా విడివడి అన్ని వైపుల నుండి మూసుకుపోయిన యూనిట్లుగా కాకుండా తమ అవసరాల కోసం బయటి ప్రపంచంతో పరిమిత సంబంధం కలిగి ఉండేవి.

గుప్తుల కాలం తర్వాత వర్తక గిల్డులు, చేతివృత్తుల గిల్డులు క్షీణించడం, ద్రవ్య చలామణి కుంచించుకుపోయి చేతివృత్తులవారు గ్రామాలలో స్థిరపడడం, స్వయంసంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడం మొదలైన పరిణామాలు కులాలపై ఆధారపడిన ఫ్యూడల్ విధానం తలెత్తడానికి అవసరమైన పరిస్థితులు సృష్టించాయి. స్వయంపోషక గ్రామాలకు మునుపటి చాతుర్వర్ణ వ్యవస్థ సరిపోలేదు. వ్యవసాయ విస్తరణ క్రమంలో సామాజికోత్పత్తి వృద్ధి చెందుతూ సామాజిక అవసరాలకు అనుగుణంగా నూతన వృత్తులు వృద్ధి చెందుతూ నూతన గ్రామీణ సమాజం ఏర్పడే క్రమంలోనే వర్ణ వ్యవస్థతో ప్రమేయం లేకుండా అనేక 'శూద్ర' కులాలు ఏర్పడ్డాయి. వర్ణాలు, వర్గాలు, కులాలుగా మారే పరిణామం జరిగింది. ఒకే వృత్తివారు ఒకే కులంగా మారారు. చతుర్వర్ణాలతో పాటు ఐదవ వర్ణం (పంచములు) అంటరానివారితో, అట్టడుగున ఉండేవారితో ఏర్పడింది. శూద్రుల సముదాయం విభజించబడి పలు చేతివృత్తులవారినీ, ఆదివాసులనూ అంటరాని సముదాయంగా మార్చారు. వీరితో బాటు మొదటి నుంచి దాస స్థితిలో మగ్గుతున్నవారినందరినీ అపరిశుద్ధ శూద్రులుగా పరిగణించారు. కులాధారిత భూస్వామ్య వ్యవస్థలో కులాలుగా మార్చబడిన తెగల దేవతలనూ, దేవుళ్లనూ బ్రాహ్మణీకరించారు. కర్మ సిద్ధాంతం ద్వారా 4వ, 5వ వర్ణాలను అణచిపెట్టగలిగారు.

దేశంలోని చాలా ప్రాంతాలలో కుల వ్యవస్థ సుమారు క్రీ.శ. 6వ శతాబ్దం నుండి

సంఘటితీకరణ మొదలై గజినీ మహమ్మద్ దండయాత్రలకు ముందే అంటే క్రీ.శ. 10వ శతాబ్దం నాటికే పూర్తయ్యింది. ఫ్యూడల్ వర్గం కులవ్యవస్థకు దన్నుగా నిలిచింది. శారీరక శ్రమతో సంబంధమున్న అన్ని కులాలవారు లేదా బ్రాహ్మణుల ఆధిక్యతను లేదా వర్ణాల అంతస్థులను ప్రశ్నించినవారు శూద్రులుగా వర్గీకరించబడ్డారు. మనుస్మృతి భూస్వామ్యానికి, దోపిడీ వర్గాల ఆధిక్యతకు సమర్థవంతమైన సైద్ధాంతిక సమంజసత్వాన్ని సమకూర్చింది. అత్యధిక ప్రజల స్వేచ్ఛను హరించి వారిని హీనస్థితికి నెట్టింది.

స్వయంపోషక గ్రామీణ వ్యవస్థ కులాధారిత ఫ్యూడల్/భూస్వామ్య వ్యవస్థలో ఒక భాగంగా, ఒక వర్గ వ్యవస్థగా ఉండేది. ఈ వ్యవస్థలో మొదట్లో భూమి ఎవరి సొంత ఆస్తిగా లేదు, అందువల్ల సరుకుగా లేదు. భూమిలో కొంత భాగం సమిష్టిగా వుండి పశువులను మేపుకోవడానికీ, వంట చెరుకు కోసం మొత్తం గ్రామ ప్రజల అవసరాలకు ఉపయోగపడేది. సజాత వ్యవసాయక బృందాలు ఇతర తెగలను శూద్రులుగా లోబరుచుకొని స్థిర ఆవాసాలు ఏర్పర్చుకోవడం ద్వారా మన దేశంలో వ్యవసాయక గ్రామాలు ఏర్పడ్డాయి. గ్రామాలలోని ప్రధాన వ్యవసాయ క్షేత్రాలు ఈ గ్రామీణుల ఉమ్మడి ఆస్తిగానే వున్నాయి. వీళ్లను 'కుటుంబినులు' అనేవారు. వీళ్లు తమ గ్రామసభ ద్వారా ప్రతీ సంవత్సరం భూమిని వ్యవసాయార్థం తమలో తాము పంచుకునేవారు. శూద్రవర్ణం నుంచి అతిశూద్ర శ్రేణుల్లోకి తోసివేయబడిన కొన్ని చేతివృత్తుల సముదాయాలవారు సంపదను, భూములను కలిగి ఉండడం నిరాకరించబడిన కట్టుబానిస వ్యవసాయ కూలీలు. మొత్తం గ్రామం కోసం, ప్రత్యేకించి భూయజమానుల వర్గం కోసం శ్రమ చేయడం మాత్రమే వారి విధిగా ఉండేది. వారు గ్రామానికి బయట నివశిస్తూ అతిహీనమైన జీవితాన్ని, శాశ్వతమైన దాస్యాన్ని అనుభవించేవారు. వీరి నుండే ఉత్పాదక మిగులును అతిఎక్కువగా దోచుకోగలిగేవారు. బంజర్లను బ్రాహ్మణులకు తదితరులకు గ్రామసభ దానం చేసేది. క్రీ.శ. 9వ శతాబ్దం నుండి గ్రామసభ సాంప్రదాయక అధికారాలు తరిగిపోనారంభించినప్పటికీ, బ్రిటీష్ ఆక్రమణ కాలానికి కూడా కొంత మేరకు అధికారాలు కలిగే వుంది.

ప్రతి గ్రామంలోనూ ప్రజల అవసరాలను తీర్చడానికి వడ్రంగులూ, కమ్మరులు, కుమ్మరులు, నేతగాళ్లూ, చర్మకారులు, గౌండ్లవాళ్లు, కంసాలులు మొదలైన చేతివృత్తులవారు ఉండేవారు. నూలు వడకడం, బట్టలు నేయడం ప్రతి కుటుంబంలోనూ ఉపవృత్తిగా వుండేది. గ్రామ ఆర్థిక, సామాజిక సేవలు కరణమూ, పురోహితుడూ, మంగలి, చాకలి, నీరటి మొదలైనవారు చేసేవారు.

వీరికి ధాన్య రూపంలో ప్రతిఫలం చెల్లించేవారు. దీనినే శతాబ్దాల తరబడి జాజ్‌మాని/బలూతేదారి పద్ధతి అనీ, అయ్యగార్ల పద్ధతి అని పిలిచేవారు. "బారహ్ బలూతేదార్లు" అంటే పన్నెండు రకాల వృత్తులవారని అర్థం. నగదు రూపంలో చెల్లింపులే కాకుండా వారికి వ్యవసాయార్థం అదనంగా భూములు కూడా యిచ్చే ఆనవాయితీ వుండేది. బ్రాహ్మణులకు అగ్రహారాలను దానం చేసినప్పుడు ఈ చేతివృత్తుల వారి భూములపై మాత్రం శిస్తు మినహాయింపు

వుండేది. ఈ పద్ధతి గుప్తుల కాలం నుండి ఉనికిలోకి వచ్చింది.

ఈ పద్ధతి ఉచిత శ్రమను అనేక రెట్లు వెలికితీసే అగ్రకులాలను గ్రామ స్థాయిలో సైతం మానవ శ్రమ నుంచి పూర్తిగా ఉపసంహరించేందుకు అనుమతించింది. చివరికి వెట్టి-బిగార్ పద్ధతి వలన ఒక ఆర్థికేతరమైన, నిర్బంధపూరితమైన సంబంధం ఏర్పడింది. అంటరాని కులాలకు దిగువస్థాయి పనులను కేటాయించారు. వారిలో కొందరికి గ్రామంలోని కొద్దిపాటి భూమిని సాగు చేసుకునే హక్కు లభించినప్పటికీ, అత్యధికులు మాత్రం నిర్దిష్టంగా కొన్ని కుటుంబాలకు కట్టివేయబడిన వెట్టిసేవకులుగా, గృహబానిసలుగా, భూమిలేని అర్ధబానిసలుగా ఉండేవారు.

ఈ పద్ధతి స్వయంసంపూర్ణ గ్రామీణ వ్యవస్థను మరింత పటిష్టం చేసింది. ఎందుకంటే ఈ చేతివృత్తులవారు గ్రామం విడిచి వెళ్లవలసిన అవసరం కలిగేది కాదు. గ్రామంలోని ఉత్పత్తి ప్రధానంగా వినియోగం కోసం జరిగేది కానీ అమ్మకం కోసం కాదు. గ్రామంలో ఉత్పత్తి అయ్యేవి ఉపయోగపు విలువలే కానీ సరుకులు కాదు. డబ్బు పాత్ర నామమాత్రంగానే ఉ ండేది. దీనినే సహజ ఆర్థిక విధానం అంటారు. కుల వ్యవస్థ, హిందూ వర్ణాశ్రమ ధర్మం గ్రామాలలోని శ్రమ విభజనని మార్చడానికి వీలులేనిదిగా చేసాయి. ఇటువంటి స్వయంసమృద్ధ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, మార్పు లేని శ్రమ విభజన, కఠినమైన కుల వ్యవస్థ కలిసి వున్న భూస్వామ్య వ్యవస్థలో మార్కెట్ సంబంధాలు, ఆర్థిక పురోగతి చాలా మందకొడిగా సాగడం సహజం.

రైతాంగానికి మార్కెట్‌తో సంబంధం చాలా అరుదుగా ఉండేది. నగదు రూపేణా భూమి పన్నులు చెల్లించాలని కొందరు రాజులు షరతు విధించినప్పుడు మార్కెట్‌తో రైతులకు కొంత సంబంధం ఏర్పడినా అది తాత్కాలికమైనదే. కొన్ని ప్రాంతాలలో నగదు రూపంలో శిస్తు చెల్లించడానికి అవసరమైనంత ధాన్యాన్ని మాత్రమే అమ్మేవారు. అయితే దేశంలో అత్యధిక ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారుల వద్ద రైతులు నగదు అప్పు తీసుకొని, తమ పంట చేతికి వచ్చాక తీర్చేవారు. మూడవ వంతు పంటని నగదు రూపంలో భూమి పన్నుగా చెల్లించాలని అక్బర్ నియమం విధించినప్పుడు రైతులు ప్రధానంగా వడ్డీ వ్యాపారులపైనే ఆధారపడ్డారు తప్ప స్వంతంగా మార్కెట్‌కు వెళ్ళి అమ్మింది తక్కువ.

ఫ్యూడల్ వర్గాల దోపిడీ ఫలితంగా సమాజంలో రైతాంగం మధ్య వర్గ విభజన తీవ్రతరమైంది. భూమి పన్ను సారాంశంలో నిర్బంధపూర్వక పన్ను. ఇది ధనిక రైతుల కంటే పేద రైతులపై ఎక్కువ భారాన్ని మోపింది. కుల వ్యవస్థ కారణంగా కులాల ఆధారంగా వర్గ విభజన సంక్లిష్ట రూపాన్ని సంతరించుకుంది. ఇది అంటరాని కులాలలో కొద్దిమందికి మినహా అత్యధికులను భూమిలేనివారినిగా చేసింది. వీరు గ్రామీణ జనాభాలో 1/5 లేక 1/4వ వంతు ఉండేవారు.

17వ, 18వ శతాబ్దాల్లో సరుకు-డబ్బు సంబంధాలు సాపేక్షికంగా బాగా అభివృద్ధి చెందిన

గుజరాత్, రాజస్థాన్, మైసూరు ప్రాంతాల్లో కూడా అత్యధిక రైతాంగం ధాన్యం రూపంలో కానీ, వడ్డీ వ్యాపారుల నుండి అప్పుగా తీసుకొన్న నగదు రూపంలో కానీ పన్నులు చెల్లించే వారని బ్రిటీష్ విశ్లేషణాకారుడు ఫ్రాన్సిస్ బుకనాన్ పేర్కొన్నాడు. మార్కెట్‌తో సంబంధాలు పరిమితంగా ఉండడం వలన రైతాంగం సరుకు ఉత్పత్తిదారులుగా పరివర్తన చెందలేదు. ఉప్పు, ఇనుము తప్ప సరుకును మార్కెట్ నుండి కొనుగోలు చేసేవారు కాదు. గ్రామీణ ప్రాంతాల్లో సరుకు-డబ్బు సంబంధాల వ్యాప్తికి భూస్వామ్య (ఫ్యూడల్) సమాజం ప్రధాన అవరోధంగా ఉండింది.

మన దేశంలో కులాధారిత భూస్వామ్య వ్యవస్థ ప్రాథమికంగా చిన్న ఉత్పత్తిదారుల వ్యవసాయిక వ్యవస్థ; సహజ ఆర్థిక వ్యవస్థ ఆధిపత్యం, అతి తక్కువ లేదా స్తంభించిన సాంకేతిక స్థితి లక్షణాలు గల వ్యవస్థ. ఈ వ్యవస్థలో రెండు ప్రధాన వర్గాలు వివిధ కులాల ప్రధానంగా అగ్రకుల భూస్వాములు, వారికింద ఉండే వివిధ కులాల ప్రధానంగా పీడిత (శూద్ర) కులాల, దళిత రైతాంగం మధ్య సంబంధం అదనపు ఆర్థిక బలవంతపు రకరకాల పద్ధతులను ఆశ్రయించిన దోపిడీ సంబంధం. యూరప్‌లో భూస్వామ్య వ్యవస్థ రైతాంగ శ్రమ దోపిడీపై ఆధారపడి మనుగడ సాగించిందనేది ముందు చూసాం. భారతదేశ నిర్దిష్ట పరిస్థితులలో ఇది భిన్న రూపాన్ని తీసుకుంది. ఇక్కడ భూస్వామ్యపూర్వ వ్యవస్థ అంటే వర్ణాధారిత తొలి వర్గ వ్యవస్థ శూద్రుల శ్రమపై ఆధారపడి మనుగడ సాగించగా, ఆ తర్వాత ఉత్పత్తి శక్తుల అభివృద్ధి, వర్గ పోరాటం ఫలితంగా ఏర్పడిన ఈ కులాధారిత భూస్వామ్య వ్యవస్థ పీడిత (శూద్ర) కులాల ప్రధానంగా దళితుల శ్రమపై ఆధారపడి మనుగడ సాగించింది. ఇక్కడ శూద్ర, దళిత రైతుల భృతికి సరిపోగా మిగిలిన అదనపు ఉత్పత్తిని భూస్వామి శ్రమ రూపంలో, వస్తు కౌలు, నగదు కౌలు రూపాలలో దోపిడీ చేసేవాడు. అంతేకాక రైతులను బలవంతంగా భూమికి కట్టివేయడం, వారిని భూమికి బానిసలుగా చేయడం, కులపీడన ప్రత్యేకించి దళితులపై వివక్ష అదనపు ఆర్థిక, సామాజిక బలప్రయోగ సాధనంగా ఉండేది. ఇదే మన దేశంలో కులాధారిత భూస్వామ్య అణచివేతకు మూలం. భూస్వామ్య వర్గం అసలు ఉత్పత్తిదారుల శ్రమ నుండి అత్యధిక అదనపు ఉత్పత్తిని పిండుకోవడం భూస్వామ్య సమాజపు ప్రాథమిక నియమం. ఇది కాలక్రమంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఆటంకంగా తయారయింది.

**గ్రామీణ భూస్వామ్య వర్గ ఆవిర్భావం-అభివృద్ధి:** బ్రాహ్మణులకు, బౌద్ధులకు భూదానాలు చేయడం ఆరంభం కావడంతో భూస్వామ్యవర్గ ఆవిర్భావానికి బీజాలు పడ్డాయి. పాలకవర్గాలు తమ దోపిడీని నిరాటంకంగా కొనసాగించడానికి బ్రాహ్మణుల సహాయంతో ప్రజలను మత ప్రభావంలో ఉంచేవారు. అందుకే బౌద్ధులకైనా, జైనులకైనా, వైష్ణవులు, పశుపతులు, కాలాముఖులు తరువాతి కాలంలో ముస్లింలు, క్రిస్టియనులు, ఇలా ఏమతానికి చెందిన గురువులకైనా వందల, వేల సంఖ్యలో గ్రామాలను దానం చేశారు. ఈ భూదానాల లక్ష్యం ఆ

గ్రామాలలో భూమిని వ్యవసాయయోగ్యం చేసి సాగులోకి తీసుకురావడమే. ఈ భూమిని శూద్రులతోనూ, ఇతర ఆటవిక తెగల నుండి వచ్చిన పంచములతోనూ సేద్యం చేయించుకునేవారు. దీని వల్ల బంజరు భూములు విస్తృతంగా సాగులోకి రావడం, సంచార తెగలు వ్యవసాయ సమూహాలుగా మార్పు చెందడంతో ఉత్పత్తి శక్తులు వేగంగా అభివృద్ధి చెందాయి. ఫలితంగా ఆటవిక తెగలలో వర్గ విభజన జరిగి ఇందులో అతి కొద్దిమంది పాలకవర్గాలలో భాగం కాగా, అత్యధికులు శూద్రులుగానో, పంచములుగానో మార్పు చెందారు. తొమ్మిదవ శతాబ్దం నుండి పదమూడవ శతాబ్దం మధ్య బ్రాహ్మణ అగ్రహారాలు దక్షిణ భారతదేశంలో విపరీతంగా పెరిగిపోయాయి. రాజుకు రైతాంగానికి మధ్య భూస్వాములుగా, మిలిటరీ అధికారులుగా యితర ఫ్యూడల్ ప్రభువులుగా మారిన బ్రాహ్మణులు బలపడడంతో ప్రభుత్వ యంత్రాంగం గణనీయంగా బలహీనపడింది.

ఈ కాలంలో గ్రామాలతో పాటు ఆ గ్రామాల చుట్టుపట్ల ఉన్న క్రయ విక్రయ కేంద్రాలను కూడా భూగ్రహీతలకు అప్పచెప్పారు. ఈ విధంగా వర్తక వాణిజ్యాల నుండి రాజ్యానికి వచ్చే ఆదాయాన్ని కూడా బ్రాహ్మణ భూగ్రహీతలకు బదిలీ చేశారు. దీని వలన వర్తకులుగానీ, చేతివృత్తుల వారు కానీ స్వతంత్రంగా అభివృద్ధి చెందగల అవకాశాలను కోల్పోయి గ్రామీణ భూస్వామ్యంలో భాగస్వాములైనారు. భూస్వామ్య వర్గంతో మిలాఖతై లాభం పొందిన ఈ వర్తకులు భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా ఎన్నడూ నిలబడవలసిన అవసరం రాలేదు. పైన పేర్కొన్న విధంగా సామంతస్వామ్యం గర్భం నుండే గ్రామీణ భూస్వామ్యం జనించి గ్రామసభ స్వయంప్రతిపత్తి హరించుకుపోయింది.

షేర్‌షా సూరితో ఆరంభమై మొగల్ పాలనలో వ్యవస్థీకృతమైన పరిపాలనా యంత్రం స్వతంత్రమైన సామంతుల పాలనను కొంతమేరకు అంతం చేసి ప్రత్యక్ష కేంద్ర పరిపాలనను స్థాపించింది. అంటే రైతాంగానికి, ప్రభుత్వానికి మధ్య ఉండే అనేక దొంతరల సామంతుల స్థానంలో ప్రభుత్వ అధికారులే పన్నులు వసూలు చేసే పద్ధతిని ప్రవేశపెట్టింది. అయితే ఈ పన్నులు వసూలు చేసే అధికారులు జాగీర్‌దారులుగా, భూస్వామ్య వర్గంగా మార్పు చెందారు. వారికి జీతానికి బదులుగా 'జాగీర్లు' ఇవ్వడం మొగల్ పాలనలో సర్వవ్యాప్తమైన లక్షణంగా మారింది.

**భూస్వామ్య దోపిడీ రూపాలు:** జమీందార్లు, జాగీర్దార్‌లు, పంటలో 1/3వ వంతుగా ఉన్న భూమి శిస్తుతో పాటు ఇతర అనేక రకాల పన్నులను కూడా రైతుల నుండి వసూలు చేసేవారు. తల పన్ను, పెళ్లి పన్ను, పుట్టుక పన్ను, ఇంటి పన్ను వగైరా పన్నులను రైతాంగం చెల్లించవలసి వచ్చేది. ఫ్యూడల్ పాలకుల ఇళ్లలో పిల్లలు పుట్టినా, శుభకార్యం జరిగినా ప్రత్యేక పన్నులు విధించేవారు. యుద్ధాలకు శాంతిభద్రతల సంరక్షణకు, దేవాలయాల కోసం పన్నులు

వసూలు చేసేవారు. దొంతరలుగా ఏర్పడిన బ్రాహ్మణుల అగ్రహారాలలో దేవాలయాల, మఠాల దోపిడీ, సామంతుల దోపిడీ, గ్రామస్థాయిలో ఆవిర్భవించిన భూస్వాముల, వర్తకుల దోపిడీ రైతాంగాన్ని పీల్చిపిప్పిచేసింది. భూస్వాములు రైతులచే, కింది కులాలకు చెందినవారిచే వెట్టిచాకిరీ చేయించుకునేవారు.

చేతివృత్తులవారు, వ్యాపారులు సైతం భూస్వామ్య దోపిడీ అణచివేతల నుండి తప్పించుకోలేకపోయారు. చేతివృత్తులవారు మొదట అగ్రహారాలలోని బ్రాహ్మణులకు, భూస్వాములకు వస్తువులు, సేవలు ఉచితంగా ఇవ్వాల్సి వచ్చేది. ఒక గ్రామానికి చెందిన వృత్తుల వారు మరెక్కడికీ పోకూడదనే ఆంక్షలు ఉండేవి. పట్టణాలలో కూడ క్రీ.శ 11వ, 12వ శతాబ్దాల వరకు ఇదే పరిస్థితి దాదాపు దేశవ్యాప్తంగా కొనసాగింది. భారతీయ వర్తకులపై కూడా పరిమిత ప్రాంతాన్ని దాటి వెళ్లకూడదని ఆంక్షలు విధించేవారు. తమ భూభాగంలో అమ్మే సరుకులపై దేవాలయాలు, మఠాలు, భూస్వాములు పన్నులు విధించేవారు. వర్తకులు రెండు విధాల అణచివేతకు గురయ్యారు. మొదటిది, ప్రముఖ వర్తకుల ఆస్తులకు భారత ఫ్యూడల్ పాలకుల నుంచి రక్షణ లేకుండా పోయింది, వారి సిబ్బంది నిరంతరం దాడులకు గురయ్యేవారు. రెండవది, భారతీయ వర్తకులు తమ సరుకులను రోడ్లు, నదుల ద్వారా రవాణా చేయటానికి వివిధ చోట్ల అనేక రకాల స్థానిక పన్నులు చెల్లించవలసి వచ్చేది. 17వ శతాబ్దం చివరికి పరిస్థితులు మరింత దిగజారాయి. ఉత్పత్తి శక్తుల విచ్ఛిన్నం విస్తృత స్థాయికి చేరుకుంది. ఫ్యూడల్ పాలకులు సాగించే దోపిడీ, పీడన, అణచివేత రైతాంగ అభివృద్ధికి, చేతివృత్తుల అభివృద్ధికి, వ్యాపారానికి పెద్ద ఆటంకంగా పరిణమించింది. 17వ శతాబ్దం 2వ అర్ధభాగం నుండి 18వ శతాబ్దం అంతటా విరామం లేకుండా రాజుల మధ్య యుద్ధాలు సాగిన కారణంగా దేశంలో రాజకీయ, సామాజిక కల్లోలం ఏర్పడింది. ఈ యుద్ధాలు వ్యవసాయాన్ని, వర్తకాన్ని నాశనం చేసి మొత్తం వ్యవస్థలో సంక్షోభాన్ని తీవ్రతరం చేసాయి.

భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా, ముఖ్యంగా వర్ణాశ్రమ ధర్మం పేరుతో బ్రాహ్మణ మఠాలు, దేవాలయాలు సాగించిన క్రూర దోపిడికీ వ్యతిరేకంగా అనేక రైతాంగ తిరుగుబాట్లు జరిగాయి. భూస్వామ్య వ్యతిరేక తిరుగుబాట్లు కొన్ని ప్రాంతాల్లో భక్తి ఉద్యమాలుగా 12-17 శతాబ్దాల మధ్య బద్దలయ్యాయి. 12వ శతాబ్దంలో ఉత్తర కర్నాటక ప్రాంతంలో బసవణ్ణ నాయకత్వంలో జరిగిన వీరశైవ ఉద్యమం ఈ ఉద్యమాలన్నింటిలోకి అభ్యుదయకరమైనది. ఈ చేతివృత్తులవారు వివిధ 'శ్రేణు'లలో సంఘటితపడి ఉండడం వలన ఒక బలమైన శక్తిగా ఉండడంతో ఈ తిరుగుబాట్లకు వర్తకులతో పాటు కలిసి వారు నాయకత్వం వహించారు. ఈ ఫ్యూడల్ వ్యతిరేక ఉద్యమాలు ప్రధానంగా బ్రాహ్మణ అగ్రహారాలకు, కుల వ్యవస్థకూ వ్యతిరేకంగా కేంద్రీకరించబడ్డాయి. ఈ తిరుగుబాట్లు, హిందూ, ముస్లిం మత పురాతనాచారాలకు వ్యతిరేకంగా భావజాల రంగంలో సాగించిన విస్తృత తిరుగుబాట్లు భూస్వామ్య వ్యవస్థను బలహీనపరిచాయి.

నిజానికి వలస పాలన ఆరంభమయ్యే నాటికి భారతదేశంలో భూస్వామ్య విధానం పతనమయ్యే దశకు చేరి భూస్వామ్య జీవనంలోని ప్రతీ రంగం తీవ్ర సంక్షోభంలో పడిపోయింది. అంతులేని యుద్ధాలను సాగించేందుకు, తిరుగుబాట్లను అణచివేసి ప్రజలను చెప్పుచేతల్లో ఉంచుకునేందుకు విశాలమైన సైన్యం కోసం పెరిగే ఖర్చు; విలాసవంతమైన జీవితాన్ని గడిపే రాజుల మితిమీరిన దుబారా ఖర్చు మొదలైనవి రైతుల నుండి అధిక మిగులు పిండేందుకు దారితీసింది. మున్సబ్‌దార్లు, అతడి అనుచరులు రైతుల ఉత్పత్తిలో అత్యధిక భాగం పిండుకునేందుకు ప్రయత్నించేవారు. మున్సబ్‌దారు భూమిని ఇజర్‌దార్ (రెవెన్యూ కాంట్రాక్టర్)కు కాంట్రాక్టుకు ఇచ్చిన సందర్భంలో ఈ దోపిడీ మరింత తీవ్రంగా ఉండేది. ఈ క్రమంలో రైతాంగం సర్వనాశనమైంది. ఈ దుష్ట ఫ్యూడల్ అణచివేత ఉత్పత్తి శక్తులను విచ్ఛిన్నం చేసింది. ఇది ఎల్లెడలా అస్తవ్యస్థ పరిస్థితికి, అనేక మంది రైతులు, చేతివృత్తుల వారు, అంటరాని కులాలవారు పట్టణాలకు పారిపోవడానికి దారితీసింది.

**చిన్న తరహా సరుకుల ఉత్పత్తి, పట్టణాల అభివృద్ధి:** భారతదేశ భూస్వామ్య వ్యవస్థలో బ్రాహ్మణీయ కులాధారిత స్వయంపోషక గ్రామీణ ఆర్థిక వ్యవస్థే ఆధిపత్యంలో ఉండడం వల్ల నేతగాళ్లు, కుమ్మరి, కమ్మరి, దర్జీలు, గౌండ్ల వాళ్లు వగైరా వృత్తులవారు సాధారణ సరుకుల ఉత్పత్తి కొనసాగించేవారు. వారు కులం ఆధారంగా శ్రేణుల్లో సంఘటితమై వుండేవారు. 11వ, 12వ శతాబ్దాల నుండి బట్టలు, నూనె, వక్క, తమలపాకులు వగైరా సరుకులకు పెరుగుతున్న డిమాండ్‌కు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త వృత్తులు, కొత్త కులాలు ఆవిర్భవించడంతో పట్టణాలు వృద్ధి చెందుతూ వచ్చాయి. అయితే అక్కడ భూస్వామ్య వర్గాల జల్సాల కోసం, విదేశీ మార్కెట్ కోసం ఆభరణాలు, పట్టు వస్త్రాలు, జరీ వస్త్రాలు, కళాఖండాలూ, పరిమళ ద్రవ్యాలూ మొదలయినవి అధికంగా తయారయ్యేవి. పట్టణ ప్రజల అవసరాల కోసం కూడా సరుకుల ఉత్పత్తి జరిగేది.

ఈ దేశ ఫ్యూడల్ సహజ ఆర్థిక వ్యవస్థలో తొలుత పట్టణాలు ప్రధానంగా ప్రభుత్వ పరిపాలనా కేంద్రాలుగానూ, యాత్రాస్థలాలుగానూ అభివృద్ధి చెందాయే కాని వాణిజ్య కేంద్రాలుగా కాదు. వాస్తవానికి గుప్తుల పతనం తరువాత చాలా మంది రాజులకు శాశ్వత ప్రాతిపదికపై రాజధానులు కూడా ఉండేవి కావు. అయితే మొగలులు సాపేక్షికంగా స్థిరమైన కేంద్రీకృత రాజ్యాన్ని దాదాపు రెండు శతాబ్దాలకు పైగా పరిపాలించడం పట్టణాలు-నగరాలు బాగా వృద్ధి చెందడం చేతివృత్తులకు, వర్తకానికి మంచి ఊపునిచ్చింది. బ్రిటీషు వలసవాదులు వచ్చేనాటికి దేశ జనాభాలో దాదాపు పది శాతం మంది పట్టణాలలో నివసించేవారు. కొన్ని చోట్ల పట్టణ జనాభాలో అత్యధిక శాతం పరిశ్రమలలో ఉద్యోగులు, కార్మికులుగా పని చేసేవారు.

పట్టణాలు-నగరాలు గ్రామీణ, పట్టణ సరుకుల అమ్మకం-కొనుగోలు కేంద్రాలుగా

మారడంతో, ఈ మార్కెట్ వ్యవస్థ అనివార్యంగా వ్యవసాయము, గ్రామీణ పరిశ్రమలపై తన ప్రభావాన్ని చూపింది. డబ్బు సంబంధాలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. రైతులు పన్నుల చెల్లింపు కోసం మొదట్లో వడ్డీ వ్యాపారులపై ఆధారపడినప్పటికీ క్రమంగా వ్యవసాయ ఉత్పత్తిలో గణనీయమైన భాగాన్ని మార్కెట్‌లో అమ్మటం సరుకుల ఉత్పత్తిలో గణనీయమైన అభివృద్ధిని, డబ్బు చలామణిని సూచిస్తుంది. దూర, దగ్గర ప్రాంతాల నుండి వచ్చిన మార్కెట్ డిమాండ్లను తీర్చడం కోసం రైతులు నీలిమందు, చెరకు, ముడి సిల్కు వంటివి పాక్షికంగా ఉత్పత్తి చేసేవారు. చేతివృత్తులవారు తమ అదనపు ఉత్పత్తిలో కొంతభాగాన్ని మార్కెట్‌లో అమ్మి తమకు అవసరమైన ముడిసరుకును కొనేవారు. కాలక్రమంలో వీరిలో విభజన ఏర్పడి విస్తృతమైన మార్కెట్ కోసం ఉత్పత్తులను అందించే నేతకారులు, కమ్మరుల గ్రామాలు తలెత్తాయి.

ఉత్పత్తిదారులు చిన్నతరహా సరుకుల ఉత్పత్తిని సాగించి రాచరిక కుటుంబాలు, పట్టణవాసులు, సైన్యం, గ్రామీణ సంపన్నులు, ఎగుమతి మార్కెట్ అవసరాలను తీర్చేవారు. ఇందులో కుటుంబ శ్రమ ఎక్కువగా ఉన్నప్పటికీ వేతన కూలీలను కూడా నియమించేవారు. ఈ కాలంలో భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో 'పెట్టుబడి ఇచ్చి సరుకులను తీసుకునే పద్ధతి'(putting-out system)ని అమలు చేసే పెట్టుబడిదారీ గృహ పరిశ్రమ అభివృద్ధి అయ్యింది. ఇది వ్యాపారుల, చేతివృత్తులవారి మధ్య సంబంధాన్ని యజమాని-దాసుడు మధ్య సంబంధంగా కుదించివేసింది. వ్యాపార పెట్టుబడి అదుపులో ఉండే వృత్తిదారుల కంటే తమ ఉత్పత్తులపై యాజమాన్యం కలిగి స్వేచ్ఛగా అమ్ముకోగలిగిన స్వతంత్ర వృత్తిదారులు చాలా తక్కువ మంది ఉండేవారు. వారు స్వంత పరికరాలు కలిగి ఉండి, కుటుంబ శ్రమపై ఆధారపడి పనిచేసినప్పటికీ, నిజానికి వ్యాపారులకు తమ శ్రమశక్తిని అమ్ముకునే వేతన కూలీలుగా మారారు.

దేశంలో కొన్ని చోట్ల వ్యాపార పెట్టుబడిదారుడు ఒకే ఫ్యాక్టరీలో అనేక మంది చేతివృత్తులవారిని స్వేచ్ఛగా వేతనాలకు నియమించుకొని పని చేయించడం సాధారణంగా కనిపించేది. ఇక్కడ శ్రమ విభజన ఉండేది కాదు, అయితే చాలా మంది కార్మికులు ఒకే రకమైన వస్తువును తయారు చేయడంలో నియమితులై ఉండేవారు. వివిధ రంగాలలో చేతివృత్తి యజమానులు 500 మంది కార్మికులను సైతం పనిలో నియమించేవారు. దక్షిణ భారతదేశంలో బట్టలు నేసే వర్క్‌షాపులు, మట్టిగాజులు తయారీ, వస్త్రాల అద్దకం, ఉప్పు, సూరేకారం (సాల్ట్‌పీటర్) ఉత్పత్తి, వడ్రంగి వంటి ఇతర పరిశ్రమల వర్క్‌షాపులు ఉండేవి. పురుషులు మార్కెట్‌లలో పని కోసం నిలబడి వేచి ఉండేవారనీ, శ్రమ మార్కెట్టు ఉనికిలో ఉండేదని ఇది సూచిస్తుంది. నౌకా నిర్మాణం, వజ్రాల తవ్వకం, ఉక్కు-స్టీలు, సిల్కు దారం తయారీ, తివాచీలు నేయడం, చక్కెర, రంగులు వంటి పరిశ్రమలలో కూడా పెట్టుబడిదారీ ఉత్పత్తి అవతరించింది. ఇందులో ఒక పద్ధతి ప్రకారం శ్రమ విభజన అనుసరించబడేది.

ఈ విధంగా భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో సాధారణ సరుకుల ఉత్పత్తి నిస్సందేహంగా

గణనీయంగా అభివృద్ధి చెందింది. అయితే సరుకులు కొనుగోలు చేసి అమ్మేవారు చేతివృత్తులవారి నుండి కాకుండా ఇక్కడి కులాధారిత భూస్వామ్య వ్యవస్థ కారణంగా తరతరాలుగా వ్యాపార కార్యకలాపాలను సాగిస్తున్న వ్యాపార సముదాయం నుంచి వచ్చారు. దీంతో చేతివృత్తి పరిశ్రమలు అభివృద్ధి చెందడంలో అనేక రకాల పరిమితులకు లోనయ్యాయి. చేతివృత్తులవారు ఎంత నిపుణులైనప్పటికీ, సంపన్నులైనప్పటికీ తమ వృత్తికే పరిమితమై ఉండిపోయారు. వ్యాపారుల స్థాయికి ఎదగలేకపోయేవారు. ఇందుకు భిన్నంగా వారు పెట్టుబడి, సరుకుల అమ్మకాల కోసం వ్యాపారులపై అనివార్యంగా ఆధారపడేవారు. ఇది చేతివృత్తుల వర్గం శాశ్వతంగా ఆర్థిక లొంగుబాటు స్థితికి దారితీసింది. సాధారణ లేదా నైపుణ్యంలేని శ్రమ, నైపుణ్యం గల శ్రమ చాలా ఎక్కువగా, చౌకగా అందుబాటులో ఉండడం, చాలా వరకు అసలైన ఉత్పత్తిదారులు (చేతివృత్తులవారు) పేదరికం, అజ్ఞానం కింద నలుగుతూ సాంకేతిక ఆవిష్కరణలు చేసే స్థితిలో లేకపోవడం, నగదు పెట్టుబడి కలిగి వున్నవారు అంటే వ్యాపారులు కుల వ్యవస్థ కారణంగా ఉత్పత్తి క్రమంలో భాగంగా లేకపోవడం, అందుకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, వారు ఉత్పత్తి పద్ధతులను విప్లవీకరించడం కోసం సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు తమ పెట్టుబడిని వినియోగించడం కంటే చేతివృత్తులవారికి అడ్వాన్సుగా రుణాలిచ్చి వారితో వెట్టిచాకిరి చేయించుకోవడమే తమకు అనుకూలమని భావించడం ఈ పరిస్థితి ఏర్పడడానికి మూలకారణం.

దేశంలోని ఆయా ప్రాంతాలలో వర్తకులు లోగడ కొన్ని పట్టణాలకు మాత్రమే పరిమితమై వ్యాపారం చేసేవారు. 16వ, 17వ శతాబ్దాలలో ప్రాంతాలవారీగా వాణిజ్య మార్కెట్‌లను, వాటిని తమ అదుపులో ఉంచుకొన్న వర్తక సంఘాలను ఏర్పరచుకున్నారు. వారిలో ముఖ్యమైన వారు రాజస్థానీ మార్వాడీలు, గుజరాతీ బనియాలు, తమిళ చెట్టియార్లు, కన్నడ బనజిగలు. 18వ శతాబ్దారంభానికి మొగల్ సామ్రాజ్యపు ఆర్థిక వ్యవహారాలన్నీ ఈ వర్తక వడ్డీ వ్యాపార వర్గాల (కులాల) చేతుల్లో కేంద్రీకరించబడ్డాయి. అనేక మంది మార్వాడీలు 17వ, 18వ శతాబ్దాల్లో బెంగాల్, బీహార్, ఒరిస్సా ప్రాంతానికి వెళ్లి అక్కడ ప్రధాన వ్యాపారులుగా స్థిరపడ్డారు. బ్రిటీషు వలసవాదులు ప్లాసీ యుద్ధంలో (1757) భారతదేశాన్ని ఆక్రమించుకోనారంభించే నాటికి వర్తక పెట్టుబడి, వడ్డీవ్యాపార పెట్టుబడి (Usury Capital) గుజరాత్, రాజస్థాన్, బెంగాల్, మైసూరు, తమిళనాడు ప్రాంతాల్లో బాగా అభివృద్ధి అయింది. గుజరాత్‌లో కేంబే, సూరత్, అహ్మదాబాదుల్లో, బెంగాల్‌లో ఢాకా, ముర్షిదాబాద్‌లో, అలాగే ఆగ్రా, లాహోర్, చెన్నపట్నం (మద్రాస్), బెంగళూరు, దావణగిరి, మచిలీపట్నంలలో వర్తకం జోరుగా సాగేది.

అయితే భారతదేశంలో చిన్న పారిశ్రామిక ఉత్పత్తిదారులు గానీ, వర్తక, వడ్డీ వ్యాపారులు గానీ పెట్టుబడిదారులుగా మారే క్రమం నిదానంగా సాగింది. ఈ పరిణామానికి సైతం వలస పాలన అడ్డుకట్ట వేసింది. ఫ్యూడల్ ఉత్పత్తి విధానం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంగా పరిణామం

సాధారణంగా మార్క్స్ సూచించిన రెండు మార్గాలలో ఏదో ఒక క్రమాన్ని అనుసరించాలి. మొదటి మార్గంలో, చిన్న సరకుల ఉత్పత్తిదారుల నుండి పారిశ్రామిక పెట్టుబడిదారులు ఆవిర్భవిస్తారు. చిన్న ఉత్పత్తిదారుల ఆర్థిక వ్యవస్థ లోపల నుండే వారు జన్మిస్తారు. రెండవ మార్గంలో, వర్తకుడు పారిశ్రామిక పెట్టుబడిదారు(ఉత్పత్తిదారు)గా మారతాడు. వర్తక పెట్టుబడిదారులకు చిన్న ఉత్పత్తిదారులు లొంగి ఉంటారు. ఇది అనేక దోపిడీ రూపాలతో, అంటే అదనపు విలువ ఫలాన్ని రాబట్టే, పంపిణీ చేసే రూపాల నిర్దిష్ట సమ్మిశ్రణతో కూడుకొని ఉంటుంది. ఇందులో పెట్టుబడిదారీ–పూర్వ దోపిడీ రూపమైన ఆర్థికేతర నిర్బంధంతో, సాంఘిక, రాజకీయ వత్తిడితో పరమ కౌలును పిండుకోవడం, వర్తక–వడ్డీ దోపిడీ వంటి భూస్వామ్య పద్ధతులు ఉంటాయి. మొదటి మార్గం కంటే రెండవ మార్గం స్వభావరీత్యా మరింత నిదానమైనది, బాధాకరమైనది, నిరంకుశమైనదిగా ఉంటుంది.

**స్వతంత్ర పెట్టుబడిదారీ విధాన దిశలో మైసూరు రాజ్యం :** 1757లో బ్రిటీషు ఆక్రమణానంతరం కూడ మరో 40 ఏళ్లకు పైగా స్వతంత్రంగా అభివృద్ధి చెందిన మైసూరు రాజ్యంలో ఉత్పత్తి సంబంధాలలో వచ్చిన మార్పులు పరిశీలిస్తే భారతదేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమం ఆవిర్భవించి ఉండడానికి ఆస్కారం ఉండేదని అర్థం అవుతుంది. ఈ రాజ్యంలో భూస్వాముల (పాలెగాళ్ల) ఆధిపత్యాన్ని అంతమొందించి బలమైన ఆధునిక కేంద్రీకృత రాజ్యాన్ని నిర్మించారు. పాలనాయంత్రాంగం దాదాపు లక్షమంది పర్మనెంటు ప్రభుత్వోద్యోగులతో, మరో లక్ష మంది పార్ట్ టైం ఉద్యోగులతో ఉండేది. ఇది కాక లక్షన్నర మందితో రెగ్యులర్ సైన్యమూ, మరో లక్షన్నర కందాచారులనబడే మిలిషియా ఉండేది. కులమతాలతో సంబంధం లేకుండా సాగుచేసేవారికి మాత్రమే భూమి ప్రాతిపదికన భూస్వాముల భూమిని, బంజరు భూమిని, పది సంవత్సరాలకు పైగా సాగుచేయకుండా ఉన్న భూములనూ పేద రైతులకు, దళితులకు పంచారు. రాజ్యంలో నీటిపారుదల సౌకర్యాలను పెద్దెత్తున విస్తరింపచేసారు. మొత్తం సాగుభూమిలో ఎనిమిదింట మూడొంతులు అంటే 38 శాతం నీటి పారుదల సౌకర్యాలు కల్పించారు. దీంతో భూమి తలసరి ఉత్పాదకత పెరగడమే కాకుండా వ్యవసాయంలో సాధారణ సరుకుల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. సరుకు–డబ్బు సంబంధాలు విస్తరించాయి. రైతాంగం మార్కెటుపై ఆధారపడేలా చేసాయి. భారతదేశంలో అధిక శాతం గ్రామాల్లో స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ ఉండగా కూడా మైసూరు రాజ్యంలో సంతలు నడవడం సాధారణ సరుకుల ఉత్పత్తి విధానం అభివృద్ధి చెందుతుండిన క్రమాన్ని తెలియజేస్తుంది.

ఫ్యూడల్ ప్రభువులైన పాలెగార్లను అంతం చేసి కేంద్రీకృతమైన ఆధునిక రాజ్యాన్ని ఏర్పరచడంతో వర్తక పెట్టుబడిదారీ అభివృద్ధికి సమస్త అవరోధాలూ తొలగిపోయాయి. అంతేకాక బ్రిటిషు సరుకులను తమ రాజ్యంలోకి రాకుండా నిరోధించారు. ఆ విధంగా స్థానిక బనిజగ వర్తకులకు

పూర్తి ప్రోత్సాహం కల్పించారు. బనిజగ వర్తకులందరూ మైసూర్ రాజ్య పాలకులు హైదర్, టిప్పులను సమర్థిస్తూ బ్రిటిషు వ్యతిరేక పోరాటంలో గట్టిగా నిలబడడానికి ఇదే కారణం. ఇదే సమయంలో గుజరాత్‌లోని బనియాలు, రాజస్థాన్‌లోని మార్వాడీలు, గోవా, కర్నాటక పశ్చిమ తీరంలోని గౌడ సారస్వత బ్రాహ్మణులు ఫ్యూడల్ వర్గాలతోనూ, పోర్చుగీసు, డచ్, బ్రిటిషు వలసవాదులతోనూ మిలాఖతై వారికి దళారులుగా పనిచేయడాన్ని గమనించవచ్చు. మైసూర్ బనిజగ వర్తకులు మొత్తం భారతదేశంలోనూ, కర్నాటకలోనూ బట్టల పరిశ్రమే అన్నిటికంటే వేగంగా పెరుగుతున్న పరిశ్రమ కావడం వలన, అది వ్యవసాయంపై ఆధారపడి ఉండడం వలన వారు అభ్యుదయ పాత్రను వహించారు. పాలెగాళ్లతోనూ, బ్రాహ్మణ వర్గంతోనూ పోరాటంలో చేతివృత్తులవారికి, రైతాంగానికీ అండగా నిలిచారు. జాతీయ బూర్జువాజీకి ప్రతీకగా నిలిచారు.

1791లో మైసూరు రాజ్యంలో 90 పట్టణాలుండేవి. పట్టణ జనాభా 21 శాతమని అంచనా. శ్రీరంగపట్టణం, బెంగళూరు, నగర్, సిరా, బళ్లారీ వంటి పెద్ద పట్టణాలలో ఉత్పత్తిలో అధిక భాగం 'పెట్టుబడి ఇచ్చి సరుకులను తీసుకునే పద్ధతి'(putting-out system)లో జరిగేది. ఈ పద్ధతిలో వర్తకులు చేతివృత్తుల వారికి కొంత డబ్బు అడ్వాన్సుగా యిచ్చి సరకులు ఉత్పత్తి చేయించుకునేవారు. చేతివృత్తులవారు స్వంత పనిముట్లతోనే ఉత్పత్తి చేసినప్పటికీ, వారు వేతన కార్మికులుగా మారే దశగా దీన్ని చెప్పుకోవచ్చు. ఎందుకంటే వర్తకుల రుణాన్ని తీర్చలేక ముడి పదార్థాల కోసం వర్తకులపై ఆధారపడే కార్మికులలో కొందరు క్రమంగా ఒకే వర్క్‌షాప్‌లో ఉత్పత్తి సాగించసాగారు. గాజు వస్తువులు, నూనె, వస్త్రాలు మొదలయిన వాటి ఉత్పత్తిలో ఇది మరింత ఎక్కువగా కనపడుతుంది. అంతేకాక సిల్క్ , కాటన్ వస్త్రాలు, ఇనుము, స్టీల్, చక్కెర తయారీ చాల మేరకు 'పెట్టుబడిదారీ మాన్యుఫాక్చర్' రూపంలో జరిగేవి. ఇనుము తయారుచేసే 'ఫోర్జు'లలో పది నుండి ఇరవై మంది కార్మికులు (తమ పనిముట్లను కూడ కోల్పోయి శ్రమశక్తినే అమ్ముకునే వేతన కార్మికులు) పెట్టుబడిదారుడి కింద పని చేసేవారు. ఈ పరిశ్రమలు శ్రమ విభజనపై ఆధారపడి పెట్టుబడిదారీ తరహాలో ఉత్పత్తిని సాగించేవి. వాటితో పాటు కొన్ని ప్రభుత్వరంగ పరిశ్రమల్లో యంత్రాల సహాయంతో ఆధునిక పెట్టుబడిదారీ ఫ్యాక్టరీ ఉత్పత్తి కూడా జరిగింది.

కొన్ని పరిశ్రమల్లో ఆధునిక యంత్రాలను ప్రవేశపెట్టి సరకుల భారీ ఉత్పత్తి (మాస్ ప్రొడక్షన్) చేపట్టడం ఆనాటి చారిత్రక పరిస్థితుల్లో ఒక విప్లవకర ముందడుగు. 130 మస్కట్ బారల్స్‌కు ఒకేసారి బోర్ వేసే యంత్రం ఒక ఉదాహరణ. బిదనూరులోని ఆయుధాల తయారీ ఫ్యాక్టరీ సంవత్సరానికి ఇరవై వేల తుపాకులు, మస్కెట్లు ఉత్పత్తి చేసేది. శ్రీరంగపట్టణంలో డబల్ బ్యారల్ పిస్టళ్లు తయారయ్యేవి. ఇవికాక గడియారాలు, కట్లరి, భూతద్దాలు, కత్తెరలు, వైజ్ఞానిక పరికరాలూ తయారుచేసే ఫ్యాక్టరీలు, యుద్ధ సామగ్రి, తుపాకులు, మస్కెట్లు, కార్బైన్లు, రాకెట్లు

చేసే ఫ్యాక్టరీలు, ఒక గన్ పౌడర్ ఫ్యాక్టరీ, ఒక పేపరు మిల్లు, గ్లాసు సామాగ్రి తయారుచేసే పరిశ్రమలు ఉండేవి. వీటిలో పనిచేసేందుకు ఫ్రెంచి, జర్మనీ, టర్కీ, అరబ్బులు, చైనీయులు మొదలయిన వందలాది విదేశీ సాంకేతిక నిపుణులను తీసుకువచ్చారు. ఇలా వచ్చిన చేతివృత్తులవారు, తుపాకులు తయారు చేసేవారు, గడియారాలు చేసేవారు, పింగాణీ సామగ్రి చేసేవారు తమతో పాటు ఆధునిక ప్రపంచ సాంకేతిక పరిజ్ఞానాన్ని, దృష్టినీ తీసుకువచ్చారు.

ఈ పరిణామాల ఫలితంగా మైసూరు ప్రాంతంలోని ఫ్యూడల్ వ్యవస్థ విచ్ఛిన్నమయ్యే, వర్తక పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడిగా పరివర్తన చెందే దశ ఆరంభమయ్యింది. వర్తక వర్గాలలో ప్రభుత్వోద్యోగులలో జాతీయ బూర్జువా చైతన్యం పెంపొందింది. అయితే 1799లో మైసూర్ రాజ్యంపై బ్రిటీషు గెలుపు అనంతరం శైశవావస్థలో ఉన్న అక్కడి జాతీయ బూర్జువా గొంతు నులమబడి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన పరిణామ క్రమం దెబ్బతింది.

మొత్తం మీద చూసినప్పుడు భారత భూస్వామ్య ఆర్థిక వ్యవస్థ గర్భంలో బీజప్రాయంగా పెట్టుబడిదారీ లక్షణాలు ఉనికిలోకి వచ్చాయి. ఎక్కువ సంఖ్యలో కార్మికులను నియమించుకునే పలు పెద్ద పరిశ్రమలు అవతరించాయి. కార్మికుల మధ్య శ్రమ విభజన ఉండేది. ఈ పరిశ్రమలలో వ్యాపార పెట్టుబడి అధీనంలో పుట్టింగ్–ఔట్ పద్ధతిలో ఉత్పత్తి చేసే పెట్టుబడిదారీ గృహ పరిశ్రమ ప్రధాన పారిశ్రామిక నిర్మాణరూపంగా కొనసాగింది. ఫలితంగా ఫ్యాక్టరీ పరిశ్రమల వైపుగా పరివర్తన జరగలేదు. తయారీ దశ నుండి పెద్ద తరహా యంత్ర పరిశ్రమ దశకు గెంతు సంభవించలేదు. ఈ రెండు అభివృద్ధి దశల మధ్య ప్రత్యక్ష సంబంధం, కొనసాగింపు లేదు. ఆనాడు దేశంలో ఈ విధమైన పెట్టుబడిదారీ ఉత్పత్తి, పరిజ్ఞానం అభివృద్ధి చెందడం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తుంది.

క్లుప్తంగా చెప్పాలంటే, వలసపూర్వ భారత కులాధారిత ఫ్యూడల్ వ్యవస్థ ఎంత కట్టుదిట్టంగా ఉన్నా, దేశీయ మార్కెట్‌ను విస్తృతం చేయడంలోనూ, చేతివృత్తుల ఉత్పాదకతను పెంచి పారిశ్రామిక పెట్టుబడిదారీ సంస్థలను అభివృద్ధి చేయడంలో బడా వర్తక పెట్టుబడి గణనీయమైన పాత్ర వహించకపోయినా, కుల కట్టుబాట్లు ఎంత పటిష్టంగా ఉన్నా పాత భూస్వామ్య విధానాన్ని బలహీనపరిచే ఈ కింది ప్రధాన అంశాలు ముందుకు వచ్చాయి: గ్రామీణ భారతంలో సహజ ఆర్థిక వ్యవస్థ ఆధిపత్యంలో ఉన్నప్పటికీ వ్యవసాయంలో, పరిశ్రమలలో సాధారణ సరుకుల ఉత్పత్తిని విస్తృతపరిచే ధోరణి ఉంది. భూమిపై వ్యక్తిగత ఆస్తి హక్కు పెంపొందే ధోరణి స్పష్టంగా ముందుకు వచ్చింది. రైతాంగంలో ధృవీకరణ జరిగింది. ఆర్థిక వ్యవస్థలో నగదు పాత్ర పెరిగింది. వ్యవసాయ ఉత్పత్తిలో గణనీయమైన భాగం మార్కెట్ కోసం ఉద్దేశించబడింది. వ్యవసాయంలో వేతన శ్రామికులను నియమించే పద్ధతి ఉనికిలోకి వచ్చింది. పరిశ్రమలలో సాధారణ సరుకుల ఉత్పత్తి ఉన్నత స్థాయికి చేరుకుని కొన్ని ప్రాంతాలలో సరుకులను తయారు చేసే కర్మాగారాలు తలెత్తాయి. పరిస్థితులు అంతగా అనుకూలంగా లేకపోయినా సాంకేతిక ఆవిష్కరణలు,

అనుసరణలు జరిగాయి. అరుదుగానే అయినప్పటికీ ప్రత్యక్ష ఉత్పత్తిదారులు పారిశ్రామిక పెట్టుబడిదారులుగా అవతరించారు. దేశంలో వ్యాపారం, విదేశీ వాణిజ్యం విస్తరించాయి. మొఘల్ కాలం చివరి నాటికి భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా రైతుల, చేతివృత్తులవారి ప్రతిఘటన తిరుగుబాట్లు, భక్తి ఉద్యమం, సిక్కిజం, అనేక జాతీయ భాషల వికాసం, జాతుల వికాసం ప్రారంభం కావడం వంటి రాజకీయ, సాంఘిక, సైద్ధాంతిక ఉద్యమాలు పెల్లుబికాయి; సామాజిక సంబంధాలలో పలు పరిణామాలు జరిగాయి. ఈ విధంగా పాత, క్షీణిస్తున్న ఫ్యూడల్ సమాజ గర్భంలోనే బలహీనంగానే అయినప్పటికీ పెట్టుబడిదారీ శక్తులు మొలకెత్తటం ప్రారంభమైంది. కనుక వలసపూర్వ భారత సమాజం స్థంభనకు గురై నిరర్థకమైనదిగా మారిందనీ, వలస పాలనకు ముందున్న కాలం చీకటి యుగమనీ చెప్పడంలో ఎంతమాత్రమూ వాస్తవం కాదు. మొత్తంగా చూసుకున్నప్పుడు భారతదేశ ఆర్థిక వ్యవస్థ క్రమంగా ఫ్యూడల్ ఉత్పత్తి విధానం నుండి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోకి మార్పు చెందేదనడంలో సందేహం లేదు. ఈ దేశ నిర్దిష్ట పరిస్థితులలో ఇటువంటి మార్పు జరిగివుంటే అది పశ్చిమ యూరప్‌లో కంటే మరింత దీర్ఘకాలం తీసుకొని ఉండేది, మరింత బాధాకరంగానూ ఉండేది.

బ్రిటీషు పూర్వ భారతదేశంలో పట్టణ ప్రాంతాల్లో చేతివృత్తులు ఉన్నత స్థాయికి అభివృద్ధి చెందినా, వర్తకం పెద్దయెత్తున విదేశాలతో సాగినా స్వయంపోషక ఆర్థిక విధానం పెద్దగా దెబ్బతినలేదు. వాస్తవానికి ఆ ఆర్థిక విధానం వర్తక పెట్టుబడిని పారిశ్రామిక పెట్టుబడిగా మార్చడానికి ప్రధాన అడ్డంకిగా ఉండింది. పశ్చిమ యూరప్‌లోలాగా భూమి సరుకుగా మారలేదు, గ్రామీణ ప్రాంతాలకు గణనీయంగా విస్తరించిన సరుకు–డబ్బు సంబంధాలు పెద్ద సామాజిక అంతరాన్ని సృష్టించలేకపోయాయి. హిందూ సనాతన ధర్మం, పటిష్టమైన కులవ్యవస్థ, శ్రమవిభజనను శాశ్వతం గావించి సమాజంలో మార్పును అడ్డుకుంది.

పటిష్టమైన కులవ్యవస్థ (వర్ణాశ్రమ ధర్మం) చేతివృత్తులవారు వర్తకులుగా మారడాన్ని నిరోధించింది. వైశ్యులు మాత్రమే వర్తకం చేయాలనే కుల కట్టుబాటు వలన భారతదేశంలోని వర్తక వర్గం, వడ్డీ వ్యాపారులు దాదాపు అందరూ (కొంతమంది ముస్లింలు, పార్శీలు తప్ప) వైశ్య కులానికి చెందినవారే. ఈ వర్తకులు ఉత్పత్తిలో ఎన్నడూ పాల్గొనలేదు. మొదటి నుండి సరుకుల చలామణి నుండే లాభం పొందారు తప్ప సరుకుల ఉత్పత్తి నుండి కాదు. పెట్టుబడిదారుడిలా, గడించిన డబ్బును సరకుల ఉత్పత్తినో, ఉత్పాదకతనో పెంచేందుకు మదుపుగా పెట్టలేదు. అప్పులిచ్చే బ్యాంకర్లుగానూ, డబ్బు మార్పిడిదార్లుగానూ, ఫ్యూడల్ ప్రభువులకు సేవ చేసే శిస్తు వసూలుదార్లుగానూ, విదేశీ వ్యాపారులకు కమిషన్‌దార్లుగానూ ఉండి డబ్బు గడించారు. నవాబులకు, రాజులకు యుద్ధాలకోసం అప్పులిచ్చారు. ఇలా వర్తక పెట్టుబడి ఫ్యూడల్ వ్యవస్థను కుల వ్యవస్థను సంరక్షిస్తూనే పోగుపడింది. సంపాదించిన డబ్బును తిరిగి పెట్టుబడిగా పెట్టడం కంటే ప్రధానంగా అప్పులుగానే యివ్వడం వలన పునరుత్పత్తి చాలా ప్రాథమిక రూపాలలో

జరిగింది. ఫ్యూడల్ ప్రభువుల కళ్లలో పడకుండానూ, దారి దొంగల బెడదవల్లనూ గడించిన ఆస్తిని పెట్టుబడిగా మార్చడం కంటే బంగారం, ఆభరణాలు, రత్న వైఢూర్యాలుగా దాచుకోవడం జరిగేది. దేవాలయాలు, భవంతులు, బంగారాభరణాలు, శిల్పాలు, కళాఖండాలు వగైరాలకే ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టేవారు. కొన్ని మఠాలు, దేవాలయాలు ఎంతటి ఐశ్వర్యంతో తులతూగేవంటే, విదేశీ రాజులు, నవాబులు ఆ సంపద కోసమే భారతదేశం మీదకు దండయాత్రలు చేసేవారు. గుజరాత్‌లోని సోమనాథ్ దేవాలయంపై మొహమ్మద్ గజనీ 17 సార్లు దాడిచేసి కోట్ల రూపాయల విలువగల బంగారం, వజ్రవైఢూర్యాలు దోచుకుపోయాడు. ప్రతిసారీ దాడి చేసిన కొద్ది కాలానికే తిరిగి ఆ దేవాలయాలు ఐశ్వర్యంతో విరాజిల్లేవి. కోట్లాది రూపాయల ఈ సంపదంతా రైతాంగం నుండి, చేతివృత్తుల వారి నుండి కొల్లగొట్టిన అదనపు ఉత్పత్తే. వారిని కటిక పేదరికంలో ఉంచి ఫ్యూడల్ ప్రభువులు భోగభాగ్యాలలో విలసిల్లేవారు. స్వయంపోషక గ్రామీణ ఆర్థిక విధానం వలన స్తబ్దతకు గురైయిన అంతరంగిక మార్కెట్లు, కులవ్యవస్థల వల్ల కొనసాగిన ఒక రకమైన చలనరాహిత్యం కారణంగా చేతివృతులు, వర్తకం ఒకే అవిభాజ్య సజీవ అంగం కాలేకపోయాయి. ఈ అంశాలు మొత్తం భారతదేశ ఆర్థిక దిశను (బ్రిటీషు కాలంలోనూ, నేటివరకు కూడా) నిర్దేశిస్తూ, పెట్టుబడిదారీ సంబంధాల అభివృద్ధిపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపాయి.

అయితే ముందు చెప్పుకున్న విధంగా ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ఫ్యూడల్ పాలకవర్గాలు వ్యాపార వర్గాలను తమ అదుపులో ఉంచుకుంటూ తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఆర్థిక వ్యవస్థను మలచుకుంటూ వచ్చాయి. అందువల్ల వలసపూర్వ భారతదేశంలో ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా ఎన్ని తిరుగుబాట్లు జరిగినా, దేశంపై ఎన్ని విదేశీ దండయాత్రలు జరిగి రాజ్యాలు మారినా, బలమైన కేంద్రీకృత రాజ్యాలు ఏర్పడినా దేశంలో బలంగా వ్యవస్థీకృతమైన స్వయంపోషక గ్రామీణ వ్యవస్థలో మౌలిక మార్పు చోటు చేసుకోలేదు. ఈ కారణాలన్నింటి వలన భారతదేశంలో ఫ్యూడల్ విధానం రెండున్నర వేల సంవత్సరాలకు పైబడి సాపేక్షికంగా స్థిరంగా వుండి సామాజికాభివృద్ధికి ఆటంకమైంది.

# బ్రిటీషు వలసవాద పాలనలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఉత్పత్తి సంబంధాలు అడ్డంకిగా నిలిచాయి

బ్రిటీషు వలసవాదులు 19వ శతాబ్దం రెండవ అర్ధభాగంలో భారతదేశాన్ని స్వాధీనం చేసుకునే నాటికి మనదేశంలోని కొన్ని ప్రాంతాలలో ఫ్యూడల్ సమాజం లోపలి నుంచి పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడం ఆరంభించింది. ఈ సమయంలో వారు ఇక్కడ తమకు దళారులుగా మారిన ఫ్యూడల్ మహారాజులతో, జమీందార్లతో, వడ్డీ వ్యాపారులు, వర్తకులతో మిలాఖత్ అయి తమ దురాక్రమణను, ఆధిపత్యాన్ని ఎదిరించి నిలిచిన ఝాన్సీ లక్ష్మీబాయి, తాంతియా తోపే వంటి వారిని నిర్మూలించారు. తమ బ్రిటీషు సైన్యంపై, దానికి అనుబంధంగా నిర్మించిన భారత కిరాయి సైన్యంపై ఆధారపడి దేశంలో మారణహోమాన్ని, అత్యంత అమానవీయ అత్యాచారాలను సాగించారు. మధ్యయుగాలను తలపించే ఈ మారణకాండను కప్పిపుచ్చుకునేందుకు 'పాశ్చాత్య సంస్కృతి' ప్రపంచంలో అత్యంత అభివృద్ధి చెందిన సంస్కృతి అంటూ భ్రమలు రేకెత్తిస్తూ భారత ఫ్యూడల్ సామాజిక పునాదిపై ఆధారపడి బ్రిటీషు సామ్రాజ్యవాదానికి దాస్యం చేసే బానిస సంస్కృతిని ప్రవేశపెట్టారు. దాదాపు రెండు శతాబ్దాల పాటు మన దేశాన్ని వలసగా మార్చుకుని తమ పారిశ్రామికోత్పత్తికి ముడిసరకుల వనరుగా, తమ పారిశ్రామిక సరకులకు మార్కెట్‌గా మార్చివేయడం ద్వారా ఇక్కడి పెట్టుబడిదారీ విధాన స్వతంత్ర అభివృద్ధిని ఆటంకపరిచారు. దీనితో భారత ఫ్యూడల్ సమాజం వలస, అర్ధభూస్వామ్య సమాజంగా మారింది. తమ ఆర్థిక, రాజకీయ, సైనిక ప్రయోజనాల కోసం మన దేశంలో బ్రిటీషు సామ్రాజ్యవాదులు ప్రవేశపెట్టిన విధానాల ఫలితంగా వర్గ సంబంధాలలో, బ్రాహ్మణవాద కుల ఆధారిత భూస్వామ్య సంబంధాలలో గణనీయమైన మార్పులు జరిగాయి. పర్యవసానంగా దళారీ బూర్జువా వర్గం, ఆధునిక విద్యావంతుల సెక్షన్, ఆధునిక కార్మికవర్గం, కాంగ్రెస్‌తో పాటు వివిధ బూర్జువా పార్టీలు, కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించాయి. వలసవాదం దేశ ప్రజల్ని తీవ్రంగా దోపిడీ, పీడన, అణచివేత, వివక్షలకు గురిచేయడం దేశవ్యాప్తంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాటాల వెల్లువ చెలరేగింది. ఇది జాతీయ ప్రజాస్వామిక విప్లవోద్యమానికి దారితీసింది. ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో, ప్రత్యేకించి బ్రిటీషు పెట్టుబడిదారీ విధానంలో/వలసవాదంలో కలిగిన ముఖ్యమైన మార్పులను దృష్టిలో పెట్టుకుని ఈ కాలాన్ని మూడు దశలుగా విభజించవచ్చు: వర్తక పెట్టుబడి దశ, పారిశ్రామిక పెట్టుబడి దశ, ద్రవ్య పెట్టుబడి దశ.

**వర్తక పెట్టుబడి దశ**

ఇది 1757 నుంచి 1813 వరకు కొనసాగింది. ఈ దశలో బ్రిటీషు వలసవాదులు అవలంబించిన దోపిడీ పద్ధతులన్నీ ప్రధానంగా అసమాన వర్తకానికీ, ప్రాథమిక పెట్టుబడి

సంచయనానికి సంబంధించినవే. ఇందులో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రధాన పాత్ర వహించింది. అది అవలంబించిన దోపిడీ పద్ధతులలో ప్రధానమైనవి: 1. అసమాన వర్తకం ద్వారా దోపిడీ; 2. బలప్రయోగం ద్వారా చేతివృత్తుల వాళ్ళనూ, వర్తకులనూ పీడించి దోచుకోవడం; 3. భారీ అదనపు శిస్తులను రుద్దడం; 4. ప్రత్యక్షంగా సైన్యంతో దాడులు చేయడం ద్వారా ప్రజలను, దేశ సంపదను లూటీ చేయడం; 5. నీలి మందు ప్లాంటర్ల పీడన. ఈస్ట్ ఇండియా కంపెనీ 1757లో ప్లాసీ యుద్ధంతో బంగాల్, బీహార్, ఒడిశాలను తమ పాలన కిందకు తీసుకొచ్చుకున్న తరువాత ఈ ప్రత్యక్ష లూటీ మొదలైంది.

తొలి రోజుల్లో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రధాన ఉద్దేశ్యం భారతదేశంలో తయారైన సరుకుల వర్తకంపై గుత్తాధిపత్యాన్ని ఏర్పరచుకోవడం ద్వారా లాభాలు సంపాదించడం. ఇందులో భాగంగా అది ప్రధానంగా బలప్రయోగంతో భారతీయ సరుకులను కారుచౌక ధరలకు కొని ప్రపంచ మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్మి విపరీతమైన లాభాలను గడించింది. ఇందుకోసం అది తన ఏజెంట్‌ల (బొంబాయిలో పార్సీలు, గుజరాత్‌లో బనియాలు, రాజస్థానీ మార్వాడీలు 'ముకద్దం'లుగా పనిచేసారు) ద్వారా, తమ గుమాస్తాల ద్వారా చేతివృత్తులవారితో బలవంతంగా తమకవసరమైన సరుకులను ఉత్పత్తి చేయించేది. కంపెనీ రిజిస్టర్‌లో పేరు నమోదు అయిన సాలెవాళ్లు మరెవరికీ పని చేయకూడదనీ, సరుకులను అమ్మకూడదనే నిబంధన ఉండేది. ఆనాటికి ఇంగ్లాండు ఇంకా పారిశ్రామిక దేశంగా అభివృద్ధి చెందలేదు. భారతదేశంలో ఉత్పత్తి అయ్యే మసాలా దినుసులు, సిల్క్ మరియు కాటన్ వస్త్రాలకు యూరప్‌లోనూ, ప్రపంచ వ్యాప్తంగానూ విస్తృత డిమాండ్ ఉండడం వలన వాటిని కొనడానికి వెండి, బంగారాలు వెచ్చించాల్సి వచ్చేది. ఆ కాలంలో భారతదేశానికి ఎప్పుడూ వర్తక శేషమే (Trade Surplus) ఉండేది.

వర్తక పెట్టుబడి దశలో భారత ఆర్థిక వ్యవస్థలో వచ్చిన ముఖ్యమైన మార్పులు: 1. బ్రిటీష్ వలసవాద ప్రయోజనాలను నెరవేర్చే విధంగా బలహీనపడుతున్న ఫ్యూడల్ సంబంధాలను పునరుజ్జీవింపజేయడం; 2. భూమిపై రైతుల సాంప్రదాయ హక్కు రద్దయి, భూమి సరుకుగా మారడం, సరుకు–డబ్బు సంబంధాలు చొచ్చుకురావడం; 3. భారతీయ పరిశ్రమ, వాణిజ్యాలపై వినాశకరమైన ప్రభావం పడడం; 4. స్వయంపోషక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ధ్వంసం కావడం, రైతాంగం, చేతివృత్తులవారు దివాలాతీయడం; 5. భారతదేశంలోని చాలా మంది పాత స్వతంత్ర బడా వ్యాపారులు, బ్యాంకర్లు దివాలాతీయడం, బ్రిటీషు దళారులుగా పనిచేసిన వర్తక, వడ్డీ వ్యాపారులు దళారీ వ్యాపారవర్గంగా పరివర్తన చెంది బలపడడం; 6. దేశీయ మార్కెటు మరింతగా కుంచించుకు పోవడం.

**ఫ్యూడల్ సంబంధాల పునరుజ్జీవం:** ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రధానంగా రైతులు ఉత్పత్తి చేసిన పంటల నుండి, చేతివృత్తులవారి సాధారణ సరుకుల ఉత్పత్తి నుండి అత్యధిక మిగులును హస్తగతం చేసుకోవడం కోసమే ఫ్యూడల్ రాజులను, నవాబులను, ఇతర ఫ్యూడల్ శక్తులను

బలోపేతం చేసింది. తన ప్రత్యక్ష పాలనను అమలు చేయగలిగిన చోట కొత్త జమీందార్లను సృష్టించింది. వలసపూర్వ పాలనలో ఏ అత్యంత అభివృద్ధినిరోధక సామాజిక, మతపరమైన ఆచారాలకు, సంస్థలకు వ్యతిరేకంగా విస్తృత తిరుగుబాట్లు జరిగాయో వాటిని అది పరిరక్షించింది. అక్బర్ కాలం నుండి కొనసాగుతూ వచ్చిన హిందూ ముస్లిం సముదాయాల మధ్య ఐక్యతను పెంపొందించే క్రమాన్ని నిలిపివేసి తిరగదోడింది. సతీసహగమనం వంటి అనేక దురాచారాలను పునరుద్ధరించింది. వలస పాలనలో భారత సమాజంలో అత్యంత హీనమైన అంటరానితనం మరింత పెరిగింది. వలసవాద ప్రయోజనాలను నెరవేర్చేలా ఆధునిక విద్యావంతుల సెక్షన్‌ను సృష్టించే లక్ష్యంతో మెకాలే విద్యా విధానాన్ని ప్రవేశపెట్టింది.

మార్కెట్‌లో అసమ వాణిజ్యంతో పాటు కౌలు వసూళ్లు కూడా కంపెనీకి ప్రధాన లాభాల వనరుగా ఉండేవి. జమీందార్లు రైతుల నుండి వసూలు చేసిన పన్ను నుండి 90 శాతం కంపెనీ వసూలు చేసేది లేదా రైతుల నుండి కంపెనీయే కౌలు వసూలు చేసేది లేదా భయపెట్టి ఫ్యూడల్ ప్రభువులను లొంగదీసుకొని వారి నుండి సుంకాలు వసూలు చేసేది. అది భూమి శిస్తు రూపంలో రైతాంగాన్ని పీల్చిపిప్పిచేసింది. ఒక రకంగా కంపెనీ పెద్ద భూస్వామిలా వ్యవహరించింది. 1770లో సంభవించిన ఘోరమైన బంగాల్ కరువులో మూడవ వంతు జనాభా (కోటి మందికి పైగా రైతులు, చేతివృత్తులవారూ) మృత్యువాత పడినప్పటికీ 1771 సంవత్సరపు వసూళ్లు 1768 నాటి వసూళ్లను మించిపోయాయి. ఈ రాష్ట్రం నుండి వసూలు చేసిన శిస్తులో సగం పైగా ఇంగ్లండుకే తరలిపోయేది. ప్రతి సంవత్సరం ల్యాండ్ రెవెన్యూ పెంచుకుంటూ పోవడంతో రైతాంగం జీవన పరిస్థితులు దయనీయంగా తయారయ్యాయి. అయితే 1793 నాటి పర్మనెంట్ సెటిల్‌మెంట్ ఆఫ్ బంగాల్ చట్టం ద్వారా భూములను అమ్మే, కొనే హక్కు రావడంతో భూమి సరుకుగా మారిపోయింది. వ్యవసాయంలో మార్కెట్ ఆధారిత పంటల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ఈ విధానాలు పెద్దెత్తున రైతుల, ఉత్పత్తి శక్తుల వినాశనానికి దారితీసాయి. ఫ్యూడల్ ప్రభువుల కాలంలో ఉన్న కనీస నీటి వసతులు కూడా కరువైపోవడం, శిస్తుల భారం పెరిగిపోయి రైతులు పొలాలను బీడు పెట్టడం వల్ల బ్రిటీష్‌వారు దేశాన్ని ఆక్రమించుకున్న 20 ఏళ్ళకే బంగాల్‌లో మూడవ వంతు సాగు భూమి బీడుగా మారిపోయింది. భారతదేశ చరిత్రలోనే ఏ ఫ్యూడల్ రాజు పాలనలోనూ కనీవినీ ఎరుగని దోపిడీని ప్రథమంగా బంగాల్ రైతు చవిచూసాడు.

**క్షీణించిన దేశీయ మార్కెట్:** బ్రిటీష్‌వారు భారత ఎగుమతులపై విపరీతమైన పన్నులతో పాటు, అంతరంగిక వాణిజ్యంలో కూడ సుంకాలు, చేతివృత్తులవారిపై పన్నులు విధించారు. ఎగుమతి చేసే సరుకులో ఎటువంటి ధర/చెల్లింపులు లేకుండా లూటీ చేసే భాగం కూడా గణనీయంగా ఉండేది. ఇది సరుకుల ఉత్పత్తిని, చెలామణిని మందగింపచేసింది. పండిన పంటతో సంబంధం లేకుండానే కాంట్రాక్టు ప్రకారం శిస్తు వసూలు చేయడంతో ఫ్యూడల్

ప్రభువుల, జమీందార్ల ఆదాయం కూడ గణనీయంగా తగ్గింది. వారికోసమే ప్రధానంగా ఉత్పత్తి చేస్తూ ఉండిన చేతివృత్తులవారు దివాళాతీసారు. దీంతో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి మార్కెట్ మరింతగా కృంగిపోయింది.

**స్వతంత్ర బడా వ్యాపారుల వినాశనం–దళారీ వ్యాపారుల అభివృద్ధి:** వలస పాలన కింద తూర్పు ఇండియాలో చాలా మంది పాత బడా వ్యాపారులు, బ్యాంకర్లు దివాలాతీసారు. బ్రిటీషు ప్రభుత్వానికి దళారులుగా పనిచేసిన బనియాలు, వడ్డీ వ్యాపారులు, వర్తకులు, జమీందార్లు, దివాన్లు అభివృద్ధి చెందారు. వీరు 18వ శతాబ్దపు రెండవ అర్ధభాగం, 19వ శతాబ్దపు మొదటి అర్ధభాగంలో అపారమైన సంపదను గడించారు. స్వతంత్ర వ్యాపారులు విదేశీ వాణిజ్యం నుండే గాక దేశ అంతర్గత వాణిజ్యం నుండి కూడా తొలగించబడ్డారు. మరోవైపు భారతదేశంలో చేతివృత్తుల వారినుండి వ్యాపారులుగా మారే క్రమం దాదాపుగా లేకపోవడం, వ్యాపారులంతా ఉత్పత్తిలో ఎన్నడూ భాగస్వామ్యం వహించకపోవడం వల్ల వారిలో పెట్టుబడిదారీ లక్షణాల కంటే ఫ్యూడల్ గుణాలే ఎక్కువ ఉండినాయి. అందువల్లే చాలా సునాయాసంగా వారు వలసవాదులకు దళారులుగా మారగలిగారు. పాత ఫ్యూడల్ రాజులకు, మొగల్ చక్రవర్తులకు సేవ చేసిన మార్వాడీ, గుజరాతీ వడ్డీ వ్యాపారులు, పార్సీ వ్యాపారులు దాదాపు అందరూ బ్రిటీషువారికి దళారీ వర్గంగా వ్యవహరించారు. వలసవాదులు భారతీయ దళారీ వ్యాపారుల మద్దతు వల్లనే బెంగాల్‌లో ముస్లిం పాలనను, మైసూర్ రాజ్యాన్ని అంతమొందించగలిగారు. వీరు పన్నుల వసూలుదార్లుగా, బ్రిటీషు ద్రవ్య సంస్థలలో భాగస్వాములుగా కూడా ఉండేవారు. అయితే వారి వర్తక లావాదేవీలన్నీ బ్రిటీషు వర్తక పెట్టుబడి అదుపులో వుండేవి. ఈ దళారీవర్గం భారతదేశ అశేష ప్రజానీకాన్ని పీల్చి పిప్పి చేయడంలో ఈస్ట్ ఇండియా కంపెనీకి మద్దతుగా ఉంటూ అపారమైన సంపదను ఆర్జించింది. అది వలస దోపిడీకీ, అణచివేతకూ ఒక సాధనంగా పెంచిపోషించబడింది. అది వలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలో బలమైన కలుపుమొక్కలా అడ్డులేకుండా పెరిగింది. ఈ విధంగా దేశ అభివృద్ధి ఆర్థిక, సామాజిక, రాజకీయ, సైద్ధాంతిక తదితర రంగాలన్నింటిలో కుంటుబడడమే గాక వక్రీకరించబడింది. వలస పాలన మన దేశంలో స్వతంత్ర పెట్టుబడిదారీ పరిణామాన్ని అడ్డుకునే సామాజిక పునాదిని సృష్టించింది.

బ్రిటీష్ వలసవాదులు భారతదేశం నుండి దోచుకున్న సొమ్ముతోనే ఇంగ్లాండులో 'పారిశ్రామిక విప్లవం' జరిగింది. ఈ మార్పుతో అక్కడి పరిశ్రమలకు చౌకగా ముడిసరుకులు కావలసి వచ్చింది. బ్రిటీష్ పారిశ్రామిక ఉత్పత్తులకు బయట మార్కెట్ల అవసరం కూడా ఏర్పడింది. దీంతో వర్తక పెట్టుబడికి పారిశ్రామిక పెట్టుబడికి జరిగిన ఘర్షణలో సహజంగానే పారిశ్రామిక పెట్టుబడిది పైచేయి అయ్యింది. 1813 కల్లా ఈస్ట్ ఇండియా కంపెనీ గుత్తాధిపత్యం రద్దయ్యింది.

**2. పారిశ్రామిక పెట్టుబడి దశ**

ఈ దశ 1813 నుండి 20వ శతాబ్దపు ఆరంభం వరకు సాగింది. ఈ దశలో భారత ఆర్థిక

వ్యవస్థలో జరిగిన ప్రధాన మార్పులు: 1. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఒక వలసగా పరాధీన స్థాయిలో విడదీయరాని భాగం కావడం అతి ముఖ్యమైన మార్పు; 2. పారిశ్రామిక సరుకులను ఎగుమతి చేసే స్థితి నుండి దిగుమతులు చేసుకొనే స్థితికి దిగజారడం, బ్రిటీషు సరుకులకు మార్కెటుగా మారడం; 3. ఫ్యూడల్ సంబంధాలు అర్ధ–ఫ్యూడల్ సంబంధాలుగా మార్పు చెందడం; 4. భారత దళారీ వర్తకులు, దళారీ బూర్జువావర్గంగా పరిణామం చెందనారంభించడం; 5. ఆధునిక కార్మికవర్గ ఆవిర్భావం; 6. చేతివృత్తులవారు, రైతాంగం మరింత నాశనం కావడంతో దేశీయ మార్కెటులో ప్రతిష్టంభన ఏర్పడడం.

వలస పాలన వేసిన తీవ్ర ప్రభావంతో 19వ శతాబ్దం ఆరంభం వరకు ఎగుమతి చేసే దేశంగా పేరు మోసిన భారతదేశం పారిశ్రామిక సరుకులను దిగుమతి చేసుకునే దేశంగా దిగజారడం ఆర్థిక వ్యవస్థకు కోలుకోలేని దెబ్బ. వలసవాదులు భారతదేశంలో కొత్త పరిశ్రమలు ఏవీ ఏర్పరచకపోవడం వలన జీవనాధారం కోల్పోయిన లక్షలాది చేతివృత్తులవారు పట్టణాల నుంచి పల్లెలకు తరలిపోయారు. 18వ శతాబ్దాంతం వరకు లండన్‌తో పోల్చదగ్గ పట్టణాలైన ఢాకా, ముర్షిదాబాదు, సూరత్ తదితర అనేక పట్టణాలు పల్లెలుగా మారిపోయాయి. పట్టణ జనాభా గ్రామాలకు తరలిపోవడంతో గ్రామీణ జనాభా విపరీతంగా పెరిగిపోయి వ్యవసాయంపై రద్దీ ఎక్కువైంది. భారతదేశం బ్రిటీషు పరిశ్రమలకు అవసరమైన ముడిపదార్థాలు, ఇతర ప్రాథమిక ఉత్పత్తులూ సరఫరా చేసే వ్యవసాయక వలస, అర్ధ–భూస్వామ్య దేశంగా మార్చివేయబడింది.

వలసవాదం అవలంబించిన కొత్త దోపిడీ పద్ధతులు భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఎలా మార్చివేసాయో వివరిస్తూ మార్క్స్ యిలా రాసారు: "భారతదేశంలో చేతిమగ్గాన్ని విరిచి, చరఖాని (స్పిన్నింగ్ వీల్) నాశనం చేసినది బ్రిటీషు దురాక్రమణదారుడే. భారతీయ నూలును యూరోపియన్ మార్కెట్ నుండి తరిమివేయడంతో ప్రారంభించింది ఇంగ్లండ్. ఆ తరువాత హిందోస్తాన్‌ను మెలిక తిప్పింది. చివరికి వస్త్రానికి తల్లి వంటి దేశాన్ని వస్త్రంతో ముంచివేసింది. ... బ్రిటిషు ఆవిరి, విజ్ఞానం హిందోస్తాన్ అంతటా వ్యవసాయానికి, మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమకూ మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేసింది" (మార్క్స్, 'భారత దేశంలో బ్రిటీషు పరిపాలన', 1853, 11వ పేరా). తద్వారా వలస విధానం ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారింది.

భారతదేశంలో వివిధ ప్రాంతాలలో బ్రిటీషువారు ప్రవేశపెట్టిన జమీందారీ, రైత్వారీ, మహల్వారీ పద్ధతులు – వ్యవసాయంలో ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాలను కొత్తపునాదిపై బలోపేతం చేసాయి. బ్రిటీషు ప్రభుత్వం అమలు చేసిన భూమి రెవెన్యూ విధానం ద్వారా రైతులు చెల్లించే కౌలు పెట్టుబడిదారీ భూమి కౌలు కాదు, అత్యంత క్రూరమైన, ఆటవికమైన ఫ్యూడల్ భూమి కౌలు. ఇది అత్యధిక కౌలు వసూళ్లకు, అసమ మార్పిడి ద్వారా లాభాలు సంపాదించేందుకు తోడ్పడింది. దళారీ వ్యాపారం, వడ్డీ వ్యాపారాన్ని ప్రోత్సహించింది. 1793 నాటి పర్మనెంట్ సెటిల్‌మెంట్ ఆఫ్ బంగాల్, దానిననుసరించి వచ్చిన క్రమబద్ధీకరణ చట్టాల ఫలితంగా పాత జమీందార్లు

బలయ్యారు. ఆ స్థానంలో బ్రిటీషువారి సేవలో ఆకస్మిక ధనికులయిన వ్యాపారులు, బనియాలు, దివాన్లు విశాల సంపన్న భూస్వామ్య వర్గంగా మారి కొత్త బనియా జమీందార్లు అవతరించారు. కౌలు కోసం రైతులను పలు విధాలుగా క్రూరంగా హింసించటానికి, కొట్టి చంపటానికి, వారి గుడిసెలను తగులబెట్టటానికి, పూర్తిగా నష్టాలపాలు చేయటానికి వీరికి అపరిమిత అధికారాలు ఉండేవి. ఇందుకోసం ప్రతి భూస్వామి వద్ద కిరాయి బలగాలు ఉండేవి. రైతు భూమిని విడిచిపారిపోయినా తిరిగి పట్టుకొని లాక్కొచ్చి భూమికి కట్టేసేవారు. దీని ద్వారా వెట్టిచాకిరికి తోడు ఒక కొత్త రకమైన ఫ్యూడల్ బానిసత్వం తలెత్తింది. వడ్డీ వ్యాపారులు/భూస్వాములు పెద్ద సంఖ్యలో అప్పు పత్రాలు కలిగి వున్న కారణంగా రైతు పండించిన పంటనంతటినీ స్వాధీనం చేసుకునేవారు. బంగాల్‌లో పేద రైతులను పశువుల్లాగా అమ్మటం, కొనడం జరిగేది. ఈ విధంగా బ్రిటీషు ప్రభుత్వం, భూస్వాములు, వడ్డీ వ్యాపారులు రైతులను మెజారిటీగా బానిసలుగా దిగజార్చి వారి అదనపు శ్రమను మాత్రమే కాక, వారు బతకటానికి అవసర శ్రమలో గణనీయమైన భాగాన్ని దోచుకునేవారు. రైతులు విపరీతమైన రెవెన్యూ శిస్తును డబ్బు రూపంలో చెల్లించవలసి రావటంతో వారు అనివార్యంగా గణనీయమైన సంఖ్యలో వ్యాణిజ్య పంటల వైపు మళ్లవలసి వచ్చింది. ఫలితంగా వారు ఫ్యూడల్ దోపిడీకి మాత్రమే గాక సట్టా వ్యాపార దోపిడీకి కూడా గురయ్యారు. బ్రిటీషువారు, వారి భారతీయ దళారులు పెద్ద మొత్తాలలో గడించిన లాభాలు సాధారణ పెట్టుబడిదారీ వాణిజ్య లాభాలు కాదు, బలప్రయోగం ద్వారా, మోసం ద్వారా రాబట్టుకున్న వలసవాద అర్ధభూస్వామ్య స్వభావం కల సట్టా వ్యాపార లాభాలు.

దళారీ ప్రాతిపదికపై కూడ ఈ కాలంలో పారిశ్రామికాభివృద్ధి జరగకపోవడానికి ముఖ్యంగా మూడు కారణాలు చెప్పుకోవాలి: 1. బ్రిటిషు వలసవాదుల ప్రయోజనాలకు అది హానికరంగా ఉండడం, భారతదేశాన్ని బ్రిటన్‌కు ముడిపదార్థాలు సరఫరా చేసే పరాధీన వ్యవస్థగా ఉంచాలంటే యిక్కడ స్థానిక పరిశ్రమలను దెబ్బతీయడంతో పాటు పారిశ్రామికాభివృద్ధి జరగకుండా చూడడం అవసరం; 2. వలస ఆర్థిక విధానం భారతదేశంలో వర్తక, వడ్డీ పెట్టుబడి బ్రిటీషు బూర్జువాజీతో మిలాఖతై ప్రజానీకాన్ని విపరీతంగా దోచుకోవడం వల్ల ఇక్కడ పారిశ్రామికాభివృద్ధి వికృత రూపం దాల్చడానికి దారితీసింది; 3. ఏ దేశంలో అయినా వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ అభివృద్ధి జరగకుండా పారిశ్రామికాభివృద్ధి గణనీయంగా పెరగడం సాధ్యం కాదు. అయితే ఆహార పదార్థాలను, యితర వ్యవసాయక ముడిపదార్థాలను బ్రిటీష్ వలసవాదులు కారుచౌకగా దోచుకోడానికి భారతదేశంలోని ఫ్యూడల్ శక్తులను సంరక్షించడం వలన, దీనికి భారతదేశపు దళారీ పెట్టుబడిదారులు పూర్తిగా సహకరించడం వలన వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ అభివృద్ధి జరగలేదు. అదే విధంగా దేశంలో బ్రిటీషువారి కబ్జా కిందకురాని 563 "ఇండియన్ స్టేట్స్"ను స్వతంత్రంగా ఉండనివ్వటానికి విధించబడిన షరతులే వాటి శాశ్వత పతనానికి, తీవ్ర అసమర్థతకు కూడా షరతులయ్యాయి. పై కారణాల వలన మార్క్స్ మొదట ఊహించినట్లుగా

రైల్వేల నిర్మాణం, యితర రవాణా సౌకర్యాల పెరుగుదల, ప్లాంటేషన్లు, గనుల అభివృద్ధి వగైరా భారతదేశంలో పెద్దయెత్తున ఉత్పత్తి శక్తులనూ, పెట్టుబడిదారీ వ్యవస్థను అభివృద్ధి చేయలేకపోయాయి.

ఈ దశలో బ్రిటీషువారు తమ పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకులను ఉత్పత్తి చేయడానికి దేశంలో 1833లో టీ, రబ్బరు, కాఫీ ప్లాంటేషన్లు, గనులు ఆరంభించారు. సరుకుల రవాణాకు 1869 నాటికి దేశంలో 4 వేల మైళ్లకు పైగా పొడవు రైలు మార్గాలు నిర్మించారు. ఆ తర్వాత బొంబాయి, కలకత్తా, మద్రాసులను లింకు చేస్తూ రైల్వే లైన్లు నిర్మించారు. రైతాంగంపై తీవ్ర నిర్బంధం ప్రయోగించి, శారీరక హింసలకు గురిచేసి, వాస్తవానికి వారిని బానిసలు గావించుకొని, వారిచే బ్రిటీషు పరిశ్రమలకు అవసరమైన పత్తి, పొగాకు, నీలిమందు, నల్లమందు, జనపనార, చెరకు వగైరాలను పెద్దెత్తున పండించి ఎగుమతి చేయించారు. టీ తోటల కార్మికులు బానిసల్లాగే పనిచేసేవారు. వారిని కొరడాలతో కొట్టడం చాలా మామూలుగా జరిగేది. బ్రిటీషువారు, వారి దళారులు ప్రయోగించే హింసలకు తాళలేక వేలాది మంది కార్మికులు మరణించేవారు. అడవుల్లోకి పారిపోయేవారు. ఈ పంటల ఉత్పత్తులలో రైతుల, కార్మికుల నెత్తుటి మరకలు అంటనది లేదు. ఆహార ధాన్యాలు ముఖ్యంగా బియ్యం, గోధుమల ఎగుమతులు సైతం 22 రెట్లు పెరిగాయి.

బ్రిటీషు పారిశ్రామికావసరాలకు అనుగుణంగా భూమిశిస్తు వసూలు చేసే విధానంలో మార్పు తెచ్చారు. వర్తక, వడ్డీ పెట్టుబడుల పాత్ర పెరిగింది. జలగల్లా పీల్చుకు తినే వడ్డీ వ్యాపారులు, వర్తకులు గ్రామగ్రామాన వెలిసారు. బ్రిటీషు పారిశ్రామిక అవసరాల కోసం ఏర్పడిన ప్లాంటేషన్లలో తప్ప అత్యంత మెజారిటీగా ఉన్న భూమిలో ఫ్యూడల్ పద్ధతుల్లో వ్యవసాయం సాగేది. వ్యవసాయంపై ఆధారపడిన జనాభా విపరీతంగా పెరగడం, బ్రిటీషు ప్రభుత్వం నీటిపారుదలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం, బంజరు భూములను సాగు కిందకు తెచ్చే మాటటుంచి సాగు భూమే బంజరుగా మారడం, రకరకాల ఫ్యూడల్ దోపిడీ మూలంగా ఉన్న భూములను రైతాంగం కోల్పోవడం వల్లనూ, రైతులు సాగుచేసే తలసరి భూమి విస్తీర్ణం రోజురోజుకూ పడిపోతూ వచ్చింది. చిన్న చిన్న కమతాలుండడం, ఫ్యూడల్, పెట్టుబడిదారీ పూర్వ పద్ధతులలో భూమి సాగుచేయబడుతూ ఉండడంతో భూమి ఉత్పాదకత గణనీయంగా పడిపోయింది. వివిధ రకాల దోపిడీలకు గురికాబడ్డ రైతుకు ఒక దశలో భూమిని సాగుచేయడమే బరువైపోయింది.

భారతదేశంలోని రైతాంగం అప్పుల పాలవ్వడం ఈ దశలో కొట్టొచ్చినట్టు కనపడే లక్షణం. 1880 నాటికే దాదాపు రైతుల్లో మూడింట రెండొంతులు అప్పులపాలై ఉన్నారనీ, దీనిలో సగం మంది అత్యంత లోతుగా అప్పుల ఊబిలో కూరుకుపోయారనీ, వారు దాని నుండి బయటపడడం అసాధ్యమనీ ఫామిన్ (కరువు) కమిషన్ రిపోర్టు పేర్కొంది. కరువుకాటకాలు విలయతాండవమాడాయి. 1876 నుండి 1900 మధ్య దాదాపు 2.6 కోట్ల మంది ప్రజలు ఆకలితో మరణించారు.

ఎగుమతి కోసం రైతులు వాణిజ్య పంటలు పండిస్తున్న ప్రాంతాల్లో వారు ఆహారధాన్యాల కోసం అనివార్యంగా వర్తకులపై ఆధారపడడం వల్ల రెండు రకాలుగా నష్టపోయేవారు. ప్రపంచ మార్కెటులో ధరలు పడిపోతే ఈ రైతులు దివాళా తీయాల్సివచ్చేది. మరో ప్రక్క ఆహారధాన్యాల కోసం వర్తకులు అమ్మే రేట్లకే కొనవలసి వచ్చేది. పంటలు సరిగా పండనప్పుడు వారు రైతులకు వడ్డీలకు అప్పులు యిస్తూ పంటను తమ యిష్టమొచ్చిన రేట్లకే కొనేవారు. ఈ విధంగా బనియా, మార్వాడీ వర్తకులు విపరీతమైన లాభాలు గడించారు.

**దళారీ బడా బూర్జువా వర్గం:** భారతదేశంలో పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం స్వతంత్రంగా, ఇక్కడ ఊడలుదిగిన భూస్వామ్య విధానాన్ని దెబ్బతీయడం ద్వారా అభివృద్ధి చెందలేదు. కొన్ని చోట్ల తలెత్తిన స్థానిక పెట్టుబడిదారీ తయారీ విధానం, దాని పరిజ్ఞానం వలస పాలనలో నాశనం చేయబడ్డాయి. పలు దశాబ్దాలు గడిచిపోయిన తర్వాత ఎక్కడో బ్రిటన్‌లో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానం తన అవసరాల కోసం ఇక్కడి భూస్వామ్య విధానంతో మిలాఖత్ కావడం ద్వారా కొన్ని పారిశ్రామిక కేంద్రాలను కృత్రిమంగా ఏర్పరచింది. భారత ఫ్యూడల్ సమాజపు గర్భంలో ఆవిర్భవిస్తున్న పెట్టుబడిదారీ సంబంధాలను నాశనం చేసి కృత్రిమమైన పరాధీన పెట్టుబడిదారీ వ్యవస్థను ఆ వ్యవస్థపై అతికించింది. సంస్థానాల్లోని ఫ్యూడల్ రాజులు (గ్వాలియర్, మైసూరు, బరోడా, ఇండోర్, ట్రావంకోర్ వగైరా), యితర ఫ్యూడల్ శక్తులు రైతాంగపు మూలుగులను పీల్చి వసూలు చేసిన భూమి పన్నులు, బడా భూస్వాములు, మహారాజాలు (దర్భంగా, బర్ధమాన్) పెట్టిన పెట్టుబడులు భారత పరిశ్రమల్లో పెట్టిన పెట్టుబడికి ఒక ప్రధాన వనరు.

సుదీర్ఘకాలం పాటు వలసవాదులకు దళారులుగా పనిచేసిన భారత దళారీ బూర్జువాజీకి తాను ఆర్జించిన అపారమైన సంపదను ఆధునిక పరిశ్రమలలో పెట్టాలనే ఎటువంటి ఆసక్తి లేదు. కాటన్ జిన్నింగ్ మిల్లుల, ప్రెస్సింగు మిల్లుల స్థాపన వెనుకనున్న ఉద్దేశం ముడి పత్తి ఉత్పత్తిని సులభంగా ఎగుమతి చేయడంలో దోహదపడి తద్వారా వాణిజ్యాన్ని పెంపొందించటమే. అయితే 1850ల నుండి మొదటి ప్రపంచ యుద్ధం వరకు భారత దళారీ బూర్జువాజీ ప్రధానంగా రెండు పరిశ్రమల్లో - బట్టల మిల్లులలో, ఇనుము-ఉక్కు కర్మాగారాలలో పెట్టుబడి పెట్టింది. అయితే ఈ దశ అంతటా కూడా వడ్డీ వ్యాపారం, వర్తకమే వీరి ప్రధాన కార్యరంగంగా ఉండింది. వీరు నెలకొల్పిన బట్టల మిల్లులను నిర్మించినదీ, వాటికి అనేక రెట్ల అధిక ధరలకు యంత్రాలను, విడి భాగాలను సరఫరా చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించిందీ, ఆ యంత్రాలను, మిల్లులను నడిపినదీ బ్రిటీషు వలసవాదులే. ఆ మిల్లుల్లో తయారైన సరకుల మార్కెట్‌కు కూడ బ్రిటీషువాడిపై పూర్తిగా ఆధారపడవలసిన పరిస్థితి వుండింది. విదేశీ సిబ్బందికీ, భారతదేశ సిబ్బందికీ వేతనాలలో తీవ్రమైన వ్యత్యాసం ఉండేది. బ్రిటీషువారి దయాదాక్షిణ్యాలపై సంపూర్ణంగా ఆధారపడిన ఈ బట్టల మిల్లుల యజమానులు మరో పక్క లాంక్‌షైర్‌లోని బ్రిటీష్ బట్టల

మిల్లులకు ముడి పత్తిని ఇక్కడ నుండి సరఫరా చేయడం, అక్కడ ఉత్పత్తి అయిన నూలుదారం మరియు బట్టలను భారతదేశ మార్కెట్‌లో అమ్మడం కొనసాగిస్తూ, అంటే బ్రిటీష్ దళారీ వర్తకులుగా పనిచేస్తూ దేశంలో నిజమైన పారిశ్రామికాభివృద్ధికి అడ్డంకిగా తయారయ్యారు. 19వ శతాబ్దపు చివరిలో ఒక వైపు భారతదేశంలో ఉత్పత్తి అయిన నూలుదారాన్ని చైనా మార్కెటులో జపాన్ ఉత్పత్తులు దెబ్బతీస్తూ వుండేవి, మరో వైపు అదే జపాను మిల్లులకు టాటాలు ముడి పత్తిని ఎగుమతి చేసేవారు. దేశ ప్రయోజనాలకంటే సామ్రాజ్యవాదులకు ఊడిగం చేయడం ద్వారా తమ ప్రయోజనాలకు లాభం చేకూరేట్టు చూసుకోవడమే భారత బడా బూర్జువావర్గ ప్రధాన ఆశయం, అదే దాని వర్గ సారాంశం. దేశంలో దళారీ, భూస్వామ్య శక్తులు నిర్వహించిన పాశ్చాత్యీకరణ ఉద్యమం వలస పాలన శృంఖలాలను మరింత బలోపేతం చేసింది.

భారత బడా బూర్జువాజీ ఏర్పాటు చేసుకున్న సంస్థలను, బోర్డులను వాటిపై బ్రిటీషు వలసవాదులకు గల ఆధిపత్యాన్ని పరిశీలిస్తే వారి పరాధీన సంబంధాలు స్పష్టమవుతాయి. మొత్తం మీద ఈ దశలో ఏర్పడిన పరిశ్రమల్లో బ్రిటీషు వారి పెట్టుబడే అత్యధికంగా వుండింది. భారతదేశంలో దళారీలకు బట్టల మిల్లులు ఏర్పాటు చేసుకోడానికి బ్రిటీషువారు అనుమతించడానికి కారణం అవి ఏ విధంగానూ బ్రిటీషు బట్టల మిల్లులతో పోటీకి రావనేది ఒకటి కాగా, బ్రిటీషు యంత్రాలను మార్కెటు చేసుకోవలసిన అవసరం మరొకటి. ఆ మిల్లులలో తయారైన బట్టలు చాలా తక్కువ నాణ్యత కలిగి, ముతక రకంవి కావడం వల్ల బ్రిటన్‌లోని లాంక్‌షైర్ మిల్లులలో ఉత్పత్తి అయినవి నాణ్యత కలిగిన మేలురకానికి చెందిన బట్టలతో పోటీపడజాలవు. ఇక ఫ్యూడల్ ప్రభువుల సహకారంతో భారత బడా బూర్జువాజీ నెలకొల్పిన మరో ముఖ్య పరిశ్రమ ఇనుము, ఉక్కు కర్మాగారం విషయానికొస్తే, అమెరికన్ సాంకేతిక నిపుణులు దీనిని నిర్మించారు, మేనేజర్లుగా వుండి నడిపించారు. దళారీ బూర్జువా వర్గం, ఫ్యూడల్ ప్రభువులు, సామ్రాజ్యవాదుల మధ్య ఉన్న అవినాభావ సంబంధాలు ఈ పరిశ్రమ స్థాపనలో స్పష్టమవుతాయి. బ్రిటీషు సామ్రాజ్యవాదుల యుద్ధ ప్రయోజనాలకే ఈ పరిశ్రమ ఉపయోగపడింది.

అందువల్లనే భారత దళారీ బడా బూర్జువాజీ బ్రిటీషు సామ్రాజ్యవాద దోపిడీ, అణచివేతలను ఎన్నడూ ప్రశ్నించలేదు. వలసపాలనను ఒక వరంగా భావించి, వలసవాద పరిపాలనా యంత్రాంగంలో కొంత మెరుగుదలను మాత్రమే కోరారు. ఆ పాలనా చట్రంలో తమ ప్రయోజనాల కోసం, అధికారాల, ప్రత్యేక హక్కుల సాధనకు మాత్రమే ప్రయత్నించారు.

**3. ద్రవ్య పెట్టుబడి దశ**

20వ శతాబ్దారంభంలో సామ్రాజ్యవాదం ఆవిర్భావంతో ఈ దశ మొదలైంది. ఈ దశలో కూడా రైల్వేలు, గనుల తవ్వకం, ప్లాంటేషన్లు కాక కొన్ని జనపనార, బట్టల మిల్లుల్లో మాత్రమే బ్రిటీష్ పెట్టుబడులు ప్రవేశించాయి. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు (1913) దేశంలోకి

ప్రవహించిన బ్రిటీషు పెట్టుబడి 2,704 కోట్ల పౌండ్లు. ఈ పెట్టుబడి ప్రధాన ఉద్దేశ్యం దేశాన్ని పారిశ్రామికీకరణ చేయడం కాదు, మన దేశంలోని ముడి పదార్థాలను తరలించుకు పోవడం, బ్రిటన్ నుండి పారిశ్రామికోత్పత్తులను మన దేశ మార్కెటులోకి తేవడం.

బ్రిటీష్ సామ్రాజ్యవాదులు భారతదేశంలో 1916లో ఇండస్ట్రియల్ కమిషన్‌ను స్థాపించారు. భారతదేశంలో స్థాపించిన పరిశ్రమలకు కావలసిన యంత్రాలను బ్రిటన్ నుండి దిగుమతి చేశారు. ఉన్నత సాంకేతిక జ్ఞానం అవసరమైన ఉద్యోగాలలో బ్రిటీషువారినే నియమించారు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలోనే ఇవి స్థాపించబడ్డాయి. మేనేజింగ్ ఏజన్సీ సంస్థల ద్వారా ఆ పరిశ్రమలపై ఆధిపత్యాన్ని తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. ద్రవ్య సంస్థలను సైతం వారే కంట్రోలు చేశారు. భారీ పరిశ్రమలేవీ స్థాపించలేదు. భారతదేశంలో కీలక పరిశ్రమల స్థాపనకు బ్రిటీషువారు ఎంత వ్యతిరేకంగా వుండే వారంటే, మొదటి ప్రపంచ యుద్ధకాలంలో కొన్ని ముతక రకం యంత్రాలను, పరికరాలను తయారుచేసే సంస్థలను తప్పనిసరై స్థాపించినా యుద్ధం ముగిసిన వెంటనే నేలమట్టం చేశారు. అలాగే రెండవ ప్రపంచయుద్ధ కాలంలో అత్యవసరంగా స్థాపించాల్సి వచ్చిన కీలకపరిశ్రమలను, బ్రిటీషు సామ్రాజ్యంలోని తెల్లజాతివారు నివసించే కెనాడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో తప్ప భారతదేశంలో స్థాపించలేదు.

ఈ కింది మూడు ఆర్థిక, సైనిక, రాజకీయ కారణాల రీత్యా బ్రిటీషు-ఇండియా ప్రభుత్వం మొదటి ప్రపంచయుద్ధం నుండి తన పారిశ్రామిక విధానాన్ని మార్చుకుంది. ఇది భారతదేశంలో పరిశ్రమల ఏర్పాటుకు దారితీసింది: 1. అమెరికా, జర్మనీ లాంటి ఆర్థికపరంగా శక్తివంతమైన సామ్రాజ్యవాద దేశాల నుండి వస్తున్న పోటీ. 2. బ్రిటీష్ సామ్రాజ్యపు సైనిక భద్రత. 3. భారత బడా బూర్జువా వర్గం అందిస్తూ వుండిన విశ్వసనీయమైన సేవలకు, ప్రజలలో బ్రిటీషు సామ్రాజ్యవాదుల పట్ల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు కొన్ని రాయితీలు యివ్వాల్సిన అవసరం ఏర్పడడం.

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటీషు సామ్రాజ్యవాదం బలహీనపడి, పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద ప్రపంచంలో దాని అగ్రస్థానాన్ని అమెరికా ఆక్రమించింది. అంతేకాక, రష్యాలో అక్టోబర్ విప్లవ విజయం, ప్రపంచంలో మొదటి సోషలిస్టు రాజ్యం తలెత్తి ప్రపంచ పీడిత ప్రజలకు ఒక విముక్తి మార్గాన్ని చూపించింది. సామ్రాజ్యవాద వ్యవస్థకే ప్రమాదంగా పరిణమించింది. తూర్పున ఒక పారిశ్రామిక స్థావరం ఆవశ్యకతను మొదటి ప్రపంచయుద్ధం ఎత్తిచూపింది. మొదటి ప్రపంచ యుద్ధంతో భారతదేశంలో ప్రజలకు భరించరాని కష్టాలు, దుఃఖాలు, దళారీ బడా బూర్జువావర్గానికి లాభాలను సమకూర్చుకోవటానికి మునుపెన్నడూ లేని అవకాశాలను కొనితెచ్చింది. 1918లో ఫ్లూ వ్యాధి ప్రబలి ఒక కోటి 40 లక్షల మందిని బలిగొన్నది. ఈ నేపథ్యంలో బ్రిటీషు సామ్రాజ్యవాదులు భారతదేశంలో తమ సామాజిక పునాదిని బలోపేతం చేసుకునేందుకు భారతదేశ ప్రయోజనాల కంటే సామ్రాజ్యవాద ప్రయోజనాలను

మిన్నగా ఎంచి తమకు సేవ చేసే భారత దళారీ బడా బూర్జువావర్గానికి వారు కొన్ని రాయితీలు కల్పించారు.

ఇందులో భాగంగానే వారు మొత్తం మీద తమకు నష్టం లేని విధంగా, తమకు నమ్మకమైన సేవకులుగా ఉన్న దళారీ బడా బూర్జువాలకు పరిశ్రమలను నెలకొల్పడానికి, ముఖ్యంగా నూలువస్త్రాల తయారీ పరిశ్రమలకు, అవకాశం కలిగించారు. ఫలితంగా భారత దళారీ బడా పెట్టుబడిదారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ 1920 దశకం ప్రారంభంలో బ్రిటీషు వ్యతిరేక పోరాటాన్ని నీరుగార్చి వేసింది. ఈ పరిస్థితి గురించి 1928లో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ డాక్యుమెంటు ఇలా పేర్కొంది: "యుద్ధ కాలంలో విప్లవోద్యమ భయంతో బ్రిటిషు సామ్రాజ్యవాదం స్థానిక బూర్జువా వర్గానికి రాయితీలు ఇచ్చింది. ఆర్థిక రంగంలో, దిగుమతి చేసుకున్న సరుకులపై అధిక సుంకాలలో, అలాగే రాజకీయ రంగంలో 1919లో ప్రవేశపెట్టిన స్వల్ప పార్లమెంటరీ సంస్కరణలలో ఇది కనిపిస్తుంది. అయితే సామ్రాజ్యవాద యుద్ధ వినాశనకర పరిణామాల (1918లో కరువు, అంటువ్యాధు)ల వల్ల, విశాల శ్రామిక ప్రజానీకపు పరిస్థితిలో ఘోరమైన దిగజారుడు వల్ల, రష్యా అక్టోబరు విప్లవ ప్రభావం వల్ల, ఇతర వలస దేశాలలో వరుస తిరుగుబాట్ల (ఉదాహరణకు స్వాతంత్ర్యం కోసం టర్కీ ప్రజల పోరాటం) వల్లా బ్రిటిషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత ప్రజానీకంలో వరుస విప్లవ వెల్లువల రూపంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అయింది. రైతాంగ తిరుగుబాట్ల వెల్లువ పెల్లుబకటం, స్వదేశీ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కార్మికుల సమ్మెలు విజృంభించటంతో బెంబేలెత్తిన భారత పెట్టుబడిదారీ వర్గం జాతీయ విప్లవ లక్ష్యానికి ద్రోహం చేయటంతో 1919-22లలో భారతదేశ మహత్తరమైన ప్రథమ సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం పతనమైంది. భారతీయ పారిశ్రామిక అభివృద్ధిని అడ్డుకునే తన విధానాన్ని అమలు చేయడానికి జాతీయ విప్లవోద్యమం కూలిపోవడం, బూర్జువా జాతీయవాద క్రమ క్షీణతా బ్రిటిషు సామ్రాజ్యవాదానికి మరోసారి అవకాశం కల్పించాయి".

ఈ క్రమంలోనే 1934-35 నాటికి భారతదేశంలో వినియోగించే వస్త్రాలలో నాలుగింట మూడొంతులు దేశంలో తయారవడం మొదలైంది. జపాన్ వస్త్రాల నుండి పోటీని తట్టుకోవడానికి 'విచక్షణాపూర్వక రక్షణ' (Discriminatory protection) అనే పేరుతో భారతదేశ మిల్లు యజమానులతో కలిసి బ్రిటీషు పెట్టుబడిదారులు భారతీయ నూలువస్త్రాల మార్కెటుపై గుత్తాధిపత్యాన్ని నెలకొల్పారు. ఉక్కు పరిశ్రమలో భారత దళారీ బూర్జువా వర్గానికి చెందిన టాటాను సంరక్షించి ప్రోత్సహించడానికి కారణం జర్మని, బెల్జియంకు చెందిన ఉక్కు ఉత్పత్తులను భారత మార్కెట్‌లోకి రాకుండా నిరోధించడానికే. శ్రేష్టమైన ఉక్కు తయారీ బ్రిటీషువారి గుత్తాధిపత్యంలో ఉంచుకొని భారతదేశంలో తక్కువ నాణ్యత కలిగిన ఉక్కునే ఉత్పత్తి చేసే విధంగా 'ఇంపిరియలిస్ట్ ప్రిఫరెన్స్' (సామ్రాజ్యవాద ప్రాథమికత) అనే పేరుతో ఉక్కు పరిశ్రమలో శ్రమవిభజనను ప్రవేశపెట్టారు. భారతదేశంలోని రైల్వేలు బ్రిటీషు ఉక్కునే కొనాలనే నిబంధన

విధించారు.

భారత బడా బూర్జువాల కంపెనీలను, బ్రిటీషు లేదా యితర విదేశీ కంపెనీలను వేరుచేసి చూడటమే కష్టమనిపించేంతగా వారిరువురి పెట్టుబడులు కలిసిపోయి ఉండేవి. అయితే అదుపు మాత్రం విదేశీయుల చేతిలో ఉండేది. 1932లో బొంబాయి వాటాదారుల సంఘం విడుదల చేసిన జాబితా ప్రకారం పిడికెడు మంది ఇండియన్ డైరెక్టర్లు భారతదేశ వ్యాపారంపై ఆధిపత్యం చెలాయిస్తుండినారు. వీరిలో ఎఫ్.ఇ. దిన్‌షాకు 65 పారిశ్రామిక సంస్థల్లోను, సర్ పురుషోత్తం దాస్ ఠాకూర్ దాస్‌కు 42 సంస్థల్లోను, సర్ ఫిరోజ్ సి. సేత్నాకు 34 సంస్థల్లోను, హెచ్.సి. మోడీకి 14 సంస్థల్లోను, సర్ లాలూభాయ్ శ్యామల్‌దాస్‌కు 26 సంస్థల్లోను, ఎన్.బి. సక్లత్‌వాలాకు 29 సంస్థల్లోను వాటాలుండేవి. బ్రిటీషు పెట్టుబడిదారీ విధానంలో కలిగిన ప్రధాన మార్పులకు అనుగుణంగానే 1860ల నుండి 1930 వరకు దేశంలోకి బ్రిటీషు ద్రవ్య పెట్టుబడి పెద్దెత్తున ఎగుమతి అయ్యింది. అప్పుడు బ్రిటీషు, భారత పెట్టుబడుల నిష్పత్తి 40:60గా ఉండింది. ఈ మిలాఖతు భారతదేశంలో పరిశ్రమలు వృద్ధి చెందడానికి దారితీసింది. అంతేకాక భారత దళారీ పెట్టుబడి బ్రిటీషు సామ్రాజ్యం కింద వున్న ఇతర వలసలను కూడా దోపిడీ చేయడానికి పూనుకుంది. 1930 నాటికి తమిళ చెట్టియార్ వడ్డీ వ్యాపారులు శ్రీలంక, మలయా, సింగపూర్, ప్రత్యేకించి బర్మా వంటి అనేక ఆగ్నేయాసియా దేశాలకు తన దళారీ కార్యకలాపాలను విస్తరించింది. క్రమంగా వీరి పెట్టుబడి అక్కడి పరిశ్రమల్లోకి ప్రవేశించింది.

**మేనేజింగ్ ఏజెన్సీ వ్యవస్థ:** భారత దళారీ బడా బూర్జువాజీ సాగించే పారిశ్రామికేతర కార్యకలాపాలకు మేనేజింగ్ ఏజెన్సీ వ్యవస్థ అద్దం పడుతుంది. ఇది పారిశ్రామికాభివృద్ధికి ఆటంకంగా తయారయింది. భారత బడాబూర్జువాజీ ఈ బ్రిటీషు ఏజెన్సీ ద్వారానే బలపడింది. ఇది అనేక స్వతంత్ర పారిశ్రామిక, వర్తక కంపెనీలపై తన ఆధిపత్యాన్ని కలిగివుండేది. ఈ వ్యవస్థ ఉత్పత్తి రంగాన్ని కొద్దిమంది ద్రవ్య పెట్టుబడిదారుల చేతుల్లో ఉంచింది. మేనేజింగ్ ఏజెన్సీల వలన కలగాపులగపు మిశ్రమంగా వుండే పెద్ద ద్రవ్య సంస్థలు ఏర్పడ్డాయి. ఇందువలన నిజమైన పారిశ్రామికాభివృద్ధి కంటే అతి తక్కువ రిస్కుతో అతి ఎక్కువ లాభాలను సంపాదించేటువంటి సంస్థలను మాత్రమే నెలకొల్పడం జరిగింది. ఈ విషయాన్ని ఇండియన్ ఇండస్ట్రియల్ కమిషన్ పేర్కొంటూ అత్యధిక లాభాలు పొందే అవకాశం లేని పరిశ్రమల్లో మేనేజింగ్ ఏజెంట్లు పెట్టుబడి పెట్ట నిరాకరించేవారనీ, అందువల్ల అవసరమైన పరిశ్రమల స్థాపన కూడ జరగలేదని తెలిపింది. ఇవి నిర్మాణంలో ఫ్యూడల్ తరహా సంస్థలుగా ఉండేవి. వర్తక రంగం నుండి పారిశ్రామిక ఉత్పత్తి రంగానికి పెట్టుబడి ప్రవహించడానికి ఇవి అడ్డంకిగా ఉండేవి.

అధికార మార్పిడి సమయానికి పరిశ్రమ రంగంలో ఆధునిక పరిశ్రమ వాటా మరీ తక్కువగా (జాతీయ ఆదాయంలో 6 నుండి 8 శాతం మాత్రమే వుండగా) చిన్న కుటీర పరిశ్రమలు,

గనుల శాతం 12 నుండి 14 శాతం వుండేది. మొత్తం దేశ జనాభాలో పట్టణ జనాభా 1901లో 10 శాతం ఉండగా 1931కి 11 శాతం, 1941కి 12.8 శాతం మాత్రమే పెరిగింది. భారతదేశ పారిశ్రామిక రంగంలో అతి ముఖ్యమైన లక్షణం ఏమంటే యంత్రాల ఉత్పత్తి (కాపిటల్ గూడ్స్ లేదా ప్రొడ్యూసర్ గూడ్స్) అనేది దాదాపుగా లేకపోవడమే. భారతదేశం యంత్రాల కోసం దాదాపు పూర్తిగా విదేశీ దిగుమతులపై ఆధారపడవలసి వచ్చేది. ఈ విధంగా విదేశీ ద్రవ్య పెట్టుబడి కొన్ని వినిమయ సరుకుల పరిశ్రమల్లోనూ (కన్స్యూమర్ ఇండస్ట్రీస్), వర్తకం, ఇన్సూరెన్సు తదితర వాణిజ్య రంగాల్లో మాత్రమే ప్రవహించింది. బ్యాంకింగ్, ఇన్సూరెన్సు రంగాలు పూర్తిగా బ్రిటీష్ వాడి అదుపులో వుండేవి.

రెండవ ప్రపంచయుద్ధ కాలంలో భారత బడా పెట్టుబడికి, బ్రిటీషు పెట్టుబడితోటి, వలస ప్రభుత్వంతోటి మరింత సన్నిహిత సంబంధాలేర్పడ్డాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటీషు సామ్రాజ్యవాదులకు భారత బడా బూర్జువాలు చేసిన సేవలకు ప్రతిఫలంగా బ్రిటీషు ప్రభుత్వము వారి సరుకులను కొనడం, వారికి ఇతరత్రా సహాయం చేయడం చేసింది. వారు తమ స్వభావం రీత్యా యుద్ధాన్ని సామ్రాజ్యవాదాన్ని కూలదోసే అవకాశంగా గాక బ్రిటీషు సామ్రాజ్యవాదులకు అవసరమైతే జపాన్ సామ్రాజ్యవాదులకు సహాయం చేయడం, ప్రజలను మరింత పేదరికంలోకి నెట్టి తమ ప్రయోజనాలను నెరవేర్చుకునే మార్గంగా చూసారు. ఈ యుద్ధం వారికి బంగారం కురిపించింది. ఈ యుద్ధ కాలంలో భారతదేశం సామ్రాజ్యవాదులకు ఒక ముఖ్యమైన స్థావరంగా మారింది. యుద్ధంలో ఈ మిలాఖతు కోట్లాది ప్రజలకు చెప్పనలవికాని కష్టాలు కడగండ్లు కొనితెచ్చింది. లక్షలాది ప్రజల మరణానికి కారణమైంది.

**వ్యవసాయంలో అర్ధ-భూస్వామ్య సంబంధాలు:** ద్రవ్య పెట్టుబడి దశలో వ్యవసాయంలో పెరుగుదల లేకపోవడం వల్ల స్తబ్దతకు గురైంది. 1911-41ల మధ్య తలసరి వ్యవసాయోత్పత్తి సంవత్సరానికి సగటున 0.72 శాతం పడిపోతూ వచ్చింది. ఈ కాలంలో తలసరి ఆహారేతర వ్యవసాయోత్పత్తి 14 శాతం పెరిగినా తలసరి ఆహార ధాన్యాల ఉత్పత్తి 29 శాతం పడిపోయింది. దీనికి కారణాలు ఇవి: 1. పత్తి, పొగాకు, జనుము, చెరకు తదితర వాణిజ్య పంటలు, రబ్బరు, కాఫీ, తేయాకు, నీలిమందు, నల్లమందు వంటి తోటల సాగు పెద్దెత్తున కొనసాగడం, బ్రిటీషు సామ్రాజ్యవాద ప్రాయోజిత మార్కెట్ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడిన అర్ధ-భూస్వామ్య సంబంధాలు అస్తిత్వంలో ఉండడం; 2. జమీందారులు వ్యవసాయంలో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపే బదులు భూమిని కౌలుకిచ్చి సునాయాసంగా, శ్రమ లేకుండా డబ్బు గడించుకోవడం; 3. కౌలుదార్లు, అనేక దొంతర్ల భూస్వాములచే దోపిడీ చేయబడడం వలన వ్యవసాయాన్ని ఆధునిక పద్ధతుల్లో అభివృద్ధి చేసే అవకాశం లేకపోవడం; 4. వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం ఏ మాత్రం సహాయం చేయకపోగా విపరీతమైన భూమి శిస్తులను గుంజుతూండడం; 5. వడ్డీ వ్యాపారులు, వర్తకులు విపరీతమైన వడ్డీలు వసూలు చేయడం; 6. ధనిక రైతాంగం చాలా ప్రాంతాల్లో

(ముఖ్యంగా రైత్వారీ ప్రాంతాల్లో) ఆవిర్భవించినప్పటికీ వారు కూడ తమ ఆదాయంతో భూములను కొని భూస్వాములుగా మారడం లేదా వడ్డీ వ్యాపారం చేయడమే తప్ప వ్యవసాయంలో పెట్టుబడిని పెట్టకపోవడం; 7. కరువు కాటకాల వలన, ఆర్థిక మాంద్యం వలన వ్యవసాయోత్పత్తుల ధరలు విపరీతంగా పడిపోవడం, రైతాంగం కొంతమేరకు కూడబెట్టిన పొదుపు హరించుకుపోయి వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టలేకపోవడం; 8. భూ కమతాలు నిరంతరం విభజనకు గురై చిన్నవి కావడం.

**వలస పాలనలో వర్గాలలో, వర్గ సంబంధాలలో కలిగిన మార్పులు:** 1) భారతదేశంలో బ్రిటీషు వలసవాదం ఫ్యూడలిజాన్ని పరిరక్షించి దీనిని తన సామాజిక ఆధారంగా ఉపయోగించుకుంది. విశాల రైతాంగ ప్రజలపై భూస్వామ్య పట్టును మౌలికంగా మార్చకుండానే బ్రిటీషు సామ్రాజ్యవాద పాలకులు తమ ప్రయోజనాలకు అనుగుణంగా పెట్టుబడిదారీ సంబంధాలను ప్రవేశపెట్టడంతో గ్రామీణ ప్రాంతంలో స్వయంపోషక ఆర్థిక విధానం దెబ్బతినిపోవడం, బడా స్వతంత్ర వ్యాపార వర్గం తుడిచిపెట్టుకొనిపోవడం, ప్రత్యామ్నాయంగా స్వతంత్ర పెట్టుబడిదారీ అభివృద్ధి చెందకపోవడంతో వ్యవసాయం, చేతివృత్తులు శాశ్వత సంక్షోభానికి గురయ్యాయి. ఇది ఉత్పత్తి శక్తులు పెద్దెత్తున నాశనమయ్యాయి. అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు ఏర్పడ్డాయి. దీనినే వికృత అభివృద్ధి అని అంటాము. 2) అనేక మంది పాత జమీందార్లు సైతం దిగజారిపోయారు. నూతన జమీందారీ వర్గం, భూస్వామ్య వర్గం అభివృద్ధి చెందింది. 3) బ్రిటీషు వలసవాదుల అవసరాలకు, పథకాలకు అనుగుణంగా, వారి ఆదరణతో వాణిజ్య పంటలలో, పరిశ్రమలలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన ఫ్యూడల్ మహారాజులు, జమీందార్లు, దివాన్లు, దళారీ వర్తకులు, వడ్డీ వ్యాపార వర్గాల నుండి దళారీ బడా బూర్జువా వర్గం ఆవిర్భవించింది. ఇది తన మనుగడకూ, ఎదుగుదలకూ సంపూర్ణంగా సామ్రాజ్యవాదంపై ఆధారపడిన వర్గం. ఇది వలస దోపిడీ, అణచివేతకు సాధనమైంది, వలసవాదులు దేశ సహజ వనరులను దోచుకెళ్లడంలో ముఖ్య పాత్ర పోషించింది. 4) వలసవాదులు సృష్టించిన వ్యవసాయ సంక్షోభం కారణంగా రైతాంగంలో వర్గ విభజన మరింత తీవ్రతరమైంది. భూమిలేని–పేదరైతుల సంఖ్య పెద్దెత్తున పెరిగింది. మధ్యతరగతి రైతులు, ధనిక రైతులలో ఒక సెక్షన్ మార్కెట్ ఆధారిత సంక్షోభాల ఫలితంగా సంకటస్థితిలో పడ్డారు. 5) ఈ సంక్షోభ ప్రభావం అంటరాని కులాలపై (దళితులపై), ఆదివాసులపై అత్యంత అధికంగా ఉంది. వీరిలో వర్గ విభజన జరిగినప్పటికీ వీరు మెజారిటీగా పీడిత వర్గాలకు ప్రాతినిధ్యం వహించారు. కులవ్యవస్థలో గణనీయమైన మార్పులు జరిగినప్పటికీ కులసమస్య పునాదిలో ఉపరితలంలో బలంగా కొనసాగింది. పితృస్వామ్యం రూపాలు మార్చుకున్నప్పటికీ మహిళలను రెండవ తరగతి పౌరులుగా పరిగణించడం, దోపిడీ, పీడన, వివక్షలకు గురిచేయడం కొనసాగింది. బ్రాహ్మణవాద హిందూ భావజాలానికి ప్రాధాన్యత నిస్తూ హిందూ–ముస్లిం సముదాయాల మధ్య

విద్వేషాలను తిరగదోడడంతో మత మైనారిటీలుగా ముస్లిములు రెండవ తరగతి పౌరులుగా దిగజార్చబడ్డారు. 6) బ్రిటీషు సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం అభివృద్ధి చెందిన వాణిజ్య పంటలు, తోటలలో అర్ధ–కార్మికవర్గం ఆవిర్భవించింది. కొన్ని పరిశ్రమలు, రైలు, ఓడరేవులు, తంతి–తపాలా, గనులు మొదలైన రంగాలు స్థాపించబడడంతో కటిక దారిద్ర్యానికి గురైన రైతాంగం నుండి ఆధునిక కార్మికవర్గం దేశ చారిత్రక రంగంపైకి వచ్చింది. 1919లో దేశంలో భారీ యంత్ర పరిశ్రమలో కార్మికుల సంఖ్య 13,65,000కు పెరిగింది. 1946లో సమ్మెలో పాల్గొన్న దేశ కార్మికుల సంఖ్య 19,61,984 ఉండింది. 7) పట్టణాలు అభివృద్ధి చెందడం, పరిపాలనా సంబంధమైన అవసరాలను తీర్చుకోవడానికి ప్రవేశపెట్టిన బ్రిటీషు మెకాలే విద్యావిధానం ఫలితంగా ఆధునిక విద్యావంతులతో కూడిన పెటీబూర్జువా సెక్షన్ ఆవిర్భవించింది. ఇది ఒకే మొత్తంగా లేకుండా తీవ్ర వర్గ ధృవీకరణకు గురైంది.

రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటీషు సామ్రాజ్యవాదం బలహీనపడడం, దానికి అమెరికా సామ్రాజ్యవాదానికి వైరుధ్యం పెరగడంతో, భారత బడా బూర్జువా వర్గంలోని ఒక సెక్షన్‌కి అమెరికా సామ్రాజ్యవాదంతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. అమెరికా, బ్రిటన్ సామ్రాజ్యవాదాల మధ్య ఈ వైరుధ్యాలను ఉపయోగించుకొని మరి కొన్ని రాయితీలు పొందడానికి భారత దళారీ బూర్జువా వర్గం ప్రయత్నించింది. ఇందులో భాగమే 1944లో రూపొందించిన బొంబాయి ప్లానుగా పిలవబడే 'ఎ బ్రీఫ్ మెమొరాడం ఔట్‌లైనింగ్ ఎ ప్లాన్ ఆఫ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ ఫర్ ఇండియా'. ఈ ప్లాన్ టాటా, బిర్లా తదితర బడా బూర్జువావర్గ ప్రతినిధులు రూపొందించినదే అయినప్పటికీ భారతదేశాన్ని ప్రధానంగా తమ పెట్టుబడుల ఎగుమతులకు వినియోగించుకోవాలన్న బ్రిటన్, అమెరికా సామ్రాజ్యవాదుల వ్యూహానికి అనుగుణంగానే అది రూపొందించబడింది. అందుకు అనుగుణంగానే స్వాతంత్ర్యానంతరం విదేశీ పెట్టుబడిని జాతీయం చేయడమనే అంశం లేకపోగా అది మరింతగా విదేశీ పెట్టుబడిని ఆహ్వానించింది. పెట్టుబడి, యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం కోసం మిలాఖత్ సంస్థలు, విదేశీ సంస్థలను అనుమతించడం ద్వారా నయావలస పద్ధతులలో దోపిడీకి మార్గాన్ని సుగమం చేసింది.

బొంబాయి ప్లాను భూస్వామ్య విధానాన్ని, ఫ్యూడల్ సంస్థానాలను నిర్మూలించడం, భూమి పునఃపంపిణీ చేయడం గురించి ఎటువంటి ప్రతిపాదనా చేయలేదు. దేశంలో వ్యవసాయ సమస్యకు పరిష్కారంగా 'కమతాల ఏకీకరణ', 'బలవంతపు సహకార వ్యవసాయాలను' సూచించింది. భూస్వామ్య విధానాన్ని నిర్మూలించకుండా, భూకమతాల పరిమాణంలో తీవ్రమైన వ్యత్యాసం, తీవ్రమైన రైతుల రుణభారం కొనసాగే స్థితిలో సహకార వ్యవసాయాన్ని బలవంతంగా అమలు చేయడం అంటే రైతాంగాన్ని భూస్వాముల, వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలిపెట్టడం తప్ప మరొకటి కాదు. 'ప్రత్యక్ష సాగు పట్ల ఆసక్తి లేని జమీందార్ల భూమిని నష్టపరిహారం చెల్లించి స్వాధీనం చేసుకోవడం' కూడా అలంకరణ కోసం తెచ్చిన సంస్కరణే అని

ఆ తర్వాత రుజువైంది. అలాగే సాంప్రదాయ వడ్డీ వ్యాపారుల ఆధ్వర్యంలో 'సహకార సంఘాల ద్వారా రైతు రుణభారాన్ని తొలగించాలని' ప్రతిపాదించడమంటే గ్రామీణ సహకార సంఘాలను వడ్డీ వ్యాపారులు, భూస్వాములు, వర్తకుల చేతికి అప్పగించడమే తప్ప మరేమీ కాదు.

ఈ విధంగా బొంబాయి ప్లాన్‌లో భాగంగా భారత దళారీ బూర్జువాజీ బ్రిటీషు, అమెరికన్ పెట్టుబడులతో "నూతన తరహా సంబంధాలను" ఏర్పరచుకొంది. సామ్రాజ్యవాద గుత్తసంస్థలతో కలిసి ఉమ్మడి పరిశ్రమల స్థాపన (జాయింట్ వెంచర్స్)కు సిద్ధమయ్యింది. ఈ ఒప్పందాలలో కీలకమైన భారీ పరిశ్రమలేవీ భారతదేశంలో నెలకొల్పే ప్రతిపాదనే లేదు. సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడిదారులు భారత దళారీ బూర్జువాలతో ముందుగా యిలాంటి ఒప్పందాలను చేసుకున్న తరువాతే 1947లో అధికార బదలాయింపు జరిగింది.

బ్రిటీషు వలస పాలన తొలినాళ్ల నుండీ భారతదేశ చరిత్రంతా బ్రిటీషు సామ్రాజ్యవాదులకూ, అలాగే భూస్వామ్య దోపిడీ, అణచివేతలకూ వ్యతిరేకంగా భారత ప్రజలు సాగించిన ఎడతెగని పోరాటాల, మహత్తర విప్లవ రైతాంగ పోరాటాల, ఆదివాసీ పోరాటాల, కార్మికవర్గ పోరాటాల చరిత్రే. 1854-56 నాటి సంథాల్ ఆదివాసీ తిరుగుబాటు నుండి చెలరేగిన పలు రైతాంగ పోరాటాలూ, తిరుగుబాట్లూ చివరికి 1857 నాటి మహత్తర మొదటి స్వాతంత్ర్య సంగ్రామానికి దారితీసాయి. ఇది దేశవ్యాప్తంగా దావానలంగా వ్యాపించి బ్రిటీషు పరాయి పాలన పునాదుల్నే కుదిపేసింది. అయితే భూస్వామ్య నాయకత్వ విద్రోహం వల్ల అది చివరికి విఫలమైంది. అయితే బ్రిటీషు వలసవాదులకూ, వారి భూస్వామ్య తాబేదార్లకూ వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో సాయుధ రైతాంగ, ఆదివాసీ తిరుగుబాట్లు చెలరేగాయి. ఆనాటికి కార్మికవర్గం బలంగా లేకపోవడమూ, విప్లవ పార్టీ లేకపోవడమూ వల్ల ఇవి కూడా విఫలమయ్యాయి. పెరుగుతున్న బ్రిటీషు వ్యతిరేక జాతీయ విముక్తి ఉద్యమాన్ని పక్కదారి పట్టించడానికి బ్రిటీషు వలసవాదులు కాంగ్రెస్ పార్టీనీ, దానికి గాంధీ నాయకత్వాన్నీ ముందుకు తెచ్చారు. అయినప్పటికీ సామ్రాజ్యవాద సంక్షోభం, ప్రపంచయుద్ధ ఫలితంగా శ్రామిక ప్రజల జీవన పరిస్థితులు రోజు రోజుకూ దుర్భరం కావడంతో రైతాంగం, కార్మికులు, ఇతర శ్రామిక ప్రజానీకం పెద్దెత్తున తిరగబడ్డారు. పెటీబూర్జువాలలోని విప్లవకర సెక్షన్ కూడా అడపాదడపా వారి వీరోచిత పోరాటాలలో, ప్రత్యేకించి భగత్‌సింగ్, ఆయన విప్లవ బృందం నేతృత్వం వహించిన పోరాటాలలో ఆయుధాలను చేబూనారు. ఈ మహత్తర స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీషు వారి కనుసన్నలలో వారికి విశ్వాసపాత్రమైన దళారీ బడా బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహించే గాంధీవాద నాయకత్వం కలుగజేసుకొని అహింస, క్రియాశూన్య ప్రతిఘటన, సత్యాగ్రహం సిద్ధాంతాలతో దానిని పోరాట మార్గం నుండి, విప్లవ మార్గం నుండి పక్కకు తప్పించి లొంగుబాటు, బేరసారాల మార్గాన్ని పట్టించింది. దీనికి బదులుగా వలస పాలకులు దానికి కొన్ని ఆర్థిక, రాజకీయ రాయితీలు కల్పించారు.

1917 అక్టోబర్ విప్లవ ప్రేరణతో 1925లో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ అసంఖ్యాకమైన అవకాశాలు వచ్చినప్పటికీ జాతీయ విముక్తి ఉద్యమంలో గాంధీవాద నాయకత్వపు అసలు స్వభావాన్ని గుర్తించ నిరాకరిస్తూ, దానికీ తనకూ మధ్య ఒక స్పష్టమైన విభజన రేఖ గీసుకుని గాంధీవాద నాయకత్వంతో పోరాడడంలోనూ, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని భారత విప్లవ నిర్దిష్ట ఆచరణతో జోడించి బ్రిటీషు వ్యతిరేక జాతీయ విముక్తి యుద్ధంలో సరైన విప్లవ పంథా–దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను చేపట్టడంలోనూ విఫలమైంది, గాంధీవాద నాయకత్వం తోకపట్టుకుని నడిచింది. అది వీరోచిత భారత ప్రజానీకంతో, ముఖ్యంగా రైతాంగంతో మమేకమవ్వడంలో విఫలమైంది. చైనా నుండి నేర్చుకోవడానికి నిరాకరించింది.

2వ ప్రపంచ యుద్ధంలో మహా నాయకుడు స్టాలిన్ నాయకత్వంలో సోవియట్ యూనియన్ ఎర్రసైన్యం, ప్రపంచ ప్రజలూ ఫాసిస్టు శక్తుల్ని చిత్తుగా ఓడించడం; యుద్ధానంతరం సామ్రాజ్యవాదం గణనీయంగా బలహీనపడడం; తూర్పు యూరప్ దేశాల్లో ప్రజల ప్రజాస్వామిక రాజ్యాల స్థాపన; కామ్రేడ్ మావో నాయకత్వాన చైనా విప్లవ ఘన విజయపు అంచుల్లోకి చేరుకోవడం; ప్రపంచంలో 3వ వంతు భాగంలో ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భావం; ప్రపంచవ్యాప్తంగా వలసల్లో స్వతంత్ర/జాతీయ విముక్తి ఉద్యమాలు పెంపొందుతుండడంతో సామ్రాజ్యవాదులకు గడ్డు స్థితి ఎదురైంది. దీంతో వారు తమ పాత ప్రత్యక్ష వలసపాలన, దోపిడీ రూపాన్ని మార్చుకొని తాము ఎంపిక చేసి, శిక్షణనిచ్చిన ఏజెంట్లపై ఆధారపడి నూతన శైలిలో పరోక్ష పాలన, దోపిడీ, అజమాయిషీలతో కూడిన నూతన రూపాన్ని–నయావలసవాద రూపాన్ని చేపట్టారు.

భారత ఉపఖండంలో సైతం ఈ కాలంలో అపూర్వమైన విప్లవ పరిస్థితి ఆవిర్భవించింది. దేశవ్యాప్తంగా 'ఆజాద్ హింద్ ఫౌజ్' ఖైదీల్ని విడుదల చేయాలంటూ శక్తివంతమైన ఉద్యమం; విద్యార్థుల శక్తివంతమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రదర్శనలు; రాజుల సంస్థానాలలో శక్తివంతమైన భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాలతో పాటు తెభాగా, బాకాస్త్ ఉద్యమాలు, పోస్టల్–టెలిగ్రాఫ్ ఉద్యోగుల సమ్మె; బొంబాయిలో రాయల్ ఇండియన్ నేవీలో మహత్తర తిరుగుబాటుతో పాటు సైన్యంలో, వాయుసేనలో తిరుగుబాటు ధోరణులు; బిహార్‌లో పోలీసుల తిరుగుబాటు; కార్మికవర్గ సంఘీభావ పోరాటాలు, తెలంగాణలో చారిత్రక రైతాంగ సాయుధ పోరాట ప్రారంభం – ఇవన్నీ భారతదేశంలో సామ్రాజ్యవాద పాలనను దాదాపుగా కుప్పకూలిపోయే స్థితికి తీసుకుపోయాయి. ఇలాంటి స్థితిలో భారత దళారీ బడా బూర్జువా వర్గం భారత ప్రజాస్వామిక విప్లవానికి ద్రోహం చేసింది. బ్రిటీషు సామ్రాజ్యవాదులు తమకు విశ్వాసపాత్రులైన దళారీ ఏజెంట్లయిన కాంగ్రెస్, ముస్లిం లీగు నాయకులపై ఆధారపడి కుట్రలూ, కుహకాలు సాగించి మతపరమైన మారణకాండకూ, ఊచకోతకూ పురికొల్పి మత ప్రాతిపదికన దేశాన్ని విభజించారు. కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అప్పగించి తెర వెనక్కి వెళ్లారు. అంటే

1947 నాటి 'స్వాతంత్ర్యం' అంతస్సారంలో ఉత్త బూటకం తప్ప మరేం కాదు. వాస్తవానికి అది సామ్రాజ్యవాద పరోక్ష పాలన, దోపిడీ, అజమాయిషీల కింద ఉండే అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ అయ్యింది.

## అర్ధ వలస, అర్ధ భూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు

## (1947-1990)

రెండవ ప్రపంచ యుద్ధానంతరం, అంతర్జాతీయంగా అమెరికా సామ్రాజ్యవాదం ఏకైక అగ్రరాజ్యంగా బలమైన శక్తిగా ముందుకు వచ్చింది. యుద్ధంలో గెలిచిన బ్రిటన్, ఫ్రాన్స్ ఓడిపోయిన జర్మనీ, జపాన్, ఇటలీలు ఆర్థికంగా బాగా బలహీనపడ్డాయి. దానికి తోడు శక్తివంతమైన సోషలిస్టు క్యాంపు ఆవిర్భావం వలన వివిధ దేశాలలో పెల్లుబికిన జాతీయ విముక్తి పోరాటాలు సామ్రాజ్యవాదాన్ని ప్రపంచ స్థాయిలో మరింతగా బలహీనపరచాయి. వర్గ శక్తుల బలాబలాలలో మార్పు తీసుకువచ్చాయి. ప్రత్యక్ష పరిపాలన కింద వలసలను ఏర్పాటు చేసుకునే సత్తా సామ్రాజవాదం దాదాపుగా కోల్పోయింది. ఈ అననుకూల పరిస్థితులను సామ్రాజ్యవాదులు తమకనుకూలంగా మార్చుకోవడంలో భాగంగానే పరోక్ష/నయా వలస తరహా దోపిడీ విధానాన్ని అమలు చేయనారంభించారు. సామ్రాజ్యవాద పెట్టుబడి మునుపటి వలస/వెనకబడిన దేశాలలో ఒక పక్క భూస్వామ్య శక్తులతోను మరో పక్క దళారీ పారిశ్రామిక వేత్తలతోనూ మైత్రినెరపింది. అది భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయోజనాలకు లోబరిచే/మలిచే లక్ష్యం కలిగి ఉన్నది. అందుచేత బ్రిటిష్ సామ్రాజ్యవాదులు 1947లో తమ విశ్వాసపాత్రమైన ఏజెంట్లూ దళారీ పెట్టుబడిదారీ, బడా భూస్వామ్య వర్గాల ప్రతినిధులైన కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి అధికారాన్ని అప్పగించి తెరవెనక్కు తప్పుకున్నారు. అందువల్లనే అధికార మార్పిడి తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని దళారీ పాలకవర్గాలు దేశంలోని అర్ధ భూస్వామ్య సంబంధాలను, స్వరూపాలను విచ్ఛిన్నం చేయలేదు. దీని ఫలితంగా భారతదేశ వలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ అనేక సామ్రాజ్యవాద శక్తుల ఆధిపత్యంలో అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థగా మార్పు చెందింది.

తమ వలస దేశాలలో పెరుగుతున్న ప్రజా పోరాటాల వెల్లువను తట్టుకోలేకా బ్రిటన్, ఫ్రాన్సులు తమ వలసలలోని దోపిడీ పాలకవర్గాలకు అధికారిక మార్పిడి చేసి ఆ దేశాలలో వారి పెట్టుబడులకు నష్టం వాటిల్లకుండా, నిరాటంకంగా దోపిడీని కొనసాగించడానికి వీలుగా ఒప్పందాలు చేసుకున్నాయి. అత్యంత శక్తివంతంగా వున్న అమెరికా సామ్రాజ్యవాదానికి వలసలు దాదాపుగా లేకపోవడం వలన అది పరోక్ష/నయా వలస విధానాల ద్వారా ఇతర దేశాల వలసలను తన ఆధిపత్యంలోకి తెచ్చుకోనారంభించింది. ఈ లక్ష్యం సాధించడం కోసం వలస విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ప్రజాస్వామ్యం కోసం నిలబడతాననీ ప్రకటించింది. స్వేచ్ఛా వ్యాపారం,

స్వేచ్ఛాయుత పోటీ, స్వేచ్ఛా మార్కెట్టు అనే పేర్లతో అనేక వలస దేశాల మార్కెట్లలోకి రెండవ ప్రపంచ యుద్ధం ముందు నుండే ప్రవేశించి అక్కడి ఆర్థిక వ్యవస్థలపై తన పట్టును పెంచుకోనారంభించింది. యుద్ధానంతరం వలస పాలన అంతమవడంతో అనేక పాత వలస దేశాలలో అమెరికా పెట్టుబడులు ఆధిక్యతలోకి వచ్చాయి.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసి సోషలిస్టు క్యాంపు ఆవిర్భవించడం భారతదేశం వంటి మునుపటి వలసల ఆర్థిక అభివృద్ధిపై గణనీయమైన ప్రభావం వేసింది. ఈ దేశాలు తమ ఆర్థిక వ్యవస్థల అభివృద్ధి కోసం కొంతవరకు సోషలిస్టు దేశాల సహాయం తీసుకోగలిగాయి. ఈ దేశాలలో పాలక వర్గాలు కొంతమేరకు నిలదొక్కుకోగలిగాయి. సామ్రాజ్యవాదంతో మరింతగా బేరసారాలాడగలిగాయి. అయితే యిది కొద్దికాలమే ఉన్నది. సోషలిస్టు క్యాంపు విచ్ఛిన్నం కావడం, సోవియట్ యూనియన్ సోషల్ సామ్రాజ్యవాద దేశంగా దిగజారిపోవడంతో ఈ దేశాలు మరింతగా సామ్రాజ్యవాద ఉచ్చులోకి వెళ్లిపోయాయి. అయితే సామ్రాజ్యవాదానికి లోబడి ఉంటూనే 1960ల చివరకి ముందుకువచ్చి, 1980ల మధ్య వరకు కొనసాగిన ద్విధృవ ప్రపంచంలో ఈ దేశాలు వీటిలో ఏదో ఒకదానికి ప్రధానంగా విధేయంగా ఉండగలిగాయి.

1947–1990 మధ్య కాలంలో మన దేశ ఆర్థిక, రాజకీయ నియంత్రణ ప్రధానంగా మొదట బ్రిటన్, అమెరికాల చేతిలోకి, తర్వాత సోవియట్ సామ్రాజ్యవాదుల చేతిలోకి, తిరిగి మళ్లీ అమెరికా చేతిలోకి మారడం మనకు కనపడుతుంది. ఈ కాలమంతటా బ్రిటీష్ సామ్రాజ్యవాదం బలహీనపడిన ద్వితీయ స్థాయి సామ్రాజ్యవాద శక్తిగా ఉండి మన దేశంపై తమ ప్రభావాన్ని (ఆర్థికంగా, రాజకీయంగా) నెరపుతూనే ఉంది. ఇతర సామ్రాజ్యవాద శక్తులు కూడా అంతర్జాతీయంగా తమ సాపేక్షిక బలాలపై ఆధారపడి మన దేశంపై ప్రభావాన్ని నెరిపాయి. అందువల్ల మన దేశంపై ఆర్థికంగా, రాజకీయంగా వివిధ స్థాయిల్లో కొనసాగిన వివిధ సామ్రాజ్యవాద దేశాల ఆధిపత్యాన్ని మనం చూడవచ్చును. ఫలితంగా అది నేటికీ వివిధ సామ్రాజ్యవాద శక్తుల పరోక్ష పాలన, దోపిడీ, అజమాయిషీల కింద ఉన్న ఒక అర్ధ వలసగానే కొనసాగుతోంది. అందువల్లనే 1947 ఆగస్టు 15న భారతదేశం స్వతంత్ర దేశం కాలేదనీ, ఆ 'స్వాతంత్రం' నామమాత్రమనీ, బూటకం అనీ మనం అంటున్నాం. వలసవాద దోపిడీ, పీడన కేవలం రూపంలో మారింది కానీ సారంలో అలాగే ఉండిపోయింది.

భారత దళారీ పాలకులు తీసుకువచ్చిన వివిధ పారిశ్రామిక అభివృద్ధి నమూనాలు విదేశీ పెట్టుబడి, సాంకేతికత, యంత్రాలు, రుణాలు, నిధుల రూపంలో విదేశీ 'సహాయం'పై భారీగా ఆధారపడి ఉన్నాయి. అవి నిరంతరం విదేశీ పెట్టుబడిపై ఆధారపడుతూ నిరాటంకంగా సామ్రాజ్యవాదుల లాభాలకు హామీనిచ్చినవే. అధికార మార్పిడి సమయంలో భారతదేశంలో ఉన్న ముఖ్య సమస్యలను సంక్షిప్తంగా చూద్దాం.

**మొదటి సమస్య – భూస్వామ్య పీడన –** అత్యధిక మంది ప్రజలు భూస్వామ్య పీడన కింద నలిగిపోతూ ఉన్నారు. దేశంలో భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామిక విప్లవం జరగకపోవడంతో భూస్వామ్య వర్గాలు చెక్కు చెదరలేదు. 1857 తిరుగుబాటు తరువాత బ్రిటీషువారితో సంపూర్ణంగా మైత్రి సాగించిన భూస్వామ్య శక్తులు కాంగ్రెసు పార్టీలో ఒక ముఖ్యమైన శక్తిగా ఉన్నారు. వారు భూ సంస్కరణల డిమాండ్‌ను ఎల్లప్పుడూ వ్యతిరేకిస్తూ వచ్చారు. 1947 తర్వాత రాచరిక రాజ్యాలను భారత యూనియన్‌లో కలిపేసుకుని, జమీందారీ రద్దు చట్టం తీసుకొచ్చినప్పటికీ జమీందారులకు తగిన పరిహారం చెల్లించారు. తమ భూమి మీద సాగు చేసుకునే హక్కు వారికే వదిలేసారు. ఆయా రాష్ట్రాల భూస్వామ్య పాలకులను నూతన అధికార వ్యవస్థలోకి తీసుకున్నారు. వారి రాచరిక సౌకర్యాలను చాలా వరకు కొనసాగనిచ్చారు.

1947 నాటికి బ్రిటీషు ఇండియాలో 40 శాతం భూమి జమీందారీ వ్యవస్థ కింద ఉన్నది. 57 శాతం రైత్వారీ వ్యవస్థ కింద, మిగిలినది మహాల్వారీ వ్యవస్థ కింద ఉన్నది. జమీందారీ ప్రాంతాలలో 70 శాతం భూమి జమీందారుల చేతిలో ఉన్నది. రైత్వారీ ప్రాంతాలలో 30 నుంచి 50 శాతం భూమిపై భూస్వాముల అదుపు ఉండేది. మిగిలిన భూమి రైతాంగం కింద ఉన్నప్పటికీ వారు తీవ్రంగా రుణగ్రస్తమై భూమిని కోల్పోయే పరిస్థితికి చేరుకున్నారు.

ఫ్యూడల్ రాజకుమారులకు, నవాబులకు యేడాదికి ఐదు కోట్ల రూపాయలు 'ప్రైవీ పర్సులు' చెల్లించేవారు. వారి భూములు, రాజభవనాలు, కోటలు, విదేశీ బ్యాంకులలో బ్యాంకు బాలెన్సులు, బంగారం, వజ్రాలూ మొదలైనవి వారికే విడిచిపెట్టారు. హైదరాబాద్ ఫ్యూడల్ పాలకుడు నైజాం, గ్వాలియర్, ఇండోర్, బరోడా మొదలైన రాజ్యాల మహారాజులూ తమ ఆదాయంలో కొంత భాగం షేర్ల రూపంలో కంపెనీలలో పెట్టుబడులు పెట్టారు. జమీందారీల రద్దు తరువాత జమీందారులకు 670 కోట్ల రూపాయలు పరిహారంగా చెల్లించారు.

గ్రామీణ ప్రాంతంలో భూస్వామ్య శక్తుల ఆధిపత్యం కొనసాగింది, ప్రభుత్వంలో అవి గణనీయంగా అధికారం చెలాయించాయి. భూసంస్కరణల పట్ల వారి వ్యతిరేకత, భూస్వామ్య పీడన కొనసాగింపూ గ్రామీణ ప్రజానీకంలో అత్యధికులను పేదరికంలో ఉంచింది. వ్యవసాయంలో ఉత్పాదకతను పెంపొందించడంలో ఉత్పత్తులను మెరుగుపరడంలో తిరిగి పెట్టుబడి కోసం మిగులును పెట్టడంలో భూస్వాములు, దళారీ పాలకులూ ఎటువంటి ఆసక్తి చూపించలేదు. వారు సృష్టించుకున్న మిగులును విలాస వస్తువుల వినియోగం కోసం వాడుకున్నారు, రుణాలుగానో జాయింట్ స్టాక్ కంపెనీలలో షేర్లలోనో పెట్టుబడి పెట్టారు. దీని ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తి చాలా పరిమితులకు గురైంది. ఇది రైతాంగం కొనుగోలు శక్తిని పెరగకుండా నిరోధించడంతో పారిశ్రామిక తయారీ సరుకులకు మార్కెట్ అంతగా అభివృద్ధి చెందలేదు.

**రెండవ సమస్య – సామ్రాజ్యవాద పెట్టుబడి –** అధికార మార్పిడి సమయంలో పారిశ్రామిక

రంగంలో విదేశీ పెట్టుబడి ఆధిక్యంలో ఉన్నది. 1948లో భారతదేశం వద్ద 264 కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడి ఉన్నది. ఇందులో మూడు వంతులు బ్రిటీష్ వారిది. దీనిని గనులలోను, ప్రాసెసింగ్ పరిశ్రమలలోను కేంద్రీకరించారు. యావత్తు విదేశీ పెట్టుబడిని మేనేజింగ్ ఏజెన్సీ వ్యవస్థలో సంఘటితం చేశారు. విదేశీ పెట్టుబడిలో మూడింట రెండు వంతులు టీ, జనపనార (20 శాతం) వంటి సాంప్రదాయ కార్యకలాపాలలో పెట్టారు. ఇది భారతీయ ఎగుమతుల్లో సగం. వ్యాపారం (17 శాతం), నిర్మాణ రంగం (12 శాతం), విద్యుత్తు, రవాణా (12 శాతం), గనులు (4 శాతం) ఉండేవి. మిగిలిన 35 శాతం తయారీ, పెట్రోలియం రంగాలలో పెట్టారు. విదేశీ పెట్టుబడి తయారీ రంగంలో ఐదింట రెండు వంతులు వస్త్రాలు, ఆహారం, పానీయాలలో, రవాణా సామగ్రి, యంత్రాలు, లోహ ఉత్పత్తులు, విద్యుత్తు సరుకులు, రసాయనాల వంటి నూతన పరిశ్రమలలో మూడింట ఒక వంతు ఉండేది.

విదేశీ అదుపు జౌళిలో 85 శాతం, చెక్క, తోలులో 80 శాతం, బొగ్గు, ఇతర గనులలో 70 శాతం, బంగారం, మెగ్నీసియం గనులలో 100 శాతం, ఇన్‌లాండ్ స్టీమర్ సర్వీసెస్‌లో 80 శాతం, ఓవర్‌సీస్ షిప్పింగ్‌లో 100 శాతం ఉండేది. భారతీయ దిగుమతులలో మూడింట ఒక వంతు, ఎగుమతులలో ఐదింట రెండు వంతులూ విదేశీ సంస్థల చేతిలో ఉండేవి. ఎగుమతులు దిగుమతుల వ్యాపార ఆర్థిక సహాయంలో మూడింట రెండు వంతులకు పైగా విదేశీ మారక బ్యాంకులు చేయగా జీవితేతర బీమా వ్యాపారంలో దాదాపు సగం విదేశీ చేతులలో ఉన్నది. ఇలా 1947లో భారతీయ ఆర్థిక వ్యవస్థలో విదేశీ పెట్టుబడి ఆధిక్యతా స్థానం అనుభవించింది.

**3వ సమస్య – బ్రిటీషు సామ్రాజ్యవాద అవసరాలకు అనుగుణంగా పెంపొందిన తల్లకిందుల, వక్రీకరించిన పారిశ్రామిక రంగం –** అధికార మార్పిడి సమయానికి భారతీయ పరిశ్రమలు ప్రధానంగా వ్యవసాయ ఆధారితం, రిపేర్ దుకాణాలు, బియ్యం మిల్లులు, వంటనూనె మిల్లులు, సాధారణ ఇంజినీరింగ్, ఇవన్నీ కలిపి యావత్తు పరిశ్రమలో దాదాపు సగం వుండేవి. కాపిటల్ గుడ్స్ రంగం అంటూ లేదు.

భారతీయ దళారీ బడా బూర్జువా వర్గం వ్యాపారం నుంచి, బ్యాంకింగ్ నేపథ్యం నుంచి ఉద్భవించింది. దీనికి ఉత్పత్తిలో పెద్దగా ఆసక్తి లేదు. వారికి మార్కెటింగ్‌లో వ్యాపారంలో ఎక్కువ శ్రద్ధ వున్నది. తమ వ్యాపార, బ్యాంకింగ్ ప్రయోజనాలకు పారిశ్రామిక పెట్టుబడిని సహాయకరంగా పరిగణించేవారు. వారి యావత్తు పెరుగుదలా విదేశీ పెట్టుబడితో కుమ్మక్కు(collaboration)తోనూ, భూస్వామ్య పాలకులతో మైత్రితోనూ జరిగింది. భూస్వామ్య, వడ్డీ వ్యాపార, వ్యాపార కార్యకలాపాలతో వారి చారిత్రక బంధాలు తెంచుకోవడంలో వారి అనాసక్తత చాలా కాలం పాటు వారి పారిశ్రామిక కార్యకలాపంపై వ్యక్తమయింది. బ్రిటీషు

సామ్రాజ్యవాదం సహాయంతో అది విధించిన పరిమితులలోనే బడా బూర్జువా వర్గం పెరిగింది. దాని వడ్డీ వ్యాపార, వ్యాపార నేపథ్యం, బ్రిటీషు సామ్రాజ్యవాదానికి లోబడి ఉండడం, భూస్వామ్య శక్తులతో మైత్రి వల్ల ఈ వర్గం వారితో రాజీపడడంతో పాటు జాతీయ ప్రయోజనాలకు, ప్రజా పోరాటాలకూ వ్యతిరేకంగా ప్రతీఘాతుక పాత్ర వహించింది. సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక స్వాతంత్ర పోరాటానికి నాయకత్వం వహించలేక పోయింది, విద్రోహం చేసింది. అధికార మార్పిడి తర్వాత ఈ వర్గం దళారీ నిరంకుశ బూర్జువా వర్గంగా మారింది. దీని ఫలితంగా బ్రిటీషు వాళ్ళు దేశం విడిచి వెళ్లిన తరువాత భారీ పారిశ్రామికీకరణ జాతీయవాద కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోయే ప్రసక్తే రాకుండా పోయింది.

**నాలుగవ సమస్య – విదేశీ పెట్టుబడిపై ఆధారపడిన పెట్టుబడి సంచయన విధానం** – దేశ పారిశ్రామికీకరణ కోసం, వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం కోసం భారత బడా బూర్జువా వర్గానికి స్వతంత్ర, సమగ్రమైన పెట్టుబడి సంచయనం పట్ల దానికి ఆసక్తి లేదు. అది తన స్వభావ రీత్యానే సామ్రాజ్యవాద ప్రయోజనాలకు లోబడి వుండే సంస్కరణలను చేపట్టి పెద్ద మొత్తంలో విదేశీ పెట్టుబడి, సాంకేతికతలపై ఆధారపడే విధానాన్ని అనుసరించింది. దీంతో విదేశీ సహాయంపై ఆధారపడడం, అంతర్గత బకాయిలు, లోటు ఫైనాన్సింగ్‌లు సాధారణమయ్యాయి.

**ఐదవ సమస్య – మూకుమ్మడి పేదరికం, దేశీయ మార్కెట్ కొరత** – దారిద్ర్యరేఖ గురించిన అధికారిక కొలమానాన్ని మొదటిసారిగా 1960–61లో నిర్వచించారు. గ్రామీణ ప్రాంతంలో నెలకు తలసరి ఇరవై రూపాయల కంటే తక్కువ వినిమయం, పట్టణ ప్రాంతాలలో ఇరవై ఐదు రూపాయల వినిమయం ఉండడాన్ని దారిద్ర్యరేఖగా నిర్వచించారు. ఇందులో ఇల్లు, విద్యల ఖర్చులు లేవు, ఇతర ప్రైవేటు వినిమయాలతో పాటు 2400 కేలరీల ఆహారం తీసుకోగలిగి ఉండాలి. ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం 1961–62లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజల సంఖ్య గ్రామీణ ప్రాంతంలో 47.37 శాతంగా, పట్టణ ప్రాంతంలో 43.5 శాతంగా ఉంటే వాస్తవ లెక్కలు మరింత ఎక్కువగా ఉంటాయి. పేదలలో చాలా మంది భారీగా రుణగ్రస్తులయి ఉండి, తమ అతి తక్కువ ఆదాయాల నుంచి వడ్డీని, అసలునూ చెల్లించవలసి వచ్చేది. 1960–61లో పేదల అధికారిక సంఖ్య మొత్తం 44 కోట్ల జనాభాలో 19 కోట్ల 70 లక్షలుగా ఉన్నది.

ఇటువంటి పరిస్థితిలో పారిశ్రామిక ఉత్పత్తి ప్రాథమికంగా సంపన్నుల విలాస వస్తువుల డిమాండ్‌ను సంతృప్తిపరచడం కోసము, ప్రపంచ మార్కెట్ అవసరాల కోసమూ పరిమితం అయింది. వ్యవసాయంలో అర్ధ భూస్వామ్య ఉత్పత్తి సంబంధాల కారణంగానే మూకుమ్మడి పేదరికం ఏర్పడింది. జనాభాలో అధిక సంఖ్యాకులు (మూడు వంతులు) ప్రాథమిక

వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. గ్రామీణ ఉత్పత్తిదారులలో అత్యధికులు సృష్టించే మిగులును భూస్వాములు, దళారీ బడా బూర్జువా వర్గం, సామ్రాజ్యవాదులూ కలిసి దోపిడీ చేసేవారు.

**భూ సంస్కరణలు బూటకం:**

1951-56 మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో అనేక రాష్ట్రాలలో భూ పరిమితి చట్టాలు చేసినప్పటికీ చాలా వరకు భూమి భూస్వాముల బంధువులు, సేవకుల పేరు మీద బదిలీ చేశారు. తద్వారా బినామీ పేర్లతో భూస్వాములు చాలా వరకు భూమిని మిగుల్చుకోగలిగారు. అంతే కాకుండా కాఫీ, టీ, రబ్బరు, పళ్ల తోటలు, పశు సంవర్ధకం, చక్కెర ఫ్యాక్టరీల కింద పలు రకాల తోటలకు, ఆధునిక పద్ధతుల ద్వారా సాగుచేసే భూములకు, దేవాలయాల, చర్చిల, మసీదుల కింద వున్న భూములకు మినహాయింపు ఇచ్చారు. భూస్వాములు తమ్ము తాము స్వయం సాగుదారులుగా ప్రకటించుకుని రైతాంగంతో తమ సంబంధాలను పునరేర్పాటు చేసుకున్నారు. అనేక మంది తమ కౌలుదారులను తొలగించారు లేదా తమ కౌలుదారులను మారుస్తూ వచ్చారు, తద్వారా చట్టబద్ధ కౌలు హక్కులను అమలు చేయాల్సిన పరిస్థితి రాకుండా చూసుకున్నారు. అలాగే పంపిణీ చేసేందుకు మిగులు భూమిగా ప్రకటించింది చాలా తక్కువే.

భూ పరిమితి చట్టాలు ప్రవేశపెట్టిన తరువాత భూమి నుంచి వెల్లగొట్టబడ్డ రైతాంగం సంఖ్య చాలా అధికంగా ఉన్నది. ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, కాశ్మీర్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ మొదలైన రాష్ట్రాలలో కుటుంబ ప్రాతిపదికన కాక వ్యక్తి ప్రాతిపదికగా భూ పరిమితి విధించారు. దీన్ని సాకుగా తీసుకుని ఒక్కొక్క భూస్వామ్య కుటుంబం వందలు వేలు ఎకరాలు నిలుపుకోగలిగింది. భూ పరిమితి చట్టం అమలు చేయవలసిన ప్రభుత్వ యంత్రాంగంలో భూస్వామ్య శక్తులు, వేతనాలు తీసుకునే వారి తైనాతీలూ ఉన్నారు. దీంతో భూ పరిమితి చట్టం చాలా వరకు కాగితాలకే పరిమితమైపోయింది.

6.2 కోట్ల ఎకరాలు మిగులు భూమి ఉన్నదని, ఇది పంపిణీకి అందుబాటులో ఉన్నదని మహాలనోబిస్ కమిటీ 1955లో ప్రకటించింది. కానీ 1970 చివరి నాటికి ప్రకటించిన మిగులు 24 లక్షల ఎకరాలు మాత్రమే. ఈ మిగులు భూమిలో పంపిణీ చేసిన భూమి అందులో సగం మాత్రమే. ఇది దేశంలో మొత్తం సాగు భూమి 40.7 కోట్ల ఎకరాలలో 0.3 శాతంగా ఉన్నది. దీనిని బట్టి భూ సంస్కరణలు భూయాజమాన్యంలో ఎటువంటి వ్యవస్థీకృత మార్పులు తీసుకురావడం కోసం కాక కేవలం కంటితుడుపుగా మాత్రమేనన్నది సుస్పష్టం. 1961 నాటికి కింది స్థాయిలో ఉన్న 80 శాతం మంది వద్ద ఉన్న సంపద పై స్థాయిలో ఉన్న కేవలం ఐదు శాతం మంది వద్ద సంపదతో సమానం. రెండు పంచవర్ష ప్రణాళికల కాలంలో ప్రజల జీవన పరిస్థితులలో మార్పును అధ్యయనం చేసేందుకు 1955లో ఏర్పాటు చేసిన మహాలనోబిస్

కమిటీ 1964లో సమర్పించిన తన నివేదికలో ఇలా పేర్కొంది. "1953-54, 1959-60 మధ్యకాలంలో భూ పరిమితి చట్టాలు పెద్దెత్తున రూపొందించినప్పటికీ ప్రజల మధ్య అసమానతలు చెప్పుకోదగినంతగా తగ్గలేదు". మొదటి మూడు పంచవర్ష ప్రణాళికల కాలంలో నెహ్రూ నాయకత్వంలో అమలు చేసిన భూ సంస్కరణలు బూటకం. నిజమైన భూ సంస్కరణలు, సహకార వ్యవసాయ విధానం అమలు చేస్తే అవి తమ ఆర్థిక, సామాజిక, రాజకీయ అధికారాన్ని బలహీనపరుస్తాయని సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య దోపిడీ పాలకవర్గాలకు తెలుసు.

45 సంవత్సరాల తరువాత కూడా ఈ నగ్న వాస్తవం ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక (1992-97)లో వెలుగులోకి వచ్చింది. ఏడో ప్రణాళిక చివరి నాటికి, అంటే 1990 నాటికి 72.3 లక్షల ఎకరాల భూమిని (మొత్తం 40.7 కోట్ల ఎకరాల సాగు భూమిలో) పంపిణీ చేసారు. పంపిణీ అయిన భూమి దేశంలో ఉన్న మొత్తం సాగు భూమిలో 1.9 శాతం కంటే తక్కువే వుంటుంది.

పంపిణీ చేసిన భూమిలో కూడా గణనీయమైన భాగం సాగుకు పనికిరానిది. తత్ఫలితంగా కొద్ది మంది భూస్వాముల చేతుల్లో భూమి కేంద్రీకృతం కావడం వ్యవసాయ రంగంలో ఆధిపత్యం వున్న లక్షణంగా ఉన్నది. మరో ప్రక్క అత్యధిక గ్రామీణ జనాభా భూమిలేని లేదా స్వల్ప భూమి కలిగిన వారుగా ఉన్నారు.

భూ సంస్కరణలు అమలు చేయకపోవడం, పెరుగుతున్న ఆదాయ అసమానతలు, మూకుమ్మడి పేదరికం, వ్యవసాయ రంగం క్షీణత యిలా గ్రామీణ ప్రాంతంలో అర్ధ భూస్వామ్య సంబంధాలు ఆధిపత్యంలో కొనసాగాయి. తయారీ రంగ వినిమయ సరుకుల మార్కెట్ ప్రధానంగా భారత సమాజంలో పై వర్గాలకు మాత్రమే పరిమితం అయిపోయింది. అంతే కాకుండా పరిశ్రమల అభివృద్ధి చాలా పరిమితంగా ఉండడంతో వ్యవసాయ రంగంలో రద్దీ అధికమైంది, అదనంగా గ్రామీణ పేదలను సృష్టించింది. దీంతో మార్కెట్ మరింతగా కుచించుకుపోయింది.

## అర్ధ భూస్వామ్య పునాదిపై కేంద్రీకృత పంచవర్ష ప్రణాళికలు:

సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గ ప్రయోజనాల కోసమే అర్ధ వలస, అర్ధ భూస్వామ్య పునాది మీదనే భారత ఆర్థిక వ్యవస్థ రూపొందింది. దీంతో దోపిడీ పాలకవర్గాలు దేశంలో పంచవర్ష ప్రణాళికల పేరుతో పారిశ్రామికీకరణకు పూనుకున్నప్పటికీ ఆ అభివృద్ధి అంతా తల్లకిందులుగా, వికృతంగానే జరిగింది. అంతేకాకుండా, పెట్టుబడి, వనరుల సమీకరణలలోనూ ప్రజల డిమాండ్‌లోనూ స్పష్టమైన పరిమితులు ఉన్నాయి. అభివృద్ధి పశ్చిమ నమూనా, పశ్చిమ సాంకేతికత, పెట్టుబడులపై ఆధారపడి చేశారు. ఇది దేశ వాస్తవిక

పరిస్థితులకు పూర్తిగా భిన్నంగా ఉన్నది. ఎటువంటి గణనీయమైన సాంకేతిక అభివృద్ధి కానీ, అరువు తెచ్చుకున్న సాంకేతికతను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఉపయోగించుకోవడం కానీ లేవు. దీని వల్ల అనేక పారిశ్రామిక సరుకుల ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయాయి, దేశ వనరులను ఊడ్చివేశాయి.

భారతదేశ పంచవర్ష ప్రణాళికలకు బొంబాయి ప్లాన్ ఒక నమూనాగా మారింది. ప్రపంచంలో కేంద్రీకృత ప్రణాళిక రాజ్య ప్రయోజనాలకు అవసరమైన సైద్ధాంతిక చట్రాన్ని కీన్స్ అందించాడు. కీన్స్ ప్రకారం ప్రభుత్వం నిధుల కోసం, తన అవసరాలు తీర్చుకోవడం కోసం భారీగా డిఫిసిట్ ఫైనాన్సింగ్‌కు పాల్పడవచ్చు. నిజానికి సంక్షోభంలో కూరుకుపోయిన పశ్చిమ ఆర్థిక వ్యవస్థలను ప్రభావవంతమైన డిమాండ్‌ను సృష్టించడం ద్వారా అధికోత్పత్తి సంక్షోభం (మాంద్యం) నుంచి బయటపడవేయడం కోసం కీనీసియన్ సిద్ధాంతం వచ్చింది. పెట్టుబడిదారీ దేశాలలో ముఖ్యమైన పరిశ్రమలను జాతీయం చేయడంతో పాటుగా నిరుద్యోగ భృతి, విద్య, ఆరోగ్యం, వైద్యం, ఇతర సామాజిక సంక్షేమ కార్యక్రమాలపై భారీ ప్రభుత్వ రాయితీలను ప్రారంభించారు. ఈ దేశాలను 'సంక్షేమ రాజ్యాలు'గా పేర్కొన్నారు. భారతదేశంలో సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బూర్జువా వర్గం, భూస్వామ్య వర్గం తమ స్వంత పరిశ్రమలకు ఫైనాన్స్ చేసుకోవడం కోసం భారీగా డెఫిసిట్ ఫైనాన్సింగ్‌ను బలపరిచాయి.

అధికార మార్పిడి నాటినుంచి వివిధ పంచవర్ష ప్రణాళికలు, యావత్తు ప్రభుత్వ రంగమూ జాతీయాకరణను బలపరచినా, ప్రైవేటీకరణను బలపరచినా అది కేవలం దళారీ బడా బూర్జువా వర్గానికి, భూస్వామ్య, సామ్రాజ్యవాద ప్రయోజనాలకూ సేవచేయడం కోసమే. కాలంతో పాటు ఈ విధానాలలో ఏం మార్పులు జరిగినా అవి యీ దళారుల, సామ్రాజ్యవాదుల మారుతున్న అవసరాలనే ప్రతిబింబించాయి. ఇలా పంచవర్ష ప్రణాళికలలో అవలంబించిన వ్యూహం 1951కు ముందు ఉనికిలో లేని కాపిటల్ గుడ్స్ రంగాన్ని, రవాణా, కమ్యూనికేషన్, విద్యుత్తు, ఇతర పబ్లిక్ యుటిలిటీస్ వంటి అవసరమైన ప్రాథమిక సౌకర్యాలనూ పెంపొందించడానికే. భూమిని పునఃపంపిణీ చేయకుండానే ఈ రంగాలలో పెట్టే ప్రభుత్వ పెట్టుబడి పెట్టుబడిదారుల కోసం దేశీయ మార్కెట్‌ను విస్తరించి పెడుతుందని ఆశించారు.

1951–1990 వరకు 7 పంచవర్ష ప్రణాళికలు రూపొందించి అమలు చేసారు. మొదటి పంచవర్ష ప్రణాళిక(1951–56)లో వ్యవసాయాభివృద్ధి కోసం 1952లో కమ్యూనిటీ డెవలప్‌మెంటు సీడీపీ కార్యక్రమాన్ని, కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని (ఎఫ్‌పీపీ)ని ప్రారంభించారు. భాక్రానంగల్, హిరాకుడ్, దామోదర్‌లోయ వంటి బహుళార్థ సాధక ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ ప్రణాళిక విజయవంతం అయ్యిందని ప్రభుత్వం ప్రకటించింది. రెండవ ప్రణాళిక (1956–61)లో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ కాలంలో మూడు ముఖ్యమైన స్టీల్ ప్లాంటులను నిర్మించారు: బ్రిటీషువారి సహాయంతో

దుర్గాపూర్ (పశ్చిమ బెంగాల్), రష్యా సహాయంతో భిలాయి (ఛత్తీస్‌గఢ్), జర్మనీ సహాయంతో రూర్కెలా (ఒడిశా). 1962లో భారత్–చైనా యుద్ధం వల్ల, 1965లో భారత్–పాకిస్తాన్ యుద్ధం వల్ల 3వ ప్రణాళిక (1961–66) విఫలమైంది. 1966–69 మధ్య ప్రణాళికకు సెలవు ప్రకటించారు. 4వ ప్రణాళిక (1967–74) 1971లో ఇండియా–పాకిస్తాన్ యుద్ధం కారణంగా విఫలమైంది. 5వ ప్రణాళిక (1977–79)లో "గరీబీ హఠావో" (పేదరిక నిర్మూలన) నినాదం యిచ్చారు. ఇందిరాగాంధీ 20 సూత్రాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. 1978లో జనతా ప్రభుత్వం ఈ ప్రణాళికను నిలిపివేసింది. అది రోలింగ్ ప్లానును ప్రారంభించింది. 6వ ప్రణాళిక (1980–85)లో నిరుద్యోగం, దారిద్ర్య నిర్మూలన లక్ష్యంగా వుందనీ. 7వ ప్రణాళిక (1985–90) కూడా పై లక్ష్యాన్నే కొనసాగించిందని అన్నారు.

ఈ ప్రభుత్వరంగ ప్రణాళికలకు నాలుగు ప్రధాన వనరుల ద్వారా ఆర్థిక సహాయం సమకూర్చారు. 1) అదనపు పన్నులు, 2) అంతర్గత అప్పులు, 3) డెఫిసిట్ ఫైనాన్సింగ్, 4) విదేశీ సహాయం (ఎఫ్‌డీఐ). డెఫిసిట్ ఫైనాన్సింగ్, విదేశీ సహాయం (ఎఫ్‌డీఐ) కలిసి మొత్తం పథకాల ఖర్చులలో 50% ఉండేవి. ఈ ఆర్థిక వనరులన్నీ విశాల ప్రజలను పిండివేయగా, ఈ పథకాల నుంచి వచ్చిన లాభాలు సంపన్నులకే వెళ్ళాయి. యావత్తు పన్ను ఆదాయంలో పరోక్ష పన్నుల వాటా 1953–55లో 58.8% ఉండగా 1966–68 నాటికి 70.7%నికి పెరిగింది.

డెఫిసిట్ ఫైనాన్సింగ్ వల్ల స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రభుత్వ భద్రతల కోసం కేంద్ర ప్రభుత్వానికి రుణం ఇవ్వవలసి రావడంతో ఆర్‌బీఐ మరింత డబ్బును అచ్చువేయవలసి వచ్చింది. దీంతో ద్రవ్యోల్బణం తీవ్రమై నిజవేతనాలు పడిపోయాయి. అంటే ప్రజల కొనుగోలు శక్తి తగ్గింది. ఈ రకంగా ప్రజల్లో అత్యధికులు పేదలుగా మారి అత్యవసర అంశాలకు కూడా తమ వినిమయ ఖర్చును తగ్గించుకోవలసి వస్తే సంపన్నులు మాత్రం అదనపు విలువలో అధిక భాగం విలాస వస్తువుల వినియోగానికి, అనుత్పాదక పెట్టుబడికీ ఉపయోగించుకున్నారు.

భారతదేశంలో ప్రైవేటు, ప్రభుత్వ రంగాలు రెండూ యంత్రాలు, యంత్ర భాగాలు, విడి భాగాలు, పారిశ్రామిక ముడిపదార్థం, సాంకేతికత, రుణాల కోసం సామ్రాజ్యవాదుల మీద భారీగా ఆధారపడి ఉండడంతో విదేశీ మారక ద్రవ్య సంక్షోభం ఉద్భవించింది.

ప్రజల వినిమయత్వాన్ని ప్రభావితం చేస్తూ ప్రభుత్వ రంగ ఉత్పాదక పెట్టుబడిని పెంచడంతో అంతిమంగా అది మార్కెట్ ప్రతిష్టంభనకు దారితీసింది. నిజానికి, ప్రజలలో అత్యంత పేదలే పరోక్ష పన్నుల వల్ల అధికంగా ప్రభావితం అయ్యారు. పరోక్ష పన్నుల విచారణా కమిటీ నివేదిక ప్రకారం 1973–74లో దేశంలో యావత్తు పరోక్ష పన్ను చెల్లింపులో 55% వరకు తలసరి నెలవారీగా నూరు రూపాయలలో అంతకంటే తక్కువో ఖర్చు చేసే కుటుంబాలే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చెల్లించేవి.

ప్రభుత్వ రంగం ప్రణాళికల ద్వారా ప్రైవేటు రంగానికే ప్రధానంగా సేవ చేసింది, దాని పెరుగుదలకు దోహదం చేసింది. అది బడా బూర్జువావర్గానికి అదనపు విలువ వాటా పెంచుకోవడానికి, పెట్టుబడిని సంచయనం చేసుకోవడానికి తోడ్పడింది. చౌకధరకు సరుకులు, సేవలు సరఫరా చేసింది. ప్రైవేట్ పెట్టుబడికి సమస్య వచ్చినప్పుడల్లా ప్రభుత్వ రంగం జోక్యం చేసుకుంది. భాయిలాపడ్డ వస్త్ర మిల్లులను, ప్రైవేట్ యూనిట్‌లను టేక్ ఓవర్ చేసుకుంది. ప్రభుత్వ రంగం అత్యంత లాభకరమైన రంగాలను ప్రైవేటు పెట్టుబడికి విడిచిపెట్టి, ప్రైవేటు రంగాన్ని ఆకర్షించని రంగాలను మాత్రమే చేపట్టింది. ప్రభుత్వరంగ నష్టాలకు నిజానికి ప్రైవేటు రంగానికి పెద్దెత్తున వస్తున్న లాభాలే కారణం.

దేశంలో పెరుగుతున్న వ్యాపార లోటు (డెఫిసిట్), పెరుగుతున్న విదేశీ రుణం, పెరుగుతున్న రుణ సేవలు, మళ్లీ పెరిగిన విదేశీ రుణం, చెల్లింపుల (బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్) సంక్షోభం, 'ప్రణాళికాబద్ధ' వికృత అభివృద్ధి కారణంగా ఇటువంటి విషపూరిత రుణ వలయంలో చిక్కుకుంది.

**'హరిత విప్లవం':**

1966 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రతి రంగమూ సంక్షోభం వల్ల ప్రభావితమైంది. పరిశ్రమ తన ఉత్పత్తులను అమ్ముకోవడానికి తీవ్రమైన సంక్షోభం ఎదుర్కొంది. అనేక పరిశ్రమలు తమ అసలు సామర్థ్యం కంటే తక్కువగా నడిచేవి, లేదా పెద్దెత్తున కార్మికులను తొలగించేవి. వ్యవసాయం స్తంభనకు గురైంది, వరుస కరువులతో ఆహార ధాన్యాల ఉత్పత్తి తీవ్రంగా పడిపోయింది. వ్యాపార లోటులు అధికమయ్యాయి. తీవ్రమైన చెల్లింపుల సంక్షోభం ఏర్పడింది. కొత్త నిధుల కోసం భారత ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు, సామ్రాజ్యవాదులూ విధించిన కఠిన షరతులను అమలు చేసింది. 1962లో భారత్-చైనా యుద్ధంతోనూ, 1965లో భారత-పాకిస్తాన్ యుద్ధంతోనూ తీవ్రమైన వనరుల కొరతకు, తీవ్ర ద్రవ్యోల్బణానికీ దారితీసింది. నిరుద్యోగం, మూకుమ్మడి పేదరికం అత్యంతగా పెరిగాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో దారిద్ర్యరేఖ దిగువన ఉన్న జనాభా వరుసగా 52.24 శాతానికి, 44.15 శాతానికి పెరిగింది. అత్యవసర సరుకుల ధరలు తీవ్రంగా పెరిగాయి. రైతాంగం భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టారు. యిదే 1967 నక్సల్బరీ రైతాంగ సాయుధ తిరుగుబాటు. ఇందులో భాగంగా దేశంలో పది రాష్ట్రాలలో వ్యవసాయ తిరుగుబాట్లు బద్దలయ్యాయి. శ్రీకాకుళం, ముషాహరి, లఖింపూర్-ఖేరి, దేబ్రా-గోపీవల్లభపూర్, బీర్‌భూం, కాంక్సా, బుధ్‌బుధ్, సోనార్‌పుర్ మొదలైన అనేక ప్రాంతాలకు వ్యాపించి యావత్తు వ్యవస్థనూ కుదిపివేసింది. 'దున్నేవారికే భూమి' నినాదంతో సాయుధ వ్యవసాయ విప్లవం ఇరుసుగా కలిగిన నూతన ప్రజాస్వామిక విప్లవమే దీనికి ప్రాతిపదికను కల్పించింది. ఈ సమయంలోనే సీపీఐ (మార్క్సిస్టు-లెనినిస్టు), మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎమ్‌సీసీ)ల నాయకత్వంలో

మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానం (నేడు మావోయిజం) మార్గదర్శకత్వంలో పెరుగుతున్న ప్రభావాన్ని రూపుమాపడం కోసం ఇందిరా గాంధీ కాంగ్రెసు ప్రభుత్వం వ్యూహాత్మకంగా రివిజనిస్టు సీపీఐ, సీపీఐ(ఎమ్)లతో చేతులు కలిపింది.

సాయుధ వ్యవసాయక విప్లవాన్ని నిరోధించడానికి ఒక వైపు లక్షలాది ప్రభుత్వ పోలీసు, పారామిలటరీ బలగాలను మోహరించి క్రూరంగా విప్లవ ప్రతీఘాతుక అణచివేతను సాగించడంతో పాటు భారత పాలకవర్గాలు, వారి సామ్రాజ్యవాద యజమానులూ రూపొందించిన ప్రత్యామ్నాయ వ్యూహమే హరిత విప్లవం.

హరిత విప్లవ లక్ష్యం రెండు రకాలు – ఒకటి భారత దేశ గ్రామీణ ప్రాంతాలలో వెలుగు చూస్తున్న ఎర్ర విప్లవానికి ప్రత్యామ్నాయంగా పనిచేయడం; రెండోది, మార్కెట్‌ను ముంచెత్తుతున్న వ్యవసాయ యంత్రాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు, హెచ్‌వైవి విత్తనాలు మొదలైన సామ్రాజ్యవాద సరుకులకు నిర్బంధ (కాప్టివ్) మార్కెట్ కల్పించడం.

'హరిత విప్లవ' వ్యూహం అమెరికా టీఎన్‌సీల ఆడంబరమైన కార్యక్రమం. హెచ్‌వైవిలు సృష్టించి, విత్తన వ్యాపారంపై ఆధిపత్యం ఉన్న టీఎన్‌సీలు చాలా వరకు ఎరువులు, పురుగు మందుల పరిశ్రమలపై కూడా ఆధిపత్యం వహించాయి. వాటి ఏకైక లక్ష్యం అత్యధిక రసాయన అమ్మకాలు సృష్టించే, తమకు లాభాలను తెచ్చిపెట్టే అటువంటి రకం మొక్కలను పెంపొందించడం. సామ్రాజ్యవాద ప్రభుత్వాల మద్దతుతో ఈ టీఎన్‌సీలు 'హరిత విప్లవ' సాంకేతికతలను అమలు చేయడం ద్వారా వెనుకబడిన దేశాలలో పెద్ద సమస్యలుగా ఉన్న ఆకలిని, పోషకాహారలేమిని పరిష్కరించవచ్చునన్న భ్రమ కల్పించడం. 'హరిత విప్లవ' వ్యూహాన్ని వెనుకబడిన దేశాల మీద రుద్దడానికి ఆ దేశాల ప్రజలు ఎదుర్కొనే ఆకలి సమస్య పట్ల శ్రద్ధ కారణం కాదు. తమ వద్ద అధికంగా మేట పడిపోయిన ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలను వదిలించుకుని, ఇలాంటి తమ ఉత్పత్తులకు డిమాండ్ పెంచుకుని ఈ ఉత్పత్తులకు నిర్బంధ మార్కెట్‌ను సృష్టించడం. యూఎస్ ఎయిడ్, ప్రపంచ బ్యాంకు, ఇతర సామ్రాజ్యవాద ఏజెన్సీలూ వెనుకబడిన దేశాలలో 'హరిత విప్లవ' సాంకేతికత అమలుకు ఆర్థిక సహాయం చేసాయి.

మన దేశానికి, ఇతర వెనుకబడిన దేశాలకూ 'హరిత విప్లవాన్ని' ఎగుమతి చేయడంలో రాక్‌ఫెల్లర్, ఫోర్డ్, కెల్లోగ్ ఫౌండేషన్‌లు చురుకైన పాత్ర వహించాయి. ఇందులో భాగంగా 1966 నుంచి గోధుమ, ధాన్యం, జొన్న, సోర్ఘం (ఒక రకమైన గడ్డి), పెర్ల్ మిల్లెట్ (గింజలుగా, పశువుల దాణాగా ఉపయోగించే గడ్డి)లలో హెచ్‌వైవి (హై ఈల్డ్ వరైటీ) కార్యక్రమాన్ని భారతదేశంలో చేపట్టారు. హెచ్‌వైవి విత్తనాల ఆధారంగా మొదట 'పాకేజ్ ప్రోగ్రాం'ను నీటిపారుదల ఉన్న పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లలోని వివిధ ప్రాంతాలలో, ఆ తర్వాత దేశంలో మూడింట ఒక వంతు ప్రాంతంలో అమలు చేసారు.

హెచ్‌వైవి విత్తనాలుగా చెబుతున్నవి నిజంగా వాటంతట అవే అధిక దిగుబడిని ఇచ్చేవి కావు. అధిక మోతాదులలో రసాయనిక ఎరువులు, పురుగు మందులు జల్లితేనే అవి బలంగా స్పందిస్తాయి. వీటికి తగినంత నీటి సరఫరా అవసరం. అవసరం అయినవన్నీ తగిన మొత్తాలలో వేయకపోతే పెద్దమొత్తంలో పంటలు దెబ్బతినడం కూడా ఇందులో సాధారణం.

'హరిత విప్లవం'గా చెప్పుకుంటున్నది కేవలం ఉత్తర భారతంలో కొన్ని ప్రాంతాలకు పరిమితం అయ్యింది. రైతాంగంలో సంపన్నులకు మాత్రమే ఉపకరించింది. చిన్న రైతులు పెట్టుబడి లేక, రుణం అందుబాటులో లేక హెచ్‌వైవి విత్తనాలను, ఎరువులనూ ఉపయోగించుకుని తమ ఆదాయాలను పెంచుకోలేకపోయారు. భూస్వాములు, ధనిక రైతులు సహకార రుణాన్ని వినియోగించుకుని హెచ్‌వైవి విత్తనాలను, ఇతర రకాల ఉత్పత్తులనూ చేపట్టారు. మిగులులో కొంత భాగాన్ని తిరిగి పెట్టుబడిగా పెట్టారు. ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు పెంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. ఉత్పత్తిలో మెరుగుదల, ఆకర్షక ధరలూ భూస్వాముల, ఒక సెక్షన్ ధనిక రైతుల ఆదాయాలను పెంచాయి.

ఉనికిలో ఉన్న భూసంబంధాలను ఏ మాత్రం మార్చకుండాననే 'హరిత విప్లవాన్ని' ప్రోత్సహించడానికి ప్రభుత్వం అదనపు ఉత్పత్తి చేస్తున్న రైతులకు, ముఖ్యంగా భూస్వాములు, ధనిక రైతులకు భారీ రాయితీలు, చౌక రుణ సౌకర్యాలూ కల్పించింది. దీంతో మొత్తం అర్ధ భూస్వామ్య గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వక్రీకరించిన పెట్టుబడిదారీ సంబంధాలు అభివృద్ధి చెందాయి.

హెచ్‌వైవీ విత్తనాలు జల్లిన ప్రాంతాలు 1966-67లో 1.2 శాతంగా ఉండగా పది సంవత్సరాలలో 20 శాతానికి పెరిగాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తి కంటే ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు మొదలైన దిగుమతులు పెరిగిపోయాయి. 1951లో 55 మిలియన్ టన్నులున్న ఆహార ధాన్యాల ఉత్పత్తి 1981లో 130 మి.ట.లకు అంటే మూడు రెట్లు పెరిగింది. 1951లో 29,000 టన్నులున్న ఎరువుల వినియోగం 1980-81కి 55 లక్షల టన్నులకు, అంటే 55,000 శాతం పెరిగింది. దీనికి తోడు 'హరిత విప్లవం' మొదటి పదేళ్ల కాలంలో ఎరువుల ధరలు 150 శాతం పెరిగి ఎరువుల పరిశ్రమకు అధిక లాభాలు తెచ్చి పెట్టాయి.

'హరిత విప్లవం'తో లాభపడ్డదల్లా సామ్రాజ్యవాదులు, ఎమ్ఎన్‌సీ, టీఎన్‌సీలు, దళారీ పెట్టుబడిదారులు, భూస్వాములు, ధనిక రైతాంగంలో ఒక సెక్షన్. 'హరితవిప్లవం' పేద, మధ్యతరగతి రైతునే కాక భూమిని కూడా నాశనం చేసింది. రైతులు పెద్ద మొత్తంలో భూములను విడిచిపెట్టేశారు. అమెరికా ఎంఎన్‌సీలకు సిరులు పండేందుకు వాటి నుంచి హెచ్‌వైవీ విత్తనాలు ఎరువులు కొనుగోలు చేయడం కోసం కాంగ్రెసు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు పెట్టేందుకు

వెనకాడలేదు కానీ దేశంలో నీటిపారుదల మీద అంత శ్రద్ధ పెట్టలేదు. ఫలితంగా దేశంలో 35 శాతం సాగుభూములకు మాత్రమే నీటిపారుదల ఉన్నది. 'హరిత విప్లవం'గా చెపుతున్న దాని మొదటి రెండు దశాబ్దాల తరువాత, బలహీన నీటిపారుదల, అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందుల కారణంగా, భూసారం క్షీణించి, వ్యవసాయ దిగుబడి పెరుగుదల రేటు తగ్గింది. గ్రామీణ జనాభా ఆదాయంలో అసమానతలు పెరిగాయి, నిరుద్యోగం పెరిగింది. ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. నీటి, వాయు కాలుష్యాలు పెరిగాయి.

**'హరిత విప్లవ' నెగిటివ్ ప్రభావాలు:**

**1) ఉత్పాదకత పెరుగుదల రేట్లలో తగ్గుదల:** 'హరిత విప్లవ' మొదటి దశాబ్దంలో ఉత్పాదకతలో గణనీయమైన పెరుగుదల ఉన్నప్పటికీ క్రమేపీ ఉత్పాదకత పెరుగుదల రేటు తగ్గిపోయింది. వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, విద్యుత్‌పై చేసే ఖర్చులు తీవ్రంగా పెరిగాయి. రైతాంగానికి వీటిని అత్యంత ఎక్కువ రేట్లకు అమ్మి దళారీ నిరంకుశ బూర్జువా వర్గం, సామ్రాజ్యవాద టీఎన్‌సీల కూటమి అపారమైన లాభాలు చేసుకున్నాయి. మరో ప్రక్క వ్యవసాయ ఉత్పత్తులను చౌక ధరలకు కొనుగోలు చేసాయి. వ్యవసాయ ఉత్పత్తుల ధరల కంటే ఖర్చులు పెరిగిపోయాయి. దాంతో బడా భూస్వామ్యవర్గం, ధనిక రైతాంగంలో ఎగువ సెక్షన్ అత్యధికంగా లాభపడగా, పేద, మధ్యతరగతి, ధనిక రైతాంగంలో ఒక సెక్షన్ నష్టపోయింది. భూగర్భ జలాలు వేగంగా ఇంకిపోతూ వచ్చాయి. పంజాబ్‌లో రైతాంగ ఆందోళనకు ఇది ఒక ముఖ్యకారణం.

**2) సంపన్నులకు పేదలకూ మధ్య అసమానతల పెరుగుదల:** పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లలో నీటిపారుదల ఉన్న ప్రాంతాలలో పేద, మధ్యతరగతి రైతాంగానికి సహకార సంస్థలు, బ్యాంకుల రుణాలు అందుబాటులో లేకపోవడం, ట్రాక్టర్లు, ఇతర యంత్రాలను ఉపయోగించుకోవడం కోసం భూమి ఎక్కువ అవసరం కావడంతో తమ భూములను అమ్ముకోవలసి వస్తే, భూస్వాములు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఆ భూములను కారుచౌక రేట్లకు కొనుగోలు చేసి సంపన్నులయ్యారు.

భారతదేశంలో మొత్తంగా చూసుకున్నప్పుడు భూకమతాల సంఖ్య 1970-71, 1985-86 మధ్య సమయంలో 7,10,11,000 నుంచి 9,71,55,000కు తీవ్రంగా పెరిగింది. మరో ప్రక్క పంజాబ్‌లో అదే కాలంలో ఇది 13,76,000 నుంచి 10,89,000కు గణనీయంగా తగ్గింది. పంజాబ్‌లో పేద రైతాంగం 5,18,000 నుంచి సగానికి 2,56,000కు, మధ్యతరగతి రైతాంగంలో కిందిస్థాయి 2,60,000 నుంచి 2,08,000కు తగ్గాయి. మొత్తం దేశంలో పేద రైతాంగం 3,56,82,000 నుంచి 5,67,48,000కు, మధ్యతరగతి కిందిస్థాయి 1,34,32,000 నుంచి 1,78,81,000కు పెరిగాయి. పంజాబ్‌లో అనేక మంది పేద

మధ్యతరగతి రైతాంగం దివాలాతీయడంతో భూస్వాములు, ధనిక రైతులలో ఒక సెక్షన్ లాభపడ్డారు. పంజాబ్‌లో భూస్వాములు 6,91,000 నుంచి 7,41,000కు పెరిగారు. అదే కాలంలో దేశంలో భూస్వాముల సంఖ్య 22,66,000 నుంచి 19,29,000కు తగ్గింది. దేశంలో అధిక భాగంలో భూస్వామి నుంచి భూమిని లీజుకు తీసుకున్నది పేద, మధ్య రైతులు కాగా, పంజాబ్‌లో 'విరుద్ధ ధోరణి' ఉన్నది. అంటే పేద, మధ్య రైతుల వద్ద నుంచి భూస్వాములు, ధనిక రైతులు భూమిని లీజుకు తీసుకున్నారు. ఈ రకంగా దేశంలో మిగిలిన ప్రాంతంలో కంటే 'హరిత విప్లవం' ప్రాంతంలో చాలా మంది పేద రైతాంగం భూములను కోల్పోయి మరింత పేదలయ్యారు.

**3) నిరుద్యోగం పెరుగుదల:** 'హరిత విప్లవ ప్రాంతాలలో ట్రాక్టర్లు, ఇతర రకాల వ్యవసాయ యంత్రాలు విస్తృతంగా వినియోగించడంతో గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగం పెద్దెత్తున పెరిగింది. ఈ ధోరణి పంజాబ్‌లో మరింత కొట్టొచ్చినట్లు కనపడింది. పేద రైతాంగాన్ని, భూమిలేని కూలీలనూ వ్యవసాయం ఇముడ్చుకోలేకపోయింది. పరిశ్రమల అభివృద్ధి లేకపోవడంతో గ్రామీణ జనాభా గణనీయమైన సంఖ్యలో నిరుద్యోగులయ్యారు. కరువు అంచులలోకి నెట్టబడ్డారు. ఈ సెక్షన్‌లే పంజాబ్‌లో 1980లలో జరిగిన ప్రజా పోరాటంలో ప్రముఖ పాత్ర వహించారు.

**4) ప్రాంతాల మధ్య అసమానతలు:** 'హరిత విప్లవం' వలన ప్రాంతీయ అసమానతలు గణనీయంగా పెరిగాయి. ఆధునిక సాంకేతికతతో కూడి ఉన్న ఈ వ్యూహం నీటిపారుదల సౌకర్యాలు ఉన్న దేశంలో మూడింట ఒక వంతు ప్రాంతంలోనే అమలయింది. మిగతా రెండొంతుల ప్రాంతంలో దీని ప్రభావం పాక్షికంగానే ఉంది. గ్రామీణ రంగానికి సంస్థాగత రుణాలు, ఎరువులకు భారీ రాయితీలు మొదలయిన ఇతర ప్రభుత్వ రాయితీలు ఈ ఎంపిక చేసిన ప్రాంతాలకే లభ్యం కావడంతో దేశంలో మిగిలిన గ్రామీణ ప్రాంతాలకు అతి తక్కువ నిధులు కేటాయించారు. దీంతో అవి వెనుకబడిపోయాయి. 'హరిత విప్లవే'తర ప్రాంతాలలో గ్రామీణ రంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో తలెత్తిన ప్రాంతీయ అసమానతలు ప్రత్యేక రాష్ట్రం, స్వయంప్రతిపత్తి మొదలయిన కోర్కెలతో ప్రాంతీయ ఉద్యమాల పెరుగుదలకు దారితీసింది.

**5) వాతావరణ కాలుష్యం:** ఎరువులు, పురుగుల మందులు వంటి రసాయనాల వాడకానికి అలవాటుపడ్డ భూమిలో నిరంతరాయంగా వాటిని ఎక్కువ మోతాదులో పెంచుతూ పోతే తప్ప పంట దిగుబడి సంతృప్తికరంగా రాదు. అందువలన రసాయనాల వాడకం దినదినం పెంచుతూ ఉండాలి. ఈ విధంగా విపరీతమైన రసాయనాలను ఉపయోగించడం యావత్తు వాతావరణాన్ని, నీటిని, గాలిని, వాటిని ఉపయోగించే భూమిని, ఆ భూమిలో వేసిన పంటలను కూడా కలుషితం చేస్తుంది. క్రమేపీ భూసారం తగ్గిపోయి, చౌడు భూములుగా, నిస్సారంగా మారిపోయాయి.

పంటలకు తీవ్ర వ్యాధులు సోకాయి. పురుగుమందులు కూడా పనిచేయని స్థితి ఏర్పడింది.

**అర్ధవలస స్థితి:**

కామ్రేడ్ లెనిన్ పేర్కొన్నట్లు పెట్టుబడిదారీ విధానపు చివరి దశ అయిన సామ్రాజ్యవాద దశలో ప్రామాణిక పాత్ర వహించే పెట్టుబడి ఎగుమతి, మున్నెన్నటి కంటే ఎక్కువ ధరలకు సరుకులను, కాలంచెల్లిన సాంకేతిక జ్ఞానాన్ని, సాంకేతిక నిపుణులను ఎగుమతి చేయడానికి సామ్రాజ్యవాద గుత్తసంస్థలు వాటి ప్రభుత్వాల చేతుల్లో ఒక లీవర్ లాగా పనిచేస్తుంది. పెట్టుబడి ఎగుమతి అనివార్యంగా విడిభాగాలకు (స్పేర్ పార్టులకు), పారిశ్రామిక ముడిపదార్థాలకు, సగం తయారైన పారిశ్రామిక సరుకులకు శాశ్వత మార్కెట్‌ను సృష్టిస్తుంది.

ఈ పెట్టుబడుల నిరంతర ప్రవాహానికీ దీనితో పాటు విదేశీ సరుకులు భారత మార్కెట్‌లోకి ప్రవేశించడానికి దళారీ నిరంకుశ బూర్జువా వర్గం నమ్మకమైన పాత్ర నిర్వహిస్తూ వస్తోంది. 1947 తర్వాత జరిగిన పరిణామాలు దీనికి అద్దం పడతాయి. భారత పారిశ్రామిక, ద్రవ్య రంగాలలో జూన్ 1948లో 264 కోట్ల రూపాయలుగా ఉన్న విదేశీ ప్రత్యక్ష మదుపులు (Foreign Direct Investments-FDI) 1981 నాటికి 2,500 కోట్ల రూపాయలకు (పది రెట్లు) పెరిగాయి.

భారతదేశ మొదటి ప్రణాళిక (1951–56)లో ప్రధానంగా అమెరికా నుంచి వచ్చిన పెట్టుబడి విదేశీ 'సహాయం'గా ఉన్నది. 1953లో గనులు, వ్యాపారం, బ్యాంకింగు వంటి సంఘటిత రంగాలలో దాదాపు సగం నికర సంపద విదేశీయుల యాజమాన్యంలోనో, నియంత్రణలోనో ఉన్నాయి. అదే సమయంలో ప్రపంచ బ్యాంకు నుంచి వచ్చిన రుణ పెట్టుబడి రైల్వేలతో సహా మౌలిక సేవలు, ప్రాథమిక సౌకర్యాలను నియంత్రించసాగింది. భారత దళారీ నిరంకుశ బూర్జువా వర్గపు నూతన పెట్టుబడులు, కుమ్మక్కుల (collaborations) రూపంలో ఎఫ్‌డీఐ వచ్చింది. ఉదాహరణకు, రైల్వేలలో ఆవిరి ఇంజన్ల స్థానంలో డీజిల్ లోకోమోటివ్‌లను ప్రవేశపెట్టారు. బొగ్గు ఆధారిత సాంకేతికత నుంచి పెట్రోలియం ఆధారిత సాంకేతికతలకు మారారు. ఎరువుల ఉత్పత్తి, విద్యుదుత్పత్తి మొదలైన రంగాలలో కూడా ఇటువంటి సాంకేతిక మార్పు జరిగింది. నిజానికి దేశంలో పెట్రోలియం కొరత ఉన్నది. బొగ్గు స్వయంసమృద్ధంగా ఉన్నది. వ్యాపారంలో లోటు కొనసాగడానికి ఇదే పునాది. వ్యాపార లోటు నుంచి తలెత్తిన విదేశీ మారక ఒప్పందాలను తీర్చడం కోసం పాలకులు విదేశీ రుణాలు తీసుకున్నారు.

అయితే అర్ధవలస భారతదేశంలో స్వాతంత్ర్య పోరాట ప్రభావం, ప్రపంచవ్యాప్తంగా ఉధృతంగా నడిచిన జాతి విముక్తి పోరాటాలు, శక్తివంతమైన సోషలిస్టు శిబిరం గురించిన భయాందోళనలతో సామ్రాజ్యవాదులు ముఖ్యంగా దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి, కొన్ని రాయితీలు ఇచ్చారు. జాయింట్ వెంచర్లు ప్రత్యక్ష పెట్టుబడులతో జోడించి భారత దళారులను

తమ నూతన సంస్థలలోకి కుమ్మక్కుదారులుగా తీసుకున్నారు. ఇది రెండో ప్రణాళిక (1957-61)లో ప్రతిబింబించింది. ఇది దిగుమతి ప్రత్యామ్నాయంగా చెప్పుకునే నెహ్రూ-మహాలనోబిస్ నమూనాను ప్రవేశపెట్టింది. దీన్ని సామ్రాజ్యవాదులు 'పెట్టుబడియేతర అభివృద్ధి మార్గం' అంటూ ముందుకు తెచ్చారు. దీనిని కృశ్చేవీయ రివిజనిస్టులు (భారతదేశంలో సీపీఐ) ప్రోత్సహించారు. పెరుగుతున్న కుమ్మక్కు ఒప్పందాలతో దళారుల బలం పెరుగుతూ సామ్రాజ్యవాదులపై పరాధీనత పెరిగింది. కేవలం 75 బడా వ్యాపార సంస్థలు సమస్త ప్రభుత్వేతర కంపెనీల సంపదలను కలిగి ఉన్నాయని, కేవలం టాటా, బిర్లా కుటుంబాలు భారతీయ కంపెనీలలో ప్రైవేటు పెట్టుబడి స్టాక్‌లలో 20 శాతాన్ని కలిగి ఉన్నాయనీ 1965లో మోనోపోలిస్ కమీషన్ పేర్కొంది. అంతేకాకుండా 1966లో భారతదేశంలో ఉన్న 112 అతిపెద్ద కార్పొరేషన్లలో (సంపదల లెక్కలో) 62 కార్పొరేషన్లు విదేశీ యాజమాన్యంలోనే, నియంత్రణలోనో ఉన్నాయి. ఎంఎన్‌సీ, టీఎన్‌సీల పెట్టుబడి అధికార మార్పిడి తర్వాత మొదటి రెండు దశాబ్దాలలో 1948లో 265 కోట్ల రూపాయల నుంచి 1968లో 1,543 కోట్ల రూపాయలకు అంటే ఆరు రెట్లు పెరిగింది. ఒక పరిశీలన ప్రకారం ప్రైవేట్ రంగంలో వ్యాపార పరిమాణంలోనూ, పారిశ్రామిక రంగాలలోనూ బహుళజాతి సంస్థలు తమ ప్రభావాన్ని విస్తరించుకున్నాయి. ప్రైవేట్ రంగపు మొత్తం అమ్మకాలలో బహుళజాతి సంస్థల వాటా 1967-68లో 26 శాతం ఉండగా, 1972-73 నాటికి 30 శాతానికి పెరిగిపోయింది. వాటి మొత్తం లాభాల వాటా ఇదే కాలంలో 36 శాతం నుంచి 50 శాతానికి పెరిగింది. 1948-61 కాలంలో విదేశీ పెట్టుబడిదారులు దేశంలో ఎంత పెట్టుబడులు పెట్టారో అంతకు మూడు రెట్లు బయటకు తీసుకుపోయారు. అంటే ఆ రోజులలో దేశం మీదను, దేశ ఆర్థిక వ్యవస్థ మీదనూ ఆధిపత్యం కొనసాగించడానికి ఎఫ్‌డీఐ, 'సహాయం' (ఎయిడ్) సామ్రాజ్యవాదుల కవల ఆయుధాలు.

1948-1958 మధ్య ఏడాదికి 50 చొప్పున కుమ్మక్కులు జరిగాయి. ఇవి ఏడాదికేడాదికీ పెరిగాయి. 1959లో 150 కుమ్మక్కులు జరిగితే, 1991 నాటికి సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పీజీ) రెండో దశ ప్రారంభం నాటికి దేశంలో 13,400 విదేశీ కొలాబరేషన్‌లు ఉన్నాయి.

'దిగుమతుల ప్రత్యామ్నాయం' (ఇంపోర్ట్ సబ్‌స్టిట్యూషన్) అంటే దిగుమతుల స్థానంలో టీఎన్‌సీలు స్థానికంగా ఉత్పత్తి చేసిన లేదా దళారులతో కుమ్మక్కై ఉత్పత్తి చేసిన విదేశీ వస్తువులను (భారత పేర్లతో) తీసుకువచ్చారు.

పాశ్చాత్య (పశ్చిమ) దేశాల 'సహాయం' కూడా పెరిగింది. నిజానికి దీనిని పెంపొందించడం కోసమే 1958లో ప్రపంచ బ్యాంకు ఎయిడ్ ఇండియా కన్సార్టియమ్‌ను స్థాపించింది. రెండో, మూడో (1962 నుంచి 1966 వరకు) ప్రణాళికల కాలంలో మొత్తం ఖర్చులో 30 శాతం విదేశీ పెట్టుబడి ఉన్నది. ఇందులో అత్యధికం అమెరికాదే.

రష్యాలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగి 1960ల చివరకు సోషల్ సామ్రాజ్యవాద దేశంగా (ఆ తర్వాత అగ్రరాజ్యంగా) మారిన తర్వాత దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి పాశ్చాత్య దేశాలతో మరింతగా బేరాలాడే పరిస్థితి వచ్చింది. దాంతో పాశ్చాత్య విదేశీ పెట్టుబడికి అనేక ఆంక్షలు ఏర్పడినప్పటికీ రష్యా 'సహాయం'తో ప్రభుత్వ రంగం ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం సాధించసాగింది. ఈ సమయంలోనే భారత పేటెంట్ చట్టం-ఫెరా (దీని ప్రకారం భారత జాయింట్ వెంచర్లలో, కొలాబరేషన్లలో విదేశీ కంపెనీలు తమ వాటాలను 40 శాతానికి తగ్గించుకోవాలి), హాతీ కమిషన్ రిపోర్ట్ (మందుల ధర నియంత్రణ), ఎఫ్‌డీఐలో పెరుగుదల, కొన్ని రంగాలలో పాశ్చాత్య దేశాల పెట్టుబడిపై నిషేధం మొదలైనవన్నీ ముందుకు వచ్చాయి. ఇవి దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం పెరుగుదలకు తోడ్పడ్డాయి. అంతేకాక ఈ చర్యల ద్వారా దేశంలో కార్యకలాపాలు సాగించే టీఎన్‌సీలు పోటీ నుంచి రక్షించబడ్డాయి. ఇది పాశ్చాత్య పెట్టుబడిపై 1970లలో కొన్ని ఆంక్షలను ముందుకు తెచ్చింది. దీంతో ఆర్థిక వ్యవస్థపై రష్యా సోషల్ సామ్రాజ్యవాదం అదుపు పెరిగింది. 1981లో ఐఎంఎఫ్ రుణం వచ్చిన తర్వాత 1980లలో ఈ క్రమం వెనక్కు తగ్గింది.

1970లలో పాశ్చాత్య పెట్టుబడి, రష్యా పెట్టుబడీ ఆధిపత్యం కోసం పోటీపడ్డాయి. పరిమాణంలో కాకపోయినా అదుపు చేయడంలో రష్యా పైచేయి సాధించింది. ప్రభుత్వ రంగం భారీగా పెరిగింది. దళారీ నిరంకుశ బూర్జువా వర్గం కూడా పెరిగింది. బ్యాంకులు, చమురు, బొగ్గు, భారీ పరిశ్రమల వంటి వాటి జాతీయాకరణ, వస్త్రాల నుంచి హోటళ్ల వరకు అన్ని ఉత్పత్తి రంగాలలోకీ ప్రభుత్వ రంగం ప్రవేశంతో కోశాగారం నుంచి (అంటే ప్రజలపై పన్నులతో వచ్చిన డబ్బు) ఇచ్చిన డబ్బులతో భారీమొత్తం తయారయింది.

భారత నిరంకుశ దళారీ బూర్జువా వర్గంతో కలిసి ఉమ్మడి సంస్థలను (జాయింట్ వెంచర్స్) స్థాపించడమే దేశ మార్కెటును తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి ఈ సామ్రాజ్యవాద గుత్త సంస్థలు అవలంబించిన అత్యంత సులభమైన మార్గం. నూటికి నూరు శాతం విదేశీ పెట్టుబడి సంస్థలను స్థాపించే బదులు జాయింట్ వెంచర్‌లను స్థాపించడం వల్ల నమ్మకమైన స్థానిక దళారీలు ప్రభుత్వం నుండి లైసెన్సులు పొందడం నుండి మొదలుకొని దేశంలో సరుకులను అమ్మడం వరకూ అన్ని పనులు చేసి పెట్టారు. విదేశీ గుత్తసంస్థలు 1991కి ముందు అంటే విదేశీ పెట్టుబడులు 40 శాతానికి మించకూడదన్న షరతు విధించక ముందు జాయింట్ వెంచర్స్‌ను ఏర్పరచాయి. 40 శాతం కంటే తక్కువ వాటా ఉన్నా కూడా వాస్తవంగా పరిశ్రమపై కంట్రోలు విదేశీ గుత్త సంస్థలకే ఉండేది. ఈ జాయింట్ వెంచర్స్‌లో అంతర్జాతీయ గుత్త సంస్థలకు దళారీలుగా పని చేస్తూ భారత బడా బూర్జువా వర్గం లాభాల్లో వాటా పొందుతూ వచ్చింది.

1970ల ఆరంభం నుండి అంతర్జాతీయ గుత్త సంస్థలు (MNC-TNC) నూతన తరహా అంతర్జాతీయ శ్రమ విభజనను ప్రవేశపెట్టి ఒక సరుకు తయారీని ఒకటికి మించిన దేశాలలో

చేయడం ద్వారా యావత్తు ప్రపంచాన్నీ తమ ఫ్యాక్టరీగా మార్చివేసారు. ఒక్కొక్క సరుకు తయారీని అనేక భాగాలుగా విడగొట్టి ఈ విడి భాగాలను వేర్వేరు దేశాలలో ఉత్పత్తి చేసి, చివరకు మరో దేశంలో వాటిని అసెంబల్ చేయడం (జోడించడం) అనే పద్ధతిని అవలంబించారు. ఉదాహరణకు ఒక కారును తయారుచేయడానికి నాలుగు వేల విడి భాగాలు ఉత్పత్తి చేసి వాటిని అసెంబల్ చేయాలి. తమకు లాభదాయకంగా ఉన్న దేశాల్లో లక్షలాది సంఖ్యలో ఒక్కో భాగాన్ని తయారు చేయడానికి విడిగా ఫ్యాక్టరీలను స్థాపించి చివరకు వీటన్నింటినీ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఒకటి లేదా కొన్ని కేంద్ర ప్రాంతాలకు తరలించి తుది అసెంబ్లింగ్ చేస్తారు. దీని వలన ఈ గుత్త పెట్టుబడిదారీ సంస్థలు లక్షల సంఖ్యలో కార్లను తయారు చేయగలుగుతాయి. ఒక్కో కంపెనీ ఇలా పెద్దెత్తున విడి భాగాలను చేయకపోతే అది లాభదాయకంగా ఉండదు. ఈ విడి భాగాలను చేసే పరిశ్రమలను మొదట వివిధ పెట్టుబడిదారీ దేశాల్లో వెనకబడ్డ ప్రాంతాల్లో (తక్కువ వేతనాలకు కార్మికులు లభ్యమయ్యే ప్రాంతాలలో) నెలకొల్పేవారు. క్రమేపీ వివిధ మూడో ప్రపంచ దేశాలలో ఈ విడి భాగాల పరిశ్రమలను, అసెంబ్లింగ్ షాపులను నెలకొల్పనారంభించారు. టివిలు, కంప్యూటర్లు, రేడియోలు, టేప్ రికార్డర్లు, విసిఆర్ మొదలయిన వస్తువులన్నీ మూడవ ప్రపంచ దేశాల్లోనే అసెంబల్ చేయనారంభించారు. ఈ దేశాలలో కార్మికుల వేతనాలు అత్యల్పంగా ఉండడం వలన ఈ ఎమ్ఎన్సిలు విపరీతమైన లాభాలు గడించాయి. తమ స్వంత పరిశ్రమలను వివిధ దేశాల్లో ఏర్పరచుకోవడం ద్వారా కానీ, స్థానిక దళారీలతో జాయింట్ వెంచర్ల ద్వారా కానీ లేదా స్థానిక కంపెనీలకు సబ్‌కాంట్రాక్టు ఇవ్వడం ద్వారా కానీ ఉత్పత్తి కొనసాగించారు. అలాగే అనేక దేశాలలో ఇటువంటి కంపెనీలను ఏర్పరచడం వలన తమకు అననుకూల పరిస్థితులు ఎదురైనప్పుడు (సమ్మెలు, ప్రభుత్వ విధానాలలో మార్పులు, కరెన్సీ మారకపు రేటులో మార్పులు వగైరా) వాటిని ఒక దేశం నుండి మరొక దేశానికి మార్చుకోవడం వాటికి తేలికయింది. అంతర్జాతీయ గుత్త పెట్టుబడిదారీ సంస్థల అంతర్జాతీయ శ్రమ విభజనలో భాగంగానే ఈ పరిశ్రమలు స్థాపించబడ్డాయి. ఎగుమతి చేయడానికే ఇవి ఉత్పత్తి చేసేవి. అందువల్ల భారతదేశం లాంటి దేశాల్లో అంతర్జాతీయ శ్రమ విభజనలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి నిజమైన జాతీయ పెట్టుబడిదారీ అభివృద్ధి కాదు. భారత పాలకవర్గాలు దేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఢంకా బజాయించినా వాస్తవానికి ఇది అర్ధవలస ఆర్థిక విధానమే తప్ప స్వతంత్ర పెట్టుబడిదారీ అభివృద్ధి కాదు.

విదేశీ ప్రైవేటు పెట్టుబడి, విదేశీ రుణ పెట్టుబడి, భారత దళారీ పెట్టుబడి, ప్రభుత్వ పెట్టుబడి అనే నాలుగు రకాల పెట్టుబడులు ముందెన్నడూ లేనంతగా పెనవేసుకుపోయి భారత దేశ అదుపులో ఉన్న పారిశ్రామిక పెట్టుబడిగా చలామణి అవుతూ వచ్చింది. ఏ పెద్ద భారత పరిశ్రమను తీసుకున్నా, అది కెమికల్స్ అయినా, మోటార్ వాహనాలైనా, ఎలక్ట్రికల్, ఎరువులు, మందులు, మెషిన్‌టూల్స్ ఇత్యాది ఏవైనా ఈ నాలుగు రకాల పెట్టుబడులు విడదీయలేనంతగా

కలగలసిపోయాయి. బిర్లాల హిందుస్తాన్ మోటార్స్ కంపెనీ అమెరికా గుత్త సంస్థ జనరల్ మోటార్స్‌కు స్థానిక దళారీలానే పనిచేసింది. మొదట ప్రభుత్వరంగంలో ఉత్పత్తి ఆరంభించిన మారుతీ కారు జపాన్‌లోని సుజుకి గుత్త సంస్థ ఎగుమతి చేసే భాగాలతో తయారయ్యేంది. ఏ ఒక్క భారీ భారతీయ సంస్థా సంపూర్ణంగా భారత పెట్టుబడితో, స్థానిక సాంకేతిక పరిజ్ఞానంతో, స్థానిక యంత్రపరికరాలతో ఉత్పత్తి చేయడం లేదు. విదేశాల నుండి దిగుమతి చేసుకొనే భాగాలను జోడించడమే ఇక్కడి అనేక పరిశ్రమల్లో చేస్తూ వచ్చాయి. ఇది 'స్క్రూడ్రైవర్ టెక్నాలజీ'గా ప్రసిద్ధి చెందింది. ఎగుమతుల పరిశ్రమ పేరుతో స్థాపించినవన్నీ ఈ అసెంబ్లీ షాపులే తప్ప కొత్త సరుకులు తయారు చేసే పరిశ్రమలు కాదు.

ఇక మన దేశంలోకి ప్రవహించే విదేశీ రుణాలు ఎలా పెరుగుతూ వచ్చాయో, వాటి పాత్ర ఏమిటో చూద్దాం. 1950-51లో విదేశీ అప్పు కేవలం 32 కోట్ల రూపాయలే. అది 1951-56 మొదటి ప్రణాళికా కాలంలో 202 కోట్లు కాగా, 1960-61లో 782 కోట్లకు, 1970-71లో 6,485 కోట్లకు, 1980-81లో 13,479 కోట్లకు, 1989-90 నాటికి 54,100 కోట్లకు, 1991 జూన్‌లో 2,10,000 కోట్లకు చేరుకోగా 1996 చివరికి రూ.3,50,000 కోట్లకు పెరిగింది.

ఈ రుణాలను దృష్టిలో ఉంచుకునే సామ్రాజ్యవాదుల దోపిడీని "ఎద్దు తోలును రెండుసార్లు వొలిచిన" చందమని లెనిన్ పేర్కొన్నాడు. అంటే ఈ రుణాలు యిచ్చే అభివృద్ధి చెందిన దేశాలు అనేక షరతులు విధించాయి. అప్పులపై వచ్చే వడ్డీ కాక ఆ అప్పులు తీసుకున్న దేశం ఎంత ఖరీదైనవైనప్పటికీ సామ్రాజ్యవాదుల సరుకులను తాము చెప్పిన సంస్థ వద్దనే చెప్పిన ధరకు మారుమాట్లాడకుండా కొనాలనే షరతు విధించడం (వీటినే నిబంధనలతో కూడిన రుణాలు (ట్రెడ్ లోన్స్) అంటారు), తాము సూచించిన రవాణా సంస్థలనే వినియోగించాలనడం, ఆర్థిక, సైనిక ఒప్పందాలు చేసుకొనే విధంగా బలవంతం చేయడం, కీలక రంగాలను జాయింట్ వెంచర్స్ ద్వారా తమ పూర్తి అదుపులోకి తెచ్చుకోవడం, తమకు పనికిరాని, కాలం చెల్లిన యంత్రాలను, ఇతర సరుకులను అప్పు తీసుకున్న దేశానికి ఎగుమతి చేయడం, వడ్డీ రేట్లను పెంచుతూ పోవడం, ముఖ్యంగా రూపాయి విలువను తగ్గించడం ద్వారా ఈ అప్పుల మొత్తాలను కృత్రిమంగా పెంచడం, రుణం తీసుకున్న దేశ రాజకీయ విధానాలను తమకు అనుకూలంగా మార్చుకోవడం మొదలయినవి సామ్రాజ్యవాద దేశాలు చేస్తూ వచ్చాయి. ఐఎమ్ఎఫ్, ప్రపంచ బ్యాంకు తదితర అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు ఈ పనిని భారతదేశంలో ప్రత్యక్షంగానే చేసాయి. ఉదాహరణకు 1966లో రూపాయి విలువ 36 శాతం పడిపోయేట్టు అపమౌల్యం (డివేల్యు) చేసారు. అంటే 1947లో మారకపు విలువ ఒక డాలర్‌కు ఒక రూపాయి కాగా, 1966లో అది 7.50 రూపాయలకు పడిపోయింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసింది. దేశంలో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. తిరిగి 1991 జూన్‌లో రూపాయి విలువ డాలర్‌కు

24.58 రూపాయలుగా అపమౌల్యానికి గురై 1,40,000 కోట్ల రూపాయలుగా ఉన్న విదేశీ అప్పు ఒకేసారి 2,10,000 కోట్లకు పెరిగింది. ఇంతేకాక భారతదేశంలో కంపెనీల షేర్లు, భూమి, ఇతర ఆస్తులూ విదేశీయులకు అత్యంత చౌకగా అందుబాటులోకి తీసుకురావడంతో (లోగడ లక్ష డాలర్లతో 20 లక్షల రూపాయల విలువగల షేర్లు వగైరాలను కొనగలిగితే రూపాయి అపమౌల్యంతో అదే లక్ష డాలర్లతో 30 లక్షల రూపాయల విలువగల షేర్లను కొనగలిగారు) వాటిని వశం చేసుకొనే క్రమం వేగం పుంజుకుంది. విదేశీ దిగుమతుల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.

మొదట పంచవర్ష ప్రణాళికలో ఈ నిబంధనలతో కూడిన రుణాలు మొత్తం విదేశీ అప్పులో 82.5 శాతంగా ఉండింది. విదేశీ అప్పు పెరిగిన కొద్దీ ఇటువంటి పరిణామాలు మరింత తీవ్రం కాక తప్పదు. బ్రిటిషు వలసవాదులు 1947కు పూర్వం అమలు పరచిన విధానాల్నే ఐఎమ్ఎఫ్ ప్రపంచ బ్యాంకులు అమలు చేసాయి.

ఇలాంటి రుణాలను ఇచ్చి అమెరికా ప్రపంచ మార్కెటు ధరల కన్నా 200 శాతం అధిక ధరలకు భారతదేశానికి ఆహార ధాన్యాలను అమ్మింది. అమెరికా అమ్మిన 77 రకాల సరుకుల్లో రెండు తప్ప మిగతా అన్నింటినీ ఇలా ఎక్కువ ధరలకు అమ్మింది.

ఈ అప్పులు తిరిగి తీర్చాలంటే భారత్ వంటి వెనకబడిన దేశాలు అవసరమైన కనీస ఉత్పత్తి క్రమంలో తయారైన (require minimum manufacturing) వ్యవసాయోత్పత్తులను, ఇతర సరుకులను (ముడిపదార్థాలను) మాత్రమే ఎగుమతి చేయగలవు. వెనకబడిన దేశాల సరుకుల ధరలు ఒక శాతం పెరిగితే, అభివృద్ధి చెందిన దేశాల సరుకులు 10 శాతానికి పైగా పెరిగాయి.

ఈ రుణాలు ప్రధానంగా ఏ రంగాలకు ఉపయోగపడుతున్నాయో చూడడానికి అంతర్జాతీయ అభివృద్ధి ఏజెన్సీ (IDA) ఇచ్చిన అప్పుల వివరాలను చూద్దాం. ప్రపంచ బ్యాంకు అనుబంధ సంస్థగా 1960లో ఐడిఎ ఏర్పడింది. వడ్డీ రేటు లేకుండానో లేక తక్కువ వడ్డీ రేటుతోనో పరిశ్రమలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించడం ఈ రుణాల లక్ష్యం. సామ్రాజ్యవాద దేశాల ద్రవ్యపెట్టుబడితో ఈ రుణాలు ఇస్తారు. రోడ్లు, రైల్వే లైన్లు, విద్యుత్ సౌకర్యం, విద్యా సంస్థలు నెలకొల్పడం, డ్రైనేజి స్కీములు, టెలికాం, లఘు పరిశ్రమలు, నీటి పారుదల సౌకర్యం, ఎరువుల ఉత్పత్తి, గ్రామీణాభివృద్ధి, చేపల పెంపకం, వరదల నివారణ, మొదలయిన వాటికి ఇవి నిధులు సమకూరుస్తాయి. 1961 జూన్ నుండి 1984 జూన్ వరకు ఐడిఎ ద్వారా భారత ప్రభుత్వం మొత్తం 1,253 కోట్ల డాలర్ల రుణాలు తీసుకున్నది.

ఐడిఎ ఇచ్చే రుణాలు పేరుకు మాత్రమే వడ్డీ లేనివి లేదా తక్కువ వడ్డీ గలిగినవి. రుణం ఇచ్చే ముందే, ఆ రుణం ద్వారా ఏయే సరుకులు, ముడి పదార్థాలు ఎక్కడెక్కడ, ఏ ధరలకు

కొనుగోలు చేయాలో మొదలయిన అనేక విషయాలను ఐడిఎ నిర్ణయిస్తుంది. ఆ ధరలన్నీ ప్రపంచ మార్కెటులో ఆ సరుకులకు, సర్వీసులకు పలుకుతున్న ధరల కన్నా రెండు, మూడు రెట్లు, కొన్నిసార్లు పది రెట్లకు పైనే నిర్ణయించినా ఎదురు మాట్లాడటానికి వీల్లేదు.

భారతదేశ అర్ధవలస ఆర్థిక స్థితిని అర్థం చేసుకోవాలంటే వివిధ సామ్రాజ్యవాద దేశాలపై అది ఎలా ఆధారపడుతూ వస్తోందో తెలుసుకోవాలి. మొదటి పంచవర్ష ప్రణాళిక కాలంలో (1951-56) మొత్తం రుణం 202 కోట్లు కాగా ఇందులో నాలుగింట మూడొంతులు అమెరికా సామ్రాజ్యవాదం నుంచే వచ్చింది. ఆ తరువాత కాలంలో భారతదేశం రుణాల కోసం ప్రధానంగా ఆరు సామ్రాజ్యవాద దేశాలపైనా (అమెరికా, బ్రిటన్, రష్యా, జపాన్, జర్మనీ, కెనడా), ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ ద్రవ్య సంస్థలపైనా ఆధారపడింది.

ముందే చెప్పినట్లుగా 1996 చివరి నాటికి ఈ రుణాల మొత్తం 3,50,000 కోట్లకు పెరిగింది. ఉపయోగించుకున్న 'సహాయం' 1,16,652 కోట్లు ఉన్నది. 1996 మార్చ్ నాటికి ప్రపంచ బ్యాంకు, ఐడిఎలు అతిఎక్కువగా 22.2 శాతం, 20.8 శాతం రుణాలు ఇచ్చాయి. దేశాలవారీగా చూస్తే అన్నింటికంటే ఎక్కువ రుణ పెట్టుబడి 16.1 శాతం జపాన్ నుండి వచ్చింది. ఆ తరువాత రష్యా నుంచి 8.7 శాతం, పశ్చిమ జర్మనీ నుంచి 5.1 శాతం, బ్రిటన్ నుంచి 3.9 శాతం, అమెరికా నుంచి 2.6 శాతం వచ్చాయి.

ప్రపంచ బ్యాంకు రుణం 1949లో 34 మిలియన్ డాలర్ల రుణంతో ఆరంభమై 1990ల చివరి నాటికి మొత్తంగా 42 వేల మిలియన్ డాలర్లు భారతదేశంలోకి ప్రవహించింది. ప్రపంచబ్యాంకు మంజూరు చేసిన మొత్తం రుణాలలో 15 శాతం ఒక్క భారతదేశమే పుచ్చుకుంది. దేశంలో ఈ బ్యాంకు 16 రంగాలకు రుణాలు ఇచ్చినప్పటికీ అది ప్రధానంగా రైల్వేలు, పారిశ్రామిక దిగుమతులు, విద్యుచ్ఛక్తి, స్టీలు రంగాలకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేసింది. వ్యవసాయానికి, నీటిపారుదలకు అది అంత ప్రాధాన్యతనియ్యలేదు. ఇంకా చెప్పాలంటే వ్యవసాయానికి ఆఖరి ప్రాధాన్యతనిచ్చిందనడం సరిగా ఉంటుంది.

వలసగా ఉన్న కాలంలో భారతదేశం నుండి బ్రిటన్‌కు తరలించుకుపోయిన సంపద కంటే ఆ తర్వాత కాలంలో (అంటే 1947 తర్వాత) అనేక రెట్లు ఈ సామ్రాజ్యవాద దేశాలు వడ్డీల రూపంలో తరలించుకు పోతూ ఉన్నాయి. రానూ రానూ అప్పులపై వడ్డీలతో పాటు అసలులో సైతం కొంత భాగం తీర్చాల్సి రావడంతో భారత ఆర్థిక వ్యవస్థ అప్పుల విషవలయంలో కూరుకుపోతోంది. అంటే అసలు, వడ్డీ చెల్లింపుల కోసం తిరిగి అప్పు చేయక తప్పని స్థితిని ఎదుర్కొంటోంది. ఉదాహరణకు, 1991-92లో తీసుకొన్న విదేశీ అప్పు రూ. 11,615 కోట్లు, ఆ సంవత్సరం చెల్లించిన అసలు, వడ్డీ కలిపితే రూ.6,656 కోట్లు. 1992-93 నాటికి అసలు, వడ్డీ రూ.9,102 కోట్లకు పెరిగింది. ఈ మొత్తాన్ని తీర్చడానికే భారత్ తిరిగి రూ.10,885

కోట్లు అప్పు చేయవలసి వచ్చింది. ఇలా పాత అప్పులు, వాటిపై వడ్డీలను తీర్చడానికి ప్రతీ సంవత్సరం అప్పు చేయక తప్పని స్థితినే రుణాల ఉచ్చు (Debt trap) అని అంటారు. ఈ రుణాల ఉచ్చు నుండి బయటపడడం భారతదేశానికి అసంభవం. ఐఎమ్ఎఫ్, ప్రపంచ బ్యాంకు, వివిధ సామ్రాజ్యవాద దేశాలు మన దేశాన్ని అర్ధవలస స్థితిలో ఉంచుతూ జలగల్లా మన దేశ ప్రజల కష్టార్జితాన్ని పీల్చుకు తింటూ ఉండడమే కాక భారతదేశ రాజకీయ, సైనిక, ఆర్థిక విధానాలను రూపొందించడంలో ఇవి నిర్ణయాత్మకమైన పాత్రను వహిస్తున్నాయి.

## సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పీజీ) విధానాల మొదటి దశ (1985–1991)

సామ్రాజ్యవాద ప్రయోజనాలను, అందులో భాగంగా తమ ప్రయోజనాలను ఈడేర్చుకోవడానికి భారత దళారీ పాలకవర్గాలు మొదటి నుంచి ప్రభుత్వ విధానాలను పలు మార్లు సరళీకరిస్తూనే వచ్చారు. 1957 మార్చ్‌లో ప్రపంచ బ్యాంకు ఒత్తిడితో భారత ప్రభుత్వం '51 శాతం నియమం', అంటే జాయింట్ వెంచర్లలో అత్యధికంగా భారతీయ యాజమాన్యం ఉండాలన్న నియమాన్ని వదిలిపెట్టడం, 1971 వరకు ఉత్పత్తిని పెంచడానికి భారీ పారిశ్రామిక సంస్థలు లాంఛనప్రాయమైన క్లియరెన్స్ తీసుకోవడం తప్పనిసరి చేసే ఎంఆర్‌టిపి చట్టాన్ని సరళీకరించడం, 1973 నాటి ఫెరాను సరళీకరించి 'విదేశీ పెట్టుబడికి నూతన అవకాశాలు' అందించడం, 1980లో ఐదు బిలియన్ రుణం తీసుకుని ఐఎంఎఫ్ షరతులను ఆమోదించి, దిగుమతుల, ఎగుమతుల విధానాన్ని సరళీకరించడం, 1982లో ఐఎంఎఫ్ నుండి రెండోసారి రుణం తీసుకొని విదేశీ పెట్టుబడులకు మరిన్ని రాయితీలు ఇచ్చి, ఎగుమతి, సాంకేతిక దృష్టి యూనిట్‌లకు 100 శాతం విదేశీ ఈక్విటీని అనుమతించడం, విదేశీ పెట్టుబడికి 'ఓపెన్ డోర్ పాలసీ' చేపట్టడం వల్ల నూతన విదేశీ కొలాబరేషన్‌లు వెల్లువెత్తడానికి దారితీసింది.

ఇది క్రమేపీ భారతదేశం మీద అమెరికా ప్రభావాన్ని పెంచింది. 1985 వరకు సోవియట్ యూనియన్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో మునిగిపోవడంతో రాజకీయంగా సైనికంగా దానిపై భారత్ పరాధీనతలో క్షీణత వచ్చింది. దీనితో అమెరికా ప్రాయోజిత నూతన ఆర్థిక విధానాలను 1985 నుంచి సంఘటితపరిచారు. 1985 ప్రారంభానికి ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులలో అనేక మంది మాజీ ఉద్యోగులు ప్రణాళికా మండలిలో, ద్రవ్య మంత్రిత్వ శాఖ, ప్రధాన మంత్రి సెక్రటేరియట్‌లలో సలహాదారులయ్యారు.

ఎల్‌పీజీ మొదటి దశలో ప్రైవేటు కార్పొరేటు రంగం మరిన్ని పన్ను రాయితీలు పొందింది. 1985లో కార్పొరేట్ లాభాలలో అన్ని స్థాయిలలోనూ పన్ను రేట్లను ఐదు శాతం తగ్గించారు. ఎగుమతులపై లాభాలలో 50 శాతం పన్ను మినహాయింపును కల్పించారు. 1988లో వారి యావత్తు లాభాలనూ పన్ను నుంచి మినహాయించారు. ఆస్తి పన్నును తగ్గించారు, సంక్షేమ ఖర్చులలో కోత విధించారు, ఎస్టేట్ డ్యూటీని మొత్తంగా తొలగించారు. వ్యక్తిగత పన్నుకు

మినహాయింపు పరిమితులను పెంచారు, వ్యక్తిగత ఆదాయ పన్ను తగ్గించారు. పన్ను రాయితీల నుంచి తలెత్తే భారీ బడ్జెట్ లోటును అప్పులు చేయడం ద్వారా తీర్చుకున్నారు. ఇండస్ట్రియల్ లైసెన్సింగ్‌ను సరళీకరించారు. మోనోపోలీస్ అండ్ రెస్ట్రిక్టెడ్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎంఆర్‌టిపి) పరిమితులను వంద కోట్ల రూపాయల ఆస్తుల వరకు పెంచారు. ఎలక్ట్రికల్ యంత్రాలు, ఎలక్ట్రానిక్ భాగాలు, మెషిన్ పరికరాలు, పారిశ్రామిక యంత్రాలు, డజన్ల కొలదీ బల్క్ డ్రగ్స్, సంబంధిత డ్రగ్ ఫార్ములేషన్స్ మొదలయిన 25 రకాల పరిశ్రమలను డీలైసెన్స్ చేసారు. పిగ్ ఐరన్, ఎయిర్ కంప్రెషన్, ఇంటర్నల్ కంబషన్ ఇంజన్‌లు మొదలయిన ఎంఆర్‌టిపి/ఫెరా కంపెనీలుగా ఉన్న 22 పరిశ్రమలను వెనుకబడిన ప్రాంతాలలో స్థాపించేందుకు సంసిద్ధులయితే డీలైసెన్స్ చేసారు. ఏడాదికి ఒక వంతుగా యథావిధిగా సామర్థ్యం విస్తరించేందుకు అనుమతించారు.

ఎగుమతులను ప్రోత్సహించి సాంకేతికతను ఆధునికం చేసేందుకు వ్యాపార ఆటంకాలను తగ్గించారు. కాపిటల్ సరుకుల, ముడి పదార్థాల, సాంకేతికతల దిగుమతిని సరళీకరించారు. కార్పొరేట్ ప్రాజెక్టుల కోసం కాపిటల్ గూడ్స్ విషయంలో కస్టమ్స్ సుంకాలను 105 శాతం నుంచి 45 శాతానికి తగ్గించారు, విద్యుత్తు ధరలు 25 శాతం తగ్గించారు, ఎరువుల కర్మాగారాలకు కస్టమ్స్ సుంకాన్ని మొత్తంగానే రద్దు చేసారు. ఇనప లోహం, పత్తి మొదలయిన అనేక సరుకులపై ఎగుమతి డ్యూటీలు తొలగించారు. ఎగుమతుల మీద లాభాలపై 50 శాతం పన్ను మినహాయింపు ఇచ్చారు.

ఈ రకంగా నూతన ఆర్థిక విధానాలు కంట్రోల్స్‌ను తొలగించడమో, సరళీకరించడమో చేసి ప్రైవేటు రంగాన్ని విస్తరించాయి, ప్రభుత్వ రంగానికి బడ్జెట్ మద్దతును తగ్గించడమో తొలగించడమో చేసాయి, ప్రణాళికా ప్రక్రియను బలహీనపరచాయి, మార్కెట్ శక్తుల పాత్ర పెరిగేందుకు దోహదం చేసాయి. ప్రభుత్వ రంగ పెట్టుబడి వాటా ఆరో ప్రణాళికలో 53 శాతం నుంచి ఏడో ప్రణాళికలో 46 శాతానికి తగ్గింది.

బడా వ్యాపారం, విదేశీ ఎంఎన్‌సీలూ, టీఎన్‌సీలూ మూడు రకాలుగా లాభపడ్డాయి –

1. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోతుండడం, నిరుద్యోగం పెరుగుతుండడం పారిశ్రామిక ఉత్పత్తుల వేతన ఖర్చులు పెరగకుండా నిరోధించేందుకు తోడ్పడ్డాయి.
2. కంట్రోల్స్‌ను, పారిశ్రామిక లైసెన్సింగ్‌నూ సరళీకరించడం ఉత్పత్తి మార్కెట్‌లపై గుత్త సంస్థల అదుపును బలోపేతం చేసింది. దీంతో అంబానీ (రిలయన్స్), చిదంబరం వంటి బడా పారిశ్రామికవేత్తలు అధిక లాభాలు గడించారు. 1981 నుంచి 1988–89 వరకు ఏడు సంవత్సరాలలో రిలయన్స్ ఆస్తులు 12 రెట్లు పెరిగితే చిదంబరం ఆస్తులు 24 రెట్లు పెరిగాయి.
3. విదేశీ పెట్టుబడితో పెరుగుతున్న కుమ్మక్కుతో భారత బడా వ్యాపారానికి అదనపు

బలం, నూతన ఉత్పత్తులకు, సాంకేతికతలకూ అవకాశం లభ్యమయ్యాయి.

ఫలితంగా 1980వ దశాబ్దంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం అంటే స్టాగ్‌ఫ్లేషన్ బాగా పెరిగిపోయింది. పలు పరిశ్రమలు దివాలాతీసాయి. ఆర్థిక సంక్షోభం, వ్యాపార లోటూ తీవ్రంగా పెరిగాయి.

పారిశ్రామిక తయారీ ఉత్పత్తుల ధరలు 1980లలో సంవత్సరానికి సగటున 9 శాతం రేటున పెరిగాయి. వ్యవసాయోత్పత్తుల వ్యాపారంలో నియమాలు సడలించడంతో రైతుల ఉద్యమాలలో ఒక వెల్లువ వచ్చింది.

శ్రమశక్తి వార్షికంగా 2.3 శాతం పెరుగగా, మొత్తంగా, సంఘటిత రంగంలో ఉపాధి వార్షిక పెరుగుదల రేటు 1973-78లో 2.5 శాతం నుంచి 1983-88 కాలంలో 1.4 శాతానికి పడిపోయింది. పరిశ్రమలు దివాలాతీయడం, మూసివేతలు, లాకౌట్‌లు సంఘటిత రంగంలో ఉపాధి పెరుగుదలలో క్షీణతకు దారితీసాయి. వ్యవసాయంలో క్యాజువల్ కార్మికుల సంఖ్య పెరిగింది. తయారీ, నిర్మాణం, రవాణా, నిలవ, కమ్యూనికేషన్ రంగాలలో ఉపాధి అసంఘటిత రంగానికి మారింది. తయారీ రంగం ఉపాధిలో అసంఘటిత రంగ వాటా 1972-73లో 67 శాతం నుంచి 1987-88లో 76 శాతానికి పెరగగా రవాణా రంగంలో అదే కాలంలో 24 శాతం నుంచి 51 శాతానికి పెరిగింది. క్రోడీకరించి చెప్పాలంటే, 1980లలో మొత్తంగా ఉపాధి పెరుగుదల వేగం తగ్గింది. ఉపాధి వ్యవసాయం నుంచి వ్యవసాయేతర రంగానికి, సంఘటిత రంగం నుంచి అసంఘటిత రంగానికీ, పర్మనెంట్ నుంచి క్యాజువల్ పనికీ మారింది. 1980 నుంచి 1988 కాలంలో దివాలాతీసిన భారీ యూనిట్‌లు 187 శాతం (409 నుంచి 1,172 వరకు) పెరిగాయి; దివాలాతీసిన చిన్న ఖాయిలా యూనిట్‌లు తొమ్మిది రెట్లు (23,000 నుంచి 2.17 లక్షలు) పెరిగాయి. చట్టబద్ధ ఆంక్షలను తప్పించుకోవడం కోసం బడా వ్యాపార సంస్థలు ఉత్పత్తిని నూతన ప్రాంతాలకు మార్చడం, ఉత్పత్తిని ఉపకాంట్రాక్ట్‌కు ఇవ్వడం, ఉద్యోగులను తొలగించడం, స్వచ్ఛంద పదవీ విరమణ పథకాలు అమలు చేయడం, బదిలీ చేయడం మొదలయిన పలు చర్యలకు పాల్పడడంతో పరిశ్రమల మూసివేత పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా 300 లేదా అంతకు మించి కార్మికులు ఉన్న ఏ ఫాక్టరీ మూసివేయకూడదనే 1976లో ప్రభుత్వ నిబంధనకు భిన్నంగా బడా వ్యాపారం, విదేశీ కంపెనీలూ పలు ఫాక్టరీలను మూసివేసాయి. వీటన్నింటితో నిరుద్యోగం భయానక స్థాయికి చేరుకుంది. 1987-88లో 43వ రౌండు నేషనల్ సాంపుల్ సర్వే 1.24 కోట్ల మంది నిరుద్యోగులు ఉన్నారని అంచనా వేసింది.

1980లలో వ్యాపార, రెవెన్యు లోటులు కూడా తీవ్రంగా పెరిగాయి. 1979 వరకు వ్యాపార లోటు మూడు వేల కోట్ల రూపాయల కంటే తక్కువగా ఉన్నది. ఇది 1980-85 కాలంలో

ఐదు వేల కోట్ల రూపాయల నుంచి ఆరు వేల కోట్ల రూపాయలకు, ఎగుమతుల పెరుగుదల భారీగా ఉన్నప్పటికీ – 1985 తరువాత ఎనిమిది వేల కోట్ల నుంచి పది వేల కోట్ల రూపాయలకు పెరిగింది.

1989–90లో కరెంట్ అకౌంట్ లోటు 11 వేల కోట్ల రూపాయలు ఉన్నది. అదే సమయంలో 1985–90 కాలంలో ఎగుమతులు సంవత్సరానికి 16 శాతం, 1989–90లో అధికంగా 35 శాతం రేటుతో పెరిగాయి. అయితే రూపాయి మారకపు విలువ స్థిరంగా పడిపోతూ ఉండడం వల్ల, దిగుమతులు వేగంగా పెరగడం వల్ల వ్యాపార లోటు తీవ్రంగా పెరిగింది. రూపాయి మారకపు విలువ 1985–90ల మధ్య కాలంలో డాలరుకు 12.36 రూపాయల నుంచి 17.50 రూపాయలకు క్షీణించింది. ఏడో ప్రణాళికా కాలపు వ్యాపార లోటు లక్ష్యం నాలుగు వేల కోట్లు కాగా ప్రణాళిక చివరి సంవత్సరం (1989–90)లో 14 వేల కోట్ల రూపాయలకు చేరుకుంది.

వ్యాపార లోటు తీవ్ర పెరుగుదలకు మూడు రకాల కారణాలు ఉన్నాయి –

1. 1980ల నాటి దిగుమతి సరళీకరణ విధానం కారణంగా దిగుమతులు బాగా పెరిగాయి. కాపిటల్ గూడ్స్, కాంపోనెంట్స్, విడి భాగాలు, ముడి పదార్థాలు, అంటే నాన్ బల్క్ దిగుమతులు 1985–86లో తొమ్మిది వేల కోట్ల (యావత్తు దిగుమతులలో 45 శాతం) నుంచి 1989–90లో 21 వేల కోట్ల (యావత్తు దిగుమతులలో 60 శాతం)కు పెరిగాయి. సరళీకరణ విధానాల వలన ఎగుమతి చేసే ఉత్పత్తులు పెరగడం కాక దిగుమతులపై ఆధారపడిన సంపన్నవర్గాల వినిమయ సరుకుల ఉత్పత్తులు పెరిగాయి. మొత్తంగా చూసుకున్నప్పుడు 1985 తరువాతి కాలంలో సరళీకరణ విధానం, పారిశ్రామిక మదుపుల కార్యక్రమం – రెండూ కాపిటల్ ఇంటెన్సివ్ (పెట్టుబడిపై అధికంగా ఆధారపడిన), ఇంపోర్ట్ ఇంటెన్సివ్ (దిగుమతులపై అధికంగా ఆధారపడిన) పారిశ్రామిక ఉత్పత్తికి దారితీసాయి. ఇది 1990 నాటికి తీవ్రమైన చెల్లింపుల సంక్షోభానికి దారితీసింది.
2. విదేశీ రుణ భారం కూడా వ్యాపార లోటుకు కారణమయింది. విదేశీ రుణాల చెల్లింపులు 1980ల మధ్య కాలంలో ఎగుమతుల నుంచి వచ్చే ఆదాయంలో 18 శాతం నుంచి 1989లో 30 శాతానికి పెరిగాయి.
3. ప్రభుత్వ ఖాతాలలో దిగుమతుల ఖాతా ముఖ్యంగా ఆయుధాల దిగుమతుల ఖాతా భారీగా పెరిగింది. 1985–1988 మధ్య కాలంలో 18 బిలియన్ డాలర్ల విలువ గల సైనిక సామగ్రిని దిగుమతి చేసుకున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రెవెన్యూ లోటు మొట్టమొదట 1980లో ప్రారంభమై ప్రతి సంవత్సరం

పెరుగుతూ వచ్చింది. ఒక పక్క కార్పొరేట్ పన్ను, ఆస్తి పన్ను, వ్యక్తిగత ఆదాయ పన్ను మొదలయిన వాటిలో భారీ రాయితీలు, మరో పక్క రక్షణ, నిర్వహణలపై, వడ్డీ చెల్లింపుల కోసం ప్రభుత్వ ఖర్చులో తీవ్ర పెరుగుదలా దీనికి కారణాలు.

ఈ విధంగా 1991 నాటికి సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ రెండో దశ ప్రారంభం నాటికి భారత ఆర్థిక వ్యవస్థ మరింతగా ప్రపంచ పెట్టుబడి సంచయనం అవసరాలకు అనుగుణంగా మారింది. అది దేశ ప్రయోజనాలను పూర్తిగా సామ్రాజ్యవాదానికి అమ్మివేయడానికీ సర్వసిద్ధమయి ఉంది.

## అర్ధ భూస్వామ్య స్థితి:

అర్ధ భూస్వామ్యం అంటే భూస్వామ్య వ్యవస్థ గర్భంలో వేరు వేరు స్థాయిలలో పెట్టుబడిదారీ సంబంధాలు అభివృద్ధి చెందినప్పటికీ అవి ఇంకా పూర్తి స్థాయిలో అంటే మౌలికంగా పెట్టుబడిదారీ సంబంధాలుగా అభివృద్ధి చెందలేదని, కనుక అది అర్ధ భూస్వామ్య సంబంధాలు కొనసాగుతోన్న వ్యవస్థ అని అర్థం.

భూమి పునఃపంపిణీ (భూసంస్కరణల) కార్యక్రమాన్ని తుంగలో తొక్కిన భారత దోపిడీ, పాలకవర్గాలు, వ్యవసాయంలో బ్రిటీషు కాలం నాటి అర్ధ ఫ్యూడల్ సంబంధాలను మౌలికంగా మార్చకుండా అలాగే ఉంచి సామూహిక అభివృద్ధి కార్యక్రమాలు, ఐఎడిపి, సహకార సంఘాలు, 'హరిత విప్లవం' మొదలైన ప్రత్యామ్నాయ మార్గాలలో వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించే కార్యక్రమాలను చేపట్టి ఎలా విఫలమైనారో చూసాం. అయితే ఈ కార్యక్రమాలు గ్రామ పంచాయితీల స్థాయి నుండి భూస్వామ్య ఆధిపత్యాన్ని పునఃసంఘటితం చేయడానికి వారికి తోడ్పడ్డాయి. ఇందులో నుండి నూతన భూస్వామ్య శక్తులు, నూతన దోపిడీ రూపాలు ముందుకు వచ్చాయి. ఈ నూతన శక్తులలో పరివర్తన చెందిన పాత భూస్వామ్య శక్తులతో పాటు, పార్లమెంటరీ పార్టీల స్థానిక నాయకులు, పంచాయితీ సంస్థల అధ్యక్షులు–సభ్యులు, సహకార సంఘాల డైరెక్టర్లు, కుల పెద్దలు ప్రధానంగా పీడక కులాల, మధ్య కులాల పెద్దలతో పాటు సామాజిక, మతపరమైన సంస్థల పెద్దలు మొదలైనవారు ఉన్నారు. దేశంలోని ఆయా ప్రాంతాల్లోని కుల సంపుటిని బట్టి వీరిలో అత్యధికులు పీడక కుల నేపథ్యం నుంచి వచ్చినవారే అయినప్పటికీ, కొంత తక్కువ లేదా ఎక్కువ మంది వెనుకబడిన కులాల నుంచి, దళితులలోని ఉన్నతవర్గాల నుంచి వచ్చిన వారు చాలా తక్కువ మంది ఉన్నారు. ఈ పాత, కొత్త భూస్వామ్య శక్తుల చేతుల్లో భూస్వామ్య ఆధిపత్యం కేంద్రీకృతమైంది. పాత కులాధారిత–భూస్వామ్య దోపిడీ, పీడన రూపాల స్థానంలో నూతన రూపాలు ముందుకు వచ్చాయి.

పాత, కొత్త భూస్వామ్య దోపిడీ పద్ధతులను, రూపాలను కొనసాగిస్తున్న/చేపట్టిన కొద్దిమంది భూస్వాముల చేతుల్లో భూమి కేంద్రీకరించి ఉండడం, దానితో పాటు వడ్డీ వ్యాపారం, పంటల

వ్యాపారం, రాజకీయాధిపత్యం భారత గ్రామీణ ప్రాంతంలో అర్ధ భూస్వామ్య సంబంధాలకు అత్యంత ముఖ్యమైన వ్యక్తీకరణ కాగా ఇతరమైనవి కూడా ఉన్నాయి. కులాధారిత–భూస్వామ్య వ్యవస్థ ఇందులో ప్రధానమైంది. ఇందులో బడా భూస్వాములు సాధారణంగా పీడక కులాల వారు కాగా, భూమిలేని రైతులు పీడిత కులాలకు చెందినవారు. వీరికి భూమిలేకుండా చేసేందుకు కుల వ్యవస్థను ఉపయోగించుకున్నారు. వీరు నామమాత్ర వేతనాలతో భూస్వాముల వద్ద చాకిరీ చేసేవారు. చాలా సందర్భాలలో వేతనాలు డబ్బు రూపంలో చెల్లించబడేవి కావు. వారు చేసే గొడ్డుచాకిరికి ధాన్యం/బియ్యం లేదా దయతో పట్టెడన్నం పెట్టేవారు.

1970ల తర్వాత నూతన భూస్వామ్య శక్తులు పలు వనరులను ఉపయోగించుకొని నూతన దోపిడీ రూపాలను అనుసరించాయి. చాలా సందర్భాలలో పాత భూస్వాముల మాదిరిగా వీటి చేతిలో అంతగా భూమి లేదు, భూమి ప్రధాన దోపిడీ సాధనంగా లేదు. కానీ వీటి చేతిలో గ్రామీణ ఆస్తిలో 60 శాతం పైగా ఉండేది. బ్యాంకులు, ఇతర సంస్థల నుంచి దాదాపు సగం రుణాలు వీటికే దక్కేవి. ఈ నూతన శక్తులు పలు రూపాలలో తమ దోపిడీని కొనసాగించేందుకు ఒక సంక్లిష్ట పార్టీ–సహకార సంస్థ–పంచాయితీ–పోలీసు వ్యవస్థను గ్రామ స్థాయి నుంచి అభివృద్ధి చేసాయి. పేద, సన్నకారు రైతాంగంలో చాలా చిన్న ముక్కలుగా భూమిని విభజించబడి ఉండడం వలన కుటుంబ శ్రమపై ఆధారపడి రైతాంగం వ్యవసాయ కార్యక్రమాలు నిర్వహించడం; భూమిని కౌలుకు తీసుకోవడం; రుణాలు ఇవ్వడం ద్వారాను లేదా భూస్వాములు రైతాంగం నుంచి, భూమిలేనివారి నుంచి చెల్లింపులు లేని శ్రమ సేవల రూపంలో అదనపు విలువను దోపిడీ చేయడం; చిన్న రైతుల, కౌలుదారుల నిరంతర రుణగ్రస్తత, పేద కౌలుదారుకు మార్కెట్ అందుబాటులో లేకపోవడం; ఉత్పత్తి సాధనాలను మెరుగ్గా ఉపయోగించనీయకుండా వడ్డీ వ్యాపారీ పెట్టుబడి నిరోధించడంతో వ్యవసాయ రంగంలో నికర పెట్టుబడిని ఆటంకపరచడం; వ్యవసాయంలో మిగులును తిరిగి పెట్టుబడిగా పెట్టకపోవడం; ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని ఆటంకపరిచే కుల పెత్తందారీ వ్యవస్థ, విలువల వ్యవస్థ సంప్రదాయ సామాజిక వర్గీకరణ రూపంలో ఉండడం; సామాన్య సరుకుల ఉత్పత్తితో పాటు సహజ ఆర్థిక వ్యవస్థ లేదా ద్రవ్యేతర (నాన్–ఫైనాన్స్) రంగం కూడా ఉండడం; అత్యధిక జనాభా జీవనోపాధి కోసం వ్యవసాయం పైననే ఆధారపడి ఉండక తప్పని పరిస్థితి నెలకొని ఉండడం – ఇవన్నీ పెట్టుబడిదారీ విధానానికి ఆటంకాలుగా తయారయ్యాయి.

1980ల రెండవ భాగం నుంచి ఎల్‌పీజీ మొదటి దశలో భాగంగా పెరిగిన ద్రవ్య పెట్టుబడి దాడి ప్రభావం వ్యవసాయంపై తీవ్రంగా పడింది. భూమి నూతన ఫ్యూడల్ తరహాలో రాజ్యం వద్ద, దేశ–విదేశీ కార్పొరేట్ కంపెనీల వద్ద కేంద్రీకరించబడడం కనపడుతుంది. ఫలితంగా వ్యవసాయ కూలీ, పేద రైతుల సంఖ్య పెద్దెత్తున పెరిగింది. వ్యవసాయాధారిత పరిశ్రమల విధ్వంసం పెరిగింది. గ్రామాలలో ప్రభుత్వ, ప్రభుత్వేతర 'పార్టీ–సహకార సంస్థ–పంచాయితీ–

పోలీసు' వ్యవస్థలు కుమ్మక్కై నూతన భూస్వామ్య శక్తులు అభివృద్ధి చెందడానికి ద్రవ్య పెట్టుబడి కీలకమైన పాత్ర పోషించింది. ఈ నూతన భూస్వామ్య శక్తులు ద్రవ్య పెట్టుబడితో కుమ్మక్కు కావడం ద్వారా ఈ కాలంలో కాంట్రాక్టు/కార్పొరేట్ వ్యవసాయానికి బీజాలు పడ్డాయి.

మొత్తంగా చూసినప్పుడు, 1947-1990 మధ్య కాలంలో వ్యవసాయంలో అర్ధ భూస్వామ్య సంబంధాలు భారత ప్రజలను ఎలా కుంగదీసాయో ఒక్కొక్కటిగా విశ్లేషిద్దాం:

**1) భూకేంద్రీకరణ:** ఉత్పత్తి సాధనాల్లో భూమి ప్రధానమయినది. కోట్లాది మంది ప్రజల జీవనానికి ఆధారమైనది. భూమి అభివృద్ధికి పునాది. దేశంలో మొత్తం సాగు భూమి 1970-71లో 16.21 కోట్ల హెక్టార్లు ఉండగా, 1980-81లో 16.38 కోట్ల హెక్టార్లుగా, 1990-91లో 16.56 కోట్ల హెక్టార్లుగా ఉన్నది. భూ సంస్కరణలు అమలు చేసామని ప్రభుత్వం చెప్పుకుంటున్నప్పటికీ, అత్యధిక భాగం భూమి భూస్వాముల, ధనిక రైతుల వద్ద, నూతన ఫ్యూడల్ తరహాలో రాజ్యం వద్ద, దేశ-విదేశీ కార్పొరేట్ కంపెనీల వద్ద కేంద్రీకరించబడి ఉన్నది. గ్రామీణ కుటుంబాల్లో అగ్రభాగాన ఉన్న 5.2 శాతం కుటుంబాలు 56.6 శాతం భూమిని కలిగి ఉన్నాయి. 41.6 శాతం గ్రామీణ కుటుంబాలకు భూమి అసలే లేదు (జాతీయ శాంపిల్ సర్వే రిపోర్ట్ నవంబర్ 4, 1990 ప్రకారం). ఈ గణాంకాల వివరాలు భూమికి సంబంధించిన అసమానతలను, భూమి కేంద్రీకరణను తెలుపుతున్నాయి.

1970-71లో 28 లక్షల గ్రామీణ కుటుంబాల వద్ద (యావత్తు వ్యవసాయ కుటుంబాలలో 3.9 శాతం వద్ద) ఐదు కోట్ల హెక్టార్ల లేదా 12.5 కోట్ల ఎకరాల భూమి ఉన్నది. 1980-81 నాటికి 22 లక్షల కుటుంబాల వద్ద (2.4 శాతం కుటుంబాల వద్ద) 3.77 కోట్ల హెక్టార్ల భూమి ఉన్నది. 1991లో 17 లక్షల కుటుంబాలు లేదా యావత్తు వ్యవసాయ కుటుంబాలలో 1.6 శాతం వద్ద 2.89 కోట్ల హెక్టార్ల లేదా 7.23 కోట్ల ఎకరాల భూమి ఉన్నది. రెండు దశాబ్దాలలో సగటు పెద్ద భూకమతాలలో ఎటువంటి మార్పులేదు. వీటి పరిమాణం సగటున 1970-71లో 18.1 హెక్టార్లు (45 ఎకరాలు) ఉంటే 1980-81లో 17.4 హెక్టార్లు, అంటే 43.5 ఎకరాలు, 1990-91లో 17.3 హెక్టార్లు, అంటే 43.2 ఎకరాలుగా ఉంది.

ఇవి ప్రభుత్వ అధికారిక వివరాలు మాత్రమే. వాస్తవానికి భూకేంద్రీకరణ ఇంకా ఎక్కువగా ఉన్నది. ఈ వివరాలను బట్టి చూసినా 1990-91లో వ్యవసాయ కుటుంబాలలో కింది స్థానంలో ఉన్న 59 శాతం కుటుంబాల వద్ద కంటే అగ్రస్థానంలో ఉన్న 1.6 శాతం వద్ద ఎక్కువ భూమి ఉన్నది. 1.6 శాతంగా ఉన్న 17లక్షల వ్యవసాయ కుటుంబాల వద్ద 2.89 కోట్ల హెక్టార్లు ఉండగా, కింది స్థాయిలో ఉన్న 6.21 కోట్ల కుటుంబాలు, అంటే వ్యవసాయ కుటుంబాలలో 59 శాతం వద్ద 2.46 కోట్ల హెక్టార్లు, అంటే అగ్రస్థానంలో ఉన్న 1.6 శాతం వారి వద్ద వున్న భూమి కంటే 43 లక్షల హెక్టార్లు తక్కువగా ఉన్నది. అంటే 59 శాతం వ్యవసాయ కుటుంబాల

వద్ద సగటున ఒక్కో ఎకరం మాత్రమే ఉన్నది. మరో 7.46 కోట్ల గ్రామీణ కుటుంబాల వద్ద అసలు భూమే లేదు.

1990-91 నాటి భారతదేశంలో భూకమతాల పద్ధతి విముక్తి పూర్వ చైనాకు అంత భిన్నంగా లేదు. ఉదాహరణకు, విముక్తి పూర్వ చైనాలో 1937లో చేసిన ఒక అధ్యయనం ప్రకారం గ్రామీణ కుటుంబాలలో అతి పేదలయిన 57 శాతం వద్ద 23.5 శాతం పంట భూమి ఉండగా అతి సంపన్న 2-6 శాతం కుటుంబాల వద్ద 28.7 శాతం భూమి ఉన్నది. 1991 జనాభా లెక్కల ప్రకారం భారత దేశంలో 78 శాతం వ్యవసాయ కుటుంబాల వద్ద మొత్తం సాగుభూమిలో 32.2 శాతం భూమి ఉన్నది. అగ్రస్థానంలో వున్న 1.6 శాతం కుటుంబాల వద్ద 17.4 శాతం భూమి ఉన్నది. తమ భూములను విభజించిన బడా భూస్వాముల వద్ద ఉన్న బినామీ భూకమతాలను పరిగణలోకి తీసుకుంటే భూకేంద్రీకరణ మరింత ఎక్కువగా ఉంటుంది.

పది ఎకరాల కంటే ఎక్కువ భూమిగల కుటుంబాలను తీసుకుంటే 1970-71లో 15.1 శాతం కుటుంబాల వద్ద మొత్తం భూమిలో 60.1 శాతం ఉన్నది. 11.5 శాతం వద్ద 1980-81లో 52.6 శాతం ఉంటే, 8.8 శాతం వద్ద 1990-91లో 44.6 శాతం ఉన్నది. పది ఎకరాలకు మించి ఉన్నవారి భూకమతాల సగటు పరిమాణం 1970-71లో 12.1 హెక్టార్లు (30.25 ఎకరాలు) ఉన్నది. 1980-81లో 11.71 హెక్టార్లు (29.3 ఎకరాలు), 1990-91 11.60 హెక్టార్లు (29 ఎకరాలు) ఉన్నది.

**2) ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యవస్థల కుమ్మక్కుతో నూతన రూపాలలో పెద్దెత్తున లూటీ:** ఈ కాలంలో అర్థభూస్వామ్యంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకోవడంతో భూస్వామ్య ఆధిపత్యపు గత రూపాల స్థానంలో నూతనమైనవి వచ్చాయి. గ్రామాలలో ఇది ప్రభుత్వ, ప్రభుత్వేతర 'పార్టీ-సహకార సంస్థ-పంచాయితీ-పోలీసు' వ్యవస్థలు కుమ్మక్కైన విస్తృత-సమిష్టి రూపం తీసుకుంది. ఇది భూస్వామ్య శక్తుల, వాటి కుటుంబ సంప్రదాయ కుల-భూస్వామ్య ఆధిపత్యాన్ని ప్రత్యక్షంగా చెలాయించడం కాకుండా బహుళ గుర్తింపు పొందిన రాజకీయ 'పార్టీ గుత్తాధిపత్యం' (ఏ పార్లమెంటరీ పార్టీ అయినప్పటికీ) లేదా ఆధునిక సంస్థ (ప్రభుత్వ, ప్రభుత్వేతర) అనే సాధనాన్ని వినియోగించుకోవడం ద్వారా ఆ ఆధిపత్యాన్ని పరోక్షంగా సాధ్యమయినంత మేరకు పరిరక్షించింది, అమలు చేసింది. పాత భూస్వామ్య కుటుంబ వారసులు అధికార స్థానంలోకి – పార్టీ నాయకులుగానో, పంచాయితీ ప్రెసిడెంట్లు లేదా సహకార సంస్థ డైరెక్టర్లుగానో – మారారు. అది వారికి పుట్టుకతో వచ్చిన హక్కుగా కాక 'రాజకీయ మద్దతు'గా వ్యక్తమయ్యింది. అందువల్లనే రాజకీయ పార్టీలకు వారే అభ్యర్థులుగా, ప్రముఖ స్థానాలకు ప్రతినిధులుగా ఎన్నికయ్యారు. రాజకీయ దన్ను వల్ల మాత్రమే అధికార స్థానాలలో ఉన్న

‘తక్కువ భూస్వామ్య విలువ’ ఉన్న వ్యక్తుల విషయంలో ఇది బాగా స్పష్టంగా కనిపించింది. రాజకీయ రంగు, సొంత వర్గ, కుల నేపథ్యాలతో సంబంధం లేకుండా వారు కులాధారిత–భూస్వామ్యంలో ఉన్న సమస్త శైలులు, ఆధిపత్య వైఖరులను అవలంబించారు. అగ్రకుల హిందు భూస్వాములు, పీడక కుల క్రైస్తవులు, ముస్లింలు, తదితరులు విడివిడిగా గానీ కలిసి కానీ ఈ ‘స్థానిక గుత్తాధిపత్యం’ నెరుపుతూ వచ్చారు. రాజకీయ పార్టీలు తమ ఆధీనంలో ఉండే ప్రజా సంఘాల/సంస్థల ద్వారా; పార్లమెంటరీ ఎన్నికలలో ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీలకు, పంచాయితీ ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా; ‘సహకార సంఘం’, ‘సహకార బ్యాంకు’, ‘నీటి వినియోగదారుల సంఘం’, ‘పారిశ్రామిక సొసైటీ’, ‘పాల సొసైటీ’, సీడీపీ (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం), ఐఆర్‌డీపీ (ఇంటెగ్రేటెడ్ రూరల్ డెవెలప్‌మెంట్ ప్రోగ్రాం), టీఆర్‌వైఎస్‌ఇఎం (ట్రైనింగ్ ఆఫ్ రూరల్ యూత్ ఫర్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్), డీపీఏపీ (డ్రాట్ ప్రోన్ ఏరియా ప్రోగ్రాం), సీఆర్‌ఎస్‌పీ (సెంట్రల్ రూరల్ సానిటేషన్ ప్రోగ్రాం), సీఏడీపీ (కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం), ఎన్‌ఆర్‌ఈపీ (నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ ప్రోగ్రాం), ఆర్‌ఎల్‌ఇజీపీ (రూరల్ ల్యాండ్‌లెస్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ ప్రోగ్రాం), డ్వాక్రా (డీడబ్ల్యుసీఆర్‌ఏ–డెవలప్‌మెంట్ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ ఇన్ రూరల్ ఏరియాస్) వంటి స్వయంసహాయ గ్రూపుల ఏర్పాటు, సీఏపీఏఆర్‌టీ (కౌన్సిల్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ పీపుల్స్ యాక్షన్ అండ్ రూరల్ టెక్నాలజీ), సీఆర్‌ఐఎస్‌పీ (కంప్యూటరైజ్డ్ రూరల్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ ప్రోగ్రాం), 20 సూత్రాల కార్యక్రమం వంటి ప్రభుత్వ స్వయం–సహాయక పథకాల ద్వారా బలాన్ని కూడగట్టుకున్నాయి. వీటిలో సభ్యులుగా పేద, మధ్య తరగతుల వారు ఎక్కువ. వీటిలో పాత, కొత్త భూస్వాములు ప్రత్యక్షంగా, చురుకుగా ఉండేవారు. వీరికే వాటిపై అదుపు ఉండేది. ఇవన్నీ భూస్వాముల సాధారణ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే సంస్థలే.

నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, అర్ధ భూస్వామ్యం కలిసిన ఒక ముఖ్యమైన సంస్థాగత రూపమే సహకార బ్యాంకు. వీటికి కేంద్ర ప్రభుత్వ నాబార్డ్ (జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి బ్యాంకు–NABARD) నిధులు ఇస్తున్నది. నాబార్డ్‌కు ప్రపంచ బ్యాంకు నిధులు సమకూరుస్తున్నది. అలాగే స్థానిక దోపిడీదారులు, ముఖ్యంగా భూస్వాముల మిగులులో చెప్పుకోదగ్గ వాటా కూడా వీటిలో ఉంది. ఇలా సహకార పెట్టుబడి సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ పెట్టుబడుల, స్థానిక–అర్ధ భూస్వామ్య మిగులుల మిశ్రమం. ఈ సంస్థకు వివిధ పార్టీల తరఫున ఎన్నికైన స్థానిక దోపిడీదారులకే దానిపై అదుపు ఉంది. అది వారికి తేలిక క్రెడిట్‌కు వనరు మాత్రమే కాదు, అధికారం నెరపడానికి ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేసింది. సహకార బ్యాంకులు రావడంతో తక్షణమే సంస్థాపరమైన క్రెడిట్ సౌకర్యం, అందుబాటు పెరిగిపోయాయి. దీంతో గ్రామీణ ప్రాంతాలలో సంప్రదాయ సంబంధాల స్థానంలో పైకి ఆధునికంగా కనిపించే నూతన సంబంధాలు ఉనికిలోకి వచ్చాయి.

ఈ సహకార బ్యాంకులు రైతాంగంతో ధాన్యం వ్యాపారం పేరుతో క్రెడిట్ మీద ముడి సరుకు హస్తగతం చేసుకొని తక్కువ పెట్టుబడితో భారీ లాభాలు గడించాయి. సహకార బ్యాంకుల నుంచి పెద్దెత్తున వడ్డీలేని క్రెడిట్ దన్నుతో నిర్వహించే వ్యాపారానికీ దీనికీ ఏమీ తేడా లేదు. ధాన్యం అమ్మకం నుంచి వచ్చిన లాభంలో ఒక వాటా సహకార బ్యాంకును అదుపు చేస్తున్న భూస్వామ్య శక్తుల చేతుల్లోకి పోయేది. ఈ విధంగా సహకార పెట్టుబడిని సహకార బ్యాంకు డైరెక్టర్లు తమ హోదాను వ్యక్తిగత ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి వినియోగించుకున్నారు. ఆ హోదాను తమ సామాజిక ఆధిపత్యాన్ని స్థాపించడానికీ, విస్తరించడానికీ కూడా ఉపయోగించుకున్నారు. మరో పక్క సభ్యులందరిని ద్రవ్యపరంగా ప్రలోభపరచడానికి ఉదార బోనస్ ఇచ్చేవారు. తద్వారా గణనీయమైన మెజారిటీతో బోర్డ్ తిరిగి ఎన్నికయ్యేది. ఈ విధంగా ప్రభుత్వ ఆస్తులు/నిధుల పునాదిగా స్థానిక ఆధిపత్యం, దోపిడీల నూతన విధానం రూపొందింది.

అలాగే స్థానిక వడ్డీ సంప్రదాయ బంధనాలను సడలించడంలోను పేద, ధనిక కుటుంబాల గుమ్మాల వద్దకు వచ్చి రుణ ఏజంట్లు అందించిన తేలికైన, అసంఘటిత క్రెడిట్ ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. ఈ క్రెడిట్‌కు అంతిమ వనరు అర్ధ భూస్వామ్య వడ్డీ పెట్టుబడే. వడ్డీ ఏడాదికి 120 శాతం లేదా అంత కంటే ఎక్కువ కూడా చేరుకుంటుంది. అతి ముఖ్యమైన విషయం ఏమంటే, ఈ క్రెడిట్ సౌకర్యం పరస్పర సంబంధమైనది, తక్షణమైనది.

ఈ క్రమంలో స్థానిక అధికారాన్ని వినియోగించుకుని గ్రామీణ ప్రాంతాలలో నూతన భూస్వామ్య వర్గం ఉనికిలోకి వచ్చింది. 1970 భూసంస్కరణలలో భాగంగా కేరళ, పశ్చిమబెంగాల్‌లలో మిగులు భూమిని సమిష్టి క్షేత్రంలో సభ్యులుగా ఉంటామన్న షరతు మీద పేద, భూమిలేని రైతాంగ కుటుంబాలకు పలు ప్రాంతాలలో పంపిణీ చేసారు. అయితే ఆచరణలో వాటిలో వారి భూయాజమాన్యం లాంఛనప్రాయంగా మారింది. ఈ సమిష్టి క్షేత్రాల డైరెక్టర్ బోర్డ్‌లలోని వారంతా పేద, భూమి లేని రైతాంగ, వెనుకబడిన కులాల లేదా దళిత కుటుంబాల వారే కానీ వారికి భూమిని తమ ఇష్టప్రకారం అమ్ముకోవడానికీ ఉపయోగించుకోవడానికీ హక్కు ఇవ్వలేదు. నిజానికి సమిష్టి క్షేత్రాల పేరుతో భూయాజమాన్యంగా ముందుకు వచ్చినది పలు రూపాలలో ప్రభుత్వ నియంత్రణలో గల బోర్డ్ సభ్యుల కార్పొరేట్ భూయాజమాన్యమే. ప్రభుత్వం, దాని పెట్టుబడి దన్నుతో అవి ఈ స్థానాన్ని సంపాదించగలిగాయి. దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ యాజమాన్యానికి మరో రూపమే ఈ భూస్వామ్య విధానం. ఇది నూతన రూపంలో అసలు యజమానులు అధికార యంత్రాంగాన్ని వినియోగించుకొని అసలు శ్రమజీవుల మీద పీడక కులాధిపత్య భూస్వామ్య సంబంధాలను స్థాపించారు. అయితే వీటిలో అవినీతి పెరిగిపోయింది. అందువల్ల ఇవి పరిమితులకు గురయ్యాయి.

ఈ విధంగా భూస్వామ్య సంబంధాల, విలువల ఆధిపత్యంలో ఆధునిక పద్ధతులలో

పెట్టుబడిదారీ విధానపు అంశాలు అంతర్భాగమయ్యాయి. ఆధునిక సంస్థలుగా, పెట్టుబడిదారీ విధానపు రాజకీయ–ఆర్థిక సాధనాలుగా చెప్పబడే సహకార సంస్థలు–వాటి రుణ పెట్టుబడులు, పంచాయితీ–దాని సేవలు, పాతను నూతన రూపాలలో నిలబెట్టడం కోసమే తోడ్పడ్డాయి. వీటికి రుణాల మంజూరు చేసే లేదా నిరాకరించే అధికారం, తాకట్టు పెట్టిన దానిని స్వాధీనం చేసుకునే లేదా వాయిదా వేసే అధికారం ఉండడంతో భూస్వాములు, ఇతర స్థానిక దోపిడీదారులూ పేద, మధ్య రైతాంగం మీద ఆధిపత్య సంబంధాలను (రిలేషన్స్ ఆఫ్ పాట్రొనేజ్) రుద్దగలిగారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల కోట్ల రూపాయల బడ్జెట్‌లతో పంచాయితీలు కూడా వీరి ఆధిపత్యానికి తోడ్పడ్డాయి. ఈ విధంగా గ్రామీణ సమాజంలో వీరు ప్రజల జీవితాల మీద రాజకీయ పార్టీల పట్టును సంపాదించారు. దీంతో ప్రభుత్వం (పంచాయితీ, సహకార సంఘం కోసం, వివిధ పథకాల కోసం, ప్రాజెక్టుల కోసం, విపత్తులలో సహాయం కోసం) మంజూరు చేసే ఏ నిధులైనా వీరి చేతుల్లోకి పోయేవి. పంచాయితీలలో రేషన్ డీలర్‌షిప్ వీరి చేతుల్లోనే ఉండేది. తద్వారా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వీరు అధికారికంగాను, అనధికారికంగానూ లూటీ చేయగలిగారు.

**3) భూ విభజన:** దేశంలో రోజు రోజుకూ వ్యవసాయ సాగుభూమిలో భూకమతాల సంఖ్య పెరుగుతున్నది. కొద్దిపాటి భూములున్న చిన్న రైతుల సంఖ్య పెద్దెత్తున పెరుగుతుండడం దీనికి ప్రధాన కారణం. 1970–71లో యావత్తు భూకమతాలూ 7.1 కోట్లు ఉండగా 1980–81లో అది 8.89 కోట్లకు పెరిగింది. 1990–91లో 10.53 కోట్లకు పెరిగింది. హెక్టారు కంటే తక్కువగా కొద్ది భూమి ఉన్న రైతులు 1970–71లో 3.62 కోట్ల మంది ఉంటే, 1990–91లో 6.21 కోట్ల మంది ఉన్నారు. 1–2 హెక్టార్ల భూమి ఉన్న చిన్న రైతుల సంఖ్య యిదే కాలంలో 1.34 కోట్ల నుంచి రెండు కోట్లకు పెరిగింది.

తమ కుటుంబ శ్రమపై ఆధారపడి మార్కెట్ కోసం ఉత్పత్తి చేస్తున్న ఈ కుటుంబాలలో అత్యధికులు వ్యాపార, వడ్డీ వ్యాపార పెట్టుబడి బంధనానికి కట్టుబడి ఉన్నారు. దీనివల్ల వ్యవసాయంలో సాంకేతికతలో కానీ, నికర పెట్టుబడిలో కానీ కొన్ని మార్పులు వచ్చినప్పటికీ అవి చెప్పుకోదగిన ప్రభావాన్ని వేయలేకపోయాయి. అందువల్ల ఉత్పాదకత కింది స్థాయిలలో ఉండిపోయింది. ఆధునిక లేదా మెరుగైన ఉత్పత్తి సాధనాలు, వ్యవసాయ సాంకేతికతల వినియోగానికి నీటిపారుదల, పెట్టుబడీ లేకపోవడంతో వారు వరుస కరువులతో తీవ్రమైన పేదరికంలోకి నెట్టబడేవారు. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేకపోవడం, చిన్నపాటి భూములను పట్టుకుని ఉండడం వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం పెరుగుదలకు ఆటంకంగా మారింది. అర్ధ భూస్వామ్యాన్ని సజీవంగా నిలిపి ఉంచింది.

ఈ సందర్భంగా మార్క్స్ చెప్పిన విషయాన్ని చూద్దాం. "భూ ఆస్తి చిన్న చిన్న కమతాలుగా

విడిపోయి ఉందంటేనే జనాభాలో అత్యధిక సంఖ్యాకులు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారనీ, సామాజిక శ్రమకాక విడివిడి శ్రమలు ప్రబలంగా ఉన్నాయనీ అర్థం. అందువల్ల అలాంటి పరిస్థితులలో ఆ జన బాహుళ్యపు భౌతిక, మానసిక అవసరాలైన సంపద గానీ, పునరుత్పత్తి అభివృద్ధి గానీ అసాధ్యం, తత్ఫలితంగా హేతుబద్ధ వ్యవసాయానికి కావలసిన అవసరాలు కూడా నెరవేరవన్న మాట".

**4) రైతాంగ వర్గీకరణ:** ఒకవైపు భూకమతాలలో అత్యధికం స్వల్పమైనవిగా లేదా చిన్నపాటివిగా ఉండడం, కుటుంబ శ్రమపై ఆధారపడడం, మరోవైపు పెట్టుబడిదారీ పునాది మీద భూమి కేంద్రీకరించబడకపోవడం చూస్తే రైతాంగాన్ని గ్రామీణ కార్మికవర్గం, పెట్టుబడిదారీ వర్గం అనే రెండు ప్రధాన వర్గాలుగా విభజించడానికి ఆధారం లేదని స్పష్టమవుతుంది. ఈ విభజన కొంత మేరకు 1960ల చివరి నుంచి దేశంలో 'హరిత విప్లవ' ప్రాంతాలలో జరిగింది. అయితే దేశం మొత్తం మీద ఈ లక్షణం ప్రముఖంగా లేదు. ఇది కూడా అర్ధ భూస్వామ్య పునాది మీదనే అభివృద్ధి చెందిందనేది దృష్టిలో ఉంచుకోవాలి.

భారతదేశంలో అసలు జరుగుతున్నదేమంటే నిరంతరం ఉపాధి తగ్గిపోవడం, భూమిలేని వ్యవసాయ కూలీల (లేబర్) సంఖ్య పెరిగిపోవడం, సగటు పని దినాలు గణనీయంగా తగ్గిపోవడం. 1961లో మొత్తం రైతాంగ కూలీల సంఖ్య 24.04 శాతం. ఈ సంఖ్య 1991 నాటికి 46 శాతానికి పెరిగిపోయింది. ఇది 2001లో 57 శాతానికి చేరుకుంది. 1981-91 మధ్య మహిళా కూలీల సంఖ్య గణనీయంగా 38.15 శాతం పెరిగింది.

భారతదేశంలో కుల వ్యవస్థ ప్రధానంగా ఏ కుల-వర్గ ప్రజలు శారీరక శ్రమ చేయాలి, వీరిలో ఎవరెలాంటి శ్రమ చేయాలి, ఎవరు శారీరక శ్రమ చేయకూడదు అనేది నిర్ధారిస్తుంది. భూస్వామ్య ఉత్పత్తి సంబంధాలకు ప్రాతినిధ్యం వహిస్తూ దళితులలో, ఆదివాసులలో 81 శాతం మంది వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉనికిలో ఉన్న ఈ కుల ఆధారిత సమాజం పెట్టుబడిదారీ విధాన సాధారణ అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా ఉంది.

అత్యధిక గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ కనీస వేతనాల చట్టం అమలులోకి రాకుండా భూస్వామ్య శక్తులు అడ్డుకున్నాయి. వ్యవసాయ కూలీలు వెట్టి కూలీలుగా పనిచేసేవారు. ముందే చెప్పినట్లుగా ఇందులో అత్యధికులు కింది కులాల వారు ప్రత్యేకించి దళితులే. వారికి అతితక్కువ వేతనాలు ఇచ్చేవారు. వేతనంగా డబ్బు రూపంలో చెల్లించడం క్రమంగా పెరిగినప్పటికీ, చాలా చోట్ల ధాన్యం/బియ్యం లేదా పట్టెడన్నం పెట్టేవారు. వ్యవసాయ కూలీల పని గంటల విషయంలో ఎటువంటి ఖచ్చితమైన నియమం లేదు. అనేక చోట్ల రోజుకు 10 నుంచి 12 గంటల పాటు వారు పని చేసేవారు. వారికి భూమి లేకపోవడమే మౌలికంగా ఈ దయనీయ స్థితికి కారణమని స్పష్టమవుతుంది.

పెద్ద సంఖ్యలో శ్రామిక సైన్యం ఉనికిలో ఉండడం వల్ల పరిశ్రమల్లో, వ్యవసాయంలో రెండింటిలో పెట్టుబడిదారీ శ్రమకి పరిమితి ఏర్పడుతున్నది. వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అయినప్పుడు నిరాటంకంగా శ్రామిక శ్రమను అమ్మడానికి అది అనుకూలమైన సంబంధాలను తప్పనిసరిగా నిర్మాణం చేయాలి. పెట్టుబడి మదుపు స్థిరంగా అభివృద్ధి చెందడంపై ఇది ఆధారపడి ఉంటుంది. భారత వ్యవసాయంపై పరిశోధనల ప్రకారం వ్యవసాయ కూలీల సంఖ్య పెరుగుదలకూ, వ్యవసాయంలో పెట్టుబడి మదుపుకు మధ్య పరస్పర అనుకూల సంబంధం లేదు. రెండవది, ఉత్పత్తి పెరుగుదల రేటుకూ, వ్యవసాయ కూలీల సంఖ్య పెరుగుదలకు మధ్య ఎటువంటి స్పష్టమైన సంబంధం మనకు కనపడడం లేదు. ఇందుకు భిన్నంగా, గ్రామీణ భారతదేశం వెట్టిచాకిరితో పాటు వివిధ రకాల వ్యవసాయ కూలీల చిత్రాన్ని ఇస్తున్నది. ఇక్కడ వ్యవసాయంలో పెట్టుబడిదారీ అర్థంలో స్వేచ్ఛా కార్మికులు ఉండడం అనేది ప్రముఖ లక్షణంగా లేదు.

**5) కౌలు వ్యవసాయం కొనసాగడం:** 1947-90 వరకు కౌలు నిర్మూలనా చట్టాలు, ఇతర సంస్కరణ కార్యక్రమాలు రూపొందించినప్పటికీ అవి యేవీ చాలా వరకు అమలుకు నోచుకోలేదు. అనేక మంది కౌలుదారుల, ఉప కౌలుదారుల, పాలు వ్యవసాయదారుల (షేర్ క్రాపర్‌ల) హక్కులను కాలరాస్తూ దేశంలో అన్ని రాష్ట్రాలలో కౌలు వ్యవసాయం యింకా బహిరంగంగా నగ్నంగా, ఘోరంగా కొనసాగింది. 'వ్యక్తిగత సాగు' పేరుతో భూస్వాములు కౌలుదారులను ఖాళీ చేయించడం దేశవ్యాప్తంగా స్పష్టమైన లక్షణంగా ఉంది. విస్తారమైన నీటిపారుదల ఉన్న సారవంతమైన ప్రాంతాలలో అధిక కౌలు (ధాన్యం రూపంలో లేదా డబ్బు రూపంలో కౌలు) ఉంది. క్రమంగా పలు ప్రాంతాలలో డబ్బు రూపంలో కౌలు చేయడం పెరిగినప్పటికీ ధాన్యం రూపంలో కౌలు ఎక్కువగా కొనసాగింది. నిజానికి కౌలు సంస్కరణ చట్టం కొన్ని కౌలు రూపాలను మరుగుపరిచింది. ఈ "ముసుగులో ఉన్న కౌలు" కౌలు నియమాలను, పరిస్థితులను మరింత క్షీణింపజేసింది. ఈ దాగివున్న లేదా అసంఘటిత కౌలు పద్ధతులలో పాలు వ్యవసాయంతో పాటు అనేక రకాల ఏర్పాట్లు ఉన్నాయి. అయితే అవి కౌలుగా నమోదు కాలేదు. నియమించుకున్న శ్రమ ద్వారా సాగు చేస్తున్నట్టుగా పైకి కనిపించే ఈ రూపాలు చట్టం ఇచ్చిన కౌలు హక్కులను ఉల్లంఘించాయి.

దేశంలో యావత్తు కౌలు వ్యవసాయంలో అత్యధికులు సాధారణ కౌలుదారులు, ఉప కౌలుదారులు, పాలు వ్యవసాయదారులుగా ఉన్నారు. అసంఘటిత లేదా పరోక్ష ఉప కౌలు చట్టవిరుద్ధంగా పాలు వ్యవసాయం ద్వారా కొనసాగింది. ఈ రకంగా పాలు వ్యవసాయం (షేర్ క్రాపింగ్) పెట్టుబడిదారీ పూర్వ, అర్ధ భూస్వామ్య వ్యవసాయ సంబంధాల నిర్దిష్ట రూపంగా కొనసాగేది.

పేద రైతాంగం, మధ్యతరగతి రైతాంగంలో ఒక సెక్షన్ భూములు కోల్పోయి భూమికి, ఇతర ఉత్పత్తి సాధనాలకూ దూరమయిపోయినప్పటికీ వారు వ్యవసాయ కార్మికులు గానో గ్రామీణ కార్మిక వర్గంగానో మారలేదు. పాలు వ్యవసాయదారులుగా (షేర్ క్రాపర్‌లు)గా అదే భూమికి కట్టుబడిపోయారు. నాగలి వంటి కొన్ని ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం కలిగి వుండేవారు. ఉత్పత్తి ఖర్చులో కొంత భాగాన్ని పంచుకున్నారు. ఇది పెట్టుబడిదారీ పూర్వ ఆస్తి సంబంధం ఒక లక్షణం. తీవ్రమైన పేద స్థితి వల్ల పాలు వ్యవసాయదారులు తమ పంటను ముందుగానే అమ్ముకుని బతికేవారు లేదా భూయాజమానుల, వ్యాపారుల, ధాన్యం డీలర్ల నుంచి ఆహార ధాన్యాలను, డబ్బును అడ్వాన్స్‌గా తీసుకునేవారు. ఈ నూతన రుణాలతో రైతాంగం తమ తరువాత పంటను కూడా వదులుకోవలసి వచ్చేది. ఒక విషవలయంలో చిక్కుకుని అందులో నుంచి బయటపడడం వారికి అసాధ్యం అయ్యేది. తమ భూములకు వారు కట్టుబడి ఉండేవారు, అర్ధ భూస్వామ్య దోపిడీ, వ్యాపార–వడ్డీ వ్యాపార దోపిడీ – ఈ రెండు విభిన్న రూపాల దోపిడీకి గురి అయ్యేవారు.

భారతదేశంలో కొన్ని ప్రాంతాలలో ఉన్న స్థిర కౌలు వ్యవస్థ వంటి ఇతర అంశాలు కూడా ఉత్పత్తి మెరుగుదలను ఆటంకపరిచేవి. ఎందుకంటే కౌలుదారుని ఆర్థిక పరిస్థితిలో ఎటువంటి మెరుగుదల ఉన్నా భూస్వామి కౌలును పెంచేవాడు.

దేశంలో ఆనాటి కౌలు పద్ధతులను క్రోడీకరించాలంటే అత్యధిక కౌలు సాధారణంగా 50 శాతానికి పైగా ఉండేది. అదనపు శ్రమను గానీ అదనపు ఉత్పత్తులను గానీ మొత్తంగా దోచుకునేవారు. భూమి కేంద్రీకరించబడి ఉండడం, దున్నేవారికి భూమి లేకపోవడం, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేకపోవడంతో భూమిపై ఉండే అధిక ఒత్తిడుల కారణంగా దేశంలో అసలు కౌలు సాధారణంగా అర్ధ భూస్వామ్య పద్ధతిలో ఉండేది. భూమిపై నియంత్రణ దోపిడీకి వనరు కావడమే దీనికి కారణం.

**6) భూస్వామ్య దోపిడీ ఇతర రూపాలు:** భారతదేశంలో రైతాంగంపై ఉన్న భూస్వామ్య దోపిడీ వివిధ రూపాలు తీసుకున్నది. వెట్టి, జీతానికి ఉండడం, ఇతర రూపాలలో స్వేచ్ఛలేని శ్రమ లేదా అనుబంధ శ్రమ, నగదు రూపంలో కానీ ధాన్యం రూపంలో గానీ భూస్వామ్య కౌలు, వర్తకుడు లేదా వడ్డీ వ్యాపారి ఇచ్చే అప్పుపై అత్యధిక వడ్డీ, వర్తకులు వ్యవసాయ ఇన్‌పుట్లను (హైబ్రిడ్ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పనిముట్లు వగైరా) రైతులకు అతి ఎక్కువ ధరకు అమ్మడం, పంటలను అతితక్కువ ధరకు కొనడం వంటి ఇతర ఆర్థికేతర దోపిడీ రూపాలు ఉన్నాయి. పేద రైతాంగం వివిధ కారణాల రీత్యా ఒకే భూస్వామికో లేదా కొద్ది మంది భూస్వాములకో కట్టుబడి ఉండేవారు. వారు రుణాలు తిరిగి చెల్లించేందుకు ఈ భూస్వాములకు శ్రమ సేవలు అందించేవారు. అనేక సందర్భాలలో యజమానులు వెట్టి

కూలీలకు ఇళ్ల స్థలాలు, ఒక్కోసారి నామమాత్రపు కౌలు లేదా కౌలు లేకుండానో పాలు వ్యవసాయం పునాది మీదనో భూమి ఇచ్చేవారు.

భూస్వామి, వర్తకుడు, వడ్డీ వ్యాపారి కుమ్మక్కై (చాలా సందర్భాల్లో ఒక్కరే ఈ మూడు పాత్రలు పోషిస్తూ నూతన భూస్వామ్య శక్తులుగా అవతరించారు) రైతాంగం జీవితంతో ఆడుకునేవారు.

రుణదాతలపై అనివార్యంగా ఆధారపడడం వల్ల పేద రైతాంగం కోతలు ముగియగానే తమ ఉత్పత్తిని వారికే అమ్ముకునేవారు. చాలా ప్రాంతాలలో స్థానిక వడ్డీ వ్యాపారులు దేశ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు ఏజెంట్లు (డీలర్లు/డిస్ట్రిబ్యూటర్లు)గా చేసేవారు. వ్యవసాయ ఇన్‌పుట్లను అమ్మేటప్పుడే తాము నిర్ణయించిన (తక్కువ ధర)కు పంటలు తమకే అమ్మాలనే ముందస్తు కాంట్రాక్ట్ ప్రాతిపదిక మీద రుణాలు ఇచ్చేవారు. దాంతో రైతాంగం భవిష్యత్తు పంటలను అమ్ముకోవలసి వచ్చేది. రైతులు తమ వినిమయ అవసరాలకోసం తిరిగి ఆహార ధాన్యాల రూపంలో గానీ, డబ్బు రూపంలో గానీ అధిక వడ్డీ రేట్లతో తాజా రుణాలు తీసుకోవలసి వచ్చేది. దీనివల్ల తమ ఉత్పత్తికి గిట్టుబాటు ధరలు లభ్యం కాకపోవడమే కాకుండా, పంటలు సరిగా పండనప్పుడు సకాలంలో రుణాలు చెల్లించలేక వారు వడ్డీ వ్యాపారులకు తమ భూములను కూడా కట్టబెట్టేవారు. తర్వాత ఎటూ పోలేక కౌలుదారులుగా మారిపోయేవారు లేదా మరో భూస్వామితో మరింత అవమానకరమైన భూస్వామ్య దోపిడీ సంబంధాలలోకి ప్రవేశించేవారు.

జాతీయ బ్యాంకుల నుంచి సంస్థాగతమైన రుణం గ్రామీణ ఉన్నత వర్గం వడ్డీ, వ్యాపార కార్యకలాపాల ద్వారా గ్రామీణ ప్రాంతంలో రైతాంగాన్ని మరింతగా దోపిడీ చేయడానికే తోడ్పడింది.

**7) కాంట్రాక్టు వ్యవసాయం:** దళారీ పాలకులు సామ్రాజ్యవాద పథకాలకు అనుగుణంగా ప్రపంచీకరణ మొదట దశలో కాంట్రాక్టు వ్యవసాయం ద్వారా వ్యవసాయాన్ని వాణిజ్యీకరించడం మొదలైంది. దేశంలో పలు ప్రాంతాలలో కాంట్రాక్టు వ్యవసాయం విస్తరించింది. దీని ద్వారా కార్పొరేట్ కంపెనీలు కాంట్రాక్టు భూముల్లో వ్యవసాయంపై పూర్తి నియంత్రణ సాధించాయి. అవి రైతులతో ముందుగా ఒప్పందం కుదుర్చుకునేవి. ఇందులో రైతులు కంపెనీ నుంచే చాలా వరకు వ్యవసాయ సాధనాలను/ఇన్‌పుట్లను కొనుగోలు చేసేవారు. మొదట్లో వీరిని ఆకర్షించేందుకు పంటలకు ఆకర్షణీయమైన రేట్లు అవి చెల్లించినప్పటికీ క్రమంగా రేట్లు గణనీయంగా తగ్గించి రైతులను దోచుకున్నాయి. ఇందులో కూడా నూతన భూస్వామ్య శక్తులే కార్పొరేట్ కంపెనీలకూ, రైతులకు మధ్య దళారీగా వ్యవహరించేవి.

# భారత అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థపై ప్రపంచీకరణ దాడి

## (1991 నుండి ఫిబ్రవరి 2020 వరకు)

### 1991 నుంచి ప్రపంచీకరణ 2వ దశ

1930లలో సామ్రాజ్యవాద సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఏ విధంగానైతే కీనీసియన్ సిద్ధాంతం రూపొందిందో, అదే విధంగా 1970 నుంచి బద్దలయిన సంక్షోభాన్ని పరిష్కరించేందుకు మోనిటరిస్టు (ద్రవ్యవాద) సిద్ధాంతం ముందుకు వచ్చింది. ద్రవ్యవాదులు బడ్జెట్ లోటును తగ్గించడం కోసం కరెన్సీని అచ్చు వేయడం కాకుండా ఖర్చులో తగ్గింపును, రాయితీలలో కోతను సూచించారు. మార్కెట్ శక్తులే ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధీకరిస్తాయని చెప్పే ఆడం స్మిత్ 'ఇన్‌విజిబుల్ హాండ్' (అదృశ్య హస్తం) సూత్రాన్ని ప్రబోధించారు. దీనినే బ్రిటన్‌లో థాచర్, అమెరికాలో రీగన్‌లు ముందుకు తెచ్చారు.

వీరు ప్రవేశపెట్టారని చెప్పే 'స్వేచ్ఛా మార్కెట్' 'స్వేచ్ఛా వ్యాపార విధానాలు' నిజానికి వ్యాపార గుత్తాధిపత్యాన్ని, మార్కెట్ మీద గుత్తసంస్థల అదుపునూ ప్రతిబింబించే విధానాలే. స్వేచ్ఛా వ్యాపారం, స్వేచ్ఛా మార్కెట్‌లు అనే పదజాలం అంతర్జాతీయ ద్రవ్య సంస్థల, బహుళ జాతి కంపెనీల గుత్తాధిపత్యానికి ముసుగు తప్ప మరొకటి కాదు. పెట్టుబడిదారీ విధాన స్వేచ్ఛా పోటీ దశ నాటి ఆడం స్మిత్ సిద్ధాంతాన్ని ఇప్పుడు అన్వయిస్తున్నామని చెప్పడం ప్రపంచ ప్రజలను మోసగించడం తప్ప మరొకటి కాదు.

ఈ విధంగా సంక్షోభానికి జవాబుగా సామ్రాజ్యవాదులు రూపొందించుకున్న 'ప్రపంచీకరణ', 'నయా ఉదారవాదం', ఎల్‌పీజీ విధానాలను ప్రపంచ వ్యాపార సంస్థ (డబ్ల్యుటీఓ) వేదికగా మరింత వేగిరపరిచారు. ఇదే సామ్రాజ్యవాదుల ప్రపంచీకరణ వ్యూహం. అంటే సంక్షోభాన్ని ఎదుర్కోవడం కోసం తమ ఆర్థిక వ్యవస్థల్ని పునర్వ్యవస్థీకరించడం. ఇది సామ్రాజ్యవాద ద్విముఖ దాడికి దారితీసింది.

మొదటిది, సామ్రాజ్యవాదులు తమ దేశాలలో రీగనామిక్స్, థాచరిజంలను అమలు చేయడం ద్వారా పెట్టుబడిదారీ విధానాన్ని పునర్వవస్థీకరించారు. బడా కంగ్లామరేట్లను స్థాపించడం కోసం మునుపెన్నడూ లేనివిధంగా విలీనాలు, కబ్జాల (మెర్జెర్స్ అండ్ ఎక్విజిషన్స్-ఎం అండ్ ఏ) వెల్లువను సృష్టించారు. ద్రవ్య పెట్టుబడిని ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను శాసించే నిర్ణయాత్మక శక్తిగా పెద్దభూతంలా మార్చారు. ప్రపంచంలోని సామాజిక ఉత్పత్తి రూపాలన్నింటినీ తమ అధీనంలోకి తెచ్చుకొని ప్రపంచ దేశాలన్నింటినీ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు లోబడేటట్లు మార్చుకున్నారు. తద్వారా తమ స్వంత దేశాలలో కార్మికవర్గంపై దాడిని తీవ్రతరం చేసి వారి నుంచి పిండుకునే అదనపు విలువ (లాభాల) రేటును పెంచుకున్నారు. రెండవది,

వెనుకబడిన దేశాలపై నూతన దాడి నిర్వహించడం ద్వారా ఆ దేశాలలో తమ మార్కెట్‌లను మరింతగా విస్తరించుకోవడం, ఆ దేశాల చౌక ముడి పదార్థాలను హస్తగతం చేసుకున్నారు. శ్రమజీవులపై తమ దోపిడీని అనేక రెట్లు తీవ్రతరం చేసారు. ఇవి రెండూ అవినాభావ సంబంధం కలిగినవి, పరస్పర ఆధారితమైనవి. అంతర్జాతీయ గుత్త ద్రవ్య సంస్థల, బహుళజాతి సంస్థల దోపిడీ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రపంచవ్యాప్తంగా యావత్తు దేశాల ఆర్థిక వ్యవస్థలను పునర్వవస్థీకరించడం, దిగుమతుల-ఎగుమతులపై, లాభాలను స్వదేశానికి తీసుకువెళ్లడంపై సమస్త ఆంక్షలనూ, సమస్త టారిఫ్ ఆటంకాలనూ తొలగించుకోవడం, ఒక్క మాటలో చెప్పాలంటే, తమ అంతర్జాతీయ గుత్తాధిపత్యానికి అనుగుణంగా ఏ దేశాన్నైనా తన ఇష్ట ప్రకారం దోచుకోవడం కోసం సరుకులు, సాంకేతికత, పెట్టుబడి, శ్రమా 'స్వేచ్ఛగా సంచరించగలిగే' 'సరిహద్దులు లేని' ఒక ప్రపంచాన్ని సృష్టించడం ప్రపంచీకరణ వ్యూహం లక్ష్యం.

'ఇన్ఫోటెక్ విప్లవం' సామ్రాజ్యవాదుల ప్రపంచీకరణ వ్యూహానికి తోడ్పడింది. ఉపగ్రహాలు, ఇతర ఆధునిక సమాచార సాంకేతికత ద్వారా యావత్తు ప్రపంచమూ రోజు రోజుకూ అతి దగ్గరగా అనుసంధానించడం కంప్యూటర్‌ల నుంచి రిమోట్ కంట్రోళ్ల ద్వారానూ, రవాణా సౌకర్యాల వేగాన్ని పెంచడం ద్వారానూ దూర ప్రాంతాల నుంచి వ్యాపార లావాదేవీలు నిర్వహించడం సాధ్యం కావడంతో 'సరిహద్దులు లేని ప్రపంచాన్ని' సృష్టించే తమ ప్రపంచీకరణ వ్యూహం అమలును ఎంఎన్‌సీలు, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు వేగవంతం చేసాయి. వేగంగా ద్రవ్య మార్కెట్‌లను విస్తరించాయి, భారీ పరిశ్రమలలో ఉత్పత్తి ప్రక్రియను చిన్న కార్యకలాపాలుగా విభజించి, వేలాది కార్యకలాపాలను అనేక దేశాలకు తరలించాయి.

సామ్రాజ్యవాదులు మార్కెట్లను వెనుకబడిన దేశాలకు దూకుడుగా విస్తరించడానికి, వెనుకబడిన దేశాలపై, పలు మాజీ సోషలిస్టు దేశాలపై సైతం అదుపును బలోపేతం చేసుకోవడానికి ఆ దేశాలలోని ప్రభుత్వాలు, పాలకవర్గాలే ఉద్దేశ్యపూర్వకంగా పెద్దెత్తున తమ దేశాల విధానాలలో, చట్టాలలో, నియమాలలో, నిబంధనలలో మొదలైన వాటిలో పెద్దెత్తున సంస్కరణలు ప్రవేశపెట్టడం ద్వారా సిగ్గూయెగ్గూ లేని ఈ దోపిడీకి మార్గం సుగమం చేసాయి.

నిజానికి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి వెనుకబడిన దేశాల మీద చేసే క్రూరమైన దాడికి 'ప్రపంచీకరణ' అనేది ఒక అందమైన పేరు. గతంలో వలసవాదులు తమ క్రూరత్వాన్ని నల్లవారిపై తెల్లవారి నాగరిక పాలనగా చెప్పుకునేవారు. నేడు ఈ నయా వలసకారులు ప్రపంచీకరణ అనివార్యమని చెబుతూ తమ బందిపోటుతనాన్ని సమర్థించుకుంటున్నారు. ప్రపంచవ్యాప్త ఘటనలను ఇంటింటికీ తీసుకువచ్చే సాంకేతికతలో ముందడుగులను చూపి, సోకాల్డ్ 'ప్రపంచం ఒక కుగ్రామం' గురించి టీవీ, ఇంటర్నెట్‌ల ద్వారా తప్పుడు భావనను కలిగిస్తూ ప్రపంచవ్యాప్తంగా తాము సాగిస్తున్న క్రూరమైన ద్రవ్య పెట్టుబడి దాడిని మరుగుపరుస్తున్నారు. ఫాసిస్టు రాజ్య అణచివేత యంత్రాంగం, రాజ్య టెర్రరిజం ప్రపంచవ్యాప్తంగా మరింతగా సువ్యవస్థమవుతున్నది.

ఇది ప్రపంచీకరణలో అంతర్భాగమే. సెప్టెంబర్ 11 తర్వాత ప్రపంచంలో నెలకొని ఉన్న వాతావరణంలో వెనుకబడిన దేశాలలో దళారీ పాలకులకు సామ్రాజ్యవాదుల నుంచి పూర్తి మద్దతు లభిస్తుంది. అయితే ఇదంతా ప్రజాస్వామ్యం పేరుతో కొనసాగుతుంది.

## అంతర్జాతీయ స్థాయిలో ద్రవ్య పెట్టుబడి దాడి

ప్రపంచీకరణలో మొదటి అంశం - పెట్టుబడిదారీ విధానాన్ని పునర్వ్యవస్థీకరించడం. సామ్రాజ్యవాదులు తమ దేశాలలో విలీనాలు, కబ్జాలు పెద్దెత్తున వెల్లువలాగా సాగిస్తూ, అతిపెద్ద కంగ్లామరేట్లను సృష్టించడం వలన చిన్న, బలహీన పరిశ్రమలు దెబ్బతినిపోతున్నాయి. ఇవి 2016 నాటికి అత్యంత భారీగా సంవత్సరానికి ఒక ట్రిలియన్ డాలర్లను మించాయి. 2008కి ముందు కంపెనీల విలీనాలు–స్వాధీనాలు సంవత్సరానికి 11,500 జరుగుతూ వచ్చాయి. 2018 నాటికి వీటి సంఖ్య సంవత్సరానికి 30,000కు చేరుకుంది. అయితే పెట్టుబడిదారీ విధానంలో అంతర్గతంగా ఉన్న మౌలిక వైరుధ్యాలు విలీనాల–స్వాధీనాల ద్వారా పరిష్కారం కాలేదు. ఇందుకు భిన్నంగా పెట్టుబడిదారీ విధానం మరింతగా గొంతు లోతు ద్రవ్య, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడానికే దారితీసింది.

కానీ గుత్త పెట్టుబడిదారీ విధానపు అనివార్య పరిణామం ఫలితంగా చేపట్టిన విలీనాలు–స్వాధీనాల ద్వారా బూర్జువా వర్గం తక్షణ సంక్షోభ ప్రభావాన్ని తాత్కాలికంగా అధిగమించగలిగింది. మొదటిది, అధికోత్పాదనను ఇముడ్చుకోలేక కుంచించుకుపోతున్న మార్కెట్లను, కంపెనీలను కబ్జా చేసుకోవడం ద్వారా విస్తరించుకోగలిగింది. రెండవది, మార్కెట్ కుంచించుకుపోయిన కారణంగా నూతన (లేదా విస్తరించబడిన) ఉత్పత్తిలో మదుపు పెట్టే మార్గం కనపడక భారీగా సంచయనం అయి వుండిన పెట్టుబడి ప్రస్తుతం ఇతర కంపెనీ/ కంపెనీలను కబ్జా చేసుకోవడంతో వినియోగంలోకి వచ్చింది. రవాణా, కమ్యూనికేషన్ రంగాలలో అభివృద్ధి వల్ల అది జీవితంలో అన్ని రంగాల్లోకీ చొచ్చుకువెళ్లే అవకాశం కలిగింది. మూడవది, హై–టెక్నాలజీని, కార్మికుల ఉపాధిలో భారీ కోతలను ప్రవేశపెట్టడం ద్వారా, విలీనాల ద్వారా ఉత్పత్తిలో 'ఘనాంగ నిర్మాణం' సాధించబడింది. తద్వారా పడిపోతున్న లాభాలను పునరుద్ధరించింది. దీంతో పాటు తమ పెట్టుబడిని, ఉత్పత్తిని పునర్వ్యవస్థీకరించింది. ప్రపంచంలోని అన్ని ఉత్పత్తి ప్రాంతాలనూ వందకు పైగా ఛానెళ్లు కలిగిన కేంద్రాలతో జోడించింది. వీటి మధ్య విలీనాలు కూడా పెరిగాయి. ఇప్పటికీ ఈ మార్కెట్ మీద ఆధారపడే అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు ఈ నిర్మాణ నెట్‌వర్క్‌కు ఆటంకం కాలేదు. అవి సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉన్నాయి. నిజానికి ఈ ఉత్పత్తి సంబంధాలే సామ్రాజ్యవాదానికి ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు దారి సుమగం చేస్తున్నాయి. ప్రపంచీకరణ యుగంలో ఈ ప్రపంచ మార్కెట్ పరిణామం శ్రమ విభజనలో ప్రతిబింబిస్తుంది. దీని వల్ల

వెనుకబడిన దేశాలపై సామ్రాజ్యవాద దేశాల జోక్యం మరింత పెరిగింది. ఒక వైపు అవి తమ (సామ్రాజ్యవాద)/పెట్టుబడిదారీ దేశాలలో కార్మికుల ఉపాధిలో భారీ కోతల ద్వారా, వేతనాలను స్తంభింపజేయడం ద్వారా, భారీయెత్తున పార్ట్‌టైం, కాంట్రాక్టు లేబర్‌ను వినియోగించడం ద్వారా కార్మికవర్గంపై ఒకే సమయంలో పలు దాడులు నిర్వహించాయి. పని గంటలు పెంచడం, ఉ త్పత్తిని తక్కువ వేతన ప్రాంతాలలో ఔట్‌సోర్సింగ్ చేయించడం, ప్రభుత్వ సామాజిక సంక్షేమంలో పెద్దెత్తున కోతలు విధించడం మొదలైన వాటి ద్వారా పడిపోతున్న లాభాలను పునరుద్ధరించడమే కాకుండా, లాభాలను భారీగా పొందాయి. మరోవైపు వెనుకబడిన దేశాలలోని ప్రజలను, ముఖ్యంగా కార్మికుల నుంచి అధిక, అధికాధిక అదనపు విలువను పిండుకునే రకరకాల అమానవీయ నూతన దోపిడీ రూపాలను, పద్ధతులను ముందుకు తెచ్చాయి. ఈ కారణంగా ప్రపంచ పీడిత ప్రజలు ఆకలి తీర్చుకోలేనంత అతి తక్కువ వేతనాలతో, దుర్భరమైన స్థితిలో జీవిస్తున్నారు.

'ప్రపంచీకరణ'లో రెండవ అంశం, సామ్రాజ్యవాదులు తమ మార్కెట్లను దూకుడుగా విస్తరించడం, వెనుకబడిన దేశాలపై, పలు మాజీ సోషలిస్టు దేశాలపై సైతం అదుపును బలోపేతం చేయడం. సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం పతనం తర్వాత మూడవ ప్రపంచమంతటా ఉ న్న దాని మార్కెట్లను పాశ్చాత్య, (జపాన్) సామ్రాజ్యవాదులు ఆక్రమించారు. మాజీ సోవియట్ యూనియన్ మార్కెట్లతో పాటు, తూర్పు యూరప్ కూడా వారికి మార్కెట్‌ను కల్పించింది. చైనాలో సోషలిస్టు ప్రభుత్వం కుప్పకూలడం, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం వెనుకపట్టు పట్టడంతో చైనా మార్కెట్లు సామ్రాజ్యవాద దోపిడీకి తెరవబడ్డాయి. ప్రపంచంలోని వెనుకబడిన దేశాలపై ఆధిపత్యం–పెత్తనం చెలాయించేందుకు దూకుడుతనంతో కూడిన విధానం అవలంబించబడింది. ఫలితంగా 'ప్రపంచీకరణ' పేరుతో ఎంఎన్‌సీ–టీఎన్‌సీలు వెనుకబడిన దేశాలలో పెద్దెత్తున ప్రైవేటు పరిశ్రమలను, పబ్లిక్ రంగంలోని పరిశ్రమలను, ద్రవ్య సంస్థలను, బ్యాంకింగ్, బీమా రంగాలను, చిన్న తరహా పరిశ్రమలను, వాటి ప్రకృతి వనరులను మరియు మైనింగ్‌తో పాటు వ్యవసాయాన్ని సైతం ఆవురావురుమంటూ మింగివేసాయి.

సామ్రాజ్యవాద అణచివేతకు గురవుతున్న దేశాలలో పారిశ్రామిక కార్మికవర్గపు అపారమైన పెరుగుదల నయా ఉదారవాద యుగంలో అత్యంత ముఖ్యమైన మార్పు. పెట్టుబడిదారీ విధాన చరిత్రలో జరిగిన అత్యంత ముఖ్యమైన పరిణామాలలో ఒకటి. వెనుకబడిన దేశాలలో కార్మికవర్గం పెరగడం, సామ్రాజ్యవాద దేశాలలో పీడిత దేశాల నుంచి వలస వచ్చిన వారితో కార్మికవర్గం పెరగడం, దాదాపుగా అన్ని దేశాలలోనూ మహిళలు వేతన శ్రమలోకి రావడం మొదలైన మార్పులు ఇందులో భాగంగా జరిగాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకించి వెనుకబడిన దేశాలలో ఇంతకంటే ఎన్నో రెట్లు అధికంగా నిరుద్యోగ–చిరుద్యోగ/అసంఘటిత రిజర్వు సైన్యం ఉంది. వెనుకబడిన దేశాల ఆర్థిక వ్యవస్థలు నయావలస తరహా దోపిడీ కొనసాగుతున్న అర్ధవలస

సంబంధాలను బద్దలు చేయకుండా ఈ స్థితిలో మార్పు రావడం అసాధ్యం.

అయితే ప్రపంచీకరణ విధానాలు సామ్రాజ్యవాదులు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ వ్యాపారం మరింత వక్రంగా మారాయి. ఇది సంపదను కనపించని మార్గాలలో భారీయెత్తున సామ్రాజ్యవాద దేశాలకు తరలిపోయేందుకు, ద్రవ్య మార్కెట్లలో పెద్దెత్తున అవకతవకలు సాగించడం ద్వారా అంతర్జాతీయ సట్టా వ్యాపారులకు భారీ లాభాలు చేకూరేందుకు, అదే సమయంలో డాలరేతర కరెన్సీల ప్రత్యేకించి వెనుకబడిన దేశాల కరెన్సీల అవమూల్యానికీ (డీవాల్యేషన్), స్టాక్ మార్కెట్ల విధ్వంసానికీ దారితీసింది. సామ్రాజ్యవాద–పెట్టుబడిదారీ వ్యవస్థలో నిజానికి ఈ ప్రపంచీకరణ కాలంలో ప్రపంచీకరణ విధానాలు నాణేనికి ఒక వైపు మాత్రమే. సామ్రాజ్యవాదులు తమ ప్రయోజనాలను ప్రత్యేకించి తమ మార్కెట్లను, సూపర్ లాభాలను పరిరక్షించుకోవడం కోసం 'రక్షణ విధానాలను' (ప్రొటెక్షనిజం) అవలంబించారు. పడిపోతున్న అభివృద్ధి రేటు, అధికోత్పత్తి సంక్షోభం, పతాక స్థాయికి చేరిన నిరుద్యోగం వంటి దీర్ఘకాల సమస్యల వల్ల సామ్రాజ్యవాద అంతర్జాతీయ గుత్తసంస్థల మధ్య నిరంతరం పెద్దెత్తున సాగుతున్న గొంతులు కోసుకునే పోటీ నానాటికీ తీవ్రతరమవుతూ వచ్చింది. వాటి మధ్య జరిగే ఎలాంటి ఒప్పందాలైనా తాత్కాలికంగా ఉపశమనం కలిగించాయే తప్ప సమస్యను పరిష్కరించలేదు. వ్యాపార యుద్ధాలు, కరెన్సీ యుద్ధాలు నిరంతరం కొనసాగుతున్నాయి. ప్రపంచీకరణ విధానాల వల్ల సామాజిక ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయి. 2012లో యావత్తు ప్రపంచ సంపద 230 ట్రిలియన్ డాలర్లు ఉండగా ఇందులో 38.5 శాతం సుమారు 0.6 శాతంగా (4.56 కోట్ల మంది) వున్న ధనికుల చేతిలో ఉంది. 50 శాతం పేద ప్రజల వద్ద అంటే 380 కోట్ల ప్రజల వద్ద ఉన్న సంపద 11 శాతం తగ్గిపోయింది. 62 మంది కుబేరుల సంపద ప్రపంచంలోని సగం జనాభా ప్రజల వద్ద ఉన్న సంపదతో సమానమైంది.

అందువల్ల ఆర్థిక రంగం బతికిబట్ట కట్టాలంటే ప్రజా ప్రయోజనాలను పణంగా పెట్టి ద్రవ్య పెట్టుబడిని సంతృప్తిపరచడం కోసం రాజ్యం ఫాసిస్టుగా మారింది. జీవనాధారాల కొరకు, హక్కుల కొరకు పోరాడే పీడిత జాతులపై, ప్రజలపై అన్ని దేశాలలో పాలకులు ఫాసిస్టు నిర్బంధాన్ని అమలు చేస్తున్నారు. దీంతో సామ్రాజ్యవాదానికీ, పీడిత జాతులకూ–పీడిత ప్రజలకూ మధ్య, పెట్టుబడికీ శ్రమకూ మధ్య, సామ్రాజ్యవాద దేశాల మధ్య మౌలిక వైరుధ్యాలు తీవ్రమయ్యాయి. ఫలితంగా తిరిగి సామ్రాజ్యవాదులు కోలుకోలేని సంక్షోభంలో కూరుకుపోయారు.

కానీ, ఆధునిక రివిజనిస్టులు పెట్టుబడిదారీ వ్యవస్థలోని మౌలిక వైరుధ్యాలను పునర్నిర్వచిస్తున్నారు. రాజ్యం, ప్రజాస్వామ్యం, కమ్యూనిస్టు పార్టీ స్వరూపం, పాత్రా, విప్లవం, శాస్త్రీయ సోషలిజం గురించి నూతన విశ్లేషణలు చేస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థపై అంచనాలోని

ఈ పెడధోరణి కేవలం విశ్లేషణలో తేడా కాదు. సైద్ధాంతిక దృక్పథానికి సంబంధించినది. నిజానికి ఆధునిక రివిజనిజాన్నీ సామ్రాజ్యవాదాన్నీ సమైక్యం చేసేది ఈ రివిజనిస్టు సైద్ధాంతిక దృక్పథమే. అది 'అల్ట్రా', 'సూపర్', 'గ్లోబల్' అనే పదాలు ఉపయోగించడం ద్వారా సామ్రాజ్యవాదం అజేయమనీ, మార్చలేనిదనీ, ఎవరూ స్పృశించలేనిదనీ, సామ్రాజ్యవాద అంతిమ విజయంతో చరిత్ర ముగుస్తుందనీ ప్రబోధిస్తున్నది. 'చరిత్ర ముగింపు' అంటే విప్లవాలు ముగియడం, సోషలిజం-కమ్యూనిజం వైపుగా సమాజ పరిణామం ఒక కలగా మిగిలిపోవడం. దీని అర్థమేమంటే, పెట్టుబడిదారీ విధానం 'అవసాన దశ'లో ఉన్న పెట్టుబడిదారీ విధానంగా కాకుండా చావులేని పెట్టుబడిదారీ విధానం-సంపూర్ణ విజయాన్ని నిర్వివాదంగా నెలకొల్పుకున్న పెట్టుబడిదారీ విధానంగా అన్ని వర్గాలనూ రూపుమాపి, యావత్తు ప్రపంచాన్నీ ఐక్యం చేసిన పెట్టుబడిదారీ విధానంగా పరివర్తన చెందడం. ఇది సమాచార సమాజం, సమాచార యుగంతో మొదలై సాంకేతిక విప్లవంతో ఈ పరివర్తన పూర్తవుతుంది. ఇక మిగిలేది సంస్కరణవాద పునాది మీద ప్రస్తుత సమస్త సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవడం, పరస్పర సహకారంతో పూర్తి స్థాయికి ప్రపంచాన్ని క్రమంగా మెరుగుపరచుకోవడం. కనుక వర్గ పోరాటాన్ని అనిశ్చితంగా విడిచిపెట్టి కార్మికవర్గ విప్లవశక్తులు తక్షణం ఈ అవాస్తవానికి లొంగిపోవాలి. సామ్రాజ్యవాదులు ప్రపంచం సరిహద్దులు చెరిగిపోయి ఒక పట్టణంగానో ఒక కుగ్రామంగానో మారిపోయిందని వ్యాఖ్యానిస్తున్నారు.

సామ్రాజ్యవాదులు, ఆధునిక రివిజనిస్టులు చెప్పేదానికి భిన్నమైన పరిణామాలకు లక్షలాది ఉదాహరణలు ప్రపంచమంతటా ఉన్నాయి. బానిస సమాజంలో, భూస్వామ్య సమాజంలో సైతం 'అజేయమైన స్వర్గం' పాలక వర్గాల ప్రపంచంలో ఎప్పుడూ ఉంటూ వచ్చింది. నాగరిక దశ నుంచీ లబ్ది పొందిన పాలకవర్గాలే ఆ 'స్వర్గానికి' ప్రతినిధులు అయ్యారు. ప్రస్తుతం సామ్రాజ్యవాదులు ఇందుకు భిన్నంగా ఏమీ మాట్లాడడం లేదు. ఉత్పత్తి సాధనాలను కలిగి ఉ ండేవాళ్లు ప్రపంచంలో సమస్త ఆస్తి మీదనూ తమకు అధికారం ఉందనీ, ప్రపంచాన్ని తమ ఇష్టం వచ్చినట్టు నడుపుకోవచ్చుననీ భావిస్తారు. శాస్త్ర సాంకేతికతలలో అభివృద్ధి, ప్రగతీ వారి సంకుచిత ప్రయోజనాల మీద ఆధారపడి, వారు నిర్ణయించిన స్థాయిలో నిర్ణయించిన విధంగా జరుగుతాయి కానీ అవి యావత్తు మానవాళి ప్రయోజనాలకూ అవసరాలకూ తగిన విధంగా ఉండవు. ఇదంతా వారి అధికారాన్ని, దోపిడీ పీడన అణచివేతలను చెలాయించుకోవడం కోసమే.

కామ్రేడ్ లెనిన్ చెప్పినట్టుగా, సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ. అలాగే అది పెట్టుబడిదారీ విధానపు అంతిమ దశ. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గురించి రివిజనిస్టు, సంస్కరణవాద ధోరణులు అతిగా వక్రీకరించి చెబుతున్నట్టుగా గుత్త పెట్టుబడిదారీ విధానపు లక్షణాలలో మార్పు కనబడదు. కానీ అందులో కమ్యూనికేషన్, సమాచార, సాంకేతికతా

(టెక్నొలాజికల్) రంగాలలోనే కాకుండా, అన్ని రంగాలలో కూడా చెప్పుకోదగ్గ పరిణామాలు జరిగాయన్నది వాస్తవం. ఈ పరిణామాల ప్రభావం ఆర్థిక వ్యవస్థ మీద ఉంది. అయితే పెట్టుబడిదారీ విధానం స్వభావంలో కానీ సామ్రాజ్యవాద ప్రపంచ వ్యవస్థ స్వభావంలో కానీ, వర్గపోరాట స్వభావంలో కానీ ఎటువంటి మౌలిక మార్పు రాలేదు.

పెట్టుబడిదారీ దేశాలలో ప్రతి మార్కెట్ రంగం తరచుగా, నిర్దయగా విలీనాలకూ, కబ్జాలకూ గురవుతూ ఉంటుందని 100 సంవత్సరాల క్రితమే లెనిన్ 'సామ్రాజ్యవాదం–పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' అనే పుస్తకంలో పేర్కొన్నాడు. ప్రపంచవ్యాప్తంగా అది అత్యంత స్పష్టంగా రుజువవుతూ వచ్చింది. సాధారణంగా సంపద కేంద్రీకరణకు, ప్రత్యేకించి గుత్తాధిపత్యానికి (మార్కెట్ రంగంలో) విలీనాలు–కబ్జాలు (ఎం అండ్ ఏ) ఒక ప్రధాన సూచిక. విలీనాల–కబ్జాల కార్యకలాపాలకు ఫైనాన్స్ పెట్టుబడి ఇంధనం లాంటిది. కనీసం ఒక కంపెనీని మరో పెద్ద కంపెనీ హస్తగతం చేసుకునే బిగ్ టికెట్ డీల్స్‌లో వేలాది కోట్ల రూపాయల డబ్బు అవసరం (కొన్ని సందర్భాలలో అది మొత్తం కాష్ డీల్‌గా ఉండచ్చు) అవుతుంది. సాధారణంగా ఏ కంపెనీ అయినా మరో కంపెనీని కబ్జా చేసుకునేటప్పుడు తన వద్ద గల డబ్బునంతటినీ వినియోగించదు. నేటి ఆర్థిక ప్రపంచంలో ద్రవ్యమే రాజ్యం చేస్తోంది గాబట్టి ఆ కంపెనీ సాధారణంగా ద్రవ్య పెట్టుబడిని ఈక్విటీ రూపంలో గానీ లేదా రుణం రూపంలో గానీ రాబట్టుకుంటుంది.

ఏ మార్కెట్ రంగం పరిపక్వం కావడానికైనా సంఘటితీకరణ (కన్సాలిడేషన్) కీలమైంది. ఇది గుత్తాధిపత్యానికి మార్గం సుగమం చేస్తుంది. ప్రారంభంలో, ఏ మార్కెట్ రంగంలో అయినా అనేక శక్తులు ఉంటాయి. కాలం గడిచే కొద్దీ వివిధ కారణాల రీత్యా రెండు లేదా మూడు కంపెనీలు ఇతర కంపెనీల కంటే పెద్దవిగా వృద్ధి చెందుతాయి.

లెనిన్ సరిగా చెప్పినట్లుగా, పోటీ ఎల్లప్పుడూ గుత్తాధిపత్యానికి దారితీస్తుంది. కొన్ని పెద్ద శక్తులు అనివార్యంగా చిన్న శక్తులను విలీనాల, కబ్జాల ద్వారా తినివేస్తాయి. కొంతకాలం గడిచిన తర్వాత ఏ మార్కెట్ రంగం అయినా (ఎక్కడ అత్యధిక స్థాయి క్రమబద్ధీకరణ సంభవిస్తుందో కనీసం అక్కడైనా) అంతిమంగా కొన్ని బడా శక్తులు గుత్తశక్తులుగా మారతాయి.

ఒక మార్కెట్ రంగంలోని బడా కంపెనీల మధ్య సైతం నిర్దాక్షిణ్యమైన పోటీ ప్రతి రోజు 24 గంటలు, ప్రతి సంవత్సరం 365 రోజులు ఉంటుంది. అవి "నేను నిన్ను చంపకపోతే, నీవు నన్ను చంపుతావు" అనే విషచక్రంలో ఉంటాయి. అందువల్ల, ఏ కంపెనీలు మరింత విజయవంతంగా ఖర్చులపై కోత విధిస్తాయో (ఉద్యోగుల సంఖ్యను, వారి వేతనాలను తగ్గించడం ద్వారా) మరియు సామర్థ్యాన్ని పెంచడం ద్వారా (తాజా టెక్నాలజీ అభివృద్ధిని/వినియోగాన్ని వేగంగా అమలులోకి తేవడం ద్వారా) అవే విజయవంతంగా మరింత పెట్టుబడిని సంచయనం

చేయగలుగుతాయి. ఆ తర్వాత ఈ పెట్టుబడిని పోటీ పడే కంపెనీలను కూకటివేళ్లతో పెకిలించేందుకు వాటికి వ్యతిరేకంగా ఉపయోగిస్తాయి, వివిధ మార్కెట్ జిత్తులను అవలంబించడం ద్వారా అతిపెద్ద గుత్తకంపెనీలుగా మారతాయి. చివరికి ఆ నిర్దిష్ట రంగంలో విలీనాల-కబ్జాల రూపంలో కన్సాలిడేషన్ జరుగుతుంది. కన్సాలిడేషన్‌లో భాగంగా బలమైన కంపెనీ బలహీనమైన పోటీ కంపెనీని నిర్మూలించి మింగివేస్తుంది. కన్సాలిడేషన్ (విలీనాల-కబ్జాల)లో భాగంగా బలమైన కంపెనీ బలహీనమైన దానిని కబ్జా చేసుకుంటుంది.

పాశ్చాత్య ద్రవ్య పెట్టుబడిదారులు ప్రతీ మార్కెట్ రంగంలోనూ ఉన్నత స్థాయి ఆధునీకరణను అభివృద్ధి చేసారు. వారు మార్కెట్‌లోని అన్ని రంగాలను ఆధునీకరించడమే కాకుండా వాటిని నియంత్రించడం కోసం కేంద్రీకరిస్తున్నారు. అదే సమయంలో, వారి టెక్నలాజికల్, ఫైనాన్సియల్ ఆధిపత్యం కూడా పెరుగుతూ ఉంది. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో వృద్ధికీ, అభివృద్ధికీ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ కీలకమైన చోదకశక్తిగా పనిచేస్తున్నది. 2017లో ఐక్యరాజ్యసమితి వాణిజ్యము, అభివృద్ధి మహాసభ (యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్-యూఎన్‌సిటిఎడి)కి చెందిన వరల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ రిపోర్టును బట్టి ఇది మరింత స్పష్టమవుతోంది. గత ఐదేళ్లలో ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ప్రాముఖ్యత ఎలా పెరుగుతూ వచ్చిందో అదే విధంగా టెక్ అండ్ డిజిటిల్ ఎంఎన్‌సీల ప్రాముఖ్యత, వీటితో పాటు ఇంటర్నెట్ ప్లాట్‌ఫారములు, ఈ-కామర్స్, డిజిటిల్ కంటెంట్ ఫర్మ్‌ల ప్రాముఖ్యత కూడా వేగంగా పెరుగుతూ వచ్చింది. వీటిని అస్సెట్-లైట్ మోడల్, ఏగ్రిగేటర్ మోడల్ కంపెనీలని కూడా పిలుస్తున్నారు. 2010-2015 మధ్య ఐక్యరాజ్యసమితికి చెందిన యుఎన్‌సీటీఏడీ ర్యాంకింగ్‌లో టాప్ 100 ఎంఎన్‌సీల మొత్తం మార్కెట్ కాపిటలైజేషన్‌తో పోల్చితే టెక్ అండ్ డిజిటిల్ ఎంఎన్‌సీల సగటు మార్కెట్ కాపిటలైజేషన్ దాదాపు మూడు రెట్లు ఉంది. 2015 చివరి నాటికి 10 టెక్ ఎంఎన్‌సీలు అగ్ర స్థానంలో ఉన్న టాప్100 ఎంఎన్‌సీల మొత్తం మార్కెట్ కాపిటలైజేషన్‌లో సుమారు 26 శాతాన్ని కలిగి వున్నాయి. టెక్ అండ్ డిజిటిల్ ఎంఎన్‌సీల ఆస్తులు టాప్‌అగ్ర స్థానంలో ఉన్న ఇతర 100 ఎంఎన్‌సీలతో పోల్చితే 65 శాతం, వాటి రెవిన్యూలు, వాటిలో పనిచేసే ఉ ద్యోగుల సంఖ్య సుమారు 30 శాతం అధికం. వాటి ఆస్తులు కేవలం 40 శాతం మాత్రమే విదేశాలలో ఉన్నప్పటికీ అవి సుమారు 70 శాతం అమ్మకాలను విదేశాల్లో జరుపుతున్నాయి. ముఖ్యంగా వీటి అమ్మకాలు సగటు టాప్ 100 ఎంఎన్‌సీల అమ్మకాల కంటే అధికం. అయితే ఇవి ప్రధాన కార్యకలాపాల కోసం తమ దేశంలోని ఉచ్చస్థాయి నైపుణ్యం కలిగిన లేబర్‌పై ఆధారపడడం వల్ల వీటి ద్వారా లభించే విదేశీ ఉపాధి తక్కువ. ఇది ప్రపంచ ఆర్థిక వృద్ధిని నెగెటివ్‌గా ప్రభావితం చేస్తున్నది. తీవ్ర నిరుద్యోగానికి దారితీస్తున్నది.

ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ రంగాల నిర్దిష్ట స్థితినీ, వాటిలోని మార్పులను అర్థం చేసుకోవడానికి వారు ప్రత్యేకమైన ఫీల్డ్ రీసర్చ్ మరియు సలహా సంఘాలను ఏర్పాటు చేసారు.

ఉదాహరణకు, ప్రపంచ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో నైట్ ఫ్రాంక్ లేదా కుష్మాన్ వేక్‌ఫీల్డ్; గ్లోబల్ ఐటీ ఫీల్డ్‌లో గార్ట్‌నెర్ రీసర్చ్ మరియు గ్లోబల్ డిఫెన్స్‌లో బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్ మొదలైనవి. ప్రతి మార్కెట్ సెగ్మెంట్‌లో, ఈ రీసర్చ్ సంఘాలు నిర్ణీత దేశంలోని మార్కెట్ రంగంలో రీసర్చ్ చేస్తాయి, పెట్టుబడిదారుల కోసం రిపోర్టులను ప్రచురిస్తాయి, తద్వారా ఈ సమాచారంపై ఆధారపడి తమ మదుపుల గురించి వారు నిర్ణయాలు తీసుకోగలుగుతారు. క్రమానుగతంగా ఈ రీసర్చ్ సంఘాలు కార్పొరేట్ కంపెనీలకు లాభాలను ఎలా పెంచుకోవాలనే సూచనలు కూడా ఇస్తాయి. లాభాలను పెంచుకునేందుకు అనుసరించాల్సిన అంచనా ప్రమాణాలను (బెంచ్‌మార్క్‌లను), కొలమానాలను కూడా అవి ఏర్పాటు చేస్తాయి. ఈ రీసర్చ్ రిపోర్టులు పెట్టుబడి ఆవశ్యకతను అంచనా వేస్తాయి, ద్రవ్య పెట్టుబడి శక్తిని ప్రయోగించడం ద్వారా పాశ్చాత్య ఫైనాన్స్ పెట్టుబడిదారులు కంపెనీలను ఎలా నియంత్రించగలుగుతారో తెలియజేస్తాయి కనుక వారికి ఈ రిపోర్టులు కీలకమైనవి.

అదే సమయంలో పాశ్చాత్య ఫైనాన్స్ పెట్టుబడిదారులు ప్రతి దేశంలోని ఆర్థిక వ్యవస్థను వివరంగా అర్థం చేసుకోవడానికి అనేక ఆర్థిక రీసర్చ్ సంస్థలను కూడా ఏర్పాటు చేసారు. అవి ప్రతి దేశంలో సూక్ష్మ మరియు స్థూల ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేస్తాయి, రీసర్చ్ రిపోర్టులను సమర్పిస్తాయి. మెక్‌కిన్సీ (యుఎస్‌ఏ), దాచే బ్యాంక్ రీసర్చ్ (జర్మనీ), ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (బ్రిటన్), నొమురా రీసర్చ్ (జపాన్), అల్‌ట్రాన్ (ఫ్రాన్స్) మొదలైనవి కొన్ని ప్రముఖ ఎకనామిక్ రీసర్చ్ అండ్ అడ్వయిజరీ ఫర్మ్‌లు. వీటితో పాటు, హార్వార్డ్, స్టన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయాలు, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ మొదలైనటువంటి పాశ్చాత్య దేశాలకు చెందిన ఐవీ లీగ్ (అంటే పై స్థాయి) విశ్వవిద్యాలయాలు వివిధ దేశాల ఆర్థిక పరిస్థితిని పెట్టుబడిదారులు అర్థం చేసుకోవడానికి రీసర్చ్ రిపోర్టులను విడుదల చేస్తాయి.

విద్యుత్తు యంత్రాలు విస్తృతంగా అభివృద్ధి చెందని పారిశ్రామికీకరణ ప్రారంభ దశలలో ముడి పదార్థాలను సరుకుగా తయారు చేసే ప్రక్రియలో వివిధ దశలు ఒకే పరిశ్రమలో జరిగేవి. దీనికి పెద్ద సంఖ్యలో గృహ కార్మికులు దోహదపడేవారు. ఆ తరువాత వంద సంవత్సరాలలో యంత్రీకరణ వెల్లువ కేంద్రీకరణ (కాన్‌సెంట్రేషన్), ప్రత్యేకీకరణ (స్పెషలైజేషన్)లను ముందుకు తీసుకువచ్చింది. దీంతో మరింత క్లిష్టమైన ఉత్పత్తి వ్యవస్థల పెరుగుదల సంబంధిత దేశం లోపలే జరిగింది. ఈ రెండు శతాబ్దాలలో అంతర్జాతీయ వ్యాపారంలో చాలా వరకూ ముడి పదార్థాలు, అంతిమ సరుకులూ (ఫైనల్ గూడ్స్) రెండూ ఉంటూ ఉండేవి. నయా ఉదారవాద ప్రపంచీకరణ ఉత్పత్తి గొలుసులో లింకులను, విలువ సృష్టినీ దేశ సరిహద్దుల ఆవలకు విస్తరించి ఈ పరిస్థితిలో భారీ మార్పు తీసుకువచ్చింది.

ఉత్పత్తి ప్రపంచీకరణలో సామ్రాజ్యవాద దేశాల కేంద్రంగా ఆయా దేశాల పెట్టుబడిదారుల యాజమాన్యంలో వున్న అత్యధిక టీఎన్‌సీలు, ఎంఎన్‌సీలు చోదకశక్తులుగా పనిచేసాయి. ఇందులో

ఒక విశిష్ట లక్షణం ఏమంటే అది విడి భాగాలను (విడి రంగాలను), ఉత్పత్తి ప్రక్రియల లింక్‌లను ఔట్‌సోర్సింగ్ చేయడం. అయితే ఇందులో సాధారణంగా వెనుకబడిన దేశాల పాత్ర ఉత్పత్తి ప్రక్రియలలో శ్రమ తీవ్రంగా అవసరం అయ్యే దశలకు పరిమితమవడంతో మాతృసంస్థకు, ఇతర దేశాలలో ఉన్న దాని అనుబంధ సంస్థకు మధ్య సంబంధం, పెట్టుబడికి శ్రమకూ మధ్య సంబంధం సామ్రాజ్యవాద దేశాల పెట్టుబడికి, వెనుకబడిన దేశాల శ్రమకు మధ్య సంబంధంగా మారిపోయింది. శ్రమ వెనుకబడిన దేశాలది, ఉత్పత్తిపై అధికారం, దాంతో వచ్చే లాభాలు సామ్రాజ్యవాద దేశాలవిగా అయ్యాయి. ప్రపంచీకరణకు మునుపు, వివిధ సరుకులు ఉత్పత్తి చేసే సంస్థల మధ్య పోటీలో భాగంగా సామ్రాజ్యవాద దేశాల కార్మికుల సాపేక్షిక వేతనాలు, ఉ పాధి భద్రతా ఆ సంస్థల యజమానులు తమ మార్కెట్ వాటాను పరిరక్షించుకోవడంపై ఆధారపడి ఉండేవి. శ్రమను పొదుపు చేసే సాంకేతికతను తీసుకువస్తే ఉద్యోగాల నుంచి తొలగించే భయం ఆ సంస్థల ఉత్పాదక సామర్థ్యాన్ని నియంత్రించేది. టీఎన్‌సీలు ఎంత విజయవంతంగా, ఆధిపత్యంలో ఉండేవో అంతగా ఎక్కువ సంఖ్యలో దేశీయ ఫాక్టరీలలో ప్రత్యక్ష ఉద్యోగులను కేంద్రీకరించడం ఉండేది. ప్రస్తుత ప్రపంచీకరణ కాలంలో 'టాస్క్ ట్రేడింగ్' ద్వారా అంటే విడి టాస్క్ (పను)లను వేతనాలు అతితక్కువగా ఉన్న దేశాలకు ఔట్‌సోర్సింగ్ చేయడం ద్వారా యజమానులకు తమ ఉద్యోగులను తొలగించడానికీ, ఉత్పత్తి ఖర్చులు తగ్గించుకోవడానికీ ప్రత్యామ్నాయ మార్గం లభించింది. ఇప్పుడు విజయవంతమయిన టీఎన్‌సీ అంటే తక్కువ వేతనాలున్న దేశాలకు ఉత్పత్తిని ఔట్‌సోర్స్ చేసే, తాను సాధ్యమయినంత తక్కువ ఉత్పత్తి చేసే సంస్థ అని అర్థం. దాదాపు అర్ధ శతాబ్దం వరకు సహజ వనరులు అంతగా లేని పేద దేశాలకు ఎగుమతి దృష్టితో పారిశ్రామికీకరణ ఒక్కటే మార్గంగా ఉంది. దాదాపు 80 శాతం ప్రపంచ వ్యాపారం (స్థూల ఎగుమతుల అర్థంలో) టీఎన్‌సీల అంతర్జాతీయ ఉత్పత్తి వ్యవస్థలతో ముడిపడి వున్నది. కార్మికుడి బతుకు ఇక ఎంతమాత్రమూ తమ యజమాని లాభాలతో ముడిపడి లేదు. ఏ యజమానైతే తమ కార్మికుల స్థానంలో చౌకగా లభ్యమయ్యే విదేశీ కార్మికులను తీసుకురాగలుగుతారో అతనిపైనే కార్మికుని భవితవ్యం ఆధారపడి వుంది. అందువల్ల సామ్రాజ్యవాద–పెట్టుబడిదారీ దేశాల, వెనుకబడిన దేశాల మధ్య తయారీ సరుకుల ఎగుమతుల వ్యాపారం ఉత్పత్తి ప్రపంచీకరణకు వ్యక్తీకరణగా, పెట్టుబడికి శ్రమకూ మధ్య దోపిడీ సంబంధంగా మారిపోయింది. ఇందులో లాభాల కోసం, మార్కెట్ వాటా కోసం, వాటాదారు విలువ కోసం వివిధ సామ్రాజ్యవాద సంస్థలు పోటీపడుతూ ఉంటాయి.

గుత్తసంస్థల విలీనం లేదా కబ్జాల వల్ల అంతర్జాతీయ, ఖండాంతర గుత్తసంస్థల సంఖ్య పెరగడంతో కేంద్రీకరణ తీవ్రమైంది. వేళ్లమీద లెక్కపెట్టగలిగిన కొన్ని గుత్తసంస్థలు యావత్తు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అదుపు చేస్తున్నాయి. ఈ భారీ గుత్తసంస్థల మధ్య పోటీ మరింత వేగవంతమైంది.

ప్రపంచీకరణ కాలంలో సామ్రాజ్యవాద అంతర్జాతీయ గుత్తసంస్థలు తమ ఉత్పత్తి కార్యకలాపాలలో ముందుకుతెచ్చిన ముఖ్యమైన పద్ధతులు ఇవి: 1. వర్టికల్ ఇంటెగ్రేషన్ పద్ధతి. ఇందులో కేంద్రీకృత అదుపుతో వివిధ దేశాలలో వివిధ విడి భాగాలు తయారు చేస్తారు. 2. హారిజాంటల్ ఇంటెగ్రేషన్ పద్ధతి. ఇందులో ఒకే ఉత్పత్తిని వివిధ దేశాలలో ఏక కాలంలో ఉత్పత్తి చేస్తారు. ఈ పద్ధతిలో ఒక దేశంలో ఫాక్టరీని మూసివేసి తమ అవసరాన్ని బట్టి మరో దేశంలో కొనసాగిస్తారు. ఒకే వస్తువును వివిధ దేశాలలో ఉత్పత్తి చేసే ఈ సౌకర్యం వల్ల ఒక దేశం నుంచి మరో దేశానికి ఎగుమతి చేసి భారీగా లాభాలు చేసుకోవచ్చు. దీన్ని ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ అని అంటారు. కరెన్సీ మారక రేట్లపై ఆధారపడి ఎంఎన్‌సీలు తమ ఉత్పత్తులను వివిధ దేశాలలో ఉన్న తమ స్వంత పరిశ్రమలకు ఎగుమతి చేస్తాయి. వివిధ దేశాలలో తమ అధీనంలో వుండే అనుబంధ పరిశ్రమలను నెలకొల్పడం ద్వారా బహుళ జాతి సంస్థలు ఈ పద్ధతిని అమలు చేయగలుగుతున్నాయి. 3. సబ్–కాంట్రాక్టింగ్ పద్ధతి. ఇందులో విడి భాగాల తయారీ, ఇతర కార్యకలాపాలు తమ స్వంత ఫాక్టరీలలో కాకుండా స్థానిక తయారీదారులకు (వివిధ అనుబంధ పరిశ్రమలకు) కాంట్రాక్ట్‌కు ఇస్తారు. 4. దళారీబూర్జువా వర్గంతో జాయింట్ వెంచర్లు నెలకొల్పడం. ఎంఎన్‌సీలే ఈ జాయింట్ వెంచర్‌లను అదుపు చేస్తాయి. అది సబ్‌కాంట్రాక్ట్ అయినా, జాయింట్ వెంచర్ అయినా విదేశీ పెట్టుబడి అవలంబించే వ్యూహం ఏమంటే దేశీయంగా నెలకొల్పిన కంపెనీల వద్ద నుంచి సరుకులు కొనుగోలు చేయడం, వాటికి తమ ట్రేడ్ మార్క్ వేసి అమ్ముకోవడం. 5. స్థానిక పరిశ్రమలను కొనుగోలు చేయడం. ఇది ఎంఎన్‌సీల దోపిడీ కొనసాగించడానికి మరో ముఖ్యమైన పద్ధతి. వీటినే టేక్ ఓవర్‌లని కూడా అంటున్నారు. ఈ టేక్ ఓవర్‌లలో తాజా పెట్టుబడి ఉండదు. ఉనికిలో ఉన్న ఫాక్టరీల యాజమాన్యంలో మార్పు మాత్రమే ఉంటుంది. దీంతో స్థానిక కంపెనీల మార్కెట్ కూడా టీఎన్‌సీల చేతుల్లోకి పోతుంది. ఏ దేశ మార్కెట్‌లోకైనా ప్రవేశించడానికి ఇది అత్యంత భద్రమైన, తేలికైన మార్గం. మార్కెట్‌లో లభ్యమయిన వాటా మీద ఆధారపడి అది తన ప్రపంచ బ్రాండ్‌తో యావత్తు జాతీయ మార్కెట్‌నూ స్వాధీనం చేసుకుంటుంది.

## ప్రపంచ ద్రవ్య పెట్టుబడి – దాని వివిధ రూపాలు:

ద్రవ్య పెట్టుబడి అంటే డబ్బు ద్వారా డబ్బు సంపాదించడం. ద్రవ్య పెట్టుబడి స్వభావ రీత్యా రెండు రకాలు: ఈసీఎం (ఈక్విటీ కాపిటల్ మార్కెట్స్–ఈక్విటీ పెట్టుబడి మార్కెట్లు), డీసీఎం (డెట్ కాపిటల్ మార్కెట్స్–రుణ పెట్టుబడి మార్కెట్లు). ఈక్విటీ వాటాలను (ఒక కంపెనీ ఆపరేషన్స్‌లో పెట్టుబడిని మదుపు పెట్టడం ద్వారా అందులోని వాటాలను/షేర్లను కొనుగోలు చేయడం) కొనుగోలు చేసే ఏ పెట్టుబడి మదుపును అయినా, పూర్తిగా షేర్ మార్కెట్‌లోకి పోయే ఏ పెట్టుబడి మదుపును అయినా ఈక్విటీ మదుపు అవుతుంది. పైన పేర్కొన్న మదుపుల కిందికి రాని ఏ పెట్టుబడి అయినా రుణ పెట్టుబడి అవుతుంది. ఈసీఎంకు గానీ, డీసీఎంకు

గానీ రెండింటికీ మూడు రూపాలు (ఫార్మేట్స్) ఉంటాయి: ఇన్‌బౌండ్, ఔట్‌బౌండ్, క్రాస్–బార్డర్. ఇన్‌బౌండ్ ఈసీఎం/డీసీఎం అంటే పెట్టుబడి విదేశీ పెట్టుబడిదారుల నుంచి దేశంలోకి వస్తుందని అర్థం. ఔట్‌బౌండ్ ఈసీఎం/డీసీఎం అంటే పెట్టుబడి దేశం నుంచి విదేశాలకు వెళుతుందని అర్థం. క్రాస్–బార్డర్ ఈసీఎం/డీసీఎం అంటే పెట్టుబడి ఒక ఖండం నుంచి మరో ఖండానికి లేదా కొన్ని దేశాల మధ్య తిరుగుతుందని అర్థం.

అయితే ద్రవ్య పెట్టుబడిదారులు "నూతన ఫైనాన్సింగ్ శైలి"ని ప్రవేశపెట్టినప్పుడల్లా నూతన ద్రవ్య పెట్టుబడి రూపాలు ముందుకు వస్తున్నాయి. ప్రధాన ద్రవ్య పెట్టుబడి రూపాలు ఇవి:

**ఎఫ్‌డీఐ, ఎఫ్ఐఐ, ఎఫ్‌పీఐ:** ఎఫ్‌డీఐ (విదేశీ ప్రత్యక్ష మదుపు) మరియు ఎఫ్ఐఐ (విదేశీ సంస్థాగత మదుపులు. వీటిని ఎఫ్‌పీఐ–విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపులు అని కూడా పిలుస్తారు) మదుపులు ఇన్‌బౌండ్ ఫార్మేట్‌లో భాగమే. ఎఫ్‌డీఐ మదుపులు ఈసీఎం మరియు డీసీఎం – రెండు ఫార్మేట్లలోనూ వస్తుంది. అయితే ఎఫ్ఐఐ పూర్తిగా ఈసీఎం ఫార్మేట్‌లోనే ఉంటుంది. ఎఫ్ఐఐ మదుపులను కంపెనీలకు రుణాలుగా ఇవ్వడం గానీ, షేర్ మార్కెట్‌లో మదుపు పెట్టడం గానీ, ఎఫ్‌డీఐ లాగా కంపెనీల కార్యకలాపాలలోకి నేరుగా ప్రవేశించడం గానీ ఉండదు.

ఈ ద్రవ్య పెట్టుబడి సంస్థలు ఇంకా హెడ్జ్ ఫండ్స్, ప్రైవేట్ ఈక్విటీ, పెన్షన్ ఫండ్స్, సార్వభౌమ ఆస్తి నిధులు (Sovereign Wealth Funds (SWF)), మ్యూచువల్ ఫండ్స్, భీమా కంపెనీలు మరియు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు మొదలైన రూపాలలో ఉన్నాయి. ఇవి ఒక కంపెనీలో మదుపుపెట్టేందుకు లేదా దానిని టేక్ ఓవర్ చేసేందుకు ఐక్యమవుతాయి. 2018 జులైలో ఒక భారత కంపెనీలో మదుపు పెట్టేందుకు టీపీజీ అనే పేరు గల ఒక అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ కంపెనీ ప్రపంచంలో 2వ అతిపెద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ (అబు ధాబీకి చెందిన ఎడీఐఎ)తో తన శక్తులను కలిపేసింది.

భారతదేశంలో ఈ అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు భారీగా మదుపులు పెట్టి, దేశ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలను తమ అదుపులోకి తెచ్చుకున్నాయి. భారతదేశంలో కూడా పెట్టుబడి సంచయనం కేంద్రీకరణ జరిగింది. దీంతో ఇక్కడ కూడా వేరు వేరు రూపాలలో ద్రవ్య పెట్టుబడి సంస్థలు కొన్ని ఉన్నప్పటికీ, అవి తక్కువ సంఖ్యలోనూ, పరిమాణంలో చిన్నవిగాను ఉండి, అధిక రిస్కు తీసుకోవడానికి సిద్ధపడవు. ఇవి బహుళజాతి ద్రవ్య సంస్థలకు లోబడి ఉంటాయి.

సూపర్ లాభాలు ఆర్జించేందుకు ద్రవ్య పెట్టుబడిదారులు, వారి దళారీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న మరి కొన్ని మోసపూరిత విధానాలు: ప్రభుత్వం పెట్టుబడిదారులతో కుమ్మక్కై బ్యాంకులలో లేదా పోస్ట్ ఆఫీసులలో ఫిక్సడ్ డిపాజిట్లలో వడ్డీ రేట్లను తగ్గించింది. పెన్షన్ ఫండ్స్‌కు సైతం తక్కువ వడ్డీ రేట్లు అందిస్తున్నది. ప్రభుత్వం ఈ ఎత్తుగడను అవలంబించడం

ద్వారా ప్రజలను బలవంతంగా సురక్షితమైన మదుపు మార్గాల నుంచి అధిక ప్రమాదం ఉండే ఈక్విటీ షేర్లు లేదా ముచువల్ ఫండ్స్‌లో మదుపు పెట్టే విధంగా నెడుతున్నది. ద్రవ్యోల్బణం నుంచి ఉపశమనం కలిగించే స్థిరమైన (ఫిక్స్‌డ్) ఆదాయం రాకుండా ప్రజలను వంచిస్తున్నది. దీనిని ఈక్విటైజేషన్ ఆఫ్ సేవింగ్స్ అని పిలుస్తున్నారు (అంటే దీని అర్థం ద్రవ్య రూపంలో ఉన్న డబ్బును ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ డిపాజిట్లలో కాకుండా స్టాక్ మార్కెట్‌లో సేవింగ్ చేయడం). ఇది కొరివితో తల గోక్కోవడం లాంటిది. ఎందుకంటే, పేద, మధ్యతరగతి ప్రజలకు తమ రోజువారీ అవసరాలకు ప్రత్యేకించి ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి రెగ్యులర్ ఆదాయం అవసరమవుతుంది. కానీ వారిని మార్కెట్ కీకారణ్యంలోకి బలవంతంగా నెట్టడం వల్ల వారికి ఆ రకంగా ఇందులో ఆదాయం రాదు. అంతేకాకుండా, ప్రజలకు డబ్బు అవసరమైనప్పుడు వారు షేర్లను లేదా ముచువల్ ఫండ్ యూనిట్స్‌ను మార్కెట్ పడిపోయిన స్థితిలో సైతం అమ్ముకోవాల్సి వస్తుంది. తద్వారా గత కొన్ని సంవత్సరాలుగా వారు సంపాదించుకున్న లాభాలన్నింటినీ వదులుకోవాల్సి వస్తుంది. అలాగే స్టాక్ మార్కెట్ లేదా ముచువల్ ఫండ్స్ మార్కెట్ అత్యంత జటిలంగా ఉంటుంది. చాలా సార్లు నిపుణుల అంచనాలు సైతం నిజం కాకుండా పోతాయి. అందువల్ల, సాధారణ ప్రజలకు వీటి ఆనుపానులు తెలియవు. తక్కువ ఫలితాలు వచ్చే తప్పుడు షేర్లను లేదా ముచువల్ ఫండ్స్‌ను కొనుగోలు చేసి నష్టపోతుంటారు.

అంతేకాకుండా, మొత్తం ప్రపంచంలో పెట్టుబడిదారులు ఎవరూ కూడా తమ వ్యక్తిగత ఆస్తిని తాము స్వయంగా స్థాపించిన కంపెనీలో మదుపుపెట్టరు. వారు తమ కంపెనీ గురించి పెద్దెత్తున ప్రచారం చేస్తారు, అందులో షేర్లు కొనేలా సాధారణ ప్రజలను ఆకర్షిస్తారు కానీ తమ స్వంత కంపెనీలో ఒక్క షేరు కూడా వారు కొనుగోలు చేయరు. తమ షేర్లను కొనుగోలు చేయమని ప్రజలను ప్రలోభపెడతారు. ఎందుకంటే పెట్టుబడిని పెంచుకోవడానికి రుణాలు తీసుకోవడం లేదా ప్రైవేట్ ఈక్విటీని ఆశ్రయించడం కంటే ఇది చౌకైన వనరు. తమ కంపెనీ ప్రజలు షేర్లు కొనుగోలు చేస్తే తమ కంపెనీ షేరు విలువ పెరుగుతుంది. అంతేకాకుండా, షేర్‌కు ఎంత డిమాండ్ పెరిగితే, మార్కెట్‌లో అది ఎంత ఎక్కువ ధర పలుకుతుంది, ఇది అనేక రకాల ప్రయోజనాలను చేకూర్చుతుంది. తమ షేరు విలువ హెచ్చుగా ఉన్నప్పుడు వారు ఆ షేర్లను అమ్ముతారు (వారికి ద్రవ్య రూపంలో డబ్బు అవసరమైనప్పుడు).

సాధారణంగా, సెన్సెక్స్ ప్రదర్శన గురించి మీడియా పతాక శీర్షికలలో పేర్కొంటుంది. ఎందుకంటే షేర్ మార్కెట్‌లో షేర్ల ధరలు పెరుగుతున్నాయా, పడిపోతున్నాయా అనేదానికి ఇది సూచిక. భారతదేశంలో బీఎస్ఈ సెన్సెక్స్ (బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్) కేవలం 30 కంపెనీలకు సంబంధించినది. ఇది అత్యధిక పెట్టుబడితో కూడుకున్న మార్కెట్ (అందులోని కంపెనీలన్నీ మన దేశంలో టాప్ కార్పొరేట్ కుటుంబాలకు సంబంధించినవి). నిఫ్టీ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి (ఎన్ఎస్ఈ)కి సంబంధించినది. ఇది ప్రధానంగా 50 కంపెనీలతో కూడుకొని ఉంటుంది

(అది మరో 50 కంపెనీల వివరాలను కూడా ఇస్తుంది). అందువల్ల, మీడియా సెన్సెక్స్ పట్ల ఉద్వేగభరితమైన పతాక శీర్షికలు ఇస్తున్నప్పుడు, దాని అర్థం బీఎస్ఈ లేదా ఎన్ఎస్ఈ వేదికలపై వేలాది కంపెనీల షేర్ల వ్యాపారం జరిగినప్పటికీ 30 సెన్సెక్స్ కంపెనీలలో యావత్ కంపెనీల లేదా కొన్ని కంపెనీల షేర్లు బూమింగ్‌లో ఉన్నాయని మాత్రమే.

## ప్రధాన ధోరణిగా మారిన ద్రవ్య వ్యాపారం:

ప్రపంచీకరణ కాలంలో అంతర్జాతీయ ద్రవ్య రంగంలో పెను మార్పులు వచ్చాయి. ప్రపంచ ద్రవ్య మార్కెట్లు వేగంగా వృద్ధి చెందాయి. సంచయనం అయిన అదనపు విలువలో అత్యధిక భాగం స్పెక్యులేషన్, అనుత్పాదక రంగాలలోకి వెళ్లింది. అంతర్జాతీయ మార్కెట్ అంటే సరుకుల, సేవల మార్కెట్ కాక, ప్రధానంగా షేర్‌లు, బాండులు, సెక్యూరిటీలు, కరెన్సీ మారకం, ఫ్యూచర్స్ మొదలయిన వాటితో కూడిన మార్కెట్టుగా మారిపోయింది.

ఎంఎన్‌సీల ద్రవ్య లావాదేవీలలో 90 శాతం వాటి ఆర్థిక అవసరాల కోసం కాకుండా స్పెక్యులేటివ్ వ్యాపారంతో ముడిపడి ఉన్నాయి. ఈ స్పెక్యులేటివ్ వ్యాపార వికాసం అమెరికాలో, ఐరోపాలో, జపాన్‌లో ప్రారంభమై 1980 నుంచి వెనుకబడిన దేశాలకు విస్తరించింది. 'హాట్ మనీ'గా కూడా పిలువబడే ఈ స్పెక్యులేటివ్ పెట్టుబడి వెనుకబడిన దేశాలలో ఉత్పాదక రంగంలోని నూతన పారిశ్రామిక సంస్థలలో ప్రాథమికంగా తాత్కాలికంగా స్వల్పకాలిక పునాదిపై తాజా పెట్టుబడిగా అంటే ఎఫ్‌డిఐగా కాకుండా సెకండరీ మార్కెట్‌లలో షేర్‌ల, బాండుల కొనుగోళ్లు-అమ్మకాలు చేసే స్పెక్యులేషన్‌గా, విదేశీ పెట్టుబడిగా వెళ్లింది. ఈ దేశాల పెట్టుబడి మార్కెట్‌లోకి స్వేచ్ఛగా ప్రవేశించింది. మరింత వేగంగా లాభాలు సంపాదించే అన్వేషణలో భాగంగా లాభం పొందిన తక్షణమే అక్కడి నుంచి వెనక్కు వచ్చి లాభాలకు అవకాశముండే ఒక పెట్టుబడి మార్కెట్ నుంచి మరో మార్కెట్‌కు, ఒక దేశం నుంచి మరో దేశానికీ రాత్రికి రాత్రి అది పరుగు పెట్టింది. అది కాపిటల్ మార్కెట్‌లోకి రావడం మరియు హఠాత్తుగా వెనక్కు తగ్గడం వల్ల ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలు అస్తవ్యస్తమయ్యాయి. అది భారీ అమ్మకాల ద్వారా కరెన్సీల విలువలను తీవ్రంగా పడగొట్టింది. 1990ల చివరిలో యావత్తు ఆగ్నేయాసియాలో సంక్షోభమూ, 1994లో మెక్సికో సంక్షోభం అంతర్జాతీయ కరెన్సీలను తలకిందులు చేయడం వల్లను, స్టాక్ బ్రోకర్‌లు అవినీతికి పాల్పడినందువల్లను ఏర్పడినవే. అమెరికాలో జంక్ బాండ్‌లు ఈ స్పెక్యులేటివ్ వ్యాపారపు అత్యంత అసహ్యకరమైన రూపాన్ని వెల్లడించాయి. ఈ బాండ్‌లతో లాభాల కోసం ఫ్యాక్టరీల కొనుగోళ్లు-అమ్మకాలూ చేసారు. సరళీకరణ, ప్రపంచీకరణలను ప్రోత్సహించేది ఈ అంతర్జాతీయ ద్రవ్య దొంగలు, బ్రోకర్‌లే.

1990 నాటికి జంక్ బాండ్‌లలో 200 బిలియన్ డాలర్‌లు పెట్టుబడి పెట్టారు. ఆ కంపెనీ లాభాలతో గానీ, ఉత్పత్తితో గానీ వాటికి సంబంధం లేదు. ఈ స్పెక్యులేటివ్ వ్యాపారం పరిమితులు

లేకుండా విదేశీ కరెన్సీ లావాదేవీలలోను, సెకండరీ మార్కెట్‌లలోనూ పెరుగుతున్నది. ఎంఎన్‌సీలు, అంతర్జాతీయ బ్యాంకులు, ఇతర సేవా సంస్థలూ ఈ జూదం మీదనే లాభాలు చేసుకుంటున్నాయంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు బ్యాంకుల పాత్ర రుణాలు ఇవ్వడం కంటే ఈ బాండ్‌లు, సెక్యూరిటీల కొనుగోళ్లు–అమ్మకాలలోనే అధికంగా ఉన్నది. సెక్యూరిటీల కొనుగోళ్లు–అమ్మకాలూ ప్రతి రోజూ కోట్ల రూపాయలలో జరుగుతున్నది. అంతర్జాతీయ బాండుల విలువ 1982లో 259 బిలియన్ డాలర్‌ల నుంచి 1991లో 1.65 ట్రిలియన్ డాలర్‌లకు పెరిగింది. కరెన్సీ వ్యాపారం 1991లో రోజుకు 900 బిలియన్ డాలర్‌లు ఉన్నదని అంచనా. 21వ శతాబ్దంలో గ్రీన్ ఫైనాన్స్ వృద్ధి ఒక చెప్పుకోదగిన పరిణామం. మొట్టమొదట 2007లో గ్రీన్ బాండ్లు జారీ అయినాయి. ఇవి పునరుత్పాదక ఇంధన రంగం (46 శాతం)లో, ఇంధన సామర్థ్యం (20 శాతం)లో, తక్కువ కార్బన్ వాయువులు వెలువరించే ట్రాన్స్‌పోర్ట్ (13 శాతం)లో, శుద్ధమైన నీరు తయారు చేసే కంపెనీలలో (9 శాతం), చెత్త–కాలుష్య నిరోధక కంపెనీలు (6 శాతం), తదితర కంపెనీలలో మదుపుపెడుతున్నాయి. 2016 నాటికి గ్రీన్ బాండ్ల పరిమాణం 100 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అంతర్జాతీయ స్థాయిలో ఒకవైపు వాస్తవ ఆర్థిక వ్యవస్థ (వ్యాపారం, ఉత్పత్తి, వినిమయం మొదలయినవి)కు, మరోవైపు ద్రవ్యరంగానికీ మధ్య స్పష్టమైన విభజన రేఖ గీయబడింది. ద్రవ్యరంగం వాస్తవ ఆర్థిక వ్యవస్థను అదుపు చేయసాగింది.

ఎఫ్‌డీఐ అంటే 'ఒక దేశ సంస్థను తమ చేతులలో ఉంచుకోవడం లేదా దానిపై ప్రభావవంతమైన మేనేజ్‌మెంట్ కంట్రోల్ నెలకొల్పుకోవడం ద్వారా సూపర్ లాభాలను ఆర్జించే లక్ష్యంతో పెట్టే పెట్టుబడి'. ఎంఎన్‌సీల లక్ష్యాన్ని బట్టి ఎఫ్‌డిఐ నాలుగు రకాలుగా ఉంది. మొదటిది, 'సామర్థ్యాన్ని కోరుకునే' (Efficiency-seeking) ఎఫ్‌డీఐ. సామర్థ్యం అంటే ఖర్చులు తగ్గించడం, ముఖ్యంగా శ్రమ ఖర్చు తగ్గించడం. రెండోది, 'మార్కెట్‌పై ఆధిపత్యాన్ని కోరుకునే' (Market-seeking) ఎఫ్‌డీఐ. నయాఉదారవాద ప్రపంచీకరణకు ముందు కాలంలో ఈ రకమైన ఎఫ్‌డీఐయే ప్రధాన రూపంగా ఉన్నది. రక్షణవాదం కారణంగా టీఎన్‌సీలు ఉత్పత్తిని మార్కెట్‌లకు సన్నిహితంగా తీసుకువెళ్లాయి. అమెరికాలో జపాన్, ఐరోపా యాజమాన్యంలో వున్న కారు పరిశ్రమలలో ఇప్పటికీ ఇది కనిపిస్తుంది. ఈ రకమైన ఎఫ్‌డీఐ ఇప్పటికీ ముఖ్యమైనదిగానే ఉంది. 'సామర్థ్యాన్ని కోరుకునే' ఎఫ్‌డీఐ మాదిరిగా 'మార్కెట్‌పై ఆధిపత్యాన్ని కోరుకునే' ఎఫ్‌డీఐ ఉత్పత్తి ప్రక్రియలను విభజించదు. ఎఫ్‌డీఐని మదుపుపెట్టిన దేశంలోనే తిరిగి మదుపుపెడుతుంది. సరుకులకు ముఖ్యమైన మార్కెట్‌లు చాలా వరకు సామ్రాజ్యవాద దేశాలలోనే ఉండడం వల్ల 'మార్కెట్‌పై ఆధిపత్యాన్ని కోరుకునే' ఎఫ్‌డీఐపై సామ్రాజ్యవాద దేశాల పెట్టుబడుల ఆధిపత్యం ఉంటుంది లేదా అంతర్జాతీయ ఉత్పత్తిపై ఆధారపడిన వ్యాపారం సమాన స్థాయిలో ప్రధానంగా సామ్రాజ్యవాద–పెట్టుబడిదారీ దేశాల మధ్య జరుగుతుంది. మూడవది 'వనరులపై (రిసోర్స్‌లపై) ఆధిపత్యం కోరుకునే' (Resource-seeking) ఎఫ్‌డీఐ.

ఇది ప్రధానంగా హైడ్రోకార్బన్‌లు, ఖనిజాల వంటి మైనింగ్ పరిశ్రమలలో, ఆహార పదార్థాలు, అలంకరణ సామగ్రిలో వాడే పదార్థాలు, వ్యవసాయ ఉత్పత్తులలో విదేశీ పెట్టుబడిని సూచిస్తుంది. ఎఫ్‌డీఐ నాలుగవ రూపం 'సాంకేతిక పరిజ్ఞానంపై ఆధిపత్యాన్ని కోరుకునేది' (technology-seeking FDI). ఇది వేరే దేశంలో శాస్త్రీయ, లేదా సాంకేతిక జ్ఞానాన్ని పొందాలని చూస్తుంది. పేద దేశాలలో ఈ రకమైన ఎఫ్‌డీఐ అరుదు.

1983-1990 మధ్య కాలంలో ఎఫ్‌డిఐ భారీగా పెరిగింది. అది ప్రపంచ ఉత్పత్తి కంటే నాలుగు రెట్లు, ప్రపంచ వ్యాపారం కంటే మూడు రెట్లు వేగంగా పెరిగింది. 1990 చివరి నాటికి అది 1.5 ట్రిలియన్ డాలర్‌లకు చేరుకుంది. 2001-2012 మధ్య కాలంలో వెనుకబడిన దేశాలు 464 బిలియన్ డాలర్‌ల ఎఫ్‌డీఐని, సామ్రాజ్యవాద-పెట్టుబడిదారీ దేశాలు 609 బిలియన్ డాలర్‌ల ఎఫ్‌డీఐని పొందాయి. 2013లో ప్రపంచవ్యాప్తంగా ఎఫ్‌డీఐలో 61 శాతం వెనుకబడిన దేశాలలోకి వచ్చింది. ఇది 2006లో 33 శాతం, 2010లో 51 శాతంగా ఉండింది. 2010-2012 మధ్య కాలంలో తయారీ రంగంలో ఎఫ్‌డీఐ ప్రవాహం సామ్రాజ్యవాద-పెట్టుబడిదారీ దేశాలలో 145 బిలియన్ డాలర్‌లుగా ఉండగా, వెనుకబడిన దేశాలలో దీనిని మించిపోయి 151 బిలియన్ డాలర్‌లకు చేరుకుంది. అలాగే సామ్రాజ్యవాద దేశాలలో ద్రవ్య వ్యాపార కార్యకలాపాలలో 2001-2012 మధ్య కాలంలో 1.37 ట్రిలియన్ డాలర్‌ల ఎఫ్‌డీఐ ప్రవహించింది. ఆ దేశాలలోకి వచ్చే తయారీ రంగ ఎఫ్‌డీఐకి ఇది రెండు రెట్లు. ఇది వెనుకబడిన దేశాలలో 509 బిలియన్ డాలర్‌లుగా ఉన్నది. 2017లో యూఎన్‌సిటిఎడికి చెందిన వరల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ రిపోర్టు ప్రకారం 2014లో 1.3 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న ప్రపంచ ఎఫ్‌డీఐ మదుపులు 2015లో బాగా వృద్ధి చెంది 1.8 ట్రిలియన్ డాలర్లు అయినప్పటికీ, 2016లో వాటి వృద్ధి రేటు 2 శాతం పడిపోయి 1.75 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. ప్రత్యేకించి వెనుకబడిన దేశాలకు ఎఫ్‌డీఐ మదుపులు బాగా పడిపోయాయి. అవి 14 శాతం క్షీణించి 646 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అయితే దక్షిణాసియాలోకి ఎఫ్‌డీఐ మదుపులు 6 శాతం పెరిగి 54 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. సామ్రాజ్యవాద-పెట్టుబడిదారీ దేశాలలోకి ఎఫ్‌డీఐ మదుపులు 2015 కంటే గణనీయంగా 5 శాతం పెరిగి ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అయితే 2017లో ప్రపంచ మదుపులు 5 శాతం పెరిగి దాదాపు 1.8 ట్రిలియన్ డాలర్లకు, 2018లో 1.85 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటాయని అంచనా వేసినప్పటికీ మదుపులు 2007 నాటి ఉచ్చస్థాయికి చేరుకోలేవని ఆ రిపోర్టు అంచనా.

ముఖ్యమైన విషయం ఏమిటంటే, సామ్రాజ్యవాద దేశాల మధ్య ఎఫ్‌డీఐ ప్రవాహం చాలా వరకు విలీనాల-కబ్జాల (ఎం అండ్ ఎ) రూపంలో ఉన్నది. ఎం అండ్ ఎ ఎఫ్‌డీఐ పెట్టుబడి కేంద్రీకరణ వేగవంతం కావడాన్ని ప్రతిబింబిస్తుంది. ఉదాహరణకు, 2014-2015 మధ్య

సీమాంతర ఎం అండ్ ఏల విలువ వేగంగా 428,126 బిలియన్ డాలర్ల నుంచి 735,126 బిలియన్ డాలర్లకు పెరుగగా, 2016లో ఇది మామూలు వృద్ధి చెంది 868,647 బిలియన్ డాలర్లు అయ్యింది. 2007లో జరిగిన మొదటి అతి పెద్ద సీమాంతర ఎం ఎండ్ ఎ ఒప్పందం స్కాట్‌లాండ్‌కు చెందిన రాయల్ బ్యాంక్ డచ్ ఎబిఎన్-ఎఎంఆర్ఒ బ్యాంకును 98.2 బిలియన్ డాలర్‌లకు కబ్జా చేసుకోవడం.

బ్యాంకులు సంపదలను పోగు చేసుకోవడం, అక్రమంగా సంపాదించడం తప్ప వాటిలో ఏ ఒక్కటీ సరుకును ఉత్పత్తి చేయవు. అవి రుణాలు ఇవ్వడం ద్వారా, పెట్టుబడులు పెట్టడం ద్వారా, హెడ్జ్ ఫండ్స్‌లో, ఫ్యూచర్ మార్కెట్‌లలో భాగస్వామ్యం వహించడం ద్వారా, ప్రైవేట్ కాపిటల్‌ను నిర్వహించడం మొదలైన అనేక పద్ధతుల ద్వారా మరియు పరోక్షంగా తాము ఫైనాన్స్ చేసే టీఎన్‌సీల ద్వారా వెనుకబడిన దేశాలపై గట్టి పట్టు సాధిస్తుంటాయి. 2007లో జరిగిన రెండో అతి పెద్ద ఎం ఎండ్ ఎ ఒప్పందం మైనింగ్ మరియు పాకేజింగ్ రంగాలలో భారీ సంస్థ అయిన అల్కాన్‌ను తన కెనడా యజమానుల నుంచి బ్రిటన్ రియో టింటో విలీనం చేసుకోవడం. అల్కాన్ కంపెనీకి 61 దేశాలలో 65,000 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 28 శాతం మంది ఐరోపా, ఉత్తర అమెరికాలకు బయటివారు. ఇక మూడో అతి పెద్ద ఎం ఎండ్ ఎ ఒప్పందం స్పానిష్ భారీ కంపెనీ ఎండెసాను ఇటలీ పెట్టుబడిదారులు 26.4 బిలియన్ డాలర్‌లకు కబ్జా చేసుకోవడం. అదే సంవత్సరం ఎండెసా సంస్థ స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, ఫ్రాన్స్, మొరొక్కో, చిలీ, అర్జెంటీనా, కొలంబియా, పెరూ, బ్రెజిల్, మధ్య అమెరికా, కారిబియన్‌లలో అనుబంధ పరిశ్రమలను నెలకొల్పింది. అది 2007లో లాటిన్ అమెరికా, కారిబియన్‌లలో వ్యాపారంలో వచ్చిన లాభాల నుంచి 18 శాతం అంటే 471 మిలియన్ యూరోలు సంపాదించింది. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి.

ప్రపంచ సంక్షోభానికి ముందు సామ్రాజ్యవాద-పెట్టుబడిదారీ దేశాలలోకి భారీగా వచ్చిన ఎం ఎండ్ ఎ ఎఫ్‌డీఐ ప్రవాహాలు ద్రవ్య రంగంలో యావత్తు పారిశ్రామిక రంగాలలో తక్కువ వేతనాలున్న దేశాలకు ఉత్పత్తి క్రమాలను బదిలీ చేయడం, కొనసాగడం టీఎన్‌సీలలో కేంద్రీకరణ, గుత్తాధిపత్యాల క్రమాన్ని ప్రతిబింబిస్తున్నది. ఈ వైవిధ్యపూరిత క్రమాన్నంతటినీ కలిపి ఎఫ్‌డిఐగా చెబుతారు. అందువల్ల ఎఫ్‌డీఐ గణాంకాలలో మూడు పూర్తి విభిన్నమైన ధోరణులు విలీనమై ఉంటాయి: 1) సామ్రాజ్యవాద బ్యాంకు పెట్టుబడుల, ద్రవ్య పెట్టుబడుల కేంద్రీకరణ, 2) సామ్రాజ్యవాద పారిశ్రామిక పెట్టుబడులను, వాణిజ్య పెట్టుబడులను కలిగి వున్న అత్యధిక ప్రముఖ సంస్థలు వాస్తవిక ఉత్పత్తిని సుదూర వెనుకబడిన దేశాలలోని అనుబంధ కంపెనీలలోని కార్మికుల ద్వారా కొనసాగించే ఒక కేంద్రీకరణ క్రమం, 3) ఉత్పత్తి క్రమాలు పతనమయ్యే ఒక క్రమం, అత్యధిక శ్రమ దోపిడీని సాగించే అన్వేషణలో భాగంగా అవి వెనుకబడిన దేశాలకు తరలి వెళ్లడం.

ఎఫ్‌డీఐ ఆదాయంలో మూడు భాగాలు ఉంటాయి: విదేశాల్లో పెట్టిన మదుపుపై తమ దేశానికి పంపిన (రిపాట్రియేటెడ్) లాభాలు, స్టాక్ హోల్డర్లకు పంపిణీ చేయని (రిటెయిన్డ్) లాభాలు, మాతృసంస్థ అనుబంధ సంస్థలకు ఇచ్చిన రుణాలపై వడ్డీ చెల్లింపులు.

2002 సెప్టెంబర్‌లో ప్రపంచంలో ముగ్గురు అగ్రశ్రేణి బిలియనీర్ల ఆస్తులు యావత్తు అత్యంత వెనుకబడిన దేశాల మొత్తం జీడీపీ (ఈ దేశాల జనాభా 60 కోట్లు) కంటే ఎక్కువ. దీన్ని బట్టి ఈ కార్పొరేట్ దిగ్గజాలు ఎంత శక్తివంతమైనవారో ఊహించుకోవచ్చు. వారి కంపెనీలు పరిమాణంలో ఎంత భారీగా ఉంటాయో, అంతగా అహంభావాన్ని కలిగి వుండి నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తుంటాయి. అమెరికా వార్షిక రక్షణ ఖర్చుతో (ఇది సుమారు 18 లక్షల కోట్లు ఉంటుంది) పోలిస్తే భారత ప్రభుత్వ జిడిపి చాలా తక్కువ. 2002 సెప్టెంబర్‌లో 'ఫోర్బ్స్' రూపొందించిన పట్టిక ప్రకారం 900 బిలియన్ డాలర్ల సంపద కలిగిన, భారత ప్రభుత్వ జిడిపికి రెండు రెట్లు సంపద కలిగి ఉన్న అగ్రశ్రేణి కుటుంబాలు 400 వరకూ ఉన్నాయి!

టెక్ అండ్ డిజిటల్ ఎంఎన్‌సీల విదేశీ అనుబంధ కంపెనీలు/సంస్థలు చెప్పుకోదగిన లాభాలు ఆర్జిస్తున్నాయి. అవి తమ మదుపులపై భారీగా నగదు రూపంలో లాభాలు సగటున అధికంగా సంపాదిస్తున్నాయి. 2015లో ఇతర ఎంఎన్‌సీలు సగటున 45 బిలియన్ డాలర్ల లాభాలు ఆర్జించగా, టెక్ మెగాకార్పొరేషన్లు సుమారు 75 బిలియన్ డాలర్ల లాభాలు సంపాదించాయి. టీఎన్‌సీలు ఔట్‌సోర్సింగ్ విధానంలో విదేశాలలో లభించిన లాభాలను తమ దేశంలో లభించిన లాభాలుగా చూపిస్తుంటాయి. ద్రవ్య పెట్టుబడి నిర్దాక్షిణ్యత గురించి లెనిన్ చెప్పిన విషయం గడచిన శతాబ్ద కాలంగా రుజువవుతూ వస్తున్నది.

2007లో యూఎన్‌సిటిఎడికి చెందిన వరల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ రిపోర్టులో ఎఫ్‌డీఐ ద్వారా పెద్దెత్తున ఉపాధి లభిస్తుందని ఢంకా భజాయించారు కానీ, 2003లో అమెరికా టీఎన్‌సీల యాజమాన్యంలోని ప్రతి మిలియన్ డాలర్‌ల ఎఫ్‌డీఐ మొత్తానికీ సామ్రాజ్యవాద–పెట్టుబడిదారీ దేశాలలోని తయారీ రంగంలో కేవలం 9.8 మంది కార్మికులను నియమించారు. ఇదే మొత్తంలో ఎఫ్‌డీఐ వెనుకబడిన దేశాలలో 23.8 మంది కార్మికులను, అంటే 2.4 రెట్లు ఎక్కువగా నియమించుకుంది. ఫలితంగా, తయారీ రంగంలోని 281 బిలియన్ డాలర్‌ల అమెరికా ఎఫ్‌డీఐ సామ్రాజ్యవాద–పెట్టుబడిదారీ దేశాలలో 2.76 మిలియన్‌ల కార్మికులను మాత్రమే నియమించుకుంది. అదే సమయంలో వెనుకబడిన దేశాలలో 88 బిలియన్ డాలర్‌ల ఎఫ్‌డీఐ మొత్తం 2.1 మిలియన్‌ల కార్మికులను నియమించుకుంది. ఇక గనులు, క్వారీయింగ్, పెట్రోలియం వంటి మైనింగ్ పరిశ్రమలలో ప్రతి మిలియన్ డాలర్‌ల ఎఫ్‌డీఐకీ సామ్రాజ్యవాద–పెట్టుబడిదారీ దేశాలలో 1.3 మంది కార్మికులను నియమించుకోగా, వెనుకబడిన దేశాలలో 2.5 మంది కార్మికులను నియమించుకుంది. అయితే టీఎన్‌సీల ఉపాధి గురించి యూఎన్‌సిటిఎడి వేసిన ఈ అంచనాలో టెంపరరీ, క్యాజువల్, సబ్ కాంట్రాక్ట్ కార్మికులను ఉ

ద్యోగులుగా పరిగణించలేదు.

2010కి ముందు ఎంఎన్‌సీల విదేశీ అనుబంధ కంపెనీలలో ఉపాధి 7.6 శాతం ఉండగా, గత ఐదు సంవత్సరాల్లో అది సగటున సంవత్సరానికి 4.9 శాతం పడిపోయింది. దీంతో మొత్తం ఎంఎన్‌సీలలోని విదేశీ ఉపాధిలో విదేశీ అనుబంధ కంపెనీలలోని ఉపాధి 2016లో 60 శాతం వద్ద స్థిరంగా ఉన్నప్పటికీ వాటి విదేశీ ఆస్తులు, అమ్మకాలతో పోల్చితే పడిపోయి 8 కోట్ల 21 లక్షల 40 వేలకు చేరుకుంది. ప్రధానంగా ఔట్‌సోర్సింగ్ వల్ల ఉపాధి పడిపోతోంది. 2000 ప్రారంభంలో ఆర్థిక వృద్ధి దెబ్బతిన్నప్పుడు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో నూతన ఔట్‌సోర్సింగ్ ఒప్పందాలకు దారితీసింది. ఉదాహరణకు, యూరప్‌లోని ఎరిక్సన్ (స్వీడన్), అల్కాటెల్ (ఫ్రాన్స్) కంపెనీలు, అమెరికాలోని హెచ్‌పీ, ఐబీఎం కంపెనీలు ఇలా ఔట్‌సోర్సింగ్ ఒప్పందాలు చేసుకున్నాయి. ఫలితంగా, ఈ ఎంఎన్‌సీల విదేశీ ఆస్తులు, ఉపాధి తీవ్రంగా పడిపోయి, ఆ కంపెనీలు క్రమంగా టాప్ 100 ఎంఎన్‌సీల ర్యాంకింగ్ నుంచి మాయమయ్యాయి.

2000–2010 మధ్యకాలంలో అమెరికాలో పారిశ్రామిక రంగంలో 12 మిలియన్‌ల ఉద్యోగాలు కోల్పోవడంతో అందులో ఉపాధి 29.6 మిలియన్‌లకు పడిపోయింది. దీంతో వీరి సంఖ్య 2016లో ఉద్యోగ జనాభాలో 16.7 శాతానికి పడిపోయింది. 2000లో వీరి సంఖ్య 23.2 శాతంగా ఉండింది. మాన్యుఫాక్చరింగ్ ఉపాధి మరింతగా దిగజారిపోయింది. 1979 మధ్య కాలంలో ఈ రంగంలో చరిత్రలోనే అత్యధికంగా 19.6 మిలియన్‌లుగా ఉంటే 2000 నాటికి ఇది 17.3 మిలియన్‌లకు పడిపోయింది. 2010 నాటికి 37 శాతం పడిపోయి 11.5 మిలియన్‌లకు చేరుకుంది. 2015 నాటికి క్రమంగా కోలుకుంటూ అమెరికా మాన్యుఫాక్చరింగ్ ఉపాధి స్వల్పంగా 12.3 మిలియన్‌లకు పెరిగింది. మొత్తం మీద చూస్తే, అమెరికా టీఎన్‌సీలు వెనుకబడిన దేశాలలో కార్మికులను క్యాజువలీకరణకు మార్గం సుగమం చేసాయి. ఈ విషయాన్ని కోకా–కోలా వంటి కంపెనీలలో స్పష్టంగా చూడవచ్చు. ఐరోపా, జపాన్‌లు కేంద్రంగా ఉన్న టీఎన్‌సీలలో కూడా పరిస్థితి ఇదే విధంగా ఉన్నది.

నయా ఉదారవాద దశలో వెనుకబడిన దేశాల శ్రమశక్తి వృద్ధి చెందింది. 1980–2003 మధ్య ఎగుమతి–సామర్థ్యం గల ప్రపంచ శ్రమశక్తి (export-weighted global labor force) నాలుగు రెట్లు పెరిగిందంటూ ఐఎంఎఫ్ పేర్కొంది. ప్రపంచంలో 'ఎకనామికల్లీ ఆక్టివ్ పాపులేషన్' (ఈఎపి) 1980లో 1.9 బిలియన్‌ల నుంచి 2006లో 3.1 బిలియన్‌లకు 63 శాతం పెరిగింది. ఈ పెరుగుదల దాదాపుగా వెనుకబడిన దేశాలలో జరిగింది. 2016లో ప్రపంచ శ్రమశక్తిలో 84 శాతం ఆ దేశాలలో ఉన్నది. వీరిలో 1.6 బిలియన్‌ల మంది వేతనాలతో పని చేస్తుండగా, మిగిలిన ఒక బిలియన్ మంది చిన్న రైతులుగా, ఇతర ప్రజలు భారీ సంఖ్యలో పలు రకాల 'అసంఘటిత ఆర్థిక వ్యవస్థ'లలో పని చేస్తున్నారు. గడచిన మూడు దశాబ్దాలలో, అంటే 1991 నుండి చూస్తే, వెనుకబడిన దేశాలలో కార్మికవర్గం సంఖ్య రీత్యా

పెరగడం మాత్రమే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మరింతగా అంతర్భాగమయ్యింది. ప్రపంచ ఈఏపీలో పరిమాణాత్మకంగా 63 శాతం పెరుగుదల వెనుకబడిన దేశాల వేతన కార్మికుల గుణాత్మక పెరుగుదలను సూచించదు. 1.47 బిలియన్ కార్మికులు ప్రపంచ శ్రామికులలో భాగం కావడం ద్వారా ప్రపంచ శ్రమశక్తిని రెట్టింపు చేసారు.

1980లు, 1990లలో ప్రపంచవ్యాప్తంగా వ్యవస్థీకృత సర్దుబాటు కార్యక్రమాల కారణంగా అనేక దేశాలలో పేదరికం, నిరుద్యోగం, చిరుద్యోగం పెరిగి అసంఘటిత రంగ వ్యాప్తికి దారితీసింది. 1995–2005 మధ్య కాలంలో ప్రపంచ పారిశ్రామిక కార్మికవర్గంలో వెనుకబడిన దేశాల పారిశ్రామిక కార్మికుల సంఖ్య వేగంగా పెరుగుతూ సంఖ్యాధిపత్యాన్ని కలిగి ఉన్నప్పటికీ, మొత్తం వెనుకబడిన దేశాల ఉపాధిలో వీరి వాటా కొద్దిగా అంటే 19.4 శాతం నుంచి 20.2 శాతానికి మాత్రమే పెరిగింది. 2002లో ఐఎల్ఓ రిపోర్టు ప్రకారం, ఆనాడు నూతన ఉపాధి చాలా వరకు, ప్రత్యేకించి వెనుకబడిన దేశాలలో అసంఘటిత రంగంలోనే ఉందనేది స్పష్టం. యావత్తు వ్యవసాయేతర ఉపాధిలో అసంఘటితరంగ ఉపాధి లాటిన్ అమెరికా, ఉత్తర ఆఫ్రికాలలో 51 శాతం (ఇందులో 40 శాతం వేతన కార్మికులు), ఆసియాలో 65 శాతం (ఇందులో 41 శాతం వేతన కార్మికులు), సబ్ సహారన్ ఆఫ్రికాలో 72 శాతం లేదా ఇందులో నుంచి దక్షిణాఫ్రికాను మినహాయిస్తే 81 శాతంగా (ఇందులో 30 శాతం వేతన కార్మికులు) ఉంది. ప్రత్యేకించి భారతదేశంలో ఉపాధి కలిగి ఉన్న జనాభాలో అత్యధికంగా 83 శాతం అసంఘటిత రంగంలో ఉన్నారు. వీరిలో 48 శాతం మంది వేతన కార్మికులు. ఏ దేశంలోనైనా అసంఘటిత రంగ ఉపాధి అపారంగా ఉన్నది. అసంఘటిత రంగం నయా ఉదారవాద ప్రపంచీకరణ ఫలితమే.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అధికారిక లేదా అనధికారిక రంగాలలో ఉపాధి వేగంగా క్యాజువలీకరించబడుతోంది. అంటే ఇక పర్మనెంట్ ఉద్యోగాలు గానీ, దీర్ఘకాల ఉద్యోగాలు గానీ ఉండవు. పెట్టుబడిదారుడికి ఎప్పుడు కార్మికులు అవసరమో అప్పుడు కొన్ని రోజులు లేదా నెలలు లేదా ఒక రోజులో కొన్ని గంటల పాటు పని ఇస్తాడు, దాన్ని బట్టే వేతనాలు ఇవ్వబడతాయి.

భారతదేశంలో బడా కార్పొరేట్ కంపెనీలు ఇప్పటికే కన్సల్టెంట్స్ భావనను ప్రారంభించాయి. అవి తమ ఉద్యోగులను ఉద్యోగం నుంచి వేతనం గల ఉద్యోగిగా రాజీనామా చేయమని, తమ కోసం కన్సల్టెంట్‌గా పని చేయమని అడుగుతున్నాయి. అట్లా పనిచేసేవారికి పని గంటల ప్రాతిపదికన ఇతర బెనిఫిట్లు ఏమీ లేకుండా కేవలం వేతనాలు చెల్లిస్తున్నారు. ఇది పాశ్చాత్య దేశాలలో చాలా కాలంగా అమలులో ఉన్న పద్ధతి. ఇది భారతదేశం వంటి దేశాలలో ప్రస్తుతం వేగంగా వ్యాపిస్తున్నది. అంటే సమీప భవిష్యత్తులో ఒక పెద్ద ఉపాధి సంక్షోభం తలెత్తనుందని స్పష్టమవుతుంది. ఇది నిరుద్యోగం, అర్ధ–ఉద్యోగిత/చిరుద్యోగం (అంటే ప్రజలకు రెగ్యులర్ ఉ

ద్యోగాలు లభించకపోవడం లేదా కనీస జీవితావసరాలు మాత్రమే తీర్చే వేతనాలతో కూడిన ఉద్యోగాలు)తో కూడుకొని ఉంటుంది.

కాజువలీకరణ–అతితక్కువ వేతనాలు ప్రపంచంలో ప్రధాన ధోరణిగా ఉంది. ఉదాహరణకు, ఐపోడ్, దాని విడిభాగాల తయారీలో ప్రపంచవ్యాప్తంగా 2006 నాటికి 41,000 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 14,000 మంది అమెరికా లోపల, 27,000 మంది అమెరికాకు వెలుపల వేరే దేశాలలో ఉన్నారు. చిన్నపాటి వేతనాలతో చేసే పనులు బయటి దేశాలకు ఇస్తారు. అమెరికాలో చేసే పనులను అధిక వేతనాలతో ఉండే ఇంజనీర్‌లతో, మేనేజర్‌లతో, తక్కువ వేతనాలు పొందే రీటైల్, వృత్తేతర కార్మికులతో చేయిస్తారు. అమెరికాలో ఉన్న 13,920 మంది కార్మికులలో కేవలం 30 మంది మాత్రమే ఏడాదికి 47,640 డాలర్‌లు పొందే ఉత్పత్తి కార్మికులు. 7,789 మంది ఏడాదికి 25,580 డాలర్‌ల సగటు వేతనం పొందే 'రిటెయిల్, ఇతర వృత్తేతర' కార్మికులు. 6,101 మంది 'వృత్తిపర' కార్మికులు, అంటే పరిశోధనా, అభివృద్ధి పని చేసే మేనేజర్‌లు, ఇంజినీర్‌లూ. ఈ మేనేజర్‌లు, ఇంజినీర్‌లకు అమెరికా యావత్తు వేతన ఖర్చులో మూడింట రెండు వంతులు పోతున్నది. వీరు సగటున ఏడాదికి 85,000 డాలర్‌లు పొందుతున్నారు. ఇదే చైనాలో 12,250 మంది ఉత్పత్తి కార్మికులు ఏడాదికి 1,540 డాలర్‌లు పొందుతున్నారు. ఇది అమెరికా రిటెయిల్ కార్మికుల సగటు వేతనాలలో కేవలం 6 శాతం, అమెరికా ఉత్పత్తి కార్మికుల వేతనాలలో 3.2 శాతం, అమెరికా వృత్తిపర కార్మికుల వేతనాలలో 1.8 శాతం. ఐపోడ్ సంబంధిత కార్యకలాపాలలో అమెరికాలోను చైనాలోనూ కార్మికులు సరిసమాన సంఖ్యలో ఉన్నప్పటికీ అమెరికాలో వేతన ఖర్చు 719 మిలియన్ డాలర్‌లు ఉండగా చైనాలో 19 మిలియన్ డాలర్‌లుగా ఉన్నది.

మరో పక్క వ్యవసాయ ఉపాధి వెనుకబడిన దేశాలలో ఇఏపీ (ఎకనామికల్లీ యాక్టివ్ పాపులేషన్–ఆర్థికంగా క్రియాశీల జనాభా) 1960లో 73 శాతం నుంచి 2016 నాటికి 48 శాతానికి, సామ్రాజ్యవాద–పెట్టుబడిదారీ దేశాలలో ఇఏపి సుమారు 1/3వ వంతు నుంచి కేవలం 4 శాతానికి పడిపోయింది. మొత్తం ఉపాధిలో వ్యవసాయ కార్మికుల వాటా పడిపోతున్నప్పటికీ, వ్యవసాయ రంగంలోని కార్మికుల సంఖ్య ప్రత్యేకించి దక్షిణ, తూర్పు ఆసియా, సబ్–సహారన్ ఆఫ్రికాలలో పెరుగుతూనే ఉందని ఐఎల్‌ఓ పేర్కొంది.

నూతన సహస్రాబ్దిలోని మొదటి ఐదు సంవత్సరాలలో వెనుకబడిన దేశాల పారిశ్రామిక ఉపాధిలో సాపేక్షిక (పెరుగుతున్న శ్రామికులతో పోల్చితే) స్తబ్దత కొనసాగింది. 2006లో ఐఎల్‌ఓ ప్రకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెద్దెత్తున ఆర్థిక వృద్ధి జరిగినప్పటికీ ఉద్యోగాల మార్కెట్లలోకి ప్రవేశిస్తున్నవారికి నూతన ఉద్యోగాలను కల్పించడంలో అది విఫలమవుతూ ఉండింది. పెరుగుతున్న శ్రామికులను ఇముడ్చుకోవడంలో వెనుకబడిన దేశాల ఆర్థిక వ్యవస్థలు మరింత అసమర్థంగా ఉన్నాయి. దాంతో భారీ వ్యవస్థీకృత నిరుద్యోగం, పేదరికం పెరిగాయి. ఎంతో

కొంత పని దొరికిన వారికి వేతనాలు బాగా తగ్గాయి.

ఈ ద్రవ్య పెట్టుబడి యుగంలో ప్రస్తుతం భారతదేశ పట్టణ ప్రాంతాలలో తీవ్రమైన ఉద్యోగాల కొరత మరియు/లేదా అర్ధ–ఉద్యోగిత కారణంగా విద్యావంతులైన పురుషులు, మహిళలు – ఇరువురు వేశ్యావృత్తిని స్వయం–ఉపాధిగా చేపట్టడం పెరిగిపోతున్నది. ఇది అభివృద్ధిలోని డొల్లతనాన్ని బహిర్గతం చేస్తున్నది.

ఇది కేవలం భారతదేశానికే పరిమితమై లేదు. ప్రపంచీకరణలో భాగమైన ప్రతీ దేశ పరిస్థితి ఇదే విధంగా ఉంది. థాయ్‌లాండ్ 1990ల నుంచి వేశ్యావృత్తికి ప్రపంచంలోనే ప్రముఖ హబ్‌గా ఉంది. అది భారతదేశం కంటే ముందే ప్రపంచీకరణలో భాగమైంది. ఇండోనేషియా ప్రస్తుతం థాయ్‌ల్యాండ్‌ను మించిపోయింది. అది సెక్స్ టూరిజానికి ప్రపంచ హబ్‌గా మారింది. ఒకప్పటి చమురు–సమృద్ధ దుబాయి (యుఏఈలో భాగం) ఇస్లామిక్ దేశంలో భాగమైనప్పటికీ, ప్రస్తుతం అక్కడ చమురు, సహజవాయువు నిక్షేపాల అంతంతో అది సెక్స్ టూరిజం హబ్‌గా ప్రత్యేకతను సంపాదించుకుంది. ఇతర దేశాల నుంచి దుబాయిని వేరు చేసే ప్రత్యేక విషయం ఏమిటంటే ఇక్కడ సెక్స్ వర్కర్లు తమ దేశానికి సంబంధించిన పౌరులు కాదు. వారంతా దాదాపు 100కు పైగా దేశాల నుంచి వచ్చినవారు. టర్కీ, ఉబ్జెకిస్తాన్, కజకిస్తాన్, ఉక్రెయిన్, రష్యా, బ్రెజిల్, మెక్సికో దేశాలన్నీ సెక్స్ టూరిజంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచాయి. ఈ దేశాలన్నీ 30 సంవత్సరాల పూర్వం ప్రపంచీకరణలో భాగమయ్యాయి.

ఈ విధంగా ప్రపంచీకరణ కాలంలో పెద్దెత్తున ఉపాధి లభిస్తుందనే ప్రచారం బూటకమని రుజువైంది. టీఎన్‌సీలు అనుబంధ పరిశ్రమలను స్థాపించిన దేశాలలో ఔట్‌సోర్సింగ్ కారణంగా కార్మిక సంఘాల అణచివేత, కాలుష్యం, నిరుద్యోగం, పేదరికం రోజు రోజుకూ అధికం అయ్యాయి, వేతనాలు రోజు రోజుకూ తగ్గిపోతున్నాయి. ఉదాహరణకు, కొలంబియా దేశం లాటిన్ అమెరికా కోకా–కోలా సాఫ్ట్ డ్రింక్ సామ్రాజ్యానికి కేంద్రం. ఈ కంపెనీలో ఆహార కార్మికుల సంఘం అయిన సైనల్ ట్రైనల్ ప్రకారం 1990 నాటి నుంచి తొమ్మిది మంది కార్మిక సంఘ నాయకులు, సభ్యులను హంతక ముఠాలు హత్య చేసాయి. దీంతో అనేక మంది కార్మిక నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లిపోవలసి వచ్చింది. కోకా–కోలా కార్మికులలో 80 శాతం మంది సంఘాలు లేని, టెంపరరీ కార్మికులు. వీరికి చెల్లించే వేతనాలు సంఘాలలో ఉన్న కార్మికుల వేతనాలలో పావు వంతు మాత్రమే.

ప్రపంచీకరణలో భాగంగా ఎగుమతి–నిర్దేశిత పారిశ్రామికీకరణ మహిళా శ్రమ–కేంద్రంగానే జరిగింది. మహిళా కార్మికులు లేకుండా ఏ వెనుకబడిన దేశమూ మాన్యుఫాక్చరింగ్ ఎగుమతులు పెంచుకున్నది లేదు. మొత్తంగా శ్రమశక్తి అవసరం పెరుగుతుండడంతో పాటుగా మహిళా కార్మికుల సంఖ్య కూడా పెరుగుతున్నది. పురుషులకంటే కూడా మహిళా కార్మికులు అధికంగా

అసంఘటిత రంగంలో చిక్కుకుపోతున్నారు. కనీస చట్టపర హక్కులు, భద్రతా చర్యలూ వారికి అందడం లేదు. అతి తక్కువ వేతనాలు అందే పనులను అధికంగా మహిళలే చేస్తున్నారు. గతంలో ఒక్క పురుషుడు సంపాదిస్తే గడిచే కుటుంబం ప్రపంచీకరణ కాలంలో వేతనాలు తీవ్రంగా పడిపోవడంతో కుటుంబంలో భార్యాభర్తలు, ఇతర సభ్యులు, పిల్లలు సైతం పనిచేస్తేనే గడవని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం నైపుణ్యమైన పనులను అధికంగా పురుషులు, నైపుణ్యం లేని పనులను అధికంగా మహిళలు చేస్తున్నారు. మహిళల, పురుషుల మధ్య వేతనాలలో తేడా తగ్గుతున్నదని అంటున్నప్పటికీ అది చాలా స్వల్పం.

ఐక్యరాజ్యసమితి ఆర్థిక సామాజిక వ్యవహారాల విభాగం నివేదిక ప్రకారం 2013లో వెనుకబడిన దేశాల నుంచి 6 కోట్ల 42 లక్షల మంది సామ్రాజ్యవాద దేశాలకు వలస వెళ్లారు. 1990లో జరిగిన 2 కోట్ల 86 లక్షల మంది వలసకు ఇది రెట్టింపు. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఓఎం–వలసలపై అంతర్జాతీయ సంస్థ) అంచనా ప్రకారం వెనుకబడిన దేశాల వలస ప్రజలలో సుమారు సగం మందికి ఉపాధి లభ్యమయింది. వీరు సామ్రాజ్యవాద దేశాల యావత్తు శ్రమశక్తిలో ఇరవయ్యో వంతుగా ఉన్నారు. వీరిలో 40 శాతం మంది పరిశ్రమలలో పని చేస్తున్నారు, స్థానిక శ్రమశక్తి 25 శాతం ఉన్నది, అంటే సామ్రాజ్యవాద దేశాలలో ఉన్న మొత్తం 14 కోట్ల 50 లక్షల పారిశ్రామిక కార్మికులలో సుమారు 9 శాతం పీడిత దేశాల వారే. స్థానిక శ్రమశక్తితో పోల్చితే వారు మూడు రెట్లు అధికంగా వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారని, వీరు 10 శాతంగా ఉంటారని, స్థానిక శ్రమశక్తి 3 శాతంగా ఉన్నదని కూడా ఐఓఎం పేర్కొంది.

1990లలో ఇతర సామ్రాజ్యవాద దేశాల కంటే అమెరికా వెనుకబడిన దేశాల ప్రజల వలసకు అనుకూలంగా ఉన్నది. ఈ దశాబ్ద కాలంలో అక్కడకు వలస 70 శాతం పెరిగింది. ఇదే యూరప్‌లో 26 శాతం పెరిగింది. అయితే 2000–2013 కాలంలో ఇందుకు భిన్నంగా జరిగింది. ఈ కాలంలో యూరప్‌లోకి వెనుకబడిన దేశాల వలస 65 శాతం పెరగగా, అమెరికాలోకి వలస 39 శాతం మాత్రమే పెరిగింది. ఈ కాలంలో మధ్యయూరప్ నుంచి జరిగిన వలసను కూడా కలిపితే ఈ వలస యూరప్‌లోకి 71 శాతానికి పెరుగుతుంది, అమెరికాలోకి 37 శాతానికి పడిపోతుంది. వలస ప్రజలను రానివ్వడంలో జపాన్ పరిమితులు పాటించింది. 2013లో జపాన్‌లో పీడిత దేశాల, చాలా వరకు ఆసియా దేశాల నుంచి వలస వెళ్లినవారు 23 లక్షలు. వీరిలో సగం మందికి ఉపాధి లభ్యమయిందని అనుకుంటే వారు జపాన్‌లో ఉన్న 6 కోట్ల 50 లక్షల శ్రమశక్తిలో 1.8 శాతం అవుతారు. ఇది అమెరికా, ఈయూలలో కంటే చాలా తక్కువ.

ఐఓఎం 2003 వరల్డ్ మైగ్రేషన్ రిపోర్ట్‌లో ఒక ఆసక్తికరమైన వివరం ఉన్నది. అదేమంటే, 2001లో 1,42,000 మంది జపాన్‌కు వర్క్ వీసాలపై వెళితే అందులో 1,17,839 (వీరిలో 71,678 మంది ఫిలిప్పీన్స్ దేశీయులు) మందిని 'ఎంటర్‌టైనర్'లుగా వర్గీకరించారు. అంటే

ఆక్టర్‌లు, గాయకులు, వృత్తిపర ఎథలెట్‌లు మొదలయినవారు. అయితే వలస కార్మికులు జపాన్ మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమకు రాను రానూ ముఖ్యంగా మారుతున్నారు. పరిశ్రమలు సాధారణంగా స్థిరమైన ఉపాధి కల్పించడం కాకుండా చైనీయులనో, బ్రెజిలియనులనో తాత్కాలిక కార్మికులుగా నియమించుకుంటాయి. వీరికి వేతనాలు తక్కువ, పని పరిస్థితులు దిగజారి ఉంటాయి. జపాన్ పరిశ్రమలను చౌక శ్రమ వద్దకు తీసుకుపోవడమే కాకుండా చౌకశ్రమను పరిశ్రమల వద్దకు కూడా తీసుకువచ్చింది.

నిపుణ కార్మికుల పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ముందుగా వెనుకబడిన దేశాలలో ఉన్న అత్యంత నిపుణ కార్మికులలో అధిక శాతం 'మేధోవలస'లో భాగమయ్యారు. సంపన్న దేశాలలోకి వెళ్లేందుకు వారికి దొరికిన అవకాశాలను వినియోగించుకున్నారు. సంపన్న దేశాల సంస్థ అయిన ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ ఎండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ–ఆర్థిక సహకారం, అభివృద్ధి సంస్థ) ప్రకారం నిపుణ కార్మికుల వలస యావత్తు వలస కంటే అధికంగా ఉన్నది. 2010లో ప్రతి తొమ్మిది మంది ఆఫ్రికా గ్రాడ్యుయేట్స్‌లో ఒకరు ఓఈసీడీ దేశాలలో ఉన్నారు. అదే లాటిన్ అమెరికాలో పదమూడింటిలో ఒకరు, కారిబియన్‌లో ముప్పై మందిలో ఒకరూ ఉన్నారు. కొన్ని ఆఫ్రికా దేశాల నుంచి మొత్తం ప్రజల వలస కంటే నిపుణుల వలస ఇరవై రెట్లు అధికంగా ఉన్నది. ఉదాహరణకు జమైకాలో 46 శాతం నిపుణులు ఓఈసీడీ దేశాలలో జీవించేవారు. జింబాబ్వేలో 43 శాతం మంది, మారిషన్, గుయానాలలో అత్యధికంగా 41 శాతం మంది ఉన్నారు. అంటే మారిషస్‌లో అత్యధికంగా 90 శాతం మంది గ్రాడ్యుయేట్‌లు ఓఈసీడీ దేశాలలో జీవిస్తున్నారు. బ్రెజిల్, చైనా, భారత్, రష్యా వంటి ఓఈసీడీయేతర దేశాలలోకి వలస 3.5 శాతం కంటే తక్కువగా ఉన్నది.

అన్ని రంగాల కంటే ఆరోగ్య రంగంలో వలస ఆయా దేశాలలో ప్రతికూల ప్రభావం వేసింది. ఆఫ్రికాకు సంబంధించిన ఒక నివేదిక ప్రకారం 2005లో మలావీ దేశంలోని డాక్టర్‌లలో అధికులు మలావీలో కంటే బ్రిటన్‌లోను బర్మింగ్‌హాంలోనూ పని చేస్తున్నారు. 2013 నాటి ఒక అధ్యయనం ప్రకారం ఆఫ్రికా దేశాల నుంచి డాక్టర్‌లు అమెరికాకు వెళ్లడం 1980ల మధ్య కాలంలో ప్రారంభమై 1990ల నాటికి వేగవంతం అయ్యింది. ఇది ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ స్ట్రక్చరల్ ఎడ్జస్ట్‌మెంట్ ప్రోగ్రాంలు నడుపుతున్న కాలం. ఇవి విధించిన షరతుల కారణంగా ప్రభుత్వాలు ప్రజారోగ్య సేవలలో తీవ్రమైన కోతలు విధించాయి. 1995–2004 మధ్య కాలంలో టాంజానియా నుంచి 78.3 శాతం మంది డాక్టర్‌లు వలస వెళ్లారు. దీంతో ఆ దేశంలో డాక్టర్‌ల సంఖ్య ప్రతి లక్ష మంది ప్రజలకు 4.1 నుంచి 0.69కి పడిపోయింది. అదే అమెరికాలో ప్రతి లక్ష మందికీ 250 మంది డాక్టర్‌లు ఉన్నారు.

ఐఎంఎఫ్ ప్రకారం ఆవిర్భవిస్తున్న ప్రధాన మార్కెట్‌లలో స్థానిక ద్రవ్యేతర సంస్థల కార్పొరేట్ రుణం 2004లో 4 ట్రిలియన్ డాలర్‌లుగా ఉండగా, 2014లో ఇది ఆకాసానికి అంటి 18

ట్రిలియన్ డాలర్‌లకు పైగా లేదా ఆ దేశాల జీడీపీలో 73 శాతానికి పెరిగిపోయింది. ఈ పెరుగుదల దాదాపుగా 2008లో ద్రవ్య సంక్షోభం తరువాత వచ్చినదే. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ (ఐఐఎఫ్) ప్రకారం ఆవిర్భవిస్తున్న మార్కెట్‌ల కార్పొరేట్ రుణం మొత్తం 2015 నాటికి 23.7 ట్రిలియన్ డాలర్లు లేదా ఆవిర్భవిస్తున్న మార్కెట్ల (దేశాల) జీడీపీలో 90 శాతానికి చేరుకున్నది.

## ప్రపంచ ద్రవ్య పెట్టుబడి కలిగిస్తున్న వినాశకర ప్రభావాలు:

ద్రవ్య పెట్టుబడిదారులకు తాము మదుపుపెడుతున్న ఒక ఉత్పత్తి లేదా సర్వీసు మానవులపై లేదా పర్యావరణంపై ఎటువంటి నెగటివ్ ప్రభావం వేస్తుందనేదానితో ఎటువంటి ఆందోళనా ఉండదు. వారు యుద్ధాలకు (ప్రపంచ యుద్ధం-1, ప్రపంచ యుద్ధం-2 - రెండింటికీ) మదుపుపెట్టారు, భారీగా మానవుల ప్రాణాలను ఫణంగా పెట్టి బిలియన్ డాలర్ల లాభాలను ఆర్జించారు. వారు ఆయుధాల (మరియు సామూహిక మానవహనన ఆయుధాల) పరిశ్రమకు మదుపుపెట్టడం కొనసాగుతున్నది. వారు జూద పరిశ్రమలో, మద్య పరిశ్రమలో సైతం మదుపుపెడుతున్నారు. వారు మదుపు పెట్టే ఇటువంటి పరిశ్రమల లిస్టు చాలా పెద్దది. ద్రవ్య పెట్టుబడి (పారిశ్రామిక పెట్టుబడితో పాటు)తో ఏర్పడిన ముఖ్యమైన నెగటివ్ ప్రభావాలను పరిశీలిస్తే - పెట్టుబడిదారులు మాత్రమే వృద్ధిని, అభివృద్ధిని తీసుకొస్తారంటూ వారు చేస్తున్న దుష్ప్రచారపు డొల్లతనం బహిర్గతం అవుతుంది.

పెట్టుబడిదారులు పలు రంగాలలో సమీప భవిష్యత్తులో ముఖ్యంగా మెజారిటీ ప్రజలకు వినాశనాన్ని కొనితెచ్చే తీవ్ర సంక్షోభాలను సృష్టించారు: ఆర్థిక సంక్షోభం, ఉపాధి సంక్షోభం, పర్యావరణ/జీవావరణ సంక్షోభం, ఇంధన (ఎనెర్జీ) సంక్షోభం, బలవంతపు వలస జనాభా సంక్షోభం, సామాజిక-సాంస్కృతిక సంక్షోభం, రాజకీయ-సైనిక సంక్షోభం.

**ఆర్థిక సంక్షోభం:** పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించే మేధావులే స్వయంగా ఆర్థిక సంక్షోభం ఎందుకు వచ్చిందనే దానిపై రీసర్చ్ గ్రంథాలు, వ్యాసాలు రాసారు. ఈ సంక్షోభం 2008 నుంచి నిరాఘాటంగా కొనసాగుతున్నది, ప్రపంచవ్యాప్తంగా ఇది విస్తరించింది, చిన్నపాటి సంక్షోభం కూడా ప్రాంతీయ, ఖండాంతర స్థాయిలో విస్తరిస్తూ ఇది మరింత పెద్ద/శాశ్వత లక్షణం సంతరించుకుంది.

పెట్టుబడిదారులు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడు తమ ప్రభుత్వాల సహాయంతో ఏం చేస్తారంటే, తమ ప్రైవేట్ నష్టాలను ప్రభుత్వ నష్టంగా బదిలీ చేస్తున్నారు (తమ కోసం ప్రభుత్వం బెయిల్-అవుట్ ప్యాకేజీలు ప్రకటించేట్లు చేస్తున్నారు). ఫలితంగా, ప్రభుత్వం ద్రవ్య లోటులో ప్రతిబింబించే ఈ లోటును-ఈ అదనపు భారాన్ని అప్పటికే దారిద్ర్యంతో అల్లాడే ప్రజలపై మోపడం కోసం పన్నులు వేయాల్సి వస్తుంది.

ఆర్థిక సంక్షోభం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థలోని అత్యంత మౌలిక సమస్య. అది మెజారిటీ ప్రజలను దుర్భర పరిస్థితుల్లోకి నెట్టడం ద్వారా పెట్టుబడిని సంచయనం చేసుకుంటుంది. అంటే పిడికెడు మంది పెట్టుబడిదారులు దేశ లేదా ప్రపంచ సంపదలో అత్యధిక భాగాన్ని నియంత్రిస్తూ, మెజారిటీ ప్రజానీకాన్ని దారిద్ర్యంలోకి నెడుతున్నారు.

పెట్టుబడిదారులు నిత్యం దేశీయంగా, అంతర్జాతీయంగా గొంతులు కోసుకునే పోటీలో ఉంటారు. ఫలితంగా, ఎవరు ఎక్కువ పెట్టుబడిని సంచయనం చేసుకుంటారో వారు విజేతలవుతారు. అపరిమితమైన మదుపులు సంపాదించుకుని బలహీనమైన కంపెనీలను విలీనాలు–కబ్జాల ద్వారా టేక్ ఓవర్ చేసుకుని (చాలా సందర్భాలలో శత్రుపూరిత టేక్ ఓవర్) గుత్తాధిపత్యం సాధిస్తారు. పెట్టుబడిదారుల మధ్య అలాంటి తీవ్రమైన పోటీ మధ్య వారిలో మానవత్వాన్ని ఎవరూ ఆశించలేరు. అందువల్ల, ఆర్థిక సంక్షోభం అంతమయ్యేది కాదని ఎవరైనా ఖచ్చితంగా చెప్పగలరు.

**ఉపాధి సంక్షోభం:** పెట్టుబడిదారుల పని ఉపాధి కల్పించడం కాదు. వారు ఎవరికైనా తమ కంపెనీలో ఉపాధిని ఒకే ఒక కారణం రీత్యా కల్పిస్తారు. నైతిక బాధ్యతగా లేదా సామాజిక బాధ్యతగా భావించి వారు ఇలా చేయరు. కార్మికులచే పనిచేయించడం, మిగులును సృష్టించడం, పెట్టుబడిని/సంపదను పోగు చేసుకోవడం కోసం మాత్రమే వారు ఉపాధి కల్పిస్తారు. ఇందుకు భిన్నంగా ఎక్కువ మంది కార్మికులను నియమించడం ద్వారా ఖర్చు పెరిగి, లాభాల మార్జిన్లు తగ్గుతాయి. ఇది అనివార్యంగా పోటీదార్ల కంటే అధిక పెట్టుబడిని పోగుచేసుకునే పెట్టుబడిదారుని సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. దీంతో కార్మికశక్తిని తగ్గించి, తద్వారా ఖర్చులను తగ్గించుకొని, అధిక పెట్టుబడిని పోగు చేసుకున్న మరో పెట్టుబడిదారుడు ఈ పెట్టుబడిదారుడిని మింగివేసే ప్రమాదం పెరుగుతుంది. అందువల్ల, తాజా టెక్నాలజీని మానుఫ్యాక్చరింగ్ రంగం, సర్వీసు రంగం – రెండింటిలో ప్రవేశపెట్టడం పెట్టుబడిదారులకు అనివార్యం. తద్వారా వారు కార్మికులను తొలగించి ఖర్చులను తగ్గించుకొని లాభాలు పెంచుకుంటారు. గొంతులు కోసుకునే పోటీకి సంబంధించిన ఈ విషవలయంలో చిక్కుకున్న పెట్టుబడిదారులు రోజు రోజుకూ టెక్నలాజికల్ డెవలప్‌మెంట్ జరుగుతూ కార్మికులను తగ్గించగలుగుతున్న స్థితిలో వారు ప్రజలకు ఉపాధి కల్పిస్తారనీ ఎవ్వరూ ఆశించలేరు.

మార్కెట్‌లోకి ఈ మధ్య దాదాపు ఒక డజను టెక్నాలజీలు వచ్చాయి. అవి: ఆటోమేటిక్ వెహికిల్స్ (డ్రైవర్ లేకుండా తమంత తాముగా నడిచే వాహనాలు); మనుషుల స్థానాన్ని ఆక్రమించే లక్ష్యంతో ఐటీ రంగంలో ఆటోమేషన్ మరియు మానుఫ్యాక్చరింగ్ రంగంలో రోబోటిక్స్; డ్రోన్ టెక్నాలజీ (మానవరహిత విమానాలు లేదా ఎగిరే వస్తువులు); ఐఓటీ–ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (పరస్పరం ఒకరితో ఇంకొకరు కమ్యూనికేషన్ సాగించేందుకు, డాటాను ఎక్స్‌చేంజ్ చేసుకునేందుకు

చిన్న లేదా పెద్ద ఎలక్ట్రిక్ మరియు ఎలక్ట్రానిక్ ఆధారిత ఉత్పత్తులు); ఎస్ఎంఏసి (సోషల్ మీడియా, ఎనలిటిక్స్ అండ్ క్లౌడ్) టెక్నాలజీస్; డాటా సైన్స్; ఏఐ–ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ (ఇందులో మెషీన్ లెర్నింగ్, తటస్థ నెట్‌వర్క్‌లు, కంప్యూటర్ విజన్ మొదలైనవి కూడా ఉంటాయి); 3డీ ప్రింటింగ్ (దీనిని ఎడిటివ్ మానుఫ్యాక్చరింగ్ అని కూడా పిలుస్తారు. ఏదైనా వస్తువును తయారు (మానుఫ్యాక్చర్) చేయడానికి ఇందులో ఫ్యాక్టరీ లేదా కార్మికుల అవసరం ఉండదు); వర్టికల్ వ్యవసాయం (అంటే వ్యవసాయ క్షేత్రాలు భూములలో ఉండవు. అవి మల్టీస్టోరీడ్ ర్యాకులలో, భూతాల్లాంటి వేర్‌హౌస్–స్టైల్ భవనాలలో ఉంటాయి); బ్లాక్‌చైన్ టెక్నాలజీ; గ్రెయిన్ టెక్నాలజీ (జెనెటిక్స్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నానో టెక్నాలజీలను సంయుక్తంగా మెడికేర్‌లో ఉపయోగిస్తారు); మిక్స్‌డ్ రియాలిటీ (వర్చువల్ రియాలిటీ–వాస్తవిక యదార్థం, అగ్‌మెంటెడ్ రియాలిటీ–పెరిగిన వాస్తవికత); డీప్ టెక్.

పై టెక్నాలజీలు కొన్ని అత్యున్నత–స్కిల్‌తో కూడిన ఉద్యోగాలను తాత్కాలికంగా సృష్టించినప్పటికీ, అవి పరిమితం. ఈ టెక్నాలజీలు మరింత ఉన్నత స్థాయిలకు అభివృద్ధి చెందితే ఆ ఉద్యోగాలు సైతం ఊడిపోతాయి. పైన పేర్కొన్న టెక్నాలజీలలో ప్రతి ఒక్కటీ వాటిని అమలులోకి తెచ్చిన ప్రతీ చోటా అవి మానవ శ్రమ స్థానాన్ని ఆక్రమిస్తాయి. వీటిని ఇప్పటికే అమలు చేస్తున్నారు. ఇవి ప్రత్యక్షంగా, పరోక్షంగా విద్యావంతులలోనూ, అంతగా విద్యావంతులు కానివారిలోనూ – ఇరువురిలోనూ పెద్దెత్తున నిరుద్యోగాన్ని సృష్టిస్తున్నాయి. ఈ వృద్ధి ఉపాధిలేని వృద్ధి. అదే సమయంలో, ఇది ఎలాంటి వృద్ధి అంటే నిజ వేతనాలు వృద్ధి చెందని వృద్ధి (అంటే వేతనాలు పెరిగినప్పటికీ, ద్రవ్యోల్బణం కారణంగా జీతం పెరిగినప్పటికీ సరుకులను కొనుగోలు చేయడం అంతగా సాధ్యం కాదు). అందుకే వీటిని "నిరుద్యోగాన్ని సృష్టించే టెక్నాలజీలు" (Unemployment-generating Technologies) అని పిలుస్తున్నారు. ఇవి సమాజాన్ని "ఉపాధిలేని జీవనోపాధి" (Unemploymentization of Livelihood) యుగంలోకి నెడుతున్నాయి. రానున్న ఒక దశాబ్దం కంటే తక్కువ కాలంలో ఈ టెక్నాలజీలు సాధారణంగా మారతాయి, భారీ స్థాయిలో ఇవి అమలులోకి వస్తాయి. ఈ టెక్నాలజీలు రానున్న ఐదు సంవత్సరాలలో ఉద్యోగాలపై తీవ్ర నెగటివ్ ప్రభావాన్ని చూపుతాయని ఒక అంచనా.

**పర్యావరణ/జీవావరణ సంక్షోభం:** వాతావరణ క్రమాలు పర్యావరణ సంక్షోభం వల్ల దెబ్బతిన్నాయి. దీని వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. ఇప్పటి వరకూ కరువులంటే తెలియని భౌగోళిక ప్రాంతాలకు కరువులు వ్యాపిస్తున్నాయి. స్విట్జర్లాండ్‌లోని మంచుతో కప్పబడిన ఆల్ప్స్ పర్వతాలలో కొన్ని సరస్సులు సైతం ఎండిపోయాయి. నానాటికీ పెరిగిపోతున్న వరదలు మరో ముఖ్య ముప్పుగా ఉన్నాయి. వ్యవసాయాన్ని కరువులు, వరదలు దెబ్బతీస్తున్నాయి. అతివృష్టి, అనావృష్టి – ఈ రెండింటి వల్ల విశాల ప్రాంతాలలో వ్యవసాయం దెబ్బతినిపోతున్నది.

పట్టణ ప్రాంతాలలో అకస్మాత్తుగా కుంభవృష్టి పడడం, పట్టణ కాలుష్యం అతిపెద్ద పర్యావరణ

సమస్యలుగా ఉన్నాయి. పర్యావరణవేత్తలు చెబుతున్న "హీట్ ఐల్యాండ్ ఎఫెక్ట్" (నగరాలపై పెద్దమొత్తంలో వేడి జమకావడం) కారణంగా అకస్మాత్తుగా కుంభవృష్టి పడడంతో సంబంధిత నగరంలో అత్యధిక భాగాన్ని వరదలు ముంచెత్తుతున్నాయి. వందల, వేల కోట్ల రూపాయల ఆస్తి ఒకే ఒక్క రోజులో నాశనమవుతున్నది.

పలు సంవత్సరాల సుదీర్ఘ చర్చల అనంతరం ప్రపంచ ఉష్ణోగ్రత రెండు డిగ్రీలు తగ్గించడం ద్వారా సముద్ర జలాల మట్టం పెరగకుండా, వాతావరణంలో ప్రతికూల మార్పులు జరగకుండా నిరోధించే లక్ష్యంతో 2018 డిసెంబర్‌లో పారిస్ పర్యావరణ ఒప్పందం జరిగింది. దీనిపై అమెరికాతో సహా 196 దేశాలు సంతకాలు పెట్టినప్పటికీ 'వృద్ధి రేటు పడిపోతుంది, జీవన ప్రమాణాలు పడిపోతాయి, నిరుద్యోగం పెరుగుతుంది, చైనా వంటి ఇతర దేశాలకు దీని వల్ల లాభం చేకూరుతుంది' అనే సాకు చూపి అమెరికా 2019లో ఆ ఒప్పందం నుండి వైదొలిగింది. పర్యావరణంలో వెలువరించే మొత్తం కార్బన్ వాయువులలో అమెరికా వాటా 21 శాతం. అమెరికా ప్రపంచంలో 2వ అతిపెద్ద కాలుష్య దేశం.

అంటే సామ్రాజ్యవాదుల లాభాపేక్ష ఫలితంగా వందలు, వేల మార్గాలలో జీవావరణ సంక్షోభం విస్తరిస్తున్నది. అత్యధిక జనాభాను ప్రభావితం చేస్తున్నది. విచ్చలవిడి నాశనాన్ని ఆపి ఈ సంక్షోభాన్ని విస్తరించకుండా నిలువరించే మార్గాలు దాదాపు మూసుకుపోయాయి. అయినప్పటికీ పెట్టుబడిదారులు పర్యావరణానికి జరిగే నష్టాన్ని ఆపేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడానికైనా అంత ఆసక్తిగా లేరు. ఎందుకంటే అలాంటి చర్యలు తమ లాభాల మార్జిన్లను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా వారు ఆర్థిక విస్తరణను మునుపెన్నడూ లేని స్థాయిలకు తీసుకెళ్లడం కోసం ఉత్పత్తులను, సర్వీసులను అపరిమితంగా కుమ్మరిస్తున్నారు. తద్వారా మరింత సంపదను కూడగట్టుకోవచ్చని భావిస్తున్నారు. వారి విధానాల ఫలితంగా పర్యావరణ పతనం మునుపెన్నడూ లేని స్థాయిలకు చేరుకుంది. తక్షణం ఒక ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను గనుక చేపట్టకపోతే మొత్తంగా పర్యావరణం ధ్వంసమై భూగోళం మనుగడకే ముప్పు ఏర్పడుతుంది.

**ఇంధన సంక్షోభం:** పారిశ్రామిక అభివృద్ధికి ఇంధనం గుండెకాయ వంటిది. పెట్టుబడిదారులు ఆర్థిక వ్యవస్థను విస్తరించడం కోసం తమ ఉత్పత్తులు, సర్వీసులను ప్రోత్సహించడం వలన ఇంధన వినియోగం నిరంతరం పెరుగుతూనే ఉంది. అయితే విరుచుకుపడనున్న ఇంధన సంక్షోభం కారణంగా ప్రస్తుతం వారి లాభాలకు ముప్పు ఏర్పడింది.

సాంప్రదాయక ఇంధన వనరులుగా హైడ్రోకార్బన్లు (బొగ్గు, యురేనియం, చమురు, గ్యాస్ వంటి) ఉన్నాయి. ఈ వనరులకు పరిమితి ఉంది. అందువల్ల వాటిని ఎంతగా వెలికితీస్తే, భవిష్యత్ తరాలకు అంత తక్కువగా మిగులుతాయి. ఎనెర్జీ నిపుణుల ప్రకారం, వాటిని అతిగా

వెలికితీసిన కారణంగా, ప్రస్తుతం మన ఎనెర్జీ లెవల్స్ ప్రమాదకర స్థాయికి (peak energy levels) చేరుకున్నాయి. అంతేకాక ఈ వనరులు అంతమయ్యే సమయం దగ్గర పడుతుండడంతో వాటిని వెలికితీయడానికి ఖర్చు బాగా పెరిగిపోతున్నది. పీక్ ఎనెర్జీ నిపుణులు చెబుతున్న దాని ప్రకారం, భూ గ్రహంలో 100 సంవత్సరాల తర్వాత బొగ్గు లభించదు. రానున్న 60 సంవత్సరాలలో యురేనియం కూడా అంతమైపోతుంది. అలాగే ఇప్పటి స్థాయిలోనే వెలికితీయడం కొనసాగితే 40 సంవత్సరాల లోపే చమురు వనరులు సైతం అంతం కానున్నాయి.

ఇక పునరుత్పాదక శక్తి వనరులు మాత్రమే మిగులుతాయి. అయితే వీటితో కూడా సమస్య ఉంది. ప్రపంచంలో 50 శాతం మంది ప్రస్తుత రోజువారీ అవసరాల కోసం సౌరశక్తి వినియోగం వైపు మళ్లే సమయానికి సోలార్ ప్యానల్స్ తయారీకి అవసరమైన రెండు అరుదైన ఖనిజాలు సైతం అంతమైపోతాయి.

ఇక వాయు శక్తి (wind energy) మిగులుతుంది. అయితే ఇది ఇంధన అవసరాలకు అనుగుణంగా పవర్‌ను సరఫరా చేయలేదు. ఎందుకంటే ఇది అత్యంత అస్థిరమైనది. కేవలం కొన్ని ప్రాంతాలలో మాత్రమే విస్తృతంగా లభిస్తుంది.

అలాగే శిలాజ ఇంధనాలు (హైడ్రోకార్బన్లు) కావచ్చు లేదా పునరుత్పాదక ఇంధనాలు కావచ్చు, ఈ వనరులలో దేని నుంచి అయినా ఒక కిలో వాట్ పవర్‌ను ఉత్పత్తి చేయడానికి నిర్దిష్ట మొత్తంలో నీరు అవసరమవుతుంది. ఒక కిలో వరిని ఉత్పత్తి చేయడానికి 5,000 లీటర్ల నీరు అవసరమవుతుంది. నీటి వినియోగ దృక్పథం నుంచి ఉత్పత్తి వైపుగా దృష్టి సారించడాన్ని “జల-సామాజిక దృక్పథం” (Hydro-social perspective) అని పిలుస్తున్నారు. మైనింగ్, చెట్ల నరికివేత మొదలైన వాటి కారణంగా పెద్దెత్తున అడవులు క్షీణించిపోవడం (deforestation) వల్ల నదులు నానాటికీ ఇంకిపోతున్నాయి. దీంతో పైన చెప్పుకున్న అన్ని రకాల ఇంధనాల ఉత్పత్తికి పరిమితులు ఏర్పడిపోయాయి.

వాతావరణ క్రమాలలో తీవ్రమైన మార్పులకు నదుల కాలుష్యం కూడా తోడవుతుండడంతో మానవ అవసరాలకు అందుబాటులో ఉండే నీరు బాగా తగ్గిపోతున్నది. కేవలం 2 శాతం నీరు మాత్రమే మానవ వినియోగానికి అనుకూలంగా ఉంది. ఇందులో కూడా చాలా భాగం వేగంగా ఇంకిపోతున్నది లేదా కలుషితమవుతున్నది. అంతకు మించి చాలా నీటిని వినియోగ సరుకులు లేదా సర్వీసుల ఉత్పత్తి కోసం మళ్లిస్తుండడంతో మానవ, జంతు అవసరాలకు చివరకు తక్కువే మిగులుతుంది.

వివిధ శక్తి వనరులను అభివృద్ధి చేయడంలో మానవుల సామర్థ్యం ప్రస్తుతం గరిష్ట పరిమితికి చేరుకుంది. అవాస్తవిక (panglossian-ప్రతికూల పరిస్థితులను కూడా లెక్కచేయని) ఆశావాదంతో తెలివితేటలు కలిగిన మానవులు శక్తి ఉత్పాదన కోసం ఏవో కొన్ని శాశ్వత

వనరులను కనుగొంటారని కొందరు వాదించవచ్చు.

కానీ ఏ వనరు నుంచి శక్తిని ఉత్పత్తి చేయడానికైనా ఎంత నీరు అవసరమవుతుందనేదే అసలు సమస్య. దీనిని పరిష్కరించలేని స్థితి ఏర్పడుతోంది. నానాటికీ పెరుగుతున్న నీటి సంక్షోభంతో వున్న మానవ ప్రపంచం శక్తి ఉత్పత్తికి సంబంధించిన గరిష్ట పరిమితులకు చేరుకుంది. నీటి సంక్షోభం, శక్తి సంక్షోభం సన్నిహిత సంబంధం కలిగినవి.

పెట్టుబడిదారీ వ్యవస్థ తన ఆర్థిక వ్యవస్థను, తద్వారా తన సంపదను విస్తరించుకోవడానికి నీటి వనరును (ఇతర అన్ని వనరుల మాదిరిగానే) అతిగా దోచుకుంటోంది. ప్రస్తుత నీరు సంక్షోభానికి, రానున్న శక్తి సంక్షోభానికి ద్రవ్య పెట్టుబడి వద్ద ఎటువంటి పరిష్కారమూ లేదు.

**బలవంతపు వలస జనాభా సంక్షోభం:** అమెరికా సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ యుద్ధ ఆర్థిక వ్యవస్థగా మారడంతో యుద్ధాలపైనే దాని కేంద్రీకరణ అధికంగా ఉన్నది. అందువల్లనే అది నిరంతరం పీడిత జాతులపై-దేశాలపై దురాక్రమణ యుద్ధాలకు పాల్పడుతున్నది. సామ్రాజ్యవాదం ఉనికిలో ఉన్నంత వరకూ యుద్ధాలు అనివార్యం. యుద్ధాలను నిర్మూలించాలంటే, మొత్తంగా పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద వ్యవస్థనే నిర్మూలించాలి.

ఈ 21వ శతాబ్దంలో అమెరికా సైన్యం కుట్రపూరితంగా హొండూరస్, ఉక్రెయిన్, ఈజిప్టులలో సాగించిన సైనిక తిరుగుబాట్లలో; బ్రెజిల్‌లో పార్లమెంట్ కుట్ర; అమెరికా మిత్ర కూటమి 20 దేశాలలో కొనసాగించిన సైనిక జోక్యాల కారణంగా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా 3 కోట్ల 20 లక్షల మంది ముస్లిముల మరణాలకు దారితీసింది; ఆఫ్రికాలో సెక్యులర్, ధనిక దేశమైన లిబియాను ధ్వంసం చేసి, ఒకప్పుడు ప్రపంచంలో ప్రవాసులకు అత్యధికంగా ఆశ్రయాన్ని కల్పించిన ఆ దేశంలోని సగానికి పైగా జనాభాను విస్థాపితం చేసింది. 1990ల నుండి ఇటువంటి ప్రత్యక్ష-పరోక్ష యుద్ధాలకు/జోక్యాలకు అమెరికా పాల్పడింది. దీని వల్ల ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా, యెమెన్, సిరియాల వంటి పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలతో పాటు లాటిన్ అమెరికాలోని పలు యుద్ధగ్రస్త దేశాలలో లక్షలాది ప్రజలు మరణించడం, గాయపడడం, లక్షల కోట్ల రూపాయల ఆస్తులు ధ్వంసం కావడం, ప్రజల బతుకులు దుర్భరం కావడమే కాకుండా ఆ దేశాల నుంచి కోట్లాది ప్రజలు యూరప్‌లోని పలు దేశాలకు, అమెరికాకు వలసపోవడం ప్రపంచీకరణ కాలంలో నానాటికీ తీవ్రతరమవుతున్న ఒక ధోరణిగా మారింది. కానీ ఈ వలస ప్రజలకు తలదాచుకుందామంటే 'మానవత్వాన్ని' వకాల్తాపుచ్చుకున్న సామ్రాజ్యవాద దేశాలు ఏ మాత్రం 'మానవత'ను ప్రదర్శించడం లేదు. అవి వలస ప్రజలను పశువుల్లా చూస్తున్నాయి. వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి చంపుతున్నాయి. వారిని కాన్‌సెంట్రేషన్ క్యాంపుల్లో బంధించి బానిస కార్మికులుగా మార్చి నిర్దాక్షిణ్యంగా వారి శ్రమను కొల్లగొడుతున్నారు.

సిరియాలో బషర్ అల్ అసద్ ప్రభుత్వాన్ని కూలదోయడం కోసం 8 సంవత్సరాలుగా అమెరికా సామ్రాజ్యవాదుల నాయకత్వంలో సాగిన దాడుల ఫలితంగా 5 లక్షల మంది ప్రజలు

మరణించారు, దాదాపు 20,00,000 మంది గాయపడ్డారు. ఒక కోటి 20 లక్షల మంది ఈ యుద్ధం వల్ల శరణార్థులుగా మారి పక్కనున్న దేశాలకు, యూరప్ దేశాలకు వలస పోయారు. శాంతి-సహనాలతో, అనేక ప్రాచీన విశ్వాసాలతో కూడిన తెగలు శాంతియుత సహజీవనం చేసిన ఆ సెక్యులర్ సమాజాన్ని ధ్వంసం చేసింది. ఇలాంటి యుద్ధగ్రస్త శరణార్థులతో 21వ శతాబ్దంలో నూతన బానిస వ్యవస్థకు ద్వారాలు తెరుచుకుంది. వీరు అన్ని హక్కులూ కోల్పోయి నిర్బంధ శిబిరాలలో జీవిస్తూ బానిస వ్యవస్థను తలపింపజేస్తున్నారు.

**సామాజిక, సాంస్కృతిక సంక్షోభం:** వికృత సంస్కృతి అభివృద్ధి (vulgarization of culture) సమాజంపై ద్రవ్య పెట్టుబడి వేసిన మరో నెగటివ్ ప్రభావం. పెట్టుబడి తన సూపర్ లాభాల వేటలో తిండిని, బట్టల్ని, సంస్కృతిని, సంప్రదాయాలను, ఆచారాలను సైతం వినిమయ వస్తువులుగా మార్చివేస్తున్నది. దేశీయ ఆర్థిక వ్యవస్థలను పరవస్తు వ్యామోహంలో ముంచెత్తి నాశనం చేస్తున్నది. ఈ రంగాలలో సరుకీకరణ పెరిగే కొలదీ, వికృత సంస్కృతి అభివృద్ధి చెందుతుంది. ఎంతగా అసభ్య సంస్కృతి అభివృద్ధి చెందితే అంతగా లాభాలు వస్తాయి. పెరుగుతున్న ఈ విచ్చలవిడి అరాచకవాద సామ్రాజ్యవాద సంస్కృతి దేశభక్తి విలువలను ధ్వంసం చేస్తున్నది. హీనమైన నేరాలు, వికృత సెక్స్, వినిమయతత్వం, మాదక పదార్థాల సంస్కృతి, స్త్రీల, పురుషుల వేశ్యావృత్తి, మహిళా-బాల-పురుష పోర్నోగ్రఫీ వంటివి హేయమైన సామాజిక విలువలను పెంపొందిస్తున్నాయి. ఫలితంగా మహిళలపై, మైనర్ బాలికలపై విచ్చలవిడిగా అత్యాచారాలు జరుగుతున్నాయి. సామ్రాజ్యవాద సంస్కృతి, కాలంచెల్లిన-తిరోగామి భూస్వామ్య సంస్కృతి పునాదిపై ఆధారపడి విస్తరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా జాత్యహంకారం (రేసిజం), వర్ణ వివక్ష, మతోన్మాదం, జాతీయోన్మాదం పెరిగిపోతున్నాయి.

**రాజకీయ, సైనిక సంక్షోభం:** ప్రస్తుత ప్రపంచ చిత్రం తీవ్రమైన అస్థిరత, కల్లోలం, అస్తవ్యస్తతలతో కూడుకొని ఉంది. ప్రపంచవ్యాప్తంగా నానాటికీ తీవ్రతరమవుతున్న దీర్ఘకాల ఆర్థిక-ద్రవ్య సంక్షోభం ప్రపంచంలోని అన్ని మౌలిక వైరుధ్యాలనూ మరింత పదునెక్కించింది. ఆర్థిక, రాజకీయ, సైనిక రంగాలలో ఆధిపత్యం కోసం సామ్రాజ్యవాదుల మధ్య వేలంవెర్రి పోటీకి దారితీసింది. వారి రక్షణ ఖర్చు పెరుగుతున్నది. తమ సైనిక సామర్థ్యాలను పెద్దెత్తున పెంపొందించుకుంటున్నారు. నూతన మోహరింపులు జరుపుతున్నారు. ఇది మళ్లీ మరింత అస్తవ్యస్థతకూ, అస్థిరతకూ దారితీస్తున్నది. ముందే చెప్పుకున్నట్లుగా ఈ నూతన శతాబ్దంలో అమెరికా మిత్ర కూటమి 20 దేశాలలో కొనసాగించిన యుద్ధాలు/సైనిక జోక్యాలు, సృష్టించిన ఉద్రిక్తతలు, చేస్తున్న బెదిరింపులు, పాలస్తీనా ప్రజలపైనా, లెబనాన్ వంటి పొరుగు దేశాలపైనా ఇజ్రాయిలీ జియోనిస్టు విస్తరణవాదులు సాగించిన నరమేధానికి అమెరికా సామ్రాజ్యవాదుల పూర్ణ అనుమతి మొదలైన – పశ్చిమాసియా ప్రాంతాన్ని పేలనున్న మందుగుండు స్థితికి తెచ్చి, దాన్ని సామ్రాజ్యవాద శక్తుల కుక్కలకాట్లాట కేంద్రంగా చేసాయి. సామ్రాజ్యవాదం తన లాభాల

కోసం, ప్రపంచాధిపత్యం కోసం ప్రపంచాన్ని విభజించడానికి– పునర్విభజించడానికి అంతిమంగా యుద్ధాలకు దిగుతున్నది. యుద్ధం ద్వారా అధిక గుత్త లాభాలనార్జిస్తున్నది. అది నయావలసవాద తరహా రూపాల్లో తన దోపిడీ పీడనలను కొనసాగించడం కోసం వెనుకబడిన ప్రాంతాలకు విస్తరిస్తున్నది. అది నేటి ప్రపంచంలోని పీడిత జాతులు, ప్రజల పాలిట రక్తపిశాచి. అది వారిని తీవ్రమైన కష్టాల పాల్జేస్తున్నది. ఈ స్థితిలో విప్లవోద్యమాలు, జాతుల తిరుగుబాట్లు, ప్రజా ఉద్యమాలు, ప్రతిఘటనలూ పెరుగుతున్నాయి. ఇది ప్రపంచంలోని యావత్ దేశాల్లో మరింత తీవ్రమైన, లోతైన, అత్యంత జటిలమైన రాజకీయ–సైనిక సంక్షోభాలకు దారితీసింది. ప్రభుత్వాల పరిపాలన, పార్లమెంటరీ వ్యవస్థల స్థిరత్వం దెబ్బతింది. పార్లమెంటరీ రాజకీయాలతో పాటు, పార్లమెంటరీ పాలకపార్టీల నిజస్వరూపాలు గణనీయంగా బహిర్గతమయ్యాయి. ఫలితంగా ఫాసిస్టు పార్టీలు బలపడుతూ ప్రభుత్వాలు ఏర్పరస్తున్నాయి. సామ్రాజ్యవాదుల, వారి దళారీ ఫాసిస్టు పాలకుల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా దక్షిణాసియా, ఉత్తరాఫ్రికాల స్థితి కూడా ఇదే. ఆఫ్రికాలో అల్జీరియా, సూడాన్, పశ్చిమాసియాలో ఈజిప్ట్, సౌదీ అరేబియా, కజకిస్తాన్, హాంకాంగ్, లాటిన్ అమెరికాలో ఈక్వెడార్, చిలీ, హైతీ, యూరప్‌లో స్పెయిన్, చెక్ రిపబ్లిక్, రష్యా, ఫ్రాన్స్ వంటి పలు దేశాలలో ప్రపంచవ్యాప్తంగా ప్రజా పోరాటాల వెల్లువ కొనసాగుతున్నది.

ఈ విధంగా సంక్షోభ పరిష్కారంగా ఎంచుకున్న ప్రపంచీకరణ విధానాలు తిరిగి కోలుకోలేని సంక్షోభానికే దారితీసాయి. బానిసత్వాన్నీ, లూటీని తీవ్రతరం చేసాయి. భూమి మీద అన్ని రకాలుగానూ సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ విధ్వంసం, క్షీణతల స్థాయి పెరిగాయి. ఆదాయ పంపకం చాలా ఘోరంగా తయారైంది. పేదరికం, నిరుద్యోగం, ఆకలి, స్వచ్ఛమైన నీరు లభించకపోవడం, మౌలిక హక్కులను, పౌరహక్కులను కాలరాచివేయడం, శిక్షలు, చిత్రహింసల రేటూ పెరిగాయి. యుద్ధాల వల్లనూ హింసాత్మక సంఘర్షణల వల్లనూ చనిపోయినవారు, గాయపడ్డవారు, నిర్వాసితులూ పెద్ద సంఖ్యలో పెరిగిపోతున్నారు. గణాంకాలను బట్టి పరిస్థితి చాలా ఘోరంగా ఉందనీ, గతం కంటే ఎన్నో రెట్లు దిగజారిందని రుజువవుతోంది. ఈ కారణాల వల్లనే సామ్రాజ్యవాద–పెట్టుబడిదారీ విధానం మరింతగా మరణానికి చేరువైంది. యావత్తు మానవత్వాన్నీ ధ్వంసం చేయక ముందే ఈ వ్యవస్థను నిర్మూలించే తక్షణ కర్తవ్యం ఇంతకు ముందటి కంటే ఎక్కువగా ప్రపంచ కార్మికవర్గం ముందు ఉంది. సామ్రాజ్యవాద–పెట్టుబడిదారీ దేశాలలో సోషలిస్టు విప్లవాన్నీ, వెనుకబడిన దేశాలలో నూతన ప్రజాస్వామిక విప్లవం, జాతివిముక్తి పోరాటాలను, అంతిమంగా ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసి కమ్యూనిజం వైపుగా పురోగమించడం ద్వారా ఆ కర్తవ్యాన్ని పరిపూర్తి చేయగలదు.

## ప్రపంచీకరణ దశ

## కొనసాగుతున్న అర్ధవలస, అర్ధభూస్వామ్య సంబంధాలు

ప్రపంచీకరణ వ్యూహంలో భాగంగా అంతర్జాతీయ (ఎంఎన్‌సీల, టీఎన్‌సీల) ద్రవ్య పెట్టుబడి ప్రవేశాన్ని సుగమం చేసే ఉద్దేశ్యంతో ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఆ తర్వాత డబ్ల్యుటీఓలు సంయుక్తంగా భారత్ వంటి 80 వెనుకబడిన దేశాలపై వ్యవస్థీకృత సర్దుబాటు కార్యక్రమాలను 'రుణాలు', 'సహాయం' అందించే పేరుతో రుద్దాయి. రోడ్లు, రైల్వేలు, టెలి కమ్యూనికేషన్‌లు, విద్యుదుత్పత్తి మొదలయిన ప్రాథమిక సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి విద్యా, సాక్షరతా కార్యక్రమాలు, నగరాలను అందంగా తీర్చిదిద్దడం, తాగు నీరు, పారిశుద్ధ్య పథకాలు మొదలయిన భారీ కార్యక్రమాలు ప్రారంభించాయి. ఈ రుణాలు తీర్చేందుకు భారత దళారీ పాలకులు దేశ ఆర్థిక వ్యవస్థను ఎగుమతుల దిశగా పూర్తిగా పునర్వ్యవస్థీకరించారు. సామాజిక సంక్షేమం కోసం చేసే ప్రభుత్వ ఖర్చులో, వివిధ రంగాలకు ఇచ్చే రాయితీలలో కోత మొదలయిన పొదుపు చర్యలను దశలవారీగా అమలు చేసారు. ప్రభుత్వ రంగ యూనిట్‌లను, ఇతర ప్రభుత్వ ఆస్తులను అమ్మడం వేగవంతం చేసారు.

తొలుత నయావలసవాదాన్ని, ఆ తర్వాత దానిలో భాగంగా ప్రపంచీకరణ విధానాలను నయాన–భయాన ఆమోదింపజేసే లక్ష్యంతో పేద, మధ్యతరగతి వర్గాల, మేధావి 'ప్రజల అభిప్రాయాన్ని మలిచే' సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల, మన దేశంలో వారి దళారీల ప్రయోజనాలను నెరవేర్చేందుకు ఒక వ్యూహాత్మక పథకం రూపొందించుకున్నారు. వారు వివిధ కార్పొరేట్ కంపెనీల ద్వారా రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్, ఫోర్డ్ ఫౌండేషన్ వంటి పలు ఫౌండేషన్లు స్థాపించి 1950ల నుంచే విద్య, కళా రంగాలలోకి ప్రవేశించి లక్షలాది డాలర్లు ఖర్చు పెడుతున్నారు. రాజకీయ శాస్త్రాల బోధనను సామ్రాజ్యవాద భావజాలానికి అనుగుణంగా మలిచి, "అంతర్జాతీయ", "ప్రాంతీయ" అధ్యయనాలు, "అభివృద్ధి అధ్యయనాలు", "ప్రజా అధ్యయనాలు", "సాంస్కృతిక అధ్యయనాలు", "మానవ ప్రవర్తనా శాస్త్రాలు", "మానవహక్కులు" వంటి విశ్వవిద్యాలయ కోర్సులకు, విద్యార్థుల స్కాలర్‌షిప్పులకు నిధులు సమకూరుస్తున్నారు. అమెరికాలో గానీ, భారత్‌లో గానీ విశ్వవిద్యాలయాలలో చదివేవారిలో 'ఫౌండేషన్–అనుకూల' విద్యార్థులకు ఫెలోషిప్పులు, పరిశోధనా నిధులు, గ్రాంటులు, ఉద్యోగాలు లభించాయి. క్రమేపీ వివిధ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికపరమైన విషయాలలో సామ్రాజ్యవాద ఆధిపత్య భావజాలాన్ని వ్యాపింపజేసారు. వీరి నుంచి తయారైన నిపుణులతో అమెరికా గూఢచర్య, భద్రతా సంస్థలు, గ్లోబల్ కార్పొరేషన్ల డైరెక్టరేట్లు నిండివున్నాయి. వీరే ఆయా దేశాలలో ప్రధానమంత్రులుగా, ఆర్థికమంత్రులుగా, ఆర్థిక శాస్త్రవేత్తలుగా, ప్రభుత్వ బ్యాంకు అధికారులుగా, కార్పొరేట్ న్యాయవాదులుగా మారి గ్లోబల్ కార్పొరేషన్లకు తలుపులు తెరిచారు. ఇదే లక్ష్యంతో

ఆజీమ్ ప్రేమ్‌జీ, జిందల్, టాటా, రిలయెన్స్ వంటి దళారీ కార్పొరేట్ కంపెనీలు కూడా సామ్రాజ్యవాద ప్రాయోజిత థింక్ ట్యాంక్ సంస్థలను ఏర్పరచాయి. మీడియాపై కూడా ఈ దేశ–విదేశీ కార్పొరేట్ సంస్థలు తమ గుత్తాధిపత్యం ఏర్పరచుకుని తమ ప్రయోజనాలకు అనుగుణంగా దాన్ని ఉపయోగించుకుంటున్నాయి.

ఈ ఫౌండేషన్లు, వారికి దళారీలుగా ఉన్న టాటా, జిందల్, ఇన్ఫోసిస్, రిలయన్స్, వేదాంత కంపెనీలు కళాకారులకు, సినిమా దర్శకులకు, కార్యకర్తలకు నిధులు ఇస్తున్నాయి. సినిమా, చిత్రకళ, సాహిత్య ఉత్సవాల పేరుతో అవి 'ప్రజాభిప్రాయాన్ని' తమకు అనుకూలంగా మలచుకుంటున్నాయి. బాక్సైట్ కోసం పురాతన డోంగ్రియా కుమ్వి ఆదివాసుల నివాస ప్రాంతాలలో మైనింగ్ చేస్తున్న వేదాంత కంపెనీ 'సుస్థిర అభివృద్ధి'పై 'ఆనందాన్ని తవ్వి తీయడం' అనే ఉపశీర్షికతో సినిమాల పోటీ నిర్వహించడం, జిందల్ గ్రూపు ఒక కళా పత్రికను ప్రచురిస్తూ, దేశంలోని ప్రముఖ కళాకారులకు 'మద్దతునివ్వడం', ఎస్సార్ కంపెనీ తెహెల్కా న్యూస్ వీక్ ఆధ్వర్యంలో గోవాలో 'థింక్ ఫెస్ట్' నిర్వహించడం, ఇందులో అది ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ రచయితలు, సామాజిక కార్యకర్తలు, వాస్తు శిల్పి ఫ్రాంక్ గెహ్రీ వంటి వారితో ఉద్వేగభరిత చర్చాగోష్ఠి జరపడం, టాటా స్టీల్, రియో టింటో (బ్రిటిష్–ఆస్ట్రేలియా గనుల కార్పొరేషన్) కంపెనీలు దర్శన్ సింగ్ కనస్ట్రక్షన్ ఆధ్వర్యంలో జైపూర్ సాహిత్య ఉత్సవాలను 'ప్రపంచంలో కెల్లా అతిపెద్ద సాహిత్య ప్రదర్శన'గా యేటా నిర్వహిస్తూ, ప్రేమ, సాహిత్యం, రాజకీయాలు, సూఫీ కవితలు, నిషేధానికి గురైన సల్మాన్ రష్దీ పుస్తకం 'ది సటానిక్ వర్సెస్' వంటి వాటి గురించి అక్కడ చర్చాగోష్ఠులు నిర్వహించడం, టాటా, జిందల్, ఇన్ఫోసిస్ కంపెనీలు వివిధ రకాల 'అత్యుత్తమ' స్కూళ్లను, విద్యాలయాలను, ఆసుపత్రులను నిర్వహించడం, స్కాలర్‌షిప్పులు ఇవ్వడం, సామాజిక శాస్త్రవేత్తలకు, గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, పర్యావరణ విద్య, నైతిక ఉత్థానం వంటి రంగాలలో పనిచేస్తున్న వారికి బహుమానాలు, ఫెలోషిప్పులు ఇవ్వడం, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ మూసలోనే దేశంలో సామ్రాజ్యవాద ప్రాయోజిత థింక్‌ట్యాంక్‌గా ఉన్న అబ్జర్వర్ రీసర్చ్ ఫౌండేషన్‌కు రిలయెన్స్ కంపెనీ నిధులు అందించడం ఇందుకు కొన్ని ఉదాహరణలు.

ప్రపంచీకరణ కాలంలో సామ్రాజ్యవాదులు, దళారీ పాలకులు మన దేశంలో ఎగుమతి–ఆధారిత విధానాన్ని అమలు చేయడంతో మన దేశ యావత్తు మార్కెట్ విదేశీ వ్యాపారంపై, పెట్టుబడి విదేశీ పెట్టుబడిపై, సాంకేతికత హై–టెక్ విదేశీ సాంకేతికతపై, ద్రవ్యం ప్రపంచ దిగుమతులపై, స్పెక్యులేషన్ వ్యాపారం (సట్టా వ్యాపారం)పై ఆధారపడి కొనసాగాయి. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల ధరల సూచికలు అంతర్జాతీయ స్పెక్యులేటర్ల (సట్టా వ్యాపారుల) నియంత్రణలో కొనసాగుతున్నాయి. వారు అక్కడే సరుకుల ధరలను (వ్యవసాయ ఉత్పత్తులతో సహా) అంతర్జాతీయ రేట్లకు అనుగుణంగా నిర్ణయించారు. అక్కడే డాలర్‌పై ఆధారపడి రూపాయి విలువను, దేశంలోకి

డాలర్ ప్రవహించే రేటును నిర్ణయించారు.

ప్రపంచీకరణ కాలంలో దేశంలో సవరణలకు గురికాని చట్టం ఒక్కటి కూడా లేదు. లోక్‌సభలోని యావత్తు గగ్గోలు మొత్తం అంత ప్రాముఖ్యత లేని వాటిపై జరుగుతుంది కానీ, ప్రతి సెషన్‌లో ఎవ్వరూ గమనించలేనంత వేగంగా పలు కీలకమైన బిల్లులు కూడా పాస్ అవుతూనే ఉన్నాయి. ఎందుకంటే సారాంశంలో 'ఆర్థిక సంస్కరణలకు' యావత్తు పార్లమెంటరీ పార్టీలు అనుకూలమే. న్యాయ వ్యవస్థ శ్రామికులపై, ఆదివాసులపై, రైతాంగంపై, చిన్న పారిశ్రామికవేత్తలపై, దళితులపై, మహిళలపై, మైనారిటీలపై, మానవహక్కులు, ప్రజా సంక్షేమంపై సైతం అత్యంత అభివృద్ధినిరోధక తీర్పులు ప్రకటిస్తూ బడా పెట్టుబడికి క్రూరమైన ఆయుధంగా మారింది. ప్రభుత్వం, చట్టసభ, న్యాయస్థానం – మూడూ సామ్రాజ్యవాదుల నిర్దేశంతో 'ఆర్థిక సంస్కరణలను' అమలు చేయడంలో కీలుబొమ్మలుగా వ్యవహరిస్తున్నాయి.

ప్రపంచ ద్రవ్య పెట్టుబడి దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రతి ఒక్క అంశం మీదనూ ఆక్టోపస్‌లా పట్టును విస్తరించింది. విదేశీ ద్రవ్య పెట్టుబడికి లక్ష్యం ఒక్కటే – తమ సామ్రాజ్యవాద మాతృసంస్థ లాభాలను అత్యధికం చేయడం. అది పూర్తి యాజమాన్యం ఉన్న అనుబంధ కంపెనీయా, జాయింట్ వెంచరా లేక టెక్నికల్ కొలాబరేషనా – ఏ మార్గం తీసుకుంటుందన్న దానితో నిమిత్తం లేదు. అయితే టీఎన్‌సీలు తమ పూర్తి యాజమాన్యం కింద ఉండే అనుబంధ కంపెనీలను నెలకొల్పడానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తాయి. అందులో 'భారతీయ' మేనేజర్లను తమ మనుషులుగా నియమిస్తాయి. ఈ పద్ధతిలో లాభాలు అధికంగా చేసుకుంటాయి. మన దేశ దళారీ పాలక వర్గానికి చెందిన ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులు, నిరంకుశ ఉన్నతాధికారులు, రాజకీయ, బుద్ధిజీవి, ఇతర ఏజెంట్లతో కూడిన విస్తృతమైన నెట్‌వర్క్ ఇందుకు మార్గం సుగమం చేస్తున్నది. ఏ పార్లమెంటరీ పార్టీ అధికారంలో ఉన్నదనేది దీనికి నిమిత్తం లేదు. అన్ని పార్టీల ప్రభుత్వాలు ఒకదానితో ఒకటి పోటీ పడి 'సంస్కరణల'ను వేగంగా అమలు చేసాయి. విదేశీ పెట్టుబడిని ఆకర్షించడానికి సామ్రాజ్యవాద అంతర్జాతీయ గుత్తసంస్థ (టీఎన్‌సీ, ఎంఎన్‌సీ)లకు పలు రాయితీలు కల్పించాయి. విదేశీ పెట్టుబడిదార్లకు వారి బాండ్లకు, ఫండ్లకు నిబంధనలను సరళం చేయడం వంటివి అనేకం చేసాయి. దళారీ ప్రభుత్వాలు ప్రపంచ ద్రవ్య పెట్టుబడికి అతిపెద్ద దళారీ కంపెనీలుగా ఆవిర్భవించిన టాటా, అదానీ, జిందాల్, వేదాంత, ఎస్సార్, రిలయన్స్, స్టెరిలైట్ వంటి కంపెనీలతో మిలాఖత్ అయి బాక్సైట్, ఇనుముతో సహా అపార ప్రకృతి వనరులను దోచుకునేందుకు వేల కోట్ల రూపాయల విలువ చేసే వందలాది అవగాహనా పత్రాలపై సంతకాలు చేసాయి.

దీంతో దేశంలో టీఎన్‌సీలకు అనుమతినిచ్చే పారిశ్రామిక ప్రాంతాల సంఖ్య బాగా పెరిగింది. అవి దేశంలో ఏర్పాటు చేసుకున్న జాయింట్ వెంచర్లలో 90 శాతం షేర్లను హస్తగతం చేసుకుని వాటిపై తమ పట్టు మరింత బిగించాయి. దళారీ ప్రభుత్వాలు ఎగుమతి చేసిన సాంకేతికతపై

ఆధారపడి (export-technology oriented) పని చేసే జాయింట్ వెంచర్‌లలో, కంపెనీలలో నూరు శాతం విదేశీ షేర్లను అనుమతించాయి. టీఎన్‌సీలు జాయింట్ వెంచర్ల ద్వారా రెండు ప్రయోజనాలు పొందుతున్నాయి. మొదటిది, భారతదేశ మార్కెట్లను కబ్జా చేసుకోవడమే కాకుండా చౌక శ్రమను దోపిడీ చేసి అధిక లాభాలు చేసుకోగలుగుతున్నాయి. ఉదాహరణకు 1990ల నాటి రూపాయి విలువ ప్రకారం భారతదేశంలో హిందుస్తాన్ లీవర్ కంపెనీకి ఒక లక్స్ సబ్బు తయారీకి ఒక రూపాయి ఖర్చు అయితే, బ్రిటన్‌లో ఉన్న దాని మాతృసంస్థ యూనీలీవర్‌లో దాని తయారీకి మూడు రూపాయలు ఖర్చయ్యేది. అందువల్ల టీఎన్‌సీలు భారతదేశంలో ఒక ఫ్యాక్టరీ పెడితే తమ లాభాలు అనేక రెట్లు పెరిగేవి. రెండోది, అవి ఆ సరుకు స్థానిక దళారులతో కలిసి జాయింట్ వెంచర్లు నెలకొల్పి ఉత్పత్తి చేసినది కావడం వల్ల దానికి స్థానిక, లేదా 'హిందుస్తానీ' ముద్ర వేసేవి. ప్రజలలో వ్యతిరేకత రాకుండా చూసుకోగలిగేవి.

తద్వారా టీఎన్‌సీలు దేశంలోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలను మింగివేసాయి. ఆర్థిక వ్యవస్థలో యావత్తు రంగాలలో చొరబడి నియంత్రణ సాధించాయి. దీంతో సుజుకి, డుపాంట్, గుడ్ ఇయర్, సీకో, జెరాక్స్, వెస్టింగ్ హౌస్, యునైటెడ్ టెక్నాలజీస్, హనీవెల్ మొదలుగా అనేక టీఎన్‌సీలు వరదలా వచ్చి పడ్డాయి. 2016లో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన అంకుర పరిశ్రమల (స్టార్టప్ ఇండియా) చట్టం కింద స్థాపితమైన సంస్థల సంఖ్య 2019 జనవరి నాటికి 15,667కి చేరింది. ఈ చట్టం స్టార్టప్ కంపెనీలలో మదుపుపెట్టే ద్రవ్య పెట్టుబడిదారులకు ఆ కంపెనీలపై ఎదురులేని అధికారాలను వారి చేతుల్లో ఉంచింది. అలాగే మోదీ ప్రభుత్వం జీఎస్‌టీ చట్టాన్ని తీసుకొచ్చి వారి ప్రయోజనాలకు అనుగుణంగా దేశాన్నంతటినీ ఒకే ఏకీకృత మార్కెట్‌గా చేసింది. బడా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులలో భారీ మొత్తాలలో మదుపు పెట్టేందుకై దేశ లేదా విదేశీ ద్రవ్య పెట్టుబడి నుంచి సమీకరించే నిధులలో ద్రవ్య పెట్టుబడిదారులకు ఎదురులేని అధికారాలను అప్పగించే రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టుల (ఆర్ఈఐటీ) చట్టం, వారి లాభాలకు గ్యారంటీ కల్పించే రేరా (రియల్ ఎస్టేట్ రెగ్యులారిటీ అథారిటీ) చట్టం తీసుకొచ్చింది.

ఈ విధంగా ప్రపంచీకరణ కాలంలో దళారీ ప్రభుత్వాల సామ్రాజ్యవాద సేవ పతాకస్థాయికి చేరుకుంది. దేశంలో నూతన ధనిక వర్గం, నూతన దోపిడీ రూపాలు ముందుకు వచ్చాయి. మన దేశ పారిశ్రామిక రంగంలో అత్యంత లాభదాయకమైన మూడు రంగాలు – టెలికాం, పవర్, ఫైనాన్స్ రంగాలు ప్రధానంగా పబ్లిక్ రంగ నియంత్రణలో ఉన్నాయి. అంతేకాక, ఆదాయాన్ని సమకూర్చే ఇతర–కీలక రంగాలైన పర్యటన, మైనింగ్, భారీ పరిశ్రమ రంగాలు కూడా ప్రధానంగా పబ్లిక్ రంగంలోనే ఉన్నాయి. ప్రపంచీకరణ దశలో దళారీ పాలకవర్గాలు ఈ రంగాన్ని సమూలంగా తుదముట్టించే పథకాలను అమలు చేసారు. అంతర్జాతీయ గుత్త ద్రవ్య పెట్టుబడి సంస్థలకు (ఎంఎన్‌సీ–టీఎన్‌సీలకు) పూర్తిగా ద్వారాలు తెరిచారు. మదుపుదారులు

పెట్టే మదుపు పరిమాణంపై ఆధారపడి ప్రోత్సాహకాలు, ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. మదుపులను ఆకర్షించేందుకు ఒక్కో రంగానికీ ఒక్కో ప్రత్యేక విధానాన్ని - టూరిజం విధానం, ఐటీ విధానం, అనిమేషన్ విధానం, ఫార్మా విధానం, స్టార్టప్ విధానం, ఇంకా ఇటువంటి వాటిని ముందుకు తెచ్చారు. పబ్లిక్ రంగాన్ని ప్రైవేటీకరించి ప్రభుత్వ పెట్టుబడులు ఉపసంహరిస్తున్నారు. ప్రభుత్వ వాటాలను దేశ-విదేశీ కార్పొరేట్ కంపెనీలకు అడ్డూఅపూ లేకుండా తెగనమ్ముతున్నారు. ప్రపంచ ద్రవ్య పెట్టుబడిదారులు సులభంగా సంపదలను పోగుచేసుకునేలా పబ్లిక్ వనరులను ప్రైవేటీకరించే పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) అనే విధానాన్ని మరింత విస్తరించారు. సామ్రాజ్యవాద ప్రాయోజిత ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల్లో భాగంగా రైల్వే రంగంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) కింద మొదటి రైలు 'తేజస్', రైల్వేస్టేషన్ల నిర్మాణం ప్రారంభమయ్యాయి. బ్యాంకుల్ని విలీనం పేరుతో ప్రైవేటీకరణ వైపు నెట్టేసారు. దీంతో అనేక ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడ్డాయి. వివిధ రూపాల్లో విదేశీ పెట్టుబడులు 'భారత' దళారీ భాగస్వాములతో కలిసి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని సంఘటిత రంగంలో వున్న పరిశ్రమలలో ఆధిపత్యం సాధించాయి. ఫలితంగా హైటెక్ యంత్రాలు, టెక్నాలజీ వినియోగం పెరిగిపోయింది. ఔట్‌సోర్సింగ్ పెరిగిపోయింది. లక్షలాది మంది కార్మికుల, ఉద్యోగుల ఉద్యోగాలు పోయాయి. కాజువలీకరణ/కాంట్రాక్టు వ్యవస్థ పెరిగిపోయింది. ఫలితంగా పారిశ్రామిక రంగంలో సంఘటిత రంగం క్షీణించిపోతున్నది. అసంఘటిత శ్రమశక్తి ప్రధాన లక్షణంగా మారిపోయింది. పబ్లిక్, ప్రైవేట్ రంగాన్ని టీఎన్‌సీలకు, వాటి స్థానిక దళారీలకు అప్పగిస్తుండడంతో దేశంపై వాటి అదుపు మరింత బలోపేతమవుతున్నది. అవి కార్మికులకు, ఉద్యోగులకు అతి తక్కువ వేతనాలు ఇచ్చి అదనపు విలువను పిండుకోవడం ద్వారా సూపర్ లాభాలు సంపాదిస్తున్నాయి. 2014-18 మధ్య సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ కంపెనీలకు 17.5 లక్షల కోట్ల రూపాయల లాభం చేకూరింది. ప్రతి సంవత్సరం దేశం నుంచి సుమారు 47.09 లక్షల కోట్ల రూపాయల సంపదను సామ్రాజ్యవాదులు దోచుకుపోతున్నారు. ఇలా పెద్దెత్తున దోపిడీకి గురవుతున్న దేశం స్వావలంబనపై ఆధారపడిన నిజమైన అభివృద్ధిని ఎన్నటికీ సాధించలేదు.

దేశంలో అసంఘటిత రంగంలో భాగంగా ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా-ఎంఎస్ఎంఈ (గతంలో చిన్న తరహా పరిశ్రమల రంగం) రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన రంగం. వ్యవసాయం తర్వాత కోట్లాది మందికి ఉపాధిని కల్పించే రంగం ఇదే. అయినప్పటికీ, దళారీ పాలకులకు దాని పట్ల శ్రద్ధ లేదు. వారి ప్రపంచీకరణ విధానాలు దానిని దెబ్బతీసే విధంగా ఉన్నాయి. ఈ రంగంలో క్యాజువలీకరణ అత్యధిక స్థాయికి చేరుకుంది. దళారీ కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ విధానాలు రూపొందించే సీఐఐ, ఎఫ్ఐసీసీఐ, అసోచమ్ వంటి వందలాది అంగాలలో ప్రాతినిధ్యం ఉంది. కానీ ఎంఎస్ఎంఈ రంగానికి ఎక్కడా ప్రాతినిధ్యం లేదు. ఈ రంగంలోని పరిశ్రమల, సంస్థల ఘోషను ఎవరూ పట్టించుకోరు. ఈ రంగంలో 6.34 కోట్ల పరిశ్రమలు

ఉన్నప్పటికీ వాటిన్నింటికీ పెట్టుబడి పరిమితంగా ఉండడం వల్ల అవి చెల్లాచెదురుగా, అసంఘటితంగా ఉన్నాయి. అంతేకాక ప్రభుత్వం ఎగుమతి–దిగుమతి పాలసీ–2000 ప్రకారం 714 సరుకుల, 2001లో మిగతా 715 సరుకుల అన్ని దిగుమతులపై ఆంక్షలను తొలగించి ఈ రంగానికి గల స్వతంత్ర మార్కెట్‌ను ధ్వంసం చేసింది. ఇలా ఈ రంగాన్ని ఒకవైపు చౌక దిగుమతుల వరదతో ముంచెత్తడం, కొన్ని వస్తువులను ఉత్పత్తి చేయడానికి ఈ రంగానికి ఇచ్చిన రిజర్వేషన్‌ను రద్దు (ప్రభుత్వం అబిద్ హుస్సేన్ కమిటీ సిఫారసుల ప్రకారం 1997లో ఈ రంగానికి ఉద్దేశించిన ఐస్‌క్రీములు, బిస్కట్లు, బియ్యం/పప్పుల మిల్లులు మొదలైన 14 కీలక ఉత్పత్తులను డీ–రిజర్వు చేసింది. తర్వాత, నూతన టెక్స్‌టైల్ పాలసీ–2000 ప్రకారం ఈ రంగపు దుస్తుల తయారీకి చెందిన భారీ సెక్టార్‌ను రిజర్వు లిస్టు నుంచి తొలగించింది. ఈ సెక్టార్‌లో ఎఫ్‌డీఐపై గరిష్ట పరిమితిని కూడా 24 శాతం నుంచి 100 శాతానికి పెంచింది. దీంతో విదేశీ పెట్టుబడి దుస్తుల తయారీ పరిశ్రమను టేక్ ఓవర్ చేసుకుంది. అప్పటికే అమెరికాకు చెందిన కొరెల్స్ ఓవర్‌సీస్ లిమిటెడ్ అనే టీఎన్‌సీ ఈ సెక్టార్‌లో ప్రవేశించింది) చేయడం, బహుళజాతి కార్పొరేట్ కంపెనీలకూ, ప్రత్యేకించి విదేశీ పెట్టుబడికి అనుమతులు ఇవ్వడం ద్వారా దెబ్బతీస్తున్నారు. మరో వైపు ఈ రంగంలో బడా వ్యాపార సంస్థలచే ఔట్‌సోర్సింగ్ (ఉత్పత్తి మరియు సర్వీసు - రెండు రంగాలలో)ను ప్రోత్సహిస్తూ దాని స్వతంత్ర అస్తిత్వాన్ని రూపుమాపడం (లేదా పెద్ద వ్యాపార సంస్థల కబ్జా)తో పాటు దానిని అనుబంధ రంగంగా మార్చివేస్తున్నారు. దీంతో ఈ రంగం వృద్ధి రేటు పడిపోయింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ వల్ల సూక్ష్మ పరిశ్రమల్లో 40 శాతం ఖాయిలాపడే స్థితి ఏర్పడింది. రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారమే దేశవ్యాప్తంగా 4,86,291 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయి.

దళారీ పాలకులు ప్రపంచీకరణ విధానాలను ఆమోదించి ప్రపంచ వ్యాపార సంస్థ ముందు లొంగిపోవడంతో చోటుచేసుకున్న ఈ కింది పరిణామాల ఫలితంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో పడింది: ఏ) వ్యవసాయ దిగుమతులకు భారత మార్కెట్‌ను తెరవడం; బీ) వ్యవసాయంలో అప్పటికే అత్యంత అధమ స్థాయికి చేరుకున్న పెట్టుబడి మదుపులో మరింత తగ్గుదల; సీ) 1970ల నుంచి వ్యవసాయోత్పత్తిలో స్వల్ప మాత్రంగా ఉనికిలో ఉన్న 'ఆహార భద్రతా' విధానాన్ని నీరుగార్చడం మరియు పబ్లిక్ రంగ సేకరణ (procurement) విధానాన్ని ప్రైవేటీకరించడం, ప్రచార ఆర్భాటం తప్ప కనీస మద్దతు ధర కల్పించే చర్యలు నామమాత్రం కావడం, ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)ను బలహీనపరచడం, సామ్రాజ్యవాద దేశాలలో అధిక సబ్సిడీలతో భారీగా, చౌకగా ఉత్పత్తి అయిన వ్యవసాయ సరుకులను మన దేశం లాంటి వెనుకబడిన దేశాల మార్కెట్లలో కుమ్మరించి వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టడం.

అర్జున్ సేన్ గుప్తా కమిటీ రిపోర్టు ప్రకారం దేశంలో 77 శాతం మంది అంటే 80 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యరేఖ దిగువన జీవిస్తున్నారు. రోజుకు 20 రూపాయల కంటే తక్కువ

వేతనంతో బతుకులీడుస్తున్నారు. మరోవైపు అంబానీలు, టాటాలు, బిర్లాలు, మిత్తల్‌లు, జిందల్‌లు, రుయియాలు, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, బి.ఎం.ఆర్ మొదలైనవారు ప్రపంచ బిలియనీర్లలో భాగమయ్యారు. 2000 సంవత్సరంలో 10 శాతం అత్యంత ధనికుల వద్ద దేశంలోని 36.8 శాతం సంపద ఉండగా ఇది 2015లో 10 శాతం అత్యంత ధనికుల వద్ద సంపద 65.9 శాతానికి చేరుకుంది. 2017 నాటికి ఒక శాతంగా ఉన్న కుబేరుల వద్ద దేశ సంపదలో 73 శాతం పోగుబడింది. 2018లో 1 శాతం ఆస్తిపరుల సంపద 39 శాతం పెరగగా కింది స్థాయి 39 శాతం మంది సంపద కేవలం 3 శాతం పెరిగింది. దేశంలో పది శాతం మంది కుబేరుల వద్ద దేశ సంపదలో 77.4 శాతం పోగుపడి వుండగా, పై 1 శాతం వ్యక్తుల వద్ద 51.53 శాతం సంపద పోగుపడి ఉంది. కింది స్థాయి 60 శాతం వద్ద 4.8 శాతం సంపద మాత్రమే ఉన్నది. పై 9 మంది బిలియనీర్ల సంపద 50 శాతం ప్రజల సంపదతో సమానం. 2020 జనవరిలో డావోస్‌లో జరిగిన 50వ ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా ఆక్స్‌ఫామ్ విడుదల చేసిన 'టైమ్ టు కేర్' రిపోర్టు ప్రకారం ఒక్క శాతంగా ఉన్న (1.32 కోట్లు) కుబేరుల వద్ద దేశంలోని 70 శాతం (95.3 కోట్ల మంది) వద్ద ఉన్న ఆస్తులకంటే నాలుగు రెట్ల సంపద పోగుబడింది. దేశంలోని టాప్-63 బిలియనీర్ల సంపద 2018-19 దేశ బడ్జెట్ (24.42 లక్షల కోట్ల రూపాయలు)కు మించిపోయింది. ఒక సామాన్య కార్మికుడు ఏడాదిలో సంపాదించే ఆదాయాన్ని ఒక సాఫ్ట్‌వేర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) కేవలం 10 నిమిషాల్లోనే సంపాదిస్తున్నాడు.

ప్రపంచీకరణ కారణంగా సంపద పైకి ఎగదన్నింది, కిందికి జారినవి ఎంగిలి మెతుకులు మాత్రమే. దేశంలో ధనికులకూ, పేదలకూ మధ్య అసమానతలు బాగా పెరిగిపోయాయి. 2019 జనవరిలో ఆక్స్‌ఫామ్-డావోస్ రిపోర్ట్ 'పబ్లిక్ గుడ్ ఆర్ ప్రైవేట్ వెల్త్' ప్రకారం భారతదేశానికి వస్తే గినీ కోఎఫిసియంట్ 2008లో 81.2 శాతం నుంచి 2018లో 85.4 శాతానికి పెరిగింది. (ఒక దేశంలో ఆర్థిక అసమానతలను లెక్కించే కొలమానమే గినీ కోఎఫిసియంట్. దీనిని 1912లో ఇటలీ సామాజికవేత్త కొర్రాడో గిని రూపొందించాడు. ఈ శాతం ఎంత పెరిగితే అంతగా అసమానతలు పెరిగినట్లు, అది సున్నా శాతానికి వస్తే ఆర్థిక అసమానతలు లేనట్లు అర్థం). ప్రపంచీకరణ విధానాల వల్ల కలిగిన ఈ పరిణామాలను చూస్తే బూర్జువా మేధో ప్రపంచం పెద్దెత్తున ప్రచారం చేస్తున్న 'సంపద బొట్లు బొట్లుగా కిందికి జారుతుంది' అనే సిద్ధాంతపు, 'విదేశీ పెట్టుబడితో భారతదేశం 8 శాతం వృద్ధి రేటు సాధిస్తుంది', 'ఉత్పత్తి సంబంధాలు ఆధునీకరించబడతాయి', 'నిరుద్యోగం సమసిపోతుంది' అనే తప్పుడు ప్రచారపు అసలు స్వరూపం బహిర్గతమవుతుంది.

## అర్ధవలస స్థితి

### విదేశీ ద్రవ్య పెట్టుబడులు:

విదేశీ ద్రవ్య పెట్టుబడులు మౌలికంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ), పోర్ట్‌ఫోలియో పెట్టుబడి రూపాలలో వస్తాయనేది మనం ముందే చూసాం. పోర్ట్‌ఫోలియో పెట్టుబడులలో విదేశీ వ్యవస్థాగత పెట్టుబడులు (ఎఫ్‌ఐఐలు), గ్లోబల్ డిపాజిటరీ రిసీట్స్ (జిడిఆర్), అమెరికన్ డిపాజిటరీ రిసీట్స్ (ఎడిఆర్)ల వంటి ద్రవ్య సాధనాలూ, ఎన్‌ఆర్‌ఐల డిపాజిట్లు కలిసి ఉంటాయి. విదేశీ పెట్టుబడులు విదేశీ 'సహాయం', రుణాల వంటి వాటి రూపాలలో కూడా వస్తున్నాయి. ఇవి విదేశీ రుణంలో భాగంగా ఉంటాయి. 1990లలో నయా వలస తరహా నియంత్రణకు 'సహాయాన్ని' ఒక ఆయుధంగా కొనసాగడంతో పాటు ఎఫ్‌డిఐలు, ఎఫ్‌ఐఐలు, మారకపు విలువలో అవకతవకలు మొదలయిన ఇతర నియంత్రణల విశాల వ్యవస్థ కూడా ఇందుకు తోడయ్యింది.

**ఎఫ్‌డీఐ:** దేశంలోకి ప్రవేశిస్తున్న ఎఫ్‌డీఐ మదుపులు ప్రధానంగా అంతర్జాతీయ గుత్త సంస్థలకు చెందినవే. వీటిని వ్యాపారాలను/కంపెనీలను స్థాపించేందుకు/టేక్ ఓవర్ చేసేందుకు మదుపుపెడుతున్నారు. ఇవి దేశ మార్కెట్లను, సహజ వనరులను కబ్జా చేస్తున్నాయి. ప్రత్యక్షంగా వడ్డీలు, డివిడెండ్లు, టెక్నికల్ తదితర ఫీజులు, అధిక ధరలు/కారుచౌక ధరలు వంటి వేరు వేరు విశ్వాసఘాతక మార్గాల ద్వారా, పరోక్షంగా కంపెనీల విదేశీ డైరెక్టర్లకు, టెక్నికల్ నిపుణులకు భారీ వేతనాలను చెల్లించడం ద్వారా దేశ సంపదను భారీమొత్తాలలో కొల్లగొడుతున్నాయి.

కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో భారతదేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పెరుగుదల రేటును చూస్తే ద్రవ్య పెట్టుబడిపై వెనుకబడిన దేశాలలోని దళారీ ప్రభుత్వాల విధానం పూర్తిగా సామ్రాజ్యవాదులు, వారి అంతర్జాతీయ గుత్తసంస్థల నిర్దేశనంలోనే ఉన్నాయని, దళారీ ప్రభుత్వాలు కేవలం రబ్బర్ స్టాంపుల మాదిరి పని చేస్తున్నాయనీ స్పష్టమవుతుంది.

నిజానికి దేశంలోకి వచ్చే ఎఫ్‌డిఐలో 70 శాతం ఉనికిలో ఉన్న వ్యాపారాలను కొనుగోలు చేయడంలో పెడుతున్నారు, చిన్న మొత్తంతో మాత్రమే నూతన సంస్థలను స్థాపిస్తున్నారు. మరో మాటలో చెప్పాలంటే, అటువంటి పెట్టుబడి ఉపాధిని సృష్టించదు. వాస్తవానికి అది ఆధునిక యంత్రాలతో ద్రవ్యోల్బణ రేట్లతో అది భారతదేశానికి దిగుమతి అవుతుంది. పెద్దెత్తున ఉద్యోగాలను నష్టపరుస్తుంది.

సరళీకరణ మొదటిదశలో 1985-1991 మధ్యకాలంలో సైతం ఉన్న ఆంక్షల కారణంగా ఎఫ్‌డిఐ సంవత్సరానికి సగటున కేవలం సుమారు 200 మిలియన్ డాలర్లు మాత్రమే వచ్చేది. సరళీకరణ 2వ దశలో ఎఫ్‌డిఐ ఊహించనంత వేగంతో పెరిగింది. 2001లో ప్రపంచ ఎఫ్‌డిఐలు సగానికి పడిపోతే (మూడు దశాబ్దాలలో పెద్ద తగ్గుదల), భారతదేశంలోకి ఎఫ్‌డిఐ

47 శాతం పెరిగింది. సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలో ఉండడంతో అవి మరింత దూకుడుగా భారతదేశం వంటి వెనుకబడిన దేశాల ఆర్థిక వ్యవస్థలపై మరింత ఆధిపత్యం కోసం ప్రయత్నించడమే దీనికి కారణం.

ఎఫ్‌డిఐలు భారత ఆర్థిక వ్యవస్థలో ప్రతి రంగంలోనూ చొరబడ్డాయి. ఆమోదం పొందిన విదేశీ కొలాబరేషన్‌లకు, వాస్తవంగా దేశంలోకి వచ్చిన ఎఫ్‌డిఐకీ మధ్య తేడా చూస్తే టీఎన్‌సీల వ్యూహాన్ని అర్థం చేసుకోవచ్చు. టీఎన్‌సీలు లాభదాయకత అత్యధికంగా ఉన్న వివిధ దేశాలలో ఆమోదాలు పొంది పెట్టుబడులు పెడుతుంటాయి. ఈ కారణంగా పై ఒప్పందాలలో కేవలం 21 శాతం మాత్రమే అమలులోకి వచ్చాయి. అలాగే రసాయనాలు, ఎలక్ట్రికల్స్, రవాణా రంగాలలో సైతం ఎఫ్‌డిఐలు విస్తృతంగా చొరబడ్డాయి.

దేశంలో ఎఫ్‌డిఐని చూస్తే, 1991 నుంచి 1999 చివరి కాలం వరకు మొత్తం ఎఫ్‌డిఐలో అన్నింటి కంటే ఎక్కువగా అమెరికా 22 శాతం (46,184 కోట్ల రూపాయలు) ఎఫ్‌డిఐ మదుపుపెట్టింది. ఆ తరువాత 7.6 శాతంతో (15,977 కోట్లు) బ్రిటన్, 4.3 శాతంతో జపాన్, 3.8 శాతంతో జర్మనీ ఉన్నాయి. మిగిలిన 30,683 కోట్లు ఐరోపా నుంచి వచ్చాయి. నామమాత్రపు పన్ను ఉన్న (tax haven) మారిషస్ నుంచి పెద్ద మొత్తాలలో పెట్టుబడులు వచ్చాయి. భారతదేశంలో పన్నులు లేకుండా ఉండేందుకు మొత్తం ఎఫ్‌డిఐలో 35 శాతం ఈ రకంగా మారిషస్ నుంచి తీసుకువచ్చారు.

ఎఫ్‌డిఐ మొదట అది భారతీయ పెట్టుబడిదారులతో జాయింట్ వెంచర్లలో మైనారిటీ షేర్లుగా వచ్చింది. ఆ తరువాత త్వరలోనే ఆ కంపెనీలో మేనేజ్‌మెంట్ నియంత్రణతో పాటు 51 శాతం షేర్లను, అంటే మెజారిటీ షేర్లను డిమాండ్ చేసింది. ప్రస్తుతం నూటికి నూరు శాతం యాజమాన్యాన్ని హస్తగతం చేసుకుంటూ చిన్న, మధ్యతరహా పెట్టుబడిదారులకు నష్టం కలిగిస్తోంది. సరళీకరణపు తొలి తొమ్మిది సంవత్సరాల కాలంలో పూర్తి యాజమాన్యంతో వచ్చిన ఎఫ్‌డిఐలకు లభించిన అనుమతులు మూడింట ఒక వంతుగా ఉన్నాయి. బీమా, బ్యాంకింగ్, గనులు, రక్షణ ఉత్పత్తి, మీడియా, చివరకు చిన్న తరహా రంగం, వ్యవసాయం, చేతివృత్తుల వంటి ప్రముఖ రంగాలలో కూడా ఆనాటికే ప్రభుత్వం ఎఫ్‌డిఐను అనుమతించింది.

2005లో ప్రభుత్వం ఎఫ్‌డీఐ పాలసీని మరింత సరళీకరించి వెంచర్లలో, కన్‌స్ట్రక్షన్ రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐని అనుమతించింది. 2012–14 మధ్య ఈ సంస్కరణలను రక్షణ, టెలికాం, చమురు, రీటైల్, విమానయానం మరియు ఇతర రంగాలకు విస్తరించింది. దీంతో 2000–2010 మధ్య దేశంలోకి 178 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ వచ్చింది. దీనిపై ఆధారపడి టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆటో విడిభాగాలు, రసాయనాలు, దుస్తులు, ఫార్మాస్యుటికల్స్, ఆభరణాలు వంటి ప్రముఖ రంగాలలో అంతర్జాతీయ గుత్తసంస్థలు సూపర్

లాభాలను దండుకున్నాయి. 2012లో ప్రభుత్వం మల్టీ-బ్రాండ్ రీటైల్ రంగంలో 51 శాతం, సింగిల్-బ్రాండ్ రీటైల్ రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలను అనుమతించింది. ఇలా అన్ని రంగాలలోకి, 2016-2017లో కీలకమైన రక్షణ, బీమా రంగాలలో సైతం 100 శాతం ఎఫ్‌డీఐని ప్రభుత్వం అనుమతించింది. 2019-20 బడ్జెట్ లెక్కల ప్రకారం మోడీ నేతృత్వంలోని మొదటి ఐదేళ్ల ఎన్‌డీఏ పాలనలో దేశంలోకి 20.30 లక్షల కోట్ల రూపాయల ఎఫ్‌డీఐలు వచ్చాయి. అయితే ఈ ఐదేళ్లలో ఎఫ్‌డీఐ అంకెలలో పెరిగినప్పటికీ, జీడీపీతో పోల్చుకుంటే అది తగ్గింది. అంటే జీడీపీ పెరిగినంతగా ఎఫ్‌డీఐ మదుపులు పెరగకపోవడానికి కారణం భారతదేశంలో మదుపుపెట్టడం లాభదాయకం కాకపోవడమూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఉన్న సంక్షోభంలో కూరుకుపోవడము తప్ప మరొకటి కాదు.

మేక్ ఇన్ ఇండియా ప్రారంభమైనప్పటి నుంచి మెజారిటీ ఎఫ్‌డీఐ ఇప్పటికీ సర్వీసు రంగంలోకే వస్తోంది. 2016 నుంచి 2017 వరకు భారతదేశంలోకి వచ్చిన ఎఫ్‌డీఐలలో ఇలా సర్వీసు రంగంలోకి వచ్చిన ఎఫ్‌డీఐ 60 శాతంగా ఉంది. ఆటోమొబైల్స్, పవర్, మందులు, రసాయనాలు, లోహాలు వంటి రంగాలలోకి వచ్చిన ఎఫ్‌డీఐ కేవలం 14.66 శాతం అంటే 22.97 బిలియన్ డాలర్లు మాత్రమే. నూతన సామర్థ్య నిర్మాణానికి (కెపాసిటీ బిల్డింగ్‌కు) తోడ్పడింది తక్కువ.

భారత దళారీ కార్పొరేట్ కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకుని 2000 సంవత్సరం నుంచి విదేశాలకు విస్తరించి అమెరికా, యూరప్, ఆఫ్రికా దేశాలలో ఎఫ్‌డీఐని మదుపుపెట్టడం ద్వారా వివిధ సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల దోపిడీకి వారధిగా పని చేస్తున్నాయి. 2006-2010 మధ్య అవి భారతదేశ జీడీపీలో 1.34 శాతం ఎఫ్‌డీఐని విదేశాలలో మదుపుపెట్టాయి. ఉదాహరణకు, జర్మనీలో అవి 140 ప్రాజెక్టులలో మదుపుపెట్టాయి. 2010 నుంచి భారత్-థాయ్‌ల్యాండ్ దేశాల మధ్య స్వేచ్ఛా వ్యాపార ఒప్పందం ఉంది. బ్రెజిల్‌లోని ఐటి, ఫార్మాస్యుటికల్స్, ఇంధనం, అగ్రిబిజినెస్, మైనింగ్, ఇంజినీరింగ్ రంగాలలో పెట్టుబడులు పెడుతున్నాయి. టాటా కంపెనీ బ్రిటన్‌లో జాగ్వార్ లాండ్ రోవర్ అండ్ కోరస్ కంపెనీని 14.3 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసి ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించే మాన్యుఫాక్చరింగ్ కంపెనీగా ఉంది. 2010 జనవరిలో అనిల్ అంబానీకి చెందిన ఏడీఏ గ్రూపు కంపెనీ రిలయెన్స్ మీడియా వర్క్స్ లిమిటెడ్ బ్రిటన్‌లోని ఇలాబ్ యు.కె. లిమిటెడ్ ఆస్తులను కబ్జా చేసుకుంది. ఇటీవల బిలియనీర్‌గా మారిన రజ్జు ష్రాఫ్‌కు చెందిన యునైటెడ్ ఫాస్ఫరస్ లిమిటెడ్ కంపెనీకి 30 కంటే అధిక దేశాలలో కంపెనీలు ఉన్నాయి.

అయితే స్విజ్జర్లాండ్ ఒక పరిశోధనా గ్రూపు చేసిన అధ్యయనం ప్రకారం ప్రపంచంలో దాదాపు అన్ని భారీ కార్పొరేట్ సంస్థలు కేవలం 20 సామ్రాజ్యవాద టి.ఎన్.సి ద్రవ్య కార్పొరేట్ సంస్థల నియంత్రణలో ఉన్నాయి. సామ్రాజ్యవాద దేశాలలో టాటాలు, అంబానీలు ఎన్ని కంపెనీలను కొనుగోలు చేసినప్పటికీ, వారి ఆదాయంలో సగానికి పైగా వాటి ప్రపంచ

కార్యకలాపాల నుంచి వచ్చినప్పటికీ, ఈ భారీ సంస్థల ముందు అవి దళారీ సంస్థలుగానే ఉండిపోతాయి.

**ఎఫ్ఐఐ:** ఎఫ్ఐఐ లేదా పోర్టుఫోలియో మదుపులు ఎఫ్‌డిఐ కంటే చాలా ప్రమాదకరమైనవి. అవి దేశానికి ఏమీ ఇవ్వకుండానే దేశ సంపదను దోపిడీ చేస్తున్నాయి. ఎఫ్ఐఐ లేదా పోర్టుఫోలియో మదుపులు ప్రధానంగా భారత స్టాక్ మార్కెట్లపై, రూపాయి మారకపు విలువపై, రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఏర్పడే స్పెక్యులేషన్ ద్వారా ఈక్విటీలను/ప్రస్తుతం డెరివేటివ్‌లను కొనడం–అమ్మడం కోసం దేశంలో మదుపుపెడుతూ–ఉపసంహరించుకుంటూ, నిరంతరం పథకాలను మార్చుకునే స్పెక్యులేటివ్ పెట్టుబడులు. వాస్తవానికి అవి స్టాక్ ధరలను నియంత్రిస్తున్నాయి. ఒక్కసారిగా కొనుగోళ్లు చేసి లేదా రాత్రికి రాత్రి అమ్మకాలు జరిపి ధరలను పడగొడుతున్నాయి, అధిక లాభాలు సంపాదిస్తున్నాయి. వీటిలో చాలా వాటిపై భారత ప్రభుత్వం పన్నులు కూడా వేయదు. సాధారణ మధ్యతరగతి ప్రజలపై ఎప్పటికప్పుడు నూతన పన్ను నియమాలు విధించే ప్రభుత్వం, ఈ ఎఫ్ఐఐలకు నామమాత్ర పన్నులు వేసే మారిషస్ దేశంలో రిజిస్టర్ చేసుకునేందుకు అవకాశం కల్పించడం ద్వారా అవి ఒక్క పైసా పన్ను చెల్లించకపోయినా దేశం నుంచి వేలాది కోట్ల రూపాయలు లూటీ చేసేందుకు అనుమతిస్తున్నది. ఈ పన్ను ఎగవేత కోసం మారిషస్‌తో భారత ప్రభుత్వం ప్రత్యేకంగా 'డబల్ టాక్సేషన్ అవాయిడెన్స్ అగ్రిమెంట్' చేసుకుంది. భారతదేశంలో కార్యకలాపాలు సాగిస్తున్న వందలాది ఎఫ్ఐఐలలో కొన్ని డజన్ల కొలదీ ఎఫ్ఐఐలు మారిషస్‌లో రిజిస్టర్ అయివున్నాయి. ఈ పనిని ప్రధానంగా మోర్గాన్ స్టాన్లీ, మిర్రిల్ లించ్ మొదలైన శక్తివంతమైన ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ కంపెనీలు, సాంప్రదాయక విదేశీ బ్యాంకుల ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ విభాగాలు వంటివి నిర్వహిస్తూ ఉంటాయి. వీటి వద్ద అపారమైన పెట్టుబడి మొత్తాలు ఉండడం, స్టాక్ మార్కెట్ల, ధరల హెచ్చుతగ్గుల వాస్తవిక నియంత్రణ వాటి చేతిలో ఉండడం వల్ల ఇందులో వాటికి సూపర్ లాభాలకు హామీ ఉంటుంది. భారత్ వంటి దేశాలలో వీటికి నష్టాలు రావడం అరుదు.

అమెరికా ఆధిపత్యంలోని భారీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థలు ప్రపంచ ద్రవ్య మార్కెట్‌లపై ఆధిపత్యం వహిస్తున్నాయి. అవి ప్రతి రోజూ మార్కెట్లలో స్పెక్యులేటివ్ పెట్టుబడి రూపంలో ట్రిలియన్ల డాలర్ల లావాదేవీలు జరుపుతున్నాయి. అవి మన దేశంలో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు, రూపాయి మారకం రేట్లు, అమ్మకపు వస్తువుల ధరలు (వ్యవసాయంతో సహా) మొదలైనవాటన్నింటిలో వినాశనం సృష్టిస్తున్నాయి. ఇవన్నీ 'డెరివేటివ్ ట్రేడింగ్' (అంటే భవిష్యత్తు ప్రత్యామ్నాయాలు, మొదలైనవి) రూపంలో స్పెక్యులేట్ అవుతున్నాయి.

1990కి ముందు భారతదేశానికి ఎఫ్ఐఐలు దాదాపు రాలేదు. అంతర్జాతీయంగా కూడా 1990ల చివరిలోనే ఈ రకమైన పెట్టుబడి ప్రపంచ ద్రవ్య మార్కెట్లపై ఆధిపత్యం సాధించసాగింది. నిరంతరం నియంత్రణలు సడలించబడడంతో వరుస ప్రభుత్వాలు, ముఖ్యంగా

ఆనాటి బీజేపీ ప్రభుత్వం ఈ చొరబాటును సుగమం చేసాయి. మొదటగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏ భారత కంపెనీలోనైనా 24 శాతం వరకు పెట్టుబడులు (పెయిడ్ అప్ కాపిటల్) పెట్టేందుకు ఎఫ్ఐఐలకు అనుమతి ఇచ్చింది. విదేశీ పెట్టుబడిదారులకు వాస్తవంగా నియంత్రణ కల్పించే 24 శాతం వాటా చిన్న, మధ్యతరహా పెట్టుబడులకు ఒక తీవ్రమైన విఘాతం. అయితే సామ్రాజ్యవాదులు దీనితో సంతృప్తి చెందలేదు. వాళ్లు మరింతగా నియంత్రణ కోరారు. 1997-98లో యూఎఫ్ ప్రభుత్వంలో చిదంబరం 'స్వాప్నిక బడ్జెట్'లో దీనిని 30 శాతానికి పెంచాడు. ఆ తరువాత భాజపా ప్రభుత్వం మొదట 40 శాతానికి, 2000 డిసెంబరులో 49 శాతానికి పెంచింది. 2001 సెప్టెంబర్‌లో ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాల ప్రకారం ఎఫ్‌డిఐలకు సమానంగా ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు ఎఫ్ఐఐలను ఆర్‌బిఐ అనుమతించింది. కొన్ని రంగాలలో వీటిని 74 శాతం నుంచి నూరు శాతం వరకు కూడా పెంచింది. 2002లో ప్రభుత్వం భారతీయ కంపెనీలలో నూరు శాతం ఎఫ్ఐఐలను అనుమతించింది. అయితే భారీ మొత్తాలలో దేశంలోకి వచ్చే, దేశం నుంచి బయటకు పోయే ఈ భారీ (ఎఫ్ఐఐ) మొత్తాలే దేశ ద్రవ్య మార్కెట్‌లను వరదలా ముంచెత్తి, వాటి మీద గట్టిపట్టు కలిగి ఉంటున్నాయి. నిజానికి అవి స్పెక్యులేషన్ ద్వారానే లాభాలు చేసుకున్నాయి. యావత్తు భారతీయ మార్కెట్ పెట్టుబడీకరణలో విదేశీ పెట్టుబడులు వాటా పెరిగింది. దేశంలోని స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల మీద ఎఫ్ఐఐల ఆధిపత్యం ఏర్పడింది.

అంతర్జాతీయ గుత్త కంపెనీలు ఎఫ్ఐఐ మదుపులే కాకుండా భారీ మొత్తంలో గ్లోబల్ డిపాజిటరీ రిసీట్స్ (జిడిఆర్)లను మదుపుపెట్టాయి. ఇవి ప్రధానంగా ఐరోపా ద్రవ్య మార్కెట్లలో అమ్మబడిన, విదేశీ కంపెనీల చేతుల్లో ఉన్న షేర్లు. విదేశీ మారకద్రవ్యం రూపంలో వాటికి డివిడెండ్లు అందుతూ ఉంటాయి.

2002 నాటికి భాజపా ప్రభుత్వం భీమా, బ్యాంకింగు, మ్యుచువల్ ఫండ్‌లు మొదలయిన రంగాలను తెరవడంతో దేశ యావత్తు ద్రవ్య రంగమూ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నియంత్రణ, ఆధిపత్యంలోకి పోవడానికి మార్గం సుగమమైంది. దీంతో వివిధ రకాల మొత్తం విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు 2004-2005లో 1,05,000 కోట్ల రూపాయల నుండి 2019 మార్చి నాటికి అవి 2,48,154 కోట్ల రూపాయలకు పెరిగాయి.

**ఎన్ఆర్ఐ డిపాజిట్లు:** ఇవి ప్రధానంగా భారత మూలాలు ఉండి విదేశాలలో ఉంటున్న సంపన్న వ్యాపార కుటుంబాల డబ్బులే. అంతర్జాతీయ మార్కెట్‌లలో నామమాత్రంగా లభించే 2 శాతం వడ్డీ రేటుతో పోల్చితే భారీ వడ్డీలను భారత ప్రభుత్వం ఇస్తున్నది. భారీ మొత్తంలో లభించే వడ్డీ, పెట్టుబడిని ప్రస్తుతం స్వదేశానికి పంపించే పూర్తి స్వేచ్ఛ ఎన్ఆర్ఐలకు ప్రభుత్వం కల్పించింది. దీంతో ఎన్ఆర్ఐ డిపాజిట్లు దేశంలోకి ప్రవహిస్తున్నాయి. 2009-10లో భారత ఎన్ఆర్ఐలు స్వదేశానికి ప్రపంచంలోనే అత్యధికంగా 2.5 లక్షల కోట్ల రూపాయలు డబ్బు

పంపారు. 2015 నాటికి మన దేశానికి వచ్చిన ఇలాంటి డబ్బు దేశ జీడీపీలో 3.32 శాతంగా ఉంది. వారు 2018లో 5.7 లక్షల కోట్ల రూపాయలు దేశంలోకి పంపారు.

**విదేశీ రుణాల ఉచ్చు:** వెనుకబడిన దేశాలలో అత్యధిక విదేశీ 'సహాయాన్ని'/అప్పులను అందుకుంటున్నది భారతదేశమే. 'ఆర్థిక సంస్కరణల' కాలంలో విదేశీ 'సహాయం' బాగా పెరిగింది. 1996 తరువాత ఈ 'సహాయం' మరింత ఖర్చుతో కూడినదిగా తయారయింది. మొత్తం 'సహాయం'లో గ్రాంట్ల శాతం సగటున 15 శాతం నుంచి 9 శాతానికి పడిపోయాయి. 1996-97లో విదేశీ 'సహాయం'/అప్పు 10,892.9 కోట్ల రూపాయలు ఉండగా, గ్రాంట్లు 1085.6 కోట్ల రూపాయలు మాత్రమే వచ్చాయి. ఇవి 2018-19 నాటికి 'సహాయం' 60,434.4 కోట్లకు పెరగగా, గ్రాంట్లు 816 కోట్ల రూపాయలకు పడిపోయాయి.

1990లో మొత్తం విదేశీ అప్పులు 98.3 బిలియన్ డాలర్లు, 1992లో 85 బిలియన్ డాలర్లు ఉంటే 2002లో 110 బిలియన్లకు పెరిగింది. నిరంతరం విలువ పడిపోతున్న రూపాయి లెక్కతో చూసినప్పుడు 2002 నాటికే ఇది మూడు రెట్లు ఎక్కువ. 1990ల, 2000 దశకాలలో ప్రపంచ బ్యాంకు నుంచి భారీ మొత్తాలలో 'సహాయం' ఆంధ్రప్రదేశ్‌లో 'గ్రామీణ ప్రాజెక్టులు'గా చెబుతున్న వాటి కోసం టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వాలకు అందాయి. నిజానికి ఈ డబ్బు రాష్ట్రంలో తీవ్రంగా వున్న మావోయిస్టు ఉద్యమం నుంచి ప్రజలను దూరం చేసేందుకే వచ్చింది. ఈ నిధుల కోసం ప్రపంచ బ్యాంకు కచ్చితమైన షరతులు విధించింది, స్ట్రక్చరల్ ఎడ్జస్ట్‌మెంట్ ప్రోగ్రాములను నిర్దేశించింది. ఆనాటి ప్రభుత్వాలు చేపట్టిన వివిధ 'విజన్ ప్లాన్‌లు' ప్రపంచ బ్యాంకు నిర్దేశించిన సంస్కరణలే తప్ప మరొకటి కాదు. ఈ విదేశీ రుణాలు 2015లో 444.2 బిలియన్ డాలర్లకు, 2017 మార్చి నాటికి 471 బిలియన్ డాలర్లకు, 2018 డిసెంబర్ నాటికి 521 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

దీనికి తోడుగా రూపాయి విలువ నిరంతరం పడిపోతూ ఉండడంతో వాస్తవ వడ్డీ రేట్లు మార్కెట్ రేట్ల కంటే చాలా ఎక్కువగా ఉంటున్నాయి. అందువల్ల డాలర్‌లలో చెల్లించడం కోసం మరింత పెద్ద మొత్తంలో రూపాయల అవసరం ఏర్పడింది. రుణ సేవా ఛార్జీలు (అంటే చెల్లింపులు, విదేశీ రుణాలపై వడ్డీ కలిపి) 1990-91లో 4,283 కోట్ల రూపాయలుగా ఉ ండగా, 1999-2000లో 16,373 కోట్ల రూపాయలు అయ్యాయి. నిజానికి పరిస్థితి ఎంత ఘోరంగా ఉన్నదంటే 1995-96 నుంచి యావత్తు నూతన రుణాలూ రుణ సేవా ఛార్జీలు చెల్లించేందుకు సరిపోవడం లేదు. విదేశీ మారకద్రవ్య నిల్వలకు, మొత్తం విదేశీ అప్పుకూ మధ్య నిష్పత్తి 2014 మార్చిలో 68.2 నుంచి 2018 డిసెంబర్ నాటికి 75.5 శాతానికి పెరిగింది. అందువల్ల అప్పులు తీర్చడం కోసం విదేశీ మారకద్రవ్య నిల్వలకై చేసే స్వల్పకాలపు అప్పుల శాతం 25.1 శాతానికి చేరుకుని ప్రపంచంలో అత్యధిక రుణగ్రహీత దేశాలలో భారతదేశం కింది నుంచి 5వ స్థానంలో ఉంది. ప్రభుత్వం చేసిన మొత్తం అప్పులపై వడ్డీ

చెల్లింపులు 2012-13లో 4,28,387 కోట్లు, 2013-14లో 5,43,267 కోట్లు, 2014-15లో 6,43,301 కోట్లు, 2015-16లో 4,56,145 కోట్ల రూపాయలకు పెరిగాయి. అంటే ప్రభుత్వ వ్యయంలో ప్రతి రూపాయిలో 43.7 పైసలు అప్పులకు వడ్డీ చెల్లింపుల కోసమే ఖర్చవుతోంది. మరో మాటలో చెప్పాలంటే, యావత్తు నూతన రుణాలనూ అంతర్జాతీయ రుణదాతలకు తిరిగి చెల్లించడం కోసమే ఉపయోగిస్తున్నారు. ఇది రుణాల ఉచ్చు తప్ప మరొకటి కాదు.

**మైక్రో-ఫైనాన్స్ సంస్థలు (MFIs)-సూక్ష్మ రుణాలు:** భారతదేశంలో ధరల పెరుగుదల, నిజవేతనాలు పడిపోవడం, నిరుద్యోగం-చిరుద్యోగం కారణంగా ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడంతో మార్కెట్ కుంచించుపోయి మరింత ద్రవ్య సంక్షోభం ఏర్పడుతున్నది. నిరుపేద ప్రజలకు తమ అవసరాలు తీర్చుకోవడానికి ఈ చిన్న మొత్తాలు సైతం రుణాలుగా దొరకవు. మైక్రో రుణాలు ఇవ్వడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించే పేరుతో ప్రపంచ ద్రవ్య పెట్టుబడి ఈ రంగంలో చొరబడింది. ఇందులో భాగంగా పేదల చిన్న పొదుపు మొత్తాలను సైతం కొల్లగొట్టే లక్ష్యంతో పలు మైక్రో-ఫైనాన్స్ సంస్థలు (ఎంఎఫ్ఐ) పుట్టుకొచ్చాయి. ఇవి ఎన్‌బీఎఫ్‌సీ కేటగిరీ (నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు. వీటికి బ్యాంకింగ్ లైసెన్స్ ఉండదు) కింద పనిచేస్తున్నాయి. ఇవి నిరుపేద ప్రజలలో మైక్రో-ఫైనాన్సింగ్ గురించి (తరచు, చాలా తక్కువగా 500 రూపాయలు) పెద్దెత్తున ప్రచారం చేసి, ప్రోత్సహించి భ్రమలు కల్పించాయి. ఉదాహరణకు, బంగ్లాదేశ్‌లో మొహమ్మద్ యునుస్ తన ఎన్‌జీఓ (నాన్-గవర్నమెంటల్ ఆర్గనైజేషన్) ద్వారా మైక్రోఫైనాన్స్‌ను ఒక సాధనంగా ఉపయోగించుకొని పేదరికాన్ని నిర్మూలించేందుకు చేసిన కృషిని చూసి అతనికి నోబెల్ శాంతి బహుమతిని ఇచ్చి మైక్రో-ఫైనాన్స్ భావనకు ఒక మానవ ముఖాన్ని కల్పించడం ఇందులో భాగమే. అయితే ఆ తర్వాత జరిగిందేమంటే నిరుపేద ప్రజానీకాన్ని లక్ష్యంగా చేసుకొని ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్లు అత్యధిక వడ్డీ రేట్లను వసూలు చేస్తూ మైక్రో ఫైనాన్స్ కంపెనీలలో పెద్ద మొత్తాలలో మదుపు పెట్టారు. ఈ ధోరణి ప్రపంచవ్యాప్తంగా కార్చిచ్చులాగా వ్యాపించింది.

'మానవాళి భవిష్యత్తుకి లక్ష్యాలు' అని పేర్కొన్న ఫోర్డ్ ఫౌండేషన్ డిక్లరేషన్‌లో స్థానికంగా, అంతర్జాతీయంగా అట్టడుగు రాజకీయ ఉద్యమాలలో జోక్యం చేసుకోవడం అనే అంశం ఉంది. శ్రామిక ప్రజలకు 'తక్కువ వడ్డీ'కి అప్పులు అందించి వినిమయ సరుకులకు పెద్దెత్తున మార్కెట్‌ను కల్పించడం, ఈ విధానాన్ని ముందుకు తెచ్చినవారికి నోబెల్ బహుమతులు ప్రకటించడం, ప్రజలను నిరంతరం అప్పుల్లో కూరుకొనిపోయేలా చేయడం, తమ జీవనశైలి తగినంత సంపాదన కోసం వారిని ఉరుకులాటలో పడేయడం ద్వారా ద్రవ్య పెట్టుబడిదారులకు రెండు లక్ష్యాలు నెరవేరాయి - ఒకటి, వేలకోట్ల డాలర్లను టర్నోవర్ చేయడం ద్వారా నూతన ద్రవ్య మార్కెట్ ఏర్పడడమే కాకుండా, వారికి అందులో సూపర్ లాభాలు చేకూరాయి. రెండవది,

సంపాదన ఉరుకులాటలో ప్రజలను రాజకీయ ఉద్యమాల నుంచి దూరం చేయగలిగారు.

2018 మే నాటికి మైక్రోఫైనాన్స్ రంగంలో మొత్తం ఈక్విటీ ఫండింగ్ 39.88 శాతం పెరిగి 9,631 కోట్ల రూపాయలకు చేరుకుంది. ఈ సూక్ష్మ రుణాలు పేదల పొదుపు మొత్తాలను కొల్లగొట్టడమే కాకుండా వెనుకబడిన దేశాల ఆర్థిక వ్యవస్థలపై దారుణమైన ప్రభావాలు వేసాయి. బంగ్లాదేశ్‌లో గ్రామీణ బ్యాంకు ద్వారా సూక్ష్మరుణాలు తీసుకున్న రైతుకూలీలు ఆకలి పీడితులై ఆకలి చావులకు గురయ్యారు. భారతదేశంలో వేలాది మంది పేద, మధ్యతరగతి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఉదాహరణకు, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 2010లో 200 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 2012లో సూక్ష్మ రుణ సంస్థ ఉద్యోగుల బెదిరింపులకు భయపడి ఒక 18 యేళ్ల బాలిక ఫీజుకని దాచుకున్న 150 రూపాయలు కట్టేసి "కష్టపడి డబ్బు సంపాదించండి, అప్పులు చేయవద్దు" అని రాసి ఆత్మహత్య చేసుకోవడం సంచలనం సృష్టించింది.

ఈ మైక్రో-ఫైనాన్స్ సంస్థలలో నిరుపేద ప్రజలు 200 శాతం కంటే అధికంగా వడ్డీ రేట్లు చెల్లిస్తున్నారు. ఇదే సమయంలో మిలియనీర్లుగా ఉన్న కుబేరులు తమ విలాసవంతమైన కార్ల కోసం జీరో శాతం వడ్డీ రేటు, విలాసవంతమైన నివాసాలను కొనుగోలు చేసేందుకు కేవలం 5 లేదా 6 శాతం వడ్డీ రేటు చెల్లిస్తున్నారు. ఇన్ఫోసిస్ నారాయణ్ మూర్తి ఒక ఎంఎఫ్ఐలో మదుపు పెట్టాడు. ఆ ఎంఎఫ్ఐ పేదల వద్ద అన్యాయంగా వడ్డీ రేట్లను పిండుకుంది. ఈ కారణంగా రుణాలు తీసుకున్న అనేక మంది పేదలు (కేవలం 5 వేల రూపాయలు లేదా అంతకంటే కొంచెం ఎక్కువ మొత్తాలు రుణంగా తీసుకున్నవారు) ఆత్మహత్య చేసుకున్నారు.

**భారత పరిశ్రమలో పెద్దెత్తున పెరిగిన అంతర్జాతీయ గుత్త సంస్థల టేక్ ఓవర్లు-వాటి ఆధిపత్యం:**

ప్రపంచీకరణ కారణంగా పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాలలో ఉన్న దాదాపు అన్ని మార్కెట్ రంగాలు భారతదేశంలో కూడా ఉనికిలోకి వచ్చాయి. అయితే ఇక్కడ భూస్వామ్య పునాదితో అవి కుమ్మక్కుకావడం వల్ల ఇవి ఇప్పటికీ పాశ్చాత్య దేశాలలో లాగా ఇక్కడ రూపొందలేదు. నిజానికి ఈ భూస్వామ్య పునాదే ప్రపంచీకరణ కాలంలో పాశ్చాత్య పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చుతూ వారి లాభాలను పెంచుకునేందుకు తోడ్పడుతున్నది.

ప్రపంచీకరణ దశలోని మొదటి పన్నెండు సంవత్సరాల (1991-2002) విదేశీ పెట్టుబడి భారత పరిశ్రమ, వాణిజ్యం, ద్రవ్యాలకు చెందిన విస్తారమైన క్షేత్రాలను మింగివేసింది. 2000 తరువాత 'రెండో తరం సంస్కరణల' కాలంలో ప్రత్యేకించి మోదీ ప్రభుత్వ హయాంలో అత్యంత ముఖ్యమైన చట్టాలను - ఐబీసీ (దివాలాతీసిన కంపెనీలపై) చట్టం చేయడం, కంపెనీల చట్టానికి ముఖ్యమైన మార్పులు చేయడం ద్వారా దేశంపై విదేశీ ద్రవ్య పెట్టుబడి పట్టు మరింత పెరిగింది. 2008-2018 మధ్య విలీనాల-కబ్జాల రేటు అసాధారణ స్థాయికి చేరుకుంది. ప్రత్యేకించి,

ఐబీసీ చట్టం దివాలాతీసిన పరిశ్రమలలో (ప్రముఖ భారత పారిశ్రామిక పెట్టుబడిదారుల యాజమాన్యంలో అవి వున్నప్పటికీ) పెట్టుబడి పెట్టిన ద్రవ్య పెట్టుబడిదారులు కంపెనీ అప్పును ఈక్విటీ (అప్పు ఇచ్చినవారు అప్పును ఈక్విటీ)గా మార్చుకుంటున్నారు. తద్వారా మెర్జర్లు, అక్విజషన్లు చాలా సులువుగా, వేగంగా జరిగిపోతున్నాయి.

ప్రపంచీకరణ ఫలితంగా గత మూడు దశాబ్దాల కాలంలో అంతర్జాతీయ గుత్త సంస్థలు దేశంలోని దళారీ నిరంకుశ బూర్జువా కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కై సాగిస్తున్న దాడి దేశ ఆర్థిక వ్యవస్థపై పెనుఘాతంగా మారింది. 100 ప్రముఖ అమెరికా కంపెనీలు మన దేశంలో సగం ఆర్థిక వ్యవస్థను కబ్జా చేసుకొని ఉన్నాయి. ఫలితంగా పోటీ పడేదానికంటే ముందే దేశీయ కంపెనీలు బేదఖల్ అవుతున్నాయి. మార్కెట్టు పిడికెడు మంది చేతుల్లో మరింతగా కేంద్రీకృతమవుతున్నది.

ఈ దశలో భారత ప్రభుత్వం ఎఫ్‌డిఐ, ఎఫ్ఐఐల కంట్రోళ్లను క్రమక్రమంగా ఎత్తివేస్తూ (డిరెగ్యులేషన్ చేస్తూ) అంతిమంగా 'ఆటోమేటిక్ మార్గం'లోకి దాన్ని మార్చే విధానం అవలంబిస్తూ వచ్చింది. ప్రభుత్వ 'టేక్ ఓవర్ కోడ్'ను నిరంతరం సడలిస్తూ రావడం ఇందులో అత్యంత ముఖ్యమైనది. దీన్ని మొదట 1990లో, ఆ తరువాత 1994లో 'సరళీకరించారు'. అంతిమంగా భగవతి కమిటి సిఫార్సుల ప్రకారం టీఎన్‌సీలకు పూర్తిగా తెరిచి పెట్టారు. అంతేకాకుండా ప్రభుత్వం అనేక ఇతర చట్టాలు చేసింది. ద్రవ్య రాయితీలు కల్పించింది. ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇవన్నీ 1990ల దశకంలోనే టేక్ ఓవర్‌లను సుగమం చేశాయి. అటువంటి ఒక ప్రముఖ చట్టమే నూతన పేటెంట్ చట్టం. ఈ చట్టం ద్వారా ప్రాసెస్ పేటెంట్లను ప్రోడక్ట్ పేటెంట్‌లుగా మార్చుకోవచ్చు. ఇది వ్యవసాయ అమ్మకపు సరుకు మార్కెట్‌ను, చిన్నతరహా రంగాన్ని నాశనం చేయడమే కాకుండా కేవలం ఫార్మాసుటికల్ రంగంలోనే ఇరవై వేల చిన్న యూనిట్లు మూసివేయవలసిన పరిస్థితిని కల్పించింది. స్థానిక రిసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ నామమాత్రంగా ఉండడం వల్ల మధ్యతరహా కంపెనీలు కూడా టీఎన్‌సీల దాడికి బలవుతున్నాయి. భారత దోపిడీ పాలకవర్గాలు ఇదంతా ప్రపంచీకరణ అనివార్యత పేరుతో చేస్తున్నాయి. దీన్ని 'టినా' (దేర్ ఈస్ నో ఆల్టర్నేటివ్ టు కాపిటలిజం) ప్రభావం అంటున్నారు.

**ఇన్ఫో-టెక్ రంగం** దీనికి ఉదాహరణ. దీనిని భవిష్యత్తులో బంగారు బాతుగా, భారతీయ మేధస్సును ఉపయోగించుకుంటున్న 'ది గ్రేట్ నాలెడ్జ్ ఎకానమీ'గా చెబుతున్నారు. ఇన్ఫోటెక్ రంగమూ యావత్తు సాఫ్ట్‌వేర్ ఎగుమతులతో నిండి ఉంది. గతంలో చాలా ఎగుమతులలో సామ్రాజ్యవాద దేశ శ్రమసేవలతో కూడుకొని ఉండేవి. ఇప్పుడు ఔట్‌సోర్సింగ్ ద్వారా భారతదేశంలో చౌక శ్రమను ఉపయోగించుకునే ధోరణి ఉంది. దేశంలో అగ్రస్థానంలో ఉన్న 20 సాఫ్ట్‌వేర్ కంపెనీలు మొత్తం సాఫ్ట్‌వేర్ ఎగుమతులలో దాదాపు సగం వరకు ఎగుమతి చేస్తున్నాయి. అవి ఆర్జించే యావత్తు డబ్బు వాటికి టీఎన్‌సీలు చేసే ఔట్‌సోర్సింగ్ ద్వారా

వస్తుంది. ఈ రంగంలో పెరుగుతున్న పోటీ వల్ల ఉన్నత శ్రేణి టెక్ మరియు డిజిటల్ టీఎన్‌సీలు లేబర్ కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తూ మరింత కారుచౌక రేట్లకు భారతీయ కంపెనీలకు కాంట్రాక్ట్ ఇవ్వగలుగుతున్నాయి. తద్వారా రోజు రోజుకూ కంప్యూటర్ ఆపరేటర్ వేతనం పడిపోతున్నది, ఈ విదేశీ టీఎన్‌సీలు తమ దేశాలలో కంటే కారుచౌక రేట్లకు మన దేశ శ్రామికులను కారుచౌకగా దోపిడీ చేస్తున్నాయి, అత్యంత లాభాలు సంపాదిస్తున్నాయి. ఇన్ఫోటెక్ పరిశ్రమలు ఆ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్న ఎఫ్ఐఐలకు కూడా అనుకూలంగా ఉన్నాయి. విప్రో, సత్యం కంప్యూటర్ సర్వీసెస్ వంటి కంపెనీలలో భారీగా మదుపు పెడుతున్నాయి. హార్డ్‌వేర్ అమ్మకాలు సాగించే కంపెనీలకు విదేశీ ఉత్పత్తిదారులతో భారీ ఒప్పందాలు ఉన్నాయి.

ఈ రంగం 2017-18లో 8.4 శాతం వృద్ధి చెంది 167 బిలియన్ డాలర్ల నుండి 2018-19లో 181 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేసినప్పటికీ ఆర్థిక వ్యవస్థలో అత్యంత అధికంగా సామ్రాజ్యవాదం మీద ఆధారపడి ఉన్న రంగం ఇదే. 2017-18లో ఈ రంగంలో కేవలం 29 శాతమే సాఫ్ట్‌వేర్-హార్డ్‌వేర్ ఉత్పత్తులు జరిగాయి. మిగతా 70 శాతం కేవలం ఐటీ సర్వీసు రంగం ఆక్రమించింది. యావత్తు ఐటి రంగ కంపెనీలూ సాఫ్ట్‌వేర్ రంగంలో బాడీ షాపింగ్ చేయడం, హార్డ్‌వేర్ రంగంలో విదేశీ విడిభాగాలకు (తర్వాత దేశంలో అసెంబ్లింగ్ చేస్తారు) దళారులుగా పని చేయడం తప్ప మరేమీ చేయవు.

భారతీయ కంపెనీలను విదేశీ కంపెనీలు ఏ స్థాయిలో కబ్జా చేసుకున్నాయి, ప్రత్యేకించి చిన్న, మధ్య తరహా కంపెనీలను ఏ విధంగా టేక్ ఓవర్ చేసుకున్నాయనే వాస్తవాలను దళారీ పాలకులు బయటకు రానీయరు, దళారీ కార్పొరేట్ మీడియా కవర్ చేయదు. 1997-98 నుండి 1999-2000 మధ్య మూడేళ్ల కాలంలో మొత్తం 11,600 కోట్ల రూపాయల విలువ గల టేక్ ఓవర్లు జరిగాయి. ఇందులో 80 శాతం టేక్ ఓవర్లు విదేశీ కంపెనీలే చేసాయి. 2000 నాటికి టీఎన్‌సీలు మరింత దూకుడుగా జాయింట్ వెంచర్లలో తమ వాటాను 90 శాతం నుంచి నూరు శాతానికి పెంచుకున్నాయి.

1990ల ప్రారంభంలో షేవింగ్ ఉత్పత్తులలో హర్బన్స్ లాల్ మల్హోత్రా (హెచ్ఎల్ఎం) మార్కెట్ లీడర్‌గా ఉన్నది. ప్రపంచ మార్కెట్ లీడర్ గిలెట్‌కు భారత భాగస్వామ్య కంపెనీ ఇండియన్ షేవింగ్స్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌తో కలిసి మార్కెట్‌లో 10 శాతం మాత్రమే ఉన్నది. సరళీకరణకు ముందు గిలెట్‌కు మెజారిటీ వాటా లభ్యం కాలేదు. ఆ తరువాత దాని వాటా 51 శాతానికి పెంచుకోగలిగింది. దీంతో అది ఆర్‌పిజి గ్రూపుకు చెందిన విల్‌టెక్ ఇండియాను కబ్జా చేసుకోగలిగింది, హెచ్ఎల్ఎంను విలీనం చేసుకునే స్థితికి చేరుకుంది.

క్వాలిటీ కంపెనీకి భారతదేశంలో 50 శాతం ఐస్‌క్రీమ్ మార్కెట్ ఉన్నది. యూనీలీవర్ గ్రూపుకు చెందిన బ్రూక్‌బాండ్ లిప్టన్ ఇండియా (బీబీఎల్ఐ) భారతదేశ ఉత్తర, దక్షిణ, పశ్చిమ

ప్రాంతాలలో క్వాలిటీ మార్కెట్ వ్యవస్థను కబ్జా చేసుకుంది. క్వాలిటీకి తయారీ యూనిట్‌పై యాజమాన్యం ఉన్నప్పటికీ అది బీబీఎల్‌ఐ కోసమే ఉత్పత్తి చేయగలుగుతుంది. బీబీఎల్‌ఐ మరో ఐస్‌క్రీం కంపెనీ మిల్క్ ఫుడ్ (జగ్‌జిత్ గ్రూపు)ని కొనుగోలు చేసింది.

సబ్బులు, డిటర్జెంట్ పరిశ్రమలలో గోద్రెజ్, టాటా ఆయిల్ మిల్స్ కంపెనీ (టోమ్కో), నిర్మా వంటి భారతీయ దళారీ కంపెనీలు హిందుస్తాన్ లీవర్, ప్రోక్టర్ ఎండ్ గాంబల్ (పి అండ్ జి) వంటి బహుళ జాతి సంస్థలతో చాలా కాలం నుండి పోటీపడుతూ ఉండినాయి. అయితే ప్రభుత్వం విలీనాలకు (మెర్జర్‌లకు) అనుమతి ఇవ్వడంతో అవి తప్పనిసరిగా వాటికి లొంగిపోవాల్సి వచ్చింది లేదా వాటితో విలీనం కావలసి వచ్చింది. టాటా గ్రూపు టోమ్కోపై తన యాజమాన్యాన్ని వదులుకుని హిందుస్తాన్ లీవర్‌తో విలీనం కావాలని నిర్ణయించుకున్నది. తన వాటాలలో 51 శాతం యూనీలీవర్‌కు చౌక ధరకు అమ్మడానికి అంగీకరించింది. మరో టీఎన్‌సీ–పి అండ్ జి తమ పోటీదారు గోద్రెజ్ సోప్స్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకుంది. ఇవి 51 శాతం, 49 శాతాల వాటాలతో ఒక నూతన కంపెనీ ఏర్పాటుకు నిర్ణయించుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా పి అండ్ జి కంపెనీ అదుపులో ఉన్న కంపెనీ ఉత్పత్తి చేసే సబ్బులతో పోటీ పడే మరో సబ్బును ప్రవేశపెట్టకుండా ఉండేందుకు గోద్రెజ్ సోప్స్ లిమిటెడ్ అంగీకరించింది.

గృహోపకరణ గూడ్స్ మార్కెట్‌లో ముఖ్యమైన పాత్ర వహిస్తున్న బజాజ్ ఎలక్ట్రికల్స్ అమెరికన్ టీఎన్‌సీ బ్లాక్ అండ్ డెకర్‌తో కలిసి జాయింట్ వెంచర్ స్థాపించి మార్కెట్ నుంచి తన ఉత్పత్తులను వెనక్కు తీసుకుంది. బజాజ్ ఈ నూతన కంపెనీ ఉత్పత్తులను మార్కెట్ చేస్తున్నది. స్వీడిష్ సంస్థ ఎలక్ట్రోలాక్స్ మరో గృహోపకరణాల కంపెనీ మహారాజా ఇంటర్నేషనల్‌లో 51 శాతం వాటా కొనుగోలు చేసింది.

ఈ టేక్ ఓవర్‌లు ఎంత ప్రమాదకరమైనవో ప్రపంచ అతి పెద్ద ఎలక్ట్రికల్ కంపెనీ ఆసియా బ్రౌన్ బ్రోవరీ (ఎబిబి) భారతదేశంలో అవలంబించిన పద్ధతులను చూస్తే స్పష్టమవుతాయి. అది మూతపడిన ఏబీఎల్ కంపెనీని టేక్ ఓవర్ చేసుకుంది. ఆ తర్వాత శక్తివంతమైన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ లైన్ ప్రొడక్షన్ ఫ్యాక్టరీ మరియు అనుబంధ పరిశ్రమ అయిన ఎస్‌ఎఇ ఇండియాను పూర్తిగా టేక్ ఓవర్ చేసుకుంది.

ఫ్రెంచి కంపెనీ విఐఎస్, గోద్రెజ్ కంపెనీతో కలిసి సగం–సగం భాగస్వామ్యంతో ఫోటోగ్రాఫిక్, డుప్లికేటింగ్ సామగ్రిని ఉత్పత్తి చేయడానికి ఒక జాయింట్ వెంచర్‌ను నెలకొల్పింది.

2000లో అతి పెద్ద మార్కెట్ రీసర్చ్ గ్రూపుగా ఉన్న 310 కోట్ల రూపాయల ఓఆర్‌జి–ఎంఎఆర్‌జిని డచ్ కంపెనీ విఎన్‌యు స్వాధీనం చేసుకున్నది. 2002లో మార్కెట్ రిసర్చ్ ఏజెన్సీలలో 66 శాతం వ్యాపారాన్ని కలిగివున్న ఎనిమిదింటిని టీఎన్‌సీలు టేక్ ఓవర్ చేసాయి.

టీఎన్‌సీలకు రెఫ్రిజరేషన్‌లో 62 శాతం మార్కెట్ షేర్ ఉంది. కోల్డ్ డ్రింక్‌లలో దాదాపు పూర్తి షేర్ ఉంది. 1994 చివరి నాటికి వివిధ వినిమయ సరుకులలో టీఎన్‌సీల పెట్టుబడులు ఇలా ఉన్నాయి - ఇన్‌స్టంట్ మిల్క్ ఫుడ్స్‌లో 90 శాతం, మాల్టెడ్ మిల్క్ ఫుడ్స్‌లో 87 శాతం, బ్రెడ్‌లో 42 శాతం (ప్రభుత్వ రంగ కంపెనీ మాడర్న్ బ్రెడ్‌ను హిందుస్తాన్ లీవర్‌కు అమ్మివేయడంతో ఇది మరింత పెరిగింది), బిస్కట్‌లలో 17 శాతం, స్వీట్‌లలో 41 శాతం, సిగరెట్లలో 97 శాతం, చెప్పులు, షూలలో 26 శాతం, ఫార్మసూటికల్స్‌లో 25 శాతం, మెడికల్ డ్రెసింగ్‌లో 97 శాతం, పెయింట్‌లలో 29 శాతం, సబ్బులలో 44 శాతం, డిటర్జెంట్లలో 39 శాతం, కాస్మెటిక్స్‌లో 20 శాతం, డెంటల్ కేర్‌లో 78 శాతం, ఆడియో సామగ్రిలో 47 శాతం, కేసెట్‌లలో 43 శాతం. మార్కెట్‌లో తక్కిన భాగాన్ని చాలా వరకు కొలాబరేషన్ ఉన్న కంపెనీలే హస్తగతం చేసుకున్నాయి. టీఎన్‌సీలకు ఈ కంపెనీలపై కంట్రోల్ ఉంది. 1994 తర్వాత ఈ శాతాలు పెరుగుతున్నాయి.

ఫోటో కాపీయింగ్ మెషిన్‌లలో మోడీ జిరాక్స్ (ఇది ఒక కొలాబరేటెడ్ కంపెనీ)కి మార్కెట్‌లో తన వాటాను 68 శాతానికి పెంచి కంపెనీ మేనేజ్‌మెంటును టేక్ ఓవర్ చేసుకుంది. 2002 జులై నెలలో ఎస్కార్ట్స్ కంపెనీకి చెందిన నాలుగు యూనిట్‌లను టీఎన్‌సీలు స్వాధీనం చేసుకున్నాయి. మొదట అది తన షేర్లను అన్నింటినీ జాయింట్ వెంచర్ చేసుకున్న యమాహాకు అమ్మివేసింది. ఎస్కార్ట్స్ జెసిబి లిమిటెడ్‌లో తన షేర్లను తన పార్ట్‌నర్ జెసి బామ్‌ఫోర్డ్ (బ్రిటన్)కి, ఎస్కార్ట్స్ క్లాస్ లిమిటెడ్‌లో తన షేర్లను కూడా దాని పార్ట్‌నర్ క్లాస్ (జర్మనీ)కి అమ్మివేసింది. ఎస్కార్ట్స్ మహలే లిమిటెడ్‌లో 50 శాతం వాటాను గోయట్జ్ ఇండియా లిమిటెడ్ (దీనిపై అమెరికా ఫెడరల్ మొగుల్ నియంత్రణ ఉన్నది)కు అమ్మివేసింది.

ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ద్విచక్ర వాహనాలు మొదలయిన రంగాలలో కూడా ఇదే పరిస్థితి ఉన్నది. 20-25 శాతం వాటాలు ఉన్నా కూడా టీఎన్‌సీలు కంపెనీలను నిర్దేశిస్తున్నాయి, నియంత్రిస్తున్నాయి.

మీడియా విషయానికి వస్తే, ప్రింట్ మీడియాలో 26 శాతం, నాన్-న్యూస్ రంగంలో 75 శాతం ఎఫ్‌డిఐని అనుమతించక ముందు నుండే మీడియాపై విదేశీ ఆధిపత్యం ఉన్నది. అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలు, అడ్వర్టయిజింగ్ కంపెనీలలో టీఎన్‌సీలదే ఆధిపత్యం. 75 శాతంగా అగ్రస్థానంలో ఉన్న 15 అడ్వర్టయిజర్స్‌లో నాలుగు (డాబర్, టాటా, బజాజ్, వీడియోకాన్) మినహా అన్నీ టీఎన్‌సీలే. మీడియా యావత్తు ఆదాయంలో 55 శాతం అడ్వర్టయిజింగ్ నుంచే వస్తుంది (కొద్ది దశాబ్దాల క్రితం ఇది 30 శాతంగా ఉండేది). 2002 మార్చ్‌లో సినిమాలు, అడ్వర్టయిజింగ్‌లలో ఆటోమేటిక్ అప్రూవల్ రూట్ ద్వారా నూరు శాతం ఎఫ్‌డిఐను అనుమతిస్తూ కేంద్ర మంత్రి మండలి నిర్ణయించింది. డబ్ల్యుపిపి, టిడబ్ల్యుటి, ఓ అండ్ ఎం, బిబిడిఒ, డిడిబి-నీధం, జెడబ్ల్యుటి వంటి ప్రపంచ కాంగ్లొమరేట్‌లు భారతీయ అడ్వర్టయిజింగ్‌లో ప్రధాన నియంత్రణను,

మార్కెట్ వాటాలో అధిక భాగాన్నీ సంపాదించాయి.

మరో వైపు మీడియా సంస్థలు కార్పొరేట్ వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నాయి. ఉదాహరణకు మధ్య భారతంలోని ప్రముఖ దినపత్రిక దైనిక్ భాస్కర్‌కి గనులు, విద్యుదుత్పత్తి, రియల్ ఎస్టేట్ వ్యాపారం, వస్త్ర పరిశ్రమల వంటి రంగాలలో 69 కంపెనీలు ఉన్నాయి. కార్పొరేట్ కంపెనీల స్థాపనలో ప్రజాభిప్రాయాన్ని మలచడం కోసం ఇటువంటి దళారీ కార్పొరేట్ పత్రికలే ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. టివి విషయానికి వస్తే ముర్‌డోక్, ఇతర అటువంటి విదేశీ కంపెనీలూ ఇప్పటికే పెద్ద పాత్ర వహిస్తున్నాయి.

గని తవ్వకాలలో అనేక కొలాబరేషన్‌లు చేసుకోవడం ద్వారా మన దేశంలోని ఒక ప్రధాన ప్రాకృతిక వనరును పూర్తిగా సామ్రాజ్యవాదులకు అందించినట్లయింది. చమురు రంగంలో షెల్, ఎక్సాన్‌లు ప్రవేశించాయి. ఒఎన్‌జిసిని ప్రైవేటురంగానికి అప్పజెప్పారు. రిలయన్స్, ఎస్సార్స్ మొదలయినవే కాకుండా టీఎన్‌సీలు కూడా ఈ రంగంలోకి ప్రవేశించాయి.

25 వరకు ఉన్న విదేశీ కొలాబరేషన్ వెంచర్ కాపిటల్ ఫండ్స్ (వీసీఎఫ్) కూడా 1998 నుంచి అతిగా పెరిగాయి. వాటి ఉమ్మడి పెట్టుబడి పునాది 1998లో ఎనిమిది వేల కోట్ల రూపాయల నుంచి 2000లో ఇరవై వేల కోట్ల రూపాయలకు పెరిగింది. ఈ 25 వీసీఎఫ్‌లు సైతం భారతీయ బడా వ్యాపారాలయిన కెవిపి వెంచర్స్ (క్రెీ పాకర్, కేతన్ పరేఖ్, హెచ్ఎఫ్‌సిఎల్‌కు చెందిన వినయ్ మాలూ) లేదా ఈవెంచర్స్ (న్యూస్ కోర్, మిత్తల్‌లు)లలోకి విదేశీ పెట్టుబడి ప్రవేశం తప్ప మరొకటి కాదు.

2002 నాటికి ప్రభుత్వం బ్యాంకింగ్, బీమా రంగాలలోకి 26 శాతం విదేశీ పెట్టుబడిని ఆహ్వానించడంతో ప్రపంచంలో ఉన్న ప్రధాన బీమా కంపెనీలు భారత బడా దళారీ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

ప్రపంచీకరణ ఫలితంగా గత మూడు దశాబ్దాలలో టెలికాం కంపెనీల్లో పోటీ మూడు కంపెనీలకే పరిమితమైంది. ఒకప్పుడు ప్రతి సర్కిల్‌లో మూడు కంపెనీలు ఉండేవి. ప్రస్తుతం మొత్తం భారతదేశంలో మూడు మొబైల్ కంపెనీలు ఉన్నాయి. పెట్రోలియంకు చెందిన మొత్తం మార్కెట్టు మూడు ప్రభుత్వ పెట్రోల్ కంపెనీల చేతుల్లో ఉంది. 2015లో దేశ మార్కెట్టు ఒక డజనుకు పైగా ఈ-కామర్స్ కంపెనీల చేతిలో ఉండగా అది ప్రస్తుతం రెండు అమెరికా కంపెనీల చేతుల్లో ఉంది. అతి పెద్ద ఈ-రీటైలర్ కంపెనీగా ఉన్న ఫ్లిప్‌కార్ట్ కంపెనీని అమెరికా గ్లోబల్ రీటైల్ తిమింగళం వాల్‌మార్ట్ హస్తగతం చేసుకుంది. ప్రస్తుతం వాల్‌మార్ట్‌కూ ఈ-కామర్స్ మార్కెట్‌లో అతి పెద్ద కంపెనీ అమెజాన్‌కూ మధ్య పోటీ కొనసాగుతున్నది. అమెజాన్ కంపెనీ గతం నుండే భారత్‌లో ఉంది. అంటే దేశీయ ఈ-కామర్స్ కంపెనీలు ధ్వంసం కావడానికి ఎంతో సమయం పట్టదు. లైట్ ఎస్సెట్ మోడల్ రంగంగా వున్న యాప్ ఆధారిత ట్యాక్సీ

సర్వీసురంగం కేవలం రెండు కంపెనీల చేతుల్లో ఉంది. త్వరలో జెట్ ఎయిర్‌వేస్ మూతపడి, విమాన సేవా రంగంలో అధిక భాగంపై మూడు (రెండు ప్రైవేటు కంపెనీలు, ప్రభుత్వ కంపెనీ ఏయిర్ ఇండియా) కంపెనీల గుత్తాధిపత్యం ఏర్పడింది. ఇటీవల ఎయిర్ ఇండియా కంపెనీ 100 శాతం ప్రైవేటు/విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ తన షేర్లను అమ్మకానికి పెట్టింది. స్టీల్, టూవీలర్, ప్లాస్టిక్ ముడి పదార్థం, అల్యూమినియం ట్రక్కులు, బస్సులు, కార్గో, రైల్వే, బొగ్గు, రోడ్డు రవాణా, చమురు ఉత్పత్తి, విద్యుత్తు పంపిణీ, కొన్ని ప్రముఖ రంగాలలో అధిక భాగం ఒకటి నుంచి మూడు కంపెనీల (ప్రవేటు లేదా ప్రభుత్వ) చేతుల్లో కేంద్రీకృతమైంది. కార్లు, కంప్యూటర్లు, ఫార్మాస్యూటికల్స్, మొబైల్ మార్కెట్టులో సైతం అంతర్జాతీయ బడా గుత్తసంస్థల హస్తగతమైంది.

సినిమా రంగాన్ని, మీడియాను, రియల్ ఎస్టేట్ రంగాన్నీ, ఉన్నత విద్య-ప్రొఫెషనల్ విద్యను, అత్యధిక ప్రైవేట్ హెల్త్‌కేర్ (ఆరోగ్య సంరక్షణ) సంస్థలను ఎంఎన్‌సీలతో కుమ్మక్కైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య శక్తులే చాలా వరకూ నియంత్రిస్తున్నాయి. భారతదేశంలో ప్రైవేట్ హెల్త్‌కేర్ రంగంలో అత్యధిక కార్పొరేట్ ఆసుపత్రులను ప్రారంభించి, నడుపుతున్నది దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య శక్తులతో కుమ్మక్కైన ప్రపంచ ప్రైవేట్ ఈక్విటీ ఫర్మ్‌లు వాటిని టేక్ ఓవర్ చేసాయి.

బ్యాంకు అప్పులలో మునిగిన కంపెనీలు ఆస్తులను అమ్ముకుంటున్నాయి. సుమారు 34 ప్రైవేటు విద్యుత్తు కంపెనీలు అప్పుల్లో కూరుకు పోయాయి. అప్పులు వసూలు చేస్తే ఈ కంపెనీలు బంద్ కావడమో, వాటిని అమ్ముకోవాల్సి రావడమో తప్పదు. అంటే విద్యుత్తు మార్కెట్టులో కూడా కొన్ని కంపెనీలు మాత్రమే మిగులుతాయి. 2017లో భారతదేశంలో 3.2 లక్షల కోట్ల డాలర్ల మదుపులతో కంపెనీలను అమ్మడం, కొనడం జరిగింది. ఇది రానున్న సంవత్సరంలో 3.58 లక్షల కోట్ల డాలర్లు దాటిపోతుందని అంచనా. విలీనాలతో-కబ్జాలతో మొబైల్ సేవల్లో, స్టీల్, ఈ-కామర్స్, విమానయానంలో ఉపాధి బాగా తగ్గిపోయింది.

ద్రవ్య రంగంలో విదేశీ పెట్టుబడి ఆధిపత్యం వేగంగా పెరుగుతున్నది. కొన్ని ఉదాహరణలు - రెండు భారతీయ ప్రాథమిక ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు - హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐలు వాస్తవంగా విదేశీ నియంత్రణలో ఉన్నాయి. 2018 నాటికి విదేశీ పెట్టుబడి హెచ్‌డిఎఫ్‌సిలో 72 శాతం ఉండగా, ఐసిఐసిఐలో 49 శాతం ఉన్నది. విదేశీ మ్యుచువల్ ఫండ్స్ కేవలం మూడు సంవత్సరాలలోనే తమ మార్కెట్ వాటాను 2.1 శాతం నుంచి 14.3 శాతానికి పెంచుకున్నాయి. టివిఎస్ ద్రవ్య విభాగమైన సుందరం ఫైనాన్సియల్ లిమిటెడ్‌కు వేర్వేరు ఎఫ్ఐఐలతో తన మ్యుచువల్ ఫండ్ కోసం, జనరల్ ఇన్సురెన్స్, కార్ ఫైనాన్స్ బిజినెస్‌ల కోసం వేర్వేరు కొలాబరేషన్‌లు ఉన్నాయి. ప్రభుత్వం క్రమంగా మ్యుచువల్ ఫండ్స్‌పై తన నియంత్రణను తగ్గిస్తున్నది, తన వాటాను 33 శాతానికి తగ్గించింది.

మ్యూచువల్ ఫండ్స్‌లో వృద్ధి 1990-91 నుండి మరింత ఊపునందుకుంది. ఇవి 1990-91లో 37,480.20 కోట్ల రూపాయల నుంచి 2018 ఆగస్టు నాటికి ఇవి 23.5 లక్షల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్ వ్యాపారంలో 38 కంపెనీలు ఉండగా ఇందులో కేవలం 4 కంపెనీలే 47 శాతం మదుపులను కలిగి ఉన్నాయి.

పోటీ పెరగడం, మాంద్యం ఏర్పడడం, నూతన టెక్నాలజీ ప్రవేశించడం, నూతన అవకాశాల కోసం అన్వేషణ, పెట్టుబడుల కొరత వల్ల మార్కెట్ పునర్వ్యవస్థీకరణ మరింత వేగవంతమైంది. పెద్దెత్తున కంపెనీలస్వాధీనం-విలీనం సాగుతోంది. ఒడాఫోన్-ఐడియా, వాల్‌మార్ట్-ఫ్లిప్‌కార్ట్, అడానీ-రిలయెన్స్ ఎనర్జీ మింత్రా-జబాంగ్, ఎమ్.టి.ఎస్-రిలయెన్స్ కమ్యూనికేషన్స్, రిలయెన్స్-ఎయిర్‌సెల్, కొటక్-బీ.ఎస్.ఎస్. మైక్రో ఫైనాన్స్, ఫ్లిప్‌కార్ట్-ఈ బే, బిర్లా కార్ప్-రిలయెన్స్ సిమెంట్....ఈ జాబితా పొడవైనది.

**విదేశీ ద్రవ్య పెట్టుబడికి సేవకులుగా దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు:**

భారతదేశంలో దళారీ బడా బూర్జువా వర్గం విదేశీ పెట్టుబడితో, టీఎన్‌సీలతో పలు రకాలుగా ప్రత్యక్ష, పరోక్షంగా వున్న కుమ్మక్కు ప్రపంచీకరణ కాలంలో ఎన్నో రెట్లు పెరిగింది. టేక్ ఓవర్ కోడ్ సడలింపు, దిగుమతి సుంకాలలో తగ్గింపు, పన్ను రాయితీలు, విదేశీ పెట్టుబడి మీద ఆంక్షల ఎత్తివేత, స్వేచ్ఛా సౌకర్యాల మంజూరు మొదలయిన పలు విషయాలలో ప్రభుత్వ విధానాలు పూర్తిగా టీఎన్‌సీలకు అనుకూలంగా ఉన్నందువల్ల స్థానిక కంపెనీలు మరింతగా విదేశీ పెట్టుబడి మీద ఆధారపడుతున్నాయి లేదా తమ కంపెనీలను వాటికి అమ్మేస్తున్నాయి. సామ్రాజ్యవాదులతో అంటకాగిన దళారీ సంస్థలు/కంపెనీలు మాత్రమే ఇక్కడ మిగిలాయి.

ఉదాహరణకు భారతదేశంలో ఎటి అండ్ టి మరియు టాటా-బిర్లా టెలికామ్ కంబైన్ ఇందుకు ఒక ఉదాహరణ. 2001 నాటికే యావత్తు టాటా సామ్రాజ్యపు (అంటే 84 కంపెనీల) అమ్మకాలు 35.95 వేల కోట్ల రూపాయలు ఉంటే ఇద్దరు బిర్లా బ్రదర్స్‌ది కలిపి 20.61 వేల కోట్ల రూపాయలు. ఎటి అండ్ టి కంపెనీవి అమ్మకాలు సుమారు 3.02 లక్షల కోట్ల రూపాయలు. ఇది టాటా, బిర్లాల అమ్మకాలకు ఆరు రెట్లు ఎక్కువ. బజాజ్ తన హోమ్ అప్లయన్స్ తయారీ రంగం నుంచి ఉపసంహరించుకొని వ్యాపారానికి పరిమితం కావాల్సి వచ్చింది. దాని వ్యాపారంలో చాలా వరకు అమెరికాకు చెందిన బ్లాక్ అండ్ డెకర్ ఉత్పత్తులే ఉన్నాయి. విదేశీ పెట్టుబడి వాటా, విదేశీ మార్కెట్లపై పరాధీనత, టెక్నికల్ కొలాబరేషన్‌లు, టీఎన్‌సీలకు కేవలం ఔట్‌సోర్సింగ్ యూనిట్‌లుగా ఉండడం మొదలైనవాటి మీద భారత కంపెనీల పరాధీనత ఏ స్థాయిలో ఉందనేది ఆధారపడి ఉంటుంది.

దేశంలో ప్రముఖ దళారీ నిరంకుశ గుత్త పెట్టుబడిదారీ సంస్థలుగా ముఖేష్ అంబానీకి చెందిన ఆర్ఐఎల్, మిత్తల్, బిర్లా, అడానీ, రూయా, జిందాల్, టాటా, వేదాంత, ఇన్ఫోసిస్,

ఎస్సార్, అనిల్ ధీరూభాయి అంబానీ గ్రూపు (ఏడిఏజి), టివిఎస్ అయ్యంగర్, థాపర్, ఆర్‌పిజి, బజాజ్, మహీంద్రాస్ వంటి కంపెనీలతో పాటు ప్రపంచీకరణ కాలంలో పతంజలి ఎఫ్ఎంసీజీ కంపెనీ వంటి పలు కంపెనీలు, దేశీ-విదేశీ పెట్టుబడుల, టెక్నాలజీల వెల్లువ ఫలితంగా జాయింట్ వెంచర్లతో ఏర్పడే తిమింగళం లాంటి భారీ (Unicorn) కంపెనీలు, అసెట్‌లైట్, ఏగ్రిగేటర్ నమూనా స్టార్టప్ కంపెనీలు ఈ కోవలో చేరాయి.

ప్రపంచీకరణ కాలంలో విదేశీ ద్రవ్య పెట్టుబడికి మార్గాన్ని మరింత సుగమం చేయడం ద్వారా దేశంలో అంబానీలు దేశంలో శక్తివంతమైన అతి పెద్ద దళారీ నిరంకుశ పారిశ్రామిక దిగ్గజాలుగా ఆవిర్భవించారు. అందువల్ల వీరికి సామ్రాజ్యవాదుల పూర్తి దన్ను ఉంది. 2012 నాటికి ముకేష్ అంబానీ ఆస్తుల విలువ 2,000 కోట్ల డాలర్లు ఉండగా, ఇది 2019 సెప్టెంబర్ చివరి నాటికి 3 లక్షల 80 వేల 700 కోట్ల రూపాయలకు చేరుకుంది. ముకేష్ అంబానీ దేశంలో అగ్రస్థానం, ప్రపంచ కుబేరులలో 15వ స్థానం సంపాదించుకున్నాడు. 2012 నాటికే రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఆస్తుల విలువ 2.56 లక్షల కోట్ల రూపాయలు. ఆ కంపెనీలో 2019 సెప్టెంబర్ నాటికి ముకేష్ కుటుంబానికి 43 శాతం వాటాలు ఉన్నాయి. దానికి పెట్రో రసాయనాలు, చమురు, సహజ వాయువు, పాలియెస్టర్ ఫైబర్, ప్రత్యేక ఆర్థిక మండలాలు (ఎస్ఈజడ్), ఆహార సరుకుల దుకాణాలు, ఉన్నత పాఠశాలలు, జీవశాస్త్ర పరిశోధనలు, మూలకణ నిలువ, పవర్ ఉత్పత్తి-పంపిణీ, ఫైనాన్స్, వ్యాపారాలలో భాగస్వామ్యం ఉంది. 2006లో రిటైల్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. ఇన్ఫోటెల్‌లో 95 శాతం వాటాని ఆర్ఐఎల్ కొన్నది. ఈ ఇన్ఫోటెల్‌కి సిఎన్ఎన్-ఐబిఎన్, ఐబిఎన్ లైవ్, సిఎన్‌బిసి, ఐబిఎన్, లోక్‌మత్, ఈటీవీకి చెందిన దాదాపు అన్ని ప్రాంతీయ భాషల్లోని వార్తలకు, వినోదాలకు సంబంధించిన 27 చానెళ్లు ఉన్నాయి. 4జి బ్రాడ్ బ్యాండ్‌లో దేశవ్యాప్త లైసెన్సు ఉన్న ఏకైక కంపెనీ ఇన్ఫోటెల్. 2016లో అది తీసుకొచ్చిన జియో ప్రాడక్ట్ టెలిరంగంలో పెద్ద మార్పు తీసుకొచ్చింది. ఆర్ఐఎల్‌కు ఒక క్రికెట్ జట్టు కూడా ఉంది. పెట్రోరసాయనాలు, చమురు, సహజవాయువు రంగాలలో ఆర్ఐఎల్‌కు అనేక భారీ సామ్రాజ్యవాద కంపెనీలతో ఎన్నో ఒప్పందాలు ఉన్నాయి. ఆ ఒప్పందాల ప్రకారం దిగుమతి చేసుకున్న ముడి చమురు, ఇతర సామగ్రిపై అది ఆధారపడి ఉంది. ఉదాహరణకు, ప్రపంచంలోనే అతిపెద్దదైన గుజరాత్‌లోని పాతాళగంగ శుద్ధి కర్మాగారానికి టెక్నాలజీ, లైసెన్స్‌లు అమెరికాకు చెందిన యూఓపి నుంచి, రికవరీ సౌకర్యానికి సాంకేతికత బ్లాక్ ఎండ్ వీచ్ సల్ఫర్ నుంచి హైడ్రోజన్ మాన్యుఫాక్చరింగ్ సౌకర్యం లిండే నుంచి లభిస్తుంది. జాన్ బ్రౌన్, యూనిపోల్ పోలిప్రొపలీన్ సౌకర్యాన్ని, ఫోస్టర్ వీలర్ కుకర్ సౌకర్యాన్ని అందిస్తాయి.

టాటాలు భారతదేశంలో అతి పెద్ద పారిశ్రామిక దళారీ బడా బూర్జువా సంస్థగా ఉన్నారు. వీరి టర్నోవర్ 2001 నాటికి 37,197 కోట్ల రూపాయలతో రెండవ స్థానంలో ఉండేది. ఆనాడు టాటాలకు 84 కంపెనీలు ఉండగా అందులో 34 కంపెనీలు టీఎన్‌సీలతో ఏర్పరుచుకున్న

జాయింట్ వెంచర్లుగా ఉన్నాయి. దేశంలో అతిపురాతన, అతిపెద్ద ప్రైవేటురంగ విద్యుత్ కంపెనీ వీళ్లదే. వీళ్లకు గనులు, చమురు క్షేత్రాలు, ఉక్కు కర్మాగారాలు, కార్ల, ట్రక్కుల తయారీ కంపెనీలు, టెలిఫోను, కేబుల్ టీవీ, బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌లు ఉన్నాయి. తాజ్ హొటళ్లు, జాగ్వార్, ల్యాండ్ రోవర్, దేవూ, టెట్లీ టీ, ఒక ప్రచురణ సంస్థ, గొలుసు పుస్తక దుకాణాలు, ఐయోడైజ్డ్ ఉప్పులో అతిపెద్ద బ్రాండు, సౌందర్య సాధనాల లాక్మే సామ్రాజ్యం, పూణేలో టాటా–హనీవెల్ ఫ్యాక్టరీ టాటాల సొంతం. కొన్ని పట్టణాలే వీరి అధీనంలో ఉన్నాయి. వీరు ప్రపంచీకరణ పూర్వకాలంలో 1990లలో అనేక కొలాబరేషన్‌లు చేసుకున్నారు. ప్రపంచీకరణ దశలో 1993లో టైటాన్ వాచెస్ అమెరికా టైటాన్ టైమ్ ప్రొడక్ట్స్‌తో, 1994లో టాటా ఇంజినీరింగ్ అమెరికా కేంద్రంగా ఉన్న కుమ్మిన్ ఇంజన్ కంపెనీతో, 1995లో బీమా రంగంలో టాటా గ్రూపు అమెరికన్ ఇంటర్నేషనల్ గ్రూపు యూఎస్‌ఎతో, టాటా ఎలక్ట్రిక్ అమెరికా లీబర్ట్ కార్పొరేషన్‌తో, 1996లో క్లీనింగ్ సిస్టమ్స్‌పై యూరేకా ఫోర్బ్స్, నిల్‌ఫిస్క్‌లతో, ఏపీలో టెలికామ్ సర్వీసెస్ కోసం టాటా ఇండస్ట్రీస్, బెల్ కెనడా ఇంటర్నేషనల్‌తో, టాటా స్టీల్ అమెరికా సంస్థ ఇన్‌లాండ్ ఇంటర్నేషనల్‌తో, 2000లో టెలికామ్ రంగంలో టాటా, బిర్లా, ఎటి అండ్ టిలు సెల్యులర్ ప్రాపర్టీస్‌తో జాయింట్ వెంచర్లు/ఒప్పందాలు చేసుకున్నారు. అంతేకాక, స్థానిక బ్రాండ్‌గా చెప్పుకునే ఇండికా కారుతో పాటు ఇప్పుడు మరో కొత్త కారు మాగ్నా వచ్చింది. ఇది టెల్కో, ప్యుగోట్ సిట్రాన్‌ల మధ్య జాయింట్ వెంచర్ ఉత్పత్తి. 2009 జూన్‌లో జపాన్ మొబైల్ కంపెనీ 13,000 కోట్ల రూపాయల విలువ గల 26 శాతం షేర్లను టాటా టెలి సర్వీసెస్ కంపెనీ నుంచి కొనుగోలు చేసింది. ఇలా అనేకం ఉన్నాయి. 2019లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టాటా మోటార్స్, టాటా స్టీల్ కంపెనీలు ప్రపంచంలో ఫోర్బ్స్ "అత్యంత గౌరవప్రద టాప్–250 కంపెనీలలో" స్థానం సంపాదించుకున్నాయి. 2018 నాటికి వీటి పెట్టుబడులు బహుళజాతి కంపెనీలతో చేసుకున్న పలు ఒప్పందాలలో భాగంగా యూరప్, మధ్య ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలకు కూడా విస్తరించాయి. ఉదాహరణకు, టాటాలకు 80 దేశాలలో వందకి పైగా కంపెనీలు ఉన్నాయి. దీనిని బట్టి టాటాలు పూర్తిగా టీఎన్‌సీలతో, ప్రత్యేకించి అమెరికాకు చెందిన టీఎన్‌సీలతో సంక్లిష్టంగా ముడిపడి ఉన్నారన్న విషయం అర్థం అవుతుంది.

బిర్లా కుటుంబం మూడు గ్రూపులుగా విడిపోయి ఉన్నది. 2002లో ఎవి బిర్లా, బికె బిర్లాల ఉమ్మడి అమ్మకాలు 21,517 కోట్ల రూపాయలతో దేశంలో మూడో స్థానంలో ఉండేవి. ఆదిత్య బిర్లా గ్రూపు థాయ్‌ల్యాండ్‌లో 50 సంవత్సరాల ముందే స్పిన్నింగ్ మిల్లు స్థాపించింది. గార్మెంట్లు, కార్బన్ బ్లాక్, రసాయనాలు వంటి రంగాలలో ఈ గ్రూపు పనిచేస్తోంది. ప్రస్తుతం అది ఆగ్నేయాసియా దేశాల్లో వివిధ రంగాలలో పనిచేసే అతిపెద్ద కంపెనీలలో ఒకటి.

ఈ మూడింటిలో పెద్దది ఎవి బిర్లా గ్రూపు. దీని అధిపతి కుమారమంగళం బిర్లా విదేశీ పెట్టుబడితో అనేక ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. 1996లో ఈ గ్రూపు రెండు బొగ్గు విద్యుత్తు

ప్లాంట్‌ల నిర్మాణానికి బ్రిటన్‌లోని పవర్ జెన్‌తో, టెలికామ్ రంగంలో టాటాతో కలిసి ఎటి అండ్ టితో, బ్యాంకింగ్ రంగంలో కాపిటల్ గ్రూపుతో జాయింట్ వెంచర్‌లు ఏర్పరుచుకుంది. 2002లో గ్లోబల్ డిపాజిట్ రిసీట్స్ (జిడిఆర్) మార్గంలో షేర్లను ఆహ్వానించి భారీ మొత్తాలలో విదేశీ పెట్టుబడిని తీసుకువచ్చింది. ఈ విధంగా 2002 నాటికే 2,080 కోట్ల రూపాయల వరకు ఆస్తులు జమ చేసుకుంది. 2016 సెప్టెంబర్ నాటికి కుమార్‌మంగళం బిర్లా ఆస్తులు 38.43 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి.

బికె బిర్లా గ్రూపు తమ అత్యంత ముఖ్యమైన కంపెనీ జువారీ ఆగ్రో కెమికల్స్‌ను అమెరికాకు చెందిన యూఎస్ఎక్స్ కార్పొరేషన్‌తో, ప్రాజెక్ట్ కన్సల్టెన్సీలో జువారీ కంపెనీ బ్రిటన్‌లోని సైమన్ కార్వ్స్ కంపెనీతో, సేవా రంగంలో సగం-సగం వాటాలతో జాయింట్ వెంచర్‌లు ఏర్పాటు చేసింది.

సికె బిర్లా గ్రూపు తమ అత్యంత ముఖ్యమైన కంపెనీ హిందుస్తాన్ మోటర్స్ ఓపెల్ ఆస్ట్రాను (విడిభాగాలను అసెంబుల్ చేసి తయారు చేసే ఉత్పత్తులు) ఉత్పత్తి చేయడానికి మిట్‌సుబిషి మోటర్స్ కార్పొరేషన్‌తో, జనరల్ మోటార్స్‌తో, ఈ గ్రూపునకు చెందిన ఓరియంట్ పేపర్స్ అండ్ ఇండస్ట్రీస్ వైట్ గూడ్స్ తయారీకి ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇన్‌కార్పొరేటెడ్‌తో జాయింట్ వెంచర్‌లు ఏర్పాటు చేసుకుంది.

బిర్లాల నియంత్రణలో ఉన్న భారీ ఇంజినీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఎల్ అండ్ టి భారీ కంపెనీ టీఎన్‌సీలతో 2001, 2002లలో జాయింట్ వెంచర్‌లు ఏర్పాటు చేసుకుంది. ఇంజనీరింగ్‌లో అమెరికాకు చెందిన సార్‌జెంట్ అండ్ లుండీతో, జపాన్‌కు చెందిన చియోదాతో, కన్‌స్ట్రక్షన్ సామగ్రిలో అమెరికాకు చెందిన కేస్‌కార్ప్‌తో, జపాన్‌కు చెందిన కోమాట్‌సుతో, పోర్ట్ అండ్ హైవే అభివృద్ధిలో డెన్మార్క్‌కు చెందిన రాంబొలితో, టెలికామ్‌లో దక్షిణ కొరియాకు చెందిన సామ్‌సంగ్‌తో, ట్రాక్టర్‌లలో అమెరికాకు చెందిన డీరేతో జాయింట్ వెంచర్లు చేసుకుంది.

వీటితో పోల్చుకుంటే ఇతర దళారీ సంస్థలు చాలా చిన్నవి. టివిఎస్ అయ్యంగార్ కంపెనీ 2001లో 7,768 కోట్ల రూపాయల టర్నోవర్‌తో నాలుగో స్థానంలో ఉన్నది. ఆ తరువాత థాపర్ గ్రూపు 6,560 కోట్లు, ఆర్‌పిజి గ్రూపు 6,667 కోట్లు, బజాజ్ గ్రూపు 6,155 కోట్లు, ఆ తరువాత మహీంద్రాలు 6,045 కోట్లు, స్టర్‌లైట్ 4,526 కోట్లతో ఉండగా, జిందల్ గ్రూపు 4,484 కోట్లతో పదో స్థానంలో ఉన్నది.

అలాగే బజాజ్ మోటర్‌సైకిల్‌కు జపాన్‌కు చెందిన కవాసాకితో, బజాజ్ ఎలక్ట్రికల్స్ యూనిట్‌కు అమెరికా బడా కంపెనీ బ్లాక్ అండ్ డెకర్‌తో, బజాజ్‌కు స్టీల్ కంపెనీ ముకుంద్‌తో కలిసి జపాన్ సంస్థలు కవాసాకి, మిట్‌సుయిలతో జాయింట్ వెంచర్లు స్థాపించింది. 2016 సెప్టెంబర్ నాటికి దీని అధినేత రాహుల్ బజాజ్ ఆస్తులు 15.12 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి.

మహీంద్రా గ్రూపు 2002లో ఫోర్డ్, సింగపూర్ నెట్‌వర్క్ సర్వీస్, మెక్‌కాన్ ఎరిక్‌సన్, ఎవిఎల్ (ఆస్ట్రియా), బ్రిటిష్ టెలికామ్, అమెరికా ట్రాక్టర్ కంపెనీ కేస్, సీ లాండ్ సర్వీసెస్ ఇన్‌కార్పొరేటెడ్, అమెరికాలోని ఓవెన్స్-కార్నింగ్స్, కెనడాలోని ప్రధాన పవర్ కంపెనీ ఏకర్స్ ఇంటర్నేషనల్‌తో జాయింట్ వెంచర్లు ఏర్పరచుకుంది. మినీవ్యాన్లు తయారీకై మిట్‌సుబిషి మోటర్ కార్పొరేషన్, సామ్‌కోర్ మాన్యుఫాక్చరింగ్‌లతో కూడా ఒప్పందం చేసుకుంది. ఎం ఎండ్ ఎం 2.94 వేల కోట్ల రూపాయల భారీ పెట్టుబడితో సగం-సగం వాటాలతో ఫోర్డ్‌తో వున్న జాయింట్ వెంచర్‌లో తన షేర్లలో చాలా వరకు 2002లో ఫోర్డ్‌కు అమ్మివేసింది. ఆనంద్ మహీంద్రా ఆస్తులు 2016 సెప్టెంబర్ నాటికి 6.93 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి.

గోద్రెజ్ గ్రూపుకు నూతన ఒప్పందాలు జనరల్ ఎలక్ట్రిక్, జిఆర్ఎన్‌డి మెట్‌కి చెందిన పిల్స్‌బరీ డివిజన్, సారా లీ, ఫోటో మీలతో ఉన్నాయి. 2016 సెప్టెంబర్ నాటికి స్మితా గోద్రెజ్, ఆది గోద్రెజ్, జమ్‌షిడ్ గోద్రెజ్, నాదిర్ గోద్రెజ్‌ల ఒక్కొక్కరి ఆస్తులు 13.86 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి.

థాపర్ గ్రూపులోని క్రాంప్టన్ గ్రీవ్స్ కంపెనీ డెన్మార్క్ కంపెనీ మేర్స్క్ డేటాతో సాఫ్ట్‌వేర్ అభివృద్ధి కోసం జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసుకుంది. అది యూపిఎస్ సిస్టమ్స్ తయారీకి ఎక్సైడ్ ఎలక్ట్రానిక్స్ గ్రూపుతో ఒప్పందం కుదుర్చుకుంది.

జిందల్ గ్రూపుకు చెందిన విజయనగర్ స్టీల్ ప్లాంట్ కాప్టివ్ పవర్ ప్లాంట్, బెల్జియన్ సంస్థ ట్రాక్టాబెల్‌లతో కలిసి జిందల్ ట్రాక్టాబెల్ పవర్ అనే కంపెనీ ఏర్పాటు చేసుకుంది. అలాగే కోరెక్స్ మోడ్యుల్‌కు చెందిన ఆక్సిజన్ ప్లాంట్‌ను జిందాల్ ప్రాక్స్‌పైర్ ఏర్పరచింది. ఇది జిస్కో, అమెరికాకు చెందిన ప్రాక్స్‌పైర్‌ల జాయింట్ వెంచర్. 2016 సెప్టెంబర్ నాటికి సావిత్రి జిందల్ ఆస్తులు 22.05 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి.

మఫత్‌లాల్ వస్త్ర కంపెనీకి షీస్సర్ ఎజితో ఒక సాంకేతిక కొలాబరేషన్ ఉన్నది. దానికి ఇటలీలోని సిల్వియా అప్పారెల్‌తో ఒక జాయింట్ వెంచర్, ఫ్రాన్స్‌లోని ఎమినెన్స్‌తో ఒక సాంకేతిక ఒప్పందం, అమెరికాలోని బర్లింగ్టన్‌తో నీలిరంగు జీన్స్ వస్త్రం (డెనిమ్) తయారీకి సగం-సగం వాటాలతో జాయింట్ వెంచర్ ఉన్నాయి. మఫత్‌లాల్‌కు గుజరాత్ గ్యాస్ వెంచర్‌లో బ్రిటన్‌లోని హాన్సమ్ గ్రూపుకు చెందిన యూబిఐ మీటర్‌లో మైనర్ వాటా ఉన్నది.

దేశంలోని సారా వ్యాపారంలో ఆధిపత్యం ఉన్న విజయ్ మాల్యా (సారా మాఫియాగా పేరు పొందాడు)కు చెందిన యూబి గ్రూపు పూర్తిగా విదేశీ ఉత్పత్తిదారులతో కలిసి వారి బ్రాండ్లను మార్కెటింగ్ చేస్తున్నది. 2002లో తన బీరు తయారీ కంపెనీ యునైటెడ్ బ్రుయరీస్ స్కాటిష్ కంపెనీతో, న్యూకాసిల్‌తో వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఫోస్టర్ అండ్ కాసిల్ లాగర్‌లతో కలిసి ఏర్పరచుకున్న జాయింట్ వెంచర్‌తో క్రోనెన్‌బోర్గ్ బ్రాండు ఉన్నత

శ్రేణి బీరు దిగుమతిని ప్రారంభించింది.

అలాగే 2016 సెప్టెంబర్ చివరి నాటికి దళారీ నిరంకుశ పెట్టుబడిదారులైన దిలీప్ శింఘ్వి, అజిమ్ ప్రేమ్‌జీ, శివ్ నాడార్‌ల ఆస్తులు వరుసగా 1.05 లక్షల కోట్లు, 94.50 వేల కోట్లు, 69.93 వేల కోట్ల రూపాయలకు, శశి రుయియా, రవి రుయియాల ఉమ్మడి ఆస్తులు 31.50 వేల కోట్ల రూపాయలకు, గౌతమ్ అడానీ ఆస్తులు 22.05 వేల కోట్ల రూపాయలకు, హర్ష్ గోయెంకా ఆస్తులు 8.19 వేల కోట్ల రూపాయలకు, బాలక్రిష్టన్ గోయెంకా ఆస్తులు 8.82 వేల కోట్ల రూపాయలకు, రాధేశ్యామ్ గోయెంకా ఆస్తులు 8.19 వేల కోట్ల రూపాయలకు, సంజీవ్ గోయెంకా ఆస్తులు 6.93 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. అనిల్ అంబానీ ఆస్తులు 15.75 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి.

2019 సెప్టెంబర్ చివరి నాటికి విప్రో వ్యవస్థాపకుడు అజిమ్ ప్రేమ్‌జీ 1,17,100 కోట్లు, గౌతమ్ అడానీ ఆస్తులు 94,500 కోట్లు, ఉదయ్ కొటక్ 94,100 కోట్లు, సైరస్ ఎస్ పూనవాలా 88,800 కోట్లు, సైరస్ పల్లోంజి మిస్త్రీ 76,800 కోట్లు, షాపూర్జి పల్లోంజి 7,56,800 కోట్లు, దిలీప్ సింఘ్వి 71,500 కోట్ల రూపాయలకు వారి ఆస్తులు చేరుకున్నాయి. ఇన్ఫోసిస్ కంపెనీ ప్రపంచంలో ఫోర్బ్స్ “అత్యంత గౌరవప్రద టాప్–250 కంపెనీలలో” మూడవ స్థానంలో నిలిచింది. అనిల్ అంబానీ ఆస్తులు 1,000 కోట్ల రూ.లకు పడిపోయాయి.

**ఎన్‌ఆర్‌ఐలు:** విదేశాలలో ద్వంద్వ పౌరసత్వాలతో చాలా శక్తివంతమైన ప్రవాస భారతీయ (ఎన్ఆర్ఐ) గ్రూపులు ఉన్నాయి. ముఖ్యంగా మిత్తల్‌లు, హిందుజాలకు భారీ కాంగ్లొమరేట్‌లు ఉన్నాయి. 1990ల నుంచి ఇవి భారతీయ పరిశ్రమలో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. ఇవి సామ్రాజ్యవాద అనుకూలమైనవి. మిత్తల్‌లు ఇండోనేసియాలోని సుహార్తో కంపెనీకి దళారీ పని చేసి డబ్బు సంపాదిస్తే, హిందుజాలు చాలా వరకు ఆయుధాల డీలర్‌లుగా డబ్బులు చేసుకున్నారు. వాళ్లు ముఖ్యంగా మాఫియాలుగా ఉన్నారు. వీరే కాక స్వరాజ్ పాల్ వంటి ఇతర పెద్ద ఎన్ఆర్ఐలు కూడా ఉన్నారు.

మిత్తల్‌ల ముగ్గురు సోదరులలో ఆర్సిలార్ మిత్తల్ ఛైర్మన్ లక్ష్మి మిత్తల్‌కు ప్రపంచవ్యాప్తంగా భారీ స్టీల్ సామ్రాజ్యం ఉన్నది. నెదర్‌లాండ్స్‌లో స్టీల్ ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ కూడా ఉన్నది. 2002లో ఫోర్బ్స్ జాబితా ప్రకారం అతను ప్రపంచంలో అత్యంత సంపన్న భారతీయుడు (8,800 కోట్ల రూపాయలు). అతని అమ్మకాలు ఇరవై వేల కోట్ల రూపాయలు. 2016 సెప్టెంబర్ నాటికి అతని ఆస్తులు 52.92 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. 2019 సెప్టెంబర్ నాటికి 1,07,300 కోట్ల రూపాయలకు పెరిగాయి.

భారతదేశంలో ఉన్న అతని ఇద్దరు సోదరులు సునిల్ మిత్తల్, లక్ష్మణ్‌దాస్ మిత్తల్‌లు జపాన్‌లోని ప్రముఖ కంపెనీ నిప్పోన్ డెన్రో ఇస్పాత్‌తో కలిసి స్టీల్ నుంచి టెలికామ్, షిప్పింగ్,

వస్త్రాలు, విద్యుత్తు వరకు అనేక రంగాలలో పెట్టుబడులు పెట్టారు. హిమాచల్‌ప్రదేశ్‌లో వారి వస్త్ర పరిశ్రమ జపాన్ టోయాడా గ్రూపుతో ముడిపడి ఉన్నది. మహారాష్ట్ర చంద్రపూర్‌లో భారీ విద్యుత్తు ప్లాంట్‌కు బ్రిటన్ ఆల్‌స్టోమ్‌తో, ఫ్రాన్స్ ఎలక్ట్రిసైట్ డి ఫ్రాన్స్‌తో ఒప్పందాలు ఉన్నాయి. 2016 సెప్టెంబర్ నాటికి సునిల్ మిత్తల్ ఆస్తులు 35.91 వేల కోట్ల రూపాయలకు, లక్షణ్‌దాస్ మిత్తల్ ఆస్తులు 10.71 వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి.

దేశంలో మిత్తల్‌కు భారీ టెలికామ్ నెట్‌వర్క్ ఉండి ఆ రంగంలో ప్రధాన పాత్ర వహిస్తున్నది. భారతీ టెలి వెంచర్స్, ఇతర భారతీ కంపెనీలూ ఎయిర్‌టెల్ పేరుతో దేశవ్యాప్తంగా కోరలు చాచి ఉన్నాయి. 2002లో భారతి కంపెనీకి 49 శాతం ఎఫ్‌డిఐ ఒక బిలియన్ డాలర్‌ల ఫారిన్ ఈక్విటీలు ఉండేవి. ఆనాటికి దేశ టెలికామ్ రంగంలో ఇదే అతి పెద్ద విదేశీ పెట్టుబడి. ఈక్విటీ ఫండ్స్‌లో వార్‌బర్గ్ పింకస్, సింగపూర్ టెలికామ్ పెట్టాయి. అంతేకాక భారతికి బ్రిటిష్ టెలికామ్ (బిటి)తో, టెలికామ్ ఇటాలియా (టిఐ)తో, సీమెన్స్ టెలికామ్‌తో జాయింట్ వెంచర్‌లు ఉన్నాయి. అంటే భారతి అనే పేరు తప్ప దానిని భారతీయ కంపెనీ అనడం కష్టం. దాని యజమాని సగం విదేశీయం, డబ్బు విదేశీయం, ఇక లాభాలు కూడా విదేశాలకే పోతాయనడంతో సందేహం అక్కరలేదు.

హిందుజాలకు దేశవ్యాప్తంగా 3,225 కోట్ల రూపాయలతో 20 కంపెనీలు ఉన్నాయి. అంతర్జాతీయంగా కార్పొరేట్ సంబంధాల విశాల వ్యవస్థతో ఈ గ్రూపు 2001 నాటికి టర్నోవర్ సుమారు ఇరవై వేల కోట్ల రూపాయలకు చేరుకుంది. ఇటలీ ఫియట్‌తో అది ఏర్పరచుకున్న జాయింట్ వెంచరే అశోక్ లీలాండ్. టెలికామ్‌లో షినావాత్రా కార్పొరేషన్‌తో ఒప్పందం చేసుకుంది. అంతేకాక టీఎన్‌సీలకు ఏజెంట్లుగా హిందూజాలు అపారంగా లాభాలు చేసుకుంటున్నారు. 2019 సెప్టెంబర్ చివరి నాటికి ఎస్‌పీ హిందూజా కుటుంబం ఆస్తులు 1,86,500 కోట్ల రూపాయలకు పెరిగింది.

**స్వచ్ఛంద సంస్థలు/ఎన్‌జీఓలు:** నయా ఉదారవాద సంస్కరణల కాలంలో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది స్వచ్ఛంద సంస్థలు ఆవిర్భవించాయి. 2020 చివరి నాటికి దేశంలో 31 లక్షలకు పైగా ఎన్‌జీఓలు పని చేస్తున్నాయి. ఇందులో అత్యధిక సంస్థలు కార్పొరేట్-ప్రాయోజిత సంస్థలే. వీటి లక్ష్యం ప్రపంచీకరణను ప్రోత్సహించడమే. ఇవి చేసే సంస్కరణలు ప్రజాభిప్రాయాన్ని మలచడంలో కీలకపాత్రను పోషిస్తున్నాయి. ఈ సంస్కరణలు బిల్ గేట్స్ ఫౌండేషన్, లిల్లీ ఎండోమెంట్, ఫోర్డ్ ఫౌండేషన్ వంటి వాటికీ, కార్పొరేషన్లకూ మధ్య సంబంధాన్ని మసకబారుస్తూ అవి ప్రజా శ్రేయస్సు కోసం పనిచేసేవనే ప్రజాభిప్రాయాన్ని ఏర్పరుస్తున్నాయి.

ప్రభుత్వ బడ్జెట్లలో కోతతో సంక్షేమ రంగాలలోకి స్వచ్ఛంద సంస్థలు ప్రవేశించాయి. ఉద్యోగాలు, జీవనోపాధి కనుమరుగైపోతుండడంతో స్వచ్ఛంద సంస్థలే ఉపాధికి ముఖ్యమైన

మార్గాలుగా మారాయి. కంపెనీలో షేర్లు కొనేసి లోపలి నుంచి ఆ కంపెనీని నియంత్రించిన విధంగానే ప్రతిఘటన ఉద్యమాల్లోకి చొరబడటానికి ఎంఎన్‌సీ/టీఎన్‌సీలు స్వచ్ఛంద సంస్థలను వినియోగించుకుంటున్నాయి. వాటికి అవి ప్రత్యక్షంగానూ లేదా వివిధ ఫౌండేషన్ల నుంచి నిధులు అందిస్తున్నాయి. ఒక ప్రాంతంలో ప్రతిఘటనా పోరాటాలు ఎంత ఎక్కువగా ఉంటే అక్కడ అంత ఎక్కువగా స్వచ్ఛంద సంస్థలు ఉంటున్నాయి.

ప్రజల్లోకి వెళ్లి విప్లవకారులుగా మారే ప్రమాదమున్నవారిని ఇవి కోట్ల రూపాయలు వెదజల్లి వేతనంపై పనిచేసే కార్యకర్తలుగా మారుస్తున్నాయి. కళాకారులకు, మేధావులకు, సినిమాలు తీసేవాళ్లకు 'నిధులు' సమకూరుస్తూ ప్రభుత్వంతో తీవ్రంగా తలపడకుండా బహుళ–సంస్కృతి, జెండర్, ప్రజల అభివృద్ధి వంటి అస్తిత్వ రాజకీయాలు, మానవ హక్కుల భాషతో కూడిన చర్చల వైపు వారిని మళ్లిస్తున్నాయి. పౌరహక్కుల ఉద్యమం, మహిళా ఉద్యమం మొదలైన సెక్షనల్ ఉద్యమాలలో చీలిక తేవడంలో, ఆ ఉద్యమాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక వర్గ దృక్పథం అవసరం లేదనే తప్పుడు వాదాన్ని ముందుకు తేవడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు రంగు, రూపం, స్వభావంలేని తమదైన ఒక పోస్ట్‌మాడర్న్ ప్రపంచాన్ని సృష్టించాయి. ఇందులోని ప్రతి అంశమూ భిన్నమైన, ప్రత్యేక ఆసక్తి గల, వృత్తిపర విషయమయింది. ఇది ప్రజల అభివృద్ధి, నాయకత్వ అభివృద్ధి, మానవహక్కులు, ఆరోగ్యం, విద్య, పునరుత్పత్తి హక్కులు, ఎయిడ్స్, ఎయిడ్స్ బాధిత అనాథలు – ఇలా ప్రతీ అంశమూ మరొకదానితో సంబంధం లేకుండా దేనికది అస్తిత్వాన్ని కలిగినదిగా చిత్రించింది. స్వచ్ఛంద సంస్థలు ఈ సమస్యలన్నింటికీ సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి వ్యవస్థ పరిధిలోనే వేరువేరు పరిష్కారాలను ముందుకు తెచ్చాయి. అణచివేత ద్వారా విచ్ఛిన్నం చేయలేకపోయిన వివిధ ప్రతిఘటనా ఉద్యమాలను ఈ విధంగా 'నిధులు' సమకూర్చి కొనేయడం ద్వారా తేలికగా సాధిస్తున్నారు.

**జాతీయ బూర్జువా వర్గం:**

ఈ వర్గం చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో పాటు హోల్‌సేల్ వ్యాపారం, సరుకు రవాణా, ప్రజా రవాణా, విద్య, వైద్య రంగాలు, హోటళ్లు, తునికాకు వ్యాపారం వగైరా వ్యాపార, సేవా రంగాల్లో పెట్టుబడులను కలిగి ఉంది. అది సామ్రాజ్యవాదం, దళారీ బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ విధానాలతో పీడించబడుతూ భూస్వామ్యం చేత కట్టివేయబడి ఉంది. ఈ కారణంగా తమ మార్కెట్ నిరంతరం వీరి దాడికి గురవుతోంది. తమ పరిశ్రమల్లో వృద్ధి పరిమితమవుతోంది. లక్షలాది పరిశ్రమలు దివాలాతీస్తున్నాయి. ఈ విధంగా ఈ వర్గం ఈ మూడు మహా పర్వతాలతో వైరుధ్యాన్ని కలిగి ఉంది.

**పారిశ్రామిక రంగం:**

దళారీ పాలకులు డబ్ల్యుటీఓ ఒప్పందాలకు అనుగుణంగా సంఘటిత రంగాన్ని సమూలంగా తుదముట్టించేందుకు పారిశ్రామిక రంగంలో పెద్దెత్తున డీ-ఇండస్ట్రియలైజేషన్, డీరెగులేషన్ విధానాలను ముందుకు తెచ్చారు. ఫలితంగా దేశంలోకి పెద్దెత్తున వస్తున్న విదేశీ పెట్టుబడులు తమ పూర్తి యాజమాన్యం కింద వున్న అనుబంధ సంస్థలలో, జాయింట్‌వెంచర్‌లలో ఔట్‌సోర్సింగ్ చేయడం, ఆధునిక టెక్నాలజీని, యంత్రాలను ఉపయోగంలోకి తీసుకురావడంతో పారిశ్రామిక రంగం మరింతగా క్షీణించింది, ఉపాధి దెబ్బతింది. పబ్లిక్ రంగ సంస్థల, బ్యాంకుల నష్టాలు పెరిగిపోయాయి. దళారీ పాలకులు సంఘటిత రంగంలోని రైల్వే, ఎయిర్ ఇండియా, ఎంటీఎన్ఎల్, బీఎస్ఎన్ఎల్, బీబీసీఎల్ వంటి ప్రధాన సంస్థలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరిస్తున్నారు, మూసివేస్తున్నారు. బ్యాంకుల్ని విలీనం పేరుతో ప్రైవేటీకరణ వైపు నెట్టేసారు. ఫలితంగా సంఘటిత రంగం క్షీణించిపోతోంది. కార్మికుల క్యాజువలీకరణ, కాంట్రాక్టీకరణ పెద్దెత్తున పెరిగిపోయాయి.

దేశ ఆర్థిక వ్యవస్థలో 90 శాతం పైగా అసంఘటిత రంగంగా మారిపోయింది. అసంఘటిత రంగం నాలుగు రకాలుగా ఉంది: 1. నిర్వహించే పనిపై ఆధారపడిన రంగం. 2. పని స్వభావాన్ని బట్టి వర్గీకరించే రంగం. 3. ప్రత్యేకంగా వెనుకబడిన, దళిత కులాలకు చెందినవారు చేసేపనులతో కూడిన రంగం. 4. చేసే సేవలపై ఆధారపడి వర్గీకరించే రంగం. ఉదాహరణకు, దాయి, ఇంటిపని చేసేవారు, బెస్తవారు, మహిళలు, మంగళి, కూరగాయలు అమ్మేవాళ్లు, పేపర్ పంచేవాళ్లు మొదలైనవారు. ఈ నాలుగు రకాల కార్మికులే కాక మంగలి, చేనేత కార్మికులు, చేతితో కళాయిలు తయారు చేసేవాళ్లు, మహిళలు, టైలర్లు, స్వయం ఉపాధి చేసుకునే వికాలాంగులు, రిక్షా కార్మికులు, ఆటో కార్మికులు, కార్పెంటర్లు, పవర్‌లూమ్ కార్మికులు, పట్టణ పేదలు వంటి వారు స్వయం ఉపాధి కార్మికులు అసంఘటిత కార్మికుల కిందకే వస్తారు.

90 శాతం పైగా కార్మికులు స్వయం ఉపాధి, అసంఘటిత రంగంలో ఉన్నారు. ఇందులో స్వయంఉపాధి వాటా 2012 నాటికి శ్రమశక్తిలో 60 శాతానికి చేరుకుంది. దేశ జీడీపీలో దీని వాటా 45 శాతం. అసంఘటిత రంగంలో వ్యవసాయ కూలీల వాటా అత్యధికంగా సుమారు 52 శాతంగా ఉంది. అసంఘటిత రంగంలో సుమారు 65 శాతం వ్యవసాయ రంగం ఉంది. 2020లో కరోనా మహమ్మారితో మోదీ ప్రభుత్వం లాక్‌డౌన్ విధించే నాటికి ఒక అంచనా ప్రకారం దేశంలో సుమారు 16 కోట్ల మంది వ్యవసాయ కూలీలు, పేద రైతులు వలస శ్రామికులుగా పని చేస్తున్నారు. ప్రస్తుతం దేశంలోని 136 కోట్ల జనాభాలో మొత్తం కార్మికుల సంఖ్య 44 కోట్లు ఉండగా వీరిలో సంఘటిత కార్మికులు 5 కోట్ల మంది మాత్రమే. అసంఘటిత కార్మికుల సంఖ్య పెద్దెత్తున పెరిగిపోతూ 39 కోట్లకు చేరుకుంది.

అసంఘటిత రంగంలో పని పరిస్థితులు మధ్యయుగాలను గుర్తుకు తెస్తున్నాయి. బతకడానికి సైతం సరిపోని విధంగా వేతనాలు దయనీయంగా ఉంటున్నాయి. కార్మికులతో యజమానుల సంబంధం బానిసకూ, బానిస యజమానికీ మధ్య సంబంధం లాగా ఉంటున్నది. అన్ని విషయాల్లో యజమానిదే అంతిమ వాక్కుగా ఉంటున్నది. అధిక నియంత్రణను సాధించేందుకు, వీలైనంత అధికంగా దోపిడీ చేసేందుకు తరచుగా కులం, మతం, పితృస్వామ్య సంబంధాలు (మహిళలు పనిచేసే చోట) ఆధిపత్యం వహిస్తున్నాయి. ఆచరణలో ఏ చట్టాలూ వర్తించడం లేదు లేదా సవరించారు. ఎటువంటి ప్రజాస్వామిక వాతావరణం లేకపోవడంతో బతుకు నరకమైపోతున్నది. యూనియన్ కార్యకలాపాలను క్రూరంగా అణచివేస్తున్నారు. ఉపాధి, జీవితం అభద్రంగా ఉండడం సాధారణ నియమంగా మారిపోయింది.

కార్మిక చట్టాలను కఠినతరం చేసి కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ వారిని 19వ శాతాబ్దంలోకి తీసుకెళ్లారు. ప్రభుత్వం నాలుగున్నర లక్షల ఉద్యోగాలను బహిరంగంగా రద్దు చేసింది. రహస్యంగా ఉద్యోగాలలో దశలవారీగా కోత పెట్టడం నిరంతరం సాగుతున్నది. 8 గంటల పని 12 గంటలు చేయించుకునే అవకాశం ఏర్పడింది. మహిళలను రాత్రి పూట పని చేయించుకోవటం చట్టబద్ధం చేసారు. 300 మంది వరకు కార్మికులను చేర్చుకోవటం, తొలగించడం, కంపెనీని లాక్ అవుట్ చేయడం మొదలైన అధికారాలు యజమానులకు లభించాయి. గతంలో 7 గురు కార్మికులు ఉంటే యూనియన్ రిజిస్టర్ చేసుకునే హక్కు ఉండేది. ప్రస్తుతం 30 శాతం మంది కార్మికులు ఉంటేనే యూనియన్ స్థాపించుకోగలుగుతారు.

2017-18లో దేశంలో అధిక ఉపాధిని కల్పించే వ్యవసాయ, పారిశ్రామిక రంగాల వాటా జీడీపీలో వరుసగా 14 శాతానికి, 31.5 శాతానికి పడిపోగా, కేవలం 31 శాతం ఉపాధిని కల్పించే సర్వీసు రంగం వాటా 54.1 శాతానికి పెరిగింది. 2019-20 ఆర్థిక సంవత్సరం 2వ అర్ధభాగంలో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి మైనస్ 1 శాతానికి పడిపోగా, పారిశ్రామిక వృద్ధి రేటు 2019 జూన్‌లో 1.3 శాతం, సెప్టెంబర్‌లో 5.2 శాతం పడిపోయింది. ఇది నవంబర్‌లో అతిస్వల్పంగా 1.8 శాతం పెరిగింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లలో సంక్షోభం ఫలితంగా 6 లక్షల ఎంఎస్ఎంఈ పరిశ్రమలు మూతపడ్డాయి. వాటి వృద్ధి రేటు 2012-13లో 15.27 శాతం నుంచి 2015-16 నాటికి 7.62 శాతానికీ, జీడీపీలో వాటి వాటా 2011-12లో 29.57 శాతం నుంచి 2015-16 నాటికి 28.77 శాతానికి పడిపోయింది. ఫలితంగా నిరుద్యోగం 2016-17లోని 9.65 శాతం నుంచి 2017-18లో 4.03 శాతానికి తగ్గి తిరిగి 2018-19లో 5.14 శాతానికి, 2019-20 తొలి ఆరు మాసాలలో 7.05 శాతానికి, 2019 అక్టోబర్ నాటికి 8.5 శాతానికి తీవ్రంగా పెరిగిపోయింది. జీడీపీ వృద్ధి రేటు 2018 నుంచి 2019 జులై వరకు గల ఆరు త్రైమాసికాలలో వరుసగా 8, 7,

6.6, 5.8, 5.5, 2019 3వ త్రైమాసికంలో 4.5 శాతానికి పడిపోతూ వచ్చింది. ఇది గత ఆరు సంవత్సరాలలో అతితక్కువ.

ప్రపంచీకరణ కాలంలో పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) అనే దోపిడీ విధానాన్ని మరింత విస్తరించి అమలు చేస్తున్నారు. పీపీపీ అంతర్జాతీయ గుత్తసంస్థల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ సంస్థల గుత్తాధిపత్యమే. ఇందులో భాగంగా ప్రస్తుతం ఫ్లాగ్‌షిప్ పథకాలు (భారతమాల పథకం, సాగరమాల పథకం, ప్రత్యేక రవాణా కారిడార్ పథకాలు వంటి) అమలవుతున్నాయి. ఇది ప్రపంచ ద్రవ్య పెట్టుబడిదారులు సృష్టించిన రవాణా–కేంద్రిత అభివృద్ధి అనే ఒక అంతర్జాతీయ భావనలో భాగమే. అందువల్ల పీపీపీ ప్రాజెక్టులలో ప్రైవేట్ కంపెనీలు ఆ రంగంలో ప్రభుత్వ ప్రాయోజిత గుత్తసంస్థలుగా మారాయి. వీటికి పోటీ అనేదే ఉండదు. ఈ మోసపూరిత పీపీపీ నమూనాతో ప్రభుత్వ వనరుల ప్రైవేటైజేషన్‌ను వ్యతిరేకించే వాళ్లందరి నోరు మూయిస్తున్నారు. ప్రభుత్వం సైతం ఇందులో వాటాదారుగా (షేర్ హోల్డర్‌గా) ఉండడమే దీనికి కారణం. ఇందులో ఏదేని ప్రాజెక్టును మొత్తంగా ప్రైవేట్ నియంత్రణలోకి తీసుకోకుండా, ప్రమాదాలను ప్రభుత్వం మీదికి, రివార్డులను ప్రైవేటు ఖాతాలోకి బదిలీ చేయాలనే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ నియంత్రణ కింద అన్ని సర్వీసులను పీపీపీ నమూనాను ఉపయోగించి క్రమంగా ప్రైవేట్ నియంత్రణ కిందకు తీసుకొస్తున్నారు. ఉదాహరణకు, ప్రభుత్వ నియంత్రణ కింద వున్న ఎయిర్‌పోర్టులను, షిప్‌యార్డులను, హైవేలను, పట్టణ ట్రాన్స్‌పోర్టును, యుటిలిటీస్‌ను (అంటే నీరు, కరెంటు), ఆసుపత్రులను, రక్షణ తయారీ (మానుఫాక్చరింగ్)ని, అనేక ఇతర రంగాలను 30 లేదా 40 సంవత్సరాల పాటు ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారు. అవి ఆ రంగాలలో గుత్తసంస్థలుగా ఉంటూ ప్రజలను దుర్భర స్థితిలోకి నెట్టి బిలియన్ల కొలది సంపదను పోగు చేసుకుంటున్నాయి. ఆ రంగాలలో ఉన్న పబ్లిక్ రంగ సంస్థలను/కంపెనీలను ప్రభుత్వాలే దెబ్బతీస్తున్నాయి. ఉదాహరణకు, తెలంగాణలో ఆర్‌టీసీ, ముంబయిలో ఓడరేవు. పీపీపీ నమూనా ఉత్పత్తి శక్తులను మరింత ధ్వంసం చేయడానికి తప్ప అభివృద్ధికి (అంటే దేశం మరింత పురోగమించే విధంగా, స్వావలంబన సాధించేలా ఉపాధిని లేదా కార్మికుల స్కిల్స్‌ను మెరుగుపరచడం, టెక్నాలజీపరంగా అభివృద్ధి చేయడం) ఏమాత్రమూ తోడ్పడవు.

ఉదాహరణకు, పీపీపీ నమూనా కింద మెట్రో రైల్ ప్రాజెక్టులను పొందిన రిలయెన్స్ లేదా ఎల్ అండ్ టీ మాత్రమే పెద్ద నగరాలకు సంబంధించిన పట్టణ ట్రాన్స్‌పోర్టులో గుత్తాధిపత్యాన్ని కలిగి ఉన్నాయి. హైదరాబాద్ మెట్రో రైలు – పీపీపీ ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వ వనరులను కొల్లగొట్టడానికి మరో మంచి ఉదాహరణ. ప్రైవేట్ కంపెనీలు నిర్వహిస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టులు అన్నీ మెజారిటీ ప్రజలకు పట్టణ ప్రయాణాలను వ్యయపూరితం గావించాయి. అవి కార్మికులు తమ హక్కుల గురించి గొంతెత్తకుండా చేసేందుకు పథకం ప్రకారం ఇతర రాష్ట్రాల వారిని కార్మికులుగా నియమిస్తున్నాయి. పీపీపీలో గ్యారంటీగా అధిక లాభాలు వస్తాయి గనుక

దేశ–ప్రపంచ ద్రవ్య పెట్టుబడిదారులు ఆ నమూనాను ప్రోత్సహిస్తున్నారు. అంతకు మించి పీపీపీ ప్రాజెక్టులో ఏ గడ్డు సమస్యలు వచ్చినా వారు వాటిని ప్రభుత్వానికే వదిలేసే అవకాశం ఉంది. భూ సేకరణ, నష్టపరిహారం, పునరావాసం, అనూహ్య పరిస్థితుల కారణంగా ఏర్పడే నష్టాలు, కంపెనీ నిర్మాణంలో ఆలస్యం కారణంగా వచ్చే నష్టాలు, లేబర్, భద్రతా ప్రమాదాలు వంటి వాటికి ప్రభుత్వమే బాధ్యతపడుతున్నది. పీపీపీ నమూనా ద్వారా సామర్థ్యాన్ని వెలికితీస్తామనడం, ధరలు చౌకగా మారడం అవాస్తవికం. ప్రభుత్వం పెట్టుబడి లేదని చెప్పి ప్రైవేటీకరణ చేస్తున్నది. కానీ ఇది పూర్తిగా తప్పు. ప్రభుత్వ వార్షిక బడ్జెట్ డాక్యుమెంట్ల ప్రకారమే వివిధ దళారీ కార్పొరేట్ కంపెనీలకు యేటా లక్షల కోట్ల రూపాయల పన్ను మినహాయింపు ఇస్తూ పీడిత ప్రజల సొమ్మును వాటికి ధారదత్తం చేస్తున్నది. వాస్తవానికి దేశాన్ని పారిశ్రామీకీకరించాలంటే పెట్టుబడిని ఎలా సృష్టించాలి? మానవ పెట్టుబడిని, అంటే దేశంలో లభ్యమయ్యే విస్తృత మానవ వనరుల భాండాగారాన్ని వెలికితీయాలి; స్థానిక వనరులు, సాంకేతికత, వనరులపై ఆధారపడి "వ్యవసాయాన్ని పునాదిగా తీసుకొని పరిశ్రమను నాయకత్వంలో ఉంచే" సూత్రాన్ని, "రెండుకాళ్లపై నడిచే" వరుస విధానాలనూ అనుసరిస్తూ పారిశ్రామికీకరణను, వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలి; ఇందుకోసం భూసంస్కరణలను అమలు చేయాలి, సహకార వ్యవసాయాన్ని సహకార పద్ధతుల ద్వారా అభివృద్ధి చేస్తూ రైతాంగం కొనుగోలు శక్తిని పెంచాలి, తద్వారా శ్రామికులు అధికంగా ఉండే పరిశ్రమలను మరిన్ని నెలకొల్పాలి, పారిశ్రామిక ఉ త్పత్తిని పెంపొందించాలి. దేశ సంపదను బయటకు పోనివ్వడాన్ని పూర్తిగా నిలిపివేయాలి, అంటే స్వావలంబ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయాలి. కానీ ఈ మార్గానికి సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు ఆటంకంగా ఉన్నాయి. కార్మికవర్గ నాయకత్వంలో నాలుగు మిత్ర వర్గాలు – కార్మిక, కర్షక, మధ్యతరగతి, జాతీయ బూర్జువా వర్గాలు, పీడిత సామాజిక సెక్షన్లు – దళితులు, ఆదివాసులు, మహిళలు, మతమైనారిటీలు సమైక్యమై వాటిని కూలదోసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని, అంతిమంగా సోషలిజం–కమ్యూనిజం స్థాపించే లక్ష్యంతో విజయవంతం చేయాలి. తద్వారానే నూతన ప్రజాస్వామిక, స్వావలంబ ఆర్థిక వ్యవస్థను స్థాపించడం సాధ్యమవుతుంది. దీని ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

ప్రస్తుతం పూర్తిగా ప్రైవేటు/విదేశీ పెట్టుబడులతో/యాజమాన్యంతో నడిచే అస్సెట్–లైట్ నమూనా కంపెనీలు అన్ని రంగాల్లో గుత్తాధిపత్యాన్ని సంపాదించుకుంటున్నాయి. ఉదాహరణకు, టాక్సీని అద్దెకు పంపే యాప్ కంపెనీలు. ఉబర్, ఒలా ఇలాంటివే. ఉబర్ కంపెనీ పూర్తిగా విదేశీ యాజమాన్యం కింద ఉంది. ఒలా అనేది ఇండియన్ స్టార్టప్ కంపెనీ అయినప్పటికీ ఇందులో మెజారిటీ షేర్లు విదేశీ ప్రైవేటు ఈక్విటీ వాటాలుగానే ఉన్నాయి.

ప్రపంచీకరణ దశలో ప్రత్యేకించి గత పది సంవత్సరాలలో స్టార్టప్ కంపెనీలలో అస్సెట్–లైట్, ఏగ్రిగేటర్ కంపెనీలు వంటి పలు రకాల నూతన రూపాలు ముందుకు వచ్చాయి. టాక్సీలను

అద్దెకు ఇచ్చే యాప్‌ల (ride-hailing apps) రంగం (భారతదేశంలో ఉబర్, ఒలా కంపెనీలు ఈ రంగంలో పని చేస్తున్నాయి) అనేది అస్సెట్-లైట్ (ఎటువంటి సాధన సంపత్తిలేని) మోడల్ కంపెనీకి ఉదాహరణ. ఉబర్ వద్ద గానీ, ఒలా వద్ద గానీ టాక్సీలుగా నడపడానికి కార్లు అంటూ ఏమీ లేవు. టాక్సీలు కలిగి ఉండి, ఉబర్ లేదా ఒలా కంపెనీలలో ఎన్‌రోల్ చేసుకున్నవారు టాక్సీ డ్రైవర్లుగా పని చేస్తారు. అంటే వాళ్లే డ్రైవర్లు-ఓనర్లు కూడా. అంతేకాక ఈ యాప్ కంపెనీలు వేతనాన్ని, ఇతర ప్రయోజనాలను సైతం చెల్లించవు. అంటే, నెలవారీగా ఎటువంటి ఖర్చు ఉండదు. డ్రైవర్లు-ఓనర్లుగా కూడా ఉన్నవాళ్లే టాక్సీ కార్ మెయింటెనెన్స్ కోసం చెల్లిస్తారు, ఆయిల్ కూడా వారే చెల్లిస్తారు. సంక్షిప్తంగా, ఉబర్, ఒలా టాక్సీ-అద్దె యాప్స్ టాక్సీ కంపెనీలు కావు, అది కేవలం ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ మాత్రమే. వారి వద్ద సాఫ్ట్‌వేర్ తప్ప ఏమీ ఉండదు. ఓయో రూములు అనే కంపెనీ హొటల్ బుకింగ్ యాప్‌ను నడుపుతుంది. దీనికి ఒక్క హొటల్ కూడా ఉండదు. జొమాటో, స్విగ్గీ, ఉబర్ ఈట్స్ అనే కంపెనీలు ఆహారాన్ని సరఫరా చేసే యాప్‌ను నడుపుతాయి. కానీ వారి యాజమాన్యం కింద ఎటువంటి రెస్టారెంటూ లేదు. రియల్ ఎస్టేట్ మార్కెట్ కోసం హౌసింగ్.కాం అనే ఒక యాప్ నడుస్తున్నది కానీ దానికి ఒక్క ఇల్లు గానీ ఫ్లాట్ గానీ లేదు. ఈ రకమైన నమూనాను అస్సెట్-లైట్ మోడల్ అని పిలుస్తారు.

స్టార్టప్ కంపెనీలలో మరో నూతన రూపమే ఏగ్రిగేటర్ కంపెనీలు. ఇది (ఒక యాప్ ద్వారా) ఒకే మొత్తం కిందికి రాగలిగే స్టార్టప్ కంపెనీలకు సంబంధించిన ఒక నిర్దిష్ట మార్కెట్ రంగాన్ని సూచిస్తుంది. ఇది ఒక ఉత్పత్తి లేదా సర్వీసుకు సంబంధించిన వేలాది మంది అమ్మకందార్లను తమదైన ఒకే వేదిక మీదకు తీసుకొస్తుంది. అంటే ఇవి కూడా అస్సెట్-లైట్ నమూనా కంపెనీలే. ఉదాహరణకు, అమజాన్, ఫ్లిప్‌కార్ట్ ఏగ్రిగేట్ రీటైల్ అమ్మకందారులు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అమెజాన్ లేదా ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన ప్లాట్‌ఫారమును వాడుకుంటారు. హౌసింగ్.కాం, మాజిక్‌బ్రిక్స్.కాం మొదలైనవి రియల్-ఎస్టేట్ మార్కెట్ ఏగ్రిగేటర్లు. రియల్-ఎస్టేట్ అమ్మకందారులు అందరూ తమ ఈ ప్లాట్‌ఫారమును ఉపయోగించుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా వ్యక్తులకు లేదా కంపెనీలకు సంబంధించిన ఒక ఏగ్రిగేటర్ Airbnb. రోజువారీగా లేదా నెలవారీగా తమ ప్రాంగణాలను అద్దెకు ఇవ్వాలనుకునేవారు దీనిని ఉపయోగించుకుంటారు. స్విగ్గీ మరియు దాని పోటీదార్లు తినుబండరాల ఏగ్రిగేటర్లు. కాల్‌హెల్త్ మరియు దాని పోటీదారు ప్రాక్టో - డాక్టర్లు, ఆసుపత్రులు మరియు మెడికల్ షాపులకు చెందిన ఏగ్రిగేటర్లు.

ఆరోగ్య సంరక్షణ (అంటే వైద్యరంగం) కోసం టెక్నాలజీ (సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ లేదా రెండింటిని)ని అభివృద్ధి చేస్తున్న స్టార్టప్ కంపెనీలను మెడ్‌టెక్ స్టార్టప్ కంపెనీలని పిలుస్తారు. BFSI (banking, financial services and insurance-బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసులు, ఇన్సూరెన్స్) రంగం కోసం టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్న వాటిని ఫైన్‌టెక్ స్టార్టప్‌లని పిలుస్తారు. అవి విద్యా రంగంలో

అలా చేస్తే వాటిని ఎడుటెక్ స్టార్టప్‌లని పిలుస్తారు. స్టార్టప్ కంపెనీలు AI (artificial intelligence), ML (machine learning), neural networks, computer vision, robotics మొదలైన రంగాలలో అలా చేస్తే వాటిని డీప్‌టెక్ స్టార్టప్స్ అని పిలుస్తారు. అవి డిఫెన్స్ రంగంలో అలా చేస్తే వాటిని డిఫెన్స్ టెక్ స్టార్టప్స్ అని పిలుస్తారు. ప్రస్తుతం ద్రవ్య పెట్టుబడిదారులు స్టార్టప్ ఫైనాన్స్ మార్కెట్‌లో అత్యధిక మదుపులను అస్సెట్-లైట్ మరియు ఏగ్రిగేటర్ మోడల్ కంపెనీలలో పెడుతున్నారు. ఎందుకంటే అటువంటి స్టార్టప్ కంపెనీలకు అంత వ్యయం చేయాల్సిన అవసరం ఉండదు.

సహజ వనరులతో సమృద్ధంగా ఉన్నప్పటికీ భారతదేశం వంటి వెనుకబడిన దేశాలను పరోక్ష వలసలుగా మార్చుకోవడానికి స్టార్టప్ కంపెనీలు ప్రపంచ ద్రవ్య పెట్టుబడిదారులకు సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి. స్టార్టప్ కంపెనీలలో అటు ఉద్యోగాలకు, ఇటు ఆదాయానికీ అభద్రత తీవ్రస్థాయికి చేరుకుంది. స్టార్టప్ యూనికార్న్ కంపెనీలు భారత కార్మికశక్తిని తీవ్రంగా దోచుకోవడం ద్వారా బిలియన్ డాలర్ కంపెనీలుగా అవతరిస్తున్నాయి. ఉబర్, స్విగ్గీ, జొమటొ, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి స్టార్టప్ కంపెనీలు ఇటువంటివే.

**సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగం:** దేశంలో చిన్న తరహా రంగం 2000-01లో ఒక కోటి రూపాయలకు లోపు పెట్టుబడితో చేసే 3.3 లక్షల యూనిట్లతో 1.8 కోట్ల మందికి ఉపాధి కలిగిస్తుండేది, ఇందులోని మొత్తం యూనిట్లలో 96 శాతం యూనిట్లు 66,250 కోట్ల రూపాయల విలువ గల ఉత్పత్తిని చేస్తుండేవి. దీని ద్వారా ఈ రంగం పరిమాణాన్ని అర్థం చేసుకోవచ్చు. చిన్న తరహా రంగం (స్మాల్ స్కేల్ సెక్టార్-ఎస్ఎస్ఎస్) తయారీ రంగం స్థూల ఉత్పత్తిలో 40 శాతం, ఎగుమతులలో 34 శాతం వాటాను కలిగి ఉంది. ఇందులో చేనేత, గ్రామ పారిశ్రామిక రంగాన్ని (హెచ్‌విఐఎస్) కలపలేదు. ఈ రంగంలో 58 లక్షల మంది ఉపాధి పొందేవారు. ఇందులో సంవత్సరానికి 5,113 కోట్ల రూపాయల ఉత్పత్తి జరిగేది. ఎస్ఎస్ఎస్, హెచ్‌విఐఎస్ - ఈ రెండు రంగాలు ప్రపంచీకరణ కాలంలో నిరంతరం దాడికి గురయ్యాయి. చౌక శ్రమశక్తి అందించే ఈ రంగానికి ప్రావిడెంట్ ఫండ్, డీఏ, బోనస్, ఈసిస్ మొదలైన యావత్తు సామాజిక భద్రతా పథకాలను మినహాయించి వాటిని కేవలం పెద్ద వ్యాపార సంస్థలకు, టీఎన్‌సీలకు, పబ్లిక్ రంగానికి మాత్రమే పరిమితం చేసారు.

ప్రస్తుతం ఈ రంగాన్ని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రాలవారీగా చూస్తే ప్రస్తుతం ఎమ్ఎస్ఎమ్ఈ సంస్థల సంఖ్య బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో అధికంగా ఉంది. తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తరవాతి స్థానాల్లో ఉన్నాయి. భారత ఎంఎస్ఎంఇ మంత్రిత్వ శాఖ 2017-18 వార్షిక నివేదిక ప్రకారం ఈ రంగంలో ఉత్పత్తి 2011-12లో 25,83,263 కోట్ల రూపాయల నుంచి 2015-16 నాటికి 39,36,788 కోట్ల రూపాయలకు పెరిగింది.

ఈ రంగం మాన్యుఫాక్చరింగ్ రంగంలో 32 శాతం, వ్యాపార రంగంలో 35 శాతం, ఇతర రంగాలలో 33 శాతం వాటాలను కలిగివుంది. 2015-16లో ఎన్ఎస్ఎస్ నిర్వహించిన 73వ సర్వే ప్రకారం ఈ రంగంలో గ్రామీణ, పట్టణ రంగాలలో 6.34 కోట్ల పరిశ్రమల్లో 11.10 కోట్ల మందికి అంటే వరుసగా 45 శాతం, 55 శాతం ఉపాధి కల్పించారు. ఇందులో సూక్ష్మ రంగంలోనే సుమారు 630.52 లక్షల పరిశ్రమల్లో 10.76 కోట్ల మందికి అంటే ఎంఎస్ఎంఈ రంగంలోని మొత్తం ఉపాధిలో సుమారు 97 శాతానికి ఉపాధి లభించింది. 2019లో 6.5 కోట్లకు పెరిగిన ఎంఎస్ఎంఈ సంస్థలలో 12 కోట్ల మందికి ఉపాధి లభిస్తున్నది. కానీ జీడీపీలో ఎంఎస్ఎంఈల వాటా 2011-12లో 29.57 శాతం నుంచి 2015-16 నాటికి 28.77 శాతానికి పడిపోయాయి. ఈ రంగం వృద్ధి రేటు 2012-13లో 15.27 శాతం నుంచి 2015-16 నాటికి 7.62 శాతానికీ, ఆపై 6 శాతానికి చేరుకొని కొన్నేళ్లుగా ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోయింది.

ఈ రంగాన్ని డీ-రిజర్వేషన్ చేయడం, ఎఫ్‌డీఐను 100 శాతం అనుమతించడం, 1999 నాటికే 'సరళీకరణ'లో 3000 రకాల విదేశీ ఉత్పత్తులు, ఎగ్జిం పాలసీ ప్రకారం 8000 రకాల విదేశీ ఉత్పత్తులు భారత మార్కెట్‌ను ముంచెత్తడంతో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ రంగంలో పరిశ్రమలు ఎక్కువగా మూతపడ్డాయి. బ్యాంకుల నుంచి ఈ రంగంలోని 16 శాతం పరిశ్రమలకు మాత్రమే రుణాలు లభిస్తున్నాయి. అలాగే వీటి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం, తగిన గిరాకీ లేకపోవడం, విద్యుత్ కొరత, ముడిపదార్థాల కొరత, యంత్రసామగ్రి లేకపోవడం ఈ రంగం దెబ్బతినిపోవడానికి కారణాలు.

రుణ అవసరాలు తీర్చడానికి ఉద్దేశించిన పథకాలు దేశంలో ఎన్నో ఉన్నాయి. ప్రధానమంత్రి ఉపాధిహామీ పథకం, ముద్ర, సంప్రదాయ పరిశ్రమల పునరుత్తేజిత నిధి (స్ఫూర్తి), కాయిర్ బోర్డు పథకాలు, సూక్ష్మ, చిన్న పరిశ్రమల రుణహామీ పథకం (సీజీటీఎమ్ఎస్ఈ), రుణ ఆధారిత మూలధన సబ్సిడీ పథకం వంటివి ఇందులో ఉన్నాయి. ఈ పథకాలకు ప్రభుత్వ కేటాయింపులు తగినంతగా లేవు. నిజానికి ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) ఇటీవల నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఈ ఎమ్ఎస్ఎమ్ఈలకు రూ.16.66 లక్షల కోట్ల మేరకు రుణ అవసరాలు ఉన్నట్లు తేలింది. భారత దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ఈ అవసరాల పట్ల గానీ, ఈ రంగానికి అవసరమైన టెక్నాలజీని అందించే శ్రద్ధ గానీ లేదు. అవి అవలంబిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల ఫలితంగా ఈ రంగంలో ఉత్పత్తి శక్తులు నిరంతరం ధ్వంసమవుతున్నాయి. ఇందులో పనిచేసే కోట్లాది మంది ప్రజలు దారిద్ర్యంలో కూరుకుపోతున్నారు. ఈ పరిశ్రమలకు యాజమాన్యంగా ఉన్న జాతీయ బూర్జువా వర్గం సైతం నిరంతరం దెబ్బలు తింటున్నది.

**రేటింగ్ ఏజెన్సీలు:** 2000వ సంవత్సరం తర్వాత ప్రపంచ ద్రవ్య పెట్టుబడిదారులు ప్రభుత్వ ద్రవ్య లోటును తగ్గించేందుకు వెనుకబడిన దేశాల ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడానికి ఒక వ్యూహాన్ని అభివృద్ధి చేసారు. ప్రపంచ ద్రవ్య పెట్టుబడిదారులు, రేటింగ్ ఏజెన్సీలు, ఎంఎన్‌సీలు వంటి వారి ప్రైవేట్ సంస్థలు, ప్రపంచ ఎకనామిక్ ఫోరం, సీక్రెటివ్ బిల్డెర్‌బెర్గ్ గ్రూపు, వివిధ థింక్–ట్యాంక్స్ వంటి పాలసీ అడ్వైజరీ సంస్థలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నిర్దేశిస్తున్నాయి. అవి ఇచ్చే రేటింగులు ఒక దేశాన్ని నిర్మించేందుకు లేదా ధ్వంసం చేసేందుకు ఒక అత్యంత శక్తివంతమైన సాధనం అయ్యాయి. ఇలా రేటింగులు ఇచ్చే మూడు రేటింగ్ ఏజెన్సీలు – ఎస్ అండ్ పీ, ఫిచ్, మూడీస్ – అమెరికాలో ఉన్నాయి. ఇవి ప్రైవేట్ కార్పొరేట్ కుటుంబాల యాజమాన్యం కింద ఉన్నాయి. ఒకానొక దేశ ప్రభుత్వపు ద్రవ్య లోటు స్థాయి, రెవెన్యూ లోటు స్థాయి, కరెంట్ అకౌంటు లోటు స్థాయి, ప్రైవేటైజేషన్‌ను కొనసాగించే సంస్కరణల స్థాయి, కార్పొరేట్ కంపెనీలు తమ వ్యాపారం సాగించేందుకు గల సౌకర్యాల స్థాయి, ఇంకా ఇటువంటి కొన్ని ప్రమాణాలపై ఆధారపడి ఈ రేటింగ్ ఏజెన్సీలు, ఐఎంఎఫ్, డబ్ల్యుబి మరియు వివిధ మదుపు లేదా ఆర్థిక రీసర్చ్ సంస్థలు వంటి పలు సంస్థలు రేటింగులు ప్రదానం చేస్తున్నాయి. పై ప్రమాణాలలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ అంశాలలో తాను (సంబంధిత ఏజెన్సీ) హెచ్చరికలు చేసినప్పటికీ లక్ష్యాలకు అనుగుణంగా లేని పక్షంలో అది దాని రేటింగ్‌ను తగ్గిస్తున్నది. రేటింగ్ తగ్గిన తర్వాత ఆ ప్రభుత్వం, ఆ దేశ కార్పొరేట్ కంపెనీలు తన సార్వభౌమ బాండ్లను అమ్మడం ద్వారా రుణాలు తెచ్చుకునేందుకు విదేశాలకు పోతే మదుపుదారులు (ప్రపంచ ద్రవ్య కంపెనీలు) ఆ బాండ్లను కొనేందుకు ఆసక్తి చూపరు లేదా అధిక వడ్డీ రేట్లను డిమాండ్ చేస్తారు. ఇది జంక్ బాండుకు సంబంధించిన అధ్వాన్న రూపం. ఫలితంగా, ఈ బాండ్లను కొనుగోలు చేసేందుకు తగిన డిమాండ్ ఉండదు. ఈ విషవలయంలో చిక్కుకున్న అత్యధిక దళారీ ప్రభుత్వాలకు రేటింగ్ ఏజెన్సీల పాటకు వంత పాడడం తప్ప మరో ప్రత్యామ్నాయం ఉండదు. 2018లో భారతదేశపు రేటింగ్‌ను ఈ మూడు రేటింగ్ ఏజెన్సీల్లో ఒకటి తగ్గించింది. ద్రవ్య లోటు తగ్గించుకోవాల్సిందిగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. వెంటనే ఆర్‌బీఐ (ఐఎంఎఫ్, డబ్ల్యుబిల మాదిరిగానే) సైతం విద్య, ఆరోగ్య సంరక్షణ, పేదరిక నిర్మూలన వంటి సామాజిక రంగాలపై, వ్యవసాయం, పరిశ్రమలు వంటి ఉత్పాదక రంగాలపై, రీసర్చ్ మొదలైన వాటిపై ఖర్చులు తగ్గించుకోవాలని సూచించడంతో మోదీ ప్రభుత్వం ద్రవ్య పెట్టుబడికి మరిన్ని రాయితీలు ప్రకటిస్తున్నది, బడ్జెట్‌లో కోతలు విధించి ప్రజాసంక్షేమ రంగాలను ప్రైవేటీకరిస్తున్నది. ఈ చర్యలు ఉపాధిని మరింతగా దెబ్బతీయడమే కాక భారత ఆర్థిక వ్యవస్థను మరింత ద్రవ్య లోటులోకి నెడుతున్నాయి.

సంక్షిప్తంగా చెప్పాలంటే, ఈ మూడు దశాబ్దాల కాలంలో ప్రపంచీకరణ ద్వారా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా పథకం ప్రకారం చేస్తున్న దాడి వెనుకబడిన దేశాలపై

తీవ్రస్థాయికి చేరుకుంది. భారత దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడిపై ఆధారపడి వుండడం, దాని ప్రయోజనాలతో తమ ప్రయోజనాలు ముడిపడి ఉండడం వలన, దానితో వాటి కుమ్మక్కు మున్నెన్నడూ లేనిస్థాయికి పెరిగిపోయింది. భారతదేశం చమురు, అణు ఇంధనం, ఆయుధాలు, యుద్ధ సామగ్రి కోసం ప్రధానంగా దిగుమతుల మీద ఆధారపడుతున్నది. దేశంలో ప్రముఖ ఆర్థిక కార్యకలాపాలుగా కన్‌స్ట్రక్షన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ముడి పదార్థాల వెలికితీత (గనులు), సాఫ్ట్‌వేర్, సామ్రాజ్యవాదుల మాన్యుఫాక్చరింగ్ సరుకుల విడిభాగాల అసెంబ్లింగ్, సేవారంగ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ముడి పదార్థాలను, కొన్ని ముఖ్యమైన వ్యవసాయ సంబంధ శ్రమను, సర్వీసులను ఎగుమతి చేసే ఆర్థిక వ్యవస్థగా మారింది. దేశం నుంచి మేధో శ్రమ, నైపుణ్యం లేని శ్రమ, అర్ధ నైపుణ్యపు శ్రమ వలస కూడా అధికంగానే ఉంది. సామ్రాజ్యవాద దేశాల నుంచి ప్రధానంగా యంత్రాలను (కాపిటల్ గూడ్స్), చాలా రకాల మాన్యుఫాక్చరింగ్ వస్తువులను, టెక్నాలజీని దిగుమతి చేసుకుంటున్నారు. సూపర్ లాభాల వేటలో విదేశీ పెట్టుబడులు నూతన టెక్నాలజీపై ఆధారపడి దేశంలో పలు స్టార్టప్ కంపెనీలను స్థాపించడం వలన నూతనంగా పలు శక్తులు దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలలో భాగమయ్యాయి. ఫలితంగా ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ గుత్త పెట్టుబడిదారీ సంస్థల ఆధిపత్యం, దేశ సహజ వనరుల దోపిడీ, పీడిత ప్రజల శ్రమశక్తి దోపిడీ, పీడన అణచివేత, పర్యావరణ విధ్వంసం ఎన్నో రెట్లు పెరిగింది. దేశ ఆర్థిక వ్యవస్థ విదేశీ రుణ పెట్టుబడి ఊబిలో గొంతులోతు కూరుకుపోయింది. అర్ధవలసగా ఉన్న దేశ పరిస్థితి మరింత దిగజారింది. దేశ పరాధీనత పెరిగిపోయింది. ఇది నయావలస తరహా అర్ధవలస దేశం కావడం వల్ల పారిశ్రామిక రంగం సంపూర్ణంగా అభివృద్ధి చెందే అవకాశం లేకపోవడంతో సామ్రాజ్యవాదుల, దళారీ పాలకవర్గాల పెట్టుబడి, ముడి సరుకుల, మార్కెట్ అవసరాలకు అనుగుణమైన మార్పులే జరిగాయి. వారి అభివృద్ధి నిరోధక స్వభావంలో ఎటువంటి మార్పూలేదు.

## అర్ధభూస్వామ్య స్థితి

ప్రపంచీకరణ విధానాల ఫలితంగా దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ గత మూడు దశాబ్దాలలో ప్రపంచ ద్రవ్య పెట్టుబడి వలయంలోకి మరింత అధికంగా ఈడ్చబడింది. ప్రపంచ వ్యాపార సంస్థ (డబ్ల్యుటీఓ) ఆధ్వర్యంలో సామ్రాజ్యవాద దేశాలు ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదం వ్యవసాయం, సేవారంగం, మేధోసంపద వంటి వాటిపై నయావలస తరహా ఒప్పందాలను వెనుకబడిన దేశాలపై మరింతగా రుద్దాయి. దీంతో మన దేశ వ్యవసాయ రంగం అంతర్జాతీయ మార్కెట్లతో మరింతగా అనుసంధానమైంది. దేశ నామమాత్ర సార్వభౌమత్వం మరింత కుదించుకుపోయింది. అదుపులేని ప్రపంచ ద్రవ్య పెట్టుబడి రాకపోకలతో వ్యవసాయ రంగంపై బహుళజాతి కార్పొరేట్ కంపెనీల ఆధిపత్యం వ్యవస్థీకృతమైంది. ఈ విధానాలన్నింటి ఫలితంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభానికి గురైంది. దీనికి మూలాలు దేశంలోని కాలంచెల్లిన

బ్రాహ్మణవాద హిందుత్వ భావజాలంతో కూడిన అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలో ఉన్నాయి. అందువల్లనే మన దేశం ఇప్పటికీ ప్రధానంగా అర్ధభూస్వామ్య దేశంగా కునారిల్లుతోంది. అర్ధభూస్వామ్య సంబంధాలు నూతన రూపాల్లో కొనసాగుతున్నాయి. ప్రపంచీకరణ కాలంలో అర్ధభూస్వామ్య సంబంధాలు భారత ప్రజలను ఎలా కుంగదీస్తున్నాయో చూద్దాం:

**1) భూకేంద్రీకరణ:** (2010-11 వ్యవసాయ గణాంకాల ప్రకారం పెద్ద భూకమతాల వైశాల్యం 2000-01లో 37.2 శాతం నుంచి 20 శాతానికి తగ్గింది. అంటే 2.11 కోట్ల హెక్టార్ల నుంచి 1.69 కోట్ల హెక్టార్లకు తగ్గింది) 2012-13లో 70వ రౌండు జాతీయ శాంపిల్ సర్వే ప్రకారం 7 శాతం గ్రామీణ ధనిక కుటుంబాల చేతిలో దాదాపు సగం భూమి ఉంది. 2015 సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం 10 శాతంగా ఉన్న భూస్వాముల చేతిలో 55 శాతం భూమి కేంద్రీకృతమై ఉంది. నిజానికి ఈ కేంద్రీకరణ మరింత ఎక్కువగా ఉంటుంది.

2017లో నాబార్డ్ గణాంకాల ప్రకారం గ్రామీణ ప్రాంతంలో భూస్వాముల సంఖ్య 5.76 శాతంగా ఉంది. భూస్వాముల సంఖ్య తగ్గిపోయి, పెద్ద భూ కమతాల విస్తీర్ణం తగ్గిందనేది వాస్తవమే అయితే ఇప్పటికీ భూస్వామ్య ఆధిపత్యం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలతో పాటు ఉపరితలంలో ఎలా కొనసాగుతున్నదో చూస్తే అది రూపంలో మార్పే తప్ప సారంలో కాదని అర్థం అవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆధిపత్య కులాల భూస్వాముల చేతిలో 100ల ఎకరాల భూమితో పాటు, రాజకీయ ఆధిపత్యం కూడా ఉంది. ప్రపంచీకరణ కాలంలో కొందరు మధ్యకులాల్లోని పై దొంతరకు సంబంధించినవారు కూడా ఈ వర్గంలో భాగమయ్యారు. మత సంస్థల కింద, దేవాలయాల కింద వేలాది ఎకరాల భూములున్నాయి.

వివిధ అధ్యయనాల ప్రకారం గ్రామీణ భారతంలో భూముల, ఇతర వ్యవసాయ సంబంధమైన ఆస్తుల, వ్యవసాయ-వ్యవసాయేతర రాబడుల కేంద్రీకరణ పెరుగుతున్నది. ఇప్పటికీ కులం ఇందులో నిర్ణయ్మాతకంగా ఉంది, ఆధిపత్య కులాలకు చెందినవారి చేతిలోనే అత్యధికంగా ఇవి కేంద్రీకరించబడుతున్నాయి. వీరికి కేవలం భూమిపై మాత్రమే కాక, సాగునీరు, భూగర్భజలాలు, రుణాలు, వ్యాపారం, వడ్డీవ్యాపారం, ధాన్యం మిల్లులు, ఇటుక బట్టీలు, పశు పోషణ, ఆహారధాన్యాల స్పెక్యులేషన్, వ్యవసాయ పరికరాలు, గ్రామీణ ఉత్పత్తి రంగం, రియల్ ఎస్టేట్లు, నిర్మాణరంగం, సినిమా థియేటర్లు, పెట్రోల్ పంపులు, రవాణరంగం, వ్యవసాయ పరికరాల అద్దె, విద్యాసంస్థలపై మొదలైన వాటిపై కూడా అదుపు ఉంది. ముఖ్యంగా నిచ్చెనమెట్ల కులవ్యవస్థపై ఆధారపడి పీడిత కులాలు సృష్టించే అదనపు విలువను దోచుకునేందుకు, వారిని బానిసలను గావించేందుకు, ఇప్పటికీ భూస్వాములకు భూమి ఒక సాధనంగా ఉపయోగపడుతోంది. పేదలకు ప్రత్యేకించి దళితులు, ఆదివాసులకు భూమి దక్కకుండా చేయడం, వారితో తక్కువ వేతనాలతో బలవంతంగా పని చేయించుకోవడం, బలవంతంగా అవమానకర వృత్తులు చేయించడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం, ప్రతీ విషయంలో దూకుడుగా,

నిర్దయగా వ్యవహరించడం, పేద మహిళల ఆత్మాభిమానాన్ని కించపరచడం మొదలైన భూస్వామ్య లక్షణాలు ప్రత్యక్షంగా ఇప్పటికీ వారిలో ప్రబలంగా కనిపిస్తాయి. మూఢ విశ్వాసాలు, వివక్ష, హింసల కారణంగా మహిళలు, పీడిత కులాలవారు సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితంలో సమాన, స్వతంత్ర భాగస్వామ్యాన్ని పొందలేకపోతున్నారు.

వీరు భూములను తమ చేతిలో పెట్టుకోవడానికి చట్టాలలోని లొసుగులను ఉపయోగించుకుంటున్నారు. భూసంస్కరణల కింద పంపిణీ చేసిన భూమిని సైతం ఆక్రమించుకోగలుగుతున్నారు. బేదఖల్ చేసిన రైతులను రెగ్యులర్‌గా వ్యవసాయ కూలీలుగా పని చేయించుకోవడం రూపంలో గానీ లేదా పంటలో భాగం ఇచ్చే రైతుల రూపంలో గానీ భూస్వామ్య దోపిడీ కొనసాగుతోంది.

రాజకీయాల్లో, గ్రామ పంచాయితీ చైర్‌పర్సన్ నుంచి దేశ అధ్యక్షుడి వరకూ అభివృద్ధినిరోధక నాయకులలో గణనీయ సంఖ్య భూస్వామ్య నేపథ్యం గలవారే. భూస్వామ్య దోపిడీ రకరకాల పద్ధతుల్లో కొనసాగుతున్నది. వ్యవసాయ కూలీలకు తక్కువ వేతనాలు ఇచ్చి వ్యవసాయం చేయించుకుంటున్నారు. ఈ పంటలే ప్రధాన ఎగుమతులుగా మారుతున్నాయి. పంటల ఉత్పత్తిలో, ఎగుమతిలో అదనపు విలువను వారు పెద్దమొత్తాన్ని హస్తగతం చేసుకుంటున్నారు. దేశ పారిశ్రామికీకరణను నిరోధిస్తూ, దేశంపై సామ్రాజ్యవాద నయావలస తరహా ఆధిపత్యాన్ని నిలిపి ఉంచుతున్నారు.

వీరు మధ్యతరగతి రైతులను కూడా దోపిడీ చేస్తారు. అధిక వడ్డీలు వసూలు చేస్తారు. భూములను కౌలుకు ఇస్తారు. కొందరు భూస్వాములు కారుచౌకగా నిస్సహాయ పేదరైతుల వద్ద భూములను 'ఎదురు' కౌలు (రివర్స్ కౌలు)కు తీసుకుని లాభాలు ఆర్జిస్తారు. వ్యవసాయ కూలీలతో, కౌలుదార్లతో వెట్టిచాకిరి చేయించుకుంటారు. దివాలా తీసిన రైతుల భూములను, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తారు. ట్రాక్టర్లు, కోత యంత్రాలు, ఇతర వ్యవసాయ పనిముట్లు, ఆహార ఉత్పత్తులు నిల్వ చేసుకునే గోదాములకు ఎక్కువ అద్దెలు వసూలు చేస్తారు. ధాన్యపు మిల్లులు, పాల కేంద్రాలు, ఆహార ధాన్యాల వ్యాపారం, తోటలు–అడవుల పెంపకం, వస్త్ర తయారీ, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, సినిమా థియేటర్లు, పెట్రోలు బంకులు, వసతి గృహాలు, రవాణా, వ్యవసాయ యంత్రాల అమ్మకం, అద్దెకు ఇవ్వటం, లాభకరమైన విద్యా సంస్థలు, వేతన ఉద్యోగం ద్వారా సంపదలు పెంచుకుంటారు. గ్రామీణ ప్రాంతంలో అన్ని ప్రభుత్వ పథకాల నిధులను స్వాహా చేస్తారు. ప్రభుత్వ/ప్రైవేటు కాంట్రాక్టులన్నీ వీరివే. ఇవన్నీ అర్ధభూస్వామ్య దోపిడీ రూపాలే.

ప్రపంచీకరణ కాలంలో ముఖ్యమైన పరిణామం లక్షలాది ఎకరాల రైతుల, ఆదివాసుల సాగు భూములను, అటవీ భూములను నిర్బంధంగా స్వాధీనం చేసుకోవడం. మెట్రోపాలిటన్

నగరాల చుట్టుపక్కల ప్రభుత్వ భూములను, రైతుల సాగు భూములను వివిధ ఎంఎన్‌సీలు, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, ప్రభుత్వ సంస్థలు, మత సంస్థలు, నాన్–గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్, స్టాక్ మార్కెట్ బ్రోకర్లు, పలు రకాల మాఫియాలు కబ్జా చేసుకుంటున్నాయి. పెద్ద పెద్ద ఎస్టేట్లను తమ చేతిలో కేంద్రీకరిస్తున్నాయి. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐలు), అధికజీతం పొందే కార్పొరేట్ ఉద్యోగులు, బడా వ్యాపారులు కారుచౌక ధరలకు వ్యవసాయ భూములను హస్తగతం చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు అభయారణ్యాలను, హరితహారాలను ఏర్పరుస్తున్నాయి. ఖనిజాలు–సహజవాయువుల మైనింగ్ కోసం, కాఫీ, రబ్బరు తదితర ప్లాంటేషన్ల కోసం భూములను అప్పగిస్తున్నారు. కార్పొరేట్ పరిశ్రమలు, స్టార్టప్ కంపెనీలు, పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు (సెజ్), ఎగుమతి ప్రోత్సాహక మండలాలు, ఇండస్ట్రియల్ కారిడార్లు, ఎకనామిక్ కారిడార్లు, డిఫెన్స్ కారిడార్లు, కోస్తా కారిడార్‌లు వంటి పారిశ్రామిక అవసరాల కోసం సాగు భూములు కేటాయిస్తున్నారు. ఇలాంటి భూములలోనే ఫారంహౌస్‌లు, అగ్రిగార్డెన్లు ఏర్పరచి కార్పొరేట్ వ్యవసాయ కంపెనీలు వ్యాపార పంటలు సాగు చేస్తున్నాయి. హైటెక్ సిటీలు, స్మార్ట్ సిటీలు, వ్యాపార–వాణిజ్య సముదాయాలు, గెస్ట్‌హౌస్‌లు, పర్యాటక/పర్యావరణ అనుకూల పార్కులు, పట్టణీకరణ, ఫార్ములా వన్ రేసింగ్‌లు, రియల్ ఎస్టేట్ సట్టా వ్యాపారం, ఫైవ్‌స్టార్ హొటళ్లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు (విలాసవంతమైన సముదాయాలు), ఫంక్షన్ హాల్స్, అమ్యూస్‌మెంట్ పార్క్‌లు, సుందర భవనాల కోసం భూములు ఇస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టులు, థర్మల్–అణు విద్యుత్ ప్లాంట్లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, నాలుగు లైన్ల–ఆరు లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవేలు, భూ బ్యాంకులు వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు భూములు కేటాయిస్తున్నారు. 'అభివృద్ధి' పేరుతో అవసరమైన భూమిని సేకరించే అప్పగించే బాధ్యత దళారీ నిరంకుశ రాజ్యమే చేపడుతున్నది. 1951–2010 మధ్య దేశంలో రైతుల నుంచి ఈ విధంగా దాదాపు 4 కోట్ల ఎకరాల భూమిని సేకరించి సరైన నష్టపరిహారం, పునరావాస సౌకర్యం అందించకుండానే దాదాపు ఆరున్నర కోట్ల మందిని నిర్వాసితులను చేసారు. నిర్వాసిత సమస్య దేశంలో భూమి సమస్యలో ఒక ప్రధాన అంశంగా మారింది.

సామ్రాజ్యవాద సంస్థలు/కంపెనీల, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్యశక్తులతో కూడిన ఈ విప్లవ ప్రతీఘాతుక కూటమి భూమిపై తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి, మరింత బలోపేతం చేసుకోవడానికి, తాము చేసిన దాడులకు కోర్టులలో శిక్షలుపడకుండా తప్పించుకోవడానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని యథేచ్ఛగా ఉపయోగించుకుంటూ ప్రత్యక్షంగా, పరోక్షంగా చేయని ప్రయత్నం లేదు. లక్షలాది ప్రభుత్వ సాయుధ బలగాలతోనే కాక, పలు రకాల విప్లవ ప్రతీఘాతుక సైన్యాలను, గ్యాంగులను నిర్మించి సాయుధంగా మోహరించి క్రూరంగా దాడులు చేస్తున్నాయి. వ్యవసాయ కూలీలకు అధిక వేతనాలు, కౌలుదారు సంస్కరణలు, రైతుల

హక్కులు, భూసంస్కరణలు, దున్నేవారికి భూమి, నిర్వాసితులకు తగిన నష్టపరిహారం కోరినవారిపై, పీడిత కులాల ప్రత్యేకించి దళితుల, మైనారిటీ హక్కులు కోరినవారిపై, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడినవారిపై పలు రకాలుగా దాడులు చేస్తున్నాయి. మానవహక్కులను అత్యంత దుర్మార్గంగా కాలరాచి వేస్తున్నాయి. పలు హత్యాకాండలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, మహిళలపై అత్యాచారాలు, గృహ దహనాలు, ఆస్తుల లూటీ, ధ్వంసం సాగించి/సాగిస్తూ అర్ధభూస్వామ్య వ్యవస్థను నిలబెట్టుకునేందుకు విఫలయత్నం చేస్తున్నాయి. దేశంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఈ విప్లవ ప్రతీఘాతుక కూటమి ఆటంకంగా ఉంది.

**2) పలు ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యవస్థల కుమ్మక్కుతో నూతన రూపాలలో పెద్దెత్తున కొనసాగుతున్న లూటీ:** ప్రపంచీకరణ కాలంలో సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువాల ప్రయోజనాలకు అనుగుణంగా రాజ్యం చేపట్టిన ప్రతి అడుగులో గ్రామీణ ప్రాంతాలలోని ఆధిపత్య కులాలకు చెందిన పాత–కొత్త భూస్వామ్య శక్తులే సామాజిక పునాదిగా ఉన్నాయి. వ్యవసాయ, గ్రామీణ దోపిడీ విధానాల ద్వారా విదేశీ కార్పొరేట్ కంపెనీల, దేశీయ దళారీ కంపెనీలతో పాటు నూతన భూస్వామ్య శక్తులు, పార్లమెంటరీ పార్టీల నాయకులు, పలు రకాల మాఫియాలు లబ్ది పొందాయి. ప్రపంచ ద్రవ్య పెట్టుబడి సంస్థల, పలు ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యవస్థల, పార్లమెంటరీ రాజకీయ పార్టీల, పలు రకాల మాఫియాలతో కుమ్మక్కు మరింత పెరగడంతో పాత–కొత్త భూస్వామ్య శక్తుల ఆధ్వర్యంలో అర్ధభూస్వామ్య సంబంధాలు నూతన రూపాలలో కొనసాగుతున్నాయి. నూతన శక్తులలో కొందరు ధనిక రైతుల నుండి, కొందరు వ్యవసాయంలో పాల్గొనే ఎగువ మధ్యతరగతి రైతుల నుండి వచ్చినవారున్నారు. కొందరు సంప్రదాయక ఆధిపత్య కులాల నుంచే కాక చాలా తక్కువ మంది అయినా పీడిత కులాల నుంచి వచ్చారు. వీరు అదనపు విలువను హస్తగతం చేసుకోవడంలోనూ, సంచయనం చేయటంలోనూ నూతన రూపాలను ముందుకు తెచ్చారు. వీరి అభివృద్ధి క్రమం కూడా వేరుగా ఉంది. కొందరు భూములను కబ్జా చేసుకుని లేదా పలు రకాల ఇతర వ్యవసాయ, వ్యవసాయాధారిత ఆస్తులు సంపాదించుకొని లేదా ఇతర లాభకరమైన పలు కార్యకలాపాలను సాగించి భూస్వాములుగా మారారు. వీరు సామాజిక పెత్తనాన్ని సాధించుకునేందుకు విద్యా సంస్థలు బాగా తోడ్పడుతున్నాయి. వీరు పంచాయితీరాజ్ సంస్థలు, శాసనసభలు, ఉన్నతాధికార, పోలీసు, న్యాయ యంత్రాంగాలలో ప్రవేశించి బలపడ్డారు. గ్రామీణ ప్రాంతాలలో, బస్తీలలో వివిధ ప్రముఖ పార్లమెంటరీ పార్టీలలో ఆధిపత్యాన్ని సాధించడం ద్వారా రాజకీయాధికారాన్ని కలిగి ఉండడం ఈ నూతన శక్తుల లక్షణం. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో ఈ పాత–కొత్త శక్తులు రాజ్యవ్యవస్థకు మూలస్తంభంగా ఉన్నాయి. ప్రపంచ ద్రవ్య పెట్టుబడి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల ద్వారా గ్రామీణ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడంలో భాగంగా చేపట్టిన పథకాలు ఈ శక్తుల ఆధిపత్యంలోనే ఉన్నాయి. ఈ పథకాల కోసం కేటాయించబడిన వేల కోట్ల రూపాయల్ని,

కోట్లాది ప్రజల పొదుపు సొమ్మును అవి దోచుకుంటున్నాయి. మరో సహకార సంస్థల, మైక్రో ఫైనాన్స్ సంస్థల అమానుష దోపిడీ తీవ్రతరమైంది. ఈ పాత-కొత్త భూస్వామ్య శక్తులు వేతనాల దోపిడీ, కౌలు దోపిడీ, అధిక వడ్డీలు, ధాన్యం గిడ్డంగుల నిర్వహణ, వ్యాపారం వంటి కార్యకలాపాల ద్వారా అనేక విధాలుగా పీడిత ప్రజలను ప్రత్యక్ష దోపిడీ చేస్తున్నాయి.

**3) భూకమతాల వైశాల్యం తగ్గుతూ చిన్న కమతాల సంఖ్య పెరిగిపోవడం:** 2012-13లో ఎన్ఎస్ఎస్ 70వ రౌండ్ గణాంకాల ప్రకారం మొత్తం అంచనా వేయబడిన భూమి 9,23,69,000 హెక్టార్లకు, వ్యవసాయ కుటుంబాలు సగటున కలిగి వున్న భూమి 0.592 హెక్టార్‌కు తగ్గింది. 2002-03లో ఎన్ఎస్ఎస్ 59వ రౌండ్ సర్వేలో ఇవి వరుసగా 10,72,28,000 హెక్టార్లు (మొత్తం భూమి), 0.725 హెక్టార్ (సగటు భూకమతం)గా ఉండేవి. 2012-13లో చిన్న భూకమతాల సంఖ్య 2002-03లో 69.63 శాతం నుంచి 2012-13లో 75.42 శాతానికి, వాటి కింద ఉన్న భూమి పరిమాణం 6 శాతానికి పైగా పెరిగింది. ఇది భూమిపై పెరిగిన జనాభా వత్తిడి ఫలితమే. దీంతో వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడింది.

2010-11 వ్యవసాయ గణాంకాల ప్రకారం దేశంలో 2005-06లో మొత్తం 12.92 కోట్ల భూకమతాలు ఉండగా, అవి 2010-11 నాటికి 7.06 శాతం పెరిగి మొత్తం 13.84 కోట్లకు పెరిగాయి. సాగుభూమి వైశాల్యం 2005-06లో 15.83 కోట్ల హెక్టార్ల నుంచి స్వల్పంగా 0.80 శాతం పెరిగి 2010-11లో 15.96 కోట్ల హెక్టార్లు అయ్యింది. సగటు భూకమతపు సైజు 2005-06లో 1.23 హెక్టార్ ఉండగా 2010-11లో 1.15 హెక్టార్‌కు తగ్గింది. అంటే భూకమతపు వైశాల్యం తగ్గుతూ వున్నది. ఇందులో మహిళా రైతులు సాగు చేసే భూకమతాల సంఖ్య 11.70 శాతం నుంచి 12.78 శాతానికి పెరిగి, వారి చేతిలో సాగుభూమి 9.33 శాతం నుంచి 10.34 శాతానికి చేరుకుంది.

చిన్న (5 ఎకరాలు కన్నా తక్కువగా ఉన్న) భూకమతాల సంఖ్య 83.29 నుంచి 85.01 శాతానికి పెరిగి, 10.76 కోట్ల నుంచి 11.76 కోట్లు అయ్యాయి. వారి చేతిలో సాగుభూమి 41.14 శాతం నుంచి 44.58 శాతానికి పెరిగి 6.1 నుండి 7.11 కోట్ల హెక్టార్లు అయ్యింది.

2010-11 వ్యవసాయ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా మొత్తం వ్యవసాయ భూకమతాల సంఖ్యలో దళితుల వాటా 12.36 శాతం, ఆదివాసుల వాటా 8.68 శాతం, వ్యవసాయ భూకమతాల వైశాల్యంలో వారి వాటా వరుసగా 8.60 శాతం, 11.42 శాతం మాత్రమే.

మొత్తం వ్యవసాయ భూకమతాల్లో దళితుల (అన్ని వర్గాల వారి) చేతిలో వున్న భూకమతాల సంఖ్య 2005-06లో 1.61 నుంచి 2010-11లో 1.71 కోట్లకు పెరిగాయి. వీరి (అన్ని వర్గాల వారి) చేతిలో వున్న భూకమతాల వైశాల్యం 1.33 నుంచి 1.37 కోట్ల హెక్టార్లకు

పెరిగింది. మొత్తం మీద వీరి చేతిలో భూమి సగటున 0.83 హెక్టార్ నుంచి 2010-11లో 0.80 హెక్టార్‌కు తగ్గింది. ఇందులో ఒక ఎకరం కంటే తక్కువ సైజులో వున్న భూకమతాలు 2010-11లో అత్యధికంగా 1.32 కోట్లు ఉండగా వారి చేతిలో వున్న భూమి 0.49 కోట్ల ఎకరాలు మాత్రమే.

మొత్తం వ్యవసాయ భూకమతాల సంఖ్యలో ఆదివాసుల (అన్ని వర్గాల వారి) చేతిలో వున్న భూకమతాల సంఖ్య 2005-06లో 1.03 నుంచి 2010-11లో 1.20 కోట్లకు పెరిగాయి. వీరి (అన్ని వర్గాల వారి) చేతిలో వున్న భూకమతాల వైశాల్యం 1.69 నుంచి 1.82 కోట్ల హెక్టార్లకు పెరిగింది. మొత్తం మీద వీరి చేతిలో కూడా భూమి సగటున 1.64 హెక్టార్ నుంచి 1.52 హెక్టార్‌కు తగ్గింది. ఒక ఎకరం కంటే తక్కువ సైజులో వున్న భూకమతాలు 2010-11లో అత్యధికంగా 0.65 కోట్లు ఉండగా వారి చేతిలో వున్న భూమి 0.31 కోట్ల ఎకరాలు మాత్రమే. మొత్తం మీద చూసినప్పుడు దళితుల, ఆదివాసుల చేతిలో భూకమతాల సంఖ్య, భూమి విస్తీర్ణం స్వల్పంగా పెరుగుతూ వచ్చినప్పటికీ వారి చేతిలోని సగటు భూమి తగ్గిపోయింది. ఆదివాసులు, ఆదివాసేతరుల కంటే దళితుల్లోనే భూమిలేని పేదలు ఎక్కువగా వున్నారు.

మొత్తం మీద చూసినప్పుడు పేద రైతులు చిన్న కమతాలపై ఆధారపడి చేసే వ్యవసాయమే మన దేశంలో ప్రధానంగా ఉంది. రైతాంగం ఈ చిన్న మడిచెక్కలపై ఆధారపడి ఇతరేతర ఎలాంటి ఉపాధిలేక జీవిస్తున్నారు. నిరంతరం చిన్న భూకమతాల సంఖ్య పెరుగుతూ వ్యవసాయ రంగంలో వీటికి ప్రాధాన్యత ఉండడం అనేది అర్ధభూస్వామ్య సంబంధాలకు ఒక ముఖ్యమైన గీటురాయి. దేశంలో సంఘటిత పారిశ్రామిక రంగ అభివృద్ధి అదనపు ఉపాధిని సృష్టించడంలో స్తంభించిపోయి ఉంది. అది చిన్న కుటీర పరిశ్రమలను నాశనం చేసింది. ఈ కారణంగా ఇక్కడ వ్యవసాయంలో మిగులు మనుషులు "కార్మికులు"గా మారే ప్రామాణిక పరివర్తన చోటు చేసుకోవడం కాకుండా గ్రామీణ లేబర్‌లో ప్రబలంగా చోటు చేసుకుంటున్న పరిణామ లక్షణం అర్ధ-కార్మికవర్గంగా మారటం. ఈ "నిర్వాసిత రిజర్వు సైన్యం" మరింతగా అసంఘటిత రంగంలో అనిశ్చితమైన కార్యకలాపాలను ఆశ్రయించాల్సి వస్తున్నది.

భారతదేశంలో ఇప్పటికీ కూడా సంఘటిత పరిశ్రమలు మొత్తం కేవలం 2 శాతం కార్యకలాపాలను మాత్రమే నిర్వహిస్తున్నాయి. అత్యధిక ఉపాధిని కల్పించే అసంఘటిత/చిన్న పరిశ్రమల మూలధనంలో వృద్ధి లేదు. వాటికి బ్యాంకు రుణాలు తగినంతగా లభ్యం కావడం లేదు. వాటిని వివిధ ప్రభుత్వాలు మోసగించాయి. దీంతో అవి ప్రధానంగా సామాన్య సరుకుల ఉత్పత్తికే పరిమితమయ్యాయి. పారిశ్రామిక అభివృద్ధి కుంటుబడింది. వ్యవసాయ సంక్షోభం కారణంగా మిగులు మనుషులుగా మారిన మిగులు రైతులు (వ్యవసాయ కూలీలు, పేద రైతులు) పట్టణాలకు వెళ్లి కార్మికులుగా పరివర్తన చెందలేకపోతున్నారు. అంతిమంగా వీరిలో అత్యధికులు తిండి తదితర అవసరాల కోసం భూస్వాముల, వడ్డీ వ్యాపారుల నుంచి రుణం

తీసుకొని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అప్పులు తీర్చేందుకు భూస్వాముల పొలాల్లో, ఇళ్లలో వెట్టిచాకిరి చేస్తున్నారు. ఈ ధోరణి 'హరిత విప్లవ' ప్రాంతాలైన పంజాబ్, హర్యానా గ్రామాలలో సైతం కనపడుతుంది. భూస్వాములు ఇలాంటి వెట్టిచాకిరి కార్మికులు, కౌలుదార్లను వినియోగించుకొని ఎలాంటి ప్రత్యేక పెట్టుబడి మదుపు పెట్టకుండానే అదనపు విలువను పొందడం సాధ్యమవుతున్నది. లేదా ఈ మిగులు రైతులు తమ చిన్న భూకమతాలపై వ్యవసాయం చేస్తూనే, ఉదరపోషణకై గ్రామీణ వ్యవసాయేతర ఉపాధిపై, పట్టణాలలో వలస వేతన శ్రమపై, చిన్నపాటి సరుకుల ఉత్పత్తిపై, వ్యాపారంపై ఆధారపడాల్సి వస్తున్నది. అలాగే పెట్టుబడిదారీ దేశాలతో పోల్చితే మన దేశంలో పెద్ద భూకమతంలో కూడా ఉత్పత్తి తక్కువగా వుంది. వెనుకబడిన అర్ధభూస్వామ్య ఉత్పత్తి విధానమే దీనికి కారణం. దీని ద్వారా పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి కాదు. ఎందుకంటే లెనిన్ చెప్పినట్లుగా, పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి ఇటువంటి పెద్ద భూకమతాలను సృష్టించడానికి, వాటి ద్వారా చెల్లాచెదురుగా వున్న శ్రమను సామాజీకరించడానికి సంబంధించిన ఎటువంటి ప్రక్రియ కూడా మన దేశంలో వ్యాప్తిలో లేదు. ఇదంతా ఒక అర్ధభూస్వామ్య లక్షణానికి నిదర్శనమే. ఇలాంటి మిగులు రైతులలో భూమి పొందాలనే ఆశ అత్యధికంగా ఉంటుంది.

**4) రైతాంగ వర్గీకరణ:** భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ 2015 జులై 3న విడుదల చేసిన 2011 సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం నిజానికి ఇప్పటికీ దేశంలో 60 శాతం జనాభా గ్రామీణ ప్రాంతం వ్యవసాయం జీవనాధారంగా జీవిస్తున్నారు.

**భూమిలేని, పేద రైతాంగం:** భూమిలేని కుటుంబాలే వ్యవసాయ కూలీలలో మూలస్థంభంగా ఉన్నాయి. గ్రామీణ వర్గ చట్రాన్ని అర్థం చేసుకోవడంలో ఒక ముఖ్యమైన అంశం భూమిలేకపోవడం. గత కొన్ని దశాబ్దాలుగా వాస్తవికంగా భూమిలేనివారి (ఒక ఎకరం కంటే తక్కువ భూమివున్నవారి) సంఖ్య తీవ్రంగా పెరిగిపోయింది. వీరి సంఖ్య 2002-03లో 60.1 శాతం నుంచి 2012-13లో 66.1 శాతానికి పెరిగింది. భూమిలేనివారి సంఖ్య కొన్ని చోట్ల చాలా అధికంగా ఉంది. ఓబీసీలలో సైతం 60 శాతానికి పైగా, పీడక కులాలలో సైతం 25 శాతానికి పైగా (కొన్ని చోట్ల 40 శాతం మంది) భూమిలేనివారున్నారు. వీరికి ఆదాయంలో ప్రధాన భాగం వేతనాల నుంచి వస్తుంది. వేతనశ్రమ పెరిగిపోయి దోపిడీ పెట్టుబడిదారీ రూపం తీసుకున్నట్లుగా పైపైన చూసేవారికి కనిపించే ఈ మార్పు ప్రస్తుతం ఉనికిలో వున్న అర్ధభూస్వామ్య దోపిడీలో భాగమే. ఎందుకంటే ఆధిపత్య కుల భూస్వామికీ, దళిత భూమిలేని శ్రామికుడికి మధ్య వేతన శ్రమ కాంట్రాక్టు అర్ధభూస్వామ్య మూలాన్ని కలిగి ఉంది. ఇది ఒకే సమయంలో ఆర్థిక, ఆర్థికేతర దోపిడీ, పీడనకు ఆధారంగా ఉంది. గ్రామీణ ప్రాంతాలలో ఈ కుల-వర్గ పీడన ఇప్పటికీ ప్రబలంగా ఉంది.

2003-04 ఎన్ఎస్ఎస్ సర్వే ప్రకారం దేశంలో గ్రామీణ కుటుంబాల్లో 31 శాతం మంది

భూమిలేనివారు. 0.4 హెక్టార్లు మాత్రమే భూమి కల్గినవారు 30 శాతం మంది వున్నారు. భూములను భూస్వాములు, వ్యవసాయం చేయని (నాన్ కల్టివేటింగ్) భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రైవేటు కంపెనీలు కబ్జా చేసుకుని ఉన్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ వ్యవసాయం మూలంగా ఈ పరిణామం మరింత వేగవంతం అవుతున్నది.

ఎన్ఎస్ఎస్ 2003 డేటా ప్రకారం దళితుల్లో ఇళ్ల స్థలాలు తప్ప ఎలాంటి ఇతర భూమిలేని పేదలు పంజాబ్, కేరళ, హర్యానాలో ఎక్కువ సంఖ్యలో 80 శాతం వున్నారు. పశ్చిమ బెంగాల్‌లో 46.5 శాతం దళితులకు ఇళ్ల స్థలాలు తప్ప భూమిలేదు. 1993-94 మరియు 2004-05 మధ్యలో దేశంలో భూమిలేని పేదల సంఖ్య 10.6 శాతం పెరిగింది. కేరళ, జమ్ము-కశ్మీర్, అసోంలో తప్ప దేశంలో అన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ భూమిలేని రైతాంగం శాతం పెరిగింది. హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో 1992-93 నుండి 2004-05 మధ్య పెరిగిన జనాభా ప్రాతిపదికన చూస్తే భూమిలేని రైతుల శాతం 11.6 శాతం పెరగగా, షెడ్యూల్ తెగల కుటుంబాలు 10.4 శాతం, దళితుల్లో 8.7 శాతం పెరిగింది. భూసంస్కరణలలో పంపిణీ చేసిన భూమిని తమ యజమాన్యం కిందికి తెచ్చుకొని సాగుచేసుకోవడంలో ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీలు తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నారు. ఆ భూములను చాలా వరకు భూస్వాములే తిరిగి కబ్జా చేసుకున్నారు. అంటే గ్రామీణ ప్రాంతంలో భూమిలేని పేదల పరిస్థితి మరింత దిగజారింది.

2015 సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం దేశవ్యాప్తంగా 17 కోట్ల 94 లక్షల గ్రామీణ కుటుంబాలలో భూమిలేని కుటుంబాల సంఖ్య ఆరు కోట్ల 87 లక్షలు, అంటే 38.3 శాతం. దేశంలో వున్న 3.30 కోట్ల దళిత కుటుంబాలలో 1.80 కోట్ల కుటుంబాలు, అంటే 54.6 శాతం భూమిలేని కుటుంబాలు. 2017 జనవరి-జూన్‌లో జరిగిన నాబార్డ్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూషన్ సర్వే ప్రకారం దేశంలోని గ్రామీణ కుటుంబాలలో 5 ఎకరాల కంటే (2 హెక్టార్ల కంటే) తక్కువ భూమి వున్న పేద రైతుల సంఖ్య 87 శాతం, అంటే సంఖ్య రీత్యా ఈ పేద రైతుల సంఖ్య 12 కోట్ల 60 లక్షలు. అంటే 9 కోట్ల 18 లక్షల కుటుంబాలు (50.1 శాతం) రోజువారీ శారీరక శ్రమ ద్వారా పొట్టపోసుకుంటున్నారు. మిగిలిన కుటుంబాలలో ఇంటి పనిచేసేవి 2.4 శాతం, చెత్త ఏరుకునేవారుగా 0.23 శాతం, బిచ్చగాళ్లుగా 0.37 శాతం ఉన్నాయి. అంటే మొత్తం 54.38 శాతం కుటుంబాలకు ఏ పూటకు ఆ పూట గడవడమే గగనంగా ఉంది. వ్యవసాయంపై ఆధారపడి వున్న విశాల శ్రామికశక్తి స్తబ్దతలో చిక్కుకుపోయింది.

భూమిలేని శ్రామికులు జనసాంద్రత తక్కువగా ఉన్న మెట్ట ప్రాంతాలలో కన్నా జనసాంద్రత అధికంగా ఉన్న మాగాణి ప్రాంతాలలో అధికంగా ఉన్నారు. అయితే వ్యవసాయ కూలీలకూ పేదరైతులకు మధ్య విభజన రేఖ గీయటం కష్టం. వ్యవసాయ కూలీలలో అత్యధికులు దళితులే. అయితే ఇతర పీడిత కులాల వారితో పాటు పీడక కులాలలోని ఒక సెక్షన్ ఇందులో భాగమైంది.

ఇందులో సగభాగం మహిళలు. వ్యవసాయ పనులలోనే కాక, ఇటుక తయారీ, నిర్మాణరంగం వంటి వ్యవసాయేతర పనులలో మహిళలు గణనీయంగా కూలికి పనిచేస్తున్నప్పటికీ పురుషులతో పోల్చుకుంటే వీరికి వేతనం ఇప్పటికీ చాలా తక్కువగా ఉంటోంది. వస్తురూపంలో (ధాన్యం, భోజనం రూపంలో) ఇచ్చే వేతనాలు పలు ప్రాంతాలలో ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

వ్యవసాయ కూలీలు మూడు రకాలుగా ఉన్నారు: 1. తమ శ్రమశక్తిలో కొంతభాగాన్ని సీజనల్  వ్యవసాయ కార్మికులుగా అమ్ముకుని తమ లోటును పూడ్చుకుంటున్నారు. ఒక సెక్షన్ కొన్ని మామూలు వ్యవసాయ సాధనాలు కలిగి ఉండి సన్నకారు రైతులుగా చిన్న చిన్న కమతాలను, తోటలను సాగుచేస్తున్నారు. కౌలు వ్యవసాయం చేస్తున్నారు. 2. భూమి, పనిముట్లు లేనివారు పూర్తిగా శ్రమశక్తిని అమ్ముకుని బతుకుతున్నారు. 3. పూర్తిగా పనులు దొరకనివాళ్లు, నిరుపేదలు సీజనల్‌గా దొరికే ఏవో క్యాజువల్ పనులు చేసేందుకు పట్టణ ప్రాంతాలకు క్రమంగా వలసవెళు తున్నారు.

వ్యవసాయ రంగంలో పలు ప్రాంతాలలో సాగు పద్ధతులలో అనేక మార్పుల కారణంగా యంత్రాల వినియోగం బాగా పెరిగింది. సాగునీటి సౌకర్యాలు లేకపోవడం వల్ల వ్యవసాయంలో ఒకే పంట తీసే విధానం ఇంకా ప్రబలంగానే ఉంది. దీంతో వ్యవసాయ కూలీలకు ఉపాధి దొరకడం చాలా తక్కువగా ఉంది. కాంట్రాక్టు పనులు ఎక్కువయ్యాయి. వ్యవసాయేతర రంగాలలో సైతం ఉపాధి అవకాశాలు చాలినంతగా లేవు. కొద్దిపాటిగా వున్న అవకాశాలు కూడా పురుషుల కన్నా మహిళలకు తక్కువగా ఉంటున్నాయి. వార్షిక పనిదినాలు పురుషులకు సగటున మూడు మాసాలు, మహిళలకు మరింత తక్కువగా సగటున 70 రోజులు దొరుకుతున్నాయి. ప్రభుత్వ ఉపాధి గ్యారంటీ పథకం–మన్‌రేగా అమలులో ఉన్నప్పటికీ వీటికి ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉండడం, కేటాయించినవాటిని పూర్తిగా విడుదల చేయకపోవడం, ఖర్చు చేయకపోవడం వల్ల గ్రామాలలో ఉపాధి సంక్షోభాన్ని అది పరిష్కరించలేకపోతున్నది. ఈ పథకం కింద 25,000 కోట్ల రూపాయలకు పైగా బకాయిలు శ్రామిక ప్రజలకు చెల్లించలేదు. ఉపాధి పథకం కింద నిర్ణయించిన వేతనాలు కనీస చట్టబద్ధ వేతనాల కన్నా తక్కువగా ఉన్నాయి. ఈ వేతనాలు పెరగకుండా, ఈ పథకం ఉపాధి గ్యారంటీ పథకంగా అమలు కాకుండా గ్రామాలలో భూస్వామ్య శక్తులు అడ్డుకుంటున్నాయి.  ఈ పథకం గ్రామీణ పేదలకు 100 రోజుల ఉపాధిని సమకూర్చింది కేవలం 10 శాతానికి లోపు కుటుంబాలకు మాత్రమే. 100 రోజులు పని లభించినప్పటికీ తక్కువ ఆదాయంతో వ్యవసాయ కూలీల జీవన అవసరాలు తీరవు. వారు దారిద్ర్యరేఖను దాటాలంటే ఏడాదిలో కనీసం 300 రోజులకు పైగా ఉపాధి లభించాలి. ఇది అసాధ్యంగా మారింది.

గ్రామీణ పేదలలో కొందరు ప్రభుత్వ పథకాలను ముఖ్యంగా సమీకృత బాలల వికాస సేవా (ఐసీడీఎస్) పథకాలు, మధ్యాహ్న భోజన పథకం మొదలైన పథకాలను ఉపయోగించుకొని

అంగన్‌వాడీ వర్కర్లుగా, సహాయకులుగా, జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం (ఎన్‌ఆర్‌హెచ్‌ఎం) కింద ఆశా వర్కర్లుగా జీవనోపాధి సంపాదించుకుంటున్నారు. ఇందులో మహిళలు చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నారు. వీరు ప్రధానంగా పార్ట్‌టైం ఉద్యోగులే. అయినా ఉపాధి సంక్షోభంలో చిక్కుకున్న గ్రామీణ ప్రాంతాలలో కొందరికి వీటిలో ఉపాధి దొరుకుతున్నది. అయితే అతితక్కువ వేతనాలతో వీరు నిరంతరం సతమతమవుతూ ప్రభుత్వంతో పోరాటాలకు దిగడం ప్రస్తుతం దేశవ్యాప్తంగా కనపడుతున్నది. వీరి సమస్య ప్రధానంగా భూమి సమస్యతో ముడిపడి ఉంది.

గ్రామీణ ప్రాంతాలలో జీతగాళ్ల వ్యవస్థ పూర్తిగా రద్దు కాలేదు. విశాల 'గ్రామీణ నిరుద్యోగ సైన్యం' దీనికి హామీ ఇస్తోంది. సంవత్సరానికీ, నెలకూ వ్యవసాయ, వ్యవసాయేతర పనులలో, ఇంటి పనులలో పెట్టుకొని వెట్టి చేయించుకోవడం గుట్టుచప్పుడు కాకుండా అంతటా కొనసాగుతూనే ఉంది. అయితే వెట్టి పాత రూపాలలో లేదు.

భూమిలేని (వ్యవసాయ కూలీలతో సహా), పేద రైతులలో "భూమి కోసం డిమాండ్" పెరుగుతున్నది. భూస్వామ్య శక్తులు భూమిని, పరపతిని, మార్కెట్‌ను, ఉత్పదకాల విషయంలోనూ, పండిన పంట విషయంలోనూ కంట్రోల్ చేస్తూ, భూమిలేని, పేద రైతు వర్గం నుంచి పెద్ద మొత్తంలో అదనపు విలువను దోచుకుంటున్నాయి.

**దిగువ మధ్యతరగతి రైతులు:** సాగుదార్లలో దిగువ మధ్యతరగతి రైతులు 5 శాతంగా ఉంటారు. వీరి వద్ద తగినన్ని ఉత్పత్తి సాధనాలు లేవు. ఇది భూస్వామ్య దోపిడీ కోరల్లో చిక్కుకొని వున్న వర్గం. విదేశీ గుత్త పెట్టుబడి, దేశీయ దళారీ పెట్టుబడి దాడికి తీవ్రంగా గురవుతున్న వర్గం. వ్యవసాయం నుంచి చాలీచాలని ఆదాయాన్నే పొందుతున్నారు. మొత్తం మీద చూస్తే వ్యవసాయ కుటుంబాలలో భూస్వాములు, ధనిక రైతులు మినహా అత్యధిక కుటుంబాలు వ్యవసాయం నుంచి మిగులును పోగుచేసుకోగల శక్తి వున్న వర్గంగా ఏదీ లేదనేది వాస్తవం. దివాలాతీసిన రైతులు పొట్ట చేతబట్టుకొని పట్టణాలకు వలసపోవడం బాగా పెరిగింది.

**ఎగువ మధ్యతరగతి రైతులు:** నేడు వ్యవసాయంలో ఎగువ మధ్యతరగతివారు రెండు శాతం ఉంటారు. వీరి వద్ద ఉత్పత్తి సాధనాలు తగినన్ని ఉన్నాయి. వీరిలో ఒక సెక్షన్ వ్యవసాయం నుంచి మిగులును పోగు చేసుకుంటుంది. ఒక మేరకు స్థిరమైన ఆదాయం పొందుతున్నది. అయితే ఈ వర్గం కూడా గణనీయమైన సంఖ్యలోనే ప్రపంచీకరణ కారణంగా చితికిపోతున్నది. భూములు కోల్పోతున్నది. భూమిలేని, పేద రైతాంగంలో చేరిపోతున్నది. వ్యవసాయ సంక్షోభంతో దెబ్బతిని ఆత్మహత్యలు చేసుకునేవారిలో ఈ వర్గం వారు గణనీయమైన సంఖ్యలోనే ఉంటున్నారు.

**ధనిక రైతులు:** వీరు రైతాంగంలో 0.24 శాతం ఉంటారు. ఈ వర్గం ఉత్పత్తి సాధనాలు, ప్రత్యేకించి భూమి, ఇతర ఉత్పాదక ఆస్తులు కలిగి ఉంది. ప్రపంచీకరణ విధానాల నుండి ఒక సెక్షన్ లాభాలు పొందుతున్నది. వనరులను ఉపయోగించుకుంటూ మార్కెట్ల మీద అదుపును

సంపాదిస్తూ మెరుగైన ధరలు నిర్ణయించి వ్యవసాయోత్పత్తుల నుండి అధిక లాభాలు సాధిస్తున్నది. వీరిలో ఒక సెక్షన్ గ్రామాల్లో, చిన్న పట్టణాలలో ఇటీవలి కాలంలో చిన్న, మధ్యతరహా వస్తు తయారీ, వ్యవసాయ ఉత్పత్తులు, రియల్ ఎస్టేట్, నిర్మాణరంగం, వ్యాపారాలు, సేవారంగం, అద్దెలు తదితరాల ద్వారా ఆస్తులు సంపాదించి, భూస్వామ్య శక్తులతో కలిసి అధికారం చెలాయిస్తున్నారు. ప్రపంచీకరణ తర్వాత వీరు ప్రభుత్వ పథకాలు, కాంట్రాక్టులు, రాయితీల ద్వారా నేరుగా లబ్ధి పొందుతున్నారు. ప్రపంచీకరణ కాలంలో సంస్థాగత రుణాలు రైతులకు తగ్గిపోవడంతో వీరిలో ఒక సెక్షన్ మైక్రో ఫైనాన్స్‌ల ద్వారా వడ్డీ వ్యాపారులుగా ఆవిర్భవించారు. అయితే గ్రామీణ బూర్జువాజీగా పెట్టుబడిదారీ మార్పును సాధించే లక్షణాలు వీరికి లేవు. ఈ వర్గంలో కూడా ఒక చిన్న సెక్షన్ ప్రపంచీకరణ దాడిలో చిక్కుకొని నలిగిపోతున్నది, వికృత పెట్టుబడిదారీ సంబంధాలు పెరిగిపోవడం వల్ల ఈ వర్గం దిగువ స్థాయికి నెట్టబడుతున్నది.

**5) వడ్డీ వ్యాపారుల దోపిడీ:** 1997 నుంచి గ్రామీణ ప్రాంతాలలో బలహీన వర్గాలను విస్మరించి, వ్యాపార లాభనష్టాల ప్రాతిపదికన పలు గ్రామీణ బ్యాంకులను మూసివేసారు. ఫలితంగా బ్యాంకు రుణాలు కార్పొరేట్ వ్యవసాయ రంగానికీ, భూస్వాములకు, ధనిక రైతులకు, కొద్దిగా మధ్యతరగతి రైతులకు తప్ప చిన్న, సన్నకారు, మెజారిటీ మధ్యతరగతి రైతాంగానికి లభించడం లేదు. దీంతో వ్యాపార పంటలు పండించే రైతులు ఖరీదైన ఉత్పాదకాల (inputs) కోసం భూస్వాముల, మార్కెట్ వ్యాపారుల, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దోపిడీకి బలవుతున్నారు. 2016లో ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన డాటా ప్రకారం వ్యవసాయ కుటుంబాల మొత్తం రుణాలలో 58 శాతం సంస్థాగతమైనవి (42.9 శాతం బ్యాంకుల నుండి, 14.8 శాతం సహకార సంఘాల నుండి). 42 శాతం రుణాలు భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, ధాన్యం వ్యాపారుల నుంచి వచ్చాయి. బ్యాంకు రుణాలు ఒక హెక్టారు కంటే తక్కువ భూమి ఉన్న కుటుంబాలకు 15 శాతం మాత్రమే అందగా, 10 హెక్టార్ల (25 ఎకరాలు) కంటే ఎక్కువ భూమి ఉన్న వర్గానికి 79 శాతం అందాయి. పేద రైతులకు 85 శాతం రుణాలు భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, ధాన్యం వ్యాపారుల నుంచే వస్తాయి. అందువల్ల వారికి రుణమాఫీలు వర్తించవు. నాబార్డ్ డాటా ప్రకారం 52 శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోయాయి. ఈ కుటుంబాలకు సగటున 1 లక్ష రూ. అప్పు ఉంది. పంటల బీమా విషయానికి వస్తే 90 శాతం వ్యవసాయ కుటుంబాలకు కనీసంగానైనా బీమా పథకం అందుబాటులో లేదు. అమలులో వున్న బీమా పథకంలో సైతం 75 శాతం ప్రీమియంను దోచుకుంటున్నారు. ఈ బీమా పథకం వల్ల బ్యాంకు రుణాలు పొందగలిగే భూస్వాములు, ధనిక రైతులే అధికంగా ప్రయోజనం పొందారు. మరోవైపు సంస్థాగత, ప్రైవేటు రుణాల కోసం పిండే అత్యధిక వడ్డీ రేట్లు పేద రైతుల మూలుగల్ని పీలుస్తున్నాయి. వీరిలో ఎంతోమంది అసలు కంటే రెట్టింపు వడ్డీ చెల్లించినా తమ అప్పులు తీరటం లేదు. ఈ విధంగా వ్యవసాయంలో

సృష్టించబడిన మిగులులో అధిక భాగం బ్యాంకుల/సహకార సంస్థల, వడ్డీ వ్యాపారుల, షావుకార్ల నిరంకుశ అదుపులో ఉంది. దీంతో ఉత్పత్తి రంగంలో పెట్టుబడి సంచయనం కాకుండా ఆటంకం ఏర్పడుతోంది. పెట్టుబడిదారీ పునరుత్పత్తి షరతు అమలు ఊసే ఉండడం లేదు.

**6) పెద్దెత్తున కొనసాగుతున్న కౌలు వ్యవసాయ దోపిడీ:** ప్రపంచీకరణ కాలంలో వ్యవసాయంలో మిగులు మనుషులుగా మారిన రైతులలో ఒక సెక్షన్ కౌలుదార్లుగా మారి పొట్టపోసుకోవడం కనపడుతుంది. వివిధ పరిస్థితులలో సాధారణ రైతుల మధ్య కూడా ఒకరి భూములు మరొకరు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేయడం కూడా కనపడుతుంది. అయితే ప్రధానంగా వ్యవసాయంలోని 'అదనపు శ్రమశక్తి' నైపుణ్యంలేని శ్రమ కావడం, ఈ శ్రమను సైతం ఇముడ్చుకునే స్థితి వ్యవసాయానుబంధ రంగానికి గానీ, పట్టణాల్లోని మాన్యుఫాక్చరింగ్, సర్వీసు రంగాలలో అసంఘటిత రంగానికి గానీ లేకపోవడం, పట్టణ పేదరికం కూడా పెరిగిపోవడంతో పట్టణాలకు వలసపోయినవారు తిరిగి గ్రామాలకు రాక తప్పనిస్థితి ఏర్పడుతోంది. దీంతో వ్యవసాయ కూలీ కుటుంబాలు, పేద రైతులు ఉపాధి అవకాశం లేకపోవడం వల్ల అధిక కౌలురేటుకు భూస్వాముల, ధనిక రైతుల భూములను కౌలుకు తీసుకోక తప్పనిస్థితి ఏర్పడింది. దేశంలో గ్రామీణ ప్రాంతాలలో అర్ధభూస్వామ్య దోపిడీ ప్రబలంగా ఉందనడానికి కౌలు వ్యవసాయమే నిదర్శనం. వీరికి బ్యాంకుల రుణ సదుపాయం అంతంత మాత్రమే. వడ్డీవ్యాపారుల దోపిడీ, మార్కెట్‌లో వ్యాపారుల దోపిడీ వల్ల అత్యధికంగా కౌలు రైతులే నష్టపోతున్నారు. ఆత్మహత్యలు చేసుకునే రైతులలో అత్యధికులు కౌలు రైతులే.

ప్రపంచీకరణ వలన కౌలు కాంట్రాక్టు రూపాలలో కూడా మార్పులు వచ్చాయి. సరికొత్త కౌలు రూపాలు ఉనికిలోకి వచ్చాయి. అత్యధిక ఉత్పాదకత, యాంత్రీకరణ అధికంగా ఉన్న ప్రాంతాలలో కౌలు దోపిడీ తీవ్రంగా ఉంది. పేద రైతాంగం ప్రత్యేకించి దళిత తదితర సెక్షన్ అధిక కౌలురేటు ద్వారానే కాకుండా ఉత్పత్తి, పరపతి, ఇన్‌పుట్ మార్కెట్‌కు మధ్య గల అంతర్గత సంబంధంతో ఏర్పడిన అసమాన మారక యంత్రాంగం ద్వారా కూడా దోపిడీకి గురవుతున్నది. భూస్వాములు, ధనిక రైతులు కూడా కౌలు వ్యవసాయం చేస్తున్నప్పటికీ సాపేక్షికంగా తేలికైన షరతులపైన వారికి భూములు లభిస్తున్నాయి. ప్రత్యేకించి పేదరైతులు సొంత ఉత్పత్తి సాధనాలు, పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, కాలువలు లేకపోవడం, బోరు బావులపై ఆధారపడాల్సి రావడం వల్ల సాగునీటికై అధిక ఖర్చు పెట్టలేక తమ భూములను అయినకాడికి కౌలుకు ఇస్తున్నారు. దీంతో ఈ 'ఎదురు కౌలు' విధానం వల్ల కూడా భూస్వాములు, ధనిక రైతులు అత్యధిక లాభాలు ఆర్జిస్తున్నారు. అంటే పేద రైతాంగం కౌలుదార్లుగానే కాకుండా, 'ఎదురుకౌలు' విధానం ద్వారా కూడా భూస్వామ్య దోపిడీకి గురవుతున్నారు.

1999లో బిహార్‌లో చేసిన ఒక అధ్యయనం ప్రకారం కౌలు వ్యవసాయం 12 శాతం, పాలు వ్యవసాయం 40 శాతం కొనసాగుతోంది. 2012-13 ఎన్ఎస్ఎస్ 70వ రౌండు సర్వే

మొదటి రౌండు గణాంకాల ప్రకారం, 1971లో మొత్తం భూమిలో కౌలుకు తీసుకున్న భూమి 12 శాతం ఉండగా, 2003లో 7 శాతానికి తగ్గింది. అయితే ఇది 2012-13లో గణనీయంగా తిరిగి 12 శాతానికి పెరిగింది. 2012-13లో బిహార్, ఆంధ్రప్రదేశ్, పంజాబ్ వంటి రాష్ట్రాలు వరుసగా 25 శాతం కంటే అధికంగా, ఒడిశా, హర్యానా, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో 15 శాతం కంటే అధికంగా సాగుభూమిని కౌలుదారీ విధానం కింద నమోదు చేసుకున్నాయి. పలువురు విద్యావేత్తల గ్రామ అధ్యయనాలు కూడా ఇదే విషయాన్ని ధృవీకరించాయి. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లే తక్కువగా 3.51 శాతం, 4.18 శాతం భూమిని కౌలు భూమిగా నమోదు చేసుకున్నాయి. భూస్వాములు కౌలుదారీ హక్కులను గుర్తించడానికి ఇష్టపడరు. కౌలుదార్లు సైతం అధికారిక సర్వేయర్లకు వాస్తవాలను వెల్లడించరు. ఈ విషయం తెలిస్తే భూస్వాములు తమను భూమి నుంచి తొలగిస్తారనే భయం వారికి ఉంటుంది. అందువల్ల కౌలుదార్ల అసలు సంఖ్య గణాంకాలకూ అందడం లేదనేది వాస్తవం.

70వ రౌండు ఎన్ఎస్ఎస్ డాటాను నిర్దిష్టంగా పరిశీలిస్తే మొత్తం కౌలుదారు కుటుంబాలలో 57.7 శాతం భూమిలేని కుటుంబాలు, 34.91 శాతం సన్న, చిన్న రైతు కుటుంబాల నుంచి, 7.39 శాతం మధ్యతరగతి కుటుంబాలు ఉన్నాయి. అంటే 92.61 శాతంగా ఉన్న భూమిలేని, స్వల్ప మరియు చిన్న భూకమతాలు ఉన్న కుటుంబాలు కౌలు వ్యవసాయంలో అత్యధికంగా దోపిడీకి గురవుతున్నాయి. మొత్తం కౌలుకు ఇచ్చిన భూమిలో (98,53,649 హెక్టార్లు) ఈ కుటుంబాలు 2012-13లో 15.10 శాతం భూమిని కౌలుకు తీసుకోగా, 2002-04లో ఇది 3.04 శాతంగా ఉండింది. వీటిని "శుద్ధ కౌలుదార్ల" కుటుంబాలు అని పిలిచారు. స్వల్ప, చిన్న భూకమతాలు కలిగి వున్న కుటుంబాలు వరుసగా 22.37 శాతం, 24.94 శాతం భూమిని కౌలుకు తీసుకున్నాయి. అందువల్ల, సగటున కౌలు భూమిలో దాదాపు 63 శాతం భూమిని భూమిలేని, స్వల్ప మరియు చిన్న భూకమతాలు కలిగివున్న కుటుంబాలు కౌలుకు తీసుకున్నాయి. భూమిలేని (వ్యవసాయ కూలీలతో సహా), స్వల్ప మరియు చిన్న భూకమతాలు కలిగివున్న కుటుంబాలలో భూమి ఆవశ్యకత ఎంత అధికంగా వుందో దీని ద్వారా స్పష్టమవుతుంది. 2 నుంచి 4 హెక్టార్ల భూ కమతాలు కలిగివున్న మధ్యతరగతి రైతులు మొత్తం కౌలుకు తీసుకున్న భూమిలో 19.64 శాతం భూమిని కౌలుకు చేస్తున్నప్పటికీ, ఆసక్తికరంగా ఈ వర్గంలో 2 నుంచి 3 హెక్టార్ల భూ కమతాలు కలిగివున్న కుటుంబాలు మధ్యతరగతి రైతులు మొత్తం కౌలుకు తీసుకున్న భూమిలో దాదాపు 70 శాతం భూమిని కౌలుకు చేస్తున్నాయి. మొత్తంగా చూస్తే వ్యవసాయ చట్రంలో ప్రత్యేకించి సంస్కరణానంతర కాలంలో "కౌలుదారీ విధానం పునరుద్ధరించబడడం" కనపడుతుంది.

కౌలు మార్కెట్‌లో పేద రైతులు భూమిని రెండు విధాలుగా కౌలుకు తీసుకుంటున్నారు: కాంట్రాక్టుకు, కౌలుకు. పేద రైతుల తర్వాత మధ్యతరగతి రైతు కుటుంబాలు కాంట్రాక్టులలో

30 శాతం వాటా, కౌలుకు తీసుకోవడంలో సైతం దాదాపు 30 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ధనిక రైతు కుటుంబాలలో కేవలం 7.14 శాతం కుటుంబాలు సుమారు 15 శాతం భూమిని కౌలుకు తీసుకుంటున్నాయి. ప్రస్తుతం అత్యధిక ప్రాంతాలలో అత్యధిక భూమిలేని, పేద రైతులు మౌఖికంగా భూమిని కాంట్రాక్టు తీసుకొని వ్యవసాయం చేయిస్తున్నారు. అంటే ప్రభుత్వ లెక్కలలో వీళ్లు భూ యజమానులు కూడా కాదు, భాగస్వాములు కూడా కాదు, వాటాదార్లు కూడా కాదు. ఇక వీరి కట్టుబానిసత్వాన్ని అంచనావేసుకోవచ్చు.

మరో ముఖ్య పరిణామం, దేశవ్యాప్తంగా 1980ల నుంచి "వ్యవసాయం చేయని రైతు కుటుంబాలు" (నాన్ కల్టివేటింగ్ పీసెంట్స్ హౌస్‌హోల్డ్స్-ఎన్.సి.పి.హెచ్.) కౌలు మార్కెట్‌లో ప్రాధాన్యత సంతరించుకోవడం. మొత్తం వ్యవసాయం చేయని కుటుంబాలలో ఎన్.సి.పి.హెచ్. శాతం 1981లో 19.1 శాతం నుంచి 2002లో దాదాపు 37 శాతానికి పెరిగింది. అదే సమయంలో, ఎన్.సి.పి.హెచ్. కలిగివున్న భూమి శాతం 3.8 శాతం నుండి 9.8 శాతానికి పెరిగింది. అవి భూమిని కౌలుకు ఇస్తున్నాయి. ఈ విధంగా ఎన్.సి.పి.హెచ్. కుటుంబాలు పెరగడం వల్ల కౌలుదారీ విధానపు ప్రాధాన్యత పెరిగింది/పెరుగుతున్నది.

పాత, కొత్త కౌలుదారీ చట్టాలు కౌలుదార్లకు ఒనగూర్చిందేమీ లేదు. భూస్వాములు కౌలు రైతులను భూమి నుండి ఎప్పుడైనా వెళ్లగొట్టవచ్చు. భూమి కౌలు మొత్తం పంట ఉత్పత్తిలో 1/5 నుంచి 1/4వ వంతుకు మించకూడదనే కౌలుదారీ చట్టం నామమాత్రంగా మారిపోయింది. కౌలు రేట్లు 1/3 నుంచి 2/3వ వంతు వరకు పెరిగినా, అంటే కౌలు ఒప్పందాలు చట్టాన్ని ఉల్లంఘించినా పట్టించుకునే నాథుడే లేడు. అసలు ఏ కౌలు ఒప్పందమూ చట్ట ప్రకారం రాతపూర్వకంగా ఉండదు. ఈ ఒప్పందాలు బానిస యజమాని-బానిస సంబంధాలను నెలకొల్పడం ద్వారా భూస్వాములు, లేదా ధనిక రైతులచే అమలవుతున్నాయి. దీనివల్ల కౌలు రైతులు కట్టుబానిసలుగా పనిచేయాల్సి వస్తున్నది. ఇందులో కౌలుదార్ల నుంచి దోచుకున్న మిగులులో ఒక భాగాన్ని ప్రైవేటుగా రాజ్య ఏజెన్సీలు తస్కరిస్తున్నాయి. ఇది రాజ్యం ఈ ఏజెన్సీలకు ఇచ్చే నిధుల కంటే అధికంగా ఉంటుంది. రాజ్య ఏజెంట్లు ప్రత్యక్షంగా బలప్రయోగానికి సైతం దిగి అత్యంత క్రూరంగా మిగులును దోచుకునే రూపాన్ని అమలు చేస్తున్నారు. ఇటువంటి ఉదాహరణలు గ్రామంలోని ఆధిపత్య భూస్వామ్య వర్గానికీ, రాజ్య అంగాలకూ మధ్య వున్న కుమ్మక్కు ధృవీకరిస్తున్నాయి. అంటే అర్ధభూస్వామ్య వ్యవస్థలో రాజ్యాధికారం గ్రామంలోని భూస్వామ్య శక్తులు, ప్రభుత్వ-పోలీసు-న్యాయ అంగాలతో పెనవేసుకొని ఉందనేది దీని ద్వారా కూడా స్పష్టమవుతుంది.

**7) వ్యవసాయంలో పెట్టుబడి సంచయనం తక్కువగా ఉండడం:** 1980ల నుంచి వ్యవసాయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మదుపు పెట్టడం అనేది ఆర్థిక వ్యవస్థలో మొత్తం మదుపుతో పోల్చి చూస్తే గణనీయంగా తగ్గింది. ఆర్థిక వ్యవస్థలో మొత్తం పెట్టుబడి

సంచయనంలో దాని వాటా 20వ శతాబ్దం చివరి నాటికి 18 శాతం నుండి 6 శాతానికి పడిపోయింది. దళారీ పాలకులు రైతు దేశానికి వెన్నుముక అని చెబుతూనే వ్యవసాయ రంగంపై మదుపు 5వ పంచవర్ష ప్రణాళికలో 16 శాతం ఖర్చు చేయగా, 11వ పంచవర్ష ప్రణాళికలో 5 శాతంతో సరిపెట్టారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలలో పెట్టిన మొత్తం పెట్టుబడి 2012-13లో 16.5 శాతం నుండి 2017-18 నాటికి 15.2 శాతానికి పడిపోయింది. సామ్రాజ్యవాద నిర్దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు ద్రవ్య విధానాలు దీనికి ఒక ముఖ్య కారణం. అది ప్రైవేటు మదుపులో వృద్ధినీ మొత్తం మదుపులో వృద్ధినీ దెబ్బతీసింది.

అలాగే భూస్వామ్య, ధనిక రైతు వర్గాలు తాము కొల్లగొట్టిన మొత్తం అదనపు విలువలో సగటున సుమారు 10.5 శాతం మాత్రమే వ్యవసాయంలో తిరిగి మదుపు పెడుతున్నాయి. అంటే వ్యవసాయంలో ఉత్పత్తి మదుపులోకి అదనపు విలువ మొత్తం తిరిగి వచ్చి చేరడం లేదు. అదనపు విలువలో ప్రధాన భాగం అనుత్పాదక రంగంలో, అంటే వడ్డీ వ్యాపారం మరియు పంటల వ్యాపార రంగంలో తిరిగి మదుపు పెడుతున్నారు. అలాగే వడ్డీ వ్యాపార, వాణిజ్య పెట్టుబడి రైతుల వ్యవసాయోత్పత్తులను/సరుకును కబ్జా చేసుకుంటుంది కానీ ఉత్పత్తి ప్రక్రియను కాదు. ఈ ప్రక్రియ రైతులను అర్ధభూస్వామ్య సంబంధాలలో బంధించి ఉంచుతుంది. వారి శ్రమశక్తిపై నియంత్రణ సంపాదించి వారిని కార్మికులుగా మార్చదు.

మరో విషయం, వ్యవసాయ కార్మికులు, సన్నకారు, చిన్న, మధ్యతరగతి రైతులు కూలీ చేసే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయంలో కార్మిక శ్రమను దోపిడీ చేయడం ద్వారా అదనపు విలువను సంపాదించుకోవడం ప్రధాన పద్ధతిగా మారిందనే నిర్ణయానికి వస్తున్నారు. వేతన శ్రమ పెరగడం అనేది పెట్టుబడిదారీ లక్షణం కావచ్చు కానీ అదొక్కటే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో నిర్ణయాత్మకమైంది కాదు. ఎన్ఎస్ఓ గణాంకాల ప్రకారం ప్రస్తుతం మొత్తం వ్యవసాయ శ్రమలో వ్యవసాయ కూలీల శ్రమ పరిమాణం తక్కువైంది. కుటుంబ శ్రమ పరిమాణం 64.2 శాతానికి పెరిగింది. దీనికి కారణం రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం. దీంతో వారు వ్యవసాయంలో వ్యవసాయ కూలీలపై పెట్టే ఖర్చు తగ్గించి కుటుంబ శ్రమ పరిమాణాన్ని పెంచాల్సివచ్చింది.

భూమిపై పెరుగుతున్న జనాభా ఒత్తిడి, వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో పాటు మదుపు పెట్టలేని స్థితి తోడై భూకమతాల విభజనకు దారితీసింది. 1990ల ప్రారంభం నుంచి వ్యవసాయోత్పత్తి దెబ్బతినడం మొదలైంది. గత మూడు దశాబ్దాలలో ఉత్పత్తిలో వృద్ధి కూడా స్తబ్ధతకు గురైంది. భూకమతాల విభజన పెరగడం అనేది పెట్టుబడి సంచయనం తక్కువగా ఉండడాన్ని సూచిస్తుంది. అలాగే వ్యవసాయ ఆర్థిక చక్రంలో చిన్న స్థాయి వ్యవసాయం, నాన్-ఫారం లఘు ఉత్పత్తి ప్రాబల్యం, విరామం లేకుండా వ్యవసాయ కూలీలు (లేబర్) వివిధ పనుల కోసం మారుతుండడం అధికంగా ఉంది. ఇది వ్యవసాయంలో పెట్టుబడిదారీ అభివృద్ధికి

ఆటంకం అవుతున్నది.

నిజానికి మార్కెట్‌లో అమ్మకమైన అదనపు ఉత్పత్తి (surplus) వాటా పరంగా చూసినప్పుడు, మార్కెట్‌పై చిన్నతరహా వ్యవసాయోత్పత్తి ఆధిపత్యం ఉంది. అయినప్పటికీ వ్యవసాయం, వేతనాలు, పాడిపశువులు, చిన్నపాటి ఉత్పత్తులు మొదలైన వనరులన్నింటి నుంచి రైతులకు వచ్చే సగటు ఆదాయం వారి సగటు వినియోగం కంటే తక్కువగా ఉంది. ఇది అర్ధభూస్వామ్య సంబంధాల ఫలితమే. ఈ స్థితిలో పెట్టుబడిదారీ విధానం తలెత్తడం సాధ్యం కాదు.

**8) భూస్వామ్య ఇతర దోపిడీ రూపాలు:** భారత ఆర్థిక వ్యవస్థ బ్రాహ్మణీయ హిందుత్వ పక్షపాతంతో కూడిన అర్ధభూస్వామ్య స్వభావాన్ని కలిగి వుంది. ఇక్కడ పేదరికం తీవ్రస్థాయిలో ఉంది. అందువల్ల ఇక్కడ పలు రూపాలలో వెట్టిచాకిరి, ఆర్థికేతర సామాజిక దోపిడీ, అణచివేత, పీడన, కుల, లింగ, ప్రాంతీయ వివక్ష మొదలైనవి వ్యవసాయం, వ్యవసాయేతర రంగాలతో పాటు పునాది ఉపరితలానికి సంబంధించిన యావత్తు అంశాలలో తీవ్రస్థాయిలో ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ప్రపంచీకరణ విధానాలు వర్గ, కుల, లింగ వివక్షను మరింతగా పెంచాయి. అవి మునుపటి కంటే వికృతరూపం దాల్చాయి.

అర్ధభూస్వామ్య వ్యవస్థలో పీడిత వర్గాలపై-కులాలపై భూస్వామ్య శక్తుల ఆధిపత్యం సామాజికంగా నూతన రూపాల్లో కొనసాగుతున్నది. దీంతో భూస్వామ్య, అర్ధభూస్వామ్య సంబంధాలు కొనసాగుతున్నాయి. కౌలు, వడ్డీ, వెట్టి, అర్ధ-వెట్టి, నయా-వెట్టి మొదలైన రూపాలలో భూస్వాములు ఇప్పటికీ పెద్దమొత్తంలో మిగులును రాబడుతున్నారు. గత మూడు దశాబ్దాల ప్రపంచీకరణ కాలంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు అమలవుతున్నచోట వెట్టిచాకిరి అదృశ్యం కావడం కాక వివిధ రూపాల్లో కొనసాగుతున్నది. వెనుకబడిన ప్రాంతాలలో దళితులతో, భూమిలేని వ్యవసాయ కూలీలతో వెట్టిచాకిరి చేయించుకోవడంలో భూస్వాములు తిట్టే తిట్లు, ప్రత్యక్ష బలప్రయోగం ఇప్పటికీ ఒక ముఖ్య పాత్ర పోషిస్తోంది. సాపేక్షికంగా వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అమలవుతున్న చోట పెద్ద మొత్తంలో డబ్బు అవసరమైన స్థితిలో రుణాన్ని సమీకరించే మరో ఇతర వనరులేని స్థితిలో పేద రైతులు రుణం తీసుకొని వెట్టిచాకిరి చేయడానికి సిద్ధపడుతున్నారు. స్థానిక బంధుత్వం వున్న వలస వ్యవసాయ కూలీలతో, పేదరైతులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. ప్రత్యేకించి దళిత పురుషులు, మహిళలు, పిల్లలు కుటుంబం మొత్తం భూస్వామ్య పొలాల్లో వెట్టిచాకిరి చేయడం కనపడుతుంది.

వెట్టిచాకిరి తీవ్రస్థాయిలో శ్రమశక్తిని వినియోగించే ఇటుక బట్టీలు, చెరకు పరిశ్రమ, ధాన్యాన్ని ఆరబెట్టే (ప్రాసెసింగ్) యూనిట్లు వంటి పెద్ద ఆగ్రో-బిజెనెస్ పరిశ్రమల్లో కనపడుతుంది. తక్కువ ఖర్చుతో, అధిక శ్రమశక్తిని వినియోగించుకునేందుకు అత్యంత క్రూరమైన రూపం వెట్టిచాకిరి. సామ్రాజ్యవాద సంస్కృతి ప్రభావంతో వస్తువ్యామోహ సంస్కృతి (కన్‌జ్యూమరిజం) ప్రభావం

వల్ల జీవనశైలులు మారడంతో పెరిగిన వినిమయ అవసరాలను, అలాగే తమ జీవన (విద్య, వైద్యం, పెళ్లి తదితర) అవసరాలను తీర్చుకోవడం కోసం శ్రామిక ప్రజలు కాంట్రాక్టర్లతో, ముఠా మేస్త్రీలతో (recruitment agents, recruiters) వెట్టిచాకిరి ఒప్పందాలు చేసుకొని అడ్వాన్స్‌గా డబ్బు తీసుకోవడం, వారిని అప్పుల ఊబిలో ఇరికించి వెట్టిచాకిరి చేయించుకోవడం (debt bondage) దేశంలో ఎక్కడ చూసినా కనపడుతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్దెత్తున ప్రజలు పట్టణాలకు వలస పోవడం వల్ల కాక, సర్క్యులర్ మైగ్రేషన్ (పట్టణాలకు వలస పోవడం, తిరిగి గ్రామాలకు రావడం, తిరిగి పట్టణాలకు వలస పోవడం) వల్ల జరుగుతున్న పట్టణీకరణ ఇందుకు దోహదం చేస్తున్నది. ఉదాహరణకు, ధాన్యాన్ని ఆరబెట్టే యూనిట్లు నిరంతరం తాళాలు వేసి నిర్బంధ శిబిరాలను పోలి ఉంటాయి. వెట్టిచాకిరి విషయంలో కార్మిక చట్టాలన్నీ కాగితాలకే పరిమితం. ఇది ప్రధానంగా అర్ధభూస్వామ్య సంబంధాలపై ఆధారపడి అమలవుతుంది.

ఇటుకలను పోతపోయడం, చెరకు కోత సాధారణ వెట్టిచాకిరి రూపాలుగా పేర్కొనవచ్చు. అప్పుల వల్ల వేతనాలు గణనీయంగా పడిపోతున్నాయి. ఇటుక బట్టీలలో సుమారు 30 శాతం, చెరకు కోతలో 45-80 శాతం వేతనాలు పడిపోయాయి. 2004లో ఈ రెండు కేసుల్లోనూ అర్ధ-కార్మికులు సర్క్యులర్ మైగ్రెంట్లే. ఈ కుటుంబాల సంవత్సర ఆదాయం 10 వేల నుంచి 30 వేల రూపాయల వరకూ ఉండేది. రోజు కూలీ సుమారు 40 నుంచి 50 రూపాయలు ఉండేది. ఇటుక పోతపోసే అర్ధ-కార్మికులు రోజుకు 12 నుంచి 16 గంటల పాటు పనిచేస్తారు. ఇందులో సగం గంటలు రాత్రి పూటే పనిచేస్తారు. చెరకు కోత కోసే అర్ధ-కార్మికులు రోజుకు 15 నుంచి 18 గంటలు పనిచేస్తారు. సుదీర్ఘ పనిదినాలను పరిగణనలోకి తీసుకుంటే గంటకు వేతనం 2 నుంచి 4 రూపాయలు మాత్రమే ఉంటుంది.

మెజారిటీ అర్ధ-కార్మికులు వారానికి ఆరు రోజులు పనిచేస్తారు. ఇటుకలు పోతపోసే అర్ధ-కార్మికుల విషయానికి వస్తే, వారి పని స్వభావాన్ని బట్టి వాళ్లు దుమ్ము, వేడి మధ్య పనిచేస్తారు. వారికి తాగునీరు, పోషక విలువలు కలిగిన ఆహారం దొరకవు. ఫలితంగా వివిధ రోగాల బారినపడతారు. ప్రత్యేకించి, వాంతులు- విరేచనాలు, అలర్జీలు, చర్మవ్యాధులు, జ్వరాలు, కండరాల నొప్పులకు గురవుతారు. చెరకు కోత కోసే అర్ధ-కార్మికుల పని పరిస్థితులే కాక, వారి జీవన పరిస్థితులు సైతం దుర్భరంగా ఉంటాయి. అర్ధ-కార్మికులలో చాలామంది కిక్కిరిసి ఉన్న, ఏమాత్రం పారిశుధ్యం లేని తాత్కాలిక టెంట్లలోనే జీవించాల్సి ఉంటుంది.

ఉత్పత్తి సీజనల్‌గా ఉండి సంవత్సరానికి సుమారు ఆరు నెలల పాటు కొనసాగుతుంది. తమ జీవనోపాధి కోసం వ్యవసాయ కూలి పనులనూ, సన్నకారు వ్యవసాయ పనులనూ సమన్వయించుకోగలుగుతారు. ఇటుకబట్టీలలో 2000 నాటికి దేశవ్యాప్తంగా దాదాపు 45 లక్షల అర్ధ-కార్మికులు పనిచేస్తున్నారు. ఈ రంగంలో శ్రామికశక్తి పెరుగుదల రేటు అత్యధికంగా

7.51 శాతం. చెరకు ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచంలో బ్రెజిల్ తర్వాత రెండవ స్థానంలో ఉంది. 40 లక్షల హెక్టార్ల భూమిలో 3 కోట్ల 50 లక్షల మంది రైతులు, అర్ధ-కార్మికులు చెరకు పండించడంలో భాగస్వాములవుతున్నారు.

ఉప్పుడు బియ్యం మిల్లుల్లో వరి ధాన్యాన్ని ఎండబెట్టడం అనేది అత్యంత తీవ్రమైన దోపిడీ రూపం. భారతదేశంలో ముఖ్యమైన ఉత్పత్తులలో చెరకు పరిశ్రమ లాగానే వరి కూడా ఒకటి. 20 శాతం కంటే అధిక సాగుభూమిలో దీన్ని పండిస్తారు. ఇందులో అర్ధ-కార్మికుల కుటుంబాలన్నీ ఉత్పత్తి స్థలంలో షెడ్లకే పరిమితమవుతాయి. అక్కడ దళారులు లేదా సబ్-కాంట్రాక్టర్లు ఉ ండరు. వ్యవసాయ కూలీలకు, వారి యజమానికీ మధ్య ఒక రకమైన పితృస్వామ్య సంబంధాలు ఉంటాయి. ఇందులో తీవ్ర దోపిడీకి గురయ్యే అర్ధ-కార్మికులు యజమానిని 'రక్షకుడి'గా పరిగణిస్తూ అతని పట్ల విధేయతను వ్యక్తం చేస్తూనే ఉంటారు. ఉత్పత్తి స్థలాలు శత్రుపూరిత, అభద్ర వాతావరణంలో ఉంటాయి. అర్ధ-కార్మికులు పగలంతా వరి ధాన్యాన్ని ఎండబెడుతూ ఉంటారు. ఇందుకోసం 24 గంటలూ వారు పనిచేయాల్సి ఉంటుంది. ఈ అర్ధ-కార్మికులు మొదట్లో వలస వచ్చినవారే, కానీ వీళ్లు ఇంటికి వెళ్లడం అనేది ఉండదు. యజమానులు వీరిని అప్పుల ఊబిలో కూరుకొనిపోయేలా చేస్తారు. ఉత్పత్తి షెడ్లలో అర్ధ-కార్మికులను తాళాలు వేసి ఉ ంచుతారు. బయట సమాజంతో వీరికి సంబంధం ఉండదు. వీరికి షెడ్ల నుంచి బయటకు వెళ్లే అవకాశాలు ఉండవు.

ఈ రెండు రూపాలను "నయా వెట్టిచాకిరి"గా పిలుస్తున్నారు. రెండింటిలోనూ వలస, సీజనల్ వ్యవసాయ కూలీలు పాల్గొంటున్నారు. స్థానిక దళారులే తమ కులానికి చెందినవారిని కూలీలుగా పట్టుకొని వస్తారు తప్ప వలసపోయిన చోట స్థానిక కూలీలను తీసుకోరు. వేతన అడ్వాన్సులు వ్యవసాయ కూలీలను ఆకర్షిస్తాయి. ఈ అడ్వాన్సులు చాలా వరకూ అంతిమ వేతనాలవుతాయి, కూలి చేసినందుకు విడిగా వేతనాలు లభించవు. వ్యవసాయ కూలీలు చాలా వరకూ దళితులే. అగ్రిబిజినెస్ పరిశ్రమల్లో కనిపించే ఈ వెట్టిచాకిరి వ్యవసాయ రంగంలో తరతమ స్థాయిల్లో కొనసాగుతున్నది. ఇవి అర్ధభూస్వామ్యానికి సంబంధించిన నూతన రూపాలు తప్ప మరొకటి కావు.

**9) కార్పొరేట్ వ్యవసాయం:** వ్యవసాయ ప్రధాన భారతదేశంలో ఈ రంగంలో సూపర్ లాభాలు ఆర్జించే లక్ష్యంతో ఎంఎన్‌సీలు కాంట్రాక్టు-కార్పొరేట్ వ్యవసాయం, గ్రూపు వ్యవసాయం ముందుకు తెచ్చాయి. అవి రైతుల భూమిని కాంట్రాక్టు తీసుకొని దానిపై అత్యాధునిక టెక్నాలజీతో పంటలు పండిస్తున్నాయి. ఉదాహరణకు పశ్చిమ బెంగాల్, పంజాబ్‌లలో బంగాళాదుంప, మధ్యప్రదేశ్‌లో సోయాచిక్కుళ్లు. వాటిని నేరుగా తమ మాల్స్‌కు పంపుతున్నాయి లేదా ఫ్యాక్టరీలలో వినియోగించి వివిధ ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసి అధిక ధరలకు మార్కెట్లో అమ్ముకుంటున్నాయి. ఈ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలను కాపాడడం కోసం వ్యవసాయ

మార్కెట్‌కు అడ్డంకిగా ఉన్న చట్టాలను మార్చారు. వాటికి చౌకగా ముడి పదార్థాలు అందేలా మార్గం సుగమం చేసారు. దీంతో సామాన్య రైతులు తమ పొలాల్లోనే కూలీలుగా మారుతున్నారు. ఎంఎన్‌సీల, దేశంలోని అంబానీ, టాటా వంటి దళారీ నిరంకుశ బూర్జువా కంపెనీలు సూపర్ లాభాలు ఆర్జిస్తున్నాయి.

గ్రూపు వ్యవసాయం రైతులను కష్టాల నుండి బయటపడేయడం కోసం కాకుండా బ్యాంకు రుణాలను గ్యారంటీగా వసూలు చేయడం కోసం చేపట్టిన చర్య. వ్యక్తిగతంగా రుణాలు ఇస్తే అవి తిరిగి వసూలు అవుతాయనే గ్యారంటీ లేదు. అందువల్ల, రైతుల గ్రూపుకు రుణం ఇస్తారు. చివరికి, అందరి మీదా ఆధారపడి ఉత్పత్తి జరుగుతుంది. వ్యవసాయపు మౌలిక సమస్యను పరిష్కరించకుండా చేసే ఈ ప్రయోగం రైతులను టోకుగా దివాలాతీసే వైపుకు, సామూహికంగా ఆత్మహత్యలు చేసుకునే వైపుకు నెడుతుంది.

మెగా ఫుడ్ పార్క్‌ల్లో 850 కోట్ల రూపాయలు మదుపు పెట్టబోతున్నారు. ఇది బీజేపీ ఆర్థిక జీవనాడి అయిన అదానీ, ఐటీస్, ఫ్యూచర్‌ల ప్రయోజనాలను నెరవేర్చడం కోసమే. అలాగే పూల తోటల పెంపకం, చేపల పెంపకం, కోళ్ల పెంపకం మొదలైన వాటిలో బడా రైతులు, కార్పొరేట్ కంపెనీలే చొరబడుతున్నాయి. పాల ఉత్పత్తిలో సాంప్రదాయకంగా పెద్ద సంఖ్యలో రైతులు ఉన్నారు. అయితే వాటిలో కూడా కార్పొరేట్ కంపెనీలు చొరబడ్డాయి. పాల ధర కూడా ఖర్చుకు అనుపాతంలో లభించడం లేదు. అందువల్ల ఆగ్రహించిన రైతులు పాలను నేలపాలు చేసే స్థితి ఏర్పడుతున్నది. ఎగుమతి రకపు బాసుమతి జీడబ్ల్యు-322, జీడబ్ల్యు-366లను ఉత్పత్తి చేయడం సామాన్య రైతుల వల్ల అయ్యే పని కాదు. వీటిని కేవలం వ్యవసాయ కంపెనీలు నిర్మించి, బడా దళారీ కంపెనీల "మూల్యవృద్ధి" గొలుసు (వాల్యూ యాడెడ్ చైన్)లో భాగమైన బడా ధనిక రైతులు, భూస్వాములు మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతున్నారు. మొత్తంగా చూస్తే, పెద్ద చేప దయాదాక్షిణ్యాలపై ఆధారపడి చిన్న చేప బతకాల్సిన స్థితి ఏర్పడింది.

ఈ పంటలకు పెట్టుబడులు ఎక్కువ. చిన్న రైతులు వాటిని పండించలేరు కనుక, కాంట్రాక్టు-కార్పొరేట్ వ్యవసాయంలో లాభసాటి వాటాలతో వారి భూములను కబ్జా చేస్తున్నారు. ఈ విధంగా కాంట్రాక్టు-కార్పొరేట్ వ్యవసాయ పద్ధతి చిన్న, మధ్యతరగతి రైతాంగాన్ని ధ్వంసం చేస్తున్నది, అగ్రి ఎంఎన్‌సీలు, రిలయెన్స్ వంటి కొద్ది దళారీ కంపెనీలు మాత్రమే లాభపడుతున్నాయి.

మొత్తంగా చూసినప్పుడు సామ్రాజ్యవాదం చారిత్రకంగానూ, వర్తమాన ప్రపంచీకరణ దశలోనూ దేశంలోని అర్ధభూస్వామ్య పునాదిపై ఆధారపడి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక మొదలైన రంగాలన్నింటిపై తన అదుపు కొనసాగిస్తున్నది. సామ్రాజ్యవాద ప్రధాన

ఉద్దేశ్యం దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం, దాన్ని మరో పెట్టుబడిదారీ పోటీదారుగా మార్చడం కాదు, దాన్ని ముడి పదార్థాల సప్లైదారుగా, సామ్రాజ్యవాద ఉత్పత్తులకు మార్కెట్‌గా నిలిపి ఉంచడం. ఇందుకు అనుగుణంగా దళారీ పాలకులు సామ్రాజ్యవాద ఎంఎన్‌సీలకు, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు అనుకూలంగా గ్రామీణ భారతంలో మార్పులు తెచ్చేలా పలు చట్టాలను, నిబంధనలను, నియమాలను, ఉత్తర్వులను, ఇతర విధానపరమైన చర్యలను అమలులోకి తెచ్చారు. భూసంస్కరణలను వెనుకపట్టు పట్టించారు. నూతన దోపిడీ రూపాలతో రైతాంగాన్ని మహిళలను, దళితులను, ఆదివాసులను తీవ్రంగా దోపిడీ, పీడనలకు గురి చేసారు. భూములు పాత–కొత్త భూస్వామ్య శక్తుల చేతిలో కేంద్రీకృతమయ్యాయి. దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య శక్తులు మరింతగా కలగలిసిపోయాయి. వివిధ పార్లమెంటరీ రాజకీయ నాయకులు, చట్టసంస్థలలో ఆ పార్టీల ప్రతినిధులు, వాటి ప్రజాసంఘాల/సంస్థల నాయకులు, ప్రభుత్వ, న్యాయ, పోలీసు ఉన్నతాధికారులతో, పలు ప్రభుత్వేతర ఆర్థిక, సామాజిక, రాజకీయ సంస్థలతో కుమ్మక్కై గ్రామీణ భూస్వామ్య వర్గంగా సామాజిక ఆర్థిక అధికారాన్ని చెలాయిస్తున్నారు.

ఈ దశలో వ్యవసాయ రంగంలో సాగు, భూమి వినియోగం, ఆహార భద్రతలలో, రుణాలలో, దేశీయ, విదేశీ వాణిజ్యంలో, ప్రభుత్వ పథకాలలో, కార్యక్రమాలలో ప్రపంచ ద్రవ్య పెట్టుబడి కీలక పాత్ర పోషిస్తున్నది. విదేశీ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలను నేరవేర్చేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం సుమారు 90,000 సహకార బ్యాంకులను కేంద్ర వాణిజ్య బ్యాంకులకు అనుబంధ బ్యాంకులుగా మార్చాలనే నిర్ణయంతో రైతులకు ఇచ్చే రుణ సదుపాయాలపై గట్టి దెబ్బపడింది. ఉదారవాద విధానాలు మొదలైనప్పటి నుంచి స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో ఆంక్షలను, నిషేధాలన్నింటినీ ఉపసంహరించడం వల్ల ఎంఎన్‌సీలకు, దేశీయ దళారీ కార్పొరేట్ కంపెనీలకు వ్యవసాయ ఆహార ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులు సులువయ్యాయి. దిగుమతి సుంకాలపై గణనీయంగా కోత విధించారు. వ్యవసాయ సరుకుల ఎగుమతులకు నూతన ప్రోత్సాహకాలు, మద్దతు, ఎగుమతుల రంగంలోకి ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం అందించారు. ఎరువులు తదితరాల, వ్యవసాయోత్పత్తుల ధరలను నియంత్రించే విధానాలలో మార్పులు వచ్చాయి. ఎగుమతులు తగ్గి, దిగుమతులు రెట్టింపయ్యాయి. అత్యధిక సబ్సిడీలున్న దేశాల వ్యవసాయోత్పత్తులు మన దేశ మార్కెట్లను ముంచెత్తడంతో వాటితో మన దేశ వ్యవసాయోత్పత్తులు పోటీపడలేకపోతున్నాయి. పెద్దెత్తున దిగుమతులు వచ్చిపడటంతో కోట్లాది మంది రైతులతో పాటు, చేతివృత్తిదారులు, పాల ఉత్పత్తిదారులతో సహా, కోళ్ల పరిశ్రమ, మత్స్య పరిశ్రమ మొదలైన చిన్న తరహా పరిశ్రమలు దెబ్బతిని అందులో పనిచేసే కార్మికుల, ఉద్యోగుల జీవనోపాధి ప్రమాదంలో పడింది.

సామ్రాజ్యవాద ప్రాయోజిత ఆధునిక వ్యవసాయ పద్ధతులు విస్తరించడంతో వ్యవసాయంలో

స్వావలంబన దాదాపు పూర్తిగా ధ్వంసమైంది. పత్తి, పొగాకు, చెరకు, రబ్బర్, కాఫీ, యూకలిప్టస్, జట్రోఫాం, వాణిజ్యపరమైన టేకు, సిల్వర్ ఓక్ వంటి వాణిజ్య పంటలకు ప్రాధాన్యత పెరిగింది. ఆహార పంటలను గణనీయమైన మొత్తంలో మార్కెట్ కోసమే పండించే ఏక పంట (మోనోకల్చర్) విధానం పెద్దెత్తున విస్తరించింది. ఆహార భద్రతను నిర్లక్ష్యం చేసి ఘెర్కిన్, ఎర్రమక్క, ఎక్కువ రసపు టమాటా, పూలు వగైరా మార్కెట్ అనుకూల పంటలను ప్రోత్సహించారు.

'రెండవ హరిత విప్లవం' పేరుతో వ్యవసాయ యాంత్రీకరణ, సాంకేతిక పరిజ్ఞానంతో జన్యుమార్పిడి (జీఎం) పంటలను తీసుకువచ్చారు. అలాగే మోన్‌సెంటో, వాల్‌మార్ట్ వంటి సామ్రాజ్యవాద కంపెనీలను దృష్టిలో ఉంచుకొని విధానాలను రూపొందించారు. ఫ్రాన్స్, జర్మనీతో సహా యూరప్‌కు చెందిన 19 దేశాలు జీఎం వ్యవసాయంపై నిషేధాన్ని విధించాయి. అమెరికాలో జీఎం లేబిలింగ్ అనివార్యం చేసారు. బీటీ విత్తనాలను అనేక అభివృద్ధి చెందిన దేశాలు నిషేధించాయి. కానీ ఆ విత్తనాలను భారతదేశం దిగుమతి చేసుకుంటూ దానినే అభివృద్ధి అంటున్నది.

నిజానికి కార్పొరేట్ ప్రాయోజిత 'అభివృద్ధి' కారణంగా వ్యవసాయ రంగం దివాలాతీసింది. వ్యవసాయ రంగం కోలుకోలేని సంక్షోభానికి గురైంది. 1994 నాటికి వంటనూనెలో స్వయంసమృద్ధి అయిన దేశం, వంటనూనెపై 300 శాతంగా వుండిన దిగుమతి సుంకాన్ని దాదాపు ఎత్తివేయడంతో విదేశీ కంపెనీలు ప్రస్తుతం 67 శాతం వంటనూనెలను దేశంలోకి దిగుమతి చేస్తున్నాయి. ఇందుకోసం ప్రతి సంవత్సరం 70,000 కోట్ల రూపాయల భారీ ఖర్చు భారత్ చెల్లించాల్సి వస్తోంది. అంతేకాక దేశంలో ఎన్నో వంటనూనె ప్రాసెసింగ్ యూనిట్లు బంద్ అయ్యాయి. రైతులు గిట్టుబాటు కాకపోవడంతో నూనె గింజల సాగు గణనీయంగా తగ్గించివేసారు. గోధుమ, పప్పు ధాన్యాలు, ఉల్లిపాయలు, పళ్లు, కూరగాయలు పరిస్థితి కూడా ఇదే. నూతన సాంకేతికతో వచ్చిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులతో సాగు వ్యయాలు పెరిగిపోయాయి. భూములు నిస్సారమయ్యాయి. నాసిరకం విత్తనాలు, నకిలీ పురుగుమందులతో నష్టం పెరిగింది. వ్యవసాయం ఇప్పటికీ ప్రధానంగా వర్షాధారంగానే ఉంది. 40 శాతం భూములకే నీటి పారుదల సౌకర్యాలు పరిమితమయ్యాయి. చిన్న, మధ్య నీటి వనరుల పట్ల, మెట్ట వ్యవసాయం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. వ్యవసాయ బావులకు-బోర్లకు విద్యుత్తు కోత పెద్ద సమస్యగా మారింది. వ్యవసాయ రంగంలో మదుపులు, ప్రభుత్వ కేటాయింపులు, సబ్సిడీలు తగ్గిపోయాయి. వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌ను, నిల్వలకు సంబంధించిన మౌలిక సదుపాయాలను ప్రైవేటీకరించారు. రైతులకు తక్కువ వడ్డీ రేట్లకు తగినంతగా ప్రభుత్వ రుణాలు దొరక్కపోవడంతో అధిక వడ్డీలతో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల, మైక్రో ఫైనాన్స్ సంస్థల, వడ్డీ వ్యాపారుల చేతిలో తీవ్రంగా దోపిడీకి గురవుతున్నారు. మార్కెట్లలో దళారీల, ముందస్తు మార్కెట్ల (ఫార్వర్డ్ లేదా ఫ్యూచర్ ట్రేడింగ్) ప్రాబల్యం పెరుగుతుండడంతో

వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. వీటన్నింటి వల్ల వ్యవసాయంలో రైతుల ఆదాయం నానాటికీ క్షీణించింది, రైతులు రుణగ్రస్తులవుతున్నారు. కనీస మద్దతు ధర, పంటల బీమా, రుణమాఫీ పథకాలు రైతుల కళ్లలో మట్టిగొడుతున్నాయి. వ్యవసాయ ఉత్పాదకాలు (హెచ్‌వైవి విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుమందులు మొదలైనవి), పనిముట్లు/యంత్రాలు, మార్కెట్లు ఎంఎన్‌సీల నియంత్రణలో ఉండడంతో ఉత్పాదకాలను కొనడానికీ, ఉత్పత్తులను అమ్మడానికీ రైతులు వాటిపైన ఆధారపడే పరిస్థితి దాపురించింది. ఆధునిక వ్యవసాయ పద్ధతులతో జీవ వైవిధ్యం ప్రభావితమవుతుండడంతో భూగర్భ జలాల మట్టం పడిపోయింది. వాతావరణంలో ప్రకృతి విపత్తులు, అంటే అతివృష్టి, అనావృష్టి, వరదలు సాధారణమయ్యాయి. గత మూడు దశాబ్దాలలో పర్యావరణం మరింతగా దెబ్బతినిపోవడంతో వ్యవసాయంపై ఇది చాలా దుష్ప్రభావాన్ని కలిగిస్తున్నది. తేమ శాతం తగ్గడం, చీడపీడలు, కలుపు పెరగడం, పంటల నాణ్యత/పోషక గుణాలు తగ్గడం, వాటిలో హానికారకాలు పెరగడం, ఉత్పత్తి తగ్గడం వల్ల వ్యవసాయం చేయడం తలకు మించిన భారం అయ్యింది.

ఇవన్నీ పైకి కనపడుతున్నట్లుగా పెట్టుబడిదారీ వ్యవసాయ లక్షణాలు కావు. ఉదాహరణకు, పంటల ఉత్పాదకత పెట్టుబడిదారీ/సామ్రాజ్యవాద దేశాలతో పోల్చితే మన దేశంలో చాలా తక్కువగా ఉంది. ఉదాహరణకు, పత్తి పంట 2018-19లో మన దేశంలో సగటున ఒక హెక్టారుకు 502 కిలోలు ఉత్పత్తి కాగా, చైనాలో 1,751 కిలోలు, ఆస్ట్రేలియాలో 1,597 కిలోలు. 2015లో మన దేశంలో వరి ఉత్పత్తి సగటున హెక్టారుకు 3.6 టన్నులు అయ్యింది. ఇది చైనా (6.89), ఈజిప్టు (9.8 టన్నులు) వంటి పలు దేశాల కంటే తక్కువ. గోధుమ ఉత్పాదకత ఇంగ్లాడ్‌లో 7.7 టన్నులుండగా, మన దేశంలో 3.1 టన్నులు, మొక్కజొన్నలో అమెరికా 10.5 టన్నులు, చైనా 5.89 టన్నులు ఉత్పాదకత సాధిస్తుంటే, మన దేశం 2.6 టన్నులకే పరిమితమైంది. వేరుశనగ మన దేశంలో 1.49 టన్నులు ఉత్పత్తి చేస్తుండగా, చైనా 3.56 టన్నులు, అమెరికా 4.44 టన్నులు ఉత్పత్తి చేస్తున్నాయి. పప్పు ధాన్యాలు మన దేశంలో 647 కిలోలు ఉత్పత్తి చేస్తుండగా, చైనా 1.74 టన్నులు, అమెరికా 1.81 టన్నులు ఉత్పత్తి చేస్తున్నాయి. మన దేశంలో పలు ప్రాంతాలలో పెట్టుబడిదారీగా చెప్పబడే ఆధునిక వ్యవసాయ పద్ధతులన్నీ నిజానికి పరాధీన పద్ధతులు కావడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై, మొత్తం ఉత్పత్తి విధానంపై ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యవస్థలతో కూడిన స్థానిక నూతన భూస్వామ్య శక్తులతో కుమ్మక్కైన విదేశీ ఎంఎన్‌సీల, దేశీయ దళారీ కార్పొరేట్ కంపెనీల ఆధిపత్యం ఉండడం వల్ల అవి కేవలం విదేశీ ఎంఎన్‌సీలు, వాటితో కుమ్మక్కైన దేశీయ కార్పొరేట్ కంపెనీల, బడా భూస్వాముల ప్రయోజనాలు మాత్రమే నెరవేరుస్తున్నాయి.

అంటే, పంటలు రైతుల చేతికి వచ్చినప్పుడు మార్కెట్‌లో ధరలు పడిపోవడం, ఆ పంటలను వ్యాపారులు కొనుగోలు చేసిన తర్వాత వాటి ధరలు పెరిగిపోవడం అనేది పెట్టుబడిదారీ

సంబంధాలను కాక, అర్ధభూస్వామ్య సంబంధాలను ఎత్తిచూపుతున్నాయి. పంటలు రైతుల చేతికి వచ్చినప్పుడు పంటల ధరలను పెట్టుబడిదారీ మార్కెట్ నియమాల ప్రకారం కాకుండా ఎరువులు, పురుగు మందులు లేదా వివిధ వ్యవసాయ ఉపకరణాల వ్యాపారులు, పంటల వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు నిర్ణయిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధర అత్యధిక రాష్ట్రాల్లో చాలా పంటలకు పేద, మధ్యతరగతి రైతులు పెట్టే పెట్టుబడులకు ఏమాత్రం సరితూగడం లేదు. జాతీయ రైతు కమీషన్ ప్రతిపాదించిన స్థాయికి దరిదాపుల్లో కూడా లేవు. దీంతో పాటు ప్రభుత్వం ధాన్య సేకరణ యంత్రాంగాన్ని బలహీనపరిచింది, సేకరణను కుదించింది, మద్దతు ధర పరిధిలోకి వచ్చే పంటల రకాలను తగ్గించింది. స్వామినాథన్ కమిషన్ సూచించిన సిఫారసులను అన్ని ప్రభుత్వాలు బుట్టదాఖలు చేసాయి. మోదీ ప్రభుత్వం ముందుకు తెచ్చిన జాతీయ వ్యవసాయ మార్కెట్ పోర్టల్ (ఈ–నామ్) మండీలలో సైతం దళారీ వ్యాపారులే రాజ్యం చేస్తున్నారు. సాయిల్ హెల్త్ కార్డ్ పథకం, '2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే పథకం' బూటకమని తేలిపోయాయి. దేశంలో మధ్యలో నిలిచిపోయిన నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడానికే 4 లక్షల కోట్ల రూపాయలు అవసరముండగా వాటికి తగిన కేటాయింపులు సకాలంలో చేయకపోవడం వల్ల, కేటాయించిన బడ్జెట్లను స్వాహా చేయడం ప్రతీ ప్రభుత్వం చేస్తూ వస్తోంది.

2015 ఎన్ఎస్ఎస్ సర్వే ప్రకారం మెజారిటీ రైతులకు స్థిరమైన ఆదాయం లేదు. వ్యవసాయ కుటుంబాలలో 51.14 శాతం క్యాజువల్ రూపంలో శారీరక శ్రమపై ఆధారపడగా, 30.10 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి. వీరిలో కౌలు రైతులు కూడా ఒక భాగమే. భూమి ఉన్న కుటుంబాలలో సగానికి పైగా కుటుంబాలకు అంటే దాదాపు 60 శాతం కుటుంబాలకు వ్యవసాయం గిట్టుబాటుగా లేని స్థితి ఏర్పడడం వల్ల వ్యవసాయానికి దూరంగా ఉండే దుస్థితి నెలకొంది. అందువల్ల, సహజంగా కుటుంబ పోషణ కోసం వ్యవసాయ కూలీలు, పేదరైతులతో పాటు పలు ప్రాంతాలలో మధ్యతరగతి రైతులు కూడా వ్యవసాయ కార్మికులుగా పని చేయాల్సి వస్తోంది. భూస్వాములు, కార్పొరేట్ కంపెనీలు భూములు కబ్జా చేసుకోవటంతో పేద, మధ్యతరగతి రైతులు భూములు కోల్పోయి వ్యవసాయ కూలీలుగా మారిపోతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఒక వైపు భూస్వాములు, ధనిక రైతుల్లో ఒక సెక్షన్ గణనీయమైన ఆదాయాన్ని పొందుతుండగా, అత్యధిక పేద, మధ్యతరగతి రైతు కుటుంబాల సగటు నెలసరి ఆదాయం ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనం కంటే చాలా తక్కువ. భూస్వాములు, ధనిక రైతులు భూమితో పాటు ఇతర ఉత్పత్తి సాధనాలను గుప్పెట పెట్టుకున్నందున వారికి సాగు వ్యయం తక్కువ కాగా, పేద, మధ్యతరగతి రైతులకు అది ఎక్కువగా ఉంటుంది. ఎరువులకు, కౌలు వ్యవసాయానికి, యంత్రాలకు వారు ఎక్కువగా వ్యయం చేయవలసి వస్తున్నది. ఎరువులు, తదితరాలను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు, మార్కెట్ అందుబాటు

అవకాశాలు ఎక్కువగా ఉండడంతో భూస్వాములు, ధనిక రైతులలో ఒక సెక్షన్ ఎక్కువ లాభపడుతున్నారు. అందువల్ల గ్రామాల్లో నెలకు 5,000 రూపాయల లోపు ఆదాయంతో నెట్టుకొస్తున్న పేద, మధ్యతరగతి రైతులు 65.9 కోట్లు. ఈ కుటుంబాల సగటు నెలసరి వినిమయ ఖర్చు 6,223 రూపాయలు (ఆహారం, ఆరోగ్యం, బట్టలు మొదలైన వాటి కోసం మాత్రమే). ఇతర ఖర్చులు లెక్కలోకి తీసుకుంటే ప్రతి కుటుంబానికి నెలకు కనీసం 856 రూపాయల లోటు వచ్చింది. అందువల్ల 70 శాతం కుటుంబాలు అప్పు చేయకుండా బతికే పరిస్థితి లేదు.

2018 చివరి నాటికి 3 లక్షల 30 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 2019లో స్వయం ఉపాధి ఉన్న 13,149 మంది, నిరుద్యోగులు 12,936 మంది, రైతులు 10,349 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ విధంగా పెద్దెత్తున ఉత్పత్తి శక్తుల విధ్వంసం దేశంలో నెలకొన్న అర్ధభూస్వామ్య విధానానికి అద్దంపడుతున్నది. రైతుల ఆత్మహత్యలకు నూతన ఉదారవాద ఆర్థిక విధానాల సహకారంతో వ్యవసాయాన్ని అత్యధికంగా వ్యాపారీకరించడానికీ, గ్రామీణ సమాజంలో వ్యాప్తిలో ఉన్న ఉత్పత్తి సంబంధాలకూ మధ్య లోతైన సంబంధం ఉంది. ఏ ప్రాంతంలో వ్యాపార పంటలు అధికంగా (69-81 శాతం) విస్తరించాయో అక్కడే రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిజానికి (దేశంలోకి) క్రమంగా పెరిగే సామ్రాజ్యవాద పెట్టుబడి చొరబాటు, వడ్డీ వ్యాపారుల, పంటల వ్యాపారుల వడ్డీ వ్యాపార దోపిడీ రెండూ ఒకదానికి మరొకటి వ్యతిరేకం కాదు. రెండూ ఒకటి మరోదానికి మద్దతునిస్తుంది. వీటి సంయుక్త దాడి రైతులను మరింత దయనీయ స్థితిలోకి నెట్టింది. నయా ఉదారీకరణ కాలంలో ప్రభుత్వ మదుపు, వ్యవసాయానికి ప్రభుత్వ రుణం తగ్గుతూ వస్తోంది. దీంతో వడ్డీ వ్యాపారం మరింతగా పెరిగింది.

వ్యవసాయ సంక్షోభం కారణంగా పట్టణాలకు వలసలు పెరగడం వల్ల 1951-2001 మధ్యకాలంలో గ్రామీణ జనాభా 10 శాతం, రైతులు 15 శాతం, వ్యవసాయ కూలీలు 17 శాతం తగ్గారు. ఈ 10 ఏళ్లలో రైతుల సంఖ్య 90 లక్షలు తగ్గింది. ప్రతి రోజు 100 మంది వ్యవసాయాన్ని వదిలిపెడుతున్నారు. ప్రపంచీకరణలో గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు సంఖ్యాపరంగా తూర్పు ఉత్తరప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాల నుంచి వలసలు ఎక్కువగా సాగుతున్నాయి. 1990లలో పంజాబ్, హర్యానాలలో వ్యవసాయ సంక్షోభం కారణంగా ఉపాధి లభించకపోవడంతో అక్కడ నుంచి వలసపోవడం బాగా కనపడింది. ఇటీవలి సంవత్సరాల్లో కేరళ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు వలసలు పెరిగాయి. వీరంతా నిర్మాణరంగం, గనులు, వస్తుతయారీ, సేవారంగాలలో రోజు కూలీలుగా పనిచేస్తున్నారు లేదా స్వయంఉపాధి చేసుకుంటున్నారు. అయితే వలసలలో అధిక భాగం తాత్కాలిక వలసలు. ఎందుకంటే పట్టణాలలో వలస కార్మికులు శాశ్వతంగా ఉండేందుకు

అనుగుణంగా వారిని ఇముడ్చుకునేలా పరిశ్రమలు భారతదేశంలో ఇప్పటికీ అభివృద్ధి కాలేదు.

ప్రపంచీకరణ ప్రభావం గ్రామీణ ప్రాంతానికి ఆలంబనగా ఉన్న చేతివృత్తులు, కులవృత్తులతో సహా వ్యవసాయ అనుబంధ రంగంపై తీవ్రంగా పడింది. వడ్రంగులు, తాపీపనివారు, నేతపనివారు, కల్లుగీత, కమ్మరులు, కుమ్మరులు, చెప్పులుకుట్టేవారు మొదలైన సాంప్రదాయక సేవలందించే కులాల ప్రజల సంఖ్య తగ్గిపోయింది. స్వయం ఉపాధిని ఏర్పర్చుకుని చిరువ్యాపారాలు చేసేవారు, తినుబండారాలు తయారు చేసి అమ్మేవారు, సైకిల్, మోటార్ సైకిల్ తదితర వాహనాలకు మరమ్మత్తులు చేసేవారు, పాల వ్యాపారం, కోళ్ల ఫారముల వంటి చిన్న తరహా ఉత్పత్తిదారులు గ్రామీణ మార్కెట్‌లపై ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ సంక్షోభం ప్రభావంతో ప్రజల కొనుగోలు శక్తి తగ్గడంతో ఆ ప్రభావం వీటిపైన కూడా ఉంది. వీరికి సహకార సంఘాల, ప్రభుత్వ రుణాలు బాగా పడిపోయాయి. వాటి ఉత్పత్తి, విక్రయాల్లో వృద్ధి లేదు. స్థిరమైన మార్కెట్ వ్యవస్థ లేదు. ఫలితంగా ఉపాధి కూడా పడిపోయింది. ప్రత్యామ్నాయం లేకపోవడం వీరిలో అధికులు వ్యవసాయ కూలీలు (లేబర్)గా, నిరుద్యోగులుగా, కొందరు పరిశ్రమలలో నైపుణ్య/నైపుణ్యేతర కార్మికులుగా, అర్థ-కార్మికులుగా మారుతున్నారు.

ముఖ్యంగా 2009-10 చేనేత సర్వేలో దేశవ్యాప్తంగా అసోం, మధ్యప్రదేశ్, పశ్చిమ్‌బంగ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక, బిహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో మొత్తం 43.31 లక్షల మంది, ఇందులో గ్రామీణులు 36.33 లక్షల మంది ఈ వృత్తిలో ఉండగా, 2017 సర్వేలో ఈ సంఖ్య మరో 40 శాతం తగ్గింది. చేనేత పేరిట మిల్లు వస్త్రాలే మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. చేనేత ఉత్పత్తులకు ధరలలో ఏమాత్రం పెరుగుదల లేదు. దీంతో ఉత్పత్తులు తగ్గిపోయాయి. చేనేతకు కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన చేయూత లభించడం లేదు. చేనేత రంగంలో పరిశోధనలు కరువయ్యాయి. బడ్జెట్‌లో కేటాయింపులు 2016-17లో 710 కోట్లు 2018-19కి 386 కోట్లకు తగ్గింది. జీఎస్‌టీ చేనేతను మరింత దెబ్బతీసింది. అప్పుల భారం, అనారోగ్యం, అర్థాకలికి అలమటిస్తూ చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో కేవలం 9.68 శాతం గ్రామీణ మధ్యతరగతి కుటుంబాలకు మాత్రమే వేతన ఆదాయం ఉంది. వారిలో 5 శాతం ప్రభుత్వోద్యోగాలు, 1.11 శాతం ప్రభుత్వరంగ ఉద్యోగాలు, 3.57 శాతం ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. ఆయా రంగాలలో వీరు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు.

ఆదివాసీ సమస్య అర్థభూస్వామ్య వ్యవస్థలో ముఖ్యమైన అంశంగా ఉంది. ఆదివాసీ ప్రాంతాలలో ఫారెస్టు విభాగపు దోపిడీ పీడనలు తీవ్రంగా కొనసాగుతున్నాయి. ఫారెస్టు హక్కుల

చట్టం, పెసా చట్టం అమలు ఎక్కడా కనపడదు. వివిధ సామాజిక సంక్షేమ పథకాలలో రెవిన్యూ అధికారుల దోపిడీ, సంతలలో ఆదివాసులు అమ్మే వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లలో, నిత్యావసర వస్తువుల అమ్మకాలలో షావుకార్ల దోపిడీ, వివిధ పనులలో కాంట్రాక్టర్ల దోపిడీ తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతాలలో ఇప్పటికీ పాత ఉత్పత్తి రూపమైన ఆహార సేకరణ కొనసాగుతున్నప్పటికీ ఇక్కడి ఉత్పత్తి విధానం ప్రధానంగా అర్ధవలస, అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాలతో కూడిన ఉత్పత్తి విధానమే. నీటి పారుదల సౌకర్యాలు లేకపోవడం వల్ల వర్షాధార మెట్ట వ్యవసాయం చేస్తున్నారు. కొన్ని చోట్ల స్వల్పంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు చొరబడుతున్నాయి. తెగపెద్దలుగా ఉన్నవారిలో ఒక చిన్న సెక్షన్ భూస్వాములుగా ఉన్నారు. వడ్డీ వ్యాపారంతో సహా వివిధ భూస్వామ్య దోపిడీ రూపాలు అమలులో ఉన్నాయి. ఇప్పటికీ విప్లవోద్యమం లేని ప్రాంతాలలోనూ, బలహీనంగా ఉన్న ప్రాంతాలలోను తెగ సాంప్రదాయాలను వినియోగించుకొని తెగ పెద్దలు వెట్టి చేయించుకోవడం ఉన్నది. ధనిక రైతుల సంఖ్య అంత ఎక్కువగా లేదు. వీరితో పోల్చుకుంటే మధ్యతరగతి రైతుల సంఖ్య ఎక్కువ. పోడు వ్యవసాయం, ఆహార సేకరణ ఇంకా కొన్ని చోట్ల ఉంది. భూములు నిస్సారంగా ఉండడం వల్ల, వెనుకబడిన ఉత్పత్తి విధానం వల్ల, ఉత్పాదకత తక్కువగా ఉండడం వల్ల ఆదివాసులలో పేద రైతులే అధిక సంఖ్యలో ఉన్నారు.

ప్రపంచీకరణ కారణంగా విదేశీ ఎంఎన్‌సీలు, దేశీయ దళారీ కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వం సాగించే మైనింగ్, వివిధ రకాల ప్లాంట్లు, రోడ్డు వగైరాల కార్యకలాపాల వల్ల ఆదివాసులు పెద్దెత్తున భూములను కోల్పోయి నిర్వాసితులవుతూ వేతన కూలీలుగా మారుతున్నారు. భూస్వామ్య, ధనిక రైతులు మినహా మధ్యతరగతి, పేద రైతులుగా, అడవులు-ఇతర సమిష్టి వనరులపై ఆధారపడి జీవనం సాగించేవారుగా, జీవనావసరాలకై, వేతనాల కోసం కనీసం 4-5 నెలల పాటు రకరకాల కూలీ పనుల కోసం వలసపోయే కూలీలుగా అతితక్కువ జీవన ప్రమాణాలతో అత్యంత దుర్భర దారిద్ర్యం అనుభవిస్తున్నారు. వలస పోయిన కూలీలు తీవ్ర దోపిడీ, పీడనలకు గురవుతున్నారు. ప్రపంచీకరణ విస్తరించే కొలదీ ఆదివాసీ ప్రాంతాలలో హైవేల పక్కన హొటళ్లు, ప్రైవేటు కాలనీలు పెరుగుతున్నాయి. వివిధ మత సంస్థల చొరబాటు పెరుగుతున్నది. అసంఘటిత అర్ధ-కార్మికులు పెరుగుతున్నారు. ఆదివాసులలో ఒక చిన్న సెక్షన్ పెటీబూర్జువా శక్తిగా ఎదుగుతున్నది. దుకాణాలలో, సేవారంగంలో వేతన ఉద్యోగులుగా, చిన్న వ్యాపారులుగా, ప్రభుత్వరంగంలో తాత్కాలిక ఉద్యోగులుగా పని చేస్తున్నారు. వీరి సంఖ్య తక్కువే అయినా వీరికి ఎంతో సామాజిక ప్రాధాన్యత ఉంది. వీరు ఆదివాసీ జీవనంలో ముఖ్య పాత్ర నిర్వహిస్తున్నారు.

మహిళలు గతం కంటే అన్ని రంగాల్లోకి రావడం పెరిగినప్పటికీ వారిపై దోపిడీ, పీడన, అణచివేత, వివక్ష కూడా మరింత పెరిగాయి. గ్రామాల్లో వ్యవసాయంలో కుటుంబ శ్రమలో,

ఇటుకబట్టీల్లో, ఇతర నిర్మాణ పనుల్లో, వ్యవసాయేతర పనులలో వలస అర్ధకార్మికుల రూపంలో మహిళల ముఖ్య పాత్ర కొనసాగుతున్నది. పురుష వ్యవసాయ కూలీలు వలస పనులకు పోవడం ఎక్కువ కావడం వల్ల మహిళలు భూస్వాముల పొలాల్లో వెట్టిచాకిరి చేయవలసి వస్తున్నది. వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల వల్ల, వ్యవసాయంలో మదుపులు తగ్గడం వల్ల, గతంలో మహిళలకు ఎక్కువగా పని లభించే క్షేత్రాలలో యంత్రాల చేత పనిచేయించడం పెరగడం వల్ల, వ్యవసాయేతర రంగాలలో ఉపాధి చాలినంత లేకపోవడం వల్ల మహిళా వ్యవసాయ కూలీలకు తగినంత పని లభించక అత్యధికులు అర్ధాకలితో బతుకులీడుస్తున్నారు. బ్రాహ్మణవాద హిందుత్వ కట్టుబాట్లు ఇప్పటికీ బలంగా ఉండడం వల్ల స్త్రీ, పురుషుల మధ్య శ్రమలో వివక్ష, అందుబాటులో ఉన్న పనిలో మహిళలకు తీవ్ర పరిమితులు కొనసాగుతున్నాయి. ఇంటిపని ఇప్పటికీ మహిళలే చేస్తున్నారు. వేతనాలలో స్త్రీ, పురుషులకు మధ్య వ్యత్యాసం ఇప్పటికీ తీవ్రంగా ఉంటోంది. పురుషుల వేతనంలో 30 నుంచి 50 శాతం వేతనాలు మహిళలకు లభిస్తున్నాయి. బ్రాహ్మణీయ హిందుత్వ సంప్రదాయాల వల్ల మహిళల కష్టాలు మరింత పెరిగాయి. ప్రపంచీకరణ కాలంలో మహిళను సరుకుగా వివిధ రూపాల్లో వ్యాపారీకరించడం పెరగడంతో మహిళ సామాజిక స్థాయి మరింతగా దిగజారింది. సామ్రాజ్యవాద సంస్కృతి, భూస్వామ్య సంస్కృతి కలగలిసిపోవడంతో మహిళపై కొనసాగే అత్యాచారాలు మరింత వికృత రూపం తీసుకున్నాయి. నిర్భయ అత్యాచారం-హత్య తదనంతరం జస్టిస్ వర్మ కమిషన్ చేసిన సిఫారసులను ఒకటి, రెండు మినహా కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు బుట్టదాఖలు చేసాయి.

గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేకించి వ్యవసాయ రంగంలో జరిగిన ఈ పరిణామాల కారణంగా జీవీఏ (స్థూల మూల్య వృద్ధి)లో పంటల వాటా 2012-13లో 11.5 నుంచి 2017-18 నాటికి 8.7 శాతానికి పడిపోగా, ఈ కాలంలో పశుపోషణ, అడవులు, మత్స్యపాలనా రంగాల వాటాలో ఏ మాత్రం వృద్ధి లేదు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలలో స్థూల మదుపులు 2012-13లో 16.5 నుంచి 2017-18లో 15.2 శాతానికి పడిపోయాయి. వ్యవసాయ రంగపు ఉపాధి వృద్ధి రేటు 2011-12 సంవత్సరంలోని -1.9 శాతం నుంచి 2015-16లో -3.6 శాతానికి పడిపోయింది. భూమి సమస్య, కౌలుదారీ సమస్య, బలవంతపు విస్థాపన సమస్య, వ్యవసాయానుబంధ రంగాల సమస్య దేశంలో వ్యవసాయ సంక్షోభ తీవ్రతను ప్రతిబింబిస్తున్నాయి. ఫలితంగా ఉత్పత్తి శక్తులు ధ్వంసమవుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి గిడసబారిపోయింది. పాత అర్ధభూస్వామ్య సంబంధాలే దీనికి కారణం. ఈ బంధనాలను తెంచుకోవడమే విప్లవం.

మొత్తంగా చూసుకున్నప్పుడు దేశ ఎగుమతులు మరింతగా క్షీణిస్తూ, దిగుమతులు పెరిగిపోతున్నాయి. పరిశ్రమల్లో ఉత్పాదకత తగ్గిపోతున్నది, పునరుత్పత్తి ప్రక్రియ దెబ్బతింటుంది. నిరంతరం కొనసాగుతున్న సామ్రాజ్యవాద సంక్షోభ ఫలితంగా జాతీయ బూర్జువాలైన చిన్న,

మధ్యతరహా బూర్జువాల యాజమాన్యం కింద వున్న లక్షలాది చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు మూతపడుతున్నాయి. కార్మికుల, ఉద్యోగుల వేతనాలు వేగంగా క్షీణిస్తున్నాయి. దీనితో వారి వేతనాల కోసం చెల్లింపులు తగ్గిపోతున్నాయి. విదేశీ పెట్టుబడులు, టెక్నాలజీపై ఆధారపడడం పెరిగింది. పలు ప్రాంతాలలో వ్యవసాయంలో అవలంబిస్తూ వచ్చిన సంప్రదాయక స్వావలంబనా/దేశవాళీ పద్ధతులు ధ్వంసమయ్యాయి. పారిశ్రామిక, వ్యవసాయ వృద్ధి క్షీణించి నిరుద్యోగం తీవ్రంగా పెరిగిపోయింది. గ్రామీణ ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో నిర్వాసితులు గావించబడుతున్న రైతులు, ఆదివాసులు ఏ ఆధునిక పరిశ్రమలలోనూ కార్మికులుగా మారడం లేదు. వాళ్లు ఇళ్లల్లో నౌకర్లుగా, గేట్‌మేన్‌లు, వాచ్‌మేన్‌లుగా, చిల్లర వ్యాపారం చేసుకునే వాళ్లుగా అసంఘటిత వృత్తుల్లో భాగమై మరో రూపంలో అర్ధభూస్వామ్యానికి బలవుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం వల్ల వస్తుసేవలకు డిమాండ్ క్షీణిస్తున్నది. హోం మార్కెట్ క్షీణించే దేశంలో గణనీయమైన అభివృద్ధి జరిగే ప్రశ్నే తలయెత్తదు.

గ్రామీణ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు, వాహనాలు, టీవీలు, రిఫ్రిజిరేటర్లు పెరిగాయి కానీ అక్షరాస్యత తగినంత పెరగలేదు, నిరుపేదల సంఖ్య తగ్గలేదు. మెజారిటీ గ్రామీణ జనాభాకు ఆరోగ్యంగా జీవించడానికి తగిన ఇంటి సౌకర్యం లేదు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలహీనపరిచారు. ఆకలి, అనారోగ్యం వెంటాడుతున్నాయి. 2014-18 మధ్యలో అధికారిక లెక్కల ప్రకారం దేశంలో 56 వేలమంది ఆకలిచావులకు గురయ్యారు. ప్రభుత్వ రేషన్ దుకాణాలు 'రేషన్' ఇవ్వకపోవడం వల్ల చాలా మంది మరణించగా ఇందులో ఎక్కువ మంది నిరుపేద మహిళలు, దళితులు, ఆదివాసులు, ముస్లిములు ఉన్నారు. ఆహార భద్రత, అంత్యోదయ పథకం లాంటి వాటి గురించి మోదీ ప్రభుత్వంతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల మాటల నిజస్వరూపం దేశంలో 275.7 మిలియన్ టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ 82 కోట్ల మంది ఆకలితో అల్లాడటాన్ని బట్టి స్పష్టమవుతుంది. దేశంలో తగినన్ని గోదాములు, శీతల గిడ్డంగులు నిర్మించకపోవడం వల్ల ప్రతి సంవత్సరం సగటున 92,651 కోట్ల రూపాయల విలువ కలిగిన ఆహారధాన్యాలు, 31 కోట్ల రూపాయల కూరగాయలు నాశనమవుతున్నాయి.

ప్రతీ బడ్జెట్‌లో విద్య, వైద్యం, కుటుంబ సంక్షేమం, గృహ నిర్మాణం, తాగునీరు, పట్టణ పేదరిక నిర్మూలన, మహిళా సాధికారిత, సమగ్ర శిశు అభివృద్ధి పథకం, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి వంటి ప్రజా సంక్షేమ పథకాలకు బడ్జెట్ కేటాయింపులలో కోత విధిస్తూ వస్తున్నారు. ఆహారం, ఎరువులు, పెట్రోలియంపై సబ్సిడీ 10 శాతం తగ్గించి కోట్లాది రూపాయల భారాన్ని ప్రజలపై మోపారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. వార్షిక ద్రవోల్బణం 2014-18 మధ్య 3.6 శాతం నుంచి 5.8 శాతానికి పెరిగింది. 67 శాతానికి పైగా గ్రామీణ కుటుంబాలకు సరైన ఇళ్లు లేవు. దేశంలో నిరక్షరాస్యత 40 శాతంగా ఉంది. దేశ జీడీపీలో విద్య కోసం కేటాయింపు 0.45 శాతానికి, వైద్యం కోసం కేటాయింపులు 0.30 శాతానికి తగ్గిపోయాయి.

ప్రతి యేటా జలుబు, దగ్గు, డయేరియా, డెంగు, మలేరియా, టైఫాయిడ్ వల్ల 24 లక్షల మంది మరణిస్తున్నారు. 60 కోట్ల మంది ప్రజలు తీవ్ర నీటిఎద్దడికి గురవుతున్నారు. గ్రామీణ భారతంలో 84 శాతం ప్రజలకు కుళాయి నీళ్లు అందుబాటులో లేవు. ఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్‌లను రద్దు చేసారు. ఎస్టీ, ఎస్సీ స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్‌కు పదుల వేల కోట్ల రూపాయల కోత విధిస్తున్నారు. 294 దళితుల పథకాలను 256కు తగ్గించారు. 307 ఆదివాసుల పథకాలను 201కి తగ్గించారు. రాష్ట్రాలు అమలు చేసే 24 పథకాలకు కేటాయించే నిధులలో కేంద్రం వాటా తగ్గిపోయింది. 8 పథకాలకు నిధుల కేటాయింపును పూర్తిగా నిలిపివేసింది. 14,700 గ్రామాలలో 2 కోట్ల 30 లక్షల కుటుంబాల ఇళ్లకు కరెంటు సౌకర్యం లేదు. గ్యాస్ సిలెండర్లను నింపుకునే ఆర్థిక స్థితి లేని బీపీఎల్ కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసారు. గ్రామీణ ప్రాంతాలలో 44 శాతం మంది ప్రజలు బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు. దేశంలో ఐదు సంవత్సరాల్లో ఆదర్శ్ గ్రామ్ పథకం కింద కేవలం 140 గ్రామాలను మాత్రమే ఆదర్శ్ గ్రామాలుగా ప్రకటించారు. సామ్రాజ్యవాదులు, దళారీ పాలకులు సూపర్‌లాభాల కోసం సాగిస్తున్న ఉత్పత్తి, వనరుల విధ్వంసం, వినిమయ విస్తరణ ద్వారా సాధిస్తున్న 'వృద్ధి' (వాపు) కారణంగా మన దేశ, ప్రపంచ పర్యావరణం తీవ్రంగా దెబ్బతిందని ముందే చూసాం. ఇందులో భాగంగా మన దేశంలో వాయు కాలుష్యం వల్ల కేవలం 2017లోనే 12 లక్షల మంది మరణించారు. మన దేశం ప్రపంచంలో అత్యంత మురికిదేశాల్లో ఒకటిగా ఉంది. ప్రపంచంలో 15 అత్యంత కాలుష్య నగరాల్లో 14 భారతదేశంలోనే ఉన్నాయి. చలికాలంలో మంటకాగేందుకు కట్టెలు కాకుండా ప్లాస్టిక్ సంచులు, రబ్బర్, టైర్, స్టైరోఫోమ్ తగులబెడుతుండడం వల్ల గాలిలో ప్రమాదకర రసాయనాలు 20 రెట్లు పెరిగిపోయాయి.

2018 నాటికి భారతదేశం ఎకనామిక్ ఫ్రీడం ర్యాంకింగ్‌లో 186 దేశాల్లో 143వ స్థానంలో ఉంది. మానవాభివృద్ధిలో 188 దేశాల్లో 131వ స్థానంలో ఉంది. ప్రపంచ హ్యాపీనెస్ సూచికలో 155 దేశాల్లో 122వ స్థానంలో ఉంది. ప్రెస్ స్వాతంత్ర్యంలో 180 దేశాల్లో 136వ స్థానంలో ఉంది. పిల్లల మరణాల రేటు ప్రపంచ సూచికలో 223 దేశాల్లో 175వ స్థానంలో ఉంది. ఆకలి సూచికలో 119 దేశాల్లో 103వ స్థానంలో ఉంది. సురక్షిత ఆహార సూచి–2018లో 113 దేశాల్లో 50వ స్థానంలో ఉంది. విద్యలో 197 దేశాల్లో 145వ స్థానంలో ఉంది. ఆరోగ్యంలో 195 దేశాల్లో 185వ స్థానంలో ఉంది. పర్యావరణ ప్రదర్శన సూచికలో 180 దేశాల్లో 'స్వచ్ఛ' భారత్ అట్టడుగున 177వ స్థానంలో ఉంది.

# అధికార మార్పిడి తర్వాత దేశ సామాజిక వ్యవస్థలో చోటు చేసుకున్న మార్పులు

1970ల ఆరంభం నుంచి సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాప్తంగా సార్వత్రిక సంక్షోభ ప్రభావంలో కూరుకుపోవడం, 1980లలో మరింత తీవ్రతరమైన ప్రపంచీకరణ విధానాలు చేపట్టడం, తన సంక్షోభ భారాన్ని భారతదేశం వంటి అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశాలపై మోపిన కారణంగా ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదానికీ, పీడిత జాతులు, పీడిత ప్రజలకూ మధ్య వైరుధ్యం తీవ్రతరమవుతూ వచ్చింది. ఈ డాక్యుమెంటులో విస్తారంగా పేర్కొన్నట్లు సామ్రాజ్యవాదం దిశానిర్దేశంలో దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య పాలకవర్గాల ప్రభుత్వాలు 1990ల ముందూ, ఆ తర్వాతా మన దేశంలో అమలు చేసిన విధానాల ఫలితంగా ఆర్థిక సంక్షోభం తీవ్రస్థాయికి చేరుకుంది. పీడిత వర్గాలైన కార్మిక, కర్షక, మధ్యతరగతి, జాతీయ బూర్జువావర్గంపై, మహిళలు, దళితులు, ఆదివాసీలు, మతమైనారిటీలు వంటి పీడిత సెక్షన్లపై, కశ్మీర్, ఈశాన్య జాతులపై దోపిడీ, పీడన, అణచివేత, వివక్ష తీవ్రరూపం తీసుకున్నాయి. గత ఏడు దశాబ్దాలలో భారత ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న మార్పుల ఫలితంగా దేశంలో ఉత్పత్తి శక్తుల స్థితిలో, ఉత్పత్తి సంబంధాలలో, వివిధ వర్గాల మధ్య సంబంధాలలో, వర్గ వైరుధ్యాలలో సంక్షిప్తంగా ఈ కింది మార్పులు చోటు చేసుకున్నాయి:

1. బొంబాయి ప్లాన్‌కు అనుగుణంగా గత ఏడు దశాబ్దాలలో వివిధ కేంద్ర, రాష్ట్రాల్లోని దళారీ ప్రభుత్వాలు సామ్రాజవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు అనుకూలమైన పలు ప్రణాళికలు, విధానాలు చేపట్టాయి. ప్రపంచీకరణ కాలంలో ఈ విధానాలు వ్యవస్థీకృతమయ్యాయి.

   ప్రపంచ ద్రవ్య పెట్టుబడి పలు రంగాలలో భూమండలంపై నివసించే పీడిత జాతుల, ప్రజల వినాశనాన్ని కొని తెచ్చే ఏడు తీవ్ర సంక్షోభాలను సృష్టించింది: ఆర్థిక సంక్షోభం, ఉపాధి సంక్షోభం, పర్యావరణ/జీవావరణ సంక్షోభం, ఇంధన సంక్షోభం, బలవంతపు వలస జనాభా సంక్షోభం, సామాజిక-సాంస్కృతిక సంక్షోభం, రాజకీయ-సైనిక సంక్షోభం. వెనుకబడిన దేశాల పరాధీనతను, బానిసత్వాన్నీ, లూటీని తీవ్రతరం చేసింది. ఆర్థిక అసమానతలు అత్యంత తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. పేదరికం, నిరుద్యోగం, ఆకలి, స్వచ్ఛమైన గాలి, నీరు లభించకపోవడం, మౌలిక హక్కులను, పౌరహక్కులను కాలరాయడం, శిక్షలు, చిత్రహింసల రేటూ పెరిగిపోతున్నది. యుద్ధాల వల్ల, హింసాత్మక ఘర్షణల వల్ల చనిపోయినవారు, గాయపడ్డవారు, నిర్వాసితుల సంఖ్య పదుల లక్షలకు పెరిగింది.

అందులో భాగంగా దేశీయ పరిశ్రమలలో పూర్తి విదేశీ భాగస్వామ్యాన్ని, అదుపులేని ప్రపంచ ద్రవ్య పెట్టుబడుల రాకపోకలను, వాటిపై సామ్రాజ్యవాద ఎంఎన్‌సీ/సంస్థల నియంత్రణను అనుమతించడం, విదేశీ టెక్నాలజీపై ఆధారపడడం ద్వారా దేశాన్ని మరింత పరాధీనంగా మార్చాయి. సామ్రాజ్యవాద అంతర్జాతీయ గుత్త సంస్థలు, దేశంలో వాటి దళారీ కంపెనీలు ఎగుమతి ఆధారిత, దిగుమతి ఆధారిత పరిశ్రమలలో, ప్రత్యేకించి ఔట్‌సోర్సింగ్ పరిశ్రమల్లో, అగ్రిబిజినెస్ కంపెనీల్లో శ్రమశక్తిని, ఉత్పత్తులను, సేవలను, ప్రత్యేకించి ముడిపదార్థాలను నిరంతరం కొల్లగొడుతున్నాయి. వివిధ సామ్రాజ్యవాద దేశాల ఎంఎన్‌సీలు, టీఎన్‌సీలతో జాయింట్ వెంచర్లు, విదేశీ అనుబంధ పరిశ్రమలు, విదేశీ పెట్టుబడులు, 'సహాయం', గ్రాంటులు, అప్పులు పెరిగిపోయాయి. రూపాయి విలువ తీవ్రంగా పడిపోయింది.

పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) అనే దోపిడీ విధానాన్ని మరింత విస్తరించి అమలు చేస్తున్నారు. ఇందులో ఫ్లాగ్‌షిప్ పథకాలు (భారతమాల పథకం, సాగరమాల పథకం, ప్రత్యేక రవాణా కారిడార్ పథకాలు వంటి) అమలవుతున్నాయి. ఇది ప్రపంచ ద్రవ్య పెట్టుబడిదారులు సృష్టించిన రవాణా-కేంద్రిత అభివృద్ధి అనే భావనలో భాగమే. పీపీపీ ప్రాజెక్టు కంపెనీలతో పాటు స్టార్టప్‌లు, లైట్ అస్సెట్ మోడల్ కంపెనీలను స్థాపించడం ద్వారా అంతర్జాతీయ గుత్త సంస్థలు, వాటి దళారీ కంపెనీలు కార్మికుల్ని తీవ్రంగా దోపిడీ చేస్తూ సూపర్ లాభాలు ఆర్జిస్తున్నాయి.

సంఘటిత రంగంలో, డీ-ఇండస్ట్రియలైజేషన్, డీ-రెగులేషన్, పబ్లిక్ రంగంలో పెట్టుబడుల ఉపసంహరణ పెద్దెత్తున చేస్తుండడంతో ఆ రంగాలు క్షీణించిపోతున్నాయి. అసంఘటిత రంగం, ప్రైవేటురంగం ప్రధాన రంగాలుగా మారాయి. దీంతో కార్మికుల నిజవేతనాలు తీవ్రంగా పడిపోతున్నాయి. వారు పోరాడి సాధించుకున్న హక్కులు కాలరాచివేయబడుతున్నాయి. కార్మికుల క్యాజువలీకరణ, కాంట్రాక్టీకరణ పెద్దెత్తున పెరిగిపోయాయి. వీరిలో పెద్దసంఖ్యలో మధ్యయుగాల పనిపరిస్థితులలో కట్టుబానిసలుగా పని చేస్తున్నారు. స్వయంఉపాధి పొందేవారి సంఖ్య 50 శాతానికి మించిపోయిందని లెక్కలు చెబుతున్నప్పటికీ నిజానికి వారంతా అర్ధ-ఉద్యోగితతో సతమతమవుతున్నారు.

అధికార మార్పిడి తర్వాత జీడీపీలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల వాటా 50 శాతం నుంచి 14.4 శాతానికి పడిపోయి భారీ వ్యవస్థీకృత మార్పులకు లోనైంది. అదే సమయంలో దేశ జీడీపీలో మాన్యుఫాక్చరింగ్ రంగం వాటా ఆసియా దేశాలన్నింటి కంటే అత్యల్పంగా 31.5 శాతంగా ఉంది. జీడీపీలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వ్యవసాయ కూలీలను ఇముడ్చుకోకుండానే సర్వీసు రంగం అతిగా వాచిపోయి, జీడీపీలో

దీని వాటా 54.1 శాతానికి పెరిగింది.

దేశ ఎగుమతుల్లో అత్యధిక భాగం వ్యవసాయోత్పత్తులు, సగం పూర్తయిన సరుకులు ఆక్రమిస్తుండగా, దిగుమతులలో అత్యధిక భాగం అమెరికా, రష్యా, యూరప్, చైనా, జపాన్ తదితర సామ్రాజ్యవాద దేశాల నుంచి పూర్తయిన పారిశ్రామిక ఉత్పత్తులు ఆక్రమిస్తున్నాయి.

2. గ్రామీణ ప్రాంతాలలో వీటి చేతిలో మరింతగా భూమి బంధించబడింది. భూకేంద్రీకరణకి సంబంధించిన గత రూపాలలో మార్పు వచ్చినప్పటికీ అది నూతన రూపాలలో పెరిగింది. ప్రభుత్వ అధికారిక గణాంకాలు చూసినా ఇది స్పష్టమవుతుంది. 1970–71లో యావత్తు వ్యవసాయ కుటుంబాలలో 3.9 శాతంగా ఉన్న భూస్వామ్య కుటుంబాల వద్ద ఐదు కోట్ల హెక్టార్ల లేదా 12.5 కోట్ల ఎకరాల భూమి ఉన్నది. 2012–13లో 70వ రౌండు జాతీయ సాంపిల్ సర్వే ప్రకారం 7 శాతం గ్రామీణ ధనిక కుటుంబాల చేతిలో దాదాపు సగం సాగుభూమి ఉంది. 2015 సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం 10 శాతంగా ఉన్న భూస్వాముల చేతిలో 55 శాతం భూమి కేంద్రీకృతమై ఉంది. ఈ ఏడు దశాబ్దాల కాలంలో సామ్రాజ్యవాదంతో కుమ్మక్కైన పాత–కొత్త భూస్వామ్య, దళారీ నిరంకుశ బుర్జువా పాలకవర్గాలు నూతన రూపాల్లో లెక్కకు అందనంతగా కోట్లాది హెక్టార్ల భూమిని కబ్జా చేసుకున్నాయని వివిధ అధ్యయనాలను బట్టి స్పష్టమవుతోంది. ఈ మూడు మహా పర్వతాలు దేశంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయి.

3. దేశంలో బ్రిటీషు కాలంతో పోల్చితే గత ఏడు దశాబ్దాలలో పెట్టుబడిదారీ సంబంధాలు మరింత వికృత రూపం తీసుకున్నాయి. అర్ధభూస్వామ్యంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ సంస్కరణలు, వివిధ విప్లవ, ప్రజాస్వామిక పోరాటాల ఫలితంగా గ్రామాలలో భూస్వామ్య దోపిడీలో, దోపిడీ రూపాలలో, గ్రామీణ వర్గ పొందికలో మార్పు రావడంతో భూస్వామ్యశక్తులలో నూతన శక్తులు వచ్చి చేరడంతో భూస్వామ్య ఆధిపత్య రూపంలో మార్పు వచ్చింది. ప్రభుత్వ, ప్రభుత్వేతర 'పార్టీ–సహకార సంస్థ–పంచాయితీ–పోలీసు' వ్యవస్థలు కుమ్మక్కై నూతన భూస్వామ్య రూపం తీసుకుంది. నూతన దోపిడీ రూపాలు ముందుకు వచ్చాయి.

4. అధికార మార్పిడి తర్వాత 'హరిత విప్లవానికీ' ముందు, తర్వాత దళారీ పాలకవర్గాలు అమలు చేసిన సామ్రాజ్యవాద ప్రాయోజిత ఆర్థిక విధానాల కారణంగా దేశంలో వ్యవసాయ, వ్యవసాయానుబంధ రంగాలు తీవ్ర సంక్షోభానికి గురయ్యాయి. ఆధునిక వ్యవసాయ పద్ధతులు గత ఏడు దశాబ్దాలలో చెప్పుకోదగిన ప్రాంతాలలో అమలులోకి

వచ్చాయి. యంత్రాల వినియోగం పెరిగింది. అయితే ఇవి ఏవీ వీటన్నింటి ఫలితంగా వ్యవసాయంలో అర్ధభూస్వామ్య సంబంధాలపై ఆధారపడి సామ్రాజ్యవాదుల, దళారీ పాలకుల దోపిడీ, పీడన, అణచివేత మరింత పెరిగాయి. సామ్రాజ్యవాదపు పట్టు పెరగడంతో దేశ పరాధీనత మరింత పెరిగింది. వ్యవసాయం కోలుకోలేని సంక్షోభంలో పడింది. ఈ కారణంగా రోజు రోజుకూ వ్యవసాయ భూకమతాల విభజన జరుగుతూ వాటి సంఖ్య పెరుగుతున్నది. 1970-71లో యావత్తు భూకమతాలూ 7.1 కోట్లు ఉండగా 1980-81లో అది 8.89 కోట్లకు పెరిగింది. 1990-91లో 10.53 కోట్లకు పెరిగింది. 2002-03లో ఎన్ఎస్ఎస్ 59వ రౌండ్ సర్వేలో ఇవి వరుసగా 10,72,28,000 హెక్టార్లు (మొత్తం భూమి), 0.725 హెక్టార్ (సగటు భూకమతం)గా ఉండేవి. 2012-13లో ఎన్ఎస్ఎస్ 70వ రౌండ్ గణాంకాల ప్రకారం మొత్తం అంచనా వేయబడిన భూమి 9,23,69,000 హెక్టార్లకు, వ్యవసాయ కుటుంబాలు సగటున కలిగి వున్న భూమి 0.592 హెక్టార్‌కు తగ్గింది.

నిరంతరం చిన్న భూకమతాల సంఖ్య, వ్యవసాయ రంగంలో సాధారణ పంటల ఉత్పత్తి పెరుగుతూ ఉంది. పెద్ద భూకమతాలలో కూడా పెట్టుబడిదారీ దేశాలతో పోల్చితే ఉత్పాదకత చాలా తక్కువగా వుంది. ఇది అర్ధభూస్వామ్య సంబంధాలకు, వెనుకబడిన అర్ధభూస్వామ్య ఉత్పత్తి విధానానికి ఒక ముఖ్యమైన గీటురాయి. ఇది పెట్టుబడిదారీగా పరివర్తన చెందడం సాధ్యం కాదు. ఎందుకంటే లెనిన్ చెప్పినట్లుగా, పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి ఇటువంటి పెద్ద భూకమతాలను సృష్టించడానికి, వాటి ద్వారా చెల్లాచెదురుగా వున్న శ్రమను సామాజీకరించడానికి సంబంధించిన ఎటువంటి ప్రక్రియ కూడా మన దేశంలో వ్యాప్తిలో లేదు.

5. గత ఏడు దశాబ్దాలలో గ్రామీణ భారతదేశంలో రైతాంగం వర్గపొందికలో చెప్పుకోదగిన మార్పులు చోటు చేసుకున్నాయి. 1961లో మొత్తం భూమిలేని వ్యవసాయ కూలీల సంఖ్య 24.04 శాతం. ఈ సంఖ్య 1991 నాటికి 46 శాతానికి పెరిగిపోయింది. ప్రపంచీకరణ తర్వాత సామ్రాజ్యవాద దాడి ఫలితంగా రైతాంగం భూములు కోల్పోయి, వ్యవసాయ కూలీలుగా, వలస అర్ధ-కార్మికులుగా, 'గ్రామీణ నిరుద్యోగ రిజర్వు'గా మారిపోతున్నవారి సంఖ్య పెరుగుతున్నది. ఇది 2001లో 57 శాతానికి చేరుకుంది. వీరి సంఖ్య 2002-03లో 60.1 శాతం నుంచి 2012-13లో 66.1 శాతానికి పెరిగింది. భూమిలేనివారి సంఖ్య కొన్ని చోట్ల చాలా అధికంగా ఉంది. 2015 సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం 54.38 శాతం కుటుంబాలకు ఏ పూటకు ఆ పూట గడవడమే గగనంగా ఉంది. 'దున్నేవారికే భూమి' ఇప్పటికీ వీరి తక్షణ డిమాండ్, రణనినాదంగా ఉంది. పేద, మధ్యతరగతి కౌలుదార్లు కూడా ఇందులో ముందువరసలో ఉంటారు.

గత ఏడు దశాబ్దాలలో వ్యవసాయంలో, వ్యవసాయానుబంధ రంగాల్లో వేతనశ్రమ పెరిగింది. వేతనంపై పనిచేసే వ్యవసాయ కూలీల, అర్ధ-కార్మికుల సంఖ్య పెరిగింది. దీంతో పైపైన చూసేవారికి గ్రామీణ ప్రాంతాలలో భూస్వామ్య దోపిడీ పెట్టుబడిదారీ రూపం తీసుకున్నట్లుగా కనిపిస్తోంది. నిజానికి ఇక్కడ అర్ధ-కార్మికులు పొందే వేతనాలకు, పరిశ్రమల్లో ఆధునిక కార్మికవర్గం పొందే వేతనాలకు ఏమాత్రం పొంతన లేదు. ఏ వేతన సంఘ సిఫార్సులు వ్యవసాయ రంగంలోని వేతన కార్మికులకు/అర్ధ-కార్మికులకు వర్తించడం లేదు. కనుక ఈ మార్పు ప్రస్తుతం ఉనికిలో వున్న అర్ధభూస్వామ్య దోపిడీని ఏమాత్రం తక్కువ చేయలేదు. ఎందుకంటే ఆధిపత్య కుల భూస్వామికీ, దళిత భూమిలేని శ్రామికుడికి మధ్య వేతన శ్రమ కాంట్రాక్టు అర్ధభూస్వామ్య మూలాన్ని కలిగి ఉంది. ఇది ఒకే సమయంలో ఆర్థిక, ఆర్థికేతర దోపిడీ, పీడనకు ఆధారంగా ఉంది. గ్రామీణ ప్రాంతాలలో ఈ కుల-వర్గ పీడన ఇప్పటికీ ప్రబలంగా ఉంది.

వ్యవసాయానుబంధ రంగాలలో పనిచేసే వివిధ రకాల అర్ధ-కార్మికులు, వృత్తి నిపుణులు, ఉద్యోగులు, స్వయంఉపాధిని పొందేవారు సైతం దేశీయ మార్కెట్ సంక్షోభానికి గురికావడం వల్ల ఉపాధి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు.

శ్రమజీవులుగా, రైతులుగా మహిళలు, దళితులు, ఆదివాసులు ఈ మూడు మహా పర్వతాల కారణంగా తీవ్రమైన దోపిడీ, పీడన, వివక్షలకు గురవుతున్నారు. అదే సమయంలో వారు ఇప్పటికీ పలు తీవ్రమైన సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. అవి వర్గ పోరాటంతో, నూతన ప్రజాస్వామిక విప్లవంతోనే ముడిపడి ఉన్నాయి.

అధికార మార్పిడి తర్వాత ఈ ఏడు దశాబ్దాల కాలంలో దళారీ పాలకులు చేపట్టిన విధానాలు కేవలం విదేశీ ఎంఎన్‌సీలు, వాటితో కుమ్మక్కైన దేశీయ కార్పొరేట్ కంపెనీల, బడా భూస్వాముల ప్రయోజనాలు మాత్రమే నెరవేరుస్తుండడం, వ్యవసాయంలో ఆహార పంటలు తగ్గిపోయి, వ్యాపార పంటలకు ప్రాధాన్యత పెరగడం వలన సామ్రాజ్యవాద ఎంఎన్‌సీలు, అగ్రిబిజినెస్ కంపెనీలు, వాటి దళారీ కంపెనీల దోపిడీ, వ్యవసాయ మార్కెట్లలో ముందస్తు మార్కెట్ల (ఫార్వార్డ్ లేదా ఫ్యూచర్ ట్రేడింగ్) ప్రాబల్యం, దళారీల దోపిడీ తీవ్రరూపం దాల్చింది. రైతు చేతికి పంట వచ్చినప్పుడు రేటు తక్కువగా, వ్యాపారుల చేతిలోకి పంట పోయినప్పుడు రేటు అనేక రెట్లు అధికంగా ఉంటున్నది. భూమి సమస్య, కౌలుదారీ సమస్య, పంటలకు గిట్టుబాటు ధర సమస్య, బలవంతపు విస్థాపన సమస్య, వ్యవసాయానుబంధ రంగాల సమస్య మొదలైనవి వ్యవసాయాన్ని కోలుకోలేని సంక్షోభంలో నెట్టివేసాయి. ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనం కంటే పేద, మధ్యతరగతి రైతు కుటుంబాల సగటు నెలసరి ఆదాయం తక్కువగా ఉంటున్నది. ఫలితంగా మధ్యతరగతి రైతాంగం దివాలాతీస్తున్నది. వారి సంఖ్య నానాటికీ

తగ్గిపోతున్నది. అదే విధంగా ధనిక రైతులపై సైతం వ్యవసాయ సంక్షోభం ప్రభావం తీవ్రంగా ఉంది. ఫలితంగా ఉత్పత్తి శక్తుల అభివృద్ధి గిడసబారిపోవడంతో పాటు అవి పెద్దెత్తున ధ్వంసం అవుతున్నాయి. ఏ ప్రాంతంలో వ్యాపార పంటలు అధికంగా విస్తరించాయో అక్కడే నిరంతరం రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

2015 సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం దేశంలో 74 శాతం గ్రామీణ జనాభాగా ఉంది. 60 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉంది. అంటే ఉత్పత్తిదారులలో రైతులు, వ్యవసాయ కూలీలు, అర్ధ-కార్మికులు మెజారిటీగానూ, పారిశ్రామిక కార్మికులు మైనారిటీగానూ ఉండడం, ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఉత్పత్తి శక్తులు ధ్వంసం అవుతూ ఉండడాన్ని (పరిశ్రమల మూసివేత, వ్యవసాయ సంక్షోభం, ప్రత్యేకించి రైతుల ఆత్మహత్యలను) బట్టి భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ వెనుకబడిన అర్ధభూస్వామ్య స్థితిలోనే ఉందని స్పష్టమవుతుంది.

బ్రిటీషు సామ్రాజ్యవాదుల వలస పాలనలో ధ్వంసమైన చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, తదితరాలను పునరుద్ధరించేందుకు అధికార మార్పిడి తర్వాత దళారీ పాలకులు చేపట్టిన పథకాలు పైపై మెరుగులకే పరిమితమయ్యాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఉపాధిని కల్పిస్తూ ముఖ్యమైన పాత్ర పోషిస్తూ వచ్చిన చేతివృత్తులు ఈ ఏడు దశాబ్దాల కాలంలో మరణావస్థకు చేరుకున్నాయి.

6. అధికార మార్పిడి తర్వాత కౌలు నిర్మూలనా చట్టాలు, ఇతర సంస్కరణ కార్యక్రమాలు సాధించింది ఏమీ లేదు. గతంలో ప్రత్యక్ష కౌలు దోపిడీ రూపాలు నేటికీ కొనసాగుతున్నాయి. కొన్ని రూపంలో మారినా సారాంశంలో మారలేదు. ప్రత్యేకించి సంస్కరణానంతర కాలంలో “కౌలుదారీ విధానం పునరుద్ధరించబడడం” కనపడుతుంది. నానాటికీ ‘గ్రామీణ నిరుద్యోగ రిజర్వు’లో చేరిపోతున్న పేద, మధ్యతరగతి రైతులు తమ బతుకుతెరువుకు కౌలు వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. అనివార్యంగా కౌలు వ్యవసాయం చేయాల్సి రావడం, అర్ధభూస్వామ్య వ్యవస్థలో రాజ్యాధికారం గ్రామంలోని భూస్వామ్య శక్తులు, ప్రభుత్వ-పోలీసు-న్యాయ అంగాలతో పెనవేసుకొని ఉండడంతో భూస్వామ్య దోపిడీ, వెట్టి క్రూరంగా కొనసాగుతున్నది. మరోవైపు భూస్వాములు, ధనిక రైతులు భూములను ‘రివర్స్ కౌలు’కు పేద రైతాంగాన్ని దోపిడీ చేసే నూతన రూపం ఇప్పుడు విస్తృతంగా అమలులో ఉంది.

7. ప్రపంచీకరణకు ముందు రైతాంగంపై అమలులో ఉన్న భూస్వామ్య ఆర్థికేతర దోపిడీ రూపాలు నేటికీ అమలులో ఉన్నాయి. ప్రత్యేకించి దళితుల వెట్టి, అర్ధ-వెట్టి, నయా-వెట్టితో వివిధ రూపాలలో కొనసాగుతున్నది. కుల ఆధారిత బ్రాహ్మణవాదం ఇప్పటికీ సజీవంగా

గ్రామీణ ప్రాంతాల్లో ఉండడం, ప్రత్యేకించి దళితులు దీని వల్ల తీవ్ర దోపిడీ పీడనలకు గురవుతున్నారు.

తీవ్రమైన వడ్డీ వ్యాపార దోపిడీ వివిధ రూపాలలో కొనసాగుతున్నది. రుణాల పేరుతో కేవలం భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, మార్కెట్ వ్యాపారులే కాకుండా, వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర ఫైనాన్స్ సంస్థలు, మొదలైనవి కూడా రైతాంగాన్ని తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయి. నయా ఉదారీకరణ కాలంలో ప్రభుత్వ మదుపు, వ్యవసాయానికి ప్రభుత్వ రుణం తగ్గుతూ వస్తోంది. ఇది వడ్డీ వ్యాపారానికి మరింత అవకాశాన్ని ఇచ్చింది.

8. కాంట్రాక్టు–కార్పొరేట్ వ్యవసాయం క్రమంగా విస్తరిస్తోంది. యావత్తు రైతాంగ భూములను కబ్జా చేసి రైతులను తమ భూములలో వ్యవసాయ కూలీలుగా మార్చడం సామ్రాజ్యవాదుల, వారి దళారీ అగ్రిబిజినెస్ కంపెనీల లక్ష్యంగా ఉంది.

9. గత ఏడు దశాబ్దాల కాలంలో బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాదం దేశంలో పెద్దెత్తున పెచ్చరిల్లింది. 1947లో దేశ విభజన సందర్భంగా లక్షలాది ముస్లిం ప్రజల ఊచకోత నుంచి మొదలుకొని, అహ్మదాబాద్ (1969), భివండి, మహారాష్ట్ర (1970), తెల్లచ్చేరి, కేరళ (1971), జెంషెడ్‌పూర్, ఝార్ఖండ్ (మునుపటి బిహార్) (1979), భాగల్పూర్, బిహార్, మీరట్, ఉత్తరప్రదేశ్ (1980), తమిళనాడు (1982), బాబ్రీమసీదు కూల్చివేత (1992), గుజరాత్ (2002), కంధమాల్, ఒడిశా (2008), ఉత్తరప్రదేశ్ (2013), హిందుత్వ శక్తులు 2000లో మొదటిసారి, 2014లో రెండవసారి, 2019లో మూడవసారి కేంద్రంలో అధికారంలోకి రావడం, ముస్లిములపై, దళితులపై, ఆదివాసులపై క్రూరమైన మోబ్ లించింగ్ హత్యలు, బాబ్రీమసీదు స్థలంలో 2019 నవంబర్‌లో రామాలయ నిర్మాణానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వడం వరకూ అది అనేక హత్యాకాండలను, అత్యాచారాలను, అగ్నికాండలను, ఆస్తుల ధ్వంసాన్ని, లూటీని సాగించింది. ప్రత్యేకించి దీని ఉన్మాదపూరితమైన హింసాత్మక దాడుల్లో ముస్లిం మతమైనారిటీలు అధికంగా నష్టపోయారు. దళితులు, ఆదివాసులు, మహిళలు, అలాగే క్రిస్టియన్లు సైతం తీవ్రంగా నష్టపోయారు. ముస్లిముల స్థితిగతులపై సచ్చర్ కమిషన్ నివేదికను కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు బుట్టదాఖలు చేసాయి. దేశాన్ని హిందుత్వ రాజ్యంగా మార్చే లక్ష్యంతో హిందుత్వ శక్తులు ఇప్పటికే చాలా ముందుకుసాగాయి. ఇదంతా ప్రపంచ ద్రవ్య పెట్టుబడి నిర్దేశితమైనదేననేది ఇక్కడ గుర్తుంచుకోవాలి. దేశంలో ఫాసిజాన్ని బలోపేతం చేసి దేశంలో అన్ని రంగాల్లో ఫాసిస్టు భావజాలాన్ని, దాని ఆధిపత్యాన్ని నెలకొల్పడం ద్వారా తన దోపిడీకి మార్గాన్ని సుగమం చేసుకోవడమే ద్రవ్య పెట్టుబడి లక్ష్యం.

10. బ్రాహ్మణవాద హిందుత్వ భావజాలంపై ఆధారపడిన నిచ్చెనమెట్ల కులవ్యవస్థ భారత అర్ధభూస్వామ్య సంబంధాలలో అంతర్భాగంగా ఉంది. దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య శక్తుల నాయకత్వంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పీడక కులాలు మనుధర్మాన్ని అమలు చేస్తూ పీడిత,దళిత కులాలపై,ఆదివాసులపై అమలు చేసే అణచివేత, పీడన, వివక్ష, అంటరానితనం, సాంఘిక బహిష్కరణ రూపాలు, ప్రత్యక్ష హింస, హత్యాకాండలు, సజీవ దహనాలు, మహిళలపై లైంగిక అత్యాచారాలు, గృహదహనాలు, ఆస్తుల విధ్వంసం, లూటీ సర్వసాధారణంగా నేటికీ కొనసాగుతున్నాయి. బెల్చి (బిహార్), కిల్వెన్‌మణి (తమిళనాడు), బతానీటోల (బిహార్), ఆంధ్రప్రదేశ్‌లో కారంచేడు, నీరుకొండ, చుండూర్‌ల నుంచి సోంపేట వరకు, మహారాష్ట్రలో ఖైర్లాంజి, జీవ్‌ఖేడ వంటి ఘటనలు, భీమాకోరేగావ్ ముందు, తర్వాతా హత్యాకాండలు, గుజరాత్‌లో ఉనా అత్యాచారం ఇందుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రాథమిక స్థాయి నుంచి అత్యున్నత స్థాయి విద్యా సంస్థల్లో, విశ్వవిద్యాలయాల్లో బ్రాహ్మణీయ శక్తుల జులుం కొనసాగుతున్నది. పాఠ్య ప్రణాళికలు బ్రాహ్మణీకరిస్తున్నాయి. ఫలితంగా విద్యార్థుల హత్యలు, ఆత్మహత్యలు, దాభోల్కర్, పన్సారే, కల్‌బుర్గి, గౌరీలంకేష్ వంటి ప్రగతిశీల, లౌకికవాదులపై బెదిరింపులు, హత్యలు, దాడులు జరుగుతున్నాయి. రోహిత్ వేముల ఆత్మహత్య తర్వాత దేశవ్యాప్తంగా పెల్లుబికిన నిరసన వెల్లువ, ఇలాంటి పలు నిరసనలు బ్రాహ్మణీయ హిందుత్వ పాశవికతను ఎండగడుతున్నాయి.

11. విద్య, ఆరోగ్యం, నివాసం, పని/శ్రమ విభజన, పీడిత కులాల సామాజిక హోదా, సంపదపై యాజమాన్యం, మొదలైనవాటిలో వివక్ష, మహిళలపై పితృస్వామ్యం ఇప్పటికీ స్పష్టంగా కనపడుతుంది. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' పేరుతో దేశాన్ని బ్రాహ్మణీయ హిందుత్వ రాజ్యంగా మార్చి 'అఖండ భారత్'ను స్థాపించే బృహత్ లక్ష్యంతో మత మైనారిటీలపై ప్రత్యేకించి ముస్లిములపై, క్రిస్టియన్లపై, జాతి విముక్తి ఆకాంక్షలతో పోరాడుతున్న కశ్మీర్, ఈశాన్య జాతులపై నిరంతరం సాగిస్తున్న దాడులు ఇందులో భాగమే. బ్రాహ్మణీయ హిందుత్వ ఆధిపత్యానికీ, అత్యాచారాలకు వ్యతిరేకంగా పీడిత/దళిత కులాలలో, ఆదివాసులలో, మైనారిటీలలో, పీడిత జాతులలో పెరుగుతున్న ప్రగతిశీల, ప్రజాస్వామిక చైతన్యాన్ని చూసి సహించలేని, ఆధిపత్య కులాల భూస్వామ్య శక్తుల ఉన్మాదపూరిత హింసాత్మక దాడుల కారణంగా పలు సందర్భాల్లో అణచివేత, పీడన, వివక్షలు తీవ్ర రూపం తీసుకున్నాయి.

**వర్గపోరాటం ఫలితంగా జరిగిన మార్పులు :**

భారతదేశంలో 1947 అధికార మార్పిడి తర్వాత వివిధ రంగాలలో కొన్ని ముఖ్యమైన

మార్పులు జరిగాయి. అలాగే గత ఐదు దశాబ్దాల కాలంగా మన పార్టీ నాయకత్వంలో భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాలతో పాటు సామ్రాజ్యవాద, ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు తీవ్ర స్థాయిలో జరిగిన ఫలితంగా వివిధ విప్లవోద్యమపు రాష్ట్రాల్లో/ప్రాంతాలలో గణనీయ మార్పులు చోటు చేసుకున్నాయి. 1960 దశకం రెండవ భాగంలో, 1970ల దశకం మొదటి భాగంలో నక్సల్బరీ సాయుధ రైతాంగ విప్లవ వెల్లువలో భాగంగా దేశవ్యాప్తంగా సాగిన భూస్వామ్య వ్యతిరేక సాయుధ రైతాంగ పోరాటాలు దేశ సామాజిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేసాయి. ఆ తర్వాత 1970ల దశకం చివరి నుంచి మరోసారి ఇలాంటి సాయుధ రైతాంగ పోరాట వెల్లువ బద్దలయింది. ఇందులో భాగంగా భూస్వామ్య సంబంధాలు బలంగా వున్న బిహార్ రాష్ట్రంలో, ఝూర్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాలలో, తెలంగాణ, రాయలసీమ, ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర, దక్షిణ కోస్తాలలోని, పశ్చిమ బంగ్, తమిళనాడు, కర్నాటక, ఒడిశా, మహారాష్ట్రలలోని కొన్ని ప్రాంతాలలో జరిగిన వర్గ పోరాటాల స్వభావం, జరిగిన మార్పుల స్వభావం దాదాపు ఒకేలాంటివి. అలాగే ఝూర్ఖండ్ రాష్ట్రంలో, దండకారణ్యం (ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర), ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, తూర్పు గోదావరి మన్యం ఏజెన్సీ, తెలంగాణ, పశ్చిమ బంగ్, ఒడిశాలలోని ఆదివాసీ ప్రాంతాలలో సామాజిక పరిస్థితి, టెర్రయిన్ స్థితి గానీ, ఇక్కడ జరిగిన వర్గ పోరాటాల స్వభావం, జరిగిన మార్పుల స్వభావం గానీ మూలంలో ఒకేలాంటివి.

భూస్వామ్య సంబంధాలు బలంగా వున్న ప్రాంతాలలో బలంగా జరిగిన భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాల ఫలితంగా నూతన భూస్వామ్య వర్గం పుట్టుకు వచ్చింది. పాత భూస్వాములు తమ ఆస్తులను, పెట్టుబడులను పట్టణ ప్రాంతాలకు తరలించారు. పాత భూస్వామ్య కుటుంబాల్లో చాలా మంది పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డారు. ఈ ప్రాంతాల్లో క్రమంగా వ్యవసాయం మీద ఆధారపడే భూస్వాముల సంఖ్యా, గ్రామీణ జీవితంలో వారి పాత్ర తగ్గిపోయి వారి స్థానంలో వ్యవసాయ, వ్యవసాయేతర గ్రామీణ పెత్తందార్ల ఆధిపత్యం ఏర్పడింది. భూమి ప్రధానంగా వారి చేతుల్లోనే కేంద్రీకరించబడింది. వీరి ఆధ్వర్యంలో రైతాంగాన్ని పీల్చిపిప్పిచేసే పలు నూతన దోపిడీ పద్ధతులు/విధానాలు ముందుకొచ్చాయి. గతంలో అనేక రకాల ఆర్థికేతర దోపిడీ రూపాలతో పాటు అక్రమ శిస్తుల వసూళ్ల ద్వారా, పలు రకాల భూములు హస్తగతం చేసుకోవడం తదితర రూపాల ద్వారా భూస్వామ్య వర్గం రైతాంగాన్ని దోపిడీ చేసి మిగులు దక్కించుకునేది. సామాజికంగానూ, వర్గ పోరాట ఫలితంగానూ మారిన పరిస్థితులలో, ముందే వివరించినట్లుగా, పై రూపాలు బలహీనపడి వాటి స్థానంలో అనేక నూతన దోపిడీ రూపాలు ముందుకొచ్చాయి. గ్రామాల వర్గపొందికలో గణనీయ మార్పులు వచ్చి, ఉత్పత్తిలో వక్రీకరించిన పెట్టుబడిదారీ సంబంధాలు విస్తరిస్తున్నాయి. అర్ధ భూస్వామ్య సంబంధాలు సాపేక్షికంగా బలహీనపడినాయి. 90వ దశకానికి ముందు గ్రామాల్లో సాధారణంగా పీడక కులాల భూస్వాములు, అందులో ఒకరిద్దరు పెద్ద భూస్వాములు, వారి ప్రాపకం కింద

ఉండే కొన్ని పీడక కులాల కుటుంబాలు, వారి దళారులు ఒకవైపు తక్కిన విశాల ప్రజారాశులు మరోవైపు వుండి వర్గపోరాటం సాగేది. ఆ తర్వాత కాలంలో దాదాపుగా అలాంటి స్థితి లేదు. గత భూస్వాముల్లో, ధనిక, మధ్య తరగతి రైతుల్లో కొంత మంది నేడు నూతన భూస్వాములుగా ఎదిగి గ్రామాధిపత్యం చెలాయిస్తున్నారు. వీరు, సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు కలిసి రాజ్యం దన్నుతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని మిగులును కొల్లగొడుతున్నారు. దీంతో నేడు వర్గ పోరాటాన్ని ఈ విప్లవ ప్రతీఘాతుక కూటమికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

విప్లవోద్యమం బలంగా కొనసాగిన ఆదివాసీ ప్రాంతాల్లో వర్గ పోరాటంలో భాగంగా అటవీ భూముల్ని స్వాధీనం చేసుకోవడం, గైరాదివాసీ, ఆదివాసీ భూస్వాముల, దుష్ట పెత్తందార్ల వద్దనున్న అదనపు భూముల్ని స్వాధీనం చేసుకోవడం, ప్రజా వ్యతిరేకులుగా, వర్గ శత్రువులుగా, విప్లవోద్యమ వ్యతిరేకులుగా ఉన్న కొద్దిమంది భూస్వాములను, దుష్ట తెగ పెద్దలను, పెత్తందార్లను, ఇన్‌ఫార్మర్లను అణచివేయడం, ప్రభుత్వ, ఫారెస్టు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ల దోపిడీ పీడనలను దెబ్బతీయడం జరిగింది. తెగ పెద్దలకు, పెత్తందార్లకు ప్రజలు చేసే వెట్టి పనులు రద్దయ్యాయి. వడ్డీ వ్యాపారాల్ని, సంత వ్యాపారుల దోపిడీని నియంత్రించారు. భూస్వామ్య–తెగ పెద్దల దోపిడీని తగ్గించారు. జీతగాళ్ళ పద్ధతులు చాలా వరకు తగ్గిపోయాయి. మరో వైపు అదే సమయంలో గత రెండు–రెండున్నర దశాబ్దాల కాలంలో ఇలాంటి వివిధ ప్రాంతాల్లో సామ్రాజ్యవాదుల, ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడికీ, రాజ్యానికీ, వీరి దళారులకు వ్యతిరేకంగా పోరాటాలు పెరుగుతూ వచ్చాయి. అదే సమయంలో విప్లవ రైతాంగ కమిటీలు/రైతుకూలీ సంఘాలు, విప్లవ ప్రజాకమిటీలు (ఆర్‌పీసీ) నిర్మాణమయ్యి, సంఘటితపడి, విస్తరిస్తున్న క్రమంలో భూస్వాముల, వడ్డీ వ్యాపారుల, ధనిక రైతుల, తదితర దోపిడీ శక్తుల దోపిడీ, పీడనలను అరికట్టడం, నియంత్రించడంతో ఈ ప్రాంతాలలో వర్గ సంపుటిలో కొన్ని గణనీయమైన మార్పులు జరిగాయి. ఉద్యమం బలంగా వున్న ప్రాంతాల్లో ఆర్‌పీసీలు అమలు చేసిన ఆర్థిక, రాజకీయ విధానాల వల్ల భూస్వాములు లేని లేదా వారి సంఖ్య గణనీయంగా తగ్గిన స్థితి ఏర్పడింది. రాజ్యం దన్నుతో పాత–కొత్త భూస్వాములతో, సామ్రాజ్యవాదులతో, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులతో పెనవేసుకుపోయిన నూతన విప్లవ ప్రతీఘాతుక కూటమి ఆవిర్భవించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని పేద రైతాంగపు సంఖ్య తగ్గి మధ్యతరగతి రైతాంగం సంఖ్య పెరిగింది. అయితే వర్గసంపుటిలో ఇప్పటికీ పేద రైతాంగమే అధికంగా వుంది. ప్రపంచీకరణ విధానాల ఫలితంగానూ వర్గ పోరాటం–ప్రజా రాజ్యాధికార అమలు ఫలితంగానూ, మధ్యతరగతి–విద్యార్థి–ఉద్యోగులతో కూడిన పెటీ బూర్జువా సెక్షన్ పెరిగింది. మరోవైపు వలస కార్మికులు, అసంఘటిత కార్మికులు పెరుగుతున్నారు. వ్యాపారస్థుల దోపిడీ పెరుగుతోంది. సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గపు దోపిడి, పీడనలు పెరుగుతున్నాయి.

దేశ సామాజిక వ్యవస్థలో సామ్రాజ్యవాద పెట్టుబడి చొరబడిన ప్రాంతాలంతటా, ప్రత్యేకించి ప్రపంచీకరణ విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత జరిగిన, జరుగుతున్న మార్పులను, వర్గ పోరాట ఫలితంగా చోటు చేసుకుంటున్న మార్పులను విడదీసి చూడలేం. అయితే వర్గ పోరాటం తీవ్రస్థాయిలో జరిగిన చోట, అది సామాజిక వ్యవస్థలోని వివిధ రంగాలలో జరిగే మార్పులపై కీలకమైన ప్రభావాన్ని వేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసిన విప్లవ ప్రతిఘాతక దాడులతో పాటు, మారిన సామాజిక పరిస్థితులకు అనుగుణంగా తగిన ఎత్తుగడలతో మనం వర్గపోరాటాన్ని నడపడంలో జరిగిన లోపాల వల్ల గతంలో వర్గపోరాటం తీవ్రంగా కొనసాగిన ప్రాంతాల్లో విప్లవోద్యమం తాత్కాలికంగా బలహీనపడింది. ఇలాంటి ప్రాంతాలలో నూతన భూస్వామ్యవర్గం, నూతన దోపిడీ శక్తులు పుట్టి పెరుగుతూ ఆధిపత్యం వహించే క్రమం వేగంగా పెరుగుతున్నది. కనుక గత ఏడు దశాబ్దాలలో సామాజిక పరిస్థితులలో జరిగిన మార్పులను, ప్రత్యేకంగా మన పార్టీ మన పార్టీ నాయకత్వాన జరిగిన వర్గ పోరాటాల ఫలితంగా చోటు చేసుకున్న మార్పులను దృష్టిలో పెట్టుకుని పాత, కొత్త దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా ప్రస్తుతం విప్లవోద్యమ ప్రాంతాలలో నిర్దిష్టంగా మనం తగిన ఎత్తుగడలతో వర్గపోరాట కార్యక్రమాన్ని రూపొందించుకుని అమలు చేయడం తక్షణ అవసరం.

## అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను నిర్మూలించి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించడమే తక్షణ కర్తవ్యం:

భారతదేశంలో కొనసాగుతున్న ఉత్పత్తి విధానాన్ని సంశ్లేషించుకునే ముందు మూడు మహా పర్వతాలు సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల గురించి మన పార్టీ ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ (2007) ఆమోదించిన 'భారత విప్లవ వ్యూహం–ఎత్తుగడలు' డాక్యుమెంట్ (18వ పేజీలో) చెప్పిన ఈ వాక్యాలను చూద్దాం:

"సామ్రాజ్యవాదం దేశంలోని భూమి, శ్రమ, ముడిపదార్థాలు తదితర సహజ వనరులను కొల్లగొడుతుంది. వివిధ మార్గాల ద్వారా దారుణమైన దోపిడిని సాగించి అది సూపర్ లాభాలను ఆర్జిస్తుంది. అది మొత్తం భారత ఆర్థిక వ్యవస్థను, రాజకీయ వ్యవస్థను, సైనిక వ్యవస్థను, సంస్కృతిని తన చెప్పుచేతల్లో ఉంచుకుంటుంది. దేశీయ పరిశ్రమను ప్రత్యేకించి చిన్న, మధ్యతరహా పరిశ్రమలను అది నాశనం చేస్తుంది. లక్షలాది కార్మికుల్ని అది వీధులలోకి గెంటేస్తుంది. జాతీయ ఆర్థిక వ్యవస్థ స్వతంత్రమైన, స్వేచ్ఛాయుతమైన అభివృద్ధిని అది అడ్డగిస్తుంది.

దళారీ బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంతో మిలాఖతవుతుంది, భూస్వామ్య విధానంతో జత కూడుతుంది. అది కార్మికవర్గం, రైతాంగం తదితర శ్రమజీవి ప్రజారాశులను మాత్రమే గాక, జాతీయ బూర్జువావర్గాన్ని కూడా పీడిస్తుంది.

కులపునాదిపై ఉన్న బ్రాహ్మణవాద భూస్వామ్య విధానం భారత ప్రజానీకంలోని అత్యధికులను

వెనుకబడిన ఉత్పత్తి సంబంధాలకే కట్టిపడవేసి వుంచడం ద్వారా ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి సంకెలగా పనిచేస్తుంది. ఆర్థికంగా అది ప్రజలలోని అత్యధికులను కటిక దారిద్ర్యంలో, దయనీయమైన స్థితిలో వుంచేస్తుంది. వారి కొనుగోలుశక్తిని కుంచిపజేస్తుంది. తద్వారా అది దేశీయ మార్కెట్టు వృద్ధిని పరిమితం చేస్తుంది. పారిశ్రామికాభివృద్ధిని కుంటుపరిచి పెద్దెత్తున నిరుద్యోగానికి, ఆర్థిక వ్యవస్థలో ప్రతిష్టంభనకు దారితీస్తుంది. రాజకీయంగా అది ప్రజారాశుల ప్రజాస్వామిక హక్కులను అణచివేస్తుంది. కొన్ని ప్రాంతాలలో అది 'రాజ్యంలో మరో రాజ్యాన్ని' సృష్టిస్తుంది. అంటే గ్రామీణ ప్రాంతాలలో తమ సొంత ప్రైవేటు సైన్యాలను కలిగి వున్న లేదా రాజ్యపు కిరాయి సాయుధ మూకల మద్దతు గల ఒక సమాంతర భూస్వామ్య రాజ్యాన్ని సైతం సృష్టిస్తుంది. అది రైతాంగాన్ని శాశ్వతమైన దాస్యానికి, వెట్టికి గురిచేస్తుంది. బ్రాహ్మణవాదమూ, కులవ్యవస్థా సమాజపరంగానూ, సిద్ధాంతపరంగానూ కింది కులాలలపై, దళితులపై ఇంకా అదనపు పీడనను కలగజేస్తాయి. దళితుల విషయంలో అది అంటరానితనం అనే అమానుష రూపం తీసుకుంటుంది. ఇవి భూస్వామ్య శక్తులకు మిగులు(సర్‌ప్లస్)ను దండుకోవడంలో ఆర్థికేతర (extra-economical) బలప్రయోగ సాధనాలుగా కూడా ఉపకరిస్తాయి.

నూతన ప్రజాస్వామిక సమాజ నిర్మాణం కోసం భారత ప్రజల మూపులపై వుండి వారిని కుంగదీస్తున్న ఈ మూడు మహా పర్వతాలను నాశనం చేయాలి".

ప్రస్తుత ఈ డాక్యుమెంటులో దేశంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత, ప్రత్యేకించి 1990ల నుండి నేటి వరకు దేశ సామాజిక వ్యవస్థలో, ప్రత్యేకించి వ్యవసాయిక గ్రామీణ రంగంలో అన్ని రంగాలలో చోటు చేసుకున్న మార్పుల గురించి ఇప్పటి వరకూ వివరంగా చూసాం. ఈ పరిణామాలను, మార్పులను సంశ్లేషించుకుంటే పై ఉల్లేఖన నేటికీ పూర్తిగా సరైందని స్పష్టమవుతుంది.

గత ఏడు దశాబ్దాలలో జరిగిన మార్పులను బట్టి భారత ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీగా గానీ, పెట్టుబడిదారీగా పరివర్తన చెందే మార్గంలో గానీ ఎంతమాత్రమూ లేదనీ, అటువంటి ప్రజాస్వామిక ధోరణి ఏదీ దేశంలో లేదనీ, అయితే ఇందుకు భిన్నంగా, అర్ధభూస్వామ్య సంబంధాలు సాపేక్షంగా బలహీనపడ్డాయనేది నిస్సందేహం. విశాల గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికీ భూమి సమస్యే ప్రధాన సమస్యగా, దున్నేవారికి భూమి ప్రాతిపదికన విప్లవ భూ సంస్కరణలు చేపట్టడం అనేది ఎంతో ప్రాధాన్యత, ప్రాసంగిత కలిగిన అంశంగా ఉంది. సగటు వ్యవసాయ గణాంకాలు, విద్యావేత్తల గ్రామ సర్వేలు అన్నీ ఈ అంశాలనే ఎత్తిచూపుతున్నాయి. భూమి కోసం దేశవ్యాప్తంగా విప్లవ, ప్రజాస్వామిక శక్తుల నాయకత్వంలో అత్యధిక రాష్ట్రాలలో ఉధృతంగా సాగిన, సాగుతున్న రైతాంగ పోరాటాలు ఇందుకు తిరుగులేని నిదర్శనం. కార్మికవర్గ నాయకత్వాన పీడితవర్గాల నియంతృత్వం కింద నూతన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించి, మూడు మహా పర్వతాల దోపిడీని రూపుమాపకుండా భూసంస్కరణలను,

కౌలు సంస్కరణలను చేసినా వాటికి పరిమితి ఉంటుందని పశ్చిమ బెంగాల్ అనుభవం తెలియజేస్తున్నది.

గత ఏడు దశాబ్దాలలో సామ్రాజ్యవాదం మన దేశంలోని అర్ధవలస, అర్ధభూస్వామ్య ఆర్థిక వ్యవస్థను స్వతంత్రంగా అభివృద్ధి చెందనీయకుండా అడ్డుకుంటున్నది. మన దేశాన్ని మరింత ఎక్కువగా సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థకు అనుబంధ ఆర్థిక వ్యవస్థగా మార్చివేసింది. అధికార మార్పిడికి ముందు మన దేశానికి సామ్రాజ్యవాద దేశాలతో ఉన్న వలస, ద్రవ్య ఆర్థిక సంబంధాలు మరింతగా విస్తరించాయి. సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్యవర్గాలు కుమ్మక్కై దేశ ప్రకృతి సంపదలను, పీడిత ప్రజల శ్రమశక్తిని పెద్దెత్తున దోచుకుంటున్నాయి. సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి పెద్ద భూతంలా పెరిగిపోయింది. అది పారిశ్రామిక, వ్యవసాయ, సర్వీసు రంగాల్లోని మిగులులో ఒక పెద్ద భాగాన్ని కబ్జా చేసుకుంటున్నది. ప్రత్యేకించి వ్యవసాయ, పారిశ్రామిక, సర్వీసు రంగాలలోని అసమాన వర్తకం, ప్రత్యక్ష పెట్టుబడులు, అప్పుల ద్వారా ఆర్థిక వ్యవస్థపై తమ అదుపును నిలుపుకుంటున్నది. విదేశీ ఎంఎన్‌సీలు, దళారీ పాలకవర్గాలు టీ, కాఫీ, రబ్బరు, చెరకు, కొబ్బరి ప్లాంటేషన్లలో కార్మికుల, ఉద్యోగుల చౌక శ్రమశక్తి నుంచి మాత్రమే కాక ముడి పదార్థాలను ఎగుమతి చేయడం, సామ్రాజ్యవాద దేశాల నుంచి దిగుమతి చేసుకున్న సరుకులను అమ్మడం, తమ వ్యవసాయ భూములను కౌలుకు ఇవ్వడం ద్వారా అధిక లాభాలు ఆర్జిస్తున్నాయి. అవి సాగించిన లావాదేవీలన్నీ కొన్ని పెద్ద తేలికపాటి తయారీ కంపెనీలు మినహాయించి మాన్యుఫాక్చరింగ్‌లో కాక వర్తక సంబంధ విషయాల చుట్టూనే ఉన్నాయి. ఆ తేలికపాటి తయారీ పరిశ్రమలు సైతం 'మేక్ ఇన్ ఇండియా'పై కాక 'అసెంబుల్డ్ ఇన్ ఇండియా'పై అంటే దిగుమతులపై ఆధారపడిన పరిశ్రమలే. వీటన్నింటిని బట్టి వస్తుగతంగా తేలేదేమంటే, భారతదేశం బ్రిటీషు పాలనలో లాగానే ఇప్పటికీ సామ్రాజ్యవాద మార్కెట్‌గానే ఉంది. ఇవన్నీ అర్ధవలస, అర్ధభూస్వామ్య లక్షణాలే.

వ్యవసాయంలో సృష్టించబడిన మిగులులో అధిక భాగం బ్యాంకుల/సహకార సంస్థల, వడ్డీ వ్యాపారుల, షావుకార్ల, వివిధ ఫైనాన్స్ సంస్థల నిరంకుశ అదుపులో ఉండడం వల్ల పెట్టుబడి సంచయనానికి ఆటంకం ఏర్పడుతోంది. పెట్టుబడిదారీ పునరుత్పత్తి షరతు అమలు ఊసే ఉండడం లేదు. అర్ధభూస్వామ్య సంబంధాలు కింది స్థాయి నుంచి పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి కాకుండా అడ్డుకుంటున్నాయి. వడ్డీ వ్యాపార, వాణిజ్య పెట్టుబడి రైతుల వ్యవసాయోత్పత్తులను/సరుకును కబ్జా చేసుకుంటుంది కానీ ఉత్పత్తి ప్రక్రియను కాదు. ఈ ప్రక్రియ రైతులను అర్ధభూస్వామ్య సంబంధాలలో బంధించి ఉంచుతున్నది. వారి శ్రమశక్తిపై నియంత్రణ సంపాదించి వారిని కార్మికులుగా మార్చదు, వారు పెట్టుబడిదారులుగా మారేందుకు సైతం అవకాశం ఇవ్వడం లేదు.

దళారీ పాలకవర్గాలు దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేస్తున్నామనీ, పెద్దెత్తున

విదేశీ పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థను గణనీయంగా అభివృద్ధి చేస్తున్నామనీ, దేశ స్థూల జాతీయోత్పత్తి ఎంతగానో పెరిగిందనీ పెద్దెత్తున చేస్తున్న ప్రచారంలో ఎంతమాత్రమూ వాస్తవం లేదు. పెట్టుబడిదారీ విధానంలో సమాజంలో సంపదంతా పెట్టుబడిదారుల చేతుల్లో పెడుతుంది, మిగతా శ్రామిక జనావళి నుంచి అత్యధికంగా అదనపు విలువను పిండుకుంటుంది, సూపర్ లాభాలు ఆర్జించుతుంది తప్ప కార్మిక, కర్షక, మధ్యతరగతి తదితర పీడిత వర్గాలకు అది ఎటువంటి అభ్యుదయాన్నీ కొనితేలేదు, కేవలం కష్టాలను, కడగండ్లను, దుర్భర దారిద్ర్యాన్ని మాత్రమే వారికి మిగుల్చుతుంది – ఇదీ పెట్టుబడిదారీ విధాన చరిత్ర. కనుక దళారీ పాలకుల ప్రకారం పెట్టుబడిదారీ అభివృద్ధి ఏదైనా జరిగినప్పటికీ – అది ఎంత వికృత రూపంలో ఉన్నప్పటికీ – పెట్టుబడిదారుల ప్రయోజనాలు తప్ప శ్రామిక జనావళి ప్రయోజనాలు ఏమాత్రం నెరవేరవు.

లెనిన్, పెట్టుబడిదారీ పరివర్తనకు సంబంధించిన రెండు అవకాశాలను సూత్రీకరించారు. భూస్వామ్య ఆర్థిక వ్యవస్థ (పై నుంచి పెట్టుబడిదారీ విధానం) పరివర్తన ఫలితంగా గానీ లేదా భూస్వామ్య ఎస్టేట్లను (కింద నుంచి పెట్టుబడిదారీ విధానం) రూపుమాపడం ద్వారా గానీ పెట్టుబడిదారీ పరివర్తన చోటు చేసుకుంటుంది. కానీ భారతదేశంలో ఈ రెండింటిలో ఏ మార్గంలోనూ పెట్టుబడిదారీ పరివర్తన చోటు చేసుకోలేదు. అందువల్ల భారతదేశం 'పై నుంచి పెట్టుబడిదారీ'గా పరివర్తన చెందిందనీ, భారత పాలకవర్గాలు స్వతంత్రమైనవనీ, వారు సామ్రాజ్యవాద దేశాలతో 'రాజీ, బేరం' అనే పద్ధతిని అవలంబిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థపై పట్టును పెంచుకుంటున్నాయనే వాదనకూ భౌతిక వాస్తవికతకూ ఏమాత్రం పొంతనలేదు. భారతదేశ దళారీ పాలకవర్గాల కంటే ప్రపంచ ద్రవ్య పెట్టుబడి అనేక వేల రెట్లు శక్తివంతంగా ఉందనేది భౌతిక వాస్తవం. వారికీ ప్రపంచ ద్రవ్య పెట్టుబడితో గల చారిత్రక మిలాఖత్తు ఒక నిర్వివాదమైన వాస్తవం.

భారతదేశంలో బ్రిటీషు వలసవాదం తన ప్రయోజనాలకు అనుగుణంగా భూస్వామ్య విధానాన్ని పరిరక్షించి, దానికి సామాజిక దన్నుగా ఉపయోగించుకుంది. విశాల రైతాంగ ప్రజారాశులపైన భూస్వామ్య విధానపు రక్కసిపట్టును మౌలికంగా మార్చకుండానే, తాను కూడా వారిని పీల్చిపిప్పి చేస్తూనే అది పెట్టుబడిదారీ సంబంధాలను ప్రవేశపెట్టింది. దీని ఫలితంగా అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రత్యక్ష వలసపాలన అంతమైన తర్వాత కూడా ఈ అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు కొనసాగాయి. సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, భూస్వామ్య విధానం రెండింటినీ భారతదేశంపై తమ నయావలస తరహా పరోక్ష పాలన, దోపిడీ, అజమాయిషీలను కొనసాగించేందుకు ఉపయోగించుకుంటున్నది. దేశీయ మార్కెట్‌ను ధ్వంసం చేసి దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసింది. గత ఏడు దశాబ్దాలలో జరిగిన పరిణామాలను, మార్పులను సంశ్లేషించుకుంటే, దేశ ప్రజలకు శత్రువులైన ఈ మూడు

మహా పర్వతాల కారణంగా ఇప్పటికీ విస్తారమైన గ్రామీణ ప్రాంతంలో విశాల ప్రజాబాహుళ్యంపై భూస్వాముల, వడ్డీ వ్యాపారుల, వర్తక వర్గాల దోపిడీ నిరాటంకంగా కొనసాగుతోందని స్పష్టమవుతుంది.

అలాగే భారత ఆర్థిక వ్యవస్థను ''అంచుల్లో ఉన్న పెట్టుబడిదారీ విధానమనీ'', ''అర్ధ–పెట్టుబడిదారీ విధానమనీ'', ''పరివర్తనలో ఉన్న పెట్టుబడిదారీ విధానమనీ'' సూత్రీకరించడం సరైంది కాదు. ఇలా సూత్రీకరించడం అంటే మన దేశంలో ఇప్పటికీ రాజ్యాధికారాన్ని చెలాయిస్తూ బలంగా నిర్ణయాత్మకంగా ఉన్న అర్ధభూస్వామ్య విధానం అప్రధానమైందిగా మారిపోతుంది. సామ్రాజ్యవాద, కార్మికవర్గ విప్లవాల యుగంలో జాతీయ ప్రజాస్వామిక విప్లవాల సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక కర్తవ్యాలు కూడా అదే విధంగా అప్రధానం అవుతాయి. అంతిమంగా వ్యవస్థ సమూల మార్పు కోసం పోరాడే విప్లవశక్తులు ఏ పంథాను అనుసరించాలి, ఎలాంటి ఎత్తుగడలను చేపట్టాలనే విషయంలో గందరగోళంలో పడేస్తుంది. అందువల్ల పై సూత్రీకరణలు సరైనవి కావు. భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఎనలేని హాని చేస్తాయి.

ప్రపంచ ద్రవ్య పెట్టుబడి సాగించే సూపర్ లాభాల వేటలో యావత్తు కార్మిక, కర్షక, మధ్యతరగతి, జాతీయ బూర్జువా తదితర పీడిత వర్గాల, సెక్షన్ల, జాతుల ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నది, వాటిపై క్రూరంగా దాడి చేస్తున్నది. ఇందుకోసం వెనుకబడిన దేశాలలో ఫాసిస్టు పార్టీలను అధికారంలోకి తీసుకువస్తున్నది. ఈ నేపథ్యంలోనే మన దేశంలో బ్రాహ్మణవాద హిందుత్వ భావజాలం కలిగిన ఫాసిస్టు బీజేపీ నాయకత్వంలోని నరేంద్ర మోదీ కేంద్రంలో అధికారాన్ని చేపట్టి గత ఆరేళ్లుగా ప్రజలపై ఫాసిస్టు దాడిని తీవ్రంగా కొనసాగిస్తున్నది. ప్రజలకు, ఆస్తులకు భద్రతను కల్పించే పేరుతో పలు నిఘా (సర్వైలెన్స్) ఉత్పత్తుల కోసం, దేశవ్యాప్తంగా సీసీ టీవీ నిఘా కెమెరాలను ఏర్పాటు చేయడం కోసం కోట్లాది రూపాయల ఖర్చు చేస్తున్నది. అన్ని రకాల డాటాను సమీకరిస్తున్నది. కమ్యూనికేషన్స్‌ను మోనిటరింగ్ చేస్తున్నది. విప్లవోద్యమాలను, ప్రజాస్వామిక ఉద్యమాలను, ప్రజా నిరసనలను అణచివేసే లక్ష్యంతో సామ్రాజ్యవాదులు, వారి దళారీ పాలకులు అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక చట్టాలను తీసుకొస్తున్నారు. పోలీసు బలగాలను మిలిటరీకరిస్తున్నది. పోలీసులను, పారామిలటరీ, కమాండో, సైనిక బలగాలను మోహరించి ఉద్యమాలపై క్రూరంగా దాడులు చేస్తున్నది. తమిళనాడులో స్టెరలైట్ ప్లాంటుకు వ్యతిరేకంగా ప్రజా ఆందోళనపై జరిపిన పోలీసు కాల్పులు, కశ్మీర్‌ను నిర్బంధ శిబిరంగా మార్చివేయడం, దళితులపై, రైతులపై, విద్యార్థులపై దేశంలో పలు ప్రాంతాలలో కాల్పులు ఇందుకు ఇటీవలి ఉదాహరణలు. రాజస్తాన్, బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో దళితులపై దాడులు, ఆదివాసీలపై, ఈశాన్య రాష్ట్రాలలో, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో

ఎక్కువగా జరుగుతున్నాయి. సామ్రాజ్యవాదులకు, వారి దళారీ ఫాసిస్టు పాలకులకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా, మన దేశంలోనూ పీడిత ప్రజలు పెద్దెత్తున నిరసనలకు దిగుతున్నారు. ప్రపంచీకరణ రాజకీయాలకు, అర్థశాస్త్రానికీ గల సంబంధాన్ని అర్థం చేసుకోలేని ఉదారవాద ప్రజాస్వామికవాదులు పోస్టుమాడర్నిజాన్ని ప్రబోధిస్తూ వాటిని వేరువేరుగా చూస్తున్నారు. ఎన్‌జీఓ (ప్రభుత్వేతర సంస్థలు) సంస్థలు చట్టబద్ధవాదాన్ని, సంస్కరణవాదాన్ని, ఆర్థికవాదాన్ని ముందుకు తెస్తూ ప్రజల పోరాట చేవపై నీళ్లు చల్లుతున్నారు. రకరకాల రివిజనిస్టులు రూపాన్ని చూసి సారాన్ని చూడనిరాకరిస్తూ ప్రజలను రాజకీయంగా తప్పుదారి పట్టిస్తున్నారు, సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్యవ్యతిరేక పోరాటాలను నీరుగారుస్తున్నారు. అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ సమూల మార్పు ఆవశ్యకతను మరుగుపరుస్తున్నారు.

నిజానికి గత ఏడు దశాబ్దాలలో మన దేశంలో నాలుగు మౌలిక వైరుధ్యాలు – 1. సామ్రాజ్యవాదానికి భారత ప్రజలకు మధ్య ఉన్న వైరుధ్యం, 2. భూస్వామ్య విధానానికి, విశాల ప్రజారాశులకు మధ్య ఉన్న వైరుధ్యం, 3. పెట్టుబడికి శ్రమకూ మధ్య ఉన్న వైరుధ్యం, 4. పాలకవర్గాల మధ్య ఉన్న అంతర్గత వైరుధ్యాలు మరింత తీవ్రమయ్యాయి. ఇందులో మొదటి రెండు వైరుధ్యాలే నేటికీ భారత సమాజంలోని మౌలిక వైరుధ్యాలుగా ఉన్నాయి. తిరిగి ఈ రెండు మౌలిక వైరుధ్యాలలో భూస్వామ్య విధానానికి విశాల ప్రజారాశులకు మధ్య ఉన్న వైరుధ్యం నేటికీ ప్రధాన వైరుధ్యమే. భారత సమాజంలో కులసమస్య, మహిళా సమస్య, ఆదివాసీ సమస్య, మతమైనారిటీల ప్రత్యేకించి ముస్లిం ప్రజల సమస్య, జాతుల సమస్య ఇతర వైరుధ్యాలుగా ఉన్నాయి. పర్యావరణ సమస్య, లఘు పరిశ్రమల సమస్య, కాంట్రాక్టు లేబర్ సమస్య, బాలకార్మిక సమస్య, నిరుద్యోగ సమస్య, రిజర్వేషన్ సమస్య, విద్యా–వైద్య సమస్యలు, వెనుకబడిన ప్రాంతాల సమస్య, పౌరహక్కుల సమస్య, వృద్ధులు–అనాధలు–శారీరక, మానసిక లోపాలున్నవారు, ఇతరత్రా లోపాలున్నవారి సమస్య, నదీజలాల వాటాల సమస్య, సరిహద్దు సమస్యలు తదితరమైనవి ఇతర ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ఈ వైరుధ్యాలను గానీ కీలకమైన సమస్యలను గానీ శిథిలమవుతున్న అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ పరిష్కరించలేదు, దేశాన్ని అభివృద్ధి చేయలేదు.

కనుక భారతదేశంలో ఇప్పటికీ అసంపూర్తిగా మిగిలిపోయిన జాతీయ ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలను పరిపూర్తి చేసి దేశంలో సోషలిజాన్ని–కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పడానికి దేశంలో కాలంచెల్లిన అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను కూలదోసి, భారత ప్రజల మూపులపై వుండి వారిని కుంగదీస్తున్న మూడు మహా పర్వతాల – సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల దోపిడీ, పీడన, అణచివేతలను తప్పనిసరిగా రూపుమాపాలి. ఇందుకు దున్నేవారికి భూమి ప్రాతిపదికన వ్యవసాయ విప్లవం ఇరుసుగా గల నూతన ప్రజాస్వామిక విప్లవమే మార్గం. ఇది దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను

అనుసరిస్తుంది. కార్మికవర్గం ఈ విప్లవానికి నాయకత్వం వహిస్తుంది. రైతాంగం ఇందులో ప్రధాన శక్తిగా ఉంటుంది. మధ్యతరగతి (పెటీబూర్జువా) వర్గం నమ్మకమైన మిత్రశక్తిగా ఉంటుంది. జాతీయ బూర్జువావర్గం ఊగిసలాడే మిత్రశక్తిగా ఉంటుంది. కేవలం ఈ విప్లవం ద్వారానే సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, నిరంకుశ దళారీ బడా పెట్టుబడి దోపిడి నుంచి భారతదేశం విముక్తిని సాధించగలుగుతుంది.

## మన రాజకీయ కార్యక్రమం

మనం ఇప్పటి వరకూ సుదీర్ఘంగా భారత సామాజిక వ్యవస్థలో జరిగిన మార్పుల గురించి, వర్తమాన నిర్దిష్ట స్థితి గురించి చర్చించాం. ప్రత్యేకంగా దేశంలో గత 72 సంవత్సరాలలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, పర్యావరణ తదితర అంశాలలో పలు గణనీయమైన మార్పులు వచ్చాయనీ, అయినప్పటికీ నేటికీ దేశ అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ వర్గ సంబంధాల చట్రంలో ప్రధానంగా మౌలిక మార్పు జరగలేదనీ మనం చూసాం. అయితే ఈ మార్పుల కారణంగా భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో కొత్తగా మన మిత్రులలో భాగమయ్యేది ఎవరు, శత్రు వర్గాలలో భాగమయ్యేది ఎవరు అనేది స్పష్టంగా అర్థం చేసుకోవడం అత్యంత కీలకమైన విషయం. గత 72 సంవత్సరాల్లో భారతదేశంలో ఉత్పత్తి విధానంలో చోటు చేసుకున్న మార్పులపై ఆధారపడి చూసినప్పుడు భారత విప్లవ స్వభావంలో గానీ, అందులో మిత్రవర్గాలలో, శత్రువర్గాలలో గానీ మౌలిక మార్పు రాలేదనీ, అలాగే భారత విప్లవానికి సంబంధించిన మౌలిక విషయాలపై మన పార్టీ ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ సంపద్వంతం చేసిన 'పార్టీ కార్యక్రమం', 'భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు' డాక్యుమెంట్లలో చెప్పిన ప్రధాన విషయాలు ఇప్పటికీ మౌలికంగా సరైనవేననీ స్పష్టమవుతుంది.

అయితే మొత్తంగా సామ్రాజ్యవాద యుగంలో, ప్రత్యేకంగా నయావలసవాద కాలంలో, మరింత ప్రత్యేకంగా ప్రపంచీకరణ కాలంలో అంతర్జాతీయంగా, దేశీయంగా వివిధ రంగాలలో వేగంగా పలు గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగానే ఈ మార్పులు తరతమ తేడాలతో వర్గ సంబంధాలలో మార్పులకు, ధృవీకరణలకు దారితీసాయి. పిడికెడు సామ్రాజ్యవాద సంస్థలు, దేశాల చేతిలో ప్రపంచ ఆర్థిక, ద్రవ్య వ్యవస్థ మరింతగా కేంద్రీకరించబడడం వల్ల బడా దళారుల చేతిలో సంపదలు, రాజకీయాధికారం కేంద్రీకరించబడడం వల్ల పీడిత జాతుల, వర్గాల, సెక్షన్ల సంఖ్య బాగా పెరిగిపోయింది. వీటిలోనూ, దోపిడీ వర్గాలలో సైతం ధృవీకరణలు జరుగుతూ వచ్చాయి. పారిశ్రామిక, వ్యవసాయ, సర్వీసు రంగాలలో పాత ఉత్పత్తి క్రమాల స్థానంలో ఆధునిక టెక్నాలజీ, ఆధునిక ఉత్పత్తి సాధనాలతో పాటుగా ఉత్పత్తి క్రమాలు చాలా చోట్ల అమలులోకి రావడం పలు రకాల నూతన వృత్తులు, వాటిలో పనిచేసే కార్మికులు, అర్ధ-కార్మికులు, ఉద్యోగులు, ఆపరేటర్లు, టెక్నోలోజిస్టులు,

అధికారులు ఉనికిలోకి వచ్చారు.

ఈ మార్పులను పరిశీలించినప్పుడు, సామ్రాజ్యవాద యుగంలో, ప్రత్యేకంగా నయావలసవాద కాలంలో ప్రపంచవ్యాప్తంగానూ, అందులో భాగంగా ప్రత్యేకంగా మన దేశంలో మహోజ్వల నక్సల్బరీ విప్లవ వెల్లువ వరకు జరిగిన సామాజిక మార్పులపై ఆధారపడి మన పార్టీ రూపొందించిన, తదనంతర కాలంలో జరిగిన మార్పులను దృష్టిలో పెట్టుకుని ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ సంపద్వంతం చేసిన మన సాధారణ రాజకీయ పంథాను, ఈ రాజకీయ పంథాను విజయవంతం చేయడానికి అనుసరించే దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను ఈ మార్పులు మౌలికంగా ప్రభావితం చేయలేవనీ, అయితే మన పంథా అమలు మరింత సంక్లిష్టం చేస్తాయనేది స్పష్టమవుతుంది. అందువల్ల మన రాజకీయ-సైనిక పంథాను దేశంలో చోటుచేసుకున్న సామాజిక మార్పులకు అనుగుణంగా, సామాజిక విప్లవానుభవాల నుండి పాఠాలు నేర్చుకుంటూ సృజనాత్మకంగా అమలు చేయాల్సిన అవసరం ఉంటుందనీ, ఈ మార్పులకు అనుగుణంగా మన రాజకీయ-సైనిక ఎత్తుగడల కర్తవ్యాలను నెరవేర్చేలా మన వ్యూహాత్మక పథకాలను రూపొందించుకోవాల్సి ఉంటుందనీ, మారిన పరిస్థితులకు అనుగుణంగా నూతన ఎత్తుగడలను గణనీయంగానే అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంటుందని స్పష్టమవుతుంది. ఈ మార్పులకు అనుగుణంగా ఉమ్మడి శత్రువులకు వ్యతిరేకంగా యావత్తు మిత్రులను ఐక్యం చేయడం ద్వారానే శత్రు వర్గాలను మిత్రవర్గాల నుంచి వేరుచేసి ఓడించడం సాధ్యమవుతుంది.

వ్యూహం-ఎత్తుగడలకు సంబంధించి కామ్రేడ్ స్టాలిన్ ఇలా చెప్పాడు:

"వ్యూహం: వ్యూహం అంటే విప్లవపు ఒకానొక దశలో కార్మికవర్గం తన ప్రధానమైన దాడిని (బ్లో) ఎక్కుపెట్టే దిశను నిర్ణయించడమూ, తదనుగుణంగా విప్లవశక్తులను (ప్రధాన, ద్వితీయ రిజర్వులను) మోహరించే పథకాన్ని రచించడమూ, ఆ ఒకానొక విప్లవ దశ అంతటా ఆ పథకాన్ని అమలుపరచడం కోసం పోరాడడం" (లెనినిజం సమస్యలు, పే. 80).

మన పార్టీ ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌లో ఆమోదించబడిన 'భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు' డాక్యుమెంటు ఈ విధంగా చెప్పింది: "మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సార్వత్రిక సత్యాన్ని మన దేశంలో నెలకొని వున్న నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించడం ద్వారా భారత విప్లవ వ్యూహాన్ని, ఎత్తుగడలను రూపొందించుకోవాలి" (7వ పేజీ, 2వ పేరా).

"వర్తమాన భారత సమాజపు నిర్దిష్ట వర్గ విశ్లేషణ నుండి భారత ప్రజాస్వామిక విప్లవపు రాజకీయ వ్యూహం ఆవిర్భవిస్తుంది. భారత విప్లవపు ప్రస్తుత దశలో కార్మికవర్గానికి ఎవరు నిజమైన మిత్రులు, ఎవరు నిజమైన శత్రువులు అనే విషయాన్ని స్పష్టపరచడం రాజకీయ వ్యూహపు కర్తవ్యం" (అదే డాక్యుమెంట్, 9వ పేజీ, 2వ పేరా).

"భారతదేశంలోని విప్లవయుద్ధానికి సంబంధించిన విశిష్ట స్వాభావిక లక్షణాలపైన ఆధారపడి సైనిక వ్యూహాన్ని రూపొందించుకోవాల్సి ఉంటుంది. ఈ స్వాభావిక లక్షణాలు ఆ సైనిక వ్యూహం దీర్ఘకాలిక ప్రజాయుద్ధంగా వుండాలని నిర్దేశిస్తున్నాయి. అంటే కామ్రేడ్ మావో చెప్పినట్లుగా శత్రువు సాపేక్షికంగా బలహీనంగా వుండే గ్రామీణ ప్రాంతంలో ముందుగా విప్లవ స్థావర ప్రాంతాలను ఏర్పరచుకొని, అటు పిమ్మట క్రమక్రమంగా శత్రు బలగాలకు కోటలుగా వుండే నగరాలను చుట్టుముట్టి స్వాధీనం చేసుకోవడం అనేది సైనిక వ్యూహంగా ఉంటుంది" (అదే డాక్యుమెంట్, 10వ పేజీ, కింది నుండి 2వ పేరా).

"భారత విప్లవ యుద్ధపు ప్రధాన స్వాభావిక లక్షణాలు: 1. భారతదేశం అసమాన ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధిని, గెరిల్లాయుద్ధానికి అనుకూలంగా ఉండే టెర్రయిన్‌ను కలిగి వుండిన విశాలమైన అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశం; రైతాంగం సుదీర్ఘకాల సాయుధ పోరాటాన్ని చవిచూసిన దేశం, ఇప్పుడిది రైతాంగం వీరోచిత పాత్ర పోషిస్తూ కొనసాగుతున్న వ్యవసాయిక విప్లవ గెరిల్లా యుద్ధాన్ని కూడా చవిచూస్తున్న దేశం. వ్యవసాయిక విప్లవాన్ని వాంఛిస్తున్న రైతాంగం దీర్ఘకాలంగా సాయుధ పోరాటాన్ని సాగించిన దేశం. రైతాంగం వీరోచిత పాత్రను నిర్వహిస్తున్న వ్యవసాయిక విప్లవ గెరిల్లా పోరాటం కొనసాగుతున్న దేశం. 2. మన శత్రువు, కేంద్రీకృత రాజ్యయంత్రాన్ని, మంచి ఆయుధ సంపత్తిగల ఆధునిక సైన్యమూ ఉన్న బలశాలి, శక్తిశాలి." (అంతేకాక బ్రిటీషు సామ్రాజ్యవాదుల పాలనలో మన దేశంలో ప్రజల తిరుగుబాట్లను, కమ్యూనిస్టులను, పౌరులను అణచడం కోసం, కౌంటర్-ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్లలో పోరాడడం కోసం ఏర్పరచిన భారత సైన్యాన్ని, పారామిలటరీ, పోలీసు బలగాలను, న్యాయవ్యవస్థను భారత దళారీ పాలకవర్గాలు వారసత్వంగా పొందాయి. అవి ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ గత 72 సంవత్సరాలలో దేశ ప్రజలకు వ్యతిరేకంగా (ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా) కౌంటర్-ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్స్‌లో వాటిని వినియోగించడం, లౌకిక, ప్రగతిశీల, దేశభక్త, ప్రజాస్వామిక, విప్లవ, జాతివిముక్తి ఉద్యమాలకు వ్యతిరేకంగా ప్రతీఘాతుక విప్లవాన్ని నడపడంలో ఎంతో అనుభవం సాధించాయి) "3. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ, గెరిల్లాసైన్యం, వ్యవసాయిక విప్లవోద్యమం ఇంకా బలహీనంగానే వున్నాయి. 4. మన దేశం ఒక జాతుల బందిఖానా. ఇందులో కొన్ని జాతులు భారత రాజ్యానికి వ్యతిరేకంగా తమ స్వయంనిర్ణయాధికార హక్కును సాధించుకోవడం కోసం కఠిన పోరాటాలు సాగిస్తున్నాయి. భారత విప్లవ యుద్ధానికి మార్గనిర్దేశకత్వం వహించే పంథాను, అంతేకాక దాని అనేక వ్యూహాత్మక ఎత్తుగడల సూత్రాలను నిర్ణయించేది పైన పేర్కొన్న స్వాభావిక లక్షణాలే" (37వ పేజీ). ఈ "... నాలుగు ప్రధాన స్వాభావిక లక్షణాలు భారత విప్లవయుద్ధానికి మార్గదర్శకత్వం వహించే పంథాను, దానికి సంబంధించిన పలు వ్యూహాత్మక, ఎత్తుగడల సూత్రాలను నిర్ణయిస్తాయి. వీటిలో ఒకటి, నాలుగు లక్షణాలు మన పార్టీ, ప్రజాసైన్యం వృద్ధి చెంది శత్రువును ఓడించగలుగుతాయని తెలియజేస్తాయి.

అయితే రెండు, మూడు లక్షణాలు మన పార్టీ, మన ప్రజాసైన్యం అత్యంత వేగంగా వృద్ధి చెందడం లేదా మన శత్రువును అతిత్వరగా ఓడించడం అసాధ్యమని తెలియజేస్తాయి. అందువలన భారతదేశంలోని విప్లవ యుద్ధం దీర్ఘకాలిక స్వభావాన్ని కలిగి వుంటుంది" (అదే డాక్యుమెంట్, 42వ పేజీ).

"భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి ఎక్కువగా ఉంది, వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు ఉన్నాయి, మెరుగైన రవాణా, కమ్యూనికేషన్ సదుపాయాలున్నాయి, విప్లవపూర్వ చైనాతో పోల్చినప్పుడు భారత ప్రభుత్వానికి చాలా పెద్దదైన ఆధునిక సైన్యం, ఒక బలమైన కేంద్రీకృత పరిపాలనా వ్యవస్థ ఉన్నాయనే కారణాలు చూపుతూ కొందరు విముక్తి ప్రాంతాలను నెలకొల్పడమూ, ఎర్రసైన్యాన్ని నిర్మించడమూ, దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని నడపడమూ అసాధ్యమని వాదిస్తారు. ఈ వాదనలు తప్పు. శత్రు సైనిక బలం ఎంత బలమైనదే అయినప్పటికీ, ప్రజాసైనిక బలం ఎంత బలహీనమైనదే అయినప్పటికీ శత్రువుకు బలహీనమైన విశాల గ్రామీణ ప్రాంతాన్ని పునాదిగా చేసుకుని, వ్యవసాయిక విప్లవం కోసం తహతహలాడే విశాల రైతాంగ ప్రజారాశులపై ఆధారపడి, గెరిల్లా పోరాటం, దీర్ఘకాల ప్రజాయుద్ధాల పట్టువిడుపులతో కూడిన వ్యూహం-ఎత్తుగడలను సృజనాత్మకంగా అనుసరించి - పూర్తి భోజనాన్ని ఒక్కొక్క ముద్దగా తినేట్టుగానే సరిగ్గా అదే విధంగా శత్రు బలగాలలో వివిధ భాగాలలో ఒక్కొక్కదానికి వ్యతిరేకంగా మన సైన్యంలోని ఉత్తమమైన భాగాన్ని (శత్రువు కంటే కొన్ని రెట్లు ఎక్కువ బలంగా ఉండే బలగాన్ని) వినియోగించి హఠాత్తుగా దాడి చేసి నిర్మూలించే విధానాన్ని, ఎత్తుగడలను అనుసరించడం ద్వారా శత్రు బలగాలను ఓడించి విడివిడి బ్యాటిల్స్‌లో శత్రువుపై విజయాన్ని సాధించడం ప్రజలకు పూర్తిగా సాధ్యమే. అందువలన ప్రజా సాయుధ బలగాలను వృద్ధి చేసుకోవడం, శత్రు బలగాల కంటే ఆధిక్యతను సంపాదించడం, శత్రువును నిర్ణయాత్మకంగా ఓడించడం సాధ్యమే.

"దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని సాగించే క్రమంలో మనం శత్రువుకు అనుకూలంగా వుండే అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ మరిన్ని ముందు జాగ్రత్తలను తప్పనిసరిగా తీసుకోవాలి; ఒకదాని వెంట మరోటిగా త్వరితంగా విముక్తి ప్రాంతాలను నిర్మించడం సాధ్యం కాదనేది దృష్టిలో ఉంచుకుని గెరిల్లాజోన్లను అభివృద్ధి చేయడం ద్వారా మనం విముక్తి ప్రాంతాలను నెలకొల్పాలి.... శత్రువుకు అనుకూలంగా వున్న అంశాలు, మన దేశ ప్రధాన స్వాభావిక లక్షణాల నుండి, చైనా, రష్యా విప్లవాల నుండి, ప్రధానంగా, చైనా విప్లవం నుండి నేర్చుకున్న పాఠాల నుండి ఆవిర్భవించిన భారత విప్లవ యుద్ధపు దీర్ఘకాలిక స్వభావాన్ని మార్చజాలవు" (అదే డాక్యుమెంట్, 43-44 పేజీలు).

..."భారత విప్లవ వ్యూహం దేశమంతటికీ ఒక్కటిగానే ఉంటుంది. అయితే ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధి అసమానంగా ఉండడం, ప్రజల చైతన్యస్థాయి, పోరాటపటిమ,

వుద్యమపు ఆటుపోట్లలో హెచ్చుతగ్గులు వుండడం అనేవి ఏ నిర్దిష్ట సమయంలోనైనా భిన్న ప్రాంతాల్లో విభిన్నమైన ఎత్తుగడలను అనుసరించవలసిన అవసరాన్ని నొక్కి చెబుతాయి. ఈ ఎత్తుగడలు వ్యూహానికి లోబడి ఉంటాయనేది స్పష్టమే. వివిధ ప్రాంతాలలోని వర్గ పోరాటపు తీవ్రతను, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధిలోని అసమానతను ఆయా ప్రాంతాలలో నిర్దిష్టంగా విశ్లేషించాలి. ఆ విశ్లేషణపై ఆధారపడి ఎత్తుగడలను (అంటే పోరాట రూపాలను, నిర్మాణ రూపాలను) రూపొందించుకోవాలి. భిన్న ప్రాంతాలలో అనుసరించాల్సిన ఈ విభిన్న ఎత్తుగడలతో పాటు నిర్దిష్ట సమస్యలపైన మొత్తంగా దేశ ప్రజానీకాన్ని సమీకరించడానికి గాను మొత్తం దేశానికి సంబంధించిన రాజకీయపరమైన సాధారణ ఎత్తుగడల నినాదాలను కూడా ఎప్పటికప్పుడు రూపొందించుకోవాలి" (అదే డాక్యుమెంట్, 9వ పేజీ, చివరి పేరా).

వ్యూహం-ఎత్తుగడలపై కామ్రేడ్ స్టాలిన్ ఉల్లేఖన, దీంతో పాటు మన డాక్యుమెంట్ నుంచి పేర్కొన్న ఉల్లేఖనలు ఇప్పటికీ సరైనవే. అయితే గత 14 సంవత్సరాలుగా, అంటే, 'ఆపరేషన్ గ్రీన్‌హంట్', 'సమాధాన్' వంటి వ్యూహాత్మక ప్రణాళికలతో దేశవ్యాప్తంగా విప్లవోద్యమ రంగాలన్నింటిపై, ప్రత్యేకంగా విప్లవోద్యమ వ్యూహాత్మక ప్రాంతాలపై విప్లవ ప్రతీఘాతుక దోపిడీ పాలకవర్గాలు కేంద్రీకరించి దాడి చేస్తుండడంతో పాటు స్వీయాత్మక పొరపాట్ల వల్ల కూడా దీర్ఘకాల ప్రజాయుద్ధంలో కొన్ని ప్రతికూలతలు పెరుగుతున్నాయి. విప్లవంలో పార్టీ నిర్వహిస్తున్న నాయకత్వ పాత్ర గురించి శత్రువు అర్థం చేసుకొని పార్టీ నాయకత్వాన్ని, కార్యకర్తలను దెబ్బతీయడంపై, ప్రజలను విప్లవోద్యమం నుండి దారి మళ్లించడంపై వాడు కేంద్రీకరించి నిరంతరం దాడులు కొనసాగిస్తున్నాడు. ఉద్యమ ప్రాంతాలన్నింటిలో దాదాపు 6 లక్షల తన కిరాయి సాయుధ బలగాలను మోహరించి ప్రతీఘాతుక యుద్ధాన్ని కొనసాగిస్తున్నాడు. దీనితో మన దేశ విప్లవోద్యమంలో సంక్లిష్ట పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొన్ని నూతన సమస్యలు ముందుకు వస్తున్నాయి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని విజయవంతంగా నడపటానికి పరిస్థితులకు తగిన రాజకీయ-సైనిక ఎత్తుగడలను తక్షణం అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

"భారత విప్లవ యుద్ధపు ప్రధాన విశిష్ట లక్షణాల్లో మొదటి అంశం- భారతదేశం అసమాన ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధిని, గెరిల్లా యుద్ధానికి అనుకూలంగా వుండే టెర్రయిన్‌ను కలిగి వుండిన విశాలమైన అర్ధవలస-అర్ధభూస్వామ్య దేశం" అని మన పార్టీ డాక్యుమెంటు 'భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు' (37వ పేజీ) పేర్కొంది. ఉత్పత్తి సంబంధాల్లో కలిగిన మార్పులను పరిశీలించుకుంటున్న ఈ సందర్భంగానే పైన పేర్కొన్న భారత విప్లవ యుద్ధపు మొదటి ప్రధాన విశిష్ట లక్షణంలో కలుగుతున్న మార్పులను కూడా పరిశీలించడం అవసరం. అందులో భాగంగా ఫాసిస్టీకరణ పొందుతున్న భారత రాజ్యం గురించి, టెర్రయిన్‌లో వస్తున్న

మార్పుల గురించి కూడా పరిశీలించుకోవడం అవసరం.

భారత దళారీ పాలకవర్గాలు అధికార మార్పిడి నాటి నుంచే కమ్యూనిస్టు విప్లవోద్యమాలను, జాతి విముక్తి ఉద్యమాలను అణచివేయడానికి కౌంటర్ ఇన్‌సర్జెన్సీని, కౌంటర్ రెవల్యూషనరీ ఆపరేషన్స్‌ను నడిపిస్తున్నాయి. వీటికి సైద్ధాంతిక చట్రంగా వున్న సామ్రాజ్యవాద ప్రాయోజిత ఎల్‌ఐసీని మన దేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించుకునే క్రమంలో ప్రపంచీకరణ కాలంలో సబ్ కన్వెన్షనల్ వార్‌ఫేర్ సిద్ధాంతాన్ని రూపొందించాయి. తాము అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, దేశ ద్రోహకర విధానాల వల్ల ప్రజలు వాటికి వ్యతిరేకంగా నిరసన, ప్రతిఘటన, తిరుగుబాటు, జాతి విముక్తి, విప్లవ పోరాటాలు చేస్తారనీ, వాటిని ప్రారంభంలోనే గుర్తించి అణచివేసేలా వ్యూహాత్మక దృష్టితో పౌర, పోలీసు, ఇంటలిజెన్స్, సైనిక వ్యవస్థలను నిర్మించాయి, వాటిని రోజురోజుకు విస్తరిస్తూ ఆధునీకరిస్తున్నాయి. దేశ ప్రజలందరి రోజువారి కార్యకలాపాల పైన, కదలికల పైన నిఘా పెట్టి ప్రజల పోరాటాలు సంఘటిత శక్తిగా ఎదకముందే/ఎదిగే క్రమంలోనే వాటిని అణచివేసేలా శత్రువు వ్యూహాత్మక దృష్టితో పౌర జీవితాన్ని నియంత్రించేందుకు తన నిఘా (సర్వయిలెన్స్), ఇంటలిజెన్స్ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నాయి. అవి సామ్రాజ్యవాదుల, తమ స్వంత ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్–రోడ్డు, రైలు, రవాణా, కమ్యూనికేషన్, ఇన్‌ఫార్మేషన్ వ్యవస్థలను గ్రామీణ ప్రాంతాలలో కూడా బలోపేతం చేస్తున్నాయి. ఫలితంగా వ్యూహాత్మక ప్రాంతాలలో టెర్రయిన్‌లో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇవి వ్యూహాత్మక అంశాలు.

భారత రాజ్యం ఫాసిస్టీకరణ పొందుతుండడం, టెర్రయిన్‌లో వస్తున్న మార్పులు భారత విప్లవ యుద్ధపు విశిష్ట లక్షణాలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా వ్యూహాత్మక దృష్టితో ఎత్తుగడలలో తగిన మార్పులు చేసుకోవడం అవసరం. ఈ మార్పులకు అనుగుణంగా వర్గపోరాటాన్ని–గెరిల్లాయుద్ధాన్ని నడిపే ఎత్తుగడలను అభివృద్ధి చేసుకోవడం అవసరం. కాబట్టి దేశంలో – పట్టణ, మైదాన, అటవీ ప్రాంతాల్లో మారిన పరిస్థితులకు అనుగుణంగా విప్లవోద్యమానికి సమర్థవంతంగా నాయకత్వం వహించగలిగేలా శత్రువుకు అబేధ్యమైన రహస్య పార్టీని నిర్మించి పటిష్టం చేయడం, ప్రజలను వర్గ పోరాటాలలో విస్తృతంగా కదిలించి సంఘటితపరచగలిగేలా ఐక్యసంఘటనా రంగంలో మన కృషిని పెంపొందించడం, గెరిల్లాయుద్ధాన్ని విస్తృతంగా, తీవ్రంగా కొనసాగించగలిగేలా పీఎల్‌జీఏను ఎదిగించుకోవడం అవసరం.

విప్లవోద్యమం గడ్డుస్థితిలో ఉన్నప్పటికీ మన పార్టీ ఒక వైపు దేశవ్యాప్తంగా వివిధ ప్రజా ఆందోళనలలో, ఉద్యమాలలో భాగస్వామ్యం కావడం, నిర్మించడం ద్వారానూ లభించిన అనుభవాల ఆధారంగా పీడిత వర్గాలను, సెక్షన్లను, పీడిత జాతులను సమైక్యం చేసి విశాల ప్రాతిపదికన విప్లవ, ప్రజాస్వామిక, జాతీయ విముక్తి ఉద్యమాలను కొనసాగించడం సాధ్యమేనని,

మన ఉద్యమ ప్రాంతాలలో స్వీయాత్మక బలం, ఫార్మేషన్ల ఆధారంగానూ, టెర్రయిన్ ఆధారంగానూ గెరిల్లా యుద్ధాన్ని నడిపే ఎత్తుగడలను అభివృద్ధి చేయడం సాధ్యమేనని గత 14 సంవత్సరాలలో, ప్రత్యేకించి గడ్డు స్థితిని ఎదుర్కొంటున్న గత పది సంవత్సరాలలో మనం సాగించిన ప్రజాయుద్ధంలో మనకు లభించిన పాజిటివ్ అనుభవాలు రుజువు చేస్తున్నాయి. రాజకీయ, సైనిక, నిర్మాణ, సాంస్కృతిక కృషిలో మన పార్టీ, పీఎల్‌జీఏ, ఐక్యసంఘటనలు ఎన్నో అనుభవాలను సంపాదించుకుని రాటుదేలాయి. ఇలా రాటుదేలిన పార్టీ కమిటీలు, కమీషన్లు, కమాండ్లు ప్రజాయుద్ధానికి నాయకత్వం వహిస్తున్నాయి. అలాగే దేశీయ, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక సంక్షోభం; ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రజా పోరాటాల వెల్లువ; రానున్న ప్రపంచవ్యాప్త విప్లవాల వెల్లువ ప్రపంచంలో మావోయిస్టు విప్లవ పార్టీలు, శక్తులు బలహీనంగా ఉన్నప్పటికీ సామ్రాజ్యవాదులకు, వారి దళారీలకు కూడా అత్యంత తీవ్రమైన సవాలుగానే ఉంటుంది. ఇవి మన శత్రువులకు తీవ్రమైన ప్రతికూల, మనకు చాలా అనుకూల అంశాలు.

ఈ వస్తుగత, స్వీయాత్మక అనుకూలతలను, ప్రతికూలతలను గమనంలో ఉంచుకుని ఎత్తుగడలను అభివృద్ధి చేసుకుని పార్టీలోనూ, ప్రజాసైన్యంలోనూ, ప్రజల మధ్యా రాజకీయ, సైనిక, నిర్మాణ, సాంస్కృతిక కృషి సాగించాలి. మన దేశాన్ని ఒక భారీస్థాయి వినాశనం వైపు తీసుకెళుతున్న మూడు మహా పర్వతాలు – సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల దోపిడీ, పీడన, అణచివేతల కింద నలిగిపోతూ, వ్యవసాయంపై ఆధారపడి బతకలేక, పట్టణాల్లో పనులు దొరకక తీవ్రమైన అసంతృప్తితో తుకతుకలాడుతున్న అశేష రైతాంగాన్నీ; కార్మికులనూ, అర్ధ–కార్మికులనూ, విద్యార్థి–యువజనులను, మేధావులను, కవులు, కళాకారులను; విస్థాపిత సమస్యతో తమ అస్థిత్వాన్ని, అస్మితను, ఆత్మగౌరవాన్ని కోల్పోతున్న దళితులను, ఆదివాసీలను, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలతో బతుకుకు భద్రత కోల్పోయిన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులను తదితర మధ్యతరగతి సెక్షన్లను, భూస్వామ్య, పితృస్వామ్య సంకెళ్లలో మగ్గుతున్న మహిళలను, రాజకీయంగా వర్గపోరాటంలో సమీకరించి సంఘటితం చేయాలి. విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికార హక్కు కోసం పోరాడుతున్న జాతుల విముక్తి పోరాటాలను సమర్థించి వాటిలో భాగస్వామ్యం కావాలి, కార్మికవర్గ నాయకత్వంలో వాటిని నడపాలి. సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు తమ దోపిడీ, పీడనలను సాగించేందుకు అమలు చేస్తున్న బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా, దేశాన్ని సైనికీకరించడానికీ, రాజ్యహింసకు వ్యతిరేకంగా, నిరంకుశ, క్రూరమైన చట్టాలకు వ్యతిరేకంగా, ముస్లిములపై, ఇతర మైనారిటీలపై, దళితులపై, ఆదివాసులపై సాగిస్తున్న అమానవీయ, క్రూర హత్యాకాండలకు, అత్యాచారాలకూ వ్యతిరేకంగా, మావోయిస్టు విప్లవకారులపై, పోరాడుతున్న జాతులపై సాగిస్తున్న హత్యాకాండలకూ,

అత్యాచారాలకూ వ్యతిరేకంగా మతమైనారిటీలతో పాటు దేశంలో యావత్తు లౌకికవాద, ప్రగతిశీల దేశభక్తులను సమీకరించాలి. పర్యావరణ పరిరక్షణకై విశాల ప్రాతిపదికన పీడిత ప్రజలను సంఘటితం చేయాలి. వికృతమైన సామ్రాజ్యవాద, భూస్వామ్య విష సంస్కృతికి వ్యతిరేకంగా మహిళలతో పాటు పీడిత ప్రజలందరినీ సమైక్యం చేసి పోరాటాలు సాగించాలి. విశాలమైన మన దేశంలో ఇటువంటి పలు ప్రజా ఉద్యమాలలో భాగం అవుతూ, విశాల ఐక్యసంఘటనల నాయకత్వంలో వాటిని పలు ప్రాంతాలలో నిర్మించి అభివృద్ధి చేస్తూ విశాలమైన, సంఘటితమైన, సమరశీలమైన ప్రజాపునాదిని పెంచుకోవాలి. ఈ ప్రజాపునాదిపై ఆధారపడి విశాల ప్రాంతాలను ఎర్రప్రతిఘటనా ప్రాంతాలుగా, వీటిని గెరిల్లాజోన్లుగా, పీఎల్‌జీఏను పీఎల్‌ఏగా, భౌతిక, స్వీయాత్మక పరిస్థితులలో కలిగే అనుకూల, ప్రతికూల పరిస్థితులపై ఆధారపడి వ్యూహాత్మక దృష్టితో పనిచేస్తూ అధిక అనుకూల గెరిల్లాజోన్లను ఒక క్రమంలో విముక్తి ప్రాంతాలుగా మార్చగలం. తద్వారా మనం ఖచ్చితంగా ప్రతికూలతలను అధిగమించడమే కాకుండా దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయగలం.

ఇలా 136 కోట్ల మంది జనాభాను, అంటే మొత్తం ప్రపంచంలో 19 శాతం పైగా జనాభాను కలిగిన భారతదేశం ఆగ్రహాన్ని, నిరసనను వెళ్లగక్కుతూ పేలడానికి సిద్ధంగా ఉన్న ఒక అగ్నిపర్వతంలా ఉంది. భారతదేశంలో అనుకూల పరిస్థితినంతటినీ సద్వినియోగం చేసుకొని విప్లవానికి నాయకత్వం వహించాల్సిన విప్లవ (మావోయిస్టు)శక్తులు ఇప్పటికీ బలహీనంగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిలో దళారీ పాలకవర్గ పార్టీలు, రకరకాల రివిజనిస్టులు, పోస్టు మోడర్నిస్టులు, చట్టబద్ధ పోరాటవాదాన్ని ముందుకు తెచ్చే ఎన్‌జీఓలు(గైరుసర్కారీ సంస్థలు), సంస్కరణవాదులు, ఆర్థికవాదులు ఈ వేడిని తగ్గించేందుకు ఆ పేలుడు వాయిదా పడటానికి సర్వవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ, భారతదేశానికి వేనవేల నూతన భగత్‌సింగ్‌లను, చంద్రశేఖర్ ఆజాద్‌లను సృష్టించే శక్తి ఉంది. అటువంటి వారిని, సీపీఐ (మావోయిస్టు)లో చేరి వివిధ రంగాల్లో పనిచేస్తూ మృత్యువును ధిక్కరించి అమరులైనవారిలో ఇప్పటికే మనం ఎంతో మందిని చూడవచ్చు. అలాగే అలాంటి శక్తి సామ్రాజ్యవాదులకు, దళారీ పాలకులకు వ్యతిరేకంగా పోరాడే కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావి తదితర పీడిత వర్గాలలో, సెక్షన్లలో, జాతులలో నివురుగప్పిన నిప్పులా ఉంది.

నేడు దళారీ నిరంకుశ బూర్జువా వర్గం మన దేశంలో సామ్రాజ్యవాదానికి దాస్యం చేసే సాధనంగా ఉంది. ఇది విశాల అర్ధభూస్వామ్య సామాజిక పునాదిని వినియోగించుకుని ప్రజలను బంధనాల్లో ఉంచుతుంది, తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తుంది. వీరు ద్రోహులు, విచ్ఛిన్నకులు, ప్రజలకు క్రూరమైన శత్రువులు. వీరు వంచకులు, అబద్ధాలకోరులు, అవినీతిపరులు, మోసగాళ్లు. వీరు ప్రజల్ని హత్యలు, ఊచకోతలు కోసేవారు, రేపిస్టులు, పూర్తిగా పనికిరానివాళ్లు. కానీ వారి చేతిలోనే అధికారం, ఉత్పత్తి సాధనాలు ఉన్నాయి. వారే దేశాన్ని పరిపాలిస్తున్నారు.

అందువల్ల మన దేశాన్ని విముక్తి చేయాలంటే మనం తప్పనిసరిగా, మొట్టమొదట, ఈ ద్రోహులను అధికారం నుండి కూలదోసేందుకు మన పార్టీ విప్లవానికి సమర్థవంతంగా నాయకత్వం వహించాలి.

## దున్నేవారికి భూమి ప్రాతిపదికన వ్యవసాయ విప్లవం ఇరుసుగా గల నూతన ప్రజాస్వామిక విప్లవం ఒక్కటే రైతాంగానికి మార్గం

1947 ఆగస్టు 15న బూటకపు స్వాతంత్ర్యం పేరుతో సామ్రాజ్యవాదులతో షరీకైన దళారీ నిరంకుశ బూర్జువావర్గం బడా భూస్వామ్య వర్గాలు అధికారంలోకి వచ్చాయి. ఈ మూడు మహా పర్వతాలు విశాల అర్ధభూస్వామ్య సామాజిక పునాదిని వినియోగించుకుని ప్రజలను బంధనాల్లో ఉంచాయి, దేశంలో భూస్వామ ఆధిపత్యాన్ని పరిరక్షించి, కొనసాగించాయి. దీంతో దళారీ దోపిడీ పాలకవర్గాలు అటు దేశంలో పరిశ్రమల్ని అభివృద్ధి చేయలేకపోయాయి. దేశాన్ని రుణగ్రస్త దేశంగా మార్చి దేశ ఆర్థిక జీవితాన్ని సామ్రాజ్యవాదుల విచ్చలవిడి దోపిడికి నిలయం చేసాయి. ఇటు వ్యవసాయాభివృద్ధికి అడ్డంకిగా తయారయ్యాయి. వ్యవసాయోత్పత్తి ఒక మేరకు పెరిగినా అందులో అత్యధిక భాగం భూస్వాముల గాదెలలోకి చేరుతోంది. అశేష పీడిత జనం తిండికి మలమలమాడే దుస్థితికి గురిచేసింది. అందువల్ల ఈ కింది ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలలో ఏ ఒక్కటీ పరిపూర్తి కాలేదు:

- "దున్నేవాడికే భూమి" ఆధారంగా భూస్వాములకు యెలాంటి నష్టపరిహారం లేకుండా భూమిని స్వాధీనం చేసుకోవడం.
- భూస్వాముల భూములను వ్యవసాయ కూలీలకు, నిరుపేద రైతులకు, కింది మధ్యతరగతి రైతులకు తిరిగి భూపంపకం చేయడం.
- ప్రజా ప్రయోజనాలకు ఆటకంకాని విధంగా వ్యవసాయంలో ఆధునిక యంత్రాలను, ఆధునిక శాస్త్రీయ విజ్ఞానాన్ని ఉపయోగించి ఉత్పత్తిని గరిష్ట స్థాయికి పెంచడం.
- "వ్యవసాయాన్ని పునాదిగా తీసుకొని, పరిశ్రమలను నాయకత్వంలో ఉంచే" సూత్రంపై, "రెండు కాళ్ల మీద నడిచే" వరుస విధానాలపై ఆధారపడి దేశాన్ని పారిశ్రామికం చేయడం.
- సహకార వ్యవసాయ ఉద్యమాన్ని, వ్యవసాయ సహకార సంఘాలను ప్రోత్సహించడం, పెంపొందించడం.
- సామ్రాజ్యవాద సంస్థల, కంపెనీల, దళారీ నిరంకుశ బూర్జువా వర్గ కంపెనీల, ప్రభుత్వ భూములను జాతీయం చేయడం.
- నిరుద్యోగాన్ని నిర్మూలించడం.

ఈ కర్తవ్యాలు పూర్తి కాకపోవడానికి కారణం ప్రజాస్వామిక విప్లవానికి బడా బూర్జువావర్గం ద్రోహం చేయడం. అందువల్ల 1947 ఆగస్టు 15న లభించినది ప్రజాస్వామిక విప్లవ విజయం కాదనీ, అది సామ్రాజ్యవాదులతో షరీకైన దళారీ బడా బూర్జువా, భూస్వామ్య వర్గాలు చేసిన కుట్ర అనీ చరిత్ర రుజువు చేసింది. కాబట్టి ఇప్పటికే దేశంలో ఆనాటికానాటికి తీవ్రతరమవుతున్న దారిద్ర్యబాధ నుండి పీడిత జనం విముక్తి కావాలంటే పై కర్తవ్యాలను నెరవేర్చగల నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేయాలి. అయితే దానికి నాయకత్వం వహించే సత్తా జాతీయ బూర్జువావర్గానికి లేదు. దళారీ నిరంకుశ బూర్జువా వర్గం చేతిలో దెబ్బలు తింటున్నప్పుడల్లా ఈ వర్గం ఎంతో ఆందోళన చెందుతున్నప్పటికీ దానికి ఆ సత్తా లేదు. తుదివరకు విప్లవానికి నాయకత్వం వహించగలిగేది ఒక్క కార్మికవర్గమే. అందువల్ల గ్రామసీమలలో నివశిస్తున్న నూటికి 70 మందిగా వున్న వ్యవసాయ కూలీలు, పేదరైతులు కార్మికవర్గ పార్టీ నాయకత్వం కింద సమైక్యం కావాలి.

గ్రామీణ ప్రాంతాల్లో మన పార్టీ పీడిత రైతాంగాన్ని సమీకరించి ప్రతీ గ్రామంలో భూమి కేంద్రీకరణ ఎలా ఉందో నిర్దిష్టంగా, స్పష్టంగా పరిశీలన జరిపి వర్గ సంబంధాల-వర్గ వైరుధ్యాల నిర్దిష్ట స్థితిని అర్థం చేసుకోవాలి. గత 72 సంవత్సరాలలో భూమి కేంద్రీకరణలో వచ్చిన మార్పులు ఈ సందర్భంగా దృష్టిలో ఉంచుకోవాలి. తరతరాలుగా మన దేశంలో గ్రామీణ ప్రజానీకం భూమిపై ఆధారపడే జీవిస్తూ వచ్చారు. 72 సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా 54.38 శాతం గ్రామీణ కుటుంబాలు కడుపు నిండా తిండి, కట్టు బట్టా లేక అలమటిస్తున్నారంటే అందుకు ప్రధాన కారణం ఆయా కుటుంబాల భూములు భూస్వాములు కాజేయగా, ఆ కుటుంబాలన్నీ కనీస జీవనాధారం కోల్పోవడమే. ఈ భూమి కేంద్రీకరణ ఒక్కో ప్రాంతంలో ఒక్కో రీతిగా వుండవచ్చు. కాని ఆ కుటుంబాలు కటికదారిద్ర్యంలో కూరుకుపోవడానికి మూలకారణం భూమి వివిధ రూపాలలో అతితక్కువ మంది భూస్వాముల చేతిలో కేంద్రీకరింపబడి వుండటమే. దీనిని ఈనాడు ప్రభుత్వం కూడా కాదనడానికి సాహసించలేదు. పెద్దెత్తున భూపరిమితి చట్టాలు రూపొందించినప్పటికీ గ్రామీణ ప్రాంతంలో అసమానతలు పెద్దగా తగ్గలేదని 1964లో మహాలనోబిస్ కమిటీ స్వయంగా పేర్కొంది.

గత 72 సంవత్సరాలను పరిశీలిస్తే పరిమాణంలో మార్పులు జరిగినప్పటికీ గుణాత్మక మార్పు ఏదీ రాలేదు. అందువల్ల ఈ దారుణ పరిస్థితి మారాలంటే 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికపై భూమిని యావత్తూ తిరిగి పంచడం మినహా మరో మార్గం లేదు. అందుకుగాను భూస్వామ్య విధానాన్ని నిర్మూలించి దున్నేవారికే భూమి పంచే నినాదంపైన పీడిత ప్రజలందరూ ఒక్కుమ్మడిగా సంఘటితం కావాలి. వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు ఎక్కువగా అభివృద్ధి చెంది వున్న పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్ వంటి కొన్ని ప్రాంతాలలో వ్యవసాయ కూలీలను, పేద, మధ్యతరగతి రైతాంగాన్ని, కలిసి వచ్చే ధనిక రైతాంగ సెక్షన్‌ను

సంఘటితపరిచి సామ్రాజ్యవాద బహుళజాతి/దళారీ నిరంకుశ బూర్జువా/ప్రభుత్వ సంస్థల వ్యవసాయ క్షేత్రాలను ఆక్రమించుకొని సహకార వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలి.

అయితే అలా భూమిని తిరిగి పంపకం చేయడము లేదా సహకార వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడము కేవలం ఉత్తిమాటలతో జరిగే పనికాదు. భూస్వాములు తరతరాలుగా పీడిత ప్రజల రక్తాన్ని దోచుకుని, కూడవేసిన భూముల్ని తేలికగా విడిచిపెడతారనడం కల్ల. అంతేకాదు, భూస్వాములకూ, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికీ ప్రాతినిధ్యం వహిస్తున్న వివిధ పార్టీల ప్రభుత్వాలు తమ లక్షలాది సాయుధ సైన్యాలతో వారికి అండదండలిచ్చి వారి దోపిడీని కాపాడడానికే కంకణం కట్టుకున్నవనే యదార్థాన్ని తెలంగాణ, తెభాగా, నక్సల్బరీ రైతాంగ విప్లవాలతో పాటు పలు రైతాంగ ఉద్యమాలు, వర్తమాన బీహార్-ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ, దండకారణ్యం (ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర), పశ్చిమ బంగ్, ఒడిశా, తమిళనాడు, కర్నాటక, కేరళం తదితర సాయుధ రైతాంగ విప్లవాలు చాటిచెబుతున్నాయి. కనుక పీడిత ప్రజలు యావన్మందీ, ముఖ్యంగా అశేష రైతాంగం, సమాజంలో అత్యంత విప్లవకరమైన కార్మికవర్గ నాయకత్వం కింద సమీకృతులై సాయుధులై తెగించి పోరాడడం ద్వారా, వ్యవసాయ విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా మాత్రమే భూమిని సాధించుకోగలుగుతారు. అది మరో మార్గంలో జరగడం అసంభవమని చరిత్ర తేల్చివేసిన సత్యం. అందువల్ల గ్రామీణ రైతాంగం యావత్తూ ఈ చారిత్రక అవసరాన్ని గుర్తించి సాయుధులై ముందుకురావాలి. తమకంటూ ఒక ప్రజాసైన్యం నిర్మించుకోవాలి. భూస్వాములు, వారి ప్రభుత్వం సృష్టించే కుల విభేదాలను అధిగమించి అన్ని కులాల పీడితులు ఒకటి కావాలి. ఆకలితో చచ్చేకంటే పోరాటంలో చావడమే ఉత్తమమనే తెగింపుతో పోరాడటానికి ప్రతి రైతూ, ప్రతి కూలీ సిద్ధం కావాలి.

అదే విధంగా నిజమైన ప్రజాస్వామ్యం గూర్చి కలలుగనే మేధావులు, అభ్యుదయ భావాలు గల ప్రజాస్వామికవాదులు, విప్లవ విద్యార్థులు, యువకులు విప్లవ ఊహాగానాల నుండి విప్లవ ఆచరణలోకి దిగాలి. నూటికి 54 మందిగా గల గ్రామీణ పీడితులు, మొత్తం దేశంలో 80 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యంతో అలమటిస్తున్న యే దేశంలోనూ నిజమైన ప్రజాస్వామ్యం నెలకొనదు. అందుకే ప్రజాస్వామ్యం గూర్చి కలలుకనే ప్రతి ఒక్కరూ, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల ఫాసిజాన్ని వ్యతిరేకించేవారందరూ భారతదేశ ప్రజాస్వామిక విప్లవానికి కీలకమైన ఈ వ్యవసాయ విప్లవాన్ని విజయవంతం చేయడంలో తమ పాత్రను జయప్రదంగా నిర్వహించాలి. మేధావులు, కవులు, గాయకులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు గ్రామీణ పీడిత ప్రజానీకంతో మమేకమై వారిలో విప్లవాగ్నిని ప్రజ్వరిల్లజేయాలి. పీడిత రైతాంగ విప్లవ జ్వాలలను దేశవ్యాప్తంగా ప్రచండ దావానలంగా మార్చి అందులో దేశాభ్యుదయానికి అడ్డంకిగా వున్న భూస్వామ్య విధానాన్ని భస్మీపటలం చేసేందుకు సాహసించి ముందుకు రావాలి. దారి

కంటకావృతమే, కానీ ఇంతకు మించి మరో మార్గం లేదు.

గత 7 దశాబ్దాల కాలంలో భారతదేశంలోని ఉత్పత్తి సంబంధాల్లోని మార్పులను విశ్లేషించుకున్నాం. ఈ విశ్లేషణ ఆధారంగా మనం సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేయడానికి మారిన సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వర్గపోరాట కార్యక్రమాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం వుంది. గత 72 ఏండ్లుగా అమలవుతున్న అర్ధవలస అర్ధభూస్వామ్య విధానాల ఫలితంగా, దాదాపు గత 52 సంవత్సరాలుగా మన పార్టీ నాయకత్వంలో జరుగుతున్న వర్గపోరాట ప్రభావం రీత్యా, ప్రత్యేకంగా 3 దశాబ్దాలుగా అమలవుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల ఫలితంగా దేశవ్యాప్తంగా అర్ధభూస్వామ్యం సాపేక్షికంగా బలహీనపడింది, వక్రీకరించబడిన పెట్టుబడిదారీ సంబంధాలు సాపేక్షికంగా పెరిగాయి. ఇందులో భాగంగా ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలలో జరిగిన మార్పులతో పాటు టెర్రయిన్ మార్పులు, లోతట్టు గ్రామీణ ప్రాంతాల్లో సైతం పెరుగుతున్న ప్రభుత్వ యంత్రాంగపు పట్టు, విస్తరణ – వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని మన దేశ అసమానాభివృద్ధిని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మార్పులు మన దేశ సామాజిక స్వభావాన్ని గుణాత్మకంగా, మౌలికంగా మార్చగలిగేవి కావు. అందువల్ల మన దేశం ఇప్పటికీ అర్ధవలస–అర్ధభూస్వామ్య దేశమే. నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే ఈ వ్యవస్థ మౌలిక స్వభావం మారుతుంది. అయితే ఈ మార్పుల దృష్ట్యా మన వ్యూహం–ఎత్తుగడల డాక్యుమెంట్‌లో పేర్కొన్న 5 కేటగిరీలున్న గ్రామీణ ప్రాంతాలతో పాటు మరో రెండు కేటగిరిలను చేర్చుకోవాల్సిన అవసరం ఉంది. అవి: 1. కొండలు, గుట్టలు, అడవులతో వున్న ప్రాంతాలు; 2. వర్గ వైరుధ్యాలు తీవ్రంగా ఉండి ఇప్పటికీ అర్ధభూస్వామ్యం సాపేక్షికంగా బలంగా వున్న ప్రాంతాలు; 3. వర్గ వైరుధ్యాలు తీవ్రంగా ఉండి, ప్రపంచీకరణ విధానాల ఫలితంగా, మన పార్టీ నాయకత్వంలో జరిగిన తీవ్రమైన వర్గపోరాటాల ఫలితంగా, అర్ధభూస్వామ్యం సాపేక్షికంగా బలహీనపడిన ప్రాంతాలు; 4. వక్రీకరించిన పెట్టుబడిదారీ సంబంధాలు సాపేక్షికంగా బలంగా వున్న ప్రాంతాలు; 5. సముద్ర తీర ప్రాంతాలు; 6. నగర ఆర్థిక జీవితంతో విడదీయలేనంతగా ముడివడిన నగరశివారు (సబర్బన్) గ్రామీణ ప్రాంతాలు; 7. ప్లాంటేషన్స్ ప్రధానంగా వున్న ప్రాంతాలు. (ఇందులో 3వ, 7వ రకం గ్రామీణ ప్రాంతాలు కొత్తగా చేర్చుకున్నవి).

ఈ వర్గీకరణ యావత్తు దేశానికీ, అన్ని రాష్ట్రాలకూ, రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకూ వర్తిస్తుంది. కాబట్టి సీసీ, ఎస్ఏసీ/ఎస్‌జడ్‌సీ/ఎస్‌సీలు పై వర్గీకరణను దృష్టిలో పెట్టుకుని నిర్దిష్ట పరిశీలన జరిపి వ్యూహాత్మక దృష్టితో సరైన ఎత్తుగడలు రూపొందించుకోవాలి. వివిధ ప్రాంతాలలో కలిగే మార్పులకు అనుగుణంగా ఎత్తుగడలు మార్చుకోవాలి. అందువల్ల ఈ వ్యూహాత్మక నాయకత్వ కమిటీలు ఒక్కో రాష్టంలో, రాష్ట్రాల సరిహద్దుల్లో ఉత్పత్తి శక్తుల అభివృద్ధి స్థాయి, ఉత్పత్తి సంబంధాల స్థితి, వర్గపోరాట ప్రభావం, ప్రపంచీకరణ ప్రభావం, కులపీడన, టెర్రయిన్,

ప్రభుత్వ యంత్రాంగపు పట్టు అనే అంశాల ఆధారంగా ఆయా ప్రాంతాలను వర్గీకరించుకోవాలి. ఈ వర్గీకరణ ఆధారంగా ఆయా ప్రాంతాల్లో సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు, భూస్వాములకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వర్గపోరాట కార్యక్రమాన్ని, వ్యవసాయిక విప్లవ కార్యక్రమాన్ని ఇందుకోసం తగిన ఎత్తుగడల్ని (పోరాట నిర్మాణ రూపాల్ని) రూపొందించుకోవాలి.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ఇందులో భాగంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సంక్లిష్టంగా మారినందువల్ల ఈ మార్పులను దృష్టిలో ఉంచుకుని, ఆయా ప్రాంతాలలో ప్రధాన నినాదంపై (దున్నేవారికే భూమి చెందాలి, విప్లవ రైతాంగ కమిటీలు, రైతుకూలీ సంఘాలు, విప్లవ ప్రజా కమిటీలకే సర్వాధికారాలు, సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల, పెట్టుబడిదారీ భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల వ్యవసాయ క్షేత్రాలను, ప్లాంటేషన్స్‌ను ప్రజాపరం చేయండి, జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్ కోసం పోరాడండి) కేంద్రీకరించి పోరాడుతూనే మన బలాబలాలను బట్టి సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలు సాగించే అన్ని రకాల దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా తగిన పోరాట, నిర్మాణ రూపాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు ఇప్పటికే ఆచరణ క్రమంలో సంపాదించిన సకారాత్మక అనుభవాలను వినియోగించుకుని నేటి మన ఉద్యమ ప్రాంతాలలోనే కాకుండా దేశవ్యాప్తంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం, విస్తృతం చేసేందుకు కృషి చేయాలి. అందుకోసం సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటంలో ఈ కింది డిమాండ్లతో రైతాంగాన్ని, మిత్ర వర్గాలను కదిలించాలి.

- భూస్వామ్య ఆధిపత్యాన్ని కూలదోసి భూమిలేని వ్యవసాయ కూలీల, పేదరైతుల, నాయకత్వం కింద ప్రజా రాజకీయ అధికారాన్ని నెలకొల్పాలి.
- పాత, కొత్త భూస్వాముల, మత సంస్థల వద్ద, భూస్వామ్య దోపిడీ, ఆధిపత్యాన్ని చెలాయించే వడ్డీ వ్యాపారులు/ఫైనాన్స్ సంస్థల యజమానులు, సారా వ్యాపారులు, పంటల వ్యాపారులు, బడా వ్యాపారులు, ప్రైవేటు గిడ్డంగుల యజమానులు, ధాన్యం మిల్లు ఓనర్లు, గ్రామీణ పరిశ్రమల, రియల్ ఎస్టేట్ల, సినిమా థియేటర్ల, పెట్రోల్ పంపుల, ట్రాన్స్‌పోర్టు యజమానులు, విద్యా సంస్థల యజమానుల వద్ద, ఇసుక, గ్రానైట్ తదితర మైనింగ్ మాఫియాల వద్ద, బహుళజాతి కంపెనీలు, దళారీ కార్పొరేట్ కంపెనీలు, ఎన్ఆర్ఐలు, ఎన్‌జీఓలు, తదితరుల మిగులు భూములను, వివిధ రకాల ఖనిజాల తవ్వకం, పరిశ్రమలు, సెజ్‌లు, ప్లాంట్లు, కారిడార్లు, ప్లాంటేషన్లు, ఫారంహౌసులు, ఫ్లైఓవర్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు, బుల్లెట్ ట్రెయిన్, మెట్రో రైల్, ఎయిర్‌పోర్టులు, షిప్‌యార్డులు తదితర పేర్లతో ప్రభుత్వం కబ్జా చేసి అప్పగించిన భూములను ఎలాంటి నష్టపరిహారం లేకుండా జప్తు చేసుకొని, వ్యవసాయ కూలీ, పేదరైతులకు పంపిణీ

చేయాలి. రైతుల వద్ద నుంచి అక్రమంగా ఆక్రమించుకున్న భూములను, భూసంస్కరణల కింద పంపిణీ చేయబడిన భూములను తమ ఆధిపత్యంలో ఉంచుకున్న భూస్వాములకు వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని నిర్మించి భూములను తిరిగి హక్కుదార్లకు (సంబంధిత వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు, మధ్యతరగతి రైతులకు) అప్పగించాలి.

- వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు ఎక్కువగా అభివృద్ధి చెందిన కొన్ని ప్రాంతాలలో వ్యవసాయ కూలీలను, పేద, మధ్యతరగతి రైతాంగాన్ని, కలిసి వచ్చే ధనిక రైతాంగ సెక్షన్‌ను సంఘటితపరిచి సామ్రాజ్యవాద బహుళజాతి/దళారీ నిరంకుశ బూర్జువా/ప్రభుత్వ సంస్థల వ్యవసాయ క్షేత్రాలను ఆక్రమించుకొని సహకార వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలి లేదా ఆ వ్యవసాయ క్షేత్రాలను విప్లవ ప్రజా ప్రభుత్వాలు జాతీయం చేయాలి.
- అడవిపై హక్కు ఆదివాసులదీ, పీడిత ప్రజలదీ. అటవీ సంపదను సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, బడా కాంట్రాక్టర్లు కొల్లగొట్టడాన్ని అడ్డగించాలి.
- ప్రజలను సాయుధం చేసి విస్తృత ప్రాతిపదికన సాయుధ ప్రజా మిలీషియాను నిర్మించాలి.
- ప్రభుత్వానికి పన్నులు, లెవీలు చెల్లించడం నిలిపివేయాలి.
- కుల, మత విభేదాలను రెచ్చగొట్టడం ద్వారా పీడిత ప్రజలను చీల్చడానికి ప్రయత్నించే భూస్వాముల, దళారీ ప్రభుత్వ కుతంత్రాలను సాగనీయరాదు.
- దళితులలో నూటికి 95 మంది, ఆదివాసులు, వెనుకబడిన కులాలవారిలో మెజారిటీ వ్యవసాయ కూలీలు, పేదరైతులు. అందువల్ల కూలిరేట్లు పెంచుకోవడానికి, అధిక పని గంటలకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టాలి. న్యాయమైన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేయాలి. నేటికీ వివిధ రూపాల్లో కొనసాగుతున్న జీతగాళ్ల జీతాలను పెంచుకోవడానికి, దళితులపై, ఆదివాసులపై, ఇతర వెనుకబడిన కులాలపై కొనసాగుతున్న సామాజిక అన్యాయాలను, అవమానాలను ప్రత్యేకించి అంటరానితనం, వెట్టిచాకిరి తదితర ఆర్థికేతర దోపిడీ, పీడన, అణచివేతలను నిరోధించడానికి, కౌలురేట్ల తగ్గింపుకు, 'వ్యక్తిగత సాగు' పేరుతో కౌలుదార్లను భూముల నుండి తొలగించకుండా నిరోధించాలని, వారిపై అమలు చేస్తున్న భూస్వామ్య దోపిడీ, పీడనలను, కట్టుబానిసత్వాన్ని అరికట్టాలని, భూస్వాములకు, ధనిక రైతులకు భూమిని కౌలు (రివర్స్ కౌలు)కు ఇవ్వడాన్ని నిషేధించాలని, తదితర డిమాండ్ల సాధనకై వ్యవసాయ కూలీలు, పేదరైతులు అంతా ఒకటి కావాలి. అంటే దళితులు, ఆదివాసులు, వెనుకబడిన కులాలవారు భూస్వాములకు వ్యతిరేకంగా ఒకటి కావాలి.

- వ్యవసాయాన్నీ, సహకార ఉద్యమాన్నీ అభివృద్ధి చేయాలి. ఉత్పత్తిని పెంచాలి. అన్ని రంగాలలో స్వయంసమృద్ధిని సాధించాలి.
- వివిధ వ్యవసాయేతర రంగాలలో, ఇటుక తయారీ, నిర్మాణరంగం, చెరకు పరిశ్రమ, ధాన్యాన్ని ఆరబెట్టే (ప్రాసెసింగ్) యూనిట్లు మొదలైన వాటిలో శ్రామికుల/అర్ధ–కార్మికులపై భూస్వామ్య శక్తులు సాగించే దోపిడీకి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ప్రత్యేక నిర్మాణ, పోరాట రూపాలను రూపొందించుకొని వర్గ పోరాటాన్ని నిర్మించాలి. ఉపాధి గ్యారంటీ పథకాన్ని అడ్డుకునే భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి. సీజనల్ శ్రామికులు ఎదుర్కొంటున్న పలు రకాల దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టాలి.
- పీడక కులాలలో కూడా అత్యధికులు పేదరైతులు, మధ్యతరగతి రైతులు. ఆనాటికానాటికి వారిలో కూడ భూమి కోల్పోయి కూలినాలి చేసికొనవలసిన స్థితికి గురైన వారి సంఖ్య పెరుగుతున్నది. వారు కుల చాదస్తపు మత్తుతో భూస్వాముల కుట్రలకు లోనయ్యే ప్రమాదం వున్నా, వారికి కూడా వ్యవసాయ విప్లవం ఒక్కటే శరణ్యం. అందువల్ల యేనాటికయినా నిజం గుర్తించి వారు దళితులకు, ఆదివాసులకు, వెనుకబడిన కులాలకు చెందిన వ్యవసాయ కూలీ, పేద రైతాంగంతో కలిసితీరాలి. అందువల్ల వారిని ప్రతి సమస్యపైనా కలుపుకొని వచ్చేందుకు ప్రయత్నించాలి. వారిని, కుల అహంభావాన్నీ, బంధుత్వాలనూ ప్రయోగించి దళిత, వెనుకబడిన కులాలకు చెందిన వ్యవసాయ కూలీ, పేద రైతాంగంతో కలవకుండా చేయడానికి భూస్వాములు విశ్వప్రయత్నం చేస్తారు. మనం ఇటువంటి పరిస్థితులలో వారు వాస్తవాలను అర్థం చేసుకునేలా వ్యవహరించాలి. భూస్వాములకు వ్యతిరేకంగా అన్ని కులాలకు చెందిన కూలీలను, పేద రైతులను సమైక్యం చేయడానికి ప్రయత్నించాలి. ఆ ప్రయత్నంలో మనం నెగ్గనంతవరకు వ్యవసాయ విప్లవం జయప్రదం కావడం కష్టమే. కనుక అందుకు ఓపికతో పని చేయాలి.
- వ్యవసాయంలో వక్రీకరించిన పెట్టుబడిదారీ సంబంధాలు విస్తరించిన చోట అన్ని కులాలకు చెందిన వ్యవసాయ కూలీలతో సహా ఇతర అర్ధ శ్రామికులను కలుపుకొని వ్యవసాయ కూలీ సంఘాలు నిర్మించాలి. అలాగే అన్ని కులాలకు చెందిన రైతులతో రైతు సంఘాలు నిర్మించాలి. ఎట్టి పరిస్థితిలోనూ భూస్వాములను రైతు సంఘాలలో చేర్చుకోకూడదు. లేకుంటే రివిజనిస్టుల సంఘాల మాదిరిగా రైతుసంఘాల పేరుతో భూస్వాముల సంఘాలు ఏర్పడతాయి. రైతు అంటే పేద రైతు, మధ్యతరగతి రైతు అనే అర్థం. రైతులలో నూటికి తొంబైమంది వారే. వారి నాయకత్వం కిందనే రైతు సంఘాలు నిర్మించాలి. ఇందులో ధనిక రైతులను కూడా కలుపుకునేందుకు కృషి

చేయాలి.

- భూస్వాముల, వడ్డీ వ్యాపారుల, పంటల వ్యాపారుల, ధాన్యం మిల్లులు, ఇతర మిల్లుల యజమానుల రుణాలను, వడ్డీలను చెల్లించడం నిలిపివేయాలి. పాత, కొత్త భూస్వాములు ముందుకు తెచ్చిన నూతన దోపిడీ రూపాలకు వ్యతిరేకంగా పోరాడాలి. రైతులకు వడ్డీలేని రుణాలు/స్వల్ప వడ్డీకి రుణాలు ఇవ్వాలనే డిమాండ్‌తో పోరాడాలి. ఊరుమ్మడి భూములపై, ఆస్తులపై, పంచాయితీలపై, పంచాయితీ నిధులపై, ప్రభుత్వ పథకాల, ప్రభుత్వ, సహకార బ్యాంకుల నిధులపై, ప్రభుత్వ, ప్రైవేటు కాంట్రాక్టులపై, ప్రకృతి వనరులపై (ఇసుక, గ్రానైట్, రంగురాళ్లు తదితర ఖనిజాలు, కలప, వనమూలికలు, అటవీ ఉత్పత్తులు), ప్రభుత్వ చౌక దుకాణాలపై (రేషన్ షాపులపై) భూస్వామ్య శక్తుల ఆధిపత్యానికి, ప్రభుత్వ నిధులను కాజేయడంలో వారి భారీ అవినీతి కుంభకోణాలకు వ్యతిరేకంగా, వ్యవసాయ ఉత్పత్తి సాధనాలపై అధిక అద్దెలు వసూలు చేయడానికి వ్యతిరేకంగా పీడిత ప్రజల అధికారం కోసం నాలుగు విప్లవ వర్గాలను సంఘటితం చేసి వర్గ పోరాటాన్ని నిర్మించి అభివృద్ధి చేయాలి. గ్రామీణ ప్రాంతాలలో రియల్ ఎస్టేట్, రవాణా, ఫైనాన్స్, సారా వంటి వ్యాపార లావాదేవీల్లో భూస్వామ్య దోపిడీని అరికట్టేందుకు వివిధ పోరాటాలు చేపట్టాలి.
- బహుళజాతి, దళారీ కంపెనీల, భూస్వామ్య కూటమి సాగించే దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా వర్గ పోరాటాలు నిర్మించాలి.
- గ్రామీణ ప్రాంతంలో దళితుల, మహిళల, మత మైనారిటీల హక్కుల పరిరక్షణకై పోరాటాలు చేపట్టాలి. వారిపై బ్రాహ్మణవాద హిందుత్వ భూస్వామ్య శక్తులు జరిపే దోపిడీ పీడనలను అడ్డుకోవాలి.
- ఏ పార్లమెంటరీ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా భూసంస్కరణలు, దళితుల ఉద్ధరణ, రైతులకై పలు పథకాలు, సంస్కరణలు మొదలైన పేర్లతో బూటకపు సంస్కరణలను ముందుకు తెస్తున్నాయి. ఈ బూటకపు సంస్కరణల నినాదాల జోరూ, ప్రచారాల హోరూ అంతా కేవలం పీడిత ప్రజలలో లేనిపోని భ్రమలు రేకెత్తించి వారిని విప్లవపథం నుండి పక్కదారి పట్టించి, అణచివేయడానికి ఆడుతున్న దొంగనాటకాలే తప్ప వేరేంకాదు. ఈ సంస్కరణలలో పీడిత ప్రజల స్థితిగతులను మెరుగుపరచడం, వెనుకబడిన కులాల ఉద్ధరణ కేవలం నేతిబీరకాయలో నేయి లాంటిదేనని విశాల ప్రజానీకానికి సోదాహరణంగా స్పష్టంగా తెలియజెప్పాలి. ఇది నిజమైన ప్రజాస్వామికవాదులందరి కర్తవ్యం. ఈ నిజాన్ని గుర్తించనివారు, దానిని ప్రజలకు తెలియజెప్పనివారు, పైకి ఎన్ని కబుర్లు చెప్పినా వారు వాస్తవానికి భూస్వాములకూ, దళారీ బూర్జువావర్గానికి

సేవ చేసేవారుగా మిగులుతారు తప్ప ఎప్పటికీ నిజమైన ప్రజాస్వామికవాదులు కాలేరు.

## సామ్రాజ్యవాద బంధనాల నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు నూతన ప్రజాస్వామిక విప్లవమే మార్గం

దాదాపు రెండున్నర శతాబ్దాలకు పైగా మన స్వాతంత్ర్యం మన నుంచి అపహరించబడింది. ప్రాకృతికంగా, మానవ వనరులపరంగా సమృద్ధమైన ఒక దేశం ధ్వంసమైపోయింది. ప్రజలు అమానవీయ స్థితిలో తమ బతుకులు వెళ్లదీస్తుండగా, మన ఖనిజాలను, పంటలను సామ్రాజ్యవాదులు దోచుకున్నారు. మన నేల, సహజ పర్యావరణం ధ్వంసమయ్యాయి. మన మూలవాసులు-ఆదివాసులు దెబ్బతినిపోయారు, అడవులు విచ్ఛిన్నమయ్యాయి.

ప్రపంచీకరణ కాలంలో దేశంలో నయావలస తరహా దోపిడీ కొనసాగడమే కాక, అది నూతన ఎత్తులకు చేరుకుంది. వినాశనం అనేక రెట్లు పెరిగింది. గతంలో సామ్రాజ్యవాదులు మహారాజుల ద్వారానూ, ప్రత్యక్షంగానూ తమ దోపిడీ, పీడనలు సాగించేవారు. అధికార మార్పిడి తర్వాత దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ద్వారా వారు పరోక్ష పాలన, దోపిడీ, అజమాయిషీకి సంబంధించిన నూతన రూపాల్ని చేపట్టారు. ఇదే నయావలసవాదం. ఇప్పటికీ దళారీ నిరంకుశ బూర్జువా వర్గం మన దేశంలో సామ్రాజ్యవాదానికి దాస్యం చేసే సాధనంగా ఉంది. అందువల్ల అది స్వావలంబన పునాదిగా దేశాన్ని పారిశ్రామీకరించేందుకు వ్యతిరేకం. దేశాన్ని రుణగ్రస్తంగా మార్చి సామ్రాజ్యవాదుల విచ్చలవిడి దోపిడీకి నిలయంగా చేసింది.

### స్వావలంబ ఆర్థిక వ్యవస్థ

దేశంలో 'ప్రపంచీకరణ' నూతన దాడి వల్ల తీవ్రంగా దెబ్బతింటున్న యావత్తు పీడిత వర్గాలు, సెక్షన్లు, పీడిత జాతులు నూతన ప్రజాస్వామిక స్వావలంబ ఆర్థిక వ్యవస్థ కోసం మూడు మహా పర్వతాలకు వ్యతిరేకంగా కొనసాగే పోరాటంలో ప్రధాన శక్తులు అవుతాయి. ఇందులో కార్మికులు, రైతాంగం, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలు అంటే నాలుగు పీడిత వర్గాలు, దళిత, ఆదివాసీ, మహిళలు, మత మైనారిటీలు తదితర పీడిత సెక్షన్లు, కశ్మీర్, నగా, మిజో, మణిపురీ, అసోం తదితర పీడిత జాతులు ఉంటాయి. వీరిని తమ డిమాండ్లపై ప్రచారం, ఆందోళన, వర్గ పోరాటం అనే ప్రక్రియల ద్వారా సమీకరించాలి. చట్టబద్ధ-చట్టవ్యతిరేక, బహిరంగ-రహస్య పోరాట, నిర్మాణ రూపాలను సమన్వయిస్తూ ప్రజా పోరాటాల, ప్రతిఘటనా పోరాటాల వెల్లువను సృష్టించాలి.

1947కు ముందు పోరాటాలలో కాంగ్రెస్, సీపీఐల నాయకత్వాల విద్రోహాల నుంచి గుణపాఠాలు తీసుకుని నిజమైన స్వాతంత్ర్య పోరాటాన్ని నిర్మించాలి. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాతో సాయుధ వ్యవసాయ విప్లవం ఇరుసుగా గల నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా

మాత్రమే దేశానికి సామ్రాజ్యవాద కబంధ హస్తాల నుంచి, యావత్తు అభివృద్ధి నిరోధకుల నుంచి – ప్రత్యేకించి దేశంలో అభివృద్ధి నిరోకత్వాన్ని ముఖ్యంగా పరిరక్షిస్తున్న విశాల గ్రామీణ ప్రాంతంలోని అర్ధభూస్వామ్య స్తబ్ధత నుంచి స్వేచ్ఛ లభిస్తుంది.

నేడు ప్రపంచీకరణ స్థానంలో స్వావలంబ ఆర్థిక వ్యవస్థను స్థాపించాలని ఎవరు మాట్లాడినా అది ఊహాజనితంగా కనిపించవచ్చు. మొత్తం భూగోళాన్ని చుట్టివేస్తూ ఒక భయానకమైన శక్తిగా ప్రపంచీకరణ కనపడుతోంది. దాని స్థానంలో మరో వ్యవస్థను స్థాపించగలమంటే చాలా మందికి నమ్మశక్యం కాదు. పెద్దసంఖ్యలో వున్న ప్రపంచీకరణ వ్యతిరేక గ్రూపులు ప్రపంచీకరణ పరిధిలోనే కేవలం సంస్కరణలను చేయాలని, దానికి మానవముఖాన్ని చేకూర్చాలని కోరుకుంటాయి. రివిజనిస్టులు సైతం దాని స్థానంలో మరొకదాన్ని తీసుకురావాలని కాకుండా, దాన్ని సంస్కరించాలని మాత్రమే మాట్లాడతారు. సారాంశంలో, ప్రస్తుతం ఉనికిలో ఉన్న వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదని చెప్పే 'చరిత్ర ముగిసింది' అనే సిద్ధాంతానికి అందరూ దాసులయ్యారు.

అయితే వాస్తవానికి ప్రపంచీకరణ అనేది ప్రపంచంలోని వెనుకబడిన దేశాలపై ద్రవ్య పెట్టుబడి దాడి. గుత్త సంస్థలలో పెట్టుబడి పునర్వ్యవస్థీకరణతో ఇది ముడిపడి ఉంది. 1973 నుంచి పెట్టుబడి శాశ్వత సంక్షోభంలో కూరుకుపోయినందువల్ల, సంక్షోభం నుంచి బయటపడేందుకు అది అనుసరించిన వ్యూహంలో కూడా ఇది భాగం. ప్రస్తుతం అది ప్రత్యేకించి 2008 నుంచి మరింత సంక్షోభంలో కూరుకుపోయింది. కాబట్టి దానికి సంస్కరణలు చేసే అవకాశాలు తక్కువ. అయితే సాధారణంగా అందులో కొన్ని వికాస దశలు కూడా ఉంటాయి. ఇందులో అసంతృప్తిని సులభంగా, మరింత చౌకగా ద్రవ్య పెట్టుబడి కొనేస్తుంది. అయితే సంక్షోభ దశల్లో ఇటువంటి అవకాశం లభించదు. సంక్షోభ దశల్లో అది మరింత దూకుడుగా మారుతుంది. పెట్టుబడిపై లాభం వీలైనంత పెంచుకునేందుకు అసంతృప్తిని క్రూరంగా అణచివేస్తుంది. యావత్తు 'భూమి శిఖరాగ్ర సభలు', 'ఆహార శిఖరాగ్ర సభలు', 'నీటి శిఖరాగ్ర సభలు', మొదలైనవి ప్రపంచ ప్రజలను మభ్యపెట్టేందుకు కేవలం కంటితుడుపు చర్యలే. జరుగుతున్న నష్టం గురించి తాము అప్రమత్తంగా ఉన్నామని చాటుకోవడానికి చేసే ప్రయత్నమే.

అందువల్ల, వాస్తవానికి, పెట్టుబడిదారీ విధానం/సామ్రాజ్యవాదం సంక్షోభంలో ఉన్నప్పుడు సంస్కరణలను లేదా మానవముఖాన్ని ఆశించడం ఆచరణ సాధ్యం కానిది/ఊహాజనితమైంది. ప్రపంచీకరణ అనే భయానక మృగానికి మానవముఖాన్ని ఇచ్చినప్పటికీ, అది కేవలం దాని రక్తపిపాసను మరుగుపరిచే ప్రయత్నం మాత్రమే. నిస్సందేహంగా, దానికి వ్యతిరేకంగా ప్రతిఘటనను పెంపొందించడం ద్వారా కొన్ని రాయితీలను పొందవచ్చు, తీవ్ర పోరాటం ద్వారా కొన్ని విజయాలను సైతం సాధించవచ్చు, కానీ మౌలిక సంస్కరణలు ఏమీ సాధ్యం కాదు.

స్వావలంబన భావాలు తక్షణం అమలయ్యే అవకాశాలు అంతగా కనపడడం లేదని కొంతమంది భావిస్తున్నారు, కానీ ఎంత కష్టమైనప్పటికీ, దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు అది మాత్రమే పరిష్కారం. ఇందుకు అడ్డదారి ఏదీ లేదు. 1947లో వచ్చిన మార్పు ఎటువంటి నిజమైన వ్యత్యాసాన్ని తీసుకురాలేకపోయింది. గత 72 సంవత్సరాలలో మూడు మహా పర్వతాల కింద మరింత నలిగిపోయిన ఫలితంగా దేశ పరిస్థితి మరింత దిగజారింది. అయినప్పటికీ దేశంలో స్వావలంబ ఆర్థిక వ్యవస్థ స్థాపన ఊహాజనితమైంది కాదు. దానిని వాస్తవంగా మార్చవచ్చు, సమస్య ఏమిటంటే ప్రస్తుతం ఉనికిలో ఉన్న వ్యవస్థను ధ్వంసం చేయడం, సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య కూటమిని ఓడించేందుకు తగినంత ఒక బలమైన శక్తిని (పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటన) నిర్మాణం చేయడం. అందుకోసం ఉనికిలో ఉన్న దోపిడీ, పీడన, అణచివేత కొనసాగిస్తున్న రాజకీయాధికార వ్యవస్థలను ధ్వంసం చేయకుండా, పాలకవర్గాలు అటువంటి ఒక ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు ఎన్నటికీ అనుమతించవు. స్వావలంబ ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు ముందు షరతు ప్రతీఘాతుక అర్ధవలస, అర్ధభూస్వామ్య రాజకీయాలకు, ఆర్థికానికీ, సంస్కృతికి వ్యతిరేకంగా దేశంలోని సకల సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామిక శక్తులు కార్మికవర్గం, దాని అగ్రగామి దళమైన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన, కార్మిక, కర్షక మైత్రి ప్రాతిపదికపైన సాయుధ పోరాటం ద్వారా అర్ధవలస, అర్ధభూస్వామ్య రాజ్యయంత్రాంగాన్ని కూలదోసి రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకోవడం, సకల సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక శక్తుల ప్రజాస్వామిక రాజ్యాన్ని స్థాపించడం.

ఈ జనతా ప్రజాస్వామిక రాజ్యం సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ బూర్జువావర్గానికి చెందిన అన్ని పరిశ్రమలను, బ్యాంకులను, ఇతర సంస్థలను స్వాధీనం చేసుకుంటుంది. సామ్రాజ్యవాదులకు చెల్లించాల్సిన అప్పులన్నీ రద్దు చేస్తుంది. భూస్వాముల భూములన్నీ స్వాధీనం చేసుకుని పేద, భూమిలేని రైతాంగానికి పంచుతుంది. రైతాంగంపై వడ్డీ వ్యాపారులు, వ్యాపారులు సాగించే దోపిడీని అంతం చేస్తుంది. తద్వారా దేశంలో కార్మికులు, అర్ధ-కార్మికులు, రైతాంగం, పట్టణ మధ్యతరగతితో సహా యావత్తు పీడిత సెక్షన్ల, పీడిత జాతుల విముక్తికి మార్గాన్ని సుగమం చేస్తుంది.

నేడు దేశంలోని పలు బలమైన విప్లవోద్యమ ప్రాంతాలలో విప్లవ ప్రజా కమిటీలు (స్థానికంగా నూతన ప్రజాస్వామిక ప్రభుత్వాలు) ఏర్పడి ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రాథమికంగా అమలు చేస్తున్నాయి. ఈ విధమైన కృషిని కొనసాగించడం ద్వారానే దేశంలో నిజమైన స్వతంత్ర, ప్రగతిశీల, సర్వతోముఖ, స్వావలంబ, లౌకిక, ప్రజాస్వామిక వ్యవస్థ స్థాపించబడుతుంది, ప్రణాళికాబద్ధంగా బలోపేతం చేయబడుతుంది. అటువంటి భారతదేశం నిజమైన లౌకిక దేశంగా వివిధ జాతుల స్వచ్ఛంద సమాఖ్యగా ఉంటుంది. ఒక

స్వావలంబ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత దోపిడీ వ్యవస్థకు భిన్నంగా రెండు మౌలిక అంశాలను కలిగి ఉంటుంది:

మొదటిది, ఉత్పత్తులకు దేశీయ మార్కెట్‌ను విస్తరించడం ద్వారా పునాది స్థాయిలో దేశ పారిశ్రామికీకరణకు మార్గం సుగమం చేస్తుంది. విశాల ప్రజారాశుల కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా మాత్రమే ఇది సాధ్యం. వీరిలో అత్యధికులు గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో కాలంచెల్లిన, వెనుకబడిన అర్ధవలస, అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాలను ధ్వంసం చేయడం ద్వారా మాత్రమే దీన్ని సాధించడం సాధ్యమవుతుంది. ఈ పాత ఉత్పత్తి సంబంధాలే ప్రజల దారిద్ర్యానికి ప్రధాన కారణం. ఈ వెనుకబాటుతనం నుంచి ప్రజలు విముక్తి అయితే, నూతన ప్రజాస్వామిక ప్రభుత్వం వ్యవసాయంలో భారీగా మదుపుపెడుతుంది. భారత ఆర్థిక వ్యవస్థకు ఒక ప్రేరకశక్తి సృష్టించబడుతుంది. ఎగుమతులపై ఎంతమాత్రమూ ఆధారపడాల్సిన అవసరం వుండదు. మార్కెట్ కోసం ధనికవర్గపు వినిమయ రూపాలపై ఆధారపడాల్సిన అవసరం వుండదు.

2వ ప్రధాన చర్య, విదేశాల నుంచి వచ్చే భారీ పెట్టుబడులకు ముగింపు పలకడం. మనం ఇప్పటికే చూసినట్లు, ప్రపంచంలో ఏ దేశపు జాతీయ ఆదాయంలో అయినా 20 శాతం ప్రతి సంవత్సరం విదేశాలకు తరలిపోతుంటే ఆ దేశంలో వృద్ధి సాధ్యమవుతుందా? విదేశీ పెట్టుబడిని భారీ మొత్తాలలో ఆహ్వానించాలని చాలా మంది మాట్లాడుతుంటారు గానీ దాన్ని నిరోధించడం గురించి ఒక్క మాట కూడా మాట్లాడరు. మోదీ నేతృత్వంలోని మొదటి ఐదేళ్ల ఎన్‌డీఏ పాలనలో దేశంలోకి 20.30 లక్షల కోట్ల రూపాయలు ఎఫ్‌డీఐ వచ్చిందని పెద్దెత్తున ప్రచారం చేసుకుంటున్నప్పటికీ ప్రతి సంవత్సరం సుమారు 47.09 లక్షల కోట్ల రూపాయల సంపదను సామ్రాజ్యవాదులు దేశం నుంచి తరలించుకు పోతున్నప్పుడు అది ఏమంత చెప్పుకోదగిన విషయం కాదు.

కనుక, మనం యావత్తు విదేశీ/దళారీ పెట్టుబడిని స్వాధీనం చేసుకుంటే, భవిష్యత్తులో దేశంలోకి నూతన పెట్టుబడి ప్రవేశించకపోయినప్పటికీ దేశానికి పెద్ద విపత్తు ఏదీ రాదు. ఇందుకు భిన్నంగా, పెద్దెత్తున పెట్టుబడి రాకకు అది ముగింపు పలుకుతుంది. ఆ తర్వాత, ఈ అత్యవసరమైన పెట్టుబడిని వ్యవసాయాన్ని, దానికి సేవ చేసే చిన్న తరహా పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు చక్కగా వినియోగించుకోవచ్చు.

దీంతో పాటు రక్షణ, పోలీసు వ్యవస్థలపై, అధికారులను, రాజకీయ నాయకులను మేపడానికై పెట్టే యావత్తు వృధా ఖర్చులపై కోత విధించడం ద్వారా మరిన్ని నిధులను విడుదల చేయవచ్చు.

అటువంటి ఆర్థిక వ్యవస్థ స్వంతకాళ్లపై ఆధారపడేదిగా ఉంటుంది, విదేశాల నుంచి నిధులపై లేదా విదేశీ మార్కెట్‌కు ఎగుమతులు చేయడంపై ఆధారపడకుండా స్వయంగా వృద్ధిని

సాధిస్తుంది. ప్రపంచ మార్కెట్ల నుంచి విడిపడటం ద్వారా స్వయంపోషకత్వం సాధిస్తామని దీని అర్థం కాదు, దీని అర్థం, సామ్రాజ్యవాదులకు కాకుండా, దేశానికి ప్రయోజనం చేకూర్చే షరతులపై వ్యవహరించడం మాత్రమే. భారతదేశం 136 కోట్ల జనాభా కలిగిన పెద్ద దేశం. దానికి పెద్దెత్తున సహజ వనరులు, సారవంతమైన భూములు ఉన్నాయి. అటువంటి భారీ దేశపు ప్రజలు ప్రస్తుత వ్యవస్థ బంధనాల నుంచి బయటపడితే ఆ దేశం అభివృద్ధి చెందటానికీ, వృద్ధి సాధించటానికీ ఎటువంటి సమస్య ఉండదు. అప్పుడు భారతదేశం పేద, వెనుకబడిన దేశంగా, సామ్రాజ్యవాదుల ప్రతి ఒక్క ఆదేశాన్నీ అతివినయంతో ఆమోదించే దేశంగా కాకుండా దోపిడీ, పీడన, అణచివేత లేని దేశంగా అవుతుంది, త్వరితంగా అభివృద్ధి చెందుతుంది.

**నిజమైన స్వాతంత్ర్యం కోసం కార్యక్రమం:**

- డబ్ల్యుటీఓ ఒప్పందాలను రద్దు చేయాలి. స్వావలంబ వ్యవసాయ, పారిశ్రామిక విధానాలను అభివృద్ధి చేసేందుకై కార్మికవర్గ నాయకత్వంలో నాలుగు పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల, జాతుల ప్రజలను సంఘటితం చేయాలి.
- యావత్తు విదేశీ కంపెనీల/సంస్థల, దళారీ బడా బూర్జువా, భూస్వామ్య పాలకవర్గాల, వారి ప్రభుత్వాల కంపెనీల/సంస్థల పెట్టుబడులను, బ్యాంకులను, ఆస్తులను జప్తు చేసుకోవాలి. బహుళజాతి కంపెనీలను, సంస్థలను తరిమికొట్టాలి. వాటి ఆస్తులను జప్తు చేసుకోవాలి. విదేశీ ఆర్థిక/టెక్నికల్ తదితర కొలాబరేషన్లను, జాయింట్ వెంచర్లను రద్దు చేయాలి. బహుళజాతి సంస్థల ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి. ఎగుమతి-ఆధారిత, దిగుమతి-ఆధారిత విధానాలను రద్దు చేయాలి. విదేశీ మార్కెట్లపై, విదేశీ టెక్నాలజీపై మన దేశ ఉత్పత్తుల పరాధీనతను తొలగించాలి. దేశీ మార్కెట్లను విదేశీ సరుకుల నుంచి పరిరక్షించాలి. విదేశీ మదుపులను ఆకర్షించేందుకు రూపొందించిన టూరిజం విధానం, ఐటీ విధానం, అనిమేషన్ విధానం, ఫార్మా విధానం, స్టార్టప్ విధానం మొదలైన వాటిని రద్దు చేయాలి. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టు వగైరా వంటి, పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానం కింద అమలవుతున్న భారతమాల పథకం, సాగరమాల పథకం, ప్రత్యేక రవాణా కారిడార్ వంటి ప్రతిష్టాత్మక పథకాలను (ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టులను) రద్దు చేయాలి. ఇవన్నీ సామ్రాజ్యవాద ప్రాయోజిత పథకాలే. ఎంఎన్‌సీలు-టీఎన్‌సీలు దేశ సంపదను, వనరులను, సూపర్ లాభాలను తరలించుకుపోవడాన్ని అడ్డుకోవాలి.
- అన్ని రకాల విదేశీ అప్పులను రద్దు చేయాలి.
- రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్, ఫోర్డ్ ఫౌండేషన్, బిల్ గేట్స్ ఫౌండేషన్ వంటి సామ్రాజ్యవాద ప్రాయోజిత వివిధ ఫౌండేషన్లను, సామ్రాజ్యవాద నిధులతో నడిచే వివిధ ఎన్‌జీఓ

సంస్థలను బహిర్గతం చేయాలి. వాటి "అధ్యయనాలు", "కోర్సులు", "అవార్డులు", "సంక్షేమం", "సహాయం", "సామాజ సేవ" తదితర పేర్లతో అవి చేపట్టే కార్యక్రమాలను బహిష్కరించాలి. వాటిని దేశం నుంచి తరిమికొట్టాలి.

- దేశీయ పరిశ్రమల్ని, చిన్న తరహా రంగాన్ని పరిరక్షించాలి.
- సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతిని, విలువలను వ్యతిరేకించాలి. నిజమైన ప్రజాస్వామిక విలువల, సూత్రాల పునాదిపై ఆధారపడి నూతన సంస్కృతి, నూతన విలువలతో కూడిన నూతన ప్రజాస్వామిక సంస్కృతిని నిర్మించాలి. మతం ఖచ్చితంగా వ్యక్తిగత వ్యవహారంగా మాత్రమే ఉండాలి. యావత్తు రూపాలలోని పితృస్వామ్యాన్ని, కులతత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలి. కులం, మతం, ఆర్థిక లేదా విద్యా స్థాయితో సంబంధం లేకుండా యావన్మందికీ న్యాయం, సమానత్వం, పరస్పర గౌరవం పునాదిగా మానవ సంబంధాలను నిర్మించాలి. యావత్తు ఆర్థిక, సామాజిక దోపిడీ రూపాలను వ్యతిరేకించే సూత్రంపై నిలబడాలి.
- దేశవ్యాప్తంగా ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలి. తద్వారా పారిశ్రామికీకరణను ప్రోత్సహించాలి. నిజమైన ఆధునీకరణ వైపు, యావత్తు దేశ అభివృద్ధి వైపు (నేడు చేస్తున్నట్లుగా జేబులు నింపుకోవడం కాకుండా) సాగాలి. స్వావలంబ ఆర్థిక వ్యవస్థను నిర్మించాలి. ధనికులకూ, పేదలకూ మధ్య అసమానతలు రూపుమాపేందుకు ప్రత్యేక పథకాలు రూపొందించాలి.
  - అధిక పన్నులకు, అధిక ధరలకు వ్యతిరేకంగా పోరాడాలి. దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న 80 కోట్ల మంది పేదలపై పన్నులను రద్దు చేయాలి. వారి జీవన ప్రమాణాలు పెంచే విధంగా సంక్షేమ కార్యక్రమాలను రూపొందించి అవినీతికి తావులేకుండా వాటిని అమలు చేయాలి. వారికి ఆహార భద్రత కల్పించాలి. ప్రైవేటురంగానికి అప్పగించిన ఆహార ధాన్యాల సేకరణను ప్రభుత్వమే చేపట్టాలి. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి. కనీస ధరలకే నిత్యావసర వస్తువులను పేద ప్రజలకు తగిన పరిమాణంలో అందించాలి.
  - దేశ ప్రజలకు కూడు, గూడు, గుడ్డ, ఉపాధి, స్వచ్ఛమైన గాలి, నీరు, మౌలిక హక్కులు, పౌరహక్కులు మొదలైనవాటికి హామీ ఉండేలా పోరాటాలు చేపట్టాలి.
  - దేశంలో సోషలిస్టు పరివర్తన తెచ్చేందుకు మొదటి అడుగుగా ఫెడరల్ డెమోక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ ఇండియాను నిర్మించాలి. ఎందుకంటే మన దేశాన్ని సామ్రాజ్యవాద కబందహస్తాల నుంచి సమర్థవంతంగా విముక్తి చేసేది సోషలిజం మాత్రమే.

స్వావలంబన కోసం సాగే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను కాలరాయడంలో శత్రువు నిర్దాక్షిణ్యంగా, క్రూరంగా, హింసాత్మకంగా ఉంటాడు. వారు తమ దోపిడీని కొనసాగించేందుకు ఎంతటి అఘాయిత్యాలకైనా పాల్పడతారు. తమ అన్యాయ వ్యవస్థను పరిరక్షించుకునేందుకై వారు ఎంత వరకు పోతారో, గతంలో ఇండో-చైనా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాలలో జరిగిన అటువంటి పోరాటాలలో చూడవచ్చు. నేడు ప్రజలపై హత్యాకాండలు, వూచకోతలు సాధారణమైపోయాయి. ఈ భయానక మృగాలకు వ్యతిరేకంగా ఎటువంటి సమర్థవంతమైన పోరాటమైనా ఈ వినాశకారుల చేత నష్టపోయిన 90 శాతం ప్రజానీకాన్ని విశాల ప్రాతిపదికన సమీకరించడం, ఐక్యం చేయడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. అనేక రెట్లు అధికంగా దోపిడీ, పీడనలకు గురవుతున్న కార్మికులు, వివిధ రంగాల శ్రామికులు తమ ఆర్థిక, రాజకీయ సమస్యలపై రోజు రోజుకూ మిలిటెంట్ పోరాటాలకు దిగుతున్నారు. అయితే దేశంలో 74 శాతంగా వుండి గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్న రైతాంగపు భాగస్వామ్యం లేకుండా సామ్రాజ్యవాద/దళారీ ముఠాకు వ్యతిరేకంగా ఏ పోరాటమూ విజయవంతం కాదు. గ్రామసీమల్లో నివసిస్తున్న నూటికి 70 మందిగా వున్న వ్యవసాయ కూలీలను, పేద రైతులను కార్మికవర్గ నాయకత్వం కింద సమైక్యం చేయాలి. కొందరు భావిస్తున్నట్లుగా, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం కేవలం పట్టణాలకు పరిమితమైనదనుకోవడం పొరపాటు. ఒక సెక్షన్ రైతాంగం డబ్ల్యుటీఓ విధానాలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో క్రియాశీలంగా పాల్గొంటున్నది.

ఈ పోరాటాలలో పెటీబూర్జువా వర్గం ప్రత్యేకించి విద్యార్థులు, టీచర్లు, మేధావులు ఒక ముఖ్యమైన శక్తిగా ఉంటారు. వారు మిలిటెంట్ స్వభావాన్ని కలిగి ఉండడమే కాకుండా ప్రజా శత్రువులకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని నిర్మించడంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తారు.

జాతీయ బూర్జువా వర్గం - ఇందులో చాలా మంది చిన్నతరహా పరిశ్రమల రంగానికి చెందినవారుగా ఉంటారు. ఈ వర్గం ఒక ఊగిసలాడే మిత్రవర్గంగా ఉంటుంది. ప్రభుత్వ విధానాల నుంచి బహిరంగ ప్రోత్సాహం లభించడం వల్ల ఎంఎన్‌సీ-టీఎన్‌సీల, దళారుల బడా పెట్టుబడి చేత, నోట్‌బందీ, జీఎస్‌టీ వంటి ప్రభుత్వ విధానాల చేత వారు తీవ్రంగా పీడించబడుతూ ఉన్నారు. పోరాటాల మొదటి దశలో వారు బహిరంగంగా ఉద్యమంలో చేరనప్పటికీ, ఒక సెక్షన్ దానికి పలు అత్యంత ఉపయోగకరమైన మార్గాలలో మద్దతునిస్తుంది.

అలాగే కులం, పితృస్వామ్యం, మతతత్వం వంటి వివిధ సామాజిక అణచివేతలతో అదనపు పీడనను ఎదుర్కొంటున్న దళితుల్లో, ఆదివాసుల్లో, మహిళల్లో, మైనారిటీల్లో విశాల సెక్షన్లను ఈ పోరాటాలలో సమీకరించాలి. ఆర్ఎస్ఎస్-బీజేపీకి చెందిన మోదీ ముఠా అధికారం చేపట్టిన తర్వాత బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం రాజ్యం నుంచి ప్రత్యక్ష, పరోక్ష మద్దతుతో కాషాయ బ్రిగేడ్ ద్వారా పెచ్చరిల్లుతున్న హిందుత్వ మతదురహంకారం మైనారిటీలను, ప్రత్యేకించి ముస్లిములను ఈ సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో భాగస్వాములను

చేయడంలో కెటలిస్టుగా తోడ్పడుతుంది. కొన్ని ముస్లిం సంఘాలు టీఎన్‌సీల ఉత్పత్తులను బహిష్కరించాల్సిందిగా పిలుపునిచ్చాయి.

అలాగే పీడిత జాతులతో ప్రత్యేకించి భారత పాలకులకు వ్యతిరేకంగా ఆయుధాలు పట్టుకున్న జాతులతో ఐక్యసంఘటనను ఏర్పరచుకొని ఒక బలమైన ఉద్యమాన్ని నిర్మించడం చాలా ముఖ్యమైన అంశం.

**పెటీబూర్జువా పార్టీలు:** దేశంలోని అనేక ఎమ్.ఎల్. పార్టీలు, చిన్న చిన్న దళిత బహుజన పార్టీలు పార్లమెంటు లోపల, పార్లమెంటు వెలుపల ఉన్నాయి. అవి మౌలికంగా పెటీబూర్జువా స్వభావం గల పార్టీలు. కాబట్టి వాటితో ఐక్యమై దేశంలో గ్లోబలైజేషన్ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్తంగా పోరాడాలి. ఈ శక్తులు ఎంత ఊగిసలాడేవిగా ఉన్నా, ఎంత తక్కువ సమయం కలిసి వచ్చేవి అయినా వాటిని సమస్యల ప్రాతిపదికన పోరాటంలోకి సమీకరించేందుకు కృషి చేయాలి. అవి సామ్రాజ్యవాదం సాగించే విధ్వంసంలో పర్యావరణం, మహిళల పీడన, నిరుద్యోగం, మొదలైనటువంటి ఒకే ఒక అంశాన్ని తీసుకుని ముందుకు రావచ్చు. కానీ అవి నిజంగా ప్రజలను సమీకరించేవిగా ఉండాలి. అవి ట్రేడ్ యూనియన్లు కావచ్చు లేదా తమపై దాడులను ప్రతిఘటించాలని కోరుకునే కార్మికుల, రైతుల గ్రూపులు కావచ్చు.

**వివిధ సంఘాలు, వ్యక్తులు:** దీంతో పాటు సామ్రాజ్యవాద వ్యతిరేక పాత్రను పోషిస్తున్న, ప్రత్యేకించి ఏ గ్రూపు లేదా సంఘంలో భాగంగా లేని వ్యక్తులను తప్పనిసరిగా ఈ పోరాటంలోకి తీసుకొనిరావాలి. దీని ద్వారా గుర్తించబడేలా ప్రోత్సహించాలి. సామ్రాజ్యవాదులు/దళారులు ఎంత వినాశకరంగా మారితే అంతగా అటువంటి మేధావులు సైతం ముందుకు వస్తారు. తాము ఒంటరిగా లేమనీ పెరుగుతున్న ప్రగతిశీల శక్తుల వెల్లువలో భాగంగా ఉన్నామని వారు గుర్తిస్తే మాట్లాడేందుకు వారికి మరింత విశ్వాసం ఏర్పడుతుంది.

పాలకవర్గాల మధ్య వైరుధ్యం నూతన ప్రజాస్వామిక విప్లవంలో ప్రత్యేకించి ఒక ముఖ్యమైన అంశం – సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థలలో సంక్షోభం పెరిగే కొలదీ, దీని ప్రభావం భారతదేశంపై పడుతుంది. పాలకవర్గాల మధ్య వైరుధ్యాలు తీవ్రతరమవుతాయి. ఈ వైరుధ్యాలు ఇప్పటికే తలెత్తడం మొదలైంది. శత్రువును మరింతగా ఒంటరి చేసేందుకు, ఒక బలమైన సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో ప్రజాస్వామిక శక్తులను సంఘటితం చేసేందుకు ఈ వైరుధ్యాలను నైపుణ్యంగా వినియోగించుకోవచ్చు.

'ఆర్థిక సంస్కరణలపై' సారాంశంలో కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో యావత్తు ప్రధాన పార్లమెంటరీ పార్టీల మధ్య ఎటువంటి మౌలిక వ్యత్యాసం లేదు. అవి ప్రతిపక్షంగా ఉన్నప్పుడు చెప్పిన మాటలకు అధికారంలో ఉన్నప్పుడు కట్టుబడవు, సామ్రాజ్యవాదుల డిమాండ్లను నెరవేర్చేందుకు వేగిరపడుతూ అవి పరస్పరం పోటీపడుతుంటాయి. ప్రాంతీయ పార్టీలు రాష్ట్ర స్థాయిలోనే

కాకుండా కేంద్రంలో సైతం సామ్రాజ్యవాద నిర్దేశిత సంస్కరణలను అమలు చేయడంలో విశ్వసనీయమైన ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీ పరిపాలించే రాష్ట్రాలలో అవి అవకాశవాదంతో లొంగిపోతున్నాయి. యావత్తు ఇతర పార్టీల వైఖరి కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఈ దళారీ, రివిజనిస్టు పార్టీలు ఏవైనా ఒక నిర్దిష్ట విధానంపై కొంత వ్యతిరేకత ఉన్నా లేదా చర్య చేపట్టినా, అది ఓట్ల కోసం ఎత్తుగడగా అయినా లేదా ఒక వ్యాపార లాబీకి వ్యతిరేకంగా మరొకదానికి మద్దతు ఇచ్చేదిగా అయినా ఉంటుంది. అందువల్ల, ఈ పాలకవర్గ పార్టీలలో ఏదైనా గానీ వివిధ సందర్భాలలో చేపట్టే నిర్దిష్ట వైఖరులు ప్రజలలో ఉన్న అసంతృప్తిని ఉపయోగించడానికి, వారిని పక్కదారి పట్టించడానికి ఉద్దేశించినవే.

వారి మధ్య వైరుధ్యాలను మనం ఉద్యమ ప్రయోజనం కోసం ఉపయోగించుకోవచ్చు కానీ వారిని సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులుగా అర్థం చేసుకోకూడదు. వారి మధ్య వైరుధ్యాలను ఎంత వరకూ ఉపయోగించుకోగలుగుతామనేది పోరాటంలో కార్మికవర్గ శక్తుల బలంపై ఆధారపడి ఉంటుందనేది తెలిసిందే. ఇక్కడ ముఖ్యమైన కర్తవ్యం ఏమిటంటే ఈ పార్టీలను పూర్తిగా బహిర్గతం చేయడం, స్థిరమైన సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వ్యతిరేక కార్యక్రమంపై ఆధారపడి ఆ పార్టీల కేడర్లను మనవైపు తిప్పుకోవడం. మనం ప్రత్యేకించి బహిర్గతం చేయాల్సిందేమిటంటే, ఈ పార్టీలన్నీ దేశద్రోహ పార్టీలే; ఇవి విదేశీ శక్తుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయి; ఈ పార్టీలే విదేశీ శక్తులతో మిలాఖత్ అవుతున్నాయి. ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే, సుడిగాలి లాగా లేచి ఈ పార్టీలను తన్నితరుముతారు, ప్రజలలో ఈ స్పృహను పెద్దెత్తున పెంపొందించడం ద్వారా ఆ పోరాట వెల్లువను భారతదేశంలో నూతన సామ్రాజ్యవాద దాడికి వ్యతిరేకంగా మనం మళ్లించగలుగుతాం.

వర్గ విశ్లేషణ, సామాజిక పరిశీలన ఎంత వస్తుగతమైనదిగా కనిపించినప్పటికీ, అవి గనుక మన దైనందిన కార్యకలాపాలతో ఎలాంటి సంబంధాన్ని కలిగి వుండనట్లయితే, భారత జనాభాలో అత్యధిక మెజారిటీగా వున్న, కార్మికవర్గానికి దృఢమైన, అత్యంత నమ్మకమైన మిత్రునిగా వుండే, విప్లవంలో ప్రధాన శక్తి అయిన రైతాంగం (ప్రత్యేకించి, పేద, భూమిలేని రైతాంగం) చురుకైన మద్దతు, దృఢమైన భాగస్వామ్య పాత్ర లేనిదే నిజమైన అర్థంలో విప్లవయుద్ధం, నిజమైన అర్థంలో విప్లవానికి ఆయుధాలుగా విప్లవ పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటన – వీటిలో ఏదీ కూడా నిర్మితం కాజాలదు. కార్మికవర్గం, రైతాంగం, యువజనులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు మొదలైన ప్రజారాశులను అసంఖ్యాకమైన పోరాటాలలోకి సమీకరించకుండా, ఆ పోరాటాల క్రమంలో వారి రాజకీయ చైతన్యాన్ని పెంపొందింపజేయకుండా వారు దోపిడీ వర్గాల రాజ్యాధికారాన్ని కూలదోయవలసిన అవసరాన్ని గుర్తించజాలరు. పీడక రాజ్య యంత్రాంగాన్ని కూలదోయడానికి అవసరమైన చైతన్యాన్ని, సమిష్టి సంకల్పాన్ని వారు సమకూర్చుకోజాలరు.

రివిజనిస్టులు నాయకత్వం వహించే ప్రజా ఉద్యమాలతోనూ, ప్రజాసంఘాలతోనూ స్పష్టమైన విభజన రేఖను గీసుకోవడం అత్యంత ఆవశ్యకం. దేశంలోని విభిన్న ప్రాంతాలలో భిన్న పరిస్థితులను బట్టి నిర్మాణ, పోరాట రూపాలు మారుతుంటాయి. ప్రజా పోరాటాలు సాయుధ పోరాటానికి, ప్రజాయుద్ధానికి దోహదపడతాయి. అలాగే ప్రజా వుద్యమం మరింతగా పురోగమించడానికి సాయుధ పోరాటం, ప్రజాయుద్ధం దోహదపడతాయి. ఇదీ ప్రజా పోరాటానికీ, సాయుధ పోరాటానికి మధ్య వున్న గతితార్కికమైన పరస్పర సంబంధం. సాయుధ పోరాటాన్ని ఇతర పోరాట రూపాలతో సమన్వయించకపోయినట్లయితే విప్లవం విజయాన్ని సాధించలేదు. అందుచేత సాయుధ పోరాటం, ఇతర రూపాలలోని పోరాటాలు రెండూ కూడా తప్పనిసరి.

కార్మిక పోరాటాలు, మురికివాడలు, తదితర బస్తీలలో జరిగే పోరాటాలు, యువజన పోరాటాలు, నిరుద్యోగుల పోరాటాలు, విద్యార్థి పోరాటాలు, మహిళా పోరాటాలు విశాల ప్రజారాశులను రాజకీయంగా సమీకరించడానికి దోహదపడతాయి. పాలకవర్గాల వివిధ విధానాలకు వ్యతిరేకంగా రాజకీయంగా ప్రజారాశులను సమీకరించడం అనే ముఖ్యమైన అంశాన్ని విస్మరించరాదు.

మన పార్టీ సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గ వ్యతిరేక పోరాటాలలో వివిధ పీడిత వర్గాలను, సెక్షన్లను, పీడిత జాతులను సంఘటితం చేస్తూ, అలాగే దేశాన్ని పీడిస్తున్న ముఖ్యమైన సమస్యలపై ఈ కింది కార్యక్రమాన్ని చేపట్టాలి:

**కార్మికవర్గం:**

సామ్రాజ్యవాద నయా ఉదారవాద విధానాలు కార్మికవర్గ సంఘటిత పోరాటాలను బలహీనపరిచాయి. వివిధ బహుళజాతి కంపెనీల, వాటి అనుబంధ, దళారీ కంపెనీల ఔట్‌సోర్సింగ్, దోపిడీ, పీడనలు తీవ్రతరం అయ్యాయి. స్టార్టప్ కంపెనీలలో ఉద్యోగాలకు, ఆదాయానికీ గ్యారంటీ లేదు. అవి తీవ్ర అభద్రతకు నెలవుగా ఉన్నాయి. కార్మికుల్లో అసంతృప్తి తీవ్రస్థాయికి చేరుకుంటోంది. అయితే రివిజనిస్టు సీపీఐ, సీపీఎం, ఇతర రకాల రివిజనిస్టులు–ఆర్థికవాదులు చట్టబద్ధత అనే చట్రంలో వీరిని బంధించి ఉంచుతున్నారు. ప్రతీ చోటా ఈ సంఘాల నాయకులు కార్మిక ప్రభువులుగా తయారయ్యారు. వీరు కార్మికవర్గం నుంచి ద్రవ్య పెట్టుబడికి సేవ చేసే కాపలాదార్లు. వీరితో పాటు అభివృద్ధి నిరోధకులు తమ బ్రాహ్మణవాద భావజాలంతో మునిగితేలే ఒక ముఠాను కార్మికవర్గంలో సృష్టించారు. వీరు నేడు కార్మికవర్గంలో ఫాసిస్టులకు పునాదిగా ఉన్నారు. నూతన టెక్నాలజీ కంపెనీల పరిమాణాన్ని తగ్గించివేసింది. కార్మికశక్తి చాలా వరకూ అసంఘటితంగా ఉంది. మనం పాత పద్ధతులను సమూలంగా మార్చుకొని మొదటి నుంచే రాజకీయంగా కార్మికవర్గాన్ని సంఘటితం చేసేందుకు చొరవ చేయాలి.

- ఆర్థిక, ఉపాధి, పర్యావరణ/జీవావరణ, ఇంధన, బలవంతపు శరణార్థ, సామాజిక-సాంస్కృతిక, రాజకీయ-సైనిక సంక్షోభాలకు పరిష్కారంలేని శాశ్వత సంక్షోభగ్రస్త సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థను భూమండలంపై కూలదోసి దాని స్థానంలో సోషలిజాన్ని-కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో మార్క్సిజం-లెనినిజం- మావోయిజం వెలుగులో ప్రపంచంలోని యావత్తు దేశాలలో వివిధ కార్మికవర్గ పార్టీలు, సంస్థలు, గ్రూపులతో సమైక్యం కావడానికి కార్మికవర్గం కృషి చేయాలి. ప్రపంచీకరణలో భాగంగా సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు వివిధ దేశాల్లోని ఉత్పత్తి యూనిట్లను ఒకే దోపిడీ గొలుసులో భాగం చేసి, కోట్లాది మంది వెనుకబడిన దేశాల పీడిత ప్రజల జీవితాలనే కాక పెట్టుబడిదారీ దేశాల పీడిత ప్రజల జీవితాలను ధ్వంసం చేస్తున్న, కార్మికులను విభజించి-దోచుకునే విధానాలకు, ప్రతీఘాతుకత్వానికీ వ్యతిరేకంగా కార్మికవర్గం అంతర్జాతీయంగా సమైక్యంగా పోరాటాలను చేపట్టాలి. ప్రపంచవ్యాప్తంగా వస్తుగత పరిస్థితిలో బ్రహ్మాండమైన శక్తి ఉన్నది. నేటి పరిస్థితులకు అనుగుణంగా దీన్ని సంపూర్ణంగా వెలికితీయడం ద్వారా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని పురోగమింపజేయాలి. ఈ కర్తవ్యం విడి విడి పార్టీల స్వీయాత్మక సామర్థ్యాల తలకు మించినది. అందువల్ల కార్మికవర్గ అంతర్జాతీయ దృక్పథంతో ఐక్యకృషిని చేపట్టడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గ పార్టీలు సంఘటితపడడానికి తోడ్పడాలి, తద్వారా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని పురోగమింపజేయాలి. ప్రపంచ ప్రజల్లో ఒక విశాలమైన సెక్షన్‌ను కమ్యూనిస్టు ఆశయం వైపు గెలుచుకోవాలి.
- కార్మికుల జీవన్మరణ సమస్యగా మారిన సామ్రాజ్యవాద సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలకు, వ్యవస్థీకృత సర్దుబాటు కార్యక్రమాలకు వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని జాగృతం చేసి సంఘటితం చేయాలి. సామ్రాజ్యవాద పరోక్ష పాలన, నయా వలస తరహా దోపిడీ, అజమాయిషీని తుదముట్టించే లక్ష్యంతో కార్మికోద్యమాలను నిర్మించాలి. మూడు మహా పర్వతాలకు వ్యతిరేకంగా వివిధ డిమాండ్లపై పీడిత వర్గాలను, సెక్షన్లను, పీడిత జాతులను సమైక్యం చేసి ప్రజా ఉద్యమాలను నిర్మించి వాటికి కార్మికవర్గం నాయకత్వం వహించాలి.
- సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు, వివిధ ప్రభుత్వాలు, ప్రత్యేకించి కేంద్రంలో అధికారంలో ఉన్న బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ముఠా అమలు చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మికులను సంఘటితం చేసి పోరాడాలి. దేశవ్యాప్తంగా పలు ట్రేడ్ యూనియన్లలో ఉన్న కార్మికులను ఐక్యవేదికల కిందకు తీసుకొచ్చి సంఘటిత, సమైక్య పోరాటాలను అభివృద్ధి చేయాలి:
  - ప్రముఖ రంగాలుగా ఉన్న కన్‌స్ట్రక్షన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గనులు, సాఫ్ట్‌వేర్,

సామ్రాజ్యవాదుల మాన్యుఫాక్చరింగ్ సరుకుల విడిభాగాల అసెంబ్లింగ్, సర్వీసు రంగాలలోని బహుళజాతి/అనుబంధ/దళారీ కంపెనీల, స్టార్టప్ యూనికార్న్ కంపెనీల, ప్రభుత్వ, పీపీపీ కంపెనీల దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా కార్మికులను, ఉద్యోగులను సంఘటితం చేయాలి. ఉపాధిలో భారీ కోత (రిట్రెంచ్‌మెంట్)కు, కంపెనీల లేఆఫ్/లాకౌట్‌లకు, ఉపాధిలో కులవివక్షకు, ఉత్పత్తిని/సర్వీసులను తక్కువ వేతనాలతో ఔట్‌సోర్సింగ్ చేయించడానికి వ్యతిరేకంగా పోరాడాలి. ఉపాధి గ్యారంటీ కోసం పోరాడాలి.

- పని గంటల పెంపు, పరిశ్రమలలో అర్ధ-కార్మికుల తీవ్ర దోపిడీ, వెట్టిచాకిరిపై పోరాడాలి. కాలుష్యాన్ని నివారించే, భద్రతతో కూడిన మెరుగైన పని పరిస్థితుల కోసం పోరాడాలి.
- తక్కువ వేతనాలు, నిజవేతనాలు తగ్గిపోవడం, వేతనాలలో స్త్రీ-పురుష వివక్ష, వేతనాల స్తంభనకు వ్యతిరేకంగా పోరాడాలి.
- మధ్యయుగాలను తలపించే అనిశ్చిత పరిస్థితులలో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న వలస శ్రామికుల (అర్ధ-కార్మికుల) సమస్యల పరిష్కారానికై పోరాడాలి. యజమానుల కుల పీడన, మహిళలపై పితృస్వామ్య పీడనలకు వ్యతిరేకంగా పోరాడాలి. ఉపాధి, వేతనం, సంక్షేమం తదితర కనీస హక్కులకు గ్యారంటీ ఉండాలి.
- దేశం నుంచి మేధో శ్రమ, నైపుణ్యంలేని శ్రమ, అర్ధ నైపుణ్యపు శ్రమ వలసను నిరుత్సాహపరచాలి. దేశంలో సరైన ఉపాధి సాధన కోసం, నాలుగు పీడిత వర్గాలలో భాగంగా దేశ ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాల పరిపూర్తికి, దేశాభివృద్ధికి పాటుపడే విప్లవ ప్రజాస్వామిక రాజకీయ సందేశాన్ని మైగ్రెంట్ ఉద్యోగుల్లోకి, కార్మికుల/శ్రామికుల్లోకి పెద్దెత్తున తీసుకుపోవాలి.
- బాలకార్మిక వ్యవస్థ, వారిని అమానవీయంగా దోపిడీ, పీడనలకు గురి చేయడాన్ని నిరసించాలి.
- సంఘటిత రంగాన్ని నిర్మూలించి, ఏమాత్రం భద్రతలేని అసంఘటిత రంగాన్ని పెంచుతున్న ప్రభుత్వరంగ కంపెనీల ప్రైవేటీకరణను, ఆ కంపెనీలలో పెట్టుబడి ఉపసంహరణ, డీ-ఇండస్ట్రియలైజేషన్, డీ-రెగులేషన్ వంటి విధానాలను, పారిశ్రామిక/వ్యవసాయ/సర్వీసు రంగాలను పూర్తిగా అసంఘటిత రంగంగా మార్చివేస్తూ భారీయెత్తున కాజువల్/పార్ట్‌టైం (దినసరి కూలీ పద్ధతి) లేబర్‌ని వినియోగించే విధానాలను ఉపసంహరించాలి.
- సంఘటిత, అసంఘటిత కార్మికుల/శ్రామికుల సమస్యలపై పోరాటాలు చేపట్టాలి.

- విద్య, వైద్యం వంటి కనీస ప్రభుత్వ సామాజిక సంక్షేమ పథకాలలో పెద్దెత్తున కోతలు ఆపాలి. కార్మిక సంక్షేమ పథకాలకు తగినన్ని నిధులు మంజూరు చేయాలి.
- పారిశుధ్య కార్మికులపై, తదితరులపై అమానవీయ దోపిడీ రూపాలకు, పద్ధతులకు వ్యతిరేకంగా పోరాడాలి.
- యూనియన్ పెట్టుకునే హక్కు వంటి అతి ప్రాథమిక హక్కుతో సహా పోరాడి సాధించుకున్న 47 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిని సామ్రాజ్యవాదులకు, దళారులకు అనుకూలంగా 4 కార్మిక చట్టాలుగా సవరించడం, కార్మిక సంఘాల అణచివేత, కార్మిక సంఘాల కార్యకర్తలపై కోర్టుల ఫాసిస్టు తీర్పులు వంటి విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి.

- దేశంలో నిరుద్యోగ, చిరుద్యోగ-అసంఘటిత రిజర్వు సైన్య పెరుగుదలకు దారితీస్తున్న ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాదులకు సూపర్ లాభాలు చేకూర్చే రోబోటిక్స్, త్రీ-డీ ప్రింటింగ్, ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ వంటి "నిరుద్యోగాన్ని సృష్టించే టెక్నాలజీలను" ప్రవేశపెట్టడానికి వ్యతిరేకంగా పోరాడాలి. పెను సమస్యగా వున్న నిరుద్యోగ పరిష్కారానికి నిరుద్యోగ విద్యావంతులైన, విద్యలేని యువతను, చిరుద్యోగులను సంఘటితం చేసి పోరాడాలి. పెద్దెత్తున ఉపాధిని కల్పించే ఎంఎస్ఎంఈ పరిశ్రమల పరిరక్షణ కోసం పోరాడాలి.

**రైతాంగం:**

మన ఉద్యమ ప్రాంతాల్లో రైతులను ప్రత్యేకించి ఆదివాసీ రైతులను ఒక మేరకు సంఘటితం చేసి పోరాటాలు నిర్మిస్తున్నాం. అయితే ఇతర ప్రాంతాలలో జరుగుతున్న రైతాంగ పోరాటాలలో మన ఉనికి చాలా తక్కువగా ఉంది. దీనికి కారణం నిరంతరం కొనసాగుతున్న రైతాంగ పోరాటాలు సంస్కరణవాద, పార్లమెంటరీవాద వ్యక్తుల చేతుల్లో బందీగా ఉండడం. వాటితో ప్రయోజనం సాధించలేకపోవడం వల్ల రైతులు నిరాశా-నిస్పృహలకు గురై ఆత్మహత్య చేసుకుంటున్నారు. మనం దేశవ్యాప్తంగా జరుగుతున్న పోరాటాలలో భాగం కావాలి. మన సంఘాన్ని కూడా నిర్మాణం చేసేందుకు చొరవ చేయాలి. ప్రస్తుతం ఉన్న సంఘాలలోని ప్రజాస్వామ్య శక్తులను విప్లవ పక్షంలోకి తీసుకొని రావాలి. కొంతమంది విప్లవానికి మిత్రులుగా ఉంటారు. కొంతమంది కొంత దూరం వరకూ కలిసి నడుస్తారు. అటువంటి యావత్తు శక్తులను వ్యవసాయ విప్లవ ఎజెండాలో భాగంగా సమీకరించేందుకు చొరవ చేయాలి.

దేశ సామాజిక, ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకుని, గ్రామీణ ప్రాంతాలలో ప్రధాన నినాదాలపై (దున్నేవారికే భూమి చెందాలి, విప్లవ రైతాంగ కమిటీలు/ రైతుకూలీ సంఘాలు, విప్లవ ప్రజా కమిటీలకే సర్వాధికారాలు, సామ్రాజ్యవాద బహుళజాతి

సంస్థల, పెట్టుబడిదారీ భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల వ్యవసాయ క్షేత్రాలను, ప్లాంటేషన్స్‌ను ప్రజాపరం చేయండి, జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్ కోసం పోరాడండి) కేంద్రీకరిస్తూనే సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలు, రాజ్యం సాగించే అన్ని రకాల దోపిడీ పీడన అణచివేతలకు వ్యతిరేకంగా తగిన పోరాట, నిర్మాణ రూపాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు ఇప్పటికే ఆచరణ క్రమంలో సంపాదించిన సకారాత్మక అనుభవాలను వినియోగించుకుని నేటి మన ఉద్యమ ప్రాంతాలలోనే కాకుండా దేశవ్యాప్తంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం, విస్తృతం చేసేందుకు కృషి చేయాలి.

- భూమి పోరాటాన్ని కేంద్రంగా చేసుకొని రైతుల తక్షణ డిమాండ్లపై సమీకరించాలి. వారు కొనసాగించే ఆందోళనలలో భాగం కావాలి, వారి పోరాటాలకు నాయకత్వం వహించాలి. రైతుల ఆందోళనలకు మద్దత్తుగా యావత్తు ప్రజాస్వామిక, ప్రజాపక్షం వహించే శక్తులను సమీకరించాలి, వారితో కలిసి ఐక్య పోరాటాలు నిర్మించాలి, వాటిని తీవ్రతరం చేయాలి.
- వ్యవసాయ మార్కెట్లలో ముందస్తు మార్కెట్ల (ఫార్వార్డ్ లేదా ఫ్యూచర్ ట్రేడింగ్) ప్రాబల్యం, దళారీల దోపిడీని నిర్మూలించాలి. ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనం కంటే పేద, మధ్యతరగతి రైతుల కుటుంబాల సగటు నెలసరి ఆదాయం తక్కువ వుండటానికి, రైతు చేతికి పంట వచ్చినప్పుడు రేటు తక్కువగా, వ్యాపారుల చేతిలోకి పంట పోయినప్పుడు రేటు అనేక రెట్లు అధికంగా ఉండటానికి కారణమైన కేంద్ర, రాష్ట్ర దళారీ పాలకుల దివాలాకోరు విధానాలను, జాతీయ రైతు కమీషన్ ప్రతిపాదించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కంటే చాలా తక్కువ వుంటున్న ప్రభుత్వ ఎంఎస్‌పీ విధానాన్ని, 'రైతాంగం ఆదాయాన్ని రెట్టింపు చేసే పథకం' వంటి బూటకపు పథకాలను ఎండగట్టాలి. రైతుల పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) సీ2 (భూమి కౌలు రేటు, వ్యవసాయ పెట్టుబడి, వడ్డీ)+75 శాతం ఉండాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా రైతాంగం విశాల ప్రాతిపదికన ఐక్యంగా మిలిటెంట్ పోరాటాలకు దిగాలి.
- సామ్రాజ్యవాద, దళారీ కంపెనీల ప్రయోజనాలు నెరవేర్చే, వ్యాపార పంటలను ప్రోత్సహించి, ఆహార పంటలను నాశనం చేసే 'హరిత విప్లవ' నమూనా, కాంట్రాక్టు/ కార్పొరేట్/గ్రూపు వ్యవసాయం, సారవంతమైన వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు బలవంతంగా జప్తు చేసుకొని రైతులను బికారులను చేయడం వంటి దళారీ పాలకుల విధానాలకు వ్యతిరేకంగా రాజకీయంగా రైతాంగాన్ని సమీకరించాలి. స్వావలంబ పద్ధతులను పునాదిగా చేసుకుని వ్యవసాయాభివృద్ధికై సహకార ఉద్యమాన్ని నిర్మించి బలోపేతం చేయాలి. వెనుకబడిన, అభివృద్ధినిరోధక, సామ్రాజ్యవాదంతో షరీకైన అర్ధవలస, అర్ధభూస్వామ్య సంబంధాలను ధ్వంసం చేసి దేశ సామాజిక వ్యవస్థను

ప్రజాస్వామీకరించాలి. ప్రజల ప్రజాస్వామిక అధికారాన్ని స్థాపించాలి.

- రైతాంగాన్ని ఒక సంఘటిత విప్లవ శక్తిగా మార్చడం కోసం విస్తృతంగా, వివిధ రూపాల్లో, ప్రజా కృషి, ప్రజా సంబంధాలు, రాజకీయ ప్రచార-ప్రసార కార్యక్రమాలు, జన చైతన్యయాత్రలు నిర్వహించాలి.
- రైతులలో, రైతాంగ కార్యకర్తలలో 'వ్యవసాయ సమస్య, దాని తక్షణ, దీర్ఘకాలిక పరిష్కారం' అనే విషయంపై రెగ్యులర్‌గా ప్రాక్టికల్ క్లాసులు, వ్యాఖ్యానాలు, చర్చా గోష్టులు నిర్వహించాలి.
- ఆత్మహత్య చేసుకోవడం సమస్యకు పరిష్కారం కాదు, విప్లవ భావాలతో సంఘటితమై దృఢమైన మానవులుగా తయారు కావడం, శ్రమజీవుల రాజ్యం కోసం పోరాడడమే సరైన పరిష్కారం అనే అవగాహనను పెంపొందించాలి.
- రైతుల స్థితిగతులు, ప్రాంతం, పరిస్థితికి అనుగుణంగా వివిధ బహిరంగ సంఘాలు, వేదికలు, కమిటీలు, ఐక్యసంఘటనలు, సహకార సంఘాలు, నిర్వహణా కమిటీలు, శిక్షణ-మద్దతు అందించే కమిటీలు, సహకార ఆర్థిక సంఘాలు, భూమి దున్నేవారి సహకార సంఘాలు, సాంస్కృతిక సంఘాలు, పీడిత రైతుల సంఘాలు, ప్రాజెక్టు పీడిత సంఘాలు, మృతుల కుటుంబ సంక్షేమ నిధి సంఘం, మనోస్థైర్యాన్ని అందించే సంఘాలు, వైద్య సహాయ సంఘాలు, కౌలుదార్ల సంఘాలు, పంటలు నష్టపోయిన రైతుల సంఘాలు, విత్తనాల-ఎరువుల సహకార సమితులు, సేంద్రీయ పురుగు మందుల తయారీ సంఘాలు, సహకార వ్యవసాయ సాధనాల సంఘాలు, అవసరాన్ని బట్టి అటువంటి వివిధ సంఘాలను నిర్మించాలి. ఈ యావత్తు సంఘాల దృక్పథం రైతాంగాన్ని వ్యవసాయ విప్లవం వైపు పురోగమింపజేయడంగానే ఉండాలి. వీటిని పరిస్థితికీ, రైతుల సంసిద్ధతకూ అనుగుణంగా దీనికి అనేక కర్తవ్యాలను జోడించి ఒక సంఘాన్ని నిర్మించవచ్చు లేదా ఒక సంఘంలో వివిధ కర్తవ్యాల కోసం వేరు వేరు కమిటీలను నిర్మాణం చేయవచ్చు.
- రైతులు తక్షణం ఏదోక పోరాట రూపంలో, నిర్మాణ రూపంలో ఉన్నప్పటికీ, భవిష్యత్తులో విప్లవ రైతు సంఘాలు, మిలీషియా నిర్మాణం చేయకుండా రైతులను విముక్తి వైపుగా పురోగమించలేమనే అవగాహనను అభివృద్ధి చేయాలి, అటువంటి నిర్మాణాన్ని ఏర్పరిచేందుకు చొరవ చేయాలి. షావుకార్ల, బ్యాంకుల రుణాల వసూలు కోసం వచ్చే దళారీలకు వ్యతిరేకంగా, గ్రామం నుంచి అవసరమైన సామాన్లు రైతులకు ఇవ్వడానికి అంగీకరించని దుష్టశక్తులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు నిర్దిష్ట కార్యక్రమం కూడా వారికి ఇవ్వాలి. అందువల్ల పై రైతు సంఘాలతో పాటు బలవంతపు ఋణ వసూళ్ళను ప్రతిఘటించేందుకూ, షావుకార్లను నియంత్రించేందుకూ, విపత్తుల

నివారణకూ, ఆందోళనకు గురయ్యే రైతాంగానికి కౌన్సిలింగ్ ఇచ్చేందుకూ, విచ్ఛిన్నకర భావాలను వ్యతిరేకించేందుకూ, రాజ్యహింసను వ్యతిరేకించేందుకు రైతు యువకులతో ఆత్మ రక్షణా దళాలు ఏర్పాటు చేయాలి.

- వ్యవసాయ కూలీ, పేదరైతు వర్గాలతో పాటు ఇతర శ్రమజీవి ప్రజల, మధ్యతరగతి రైతుల సంపూర్ణ రుణమాఫీ (బ్యాంకుల, షావుకార్ల), కౌలుదారు చట్టాల అమలు, విత్తనాలు–ఎరువులు, పురుగు మందులపై సబ్సిడీ, వ్యవసాయ మార్కెట్లలో పేద, మధ్యతరగతి రైతుల నిర్వహణ కమిటీ, ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ల సంఖ్యను 7వేల నుంచి 22వేలకు పెంచుతామనే వాగ్దానాన్ని అమలు చేయాలనీ, ఎటువంటి ఆటంకం లేకుండా లేదా రిజిస్ట్రేషన్ లేకుండా సరుకును కొనుగోలు చేసేందుకు గ్యారంటీ, 24 గంటలు ఉచిత కరెంటు, వాస్తవిక సేంద్రీయ వ్యవసాయం, టర్మినేటర్, జన్యుమార్పిడి (జీఎం) రకాల విత్తనాలపై నిషేధం, నీటిపారుదలకు డ్రిప్ టెక్నిక్‌ను వినియోగించుకునేందుకు అవసరమైన సామగ్రిని రైతులందరికీ ఉచితంగా పంపిణీ చేయడం, నీటిపారుదల కల్పించడం, నీటిపారుదల వ్యవస్థను, నీటిపారుదల ప్రాజెక్టు పథకాలను కిసాన్ కమిటీలకు అప్పగించడం, నీటిపారుదల కుంభకోణాలలో భాగమైన మంత్రులు, అధికారులు, కాంట్రాక్టర్లపై చర్య, ప్రభుత్వ శీతలీకరణ భవనాల నిర్మాణం, ప్రభుత్వ పాల నిల్వ వ్యవస్థ, యావత్తు పేద రైతులకు తక్కువ ధరలకు ఆహార ధాన్యాలు, నిత్యావసర వస్తువులు అందించడం, పేద రైతుల పిల్లలకు ఉచిత విద్య మొదలైన డిమాండ్లపై పోరాటాలను నిర్మించాలి. ఇందులో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, నీటిపారుదల సాధనాల సమస్య, పంటల బీమా, సామాజిక భద్రత, పేదరైతులకు వడ్డీలేని రుణాలు, ఆహార భద్రత, ఉపాధి, సహకార సొసైటీలు, వ్యవసాయం కోసం మౌలిక సదుపాయాలు, మార్కెట్ మొదలైన అనేక సమస్యలు ఉన్నాయి. ఇందులో రైతుల బతుకులు చిక్కుకొని ఉన్నాయి. ప్రత్యేకించి ఉపాధి గార్యంటీ పథకానికి అధిక ప్రాధాన్యతనిచ్చి గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి లేనివారికి తక్షణం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కూలీలను, పేద రైతులను కదిలించి మిలిటెంట్ ఆందోళలను నిర్మించాలి. కాలంచెల్లిన అర్ధభూస్వామ్య వ్యవస్థ కారణంగా తీవ్రమైన వ్యవసాయ సంక్షోభంలో రైతులకు చెందిన ఈ యావత్తు సమస్యలను లేవనెత్తుతూ, వారిని వ్యవసాయ విప్లవ కార్యక్రమం 'దున్నేవారికే భూమి, క్రాంతికారీ కిసాన్ కమిటీ చేతుల్లో యావత్తు అధికారం' అనే నినాదంతో వారిని తక్షణ డిమాండ్లపై కదిలించాలి. పోరాటంలో రైతులను క్రియాశీల భాగస్వాములను చేయాలి.
- సంస్కరణవాదుల, రివిజనిస్టుల, పోస్ట్‌మాడర్నిస్టుల, గాంధీవాదుల నుంచి రైతులను కాపాడాలి. వీరితో సమస్యల ప్రాతిపదికన సంయుక్తంగా పోరాటాలలో భాగస్వాములం

కావాలి. తక్షణ డిమాండ్లపై మద్దతు నివ్వాలి. ఇందులో కొన్ని శక్తులను సరైన మార్గంలోకి తీసుకొచ్చి మిగతా వారితో ఐక్యత–పోరాటం సాగించాలి. వ్యతిరేక పక్షంలో ఉండేవాళ్లు అధికారంలోకి రాగానే మారిపోతున్నారు. మధ్యేమార్గ నాయకత్వం కేవలం విశ్లేషణలు, ఉపన్యాసాలలోనే గంభీరంగా ఉంటారు. కానీ రైతుల విముక్తి గురించి ఆలోచించరు. వారికి ఒక దిశ గానీ, రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడే ధైర్యం గానీ ఉండదు. వారు అవకాశం చూసుకొని అప్పుడప్పుడు విప్లవ పలుకులు పలుకుతారు, కానీ విప్లవ మార్గంలో సాగడానికి జంకుతారు. వారు రైతుల ఆగ్రహాన్ని చూసి ఉత్సాహపడి మావోయిస్టులుగా తయారు కావాలని అంటారు, కానీ రాజ్యానికి వ్యతిరేకంగా ఆయుధాలు పట్టేందుకు భయపడతారు. రైతుల దుస్థితి, ఆత్మహత్యలకు వెనుక దాగి ఉన్న రాజ్య విధానాలను చూడకుండా, భౌతిక కారణాల పరిష్కారం కోసం పోరాటం చేయకుండా మానసిక కారణాలలో పరిష్కారాన్ని వెతుకుతారు. తప్పుడు దృష్టి లేకుండా, నిరాడంబరంగా ఉండే అనేక మంది రైతు నాయకులు, కార్యకర్తలు, వ్యాఖ్యాతలు, కోఆర్డినేటర్లు, కన్వీనర్లు దేశవ్యాప్తంగా ఉన్నారు. తెలిసో–తెలియకో వారు ఈ వ్యవస్థకు సేఫ్టీ వాల్వులుగా పనిచేస్తున్నారు. కొంత మంది ఎంపీలుగా, ఎంఎల్ఏలుగా, మంత్రులుగా తయారై, కొందరు కమిటీల అధ్యక్షులుగా, సంస్థల అధిపతులుగా, శాస్త్రజ్ఞులుగా హోదాను సంపాదించుకొని సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు సమస్యలను అద్భుతంగా బహిర్గతం చేస్తున్నామనే ఆత్మసంతృప్తితో ఉంటున్నారు. వీరు రైతుల విముక్తి కోసం ఎలాంటి మార్గం చూపలేరు. వీరిలో కొందరు రైతు నాయకులుగా కూడా పాతుకుపోయి ఉన్నారు. అయితే సరైన దిశానిర్దేశం లేకుండా ఈ రైతులు నిరంతరం సాగిస్తున్న పోరాటాలు వ్యవస్థ మార్పుకు దోహదపడవు. అటువంటి సంస్కరణవాదులు, రివిజనిస్టులు, పోస్టుమాడర్నిస్టులు, గాంధేయవాదులతో పోరాటం, ఐక్యతా కొనసాగిస్తూ ఇందులో అత్యధిక శక్తిని ఏదో ఒక రూపంలో విప్లవ పక్షం వైపు తీసుకొచ్చేందుకు కృషి చేయాలి. మిగతా వారిని కూడా విశాల పోరాటాలలో నిరంతరం సమీకరిస్తూ ఉండాలి.

- పార్లమెంటరీ చట్రంలో రైతు సమస్యకు పరిష్కారాన్ని వెతికే కొంత మంది రైతు నాయకులతో పోరాటం–ఐక్యతపై ఆధారపడి మనం వ్యవహరించాలి. కొంతమంది రైతు నాయకులుగా తయారై ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేస్తారు. వారిని తీవ్రంగా వ్యతిరేకించాలి. రైతుల తక్షణ డిమాండ్ల కోసం రైతులను సమీకరించడం, పోరాటం సాగించడంలో మనం ఐక్యం కావాలి. రాజకీయ పార్టీలకు తోకగా మారిన వారిని, ఆందోళనను మోసపూరితంగా పరిమితులకు గురిచేసే వారిని మనం విమర్శించాలి.
- వ్యవసాయంతో పాటు పర్యావరణం, అడవులు, జల వనరుల రక్షణ, పశు పోషణ,

కోళ్ల పెంపకం, మత్స్య పరిశ్రమ, ఉద్యాన పంటలు, పండ్ల తోటలు, కూరగాయలు, నర్సరీ, ఔషధ, సుగంధ మొక్కల పెంపకం మొదలైన రంగాల సమస్యలను తీసుకొని రైతాంగ పోరాటాలు నిర్మించాలి.

- బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు మోదీ ముఠా అధికారంలోకి వచ్చిన తర్వాత పశువుల వ్యాపారంపై నిషేధం విధించడంతో రైతాంగం వ్యవసాయయోగ్యం కాని పశువులను అమ్ముకునే, అవసరమైన పశువులను కొనుగోలు చేసే హక్కును కోల్పోయారు. దీనికి వ్యతిరేకంగా రైతాంగాన్ని సమీకరించాలి. పశువులను అమ్ముకునే-కొనుగోలు చేసే హక్కుకై ఉద్యమించాలి.
- క్రాంతికారీ కిసాన్ సంఘటన్ నాయకత్వంలో పోరాటం, దాని విజయాల గురించి మైదాన ప్రాంత రైతులలో విస్తృతంగా, పదే పదే వారి స్థానిక భాషలలో ప్రచారం చేయాలి.
- పూర్తిగా దుర్భర స్థితిలో ఉన్న రైతులకు సామూహిక మద్దతును సమీకరించాలి. దీనిని ఒక సాధారణ సంప్రదాయంగా మార్చాలి.
- సందర్భాన్ని బట్టి పాలకవర్గ రాజకీయ నాయకులపై, ప్రభుత్వ ఉద్యోగులపై గావ్‌బందీ లాంటి పోరాట రూపాలను ఉపయోగించాలి.
- వ్యవసాయ ఎదుగుదలకు అన్ని సదుపాయాలను కల్పించాలి. వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు ఉండేలా చేయాలి.
- గ్రామీణ ప్రాంతాలలో స్కూల్ టీచర్లు, పంచాయితీరాజ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు, ఆశా వర్కర్లు తదితర సంఘటిత, అసంఘటిత ఉద్యోగుల సమస్యలపై వారిని సంఘటితం చేస్తూ నిరంతరం వారు సాగించే పోరాటాలలో భాగం కావాలి. ఆ పోరాటాలను ఐక్య పోరాటాలుగా అభివృద్ధి చేస్తూ నాయకత్వం వహించేందుకు కృషి చేయాలి. వీరిలో ఎక్కువ మంది అసంఘటిత ఉద్యోగులే కనుక, వీరికి ప్రధానమైన భూమి సమస్యపై వీరిని భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో సంఘటితం చేసేందుకు కృషి చేయాలి.

**పెటీబూర్జువావర్గం:**

- ఆర్థిక సంక్షోభ ప్రభావంతో, అధిక ధరలతో, పన్నుల భారంతో పెటీబూర్జువా వర్గం తీవ్రంగా సతమతమవుతోంది. ఈ వర్గం కిందికి వచ్చే చేతివృత్తులవారు అంటే చిన్నతరహా ఉత్పత్తి చేసేవాళ్లు, చిన్న వ్యాపారులు, విద్యార్థులు, స్కూల్ టీచర్లు, కాలేజీ అధ్యాపకులు, యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లు, ఆఫీసుల్లో/బ్యాంకుల్లో/కంపెనీల్లో గుమస్తాలు, నాన్-గెజిటెడ్ అధికారులు, గెజిటెడ్ అధికారులలో కింది, మధ్యశ్రేణి ఉద్యోగులు మొదలైన

మూడవ శ్రేణి, నాలుగవ శ్రేణి ఉద్యోగులు, ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు మొదలైనవారు అంతా దీర్ఘకాలంగా తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. వీరిలో చాలా మంది తమ తమ ట్రేడ్ యూనియన్లలో, సంఘాలలో, సంస్థలలో సంఘటితంగా పోరాడుతున్నారు. చాలా మంది అసంఘటితంగా కూడా ఉన్నారు. వీరి పోరాటాలలో మనం భాగస్వామ్యం వహించాలి. వారిని విప్లవ రాజకీయాలతో చైతన్యవంతం చేస్తూ ఆ సంఘాలలో విప్లవ శక్తుల ప్రభావాన్ని పెంపొందింపజేయాలి.

- **విద్యార్థులు–యువత:** విప్లవకర శక్తి అయిన విద్యార్థులు అశాస్త్రీయ, అప్రజాస్వామిక విద్యా విధానం కారణంగా తీవ్రమైన అన్యాయానికి గురవుతూ అంధకారబంధురమైన భవిష్యత్తును ఎదుర్కొంటున్నారు. వీరిని సంఘటితం చేసి ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, శాస్త్రీయ విద్యా విధానం కోసం, విద్యను, సంస్కృతిని, చరిత్రను కాషాయీకరించడానికి వ్యతిరేకంగా, ప్రైవేటీకరణకు, విద్యపై బడ్జెట్‌లో కోతకు, ఫీజుల పెంపుదలకు వ్యతిరేకంగా, విదేశీ ఎంఎన్‌సీల ఆధ్వర్యంలోని ఉన్నత విద్యా సంస్థల రద్దు కోసం, సామ్రాజ్యవాద/దళారీ పాలకవర్గాల ఏజెంట్లను తయారు చేసే పోస్ట్‌మాడర్నిస్టు పాఠ్యాంశాల, పరిశోధనల రద్దు కోసం, వీటన్నింటినీ ఒక విధానంగా మారుస్తూ ఇటీవల మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్మించాలి.
- 'కామన్ స్కూల్ విధానం' కోసం దేశంలో జరుగుతున్న పోరాటాల్ని సమర్థించాలి, వాటిలో పాలుపంచుకోవాలి, ఈ పోరాటాలను నడపాలి.
- బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టులు విద్యారంగంలో ఆధిపత్యాన్ని సంపాదించుకొని మధ్యయుగాల నాటి మనుధర్మంపై, కౌటిల్యుని అర్థశాస్త్రంపై ఆధారపడిన ఫ్యూడల్ విద్యను రుద్దడానికి చేస్తున్న దుర్మార్గ ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాడాలి.
- విద్యార్థి, యువజన, మేధావుల పోరాటాలపై ఫాసిస్టు నిర్బంధానికి వ్యతిరేకంగా, విప్లవ, ప్రజాస్వామిక కార్యకర్తలను ఉపా వంటి క్రూరమైన చట్టాలను మోపి జైళ్లలో నిర్బంధించడానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాటాలు నడపాలి.
- ఫీజుల పెంపుదల, స్కాలర్‌షిప్పుల పెంపుదల కోసం, తమ హక్కుల పరిరక్షణ కోసం విద్యార్థులు మిలిటెంట్ పోరాటాలు సాగిస్తున్నారు. మనం గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని విద్యార్థులను సంఘటితం చేయాలి. వీరిని రైతాంగంతో, ఆదివాసులతో మమేకం కావడానికై వెనుకబడిన గ్రామీణ ప్రాంతాలకు పంపాలి.
- యువతీ, యువకులను తమ సమస్యలపై కదిలించాలి. విశాల గ్రామీణ ప్రాంతాలలో, పట్టణాలు, నగరాలలో, మురికివాడల్లో నివశించే నిరుద్యోగ యువతను కదిలించి

పోరాటాలు నిర్మించాలి.

- **మేధావులు:** వీరిలో అత్యధికులు ప్రైవేటీకరణ విధానాల వల్ల తీవ్ర సామాజిక అభద్రతతో జీవిస్తున్నారు. హిందుత్వ ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా ప్రొఫెసర్లు పోరాటాలు సాగిస్తున్నారు. మనం వీరి పోరాటాలను విశాల ప్రాతిపదికన సంఘటితం చేయాలి.
- **ఉద్యోగులు:** ప్రైవేటీకరణ కారణంగా ప్రభుత్వ/సంఘటిత రంగం క్షీణించిపోవడం వల్ల సంఘటిత ఉపాధి తగ్గిపోవడం, క్యాజువల్ ఉపాధి పెరగడంతో పర్మనెంట్–పార్ట్‌టైం ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయికలు మొదలైనవారు ఉపాధి భద్రత, తగిన వేతనాలు, కుటుంబ సంక్షేమం తదితర సమస్యలను దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్నారు. లక్షలాది మంది ఉపాధి కోల్పోయి వీధుల పాలవుతున్నారు. కార్మికవర్గంలోకి లేదా నిరుద్యోగ శ్రేణుల్లోకి నెట్టివేయబడుతున్నారు. వీరు దీర్ఘకాలంగా పలు మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తున్నప్పటికీ వీరి యూనియన్‌లు అన్నీ రివిజనిస్టుల, పార్లమెంటరీ రాజకీయ పార్టీల నాయకత్వంలో ఉండడం వల్ల, యూనియన్ల నాయకులు ప్రభుత్వాలకు దళారులుగా వ్యవహరించడం వల్ల వీరి పోరాటాలు చాలా వరకు ద్రోహానికి గురవుతున్నాయి. సమస్యలపై మిలిటెంట్ పోరాటాలపై వీరిని కదిలిస్తూ వీరికి నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలు అందిస్తూ దళారీ ట్రేడ్ యూనియన్ నాయకులను బహిర్గతం చేసేందుకు నిరంతరం కృషి చేయాలి. క్రమంగా ఐక్య ఉద్యమాలలో ఉద్యోగులను బలమైన పోరాటశక్తిగా అభివృద్ధి చేయాలి.
- **వ్యాపారులు:** చేతివృత్తులవారు, చిన్న, మధ్యరకం వ్యాపారులు సామ్రాజ్యవాద, ప్రపంచీకరణ దాడికి గురై చితికిపోతున్నారు. చిల్లర వ్యాపారంలో వంద శాతం ఎఫ్‌డీఐని అనుమతించడంతో చేతివృత్తులవారికి, చిన్న, మధ్యరకం వ్యాపారులకు నిర్దిష్ట మార్కెట్లు, ఆదాయాలు లేకుండా పోతున్నాయి. బికారులుగా/నిరుద్యోగులుగా మారిపోతున్నారు. వీరు పెద్ద వ్యాపారుల, వడ్డీ వ్యాపారుల దోపిడీకి గురవుతున్నారు. జీఎస్‌టీ వల్ల వీరు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే వీరు వివిధ రూపాల్లో ప్రజలను దోచుకుంటారు. వీరు విప్లవంలో కార్మికవర్గానికి నమ్మదగిన మిత్రులు. కనుక ఈ సమస్యను వివిధ రూపాలలో పరిష్కరించే ప్రయత్నం చేస్తూనే, వీరి సమస్యల పరిష్కారానికై వీరిని సంఘటితపరచాలి, పోరాటాలలో కదిలించాలి. ధరల పెరుగుదల, ప్రత్యేకించి డీజల్, పెట్రోల్ ధరలకు వ్యతిరేకంగా, వారి జీవనోపాధికి గ్యారంటీ కోసం, కుటుంబ సంక్షేమం కోసం పోరాటాలు నిర్వహించాలి.
- వాల్‌మార్ట్, అమేజాన్, రిలయన్స్ రిటైల్, టాటా క్రోం, ఆదానీ ఎంటర్ ప్రైజెస్, డీమార్ట్ వంటి బహుళజాతి, దేశీయ దళారీ కార్పొరేట్ సరుకులను రిటైల్ మార్కెట్‌లో ప్రవేశం

కల్పించే ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా చిన్న దుకాణదారులనూ, వ్యాపారులను సంఘటితం చేసి పోరాటంలోకి దించాలి.

- **లాయర్లు:** బడా లాయర్ల ఫోరం, వారి న్యాయమూర్తులు కుమ్మక్కై న్యాయవ్యవస్థను అవినీతిమయం చేయడానికి వ్యతిరేకంగా లాయర్లను సంఘటితం చేయాలి. న్యాయప్రక్రియలో పోలీసుల జోక్యం, లాయర్లను బెదిరించడం, తప్పుడు కేసులు బనాయించడం వంటి అన్యాయాలకు వ్యతిరేకంగా సంఘటితం చేయాలి.

**జాతీయ బూర్జువావర్గం:**

- 50 లక్షల నుంచి 5 కోట్ల రూపాయల వరకు పెట్టుబడితో తమ పరిశ్రమలు/వ్యాపారాలు నడుపుకునే చిన్న, మధ్య రకం పరిశ్రమాధిపతులు, చిన్న, మధ్య రకం కాంట్రాక్టర్లు, ట్రాన్స్‌పోర్ట్ యజమానులు, వివిధ భారీ యంత్రాల (ఎర్త్ మూవర్స్, జేసీబీ తదితరమైనవి) చిన్న, మధ్య రకం హోటళ్ల, లాడ్జీల యజమానులు జాతీయ బూర్జువావర్గంలోకి వస్తారు. ముందే చెప్పుకున్నట్లు దళారీ పాలకుల విధానాల వల్ల వీరు నష్టపోతున్నారు. ట్రక్ యజమానుల సమ్మె, జీఎస్‌టీకి వ్యతిరేకంగా వీరు ఉద్యమించడం ఇందుకు సజీవ ఉదాహరణలు. ఒక వైపు సామ్రాజ్యవాదులకు, వారి దళారీలకు కారుచౌక రేటుకు వివిధ వనరులు లభిస్తుండగా, జాతీయ బూర్జువా వర్గం అందుకోసం అధిక రేట్లు చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఉత్పత్తి ఖర్చు పెరిగి, తమ ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకు అమ్ముకోలేక నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఫలితంగా లక్షలాది పరిశ్రమలు దివాలాతీసి మూతపడుతున్నాయి. వనరుల కేటాయింపులు, వాటిపై సబ్సిడీ ధరలు, పన్ను రాయితీలు, విద్యుత్ సబ్సిడీ, లైసెన్సుల మంజూరు, వివిధ సౌకర్యాలు మొదలైన తమ సమస్యలపై వీరు చేసే ఆందోళనలకు మనం మద్దతును అందించాలి. వారి ఆందోళనలలో భాగస్వాములం కావాలి.
- పెట్రోలియం ఉత్పత్తుల, ఆటోమొబైల్ విడిభాగాల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు నిరంతరం ప్రోత్సహించాలి.
- మనం వీరితో సంబంధాలను ఏర్పరచుకుని, వారికి మన పార్టీ పాలసీని అర్థం చేయిస్తూ, వారి వ్యాపారాలకు, పరిశ్రమలకు, ఆర్థిక ప్రయోజనాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాలి.
- సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ దోపిడీ పీడనలను అంతం చేసి దేశంలో నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించడం ద్వారానే వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే రాజకీయ సందేశాన్ని నిరంతరం వారికి అందించేందుకు ఆయా సందర్భాలను వినియోగించుకోవాలి.
- ఐక్యత–ఘర్షణ ద్వారా కార్మికుల ప్రయోజనాలకు భంగం కలగని రీతిలో వీరితో

మనం వ్యవహరించాలి. వీరి పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు న్యాయమైన డిమాండ్ల కోసం వీరికి వ్యతిరేకంగా ఉద్యమించాలి.

- వీరిలోని ఒక సెక్షన్‌తో బలమైన మైత్రిని ఏర్పరచుకుని విప్లవోద్యమం వైపు తీసుకొచ్చేందుకు కృషి చేయాలి. ప్రజాయుద్ధానికి వారి మద్దతును పొందాలి. ఒక సెక్షన్‌ను తటస్థం చేయాలి. మొండిఘటాలను వేరుచేయాలి.

**వివిధ సామాజిక సెక్షన్లు:**

**దళిత సమస్య:**

- ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఆటంకంగా వున్న, మెజారిటీ ప్రజల దోపిడీ, పీడనలకూ, దారిద్ర్యానికీ దయనీయ స్థితికీ, అమానవీయమైన అంటరానితనానికీ కులపీడనకూ మూలభూతంగా వున్న, దేశ నిజమైన స్వాతంత్ర్యానికీ, ప్రజాస్వామ్యానికీ సార్వభౌమత్వానికీ ఆర్థిక రాజకీయ సాంస్కృతిక పురోభివృద్ధికీ పెను ఆటంకంగా వున్న కుల ఆధారిత భూస్వామ్య విధానాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని, సామ్రాజ్యవాదాన్ని కూలదోసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా కుల వ్యవస్థ సమూల నిర్మూలనకు కావలసిన అనుకూలమైన భౌతిక పరిస్థితిని సృష్టించే లక్ష్యంతో సకల రంగాలలో కులవ్యతిరేక పోరాటాలను నిర్మించాలి.
- కార్మికవర్గ మహత్తర సిద్ధాంతమైన మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మార్గదర్శకత్వాన నూతన ప్రజాస్వామిక విప్లవకాలంలో బ్రాహ్మణీయ కులాధారిత భూస్వామ్య భావజాలానికీ సంస్కృతికీ, కొన్ని పీడిత కులాల వృత్తులను, ఆవు, ఎద్దు, దున్న, పంది, తదితర జంతు మాంసాలు భుజించే ప్రజల సాంప్రదాయాలను హీనంగా చూడడాన్ని, మూఢ నమ్మకాలతో సహా వాటి వివిధ వ్యక్తీకరణలకు వ్యతిరేకంగా పట్టువిడువకుండా పోరాడాలి. మనుస్మృతి-వేదాలు, రామాయణ, మహాభారతాలు మొదలైన వాటిలో గల కులతత్వ భావజాలాన్ని ఎండగట్టాలి. కుల అస్థిత్వాన్ని సూచించే, హీనపరిచే సంకేతాలను, భాషను, కులతత్వాన్ని కలిగిన సంస్కృతిని వ్యతిరేకించాలి. ప్రజాస్వామిక దృష్టితో భాషా, సంస్కృతులలో అవసరమైన మార్పు తీసుకు రావడానికి కృషి చేయాలి. సామాజిక వేడుకల్లో పీడిత కులాల సమాన భాగస్వామ్యం కోసం పోరాడాలి. వర్గపోరాటంలో పాల్గొనే వివిధ కులాలకు చెందిన ప్రజల మధ్య సామాజికంగా కలిసిపోయే ధోరణిని పెంచటానికి ప్రయత్నించాలి. వివిధ కులాల ప్రజల మధ్య సహపంక్తి భోజనాలను ప్రోత్సహించాలి. పీడక కులాలలోని పేద ప్రజలలో, తాము తమ కులాలలోని ధనవంతులతో సామాజికంగా సమానమన్న తప్పుడు చైతన్యాన్ని, భ్రమల్ని పోగొట్టాలి. కులాంతర మతాంతర వివాహాలకు మద్దతు,

ప్రోత్సాహం అందించాలి. కులాంతర మతాంతర వివాహాలు చేసుకున్న వారి పిల్లలు తల్లిదండ్రులలో ఎవరికి లభించే సదుపాయాలనైనా పొందటానికి అర్హులవుతారని చెప్పాలి. కులపీడనకూ, అంటరానితనానికి తావులేని నిజమైన ప్రజాస్వామిక, సోషలిస్టు సంస్కృతిని విశాల ప్రజారాశులలో ప్రచారం చేయాలి, అభివృద్ధి చేయాలి. పీడిత ప్రజల వర్గ ఐక్యతను, పీడిత సామాజిక సెక్షన్ల ప్రజల ఐక్యతను నిరోధించే పీడిత కులాలలోని కులతత్వ నాయకత్వశక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి. పీడక కులాధిపత్యంపై మన దాడిని ఎక్కుపెడుతూనే, పీడిత కులాలలో తలెత్తే సెక్టేరియన్ ధోరణులను వ్యతిరేకించాలి.

- విప్లవోద్యమంలో దళిత తదితర పీడిత సెక్షన్ల చైతన్యయుత, క్రియాశీల పాత్రను పెంపొందిస్తూ ఎంఎల్ఎంతో వారిని సాయుధం చేసి కార్మికవర్గ ఉత్తమ యోధులుగా, నాయకులుగా వారిని తీర్చిదిద్దాలి.
- కులనిర్మూలనా లక్ష్యంతో కులపీడనకు వ్యతిరేకంగా మన వివిధ వర్గ సంఘాలు, సెక్షనల్ సంఘాలు దళిత తదితర పీడిత కులాల ప్రజలను, ప్రజాస్వామిక శక్తులను ఆత్మగౌరవ పోరాటాలలోకి, పీడక కుల భూస్వామ్య శక్తులు సాగించే అన్ని రకాల వివక్షలకు, అణచివేతకు, అవమానాలకు, భౌతిక దాడులకు, వూచకోతలకు వ్యతిరేకంగా, దళితులు సాధించుకున్న హక్కులను వమ్ముచేయటానికి భూస్వాములకు మద్దతుగా ప్రభుత్వం అమలుపరచుతున్న నిర్బంధపూరిత చట్టాలకు, అణచివేత చర్యలకు వ్యతిరేకంగా పోరాటాలలోకి విస్తృతంగా కదిలించి పోరాటాలను నిర్మించి ఉన్నతస్థాయికి అభివృద్ధి చేయాలి. ఈ పోరాటాలను వ్యవసాయ విప్లవంతోనూ, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలతోనూ సమన్వయించి ప్రభావవంతంగా నడపాలి.
- రిజర్వేషన్ల విధాన సక్రమ అమలు కోసం పోరాడాలి.
- బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా దళితులు మిలిటెంటుగా పోరాడుతున్నారు. మనం వారిని సరైన దిశలో తీసుకొని పోవాలి. చాలా మంది అంబేద్కర్ భావజాలంతో స్వతంత్రంగా చొరవ చేస్తున్నారు. దళిత ప్రజలు, వివిధ దళిత ఉద్యమ సంస్థలు గణనీయమైన సంఖ్యలోనే మన పార్టీని మిత్ర సంస్థగా చూస్తారు. మనం దళిత ప్రజల్లో పని చేసేటప్పుడు, కుల నిర్మూలనా ఉద్యమం నిర్మించేటప్పుడు దేశవ్యాప్తంగా విశాల ప్రాతిపదికన ఒక బలమైన ఉద్యమాన్ని నిర్మించాలనే దృష్టితో పని చేయాలి.
- ఈ సమస్యపై మన అవగాహనకు దగ్గరగా ఉన్న ఎం.ఎల్. పార్టీలతో, వారి ప్రజాసంఘాలతో, ఇతర ప్రజాస్వామిక సంస్థలతో, వ్యక్తులతో ఎత్తుగడలపర

ఐక్యసంఘటనా వేదికలను నిర్మించాలి. అలాగే కొన్ని సమయాల్లో సమస్య ప్రాతిపదికన కలిసివచ్చే రివిజనిస్టు పార్టీలతో, పాలకవర్గ పార్టీలతో, వాటి ప్రజాసంఘాలతో, వ్యక్తులతో తాత్కాలిక ప్రాతిపదికన కలిసి పనిచేయాలి. పార్లమెంటరీ పార్టీలతో సమస్య ప్రాతిపదికపై తాత్కాలిక ఫ్రంట్ కట్టేటపుడు ప్రజలలో వీరి పట్ల భ్రమలు ఏర్పడకుండా చూడాలి.

- బ్రాహ్మణీయ కుల ఆధారిత భూస్వామ్యానికి వ్యతిరేకంగా భావజాల రంగంలోనే గాకుండా రాజకీయ రంగంలోనూ మనం వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలి. ముఖ్యంగా ప్రభుత్వాలు, బ్రాహ్మణవాద సంస్థలు, హిందుత్వ మత దురహంకార సంస్థలు బ్రాహ్మణవాద-పీడక కుల అనుకూల భారత రాజ్యాంగాన్నీ, రాజ్యాంగ యంత్రాంగాన్ని వివిధ రకాలుగా వినియోగించుకొని చేపట్టే భావజాల, మత, సాంస్కృతిక ప్రచారాన్ని, కార్యక్రమాలను ప్రజలలో ఎండగట్టాలి, ఎదుర్కోవాలి, రాజ్యాంగపు-రాజ్యాంగ యంత్రపు హిందూ మత, పీడక కుల అనుకూల పక్షపాతాన్ని బహిర్గతం చేయాలి.
- ప్రజాస్వామిక ఉద్యమంలో భాగమైన నిజమైన అస్థిత్వ ఉద్యమాలను మనం సమర్థిస్తూనే వివిధ ఉద్యమాలపై పోస్ట్‌మోడర్నిస్టు సిద్ధాంత ప్రభావాన్ని సిద్ధాంతపరంగా ఎత్తిచూపాలి. ఇవి సరైన దిశలో సాగడానికీ, వాటిని విప్లవోద్యమంలో భాగం చేయడానికి కృషి చేయాలి.

**ఆదివాసీ సమస్య:**

- ఆదివాసీ ప్రాంతాలలో దున్నేవారికి భూమి ప్రాతిపదికన భూస్వాముల, ప్రవాస భూస్వాముల, దుష్ట పెత్తందార్ల, ప్రజావ్యతిరేకుల భూములను స్వాధీనం చేసుకొని, వ్యవసాయేతర ప్రయోజనాలకు ఉదాహరణకు, కాఫీ, రబ్బరు, టీ తదితర ప్లాంటేషన్లకు, ఉపయోగించే అటవీ భూములను, మత సంస్థల అదనపు భూములను, పళ్ల తోటలను, బంజరు భూములను ఆక్రమించి భూమిలేని, పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రాధాన్యతా క్రమాన్ని బట్టి పంపిణీ చేసేందుకు వర్గ పోరాటాన్ని నిర్మించడంపై కేంద్రీకరించాలి.
- భూమి సమస్య తీవ్రంగా ఉండి, అడవి భూములు తగినంతగా ఉన్నచోట అడవి భూములను నిర్ధారిత పరిధిలో నరికి సాగు చేసుకునే విధంగా రైతాంగాన్ని సమీకరించాలి.
- పోడు వ్యవసాయం అమలులో వున్న చోట రైతాంగానికి మద్దతునివ్వాలి. ప్రత్యేక కార్యక్రమం రూపొందించుకొని అక్కడ స్థిర వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషిని ప్రణాళికాబద్ధంగా కొనసాగించాలి.
- వ్యవసాయాభివృద్ధి కోసం నీటిపారుదల సౌకర్యం, 24 గంటల ఉచిత కరెంట్, వడ్డీలేని

రుణాలు ఇవ్వాలి.

- అటవీ హక్కుల చట్టం-2006 ప్రకారం ఆదివాసులు సాగుచేసుకుంటున్న భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలి.
- అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాల కోసం, గిట్టుబాటు ధరల కోసం పోరాటాలు చేపట్టాలి.
- ఆదివాసీ ప్రాంతాలలో ఒకే పంట కాలం ఉండడం వల్ల మిగతా కాలమంతా ఉపాధి గ్యారంటీ కోసం పోరాటాలు నిర్వహించాలి.
- ఆదివాసులు ఉపాధి కోసం వలసవెళ్లడాన్ని నిరుత్సాహపరచాలి. వలస శ్రామికులతో వలస శ్రామిక సంఘాలు నిర్మాణం చేసి, వాటి పర్యవేక్షణలో పనులకు బృందాలుగా వెళ్లడం, ఏజెంట్ల దోపిడీని అరికట్టడం, కూలీరేటు, పని గంటలు నిర్ధారించుకోవడం, అదనపు శ్రమకు అదనపు వేతనం, చెల్లింపు గ్యారంటీ ఉండేలా చూసుకోవడం, శ్రామికుల సంక్షేమం (వసతి, తిండి, వైద్యం) కోసం తగిన పోరాటాలు చేపట్టాలి. సామాజిక పీడన (అవమానించడం, తిట్టడం, కొట్టడం)కు వ్యతిరేకంగా పోరాడాలి. వలస మహిళా శ్రామికులపై అత్యాచారాలు, అపహరణలు, అమ్మివేయడం మొదలైనవాటిని అరికట్టాలి.
- ఆదివాసులను విస్థాపితం చేసే బహుళజాతి కంపెనీలు, వారి దళారీలు తలపెట్టిన గనులు, డ్యాములు, రోడ్లు, రైల్వేలు, అభయారణ్యాలు, ఇండస్ట్రియల్ పార్కులు, ప్రభుత్వ సాయుధ బలగాల కోసం ఫైరింగ్ రేంజ్‌లు, బ్యారక్‌లు, హెలిప్యాడ్‌లు మొదలైనవాటి నిర్మాణాన్ని అడ్డుకునే విధంగా 'జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్' నినాదంతో విశాల ఐక్యసంఘటనా వేదికలు నిర్మించి పోరాటాలు చేపట్టాలి.
- దేశ జనాభాలో 8 శాతంగా ఉన్న ఆదివాసులకు ప్రత్యేక ఆర్థిక, సామాజిక వ్యవస్థ, సాంస్కృతిక స్వాభావిక లక్షణాలు ఉన్నాయి. ఆదివాసీ పోరాటాల ఫలితంగా దళారీ పాలకవర్గాలలో రాజ్యాంగంలో 5వ షెడ్యూల్, 6వ షెడ్యూల్‌లను పొందుపరిచినప్పటికీ, అటవీ హక్కుల చట్టం, పెసా చట్టం వంటివి తీసుకొచ్చినప్పటికీ ఆదివాసులు అడవుల నుంచి బేదఖల్ చేయబడుతున్నారు. ఆదివాసీ బాహుళ్య ప్రాంతాల్లో గ్రామసభల అధికారాలను తుంగలో తొక్కి చేస్తున్న బలవంతపు విస్థాపనలకు వ్యతిరేకంగా 'పత్థల్‌గడీ' వంటి పోరాటాలను విశాల ప్రాతిపదికన నిర్మించి అభివృద్ధి చేయాలి. ఈ పోరాటాలను సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ బూర్జువా వ్యతిరేక, రాజ్య వ్యతిరేక పోరాటాలుగా అభివృద్ధి చేయాలి.

**మహిళా సమస్య:**

- దళారీ బూర్జువా, భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, పితృస్వామ్య వ్యతిరేక

వర్గ పోరాటంలో మహిళలను సమీకరించాలి. విద్య, ఆరోగ్యం, నివాసం, పని/శ్రమ విభజన, సమాన పనికి సమాన వేతనం, సమాన పని గంటల కోసం, సామాజిక హోదా, సంపదపై యాజమాన్యం, మహిళల అభివృద్ధి చెందడానికి సమానావకాశాల కోసం, దోపిడీ, పీడన, వివక్షలకు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, మహిళలు అబలలు అంటూ వారిని రెండవ తరగతి పౌరులుగా దిగజార్చిన పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో మహిళలను పెద్దెత్తున కదిలించి విశాల ప్రాతిపదికన పోరాటాలు నిర్మించాలి.

- బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిస్టు దళారీ పాలకులు ఒక వైపు మనుస్మృతితో మహిళల్ని బంధించి ఉంచుతూ మహిళలపై అత్యాచారాలు చేసే వారికి ఉరి-ఉరి అంటూ గొంతు చించుకుంటున్నారు, మరో వైపు సామ్రాజ్యవాద సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారు. పబ్ సంస్కృతి, పతన విలువలు, నిరుద్యోగానికి పరిష్కారంగా వేశ్యా వృత్తిని ఎంచుకోవడం, బలవంతంగా ఆడపిల్లలను వేశ్యావాటికలకు అమ్మేయడం, మహిళలపై అత్యాచారాలకు కుఖ్యాతి గాంచిన రేప్ డ్రగ్ పార్టీలు, మహిళను సరుకుగా మార్చి వివిధ రూపాల్లో వ్యాపారీకరించడం, స్వార్థం, ఎంతటి నీచ పద్ధతులకైనా దిగజారి సంపదను పోగుచేసుకోవడం, మద్యం వ్యాపారం, గంజాయి చాక్లెట్లు, సింథటిక్ డ్రగ్స్ వినియోగం, సినిమాలు, టీవీ సీరియల్స్, నీలిచిత్రాలు (పోర్న్ వీడియోలు), అత్యాచారం చేసి ఆ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేయడం మొదలైన వాటిని పెద్దెత్తున ప్రోత్సహించడం ద్వారా ఇంటా, బయటా మహిళలపై అత్యాచారాలకు అనుకూల వాతావారణాన్ని తయారు చేస్తున్నారు. ప్రతి పది నిముషాలకు ఒక రేప్ జరుగుతోంది. భార్యను కొట్టడం తప్పు కాదు అని 90 శాతం పురుషులు, 50 శాతం మహిళలు కూడా నమ్ముతున్న దేశం ఇది. పెళ్లిళ్లలో సమానత్వం, గౌరవం, ప్రేమ ఉండాల్సిన స్థానంలో కులం, కట్నం, జాతకం ప్రబలంగా ఉంటున్నాయి. 'వాడు మగాడు', 'నువ్వు మగాడివేనా?', 'మగాడంటే అలా ఉండాలి', 'ఆమె కావాలి' అనిపిస్తే, ఆమెను 'స్వంతం' చేసుకోవడం – ఇవే ఇతివృత్తాలతో సినిమాలు బ్లాక్ బస్టర్ సినిమాలు అవుతున్నాయి. మానవ అక్రమ రవాణాలో 71 శాతం బాలికలు, మహిళలు ఉంటున్నారు. బాల్య వివాహాలు, బలవంతపు వివాహాలు, మారిటల్ రేప్, వరకట్నపు హత్యలు, పరువు హత్యలు, బాణామతి హత్యలు, యాసిడ్ దాడులు, ప్రసవ మరణాలు మహిళల పాలిట పీడగా వున్నాయి. దళారీ ప్రభుత్వాల చట్టాలు ధనికవర్గాలకు అనుకూలంగా పనిచేస్తున్నాయి. వీటి ద్వారా పితృస్వామ్యం, పురుషాధిపత్య భావజాలం ప్రమాదకర స్థాయికి పెరిగింది. వీటన్నింటికి వ్యతిరేకంగా మహిళా లోకంలో తీవ్రమైన ఆక్రోశం ప్రబలి ఉంది. దీన్ని శక్తివంతమైన విస్ఫోటనంగా మార్చి ఈ అర్థవలస, అర్థభూస్వామ్య

వ్యవస్థను కూల్చే వైపు మళ్లించాలి. భూస్వామ్య, సామ్రాజ్యవాద వినిమయ విష సంస్కృతికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బలమైన మహిళా ఉద్యమాన్ని నిర్మించాలి.

- మనం సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్యానికి వ్యతిరేకంగా సాగించే సాయుధ వ్యవసాయక విప్లవ పోరాటాలలోకి, అలాగే సామాజిక అసమానతలకు, అణచివేతకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా సాగే పోరాటాలలోకి మహిళలను, ముఖ్యంగా పేద, భూమిలేని రైతాంగం నుండి వచ్చిన మహిళలను పెద్దెత్తున సమీకరించాలి.
- సమాజంలో నూతన ప్రజాస్వామిక విప్లవం, ఆ తర్వాత సోషలిస్టు పరివర్తన ద్వారానే మహిళా విముక్తి లభిస్తుందనే మార్క్సిస్టు అవగాహనను అందిస్తూ మహిళలను మేల్కొల్పాలి, సమీకరించాలి, సంఘటితపరచాలి, మహిళల సమస్యలతో పాటు వివిధ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సమస్యలపై జరిగే వివిధ పోరాటాల్లో భాగస్వామ్యం చేయాలి.
- విప్లవ మహిళ సంఘాలలో, ప్రజాయుద్ధంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ వారి నుండి దృఢమైన, ముందుచూపు గల కమ్యూనిస్టు నాయకులను అభివృద్ధిపరచడంపై మనం తప్పనిసరిగా కేంద్రీకరించాలి.

**మత మైనారిటీల ప్రత్యేకించి ముస్లిం ప్రజల సమస్య:**

- భారతదేశంలో లౌకికవాదం ముసుగులో బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాదం రాజ్యమేలుతోంది. ఇందుకోసం అన్ని పాలకవర్గ పార్టీలు రాజ్య యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాయి. భారత రాజ్యం హిందుత్వ అనుకూల వైఖరి బహిరంగంగానే వ్యక్తమవుతోంది. ఇటీవలి బాబ్రీమసీదు–రామజన్మభూమి వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు ఇందుకు సజీవ ఉదాహరణ. భారతీయుడంటే హిందువే అంటూ మతమౌఢ్యం పెంచి పోషిస్తున్నాయి. తద్వారా దేశ జనాభాలో 15 శాతంగా వున్న మత మైనారిటీలను ద్వితీయ స్థాయి పౌరులుగా దిగజారుస్తోంది. వీరిపై కొనసాగుతున్న దోపిడీ, పీడనలకు, వివక్షకూ, వేదింపులకూ, క్రూర అణచివేతకూ, దేశ విభజన నాటి నుండి వర్తమాన సీఏఏకు వ్యతిరేకంగా రాజధాని ఢిల్లీ వరకూ అడ్డూఆపూలేకుండా కొనసాగుతున్న మూకుమ్మడి హత్యాకాండలకు, ప్రగతిశీల, లౌకికవాదుల హత్యలకు, వారిపై బెదిరింపులకు, మోబ్ లించింగ్‌కు (మూక హత్యలకు), మత మైనారిటీల ధార్మిక స్థలాల (మసీదులు, చర్చిలు) విధ్వంసానికి, మత ప్రాతిపదికన శ్రామిక ప్రజల్ని విభజించే దోపిడీ వర్గనీతికి వ్యతిరేకంగా పెద్దెత్తున పోరాటాలు విశాల ప్రాతిపదికన నిర్వహించాలి.
- అక్రమ చొరబాటుదార్ల వలసలను నివారించే సాకుతో దేశంలో హిందుత్వ రాజ్యాన్ని (హిందూ నేషన్) స్థాపించే కుట్రలో భాగంగా బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ

చట్టాన్ని (సీఏఏ) ముందుకు తెచ్చింది. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్ దేశాల నుండి ఆర్థిక, రాజకీయ, సామాజిక కారణాలతో భారతదేశంలోకి వచ్చిన హిందువులకు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రైస్తవులకు ఈ చట్టం పౌరసత్వం కల్పిస్తుంది. ఈ 'నూతన పౌరులతో' కలిపి దేశ పౌరుల రిజిస్టర్ తయారీ కోసం మొదటి జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌పీఆర్)ను తేవాలని, ఆ తర్వాత నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్‌షిప్ (ఎన్‌ఆర్‌సీ) తయారు చేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. బంగ్లాదేశ్ తదితర దేశాల నుండి భారతదేశంలోకి వలస వచ్చిన ముస్లిం మత మైనారిటీలను అక్రమ వలసదార్ల పేరుతో ఈ దేశం నుండి తరిమేయడం లేదా వారిని హిందువులుగా మారేలా ఒత్తిడి చేయడం ఈ చట్టాల వెనకనున్న ప్రమాదకర లక్ష్యాలు. కనుక సీఏఏ రద్దు కోసం పోరాడాలి.

- మత మైనారిటీల సామాజిక, ఆర్థిక అభివృద్ధికై వారిని విశాల ప్రాతిపదికన సమీకరించి పోరాటాలు నిర్వహించాలి.
- బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిజం నిజమైన లక్ష్యం పెరుగుతున్న పోరాటాల వెల్లువల నుండి ప్రజల దృష్టిని మళ్లించి, వారిని విభజించి, వారి చైతన్యాన్ని మొద్దుబర్చడం, వారి పోరాటాలను క్రూరంగా అణచివేయడమే. అందుకని ఫాసిజానికి అంతిమంగా స్వస్తి పలకగల వాస్తవ వర్గ పోరాటాన్ని – దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడంపై మనం దృష్టిని తప్పనిసరిగా కేంద్రీకరించాలి.

**జాతుల సమస్య:**

- దేశం జాతుల బందీఖానాగా మగ్గిపోతున్నది. దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా మాత్రమే సామ్రాజ్యవాద బానిసత్వాన్నీ, దాని దోపిడీని, అజమాయిషీని కూకటివేళ్లతో సహా పెకిలించివేసి జాతీయ స్వాతంత్ర్యాన్ని సాధించడం గానీ, భూస్వామ్య నిరంకుశత్వాన్ని బ్రద్దలుకొట్టి ప్రజల ప్రజాస్వామ్యాన్ని స్థాపించడంగానీ సాధ్యమవుతుంది. కనుక కశ్మీర్ జాతితో పాటు నగాలు, మణిపురీలు, అసామీలు, ఈశాన్య ప్రాంతంలోని తదితర పీడిత జాతులు విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికార హక్కు కోసం సాగిస్తున్న న్యాయమైన పోరాటాలను మనం సమర్థించాలి, ఈ ఉద్యమాలకు మద్దతుగా సంఘీభావ ఉద్యమాలను నిర్మించాలి. వీటిపై కొనసాగే దమనకాండకు వ్యతిరేకంగా పోరాడాలి. భారత విస్తరణవాద రాజ్యం వీటిని వేర్పాటు ఉద్యమాలుగా చిత్రించి, వీటికి వ్యతిరేకంగా భారత ప్రజలలో బూర్జువా జాతీయ దురభిమానాన్నీ, బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాదాన్ని రెచ్చగొట్టటానికి చేస్తున్న కుట్రలను బట్టబయలు చేయాలి. పలు జాతుల, ప్రాదుర్భావ జాతుల, జాతి

మైనారిటీల మధ్య అనైక్యతను సృష్టిస్తున్న భారత దోపిడీ పాలకవర్గాల కుట్రలను బహిర్గతం చేస్తూ ఉమ్మడి లక్ష్యం కోసం వాటిని ఐక్యం చేసేందుకు కృషి చేయాలి. జాతుల విముక్తి పోరాటాలలో మనం భాగస్వామ్యం కావాలి. వాటికి నాయకత్వం అందించాలి. జాతి విముక్తి ఉద్యమాలను సాయుధ వ్యవసాయ విప్లవ వర్గ పోరాటంతో సమన్వయించి నడపాలి.

- కశ్మీర్‌లో, ఈశాన్య ప్రాంతంలో పీడిత జాతులను కుంగదీస్తూ వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, భాషా, సంస్కృతుల అభివృద్ధిని అడ్డుకుంటున్న మూడు మహా పర్వతాలను ధ్వంసం చేసే వైపుగా జాతుల విముక్తి పోరాటాలను నడపాలి.
- అన్ని జాతుల స్వయంనిర్ణయాధికార హక్కును, అన్ని భాషల సమానత్వాన్నీ గుర్తించే, సమానత్వంపై ఆధారపడిన జాతుల స్వచ్ఛంద ఫెడరల్ ప్రజాస్వామిక రిపబ్లిక్ స్థాపన కోసం పోరాడాలి. ఈ లక్ష్యంతో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలి.
- జాతి మైనారిటీలకు, ప్రాదుర్భావ జాతులకు సంబంధించిన ప్రతి ప్రజాస్వామిక డిమాండ్ల కోసం – సమానహోదా, ప్రత్యేక రాష్ట్రం, స్వయంప్రతిపత్తి, ఒక జాతిపై మరో జాతి సాగించే రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రూపాలలోని పీడన, వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి. జాతి మైనారిటీల సాంస్కృతిక అభివృద్ధి కొరకు, తమ భాషలో విద్యా సౌకర్యాలు వగైరా ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడాలి. గోండ్వానా, విదర్భ, కోసల, గోర్ఖాలాండ్, బుందేల్‌ఖండ్, పూర్వాంచల్ తదితర ప్రత్యేక రాష్ట్రాల ఉద్యమాలను సమర్థించాలి. ఈశాన్య భారతంలోని చిన్న జాతుల ముందు 'ప్రజాస్వామిక స్వయంపాలనా కౌన్సిల్స్' (డెమోక్రటిక్ అటానమస్ కౌన్సిల్స్) కోసం పోరాడే కార్యక్రమాన్ని ఉంచాలి. తగిన పోరాట, నిర్మాణ రూపాలను చేపట్టాలి.
- మైనారిటీ జాతుల హక్కులను పరిరక్షించాలి. ప్రాదుర్భావ జాతులతో పాటు అన్ని జాతుల సర్వతోముఖ ఆర్థిక, రాజకీయ, భాష, సాంస్కృతిక అభివృద్ధి కోసం పోరాడాలి.
- దేశంలోని వివిధ ఆదివాసీ తెగల రాజకీయ స్వయంనిర్ణయాధికారానికి/స్వయంప్రతిపత్తికి హామీ ఉండాలి. వీరిని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, భాషా, విద్యాపరమైన సమస్యలపై సంఘటితపరచాలి. వీరి సంపూర్ణ విముక్తి కోసం వీరి పోరాటాలకు నాయకత్వం వహించాలి.
- వివిధ జాతుల ప్రజలను జాతిపరమైన ఒంటరితనం నుండి బయటికి తెచ్చి, వారిలో జాతుల సమైక్యతా భావననూ, అంతర్జాతీయ సౌభ్రాతృత్వాన్ని పెంపొందింపజేయాలి.
- అన్ని జాతుల, తెగల భాషలకు సమాన హోదా కల్పించాలనీ, దీనిని ప్రాథమిక

హక్కుగా గుర్తించాలనీ, జాతీయ భాష లేదా అనుసంధానభాష లేదా మరో పేరుతో ఏ భాషనూ ఇతర భాషలపై రుద్దరాదనీ, త్రిభాషా సూత్రాన్ని రద్దు చేయాలనీ, మాతృభాషలో ఉచిత విద్య అందించాలనీ, తమ అధికారిక కార్యకలాపాలు తమ భాషలలో నిర్వహించుకునే హక్కు కల్పించాలనీ, లిపిలేని భాషలకు లిపిని అభివృద్ధి చేయాలనీ, డిమాండ్లతో ప్రజలను కదిలించాలి.

- సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఫలితంగా విద్య, వైద్య రంగాలు ప్రైవేటీకరించబడి పీడిత జాతి సముదాయాల అభివృద్ధి కుంటుపడుతున్నందునా ఆ రంగాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి. 'కామన్ స్కూల్ విధానం' కోసం దేశంలో జరుగుతున్న పోరాటాల్ని సమర్థించాలి, వాటిలో పాలుపంచుకోవాలి, ఈ పోరాటాలను నడపాలి.
- సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్ఆర్సీ చట్టాల ద్వారా భారతదేశంలోని పీడిత జాతులు, ముఖ్యంగా ఈశాన్య, తూర్పు భారతంలోని పీడిత జాతుల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రయోజనాలకు తీవ్రమైన నష్టం జరిగి ఆ జాతుల అస్తిత్వం పెనుప్రమాదంలో పడనుంది. కనుక సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్ఆర్సీల రద్దు కోసం పోరాడాలి. వలస సమస్యపై ఐక్యరాజ్యసమితి చార్టర్‌పై ఆధారపడి దక్షిణాసియాలో వలస సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజలను కదిలించాలి. దక్షిణాసియాలో వలస సమస్యకు కారణమైన దక్షిణాసియాలోని పాలకవర్గాల, ప్రత్యేకంగా భారత విస్తరణవాద విధానాలకు వ్యతిరేకంగా భారత ప్రజలతో పాటు దక్షిణాసియా ప్రజలను సమీకరించి పోరాడాలి.
- భారత అభివృద్ధి నిరోధక పాలకవర్గాలు రెచ్చగొట్టే బూర్జువా జాతీయ దురహంకారానికీ, విస్తరణవాదానికీ, కుహనా దేశభక్తికీ, బూటకపు దేశ సమగ్రతకు వ్యతిరేకంగా పోరాడాలి. వారు జాతుల సుసంపన్నమైన సంస్కృతిని, భాషలను నాశనం చేసి, మతమైనార్టీలపై నిరంతరాయంగా దాడులు చేస్తూ వాటిపై బ్రాహ్మణవాద సంస్కృతిని, హిందూ మతాన్ని, హిందీ, సంస్కృతం భాషలను రుద్దటానికీ, దేశంలో ఫాసిస్టు పాలన నెలకొల్పి హిందుత్వ రాష్ట్ర నిర్మాణంకై పన్నుతున్న బ్రాహ్మణీయ హిందుత్వ మతఛాందసవాద/మతదురహంకార కుట్రలకు వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడి ఓడించాలి.
- జాతీయ, ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో ఆయా జాతి ప్రాంతాలలో ప్రత్యేక నిర్మాణాలను ఏర్పరచాలి. ఈ సంస్థలు జాతి విముక్తి ఉద్యమ నిర్మాణంలో భాగంగా ఆయా జాతులకు సంబంధించిన ప్రతీ సమస్యపై ప్రజలను కదిలించాలి. ఈ సంస్థలు సామ్రాజ్యవాదుల, భారత పాలకవర్గాల విభజించి-పాలించే విధానాలకు వ్యతిరేకంగా, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడడంతో పాటు అన్ని జాతుల ఉద్యమాలకు మద్దతునివ్వాలి, సంఘీభావ ఉద్యమాలను నిర్మించాలి. ఈ ఉద్యమాలకు వెన్నుపోటు పొడిచే జాతి

విద్రోహులను బట్టబయలు చేయాలి.

- జాతుల సమానత్వంపై ఆధారపడిన, స్వయంనిర్ణయాధికారం కలిగిన నిజమైన ప్రజాస్వామిక ఫెడరల్ రిపబ్లిక్ స్థాపనా లక్ష్యంతో ఉమ్మడి శత్రువులకు వ్యతిరేకంగా వివిధ విప్లవ పార్టీలతో, వివిధ జాతి విముక్తి ఉద్యమాల సాయుధ సంస్థలతో, ఈ ఉద్యమాలను బలపరిచే వివిధ ప్రజాస్వామిక సంస్థలతో వ్యక్తులతో ఉమ్మడి కార్యక్రమం ఆధారంగా ఒక వ్యూహాత్మక ఐక్యసంఘటన ఏర్పరచాలి. దీని నాయకత్వాన జాతుల సమస్యపై దేశంలోని వివిధ జాతుల ప్రజలను జాతీయ ప్రజాస్వామిక విప్లవం దిశగా నడపాలి. ఆయా జాతుల ప్రజల సంసిద్ధతపై ఆధారపడి నిర్దిష్ట నినాదాలతో ఎత్తుగడలపర ఐక్యసంఘటన వేదికలను నిర్మించి పోరాటాలు నడపాలి. ఈ ఐక్యసంఘటన నిర్మాణాలన్నీ జాతుల ఉమ్మడి ఆశయం కోసం పోరాడాలి.

**పర్యావరణ సమస్య:**

- రోజు రోజుకూ అత్యంత ప్రమాదకరంగా మారుతున్న పర్యావరణ సమస్య, గ్రీన్‌హౌస్ వాయువుల సమస్య మానవాళికి ముప్పుగా మారుతున్నందున దీనిపై కలసి వచ్చే శక్తులన్నింటితో కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందించుకొని విశాల ప్రజా ఉద్యమాన్ని నిర్మించేందుకు పోరాటాలు నిర్మించాలి.
- తక్షణం ఒక ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను చేపట్టే విధంగా పెద్దెత్తున ఉద్యమాలు నడపడం ద్వారా దోపిడీ ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి.
- మూడు మహా పర్వతాలను కూలదోసి ప్రజల ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించకుండా ఏ ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా ఆచరణలో అమలులోకి రాదనే వాస్తవికత దేశ ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలి. నూతన ప్రజాస్వామిక విప్లవం వైపుగా ప్రజలను సమీకరించాలి.

**బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా:**

- ఆర్థిక సంక్షోభం నుండి బయటపడడం కోసం, దోపిడీ, పీడనలు సాగించడం కోసం సామ్రాజ్యవాదుల సేవలో భారత దళారులు అత్యంత అధికంగా క్రూరమైన పాలన సాగించే విధానాన్ని – బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిజాన్ని అమలు చేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ముస్లిములు, దళితులు, ఆదివాసులు, మహిళలు పోరాడుతున్నారు. చరిత్రను, సంస్కృతిని, ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసం మేధావులు పోరాడుతున్నారు. ఇందులో మన పార్టీ భాగస్వామ్యం కావాలి. వీటికి నాయకత్వం వహించాలి.
- ఫాసిజం గ్రామీణ, పట్టణ మధ్యతరగతి వర్గం, పెటీబూర్జువా వర్గం, లంపెన్ కార్మికవర్గం మధ్య సుదీర్ఘ సన్నాహాలతో పునాదిని ఏర్పాటు చేసుకుంటుంది. దీన్ని దృష్టిలో ఉ

ంచుకొని మనం ఈ వర్గాల ప్రజల్లో భావజాలపరంగా, సాంస్కృతికంగా, ఆచరణాయుతంగా కిందికి వెళ్లి పని చేసేందుకు సన్నాహాలు చేయాలి.

- మన వర్గ సంఘాలు, ఇతర సంఘాల ద్వారా ఫాసిజానికి వ్యతిరేకంగా నిరంతరం ప్రచార, ఆందోళనలను నిర్వహించాలి.
- మనం మతమైనారిటీలలో, ప్రత్యేకించి ముస్లిము ప్రజలలో స్థానాన్ని ఏర్పరచుకోవడానికి చొరవ చేయాలి. మధ్యతరగతి వర్గంలోని విశాల సెక్షన్లకు నూతన ప్రజాస్వామిక విప్లవం వల్ల ప్రయోజనం ఏమిటో తెలియజేస్తూ, బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడే క్రమంలో వారిని సమీకరించేందుకు చొరవ చేయాలి.
- గత ఆరు సంవత్సరాలలో అమలులోకి వచ్చిన 'గోహత్య' నిషేధం, గోమాంసం తినడంపై నిషేధం, ఘర్ వాపసీ, లవ్ జిహాదీ, పెద్ద నోట్ల రద్దు, వస్తు-సేవల పన్ను, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కోత, భీమా కోరేగాం కేసు, భిన్నాభిప్రాయాల నిర్దాక్షిణ్య-క్రూర అణచివేత, ఆహారం-ఆహార్యం మీద ఆంక్షలు, నిరంకుశంగా ట్రిపుల్ తలాఖ్ రద్దు, ఎన్ఐఏ సవరణ బిల్లు-2019, ఉపా సవరణ బిల్లు-2019, మానవహక్కుల పరిరక్షణ సవరణ బిల్లు-2019, ఆర్టీఐ సవరణ బిల్లు-2019, 370, 35ఏ అధికరణాల రద్దు, బాబ్రీమసీదు విధ్వంసంపై తీర్పు, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వంటి డజనుకు పైగా ప్రజావ్యతిరేక నిర్ణయాలకూ, విధానాలకూ వ్యతిరేకంగా, మోబ్ లించింగ్‌కు (మూక హత్యలకు) వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన ఉద్యమాలను నిర్వహించాలి.
- బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాదానికి వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన ఎత్తుగడలపర ఐక్యసంఘటన నిర్మించాలి. మత మైనారిటీల ప్రత్యేకించి ముస్లిము మత మైనారిటీల సంఘాలతోనూ సంస్థలతోనూ, కుల నిర్మూలనా సంఘాలతోనూ, ప్రజాస్వామిక స్వభావం కలిగిన వివిధ దళిత, ఆదివాసీ, పీడిత జాతుల సంస్థలతోనూ, మహిళా సంఘాలతోనూ, లౌకికవాద శక్తులతోనూ, కలిసి వచ్చే ఎం-ఎల్ శక్తులతోనూ, వ్యక్తులతోనూ దీన్ని నిర్మించాలి. దీనికి ఒక సరైన దిశనిచ్చి రాజకీయంగా సంఘటితపరచాలి. ఇది కేవలం ప్రచారం కార్యక్రమాలకే పరిమితం కాకుండా ఆందోళనా కార్యక్రమాలను చేపట్టేలా రాసిలోనూ, వాసిలోనూ బలోపేతం చేయాలి.
- ఈ సమస్యపై కలసి వచ్చే రివిజనిస్టు పార్టీలతో, బూర్జువా పార్టీలతో, వాటి ప్రజాసంఘాలతో సమస్య ప్రతిపాదికన మాత్రమే ఎత్తుగడలపరంగా ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కార్యక్రమాల్లో కలిసి పనిచేయాలి. ఈ క్రమంలో ప్రజలలో వీరి పట్ల భ్రమలు ఏర్పడకుండా రాజకీయంగా వారి వైఖరిని నిరంతరం ఎండగడుతూ

ఉండాలి.

**విస్థాపన :**

- దేశంలో ఇది తీవ్రమైన సమస్యగా ఉంది. దేశవ్యాప్తంగా వివిధ సంఘాలు ఈ సమస్యపై పోరాడుతున్నాయి. విప్లవ వేదికలతో పాటు ప్రజాస్వామిక, ఎన్‌జీఓ, సంస్కరణవాద, రివిజనిస్టు, గాంధీవాద, చట్టబద్ధవాద మొదలైన భావజాలాలు కలిగిన సంఘాలు, వ్యక్తులు ఇందులో ఉన్నారు. ఎక్కువగా ఆదివాసులు, రైతులు, మత్స్యకారులు ఈ సమస్య బారిన పడుతున్నారు. వీరందరికీ తగిన పునరావాసం కల్పించాలి, చట్టబద్ధంగా నష్టపరిహారం చెల్లించాలి, ముందు పునరావాసం తర్వాత విస్థాపన, వంటి వర్గపోరాటాన్ని నీరుగార్చే భావాలను బహిర్గతం చేయాలి. సమస్య తీవ్రత కారణంగా స్వభావ రీత్యా ఈ పోరాటానికి మిలిటెంట్ లక్షణం ఉంది. దీన్ని ఉపయోగించుకొని మిలిటెంటు ఆర్థికవాదం కూడా కొన్ని చోట్ల ముందుకు వస్తున్నది. దీనివల్ల ప్రజల మద్దతు కలిగిన నాయకులు ఆవిర్భవిస్తున్నారు. వారు తిరిగి అమ్ముడుపోతున్నారు. మనం అన్ని రకాల విస్థాపన వ్యతిరేక పోరాటాలను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కనీస కార్యక్రమంపై ఆధారపడి విశాల ప్రాతిపదిన సంఘటితం చేయాలి. ఈ పోరాటాలను విప్లవోద్యమంతో సమన్వయించి నడపాలి.
- మనం ప్రజల్ని పక్కదారి పట్టించే భావజాలాలతో పోరాటం-ఐక్యత ప్రాతిపదికన ముందుకు సాగుతూ వీలైనన్ని శక్తులను విప్లవ పక్షంలోకి తీసుకొని రావాలి. మనం మన ప్రజాసంఘాల నాయకత్వంలో వీలైనంత ఎక్కువగా చొరవ చేయాలి.

**ఎంఎస్ఎంఈ పరిశ్రమల సమస్య:**

- లక్షలాది కుటీర, లఘు, మధ్యతరహా పరిశ్రమలు దివాలాతీసి మూతపడడానికి కారణమవుతున్న సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువాజీ అనుకూల దళారీ పాలకుల వివక్షాపూరిత విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టాలి. ఈ పరిశ్రమలకు ఉచిత/సబ్సిడీ రేట్లతో విద్యుత్తు, ఉచిత నీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలనీ, పన్నుల్లో మినహాయింపులు కల్పించాలని డిమాండ్ చేయాలి. ఎమ్.ఎస్.ఎమ్.ఈలను రెండు రకాలుగా చూడాలి. ఒకటవ రకం స్థానిక మార్కెట్‌కోసం ఉత్పత్తి చేస్తాయి. రెండవరకం దళారీ, సామ్రాజ్యవాద కంపెనీల కోసం ఉత్పతి చేస్తాయి. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం ఎమ్.ఎస్.ఎమ్.ఈల నిర్వచనాన్ని మార్చడంతో ఈ దళారీ, సామ్రాజ్యవాద కంపెనీలు నేరుగానూ, ఫైనాన్స్ చేయడం ద్వారాను ఇందులో ప్రవేశిస్తాయి. ఈ పరిస్థితుల్లో కునారిల్లిపోతున్న ఎమ్.ఎస్.ఎమ్.ఈలకు ప్రయోజనం చేకూర్చేందుకు దళారీ, సామ్రాజ్యవాద కంపెనీల సరుకులను మార్కెట్‌లోకి తేవడంపై నిషేదం విధించాలి.

లేదా వాటిపై అధిక పన్ను వేయాలి. స్థానిక మార్కెట్ కోసం ఉత్పత్తి చేసే ఎమ్.ఎస్.ఎమ్.ఈల కార్మికుల వేతనాలను ప్రభుత్వమే చెల్లించాలి. 'పని స్థలంలో భద్రతా వ్యవస్థ బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి' అని డిమాండ్ చేయాలి.

**మత్స్యకారుల సమస్య:**

- ఏడున్నర వేల కి.మీ.లకు పైగా సముద్రతీరం, అనేక జలాశయాలు, నదులూ, కాలువలతో భారతదేశం ఒక కోటి నలభై లక్షల మందికి మత్స్యపరిశ్రమ జీవనోపాధి కల్పిస్తున్నది. ఇది ప్రపంచంలో సముద్ర చేపల వేటలో మూడో స్థానంలో, మంచినీటి చేపల ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉంది. మత్స్య ఎగుమతుల ద్వారా గత సంవత్సరం 49 వేల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆర్జించింది. వీరు సైనిక దుస్తులు ధరించని సైనికులుగా రక్షణలో ఇంటెలిజెన్స్ సేవలుకూడా అందిస్తున్నారు. దేశానికి ఆహార, ఆర్థిక భద్రతతో పాటు, రక్షణపరంగా అండగా ఉంటున్న మత్స్యకారులలో ఉపాధి లభించకపోవడంతో వలసలు పెరుగుతున్నాయి. పర్యావరణం దెబ్బతిని, సముద్రాలు కలుషితం కావడంతో చేపల వేట గిట్టుబాటు కాకపోవడమే దానికి కారణం. షిప్‌యార్డులు, పోర్టుల నిర్మాణాల ఫలితంగానూ, బడా దళారీ కంపెనీల 'ట్రాలర్'ల చేపల వేటల వల్లనూ మత్స్యకారులు పెద్ద సంఖ్యలో విస్థాపితులవుతున్నారు. వీరు పొరుగు దేశాలలో జైళ్లలో మగ్గుతున్నారు. విద్య, ఉపాధి కోసం రిజర్వేషన్లకై ఆందోళన సాగిస్తున్నారు. మత్స్యకారుల సమస్య భూమి సమస్యలో భాగమే. వ్యవసాయ విప్లవ వర్గపోరాటంలో వీరిని సంఘటితం చేయాలి. వీరి జీవన్మరణ సమస్యలపై మనం వివిధ పోరాట నిర్మాణ రూపాలు చేపట్టాలి.
- సముద్ర తీర ప్రాంతాల్లో జీవ వైవిధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టాలనీ, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించాలనీ, కంపెనీల ట్రాలర్‌లతో చేపలు పట్టడంపై నిషేదం విధించాలని డిమాండ్ చేయాలి. ఉపాధి గ్యారంటీ పథకం అమలు కోసం, సముద్రంపై మత్సకారుల అధికారంకోసం పోరాడాలి. రిజర్వేషన్లకై వారి ఆందోళనను సమర్థించాలి.

**మైక్రో ఫైనాన్సింగ్ సమస్య:**

- విదేశీ ద్రవ్య పెట్టుబడి/దళారీల పెట్టుబడితో నడిచే మైక్రో ఫైనాన్సింగ్ వలలో 2015 చివరి నాటికి ప్రపంచంలో 17.5 కోట్ల మంది చిక్కుకుని ఉన్నారు. కోట్లాది మంది ఈ సూక్ష్మరుణాల కోరల్లో చిక్కుకుపోవడానికి కారణం అత్యంత తీవ్రమైన స్థాయికి చేరిన నిరుద్యోగం, పేద, మధ్యతరగతి ప్రజలకు ఆదాయ మార్గాలు మూసుకుపోవడం. అత్యంత అధిక వడ్డీరేట్లకు అతితక్కువ రుణాలు ఇచ్చి పెద్దెత్తున నిరుపేద, మధ్యతరగతి

ప్రజలను దోచుకుంటున్న విదేశీ ద్రవ్య పెట్టుబడి/దళారీల పెట్టుబడితో నడిచే మైక్రో ఫైనాన్స్ సంస్థలకు వ్యతిరేకంగా వివిధ పోరాట, నిర్మాణ రూపాలు చేపట్టాలి. ఈ సామాజిక విషరుగ్మతకు వ్యతిరేకంగా బాధితులను, వారికి మద్దతుగా ఇతర పీడిత ప్రజలను విశాల ప్రాతిపదికన సంఘటితం చేయాలి. ప్రజాబలం వున్న చోట ఈ సంస్థల ఆస్తులను జప్తు చేసుకోవాలి. వాటిని ప్రజల సమిష్టి బాధ్యతతో కమ్యూనిటీ అభివృద్ధి కోసం ఉపయోగించాలి. బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి.

- మైక్రో ఫైనాన్స్ వ్యాపారుల దుర్మార్గ, వికృత చర్యలకు, వారు మహిళలపై చేసే అత్యాచారాలకు వ్యతిరేకంగా, వారి అక్రమ వ్యాపారానికి కొమ్ముకాసే ప్రభుత్వ, పోలీసు అధికారులకు, రాజకీయ నాయకులకు వ్యతిరేకంగా ప్రజలను మిలిటెంట్ పోరాటాలలోకి సమీకరించాలి.
- నిరుపేదలకు అవసరమైన మేరకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేయాలి.
- మోసపూరిత ఫైనాన్స్ సంస్థలను బహిర్గతం చేసి తరిమికొట్టాలి. సహకార ప్రాతిపదికన ప్రజల ఫైనాన్సింగ్ పద్ధతులను అభివృద్ధి చేయాలి.

**అసంఘటిత కాంట్రాక్టు లేబర్ సమస్య:**

- ప్రభుత్వం అసంఘటిత రంగాన్ని నాలుగు రకాలుగా విభజించింది: 1. పనిపై ఆధారపడి. చిన్న, సన్నకారు రైతులు, భూమిలేని, వ్యవసాయ కూలీలు, కౌలుదార్లు, బెస్తవాళ్లు, పాడి పశువుల రంగం, బీడీల తయారు, ప్యాకింగ్, లేబల్ వేయడం, భవన నిర్మాణ శ్రామికులు, కోళ్ల పరిశ్రమ శ్రామికులు, నేత పనివారు, ఉప్పు తయారీ శ్రామికులు, ఇటుక బట్టీ శ్రామికులు, రాతి పనిచేసే శ్రామికులు, చేనేత, నూనె మిల్లు కార్మికులు మొదలైనవారు. 2. పని స్వభావాన్ని బట్టి. వ్యవసాయ కార్మికులు, వెట్టిచాకిరి, వలస శ్రామికులు, కాంట్రాక్టు శ్రామికులు, అనియమిత శ్రామికులు మొదలైనవారు. 3. ప్రత్యేకంగా వెనుకబడిన కులాలకు చెందినవారు. చచ్చిన పశువులను తినేవాళ్లు, పాకీ పనివాళ్లు, పశువులతో లాగుడుబండ్లు నడిపేవాళ్లు, బండ్లు నడిపేవాళ్లు మాల్ లోడింగ్-అన్‌లోడింగ్ చేసే ముఠా శ్రామికులు మొదలైనవారు. 4. సేవలపై ఆధారపడిదాయి, ఇంటిపని చేసే మహిళలు, మత్స్యకారులు, కూరగాయలు అమ్మేవాళ్లు, పేపర్ పంచేవాళ్లు మొదలైనవారు. ఈ నాలుగు రకాల శ్రామికులే కాక మంగలి, చేనేత కార్మికులు, చేతితో కళాయిలు తయారు చేసేవాళ్లు, టైలర్లు, స్వయం ఉపాధి వికలాంగులు, రిక్షా శ్రామికులు, ఆటో కార్మికులు, కార్పెంటర్లు, పవర్‌లూమ్ కార్మికులు, పట్టణ పేదలు వంటి స్వయం ఉపాధి కార్మికులు అసంఘటిత కార్మికుల కిందకే

వస్తారు. వీరంతా రెక్కాడనిదే డొక్కాడనివారే. విప్లవోద్యమానికి వీరు అత్యంత ముఖ్యమైన చోదకశక్తిగా పనిచేస్తారు.

- అసంఘటిత/కాజువల్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై వివిధ పోరాట, నిర్మాణ రూపాలు చేపట్టాలి. వీరు ఇప్పటికే ఆయా రంగాలలో సంఘటితమై ఉన్న ట్రేడ్ యూనియన్లలోని కార్మికులను సమస్యల ప్రాతిపదికన ఐక్య పోరాటాలకు సిద్ధం చేయాలి. కార్మికుల ఐక్యతను బలోపేతం చేస్తూ పోరాటాలను నడపాలి. కార్మిక ఐక్యతను విచ్ఛిన్నం చేసే బూర్జువా, రివిజనిస్టు యూనియన్ల నాయకులను ఎండగట్టాలి.
- అసంఘటిత రంగంలో హైర్ అండ్ ఫైర్ విధానం స్థానంలో ఉపాధికి గ్యారంటీ కోసం, క్యాజువల్, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలనీ అందరినీ పర్మనెంటు చేయాలనీ డిమాండ్ చేయాలి. వేజ్‌బోర్డు, వివిధ అలవెన్సులు, పీఎఫ్, సెలవులు తదితర సౌకర్యాల కోసం నిరంతర పోరాటాలు సాగించాలి.
- యూనియన్ పెట్టుకునే హక్కు, 8 గంటల పని, కనీస వేతనాల చట్టం అమలు, అదనపు శ్రమకు అదనపు వేతనం కోసం, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్మించాలి.
- డిమాండ్లపై పోరాడినవారిపై కక్షసాధింపు చర్యలకు, యూనియన్ నిర్మాణంపై ఆంక్షలకు వ్యతిరేకంగా పోరాడాలి.
- పని స్థలంలో భద్రత, ఆరోగ్య భద్రత, నివాస భద్రత కల్పించాలి. యజమానులు అనివార్యంగా వీటిని కల్పించేలా చేయాలి.
- కాంట్రాక్టు లేబర్ పద్ధతిని రద్దు చేసి, ఆ కార్మికులను నేరుగా వారు పనిచేసే కంపెనీ కార్మికులగా గుర్తించాలి.

**బాలకార్మిక సమస్య:**

మన దేశంలో 33 శాతానికి పైగా బాలకార్మికులున్నారని అంతర్జాతీయ సంస్థల అంచనా. మనం ఈ కింది డిమాండ్లతో పోరాడాలి:

- 18 సంవత్సరాల లోపు బాలకార్మిక శ్రమను పూర్తిగా నిషేధించాలి.
- బాల కార్మికులకు పునరావాసం, విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం వంటి హక్కులు కల్పించాలి.
- 6-14 ఏళ్ల బాల బాలికలకు నిర్బంధ విద్య అమలు చేయాలి.
- 14 ఏళ్ల లోపు బాలలను పనిచేసేందుకు అనుమతించే బాల కార్మిక (నిషేధ-నియంత్రణ) చట్టం-2015ను రద్దు చేయాలి.

**నిరుద్యోగ సమస్య:**

- దళారీ పాలకులు అవలంబిస్తున్న ప్రపంచీకరణ విధానాల కారణంగా దేశంలో నానాటికీ నిరుద్యోగం/చిరుద్యోగం పెరిగిపోతున్నది. ఉపాధిలో సగభాగం స్వయంఉపాధి ఆక్రమిస్తున్నది. నిరుద్యోగ యువతకు విప్లవ రాజకీయాలను అందించి వారిని విప్లవోద్యమంలోకి సమీకరించడానికి, సంఘటితపరచడానికి అత్యంత అనుకూల వాతావరణం ఏర్పడి వుంది. నిరుద్యోగ/చిరుద్యోగ, స్వయంఉపాధి యువతను సంఘటితం చేసేందుకు వివిధ పోరాట, నిర్మాణ రూపాలను చేపట్టాలి.
- బయట నుండి ఉద్యోగులను నియమించుకునేందుకు అవుట్‌సోర్సింగ్ కోసం ప్లేస్‌మెంట్ కంపెనీలకు కాంట్రాక్టుకు ఇవ్వడాన్ని వ్యతిరేకించాలి. ఔట్‌సోర్సింగ్ పద్ధతిని రద్దు చేయాలి. స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేయాలి.
- ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేయాలి. పీడిత ప్రజల నెత్తురుతాగే సాయుధ బలగాలలో భర్తీని నిరుత్సాహపరచాలి. సాయుధ బలగాలలో మాత్రమే పెద్దెత్తున భర్తీలు నిర్వహిస్తున్న దళారీ పాలకుల విధానాలను ఎండగట్టాలి.
- ఉపాధి/ఉద్యోగం ఇచ్చేంతవరకు నిరుద్యోగ యువతకందరికీ కనీస వేతనాలకు సమానమైన నిరుద్యోగ భృతిని ఇవ్వాలి.

**రిజర్వేషన్ సమస్య:**

- రిజర్వేషన్ల విధాన సక్రమ అమలు కోసం పోరాడాలి. రిజర్వేషన్లను ఎత్తివేయాలనే సంఘ్‌పరివార్ ఎజెండాకు అనుగుణంగా మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం రిజర్వేషన్లను నీరుగార్చడానికి చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలి.
- ఇతర కులాలలోని పేదవారి పిల్లలకు ప్రభుత్వం ఉచిత విద్యనందించడం కోసం పోరాడాలి.
- ప్రభుత్వ విద్యను బలహీనపరుస్తూ, విద్యను కార్పొరేటీకరిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ రిజర్వేషన్లను నీరుగారుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఎస్‌సి, బిసి, ఎస్‌టి ప్రజలతో పాటు ఇతర కులాల పేద ప్రజలను, ప్రత్యేకంగా విద్యార్థి యువజనులను, నిరుద్యోగులను, ఉపాధ్యాయులను, కార్మిక సంఘాలను, ఉద్యోగులను, ప్రజాస్వామిక విద్యావేత్తలను కదిలించి పోరాటాలు నిర్వహించాలి.

**విద్య :**

- దళితులు, ఆదివాసీలు, వెనుకబడినవారు, పేదల పిల్లలకు విద్య అందించకుండా

చేసే ప్రభుత్వ నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులనూ, యువతనూ, విశాల ప్రజారాశులను సమీకరించాలి.

- విద్యను సేవారంగం నిర్వచనం నుంచి తొలగించి సరుకు, మార్కెట్, వ్యాపార శ్రేణిలోకి తీసుకొచ్చే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్మించాలి.
- ప్రైవేటు విద్యాసంస్థల ప్రాపకాన్ని పెంచడంకోసం ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యా ప్రమాణాలను పడగొట్టడం, ప్రభుత్వ విద్యా సంస్థలను రద్దు చేయడం, విద్యారంగానికి బడ్జెట్‌లో కోత విధించడం, టీచర్లలో తాత్కాలిక నియామకాలు –మొదలైన వాటికి వ్యతిరేకంగా పోరాడాలి.
- విద్యను మార్కెటీకరించడం, ప్రైవేటీకరించడం, కాషాయికరించడానికి వ్యతిరేకంగా నిరంతరం ఆందోళనలు నిర్మించాలి.
- విదేశీ విద్యా సంస్థలను భారతదేశంలోకి తీసుకువచ్చి విద్యను మార్కెట్ సరుకుగా మార్చే ప్రతిఒక్క ప్రయత్నానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలి.

వైద్యం :

దేశంలో వైద్య చికిత్సకయ్యే వ్యయం, మందుల ఖర్చులు సగటున నెలకు ఒక్కో కుటుంబానికి వేల, లక్షల రూపాయలు అవుతున్నాయి. ఈ ఖర్చులు భరించలేక ఏటా ఐదున్నర కోట్ల మంది పేదరికంలో కూరుకుపోతున్నారు. యాంటీబయాటిక్స్ కొనుక్కోవడానికి రెండు రోజులు పస్తులుండాల్సి వస్తోంది. గ్రామీణ వైద్యంలో 79 శాతం మందుల కోసం అవుతుండగా అందులో ఎక్కువ భాగం రోగులు సొంతంగా భరిస్తున్నారు. వైద్యం కోసం అంతర్జాతీయంగా ప్రజలు ఒక వ్యక్తి సగటున 18 శాతం ఖర్చు చేస్తుండగా, మన దేశంలో 68 శాతం ఖర్చు చేస్తున్నారు. దేశంలో వైద్య సదుపాయాలు సరిగా లేవని దీన్ని బట్టి స్పష్టమవుతుంది. ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం జీడీపీలో కేవలం 1.5 శాతమే ఖర్చు చేస్తోంది. వైద్యరంగాన్ని ప్రైవేటీకరించడంతో గత పదేళ్లలో ఆసుపత్రులకు, రోగ నిర్ధారణ కేంద్రాలకు సుమారు 43 వేల కోట్ల రూపాయల ఎఫ్‌డీఐ మదుపులు వచ్చాయి. భారీ పెట్టుబడులు పెట్టిన విదేశీ సంస్థలు రోగుల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్నాయి. దీంతో వైద్య ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఈ కింది డిమాండ్లతో సరియైన వైద్య సదుపాయల కోసం పోరాడాలి:

- ప్రతి వైద్యరంగాన్ని ప్రైవేటీకరించి ఎంఎన్‌సీలకు/స్టార్టప్ కంపెనీలకు/దళారీ కంపెనీలకు అప్పగించటానికి వ్యతిరేకంగా పోరాడాలి. కార్పొరేట్ కంపెనీల విచ్చలవిడి దోపిడీ ఫలితంగా వైద్యంపై విపరీతంగా పెరిగిపోతున్న ఖర్చులను ప్రభుత్వమే భరించాలి. దళారీ ప్రభుత్వాల బూటకపు ఆరోగ్య పథకాలను ఎండగట్టాలి.
- వైద్యంపై బడ్జెట్ కోతను వ్యతిరేకించాలి.

- పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేయాలి.
- ఖాళీగా ఉన్న వైద్యుల, వైద్య సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. క్యాజువల్ వ్యవస్థను రద్దు చేసి వారి ఉద్యోగాలకు భద్రత కల్పించాలి. వారి సమస్యలను పరిష్కరించాలి. వారి సంక్షేమాన్ని పట్టించుకోవాలి.
- ప్రజల ఆరోగ్యాలను కనీవినీ ఎరుగని రీతిలో క్షీణింపజేస్తున్న రసాయనిక ఆహార పదార్థాల నిషేధం కోసం పోరాడాలి.
- 'ఆయుష్మాన్' వంటి కంటితుడుపు పథకాలు చేపట్టి, వాటిని రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రచారం చేస్తూ, ప్రజారోగ్యం ఎడల నిర్లక్ష్యంగా ఉండటాన్ని బహిర్గతం చేస్తూ పోరాటం చేపట్టాలి.

**కేంద్ర, రాష్ట్రాల మధ్య సమస్య:**

- అన్ని జాతులూ, మొత్తం దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి తోడ్పడేలా కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు సంబంధించిన చట్టపర నియమాలను రూపొందించాలనీ, ఈ చట్టపర నియమాలను అనుసరించే కేంద్ర ప్రభుత్వం రాజకీయ, ఆర్థిక-వనరుల, భాషా సంస్కృతి తదితర అన్ని విషయాలలో రాష్ట్రాలతో, స్వయంప్రతిపత్తి ప్రాంతాలతో ప్రజాస్వామిక సంబంధాలను కొనసాగించాలని డిమాండ్ చేయాలి. వీటికి వ్యతిరేకంగా వ్యవహరించే కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యానికి, నిరంకుశపూరిత నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించాలి.
- కేంద్ర, రాష్ట్రాల మధ్య అసమ సంబంధాల రద్దు కోసం ఆయా రాష్ట్రాల్లోని ప్రజలు లేవనెత్తే డిమాండ్స్‌ను సమర్థించాలి. పన్నుల వసూళ్లలో రాష్ట్రాల వాటాను, స్థానిక సంస్థల వాటాను పెంచే డిమాండ్‌ను, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం, ప్రత్యేక హోదాల కోసం, ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీల కోసం తలెత్తే డిమాండ్‌ను సమర్థించాలి.
- 'ఒక దేశం ఒక చట్టం', 'ఒక దేశం ఒక పన్ను' వంటి విధానాలతో ఫెడరలిజానికి తూట్లు పొడుస్తూ, కేంద్రంలో అధికారాన్ని కేంద్రీకరిస్తున్న మోదీ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించాలి.

**వెనుకబడిన ప్రాంతాల సమస్య:**

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, అభివృద్ధి నిరోధక విధానాల మూలంగా దేశంలోని అనేక రాష్ట్రాల్లో అనేక ప్రాంతాలు దీర్ఘకాలికంగా వివక్షకు గురై వెనుకబడిన ప్రాంతాలుగా ఉన్నాయి. ఇలాంటి ప్రాంతాల ప్రజలు తమ హక్కుల కోసం చేస్తున్న న్యాయమైన పోరాటాలను సమర్థించాలి.

**పౌరహక్కుల సమస్య:**

ప్రపంచంలో, దేశంలో ఫాసిజం ప్రధాన ధోరణిగా ఉన్నందున పౌరహక్కులు, మానవహక్కులు క్రూరంగా అణచివేయబడుతున్నాయి. ఈ కింది డిమాండ్లతో మనం పోరాడాలి:

- మానవహక్కులను కాలరాచి వేస్తున్న అఫ్స్పా, ఎన్ఐఏ సవరణ బిల్లు-2019, ఉపా సవరణ బిల్లు-2019, మానవహక్కుల పరిరక్షణ సవరణ బిల్లు-2019, ఆర్టీఐ సవరణ బిల్లు-2019, 370, 35ఏ అధికరణాల రద్దు/జమ్ము-కశ్మీర్ పునర్వవస్థీకరణ చట్టం, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఎన్పీఆర్, ఎన్ఆర్సీ వంటి క్రూరమైన చట్టాలను రద్దు చేయాలి. యావత్తు మానవహక్కులను, పౌరహక్కులను అమలు చేయాలి.
- ఆదివాసుల పోరాటాల ఫలితంగా రూపొందిన ఫారెస్టు హక్కుల చట్టం, పెసా చట్టం, 5వ షెడ్యూల్, 6వ షెడ్యూల్లను అమలు చేయాలి.
- కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కుల చట్టాలను పునరుద్ధరించాలి.
- న్యాయ వ్యవస్థ శ్రామికులపై, ఆదివాసులపై, రైతాంగంపై, చిన్న పారిశ్రామికవేత్తలపై, దళితులపై, మహిళలపై, మైనారిటీలపై, మానవహక్కులపై, ప్రజాసంక్షేమంపై అభివృద్ధినిరోధక తీర్పులను, బాబ్రీమసీదు విధ్వంసంపై తీర్పు-2019ను రద్దు చేయాలి.
- వ్యవసాయ కూలీలకు అధిక వేతనాలు, కౌలుదారు సంస్కరణలు, రైతుల హక్కులు, భూసంస్కరణలు, దున్నేవారికి భూమి, నిర్వాసితులకు తగిన నష్టపరిహారం కోరినవారిపై, పీడిత కులాల ప్రత్యేకించి దళితుల, ఆదివాసుల మైనారిటీ హక్కులు కోరినవారిపై, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడినవారిపై ప్రభుత్వ కిరాయి సాయుధ బలగాల, రహస్య హంతక ముఠాల దాడులు, పలు హత్యాకాండలు, బూటకపు ఎన్కౌంటర్లు, మహిళలపై అత్యాచారాలు, గృహ దహనాలు, ఆస్తుల లూటీ, విధ్వంసానికి వ్యతిరేకంగా ప్రజలను కదిలించాలి. ఆపాలి. దాడులకు బాధ్యులైన ఉన్నత పోలీసు, ప్రభుత్వ అధికారులను కఠినంగా శిక్షించాలనే డిమాండ్పై పోరాడాలి.
- మానవహక్కుల కార్యకర్తలపై, సామాజిక కార్యకర్తలపై, లౌకిక, ప్రగతిశీల శక్తులపై రాజ్య ప్రాయోజిత దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి.
- మానవహక్కుల పేరుతో సామ్రాజ్యవాద ప్రాయోజిత సంస్థలు, వారి దళారీ సంస్థలు, ఎన్జీఓలు ప్రతీఘాతుకత్వాన్ని ప్రోత్సహించడానికి వ్యతిరేకంగా పోరాడాలి.
- అక్రమంగా జైళ్లలో బంధించిన విప్లవ, ప్రజాస్వామిక, ప్రగతిశీల రాజకీయ ఖైదీలను, దళిత, ఆదివాసీ, ముస్లిము మత మైనారిటీలకు చెందిన సామాజిక కార్యకర్తలను బేషరతుగా విడుదల చేయాలి. విప్లవకారులపై ఈ దోపిడీ ప్రభుత్వాలు కుట్రపూరితంగా

నార్కోటిక్ టెస్ట్‌లు చేయడాన్ని వ్యతిరేకించాలి.

- దేశంలోని పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని (ప్రైవసీ) తస్కరించేందుకు ఆధార్ కార్డు అమలుతోపాటు, డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించడంపై ప్రజలను ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాగృతం చేసి, పోరాడాలి.

**మీడియా–వివిధ జర్నలిస్టుల సమస్యలు:**

- ప్రపంచీకరణ కాలంలో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రాధాన్యత ఎన్నో రెట్లు పెరిగింది. సామ్రాజ్యవాదులు, దళారీ పాలకులు తమ దోపిడీ ప్రయోజనాల కోసం కార్పొరేట్ మీడియాను ఉపయోగించుకుంటూ ఫాసిస్టు పద్ధతుల్లో ఫ్రీలాన్స్ జర్నలిస్టుల, కెమెరాపర్సన్ల ఇతర మీడియా ఉద్యోగుల హక్కులను కాలరాచి వేస్తున్నారు. కార్పొరేట్ మీడియాలోను, స్వతంత్ర మీడియాలోను లౌకిక, ప్రగతిశీల, దేశభక్త, ప్రజాస్వామిక, విప్లవ భావాలు కలిగిన జర్నలిస్టులను మనం సంఘటితం చేయాలి. వారి సమస్యల కోసం, హక్కుల కోసం పోరాడాలి.
- ప్రజాస్వామిక జర్నలిస్టులపై ఉపా, అఫ్స్పా వంటి క్రూరమైన చట్టాల కింద అక్రమంగా మోపిన కేసుల ఉపసంహరించుకోవాలని పోరాడాలి.
- ప్రతీ సందర్భంలో క్రూరమైన సామ్రాజ్యవాద దోపిడీ విధానాలను, దళారీ పాలకుల దేశద్రోహకర, అభివృద్ధినిరోధక, ప్రతీఘాతుక దోపిడీ విధానాలను ఎండగడుతూ లౌకిక, ప్రగతిశీల, దేశభక్త, ప్రజాస్వామిక, విప్లవ రాజకీయాలను ఎత్తిపడుతూ పీడిత ప్రజల పక్షం నిలిచి సేవచేసేలా వారిని ఎడ్యుకేట్ చేయాలి.

**వృద్ధులు–అనాథలు–శారీరక, మానసిక లోపాలున్నవారు, ఇతరత్రా లోపాలున్నవారి సమస్య:**

- వృద్ధుల (సీనియర్ సిటిజన్స్) పరిరక్షణ సమాజ బాధ్యత. వృద్ధాప్య పించన్‌తో వారి అవసరాలు ఏమాత్రమూ తీరవు. వృద్ధుల పూర్తి స్థాయి సంరక్షణ కోసం మనం పోరాడాలి.
- అనాథ బాలబాలికల పరిరక్షణ సమాజ బాధ్యత. వారు యోగ్యులయ్యే వరకు వారికి విద్యాబుద్ధులు చెప్పడం, వారికి తగిన ఉపాధి కల్పించడం మొదలైన డిమాండ్లతో పోరాడాలి.
- శారీరక, మానసిక సమస్యలున్నవారికి (వికలాంగులకు) పూర్తిగా ఉచిత వైద్యసేవల కోసం, వారి పునరావాసం కోసం పోరాడాలి.
- ఎటువంటి ఆధారంలేని వితంతువుల అవసరాలను వితంతు పించన్లు ఏమాత్రమూ తీర్చలేవు. వారి పూర్తి స్థాయి సంరక్షణ, వారికి తగిన ఉపాధి కోసం మనం పోరాడాలి.
- ఇతరత్రా సమస్యలున్నవారి విషయంలో కూడా ఇదే విధంగా బాధ్యత వహించాలి.

**నదీజలాల వాటాల సమస్య, సరిహద్దు సమస్య:**

- వివిధ రాష్ట్రాల, జాతుల, తెగల ఎల్లల గురించి, నదీజలాలు తదితర ప్రకృతి వనరుల గురించి, పర్యావరణం గురించి తలెత్తే వివాదాలు పరస్పర ప్రయోజనాలకు హాని కలగకుండా పరస్పరం సంప్రదింపుల ద్వారా పరిష్కరించబడేలా ప్రజలను కదిలించాలి.
- ఇలాంటి వివాదాలలో కేంద్ర ప్రభుత్వ పెత్తందారీ జోక్యాన్నీ, సంబంధిత ప్రాంతాల రాజకీయ పార్టీలు/ప్రభుత్వాలు తమ సంకుచిత ప్రయోజనాల కోసం ప్రజలను పరస్పరం ఒకరికి వ్యతిరేకంగా మరొకరిని ఉసిగొల్పడానికి చేసే కుట్రలు, కుహకాలను వ్యతిరేకించాలి, బహిర్గతం చేయాలి, తిప్పికొట్టాలి, ప్రజల మధ్య సమైక్యతను నిలబెట్టటానికి కృషి చేయాలి.

**రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే రాజకీయాలు**

అన్ని దేశాల్లో లాగానే సాయుధ శక్తి ద్వారా అధికారం చేజిక్కించుకోవడమే మన దేశ విప్లవ కేంద్ర సమస్య. కాలంచెల్లిన భారత అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా దీర్ఘకాల ప్రజాయుద్ధపు పంథాను అమలు చేస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలంటే ప్రజలను మేల్కొల్పేందుకు, సమీకరించేందుకు, సంఘటితం చేసేందుకు, శత్రువును ఓడించేందుకు మూడు అద్భుత ఆయుధాలను ప్రతిభావంతంగా వినియోగించాల్సి ఉంటుంది. మొదటి ఆయుధం కార్మికవర్గ అగ్రగామి దళంగా విప్లవ కమ్యూనిస్టు పార్టీ. అది మిగతా రెండు ఆయుధాలైన ప్రజాసైన్యానికీ, ఐక్యసంఘటనకూ–విశాల ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహిస్తుంది. అవి అభివృద్ధి నిరోధక రాజ్యాన్ని కూలదోయడానికి, ప్రజల ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని స్థాపించేందుకు ఉద్దేశించినవి. కార్మికవర్గ పార్టీ నాయకత్వంలో అది లక్షలాది, కోట్లాది ప్రజలను విప్లవంలో సమీకరించేందుకు, విప్లవ యుద్ధంలో లేదా సామ్రాజ్యవాదుల దురాక్రమణ యుద్ధాలకు వ్యతిరేకంగా సాగే దేశభక్తయుత యుద్ధంలో శత్రువును ఒంటరి చేసి, బలహీనపరచి, నాశనం చేసేందుకు వివిధ రకాల ఐక్యసంఘటనా రూపాలను ఎంతో చాకచక్యంగా ముందుకు తెస్తుంది. దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి ఎంఎల్ఎం వెలుగులో దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాతో సాయుధమైన విప్లవ కార్మికవర్గ పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటనలను నిర్మించడం, సుసంఘటితం/బలోపేతం చేయడం, విస్తరింపజేయడం అనేది సాయుధ వ్యవసాయక విప్లవ యుద్ధం నుండి, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం నుండి విడివడి ఒంటరిగా సాగించగలిగేది కాదు. అలాగే దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో ఎగుడు–దిగుళ్ళు, మెలికలు–మలుపులు ఎదుర్కొంటూ, అలలు అలలుగా పురోగమిస్తూ వ్యూహాత్మక ప్రాంతాలలో ప్రాంతాల వారీగా ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపించడం, దేశవ్యాపితంగా అధికారాన్ని హస్తగతం చేసుకోవడం సాధ్యం కాదు.

నేడు ఈ సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య కూటమి రూపొందించే సామ్రాజ్యవాద అనుకూల విధానాలకూ, చేపట్టే చర్యలకు వ్యతిరేకంగా అతి చిన్న పోరాటాలు సైతం, అవి ఎంత పరిమితమైనప్పటికీ, వాటిని ఆహ్వానించాలి, వాటికి మద్దతునివ్వాలి, వాటిని ప్రోత్సహించాలి. అవి బూటకమైనవి కానంతవరకూ అటువంటి యావత్తు పోరాటాలకు మద్దతునివ్వాలి, వాస్తవానికి ఆ ఉద్యమాల నాయకత్వం విధించే పరిమితులను అధిగమించి వాటిని ముందుకు తీసుకుపోవాలి. ఈ విధానాలకు వ్యతిరేకంగా అటువంటి విజయవంతమైన పోరాటాలు అందులో భాగస్వామ్యమైన ప్రజలకు తాత్కాలిక ఉపశమనాన్ని కలిగించడం మాత్రమే కాక, మొత్తంగా దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని అభివృద్ధి చేసేందుకు తోడ్పడతాయి. దీంతో పాటు, ఇటువంటి వేలాది చిన్న చిన్న పోరాట స్రవంతులు సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమ మహాధారగా మారి ప్రజాస్వామిక విప్లవ సముద్రంలో కలుస్తాయి.

ప్రపంచీకరణ మన దేశంలోకి ప్రవేశించి ప్రజలపై దోపిడీని నూతన ఎత్తులకు తీసుకుపోయింది. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం వెనుకపట్టు పట్టడాన్ని, జాతీయ విముక్తి పోరాటాలు వెనకడుగు వేయడాన్ని అవకాశంగా తీసుకొని సామ్రాజ్యవాదులు, వారి దళారీ ఏజెంట్లు అహంభావంతో విర్రవీగుతున్నారు, క్రూరులుగా మారుతున్నారు. ప్రత్యర్థి అగ్రరాజ్యమైన సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం పతనమైన తర్వాత, 1990ల తర్వాత, ఇది మరింత పెరిగింది. ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదం, దాని పెంపుడుకుక్క ఇజ్రాయిల్ ప్రజలపై, ప్రత్యేకించి అరబ్బు ప్రజలపై తీవ్రంగా దాడులు చేస్తున్నాయి. సెప్టెంబర్ 11 తర్వాత ఈ దాడులు ఉన్మాదపూరిత యుద్ధంగా మారి యావన్మందికీ ముప్పుగా పరిణమించాయి. అవి నిరంతరం దురాక్రమణపూరిత దాడులకు పూనుకుంటున్నాయి. మొదట ఆఫ్ఘనిస్తాన్, తర్వాత ఇరాక్, లిబియా, ఆ తర్వాత అమెరికా అగ్రరాజ్యం ముందు తలవంచని మరో దేశం – ఉదాహరణకు, సిరియా – ఇలా అవి దురాక్రమణ యుద్ధాలను కొనసాగిస్తున్నాయి. భారత దళారీ పాలకులు ఆర్థికంగానే కాకుండా, సైనికంగా కూడా ఈ కూటమితో సన్నిహిత సంబంధాలు అభివృద్ధి చేసుకున్న తర్వాత, భారత ప్రజలపై హత్యాకాండలు సాగిస్తున్నారు. భారతదేశంలో టెర్రరిస్టు వ్యతిరేక ఉన్మాదం అమెరికా, ఇజ్రాయిల్‌లలో లాగా రెచ్చగొడుతున్నారు. ఆ యుద్ధోన్మాదుల నుంచి మద్దతును పొందుతూ, భారత దళారీ పాలకులు అతి చిన్న పోరాటాలపై కూడా క్రూరంగా విరుచుకుపడుతున్నారు. మరింత ఫాసిస్టులుగా మారుతూ తమను, తమ యజమానులను వ్యతిరేకించే యావత్తు రూపాలలోని నిరసనను క్రూరంగా బలప్రయోగంతో కాలరాచివేస్తున్నారు, వేస్తారు.

రాజ్య టెర్రరిజాన్ని ఎదుర్కోవడం వల్ల శాంతియుత పోరాట రూపాలు త్వరగా ఎటువంటి ప్రాధాన్యతలేనిగా అయిపోతున్నాయి. భారతదేశ అడవుల్లో, మైదానాల్లో, పట్టణాల్లోని యావత్తు రంగాలలోని ప్రజా పోరాటాలలో సాయుధ పోరాట ప్రభావం పడుతున్నది. ముస్లిం మత

మైనారిటీలపై వరుసగా కొనసాగుతున్న అత్యాచారాలు ప్రతీ ముస్లిము తనను తాను రక్షించుకునేందుకు ఆయుధం పట్టుకునేలా చేస్తున్నాయి. కార్మికులు, రైతులు, విద్యార్థులు, పబ్లిక్‌రంగ కంపెనీల ఉద్యోగులు, మొదలైనవారి శాంతియుత పోరాటాలపై సైతం క్రూరంగా సాగిస్తున్న దాడులు వారంతా నూతన, మరింత సమర్థవంతమైన పోరాట పద్ధతుల గురించి ఆలోచించుకునేలా నెడుతున్నాయి.

ఇలాంటి నేపథ్యంలో సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాలు సీపీఐ (మావోయిస్టు) నాయకత్వంలో సాగుతున్న ప్రజాయుద్ధం నుంచి మద్దతు పొందుతాయి, తప్పనిసరిగా మద్దతు పొందాలి. విప్లవోద్యమం సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్య విధానానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికీ వ్యతిరేకంగా స్థిరంగా పోరాడుతున్నందువల్ల, దేశంలో మావోయిస్టు ప్రజాయుద్ధంతో బలమైన సంబంధాలను ఏర్పరచుకోకుండా ఏ సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాలు కూడా నిలదొక్కుకోలేవు, అభివృద్ధి చెందలేవు. వాస్తవానికి మావోయిస్టు పార్టీ నాయకత్వం కింద మాత్రమే సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాలు విజయాన్ని సాధించగలవు. నిజమైన స్వేచ్ఛ, స్వావలంబన కలిగిన భారతాన్ని సృష్టించేవైపుగా ముందడుగు వేయగలవు. ప్రాంతాల వారీగా అధికారాన్ని హస్తగతం చేసుకోవడం, విముక్తి ప్రాంతాల స్థాపన దేశంలో యావత్తు నిజమైన సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల పురోగమనానికీ, ధృవీకరణకు అత్యంత బలమైన పునాది కాగలవు.

అదే విధంగా, అంతర్జాతీయంగా ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమం నిరంతరం వృద్ధి చెందుతోంది. అవి సాధారణంగా తమ ఉమ్మడి శత్రువుగా ఉన్న సామ్రాజ్యవాదాన్ని, తమ బహుముఖ సంస్థలను, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదాన్ని, దాని ఫాసిస్టు పెంపుడుకుక్క ఇజ్రాయిల్‌ను లక్ష్యంగా చేసుకున్నాయి. అందువల్ల, భారతదేశంలో సామ్రాజ్యవాద/దళారీ వ్యతిరేక ఉద్యమాలు, అంతర్జాతీయంగా జరుగుతున్న ఉద్యమాలతో ఐక్యత పరస్పరం రెండింటినీ బలోపేతం చేస్తుంది. ఈ విధంగా అనేక సామ్రాజ్యవాద/దళారీ వ్యతిరేక ఉద్యమాల ప్రవంతులు పెంపొందుతాయి, బలోపేతమవుతాయి, పరస్పరం బలమైన సంబంధాలను ఏర్పరచుకుంటాయి, జాతుల సాయుధ పోరాటాలతో ఐక్యమవుతాయి. మావోయిస్టు ప్రజాయుద్ధంతో సంబంధాలను ఏర్పరచుకుంటాయి. బలమైన సుడిగాలిలా మారి మన దేశంలోని మూలమూలలా ఈ భయానక క్రూర జంతువులను తుడిచిపెడతాయి.

## రాజకీయ ఎత్తుగడల నినాదాలు

- గ్రామీణ ప్రాంతాల్లో పాత-కొత్త భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడండి. పాత-కొత్త దోపిడి శక్తులకు వ్యతిరేకంగా పోరాడండి.
- దున్నేవారికే భూమి చెందాలి.
- నీరు, అడవి, భూమి, ఆత్మగౌరవం, అధికారం కోసం పోరాడండి.
- ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కాజువల్, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి. అందరిని పర్మనెంట్ చేయాలి. నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించాలి.
- సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటాన్ని విస్తృతం, తీవ్రతరం చేయండి.
- విద్యా, వైద్య రంగాలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకించండి.
- మత మైనారిటీలపై బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాదుల దాడులను ఖండించండి. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడండి.
- దళితులపై పీడక కులాల దాడులను ప్రతిఘటించండి. అన్నిరకాల కుల వివక్షతకు, కుల పీడనకు వ్యతిరేకంగా పోరాడండి.
- పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడండి, మహిళలపై అన్నిరకాల దాడులకు వ్యతిరేకంగా పోరాడండి.
- జాతుల స్వేచ్ఛా, సమానత్వం, స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడండి.
- దేశ, విదేశీ కార్పొరేట్ల అన్నిరకాల దోపిడికి వ్యతిరేకంగా పోరాడండి.
- జాతీయవాదం పేరుతో దేశాన్ని సామ్రాజ్యవాదానికి తెగనమ్ముతున్న బీజేపీ మోడి ప్రభుత్వ దేశ ద్రోహానికి వ్యతిరేకంగా పోరాడండి.
- కేంద్ర ప్రభుత్వ దేశద్రోహకర విధానాలకు వ్యతిరేకంగా పోరాడండి.
- సాయుధ పోరాటాన్ని విస్తృతం-తీవ్రతరం చేయండి.

✶